పరిణతవాణి

(ఆరవ సంపుటి)

(65 ఏళ్ళకు పైబడిన తెలుగు భాషా సాహిత్యరంగ ప్రముఖుల ఆత్మకథా ప్రసంగ వ్యాసాలు)

సప్తతి మహోత్సవ ప్రత్యేక ప్రచురణ

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్డు, హైదరాబాద్-1

పరిణతవాణి

(ఆరవ సంపుటి)

(65 ఏళ్ళకు పైబడిన తెలుగు భాషా సాహిత్యరంగ ప్రముఖుల ఆత్మకథా ప్రసంగ వ్యాసాలు)

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా. సి. నారాయణరెడ్డి

అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు

డా. జె. చెన్నయ్య

ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాదు – 500 001

ఫోన్‌నం. 040–2475 3724

PARINATHAVANI

(VOLUME - VI)

(A collection of autobiographical speeches of Eminent Telugu Literary Persons)

ప్రథమ ముద్రణ: మే, 2013

పుటల సంఖ్య :294

ప్రతులు : 1000

మూల్యం : రూ. 150/-

ప్రతులకు:

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001

ఫోన్: +91-40-24753724

డిటిపి

లిటరసీ హౌస్, ఆంధ్ర మహిళాసభ

ఉస్మానియా యూనివర్సిటీ రోడ్

హైదరాబాదు 500 007

ఫోన్: +91-40-2709 8406, 2709 6464

ముద్రణ:

సాయి లిఖిత ప్రింటర్స్

ఖైరతాబాద్, హైదరాబాద్

040-65 545 979

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా॥సి. నారాయణరెడ్డి

అధ్యక్షులు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

ప్రవేశిక

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాల్లో 'పరిణతవాణి' ప్రసంగ పరంపర ఎందరో సహృదయుల ప్రశంసలు అందుకున్నది. రాష్ట్రంలోని ప్రముఖులను ఆహ్వానించి సాహిత్య సాంస్కృతిక భాషా రంగాల్లో వారు చేసిన కృషిని గురించి ప్రసంగించమని కోరాం. మొదట డెబ్భై యేళ్ళకు పైబడ్డ ప్రముఖులచేత ప్రసంగాలు ఇప్పించాం. తరువాత అరవై అయిదేళ్లు పైబడ్డ వారిని ఆహ్వానించాము.

ప్రసంగ కర్తలు తమ ప్రసంగ వ్యాసాలు సమర్పించారు. సుదీర్ఘంగా ఉన్న వ్యాసాలను క్లుప్తీకరించాం. విషయ ప్రధాన దృష్టితో ఈ ప్రసంగ వ్యాసాలను సంపుటీకరిస్తున్నాం. అందుచేత ఈ ప్రసంగ వ్యాసాలు విస్తృతిలో కొన్ని చిన్నవిగా, మరికొన్ని పెద్దవిగా రూపొందాయి.

పరిషత్తు కార్యవర్గంవారు, కార్యకర్తలు, ఈ ప్రసంగ పరంపరకు విచ్చేసిన సదస్యులు, సాహిత్యవేత్తలు వీటిని పుస్తక రూపంలో తీసుకురావలసిందని సూచించారు. వారి సూచన ప్రకారం అయిదు ప్రసంగాలతో మొదటి సంపుటిని, ఏడు వ్యాసాలతో రెండవ సంపుటిని, ఎనిమిది ప్రసంగాలతో మూడవ సంపుటిని, తొమ్మిది ప్రసంగాలతో నాల్గవ సంపుటిని పది ప్రసంగాలతో ఐదవ సంపుటిని వెలువరించాం. ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించి 26-05-2013 నాటికి 70 సంవత్సరాలు పూర్తి అయినాయి. ఈ సప్తతి మహోత్సవాలను పురస్కరించుకుని 14 ప్రసంగ వ్యాసాలతో ఆరవ సంపుటిని వెలువరిస్తున్నాం ఈ పరిణత ప్రముఖుల ఆశయాలు ఆదర్శ కరదీపికలుగా నేటి తరాన్ని ఉద్దీపింప చేస్తాయని ఆశిస్తున్నాను. మరో పది ప్రసంగవ్యాసాలతో ప్రస్తుతం ఐదవ సంపుటిని వెలువర్తిస్తున్నాము. ఈ పరిణత ప్రముఖుల ఆశయాలు ఆదర్శ కరదీపికలుగా నేటి తరాన్ని ఉద్దీపింప చేస్తాయని ఆశిస్తున్నాను.

హైదరాబాదు

26 మే 2013

(డా॥ సి. నారాయణ రెడ్డి)

డా॥ జె. చెన్నయ్య

ప్రధాన కార్యదర్శి

ఆంధ్ర సారస్వత పరిషత్తు

ముందుమాట

'**ప**రిణతవాణి' అన్నది ఒక విశిష్టమైన ప్రసంగ పరంపర. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు ఈ ప్రసంగ పరంపర స్వరూప శిల్పి. పరిణతవాణి కార్యక్రమంలో పరిషత్తు వేదిక నుంచి సాహిత్య సాంస్కృతిక రంగాలకు చెందిన తెలుగు ప్రముఖులు వారి అనుభవాలను, ప్రముఖులతో వారికి గల పరిచయాలను, వారు చేసిన కృషిని గురించి ఆత్మ కథాకథన రూపంలో ఎన్నో విశేషాలు వివరించారు. అందులో కొన్ని మనకు తెలిసిన విషయాలు కాకపోవచ్చు. ఈ తరం వారికి వారి అనుభవాలు, జ్ఞాపకాలు, ఎంతైనా అవసరం. భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంలో ఈ తెలుగు ప్రముఖుల అనుభవాలను, జ్ఞాపకాలను మొదటి సంపుటిగా పుస్తక రూపంలో తీసుకురావడానికి కారణం మా అధ్యక్షుల వారి సంకల్ప బలం. ఇప్పటికి యాభై ప్రసంగాలు జరిగాయి. ఐదు సంపుటాలు ప్రచురించాం. మరో 14 వ్యాసాలతో ఈ ఆరవ సంపుటిని వెలువరిస్తున్నాం.

ఈ ప్రముఖులు వ్యాస రూపంగా ఇచ్చిన ప్రసంగాలను ఇందులో ప్రచురించాం. సాధ్యమైనంత వరకు విషయ ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకోవడం జరిగింది. చాలా వరకు వారి స్వచ్ఛందమైన అభిప్రాయాలను గౌరవిస్తూ వాటిని ప్రచురించాం. అభిప్రాయ భేదాలు ఉన్నచోట ఆ అభిప్రాయాలు ఆ ప్రముఖుల వెలువరించినవవీ, ఆంధ్రసారస్వత పరిషత్తు కేవలం వాటిని ప్రచురించిందనీ గమనించవలసిందిగా మా విజ్ఞప్తి.

పరిషత్తు సప్తతి మహోత్సవాలు జరుపుకుంటున్న ఈ తరుణంలో పరిణతవాణి ప్రసంగాల ఆరవ సంపుటి వెలువడడం సంతోషదాయకం. ఈ సంపుటికి ప్రత్యేకతలు కూడా వున్నాయి. ముఖ్యంగా ఆధునికాంధ్ర కవిత్వంలో అగ్రపీఠి, జ్ఞానపీఠి డా॥ సి. నారాయణరెడ్డి గారి ఈ కార్యక్రమ రూపకర్త వారే కాబట్టి తాము ప్రసంగం చేయరాదని అధ్యక్షులు భావించారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు, అధ్యక్షులుగా వున్నాలనే కారణంతో ఆరు దశాబ్దాలుగా తెలుగు సాహిత్య సాంస్కృతిక క్షేత్రాల్లో బహు ముఖ్యంగా సాగుతున్న డా. సి. నారాయణరెడ్డిగారి మహోన్నత వ్యక్తిత్వాన్ని గురించి వారి ముఖత: తెలుసుకొనే అవకాశాన్ని కోల్పోవడం సమంజసం కాదని చాలామంది గట్టిగా అభిప్రాయ పడ్డారు. ఆ విధంగా పరిణతవాణి ప్రసంగాన్ని చేయవలసిందని వారిచేత ఒప్పించాం. వారితోపాటు ప్రసంగాలు చేసినవారు కూడా లబ్ధ ప్రతిష్టులే వారి ప్రసంగాలు కూడా ఈ సంపుటిలో వున్నాయి.

సంపుటిని డిటిపి చేసిన ఆంధ్ర మహిళా సభ, సాక్షరతా భవన్ వారికి, అందంగా ముద్రించిన సాయి లిఖిత వారికి కృతజ్ఞతలు తెలియజేసుకున్నాను. ఈ పనులన్నిటినీ సమన్వయ పరచిన మా కార్యక్రమాల సలహాదారు గోవిందరాజు రామకృష్ణారావు గారికీ, సహకారం అందించిన పరిషతు, కార్య నిర్వాహణాధికులు యస్.యాదగిరిరావు, బి. గోపాలరెడ్డి గార్లకు, సహాయకుడు యం. రాందాస్‌కు కృతజ్ఞతలు.

ప్రధానకార్యదర్శి

హైదరాబాదు

26 మే 2013

ప్రసంగ వ్యాససూచిక



పొత్తూరి వెంకటేశ్వరరావు

"పరిణతవాణి" ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న ఒక అద్భుత కార్యక్రమం. కాళోజీ నారాయణరావు, బోయి భీమన్న, బెజవాడ గోపాలరెడ్డి, బిరుదురాజు రామరాజు మొదలైన ఎందరో మహనీయుల జీవితాల నుంచి కొత్త తరాలు తెలుసుకోవలసిన జీవిత సత్యాలను, విలువలను, విజయ రహస్యాలను అక్షరబద్ధం చేసే ఒక గొప్ప ప్రయత్నం. మొదట ప్రసంగం ఏర్పాటు చేయడం, తరువాత దానిని గ్రంథ రూపంలో తీసుకొని రావడం ఇంతకు పూర్వం ఏ సంస్థా చేయలేదు. ఆ కీర్తి ఆంధ్ర సారస్వత పరిషత్తుకే దక్కుతున్నది.

వివిధ రంగాలలో లబ్ధ ప్రతిష్ఠులైన మహామహులు పాల్గొంటున్న కార్యక్రమంలో నన్నూ మాట్లాడమనడం ఒకింత ఆశ్చర్యం కలిగించింది. చెప్పడానికి నా వద్ద ఏమి ఉన్నదనే ఆలోచనా వచ్చింది. ఐతే, ఆచార్య నారాయణరెడ్డి గారి పట్ల ఉన్న గౌరవం వల్లా, ఆయన నిర్ణయం పట్ల విశ్వాసం వల్లా "సరే" అని తరువాత తీరికగా ఆలోచిస్తే, నాకు చెప్పదగిన విజయాలు లేకపోయినా అపజయాలు ఉన్నాయి కనుకా, ఎన్నో ప్రతికూల పరిస్థితులను చూసి అనుభవించాను కనుకా ఎవరైనా వాటి నుంచి నేర్వదగినది ఎంతో కొంత ఉండకపోదన్న భావన కలిగింది. అదే నా చేత ఈ ప్రసంగ ప్రయత్నాన్ని చేయిస్తున్నది.

మాది మధ్యతరగతి కుటుంబం. అన్న వస్త్రాలు లేని పేదలం కాదు కనుక మధ్యతరగతి. గుంటూరు సమీపంలోని పొత్తూరు మా గ్రామం. 1934 ఫిబ్రవరి 8వ

తేదీన జన్మించాను. నా కన్న తండ్రి వెంకట సుబ్బయ్య గారు. ఆయన "కూలి కరణం". వారసత్వ కరణీకం కాదు కనుక కూలి కరణం. అంటే, వారసత్వ కరణం పక్షాన పని చేయడం. పనంతా మా నాన్న గారే చేసేవారు. నా కన్న తల్లి పేరు పన్నగేంద్రమ్మ. కన్న తల్లి, కన్న తండ్రి అని ఎందుకు ప్రత్యేకం అనవలసి వచ్చిందంటే నన్ను నా పినతండ్రి, పినతల్లి పెంచుకొన్నారు. పెంపుడు తల్లి నా కన్న తల్లికి చెల్లెలు. పెంపుడు తండ్రి నా కన్న తండ్రికి సొంత తమ్ముడు. సాధారణంగా అన్న దమ్ములు అక్క చెల్లెళ్లను చేసుకొనరు. నా కన్న తండ్రి కూడా పెంపుడు పోయినవాడు కనుక అన్నదమ్ములు అక్క చెల్లెళ్లను వివాహం చేసుకోవడం శాస్త్ర సమ్మతం అన్నారట అప్పటి కుటుంబ పెద్దలు. సొంత పినతండ్రి, సొంత పిన తల్లి పెంచడం కనుక నేను పరాయి ఇంటికి పోయానని అనిపించలేదు. మాకు కొద్దిపాటి భూస్థితి ఉండేది. అన్న వస్త్రాలకూ, అతిథి సత్కారాలకు లోటు ఉండేది కాదు. నాన్న గారు కరణీకంతో పాటు సొంతంగా సేద్యం కూడా చేసేవారు. సాయంత్రం వేళ పొలం నుంచి మేత మోపు నెత్తిన పెట్టుకొని ఇంటికి వస్తుండటం నాకు గుర్తు. ఎందుకు అంతగా గుర్తుందంటే నాన్నగారు నానెత్తిన నాలుగు దంట్లు కట్టకట్టి పెట్టేవారు. అది ఆయన సరదాకు చేయలేదనీ, శ్రమ చేయడం పట్ల నాకు గౌరవభావం కలిగించడానికనీ పెద్దయ్యాక తెలిసింది. మాకు పాడి ఉండేది. నా తల్లి పొద్దున్నే కవ్వం పెట్టి చల్ల చేయడం, నాకు వెన్న పెట్టడం, ఇంట్లోకి కావలసిన పెరుగు, మజ్జిగ పక్కన పెట్టి ఒక పెద్ద పాత్రలో చల్ల నింపి ఉంచడం నాకు బాగా గుర్తు. పాడిలేని ఇరుగు పొరుగులు చల్ల కోసం మా ఇంటికి వస్తే నా తల్లి వారు తెచ్చుకొన్న పాత్రల్లో చల్ల పోస్తుండేది. ఊరిలో ఎవరికైనా ఎవరూ పాలూ పెరుగూ చల్లా అమ్మేవారు కారు. యాదవ కుటుంబాలవారు మాత్రం గుంటూరు వెళ్లి పాలూ, పెరుగూ, వెన్నా అమ్ముకునేవారు. అది వారి జీవిక. మాకు వారూ వీరూ తమ పొలం గట్ల మీద కాసే కూరగాయలు తెచ్చి ఇస్తుండేవారు – డబ్బుకు కాదు, ఊరకనే. ఇదంతా నాకు ఐదారు సంవత్సరాల వయసప్పటి మాట. నాకు అన్న, ఇద్దరు అక్కలు. నా పెంపుడు తండ్రి రైల్వే స్టేషను మాస్టరుగా పని చేస్తుండేవారు. ఆయన సొంతంగా కొంత భూమి కొన్నారు. పిత్రార్జితం, కొన్నదీ కలిపి ఆయనకు పదిహేను ఎకరాల దాకా మెట్ట ఉండేది. చెరువు కింద ఒక ఎకరం మాగాణి ఉండేది. వరి అన్నమే గాక మా ఇంట్లో జొన్నన్నం, సజ్జన్నం కూడా తినేవాళ్లం. అతిథులు వచ్చినప్పుడు విధిగా వరి అన్నం పెట్టేవారు. నా తండ్రులు శ్రీశైలం లాంటి క్షేత్రాలలోని అన్న సత్రాల వారికీ, యేటా వచ్చే కూచిపూడి భాగవతులకు,

విప్రవినోదులకూ, శరన్నవరాత్రులలో వేదపండితులకూ తమకు ఉన్నంతలోనే ఎంతో కొంత ఇచ్చి సంతృప్తి పరచి పంపిస్తుండేవారు. పొరుగూళ్ల నుంచి పొత్తూరుకు ఎవరైనా బ్రాహ్మణులు వస్తే మా ఇంట్లోనే భోజనం. మడీ, ఆచారం ఉండేవి. గడియారాలు ఉండేవి కావు కనుక నా తండ్రి రోజూ సూర్యుడు నడినెత్తి దాటేదాకా వేచి ఉండి, ఎవరూ రారని నిర్ధారించుకొన్నాక భోజనానికి కూర్చొనేవారు. పంటలు చేతికొచ్చే రోజులలో వృత్తి పనివారు కళ్ళంలోనే తమ వార్షికం తీసుకొని వెళ్లేవారు.

మా ఊళ్లో ఒక ప్రాథమిక పాఠశాల ఉండేది. "గాడ్ సేవ్ ద కింగ్" అని మా చేత పొద్దున్నే పాడిస్తుండేవారు. మా ఊళ్లో నా చదువు ఐదో తరగతి వరకే. అదైనా పూర్తయిందో లేదో జ్ఞాపకం లేదు. నా తండ్రి పొలికట్టెతో ఇంటి ఆవరణ ఊడుస్తూ, గొడ్ల చావిడి శుభ్రం చేస్తూ నా చేత భాగవతంలోని "ఎవ్వనిచే జనించు..." మొదలైన పద్యాలూ, సుమతి, వేమన, దాశరథి శతకాల పద్యాలూ కంఠస్థం చేయించేవాడు. కూడికలు హెచ్చివేతల వరకూ లెక్కలూ, అన్నో ఇన్నో పద్యాలూ, ఇంగ్లీషులో అక్షరాలూ వరకే గ్రామంలో నా చదువు. ఇదే జీవితం అనుకొంటున్న దశలో నాకు పది సంవత్సరాలు నిండక ముందే నా కన్న తండ్రి చనిపోయాడు. అటు తరువాత ఆరు నెలలకే నా పెంపుడు తండ్రి కూడా పోయాడు. నా అన్న అప్పటికి బి.ఏ. చదివి ఉద్యోగం అన్వేషణలో ఉండేవాడు. నా తండ్రి మరణ సమయంలో నా అన్నకు గవర్నమెంటు ఉద్యోగం వచ్చిందా అని అడిగితే, దగ్గరున్న చుట్టాలు వచ్చిందని చెప్పగా విని తృప్తితో పోయాడని అనుకొన్నారు. నా పుట్టుక సమయంలో నా తల్లి వేంకటేశ్వరస్వామికి మొక్కుకొన్నదట. నాకు ఆ స్వామి పేరు పెట్టారు. తాను కుడిచేయి ముడుపుకట్టుకొని, నాకు పదవయేట కాబోలు నన్ను తిరుమలకు తీసుకొనివెళ్లి పుట్టు వెంట్రుకలు తీయించింది. అప్పటిదాకా నాకు జడ ఉండేది. తిరుమలకు అంతవరకు మెట్ల మార్గమే. ఘాట్ రోడ్డు నిర్మాణం జరగలేదు. మెట్లు ఎక్కుతూ కాస్తంత దూరం ఎక్కగానే "నాయనా! కాళ్లు నొప్పులు పుడుతున్నాయా?" అని అమ్మ అడుగుతుండటం నాకు బాగా గుర్తు.

తండ్రీ, పినతండ్రుల మరణం నుంచే నా పరాజయాల పరంపరా, ప్రతికూల పరిస్థితులూ ప్రారంభం. పొలం మీది నుంచి ఆదాయం కుటుంబ పోషణకు చాలేది కాదు. అన్న ఇంకా ఉద్యోగంలో చేరలేదు. తండ్రీ, పినతండ్రీ కూడా లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువైనాయి. నా తండ్రికి మరో ముగ్గురు తమ్ములు, ఒక చెల్లెలు ఉండేవారు. వారి కష్టసుఖాలు వారికి ఉండేవి. ఊరివారికి మా కుటుంబం పట్ల గౌరవం

ఎక్కువే. ఐతేనేమి, వారు మాకు చేయగలిగింది ఏమీ లేదు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనక చేసేదేమీ లేదు.

మా ఇంటి ముందు అరుగు మీద నిత్యం ఊరి పెద్దలు పిచ్చాపాటీ మాట్లాడుతూ కూర్చొనేవారు. అది మా తండ్రి కాలం నుంచి వస్తున్న అలవాటు. ఒక సాయంత్రం వేళ నేనూ, నా యీడు వాడే మరో పిల్లవాడూ వీధిలో ఆడుకొంటూ ఉంటే అరుగు మీది పెద్దలు మమ్మల్ని కేకేసారు. "ఒరే పిల్లలూ! మీ ఇద్దరిలో ఎవరు బలవంతులో చూద్దాం. వీపు మీద ఒకే ఒక గుద్దు గట్టిగా గుద్దుకోండి" అన్నారు. రెండో పిల్లవాడు నాకు స్నేహితుడే. పైగా మా రైతు కొడుకు. "కరణం గారి అబ్బాయే మొదట గుద్దుతాడు" అని కూడా పెద్దలు చెప్పారు. నా స్నేహితుడు వంగి "కొట్టరా" అన్నాడు. వాడికి దెబ్బ తగులుతుందేమో అనే భయం వల్లా, అలాంటి ఆటలు నాకు అలవాటు లేకపోవడం వల్లా నేను వాడిని నెమ్మదిగా గుద్దాను; వాడేమో తన వంతు రాగా బలంగా గుద్దాడు. నేను నేలను కరచుకొన్నాను. నా స్నేహితుడు నన్ను లేపి, నాకు అంటిన మట్టి దులిపి "పప్పు తినే బాపనోడివి, నువ్వేం గుద్దుతావురా" అన్నాడు– బహుశా సానుభూతితోనే. గ్రామ పెద్దలు పెద్దగా నవ్వారు. వాళ్లకది వినోదం. నాకు ఏడుపొచ్చింది. తల వంచుకొని ఇంట్లోకి వెళ్ళిపోయాను. అది మొదటి పరాజయం. నా మనస్సు మీద అ అనుభవం చెరగని ముద్ర వేసింది. మరి కొన్నాళ్లకు నా చదువు కోసం కుటుంబం గుంటూరు చేరింది. మా అన్నకు ఉద్యోగం వచ్చి మద్రాసుకు వెళ్ళిపోయాడు. నా చదువు విషయంలో సరైన సలహా ఇచ్చే వాళ్లు లేకపోయారు. ఎవరో ఒక ట్యూషను మేష్టారు సలహా మీద నన్ను "థర్డ్ ఫారం"లో చేర్పించడానికి నిశ్చయించి, నా పినతల్లి ఆయన సహాయాన్నే తీసుకొన్నది. ఆయనగారు నన్ను సెకండ్ ఫారం పరీక్షలో కూర్చోబెట్టి తనే నాచేత సమాధానాలు రాయించి, పాసైనాననిపించి, ఇచ్చిన మాట ప్రకారం థర్డ్ ఫారంలో చేర్పించాడు. చేరడమైతే చేరాను గాని తగిన పునాది లేదు కనుక క్లాసులో కొందరు టీచర్లు ఏవేవో ప్రశ్నలు అడిగి నేను చెప్పలేకపోతే నాకు రెండు తగిలించి, అందరూ నవ్వే వ్యాఖ్యానాలు చేసేవారు. అలా ఒక సంవత్సరం యావత్తు నరక యాతన అనుభవించాను. సహజంగానే పరీక్ష తప్పాను. అది నా రెండవ పరాజయం. థర్డ్ ఫారం రెండవ సారి చదువుతున్న రోజులలో నాకు నిత్యం రౌడీ విద్యార్థులు తారసపడి జేబులో అణానో రెండు అణాలో ఉంటే లాక్కునేవారు (అణా అంటే రూపాయిలో పదహారవ వంతు నాణెం). ఒకసారి స్కూలు ఫీజు కట్టడానికి తీసుకొని వెడుతున్న డబ్బులు కూడా

లాక్కొన్నారు. ఇంట్లో తల్లులకు చెప్పలేక అవమానాన్ని దిగమింగుకొనేవాడిని. రౌడీలను ఎదిరించలేక పోవడం మూడవ పరాజయం. ఎలాగో కష్టపడి స్కూల్ ఫైనల్ పాసయ్యాను. ఆర్థిక ఇబ్బందులు మితిమీరి పోయాయి. పొలాల మీది నుంచి ఆదాయం తగ్గిపోయింది. నా పినతల్లికి ఇంటి నిండా చుట్టాలు ఉండి, పది మంది భోజనం చేస్తుంటే తృప్తిగా ఉండేది. తన ఒంటి మీది బంగారం అమ్మి, భూములు అమ్మి మా తండ్రుల కాలం నాటి పదిమందికి భోజనాలు పెట్టడమనే వైభవం కొనసాగుతున్నదనే భ్రమ కలిగిస్తుండేది.

ఇది ఇలా ఉండగా నా చిన్న బావగారు దిడుగు కైలాసపతిగారు ప్రభుత్వ ఉద్యోగం మానుకొని కుటుంబ సమేతంగా మా ఇంటికి వచ్చారు. ఆయన ఆదర్శవాది. కడప జిల్లా జమ్మలమడుగు ప్రాంతంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టరుగా పని చేస్తూ లంచం తీసుకొనడాన్ని వ్యతిరేకించి కష్టాలపాలై ఉద్యోగం మానుకొన్నాడు. ఆయన గుంటూరులోని హరిజన సేవక్ సంఘంలో రోజుకు రెండు రూపాయల వేతనం తీసుకొంటూ పని చేసాడు. దళిత వాడలలో వీధులు ఊడ్చడం లాంటి పనులు చేసేవాడు. నాకు కూడా ఆయన ఆ పనిలో ఉన్న తృప్తిని పంచాడు. అప్పటి హరిజన సేవాసంఘం అధ్యక్షునితో గాంధేయవాదులు ఫస్ట్ క్లాస్‌లో రైలు ప్రయాణాలు చేయకూడదనే పేచీ పెట్టుకొని అక్కడా మానేశాడు. కొన్నాళ్లు విమానాశ్రమంలోనూ పని చేశాడు. నాకు ఉన్న భూమిలో ఆరో వంతు దానం చేయమని బోధిస్తుండేవాడు. అప్పటికే అప్పుల పాలై ఉండటం వల్ల మేము అలా దానం చేయలేక పోయాము. ఆయన ఇంగ్లీషులో మంచి కవితలు అల్లేవాడు. Unable to live and unallowed to die అనే పంక్తి నాకు జ్ఞాపకం ఉంది. సమాజంలో పెరుగుతున్న అవినీతి ఆయనను కలత పెడుతుండేది. నేను ఇంటర్ పాసై, బి.యస్‌సి. రెండవ సంవత్సరం చదువు తున్నప్పుడు ఆయన నాకు ఒక ఉత్తరం రాసిపెట్టి ఆత్మహత్య చేసుకొన్నాడు. "అవినీతి లేని సమాజంలో పుట్టడం కోసం జీవితాన్ని అంతం చేసుకొంటున్నాను" అని ఆయన రాశాడు. ఇది నా మనస్సును తాకిన చాలా పెద్ద దెబ్బ. కైలాసపతిగారి ఉత్తరాన్ని ఆయన అన్నగారికి ఇచ్చాను. ఆయన కూడా ఆదర్శవాది. ఆయన తన పేరును ఫ్రాంక్లిన్ రాం మహమ్మద్ అని మార్చుకున్నారు. అవినీతి లేని సమాజం సాధ్యమా? కాదని అప్పుడు నేను అనుకోలేదు. ప్రయత్నం చేద్దామనే అనుకొన్నాను. కాని, నా ప్రయత్నాలు ఫలించకపోవడాన్ని గురించి చెప్పడానికి చాలా ఉంది. అదంతా మరొక పరాజయం అనుకొంటే చాలు.

నేను ఇంటర్ చదివే రోజుల్లో క్లాసు పుస్తకాలు గాక ఇతర పుస్తకాలు చదవటం

అలవాటైంది. అప్పటి మా ప్రిన్సిపాల్ శ్రీ వల్లభజోశ్యుల సుబ్బారావు గారు ఇంగ్లీషు బోధించేవారు. మంచి మార్కులు తెచ్చుకొంటున్న మాలో కొందరిని "సివిల్ సర్వీసెస్" పోటీ పరీక్షలకు వెళ్లమని ప్రోత్సహించేవారు. ఆయన ప్రోత్సాహంతోనే విజ్ఞానం పెంచే ఇతర పుస్తకాలు చదవటం మొదలైంది. మా అన్నగారి ప్రోద్బలంతో ఇంగ్లీషులో "ద హిందూ" పత్రికనూ, తెలుగులో "ఆంధ్ర ప్రభ"నూ క్రమం తప్పక చదివేవాడిని. ముఖ్యంగా ఇంగ్లీషులో ఎడిటోరియల్ చదివి తెలియని పదాలకు అర్థాలు రాసుకునే వాడిని. కొన్ని వాక్యాలను కంఠస్థం కూడా చేసేవాడిని. అంతో ఇంతో ఇంగ్లీషు భాషా జ్ఞానం కలగడానికీ, మంచి మార్కులు తెచ్చుకోడానికీ అది ఉపయోగపడింది. అలాగే తెలుగులో నార్ల గారి సంపాదకీయాలను శ్రద్ధగా చదివేవాడిని. నాకు పత్రికల భాష అలవడటానికి అదే మూలం. నేను కళాశాలలో చదువుతూ ఉండగా సాహిత్యంలో దిట్టలైన కొందరు స్నేహితులు ఉండేవారు. అందులో ఒకరు డాక్టర్ ప్రసాదరాయ కులపతి. ఆయన మేము చదవుకున్న హిందూ కళాశాలకు తరువాత ప్రిన్సిపాల్ అయినారు. ఇంటర్, బి.యస్‌సి చదువుతున్న రోజులలో సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి "హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ", బెర్‌ట్రెండ్ రసల్ రచించిన "హిస్టరీ ఆఫ్ వెస్ట్రన్ ఫిలాసఫీ", ఇంకా "ఫండమెంటల్స్ ఆఫ్ మార్క్సిజం, లెనినిజం" మొదలైన పుస్తకాలు చదివాను. అంతబాగా అర్థం కాకపోయినా పట్టుదలగా చదివేవాడిని."కాపిటల్" చదువుదామని ప్రయత్నించి అర్థం కాక విరమించుకొన్నాను. జోలా, తామస్ హార్డీ, డాస్టవిస్కీ మొదలైన వారి నవలలు చదివాను. హిగిన్‌బాదమ్స్ స్టాలుకు వెళ్లి బ్రిటన్ నుంచి వస్తుండే "సైకాలజిస్ట్" పత్రికనూ, మన దేశంలోనే ప్రచురితమయ్యే "ఇలస్ట్రేటెడ్ వీక్లీ", "రేషనలిస్ట్" లాంటి పత్రికలనూ కొని చదివేవాడిని. హేతువాదం పట్లా, రాడికల్ హ్యూమనిజం పట్లా ఇష్టం ఉండేది. దైవం పట్ల గానీ, బ్రాహ్మణ కుటుంబాలు పాటించే సంప్రదాయాల పట్ల గానీ విశ్వాసం ఉండేది కాదు. కానీ, తల్లి తృప్తి కోసం శ్రద్ధగా తండ్రికి అబ్దీకాలు పెట్టేవాడిని. వివిధ విషయాలపై పుస్తకాలు చదవడం వల్ల చిన్నప్పుడు ఏర్పడిన ఆత్మన్యూనతా భావం పోయి, నాతో చదువుకుంటున్న విద్యార్థులకు నేను ఇంగ్లీషులో పాఠాలు అర్థమయ్యే విధంగా చెప్పే స్థాయికి చేరాను. 1948లో డాక్టర్ ప్రసాదరాయ కులపతి లాంటి మిత్రుల సాహచర్యం వల్ల మేఘసందేశం మొదలైన సంస్కృత కావ్యాలూ, ఆధునిక కవుల రచనలూ, నవలలూ చదివే అలవాటైంది. కవి మిత్రులతో చర్చలు జరుగుతుండేవి. ఈ విధమైన సాహిత్య వ్యాసంగంతో పాటు, వ్యాయామ శాలకు వెళ్లి వెయిట్‌లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ మొదలైనవి

చేసాను. శరీరం దృఢంగా తయారైంది. దానితో చిన్నప్పుడు కలిగిన "నేను జన్మరీత్యా బలహీనుడను" అనే భావన పోయింది. ఈ విధంగా మానసికంగానూ, శారీరకంగానూ బలపడి చిన్నతనంలో అనుభవించిన పరాజయాల దెబ్బ నుంచి బయటపడగలిగాను. నేను గానీ, కులపతి గారు గానీ, మా వ్యాయామ శాలలో ఇతర మిత్రులు గానీ ఎవరినీ తిట్టిందీ కొట్టిందీ లేదు. ఐనా, మా పట్ల సాటివారు అపారమైన గౌరవాభిమానాలు చూపిస్తుండేవారు. ఇంటర్ పాసై, బి. ఎస్‌సి లో చేరిన యేడాదికి మా పెంపుడు తల్లి నాకు పెళ్లి చేయాలనుకున్నారు; చేసారు. బి.ఎస్‌సి చదువుతున్నప్పుడు కూడా ఇతర పుస్తకాల మీద దృష్టి ఎక్కువై క్లాసు పుస్తకాలు చదవటం తగ్గిపోయింది. పరీక్షలకు ముందు రెండు మూడు రోజులు చదివితే పాసై పోవచ్చుననే ఆత్మ విశ్వాసాన్ని మించిన అహంకార భావన ఏర్పడింది. క్లాసు పుస్తకాలను పక్కన పారేసి, వేరు పుస్తకాలు చదవటం తప్పే. బి.ఎస్‌సి కాగానే నన్ను ఒక ప్రసిద్ధ పొగాకు కంపెనీలో "బయ్యర్"గా వేయించాలని మా మామగారి ఆలోచన. ఆ కంపెనీలో ఆయన దగ్గర బంధువు ఒకరు పెద్ద పదవిలో ఉండేవారు. ఆయన ఉద్యోగ విరమణ సమయంలో తన వారెవరో ఒకరికి "బయ్యర్" ఉద్యోగం ఇప్పించవచ్చు. ఆరువందల రూపాయల జీతం వచ్చే ఉద్యోగం అది. నేను ఆ ఉద్యోగాన్ని ఇష్టపడలేదు, కనుక ప్రయత్నించలేదు, దక్కించుకొనలేదు. పెద్ద జీతం నన్ను ఆకర్షించలేదు. ఎందుకంటే అది అంతే. ఆ రోజుల్లో అంత జీతం వచ్చే ఉద్యోగావకాశాన్ని జారవిడుచుకోవటం మా బంధువులందరి దృష్టిలో అతిపెద్ద వైఫల్యం, పరమ తెలివితక్కువ పని.

నా హైస్కూలు, కాలేజీ చదువుల రోజుల్లో జరిగిన రెండు మూడు ఆసక్తికర సంఘటనలను చెప్పవలసి ఉంది. మొదటిది స్కూల్ ఫైనల్ చదివేటప్పుడు ఒకరోజు టకటకలాడే బూట్లు వేసుకొని క్లాసుకు వెళ్లాను. రెండు మూడు నిమిషాలు లేటుగా వెళ్లటం వల్ల టీచరు అనుమతి తీసుకొని లోపలకు వెళ్లవలసి వచ్చింది. వెళుతుంటే నా బూట్ల చప్పుడు తప్పించి మరేమీ వినిపించనంత నిశ్శబ్దం ఏర్పడింది. మా టీచరు నోటి మీద వేలు వేసుకొని చేసిన సైగ వల్ల అంతా సైలెంట్ అయిపోయి నా వంకే చూస్తున్నారని తరువాత అర్థమైంది. నేను నా సీటు వద్దకు వెళ్లి కూర్చొని చూస్తే అప్పుడు అర్థమైంది. టీచరు అప్పటికి ఒక చిరునవ్వుతో నాకు జ్ఞానోదయం కలిగించి టకటకలాడే బూట్లతో క్లాసులోకి రావడం ఎందుకు మంచిదికాదో మరో రోజున క్లాసులో పాఠం చెప్పారు. అటు తరువాత జీవితంలో నేను ఎన్నడూ ఆడంబరంగా చప్పుడు చేసే చెప్పులు గానీ,

బూట్లు గానీ వేసుకోలేదు. ఇంటర్ చదివిన కాలం నాటి మరో సంఘటన, నా యీడు వాడైన మా దగ్గరి బంధువు ఒకరికి "అటెస్టేషన్" అవసరమై, నా పట్ల వాత్సల్యం కలిగిన మా ప్రిన్సిపాల్ సుబ్బారావు గారి దగ్గరకు అతడిని తీసుకొని వెళ్ళాను. ఆయన ఎలాంటి ప్రశ్నలు వేయకుండా సర్టిఫికేట్ ప్రతి మీద సంతకం పెట్టారు. నేను సంతోషంగా వెనక్కు తిరిగి వస్తున్నాను. తలుపు దగ్గరకు వెళ్లేసరికి ప్రిన్సిపాల్ గారు వెనుక నుంచి పిలిచారు. వెళ్లాను. ఆయన "వెంకటేశ్వరరావ్! నీవు నా దగ్గర రెండు సంవత్సరాలు చదువుకున్నావు, ఇంతేనా నీవు నేర్చుకొన్నది?" అన్నారు. ఆయనకు క్షమాపణ చెప్పాను. నాటి నుంచి నేటి వరకు ఎవరైనా సహాయం చేస్తే, వారు చిన్నవారైనా పెద్దవారైనా, ఇంగ్లీషు వచ్చినవారైనా రానివారైనా "థాంక్స్" అని కనీసం వినిపించీ వినిపించకుండా అయినా అనడం అలవాటైంది. బి.ఎస్సి చదివినప్పటి మరో సంఘటన, ఒక రోజు క్లాసులో వెనక బెంచీలో కూర్చుని పాఠం వినకుండా వేరే పుస్తకం చదువుతున్న నన్ను మాకు ఫిజిక్స్‌లో "హీట్" చెప్పే లెక్చరర్ పట్టుకొన్నారు. ఆయన నా బల్ల దగ్గరకు వచ్చి రెండు మూడు నిమిషాలు నిలుచున్నప్పటికీ నేను గమనించలేకపోయాను. లెక్చరర్ నన్ను నిలుచోమని క్లాసులో అందరూ వినేటట్టు పాఠాలు వినకపోతే ఎలా నష్టపోతామో చాలా సేపు చెప్పారు. ఆయన మాటల్లో బాధ ఉంది. నా పట్ల సానుభూతి ఉంది. ఆయనే బి.ఎస్సి ఫైనల్ యియర్ చివరి వర్కింగ్ డే నాడు ఒక్కొకరిని "మీ చదువు పూర్తయిన తరువాత ఏమి చేయాలని అనుకొంటున్నారు?" అని అడిగారు. నా దగ్గరకు వచ్చే సరికి "నేను జర్నలిస్టును కావాలనుకొంటున్నాను" అన్నాను. నేను అంతకు ముందే మా కాలేజీ మేగజైన్‌లో టెలివిజన్ గురించి ఇంగ్లీషులో వ్యాసం రాశాను. లెక్చరర్ దాన్ని ప్రస్తావించి, "ఒక వ్యాసం రాయగానే నార్ల వెంకటేశ్వర రావు అయిపోతా ననుకొంటున్నావా?" అన్నారు. కొంచెం సేపు ఆగి, ఆయనే "అయితే అవుతావేమోలే, నీ వాలకం చూస్తే అట్లాగే ఉంది" అన్నారు.

డిగ్రీ చదువు పూర్తవుతున్న దశలో జీవితం ఒక పెద్ద మలుపు తిరిగింది. బి.ఎస్సి పరీక్షలు జరుగుతున్న సమయంలో మా చిన్న బావగారి దురదృష్టకర, అసహజ మరణం సంభవించింది. మా అన్నగారు గుంటూరు జిల్లాలోనే ఉద్యోగం చేస్తున్నప్పటికీ ఆయన కుటుంబం కూడా పెద్దదే కనుక ఆర్థిక ఇబ్బందులు అనుభవిస్తుండేవాడు. నాకు ఆదాయం లేక, ఇల్లు గడవటం ఎలాగనే పరిస్థితి ఏర్పడింది. ధైర్యం చెప్పేవారు గానీ, సహాయం చేసేవారు గానీ లేరు. అప్పటికి పెళ్లి కూడా అయింది కనుక, ఉద్యోగం చేయక తప్పదు.

నా బలమైన కోర్కె పత్రికలలో ఉద్యోగం. పొగాకు కంపెనీలో పని ఇష్టం లేదు. ఈ పరిస్థితులలో నేను మొదటిసారి హైదరాబాద్‌లో నా పెద్దక్క శ్రీమతి శేషగిరమ్మ, పెద్దబావగారు శ్రీ వల్లూరి వెంకటేశ్వర్లు దంపతుల వద్దకు మనశ్శాంతి కోసం, మార్గదర్శకత్వం కోసం చేరాను. అది 1955 మధ్య కాలం. వెంకటేశ్వర్లు గారు సుప్రీం కోర్టు, హైకోర్టులలో న్యాయవాది. చాలా పెద్ద ప్రాక్టీసు ఉండేది. ఆయనకు డబ్బు కూడబెట్టాలనే ఆలోచన ఉండేది కాదు. ఇంటి నిండా వచ్చే పోయే జనం ఉండేవారు. ఎవరు వచ్చినా "భోజనానికి లేవండి" అనడం మా బావగారికి అలవాటు. దానధర్మాలు విరివిగా చేసేవారు. ఉదార స్వభావం. పుస్తకాల దుకాణానికి వెడితే ఒకేసారి జేబులో డబ్బులను బట్టి చాలా పుస్తకాలు కొనేవారు. వాటిని ఆయన గారి జూనియర్లు తీసుకొని వెళ్లేవారు. నేను చదువుదామంటే ఉండేవి కావు. ఒకసారి నేను మా బావగారికి "పుస్తకాలు పోతున్నాయి" అని చెపితే నన్ను కోప్పడ్డారు. ఎవరో తీసుకొని పోతున్నారని నేను కంప్లెయింట్ చేయడం ఆయనకు నచ్చలేదు. "Books are meant to be read and if somebody steals a book to read I will not mind it" అన్నారు. మరో సందర్భంలో "I do not like accumeulation money in bank accounts. We should spend it for good causes, particularly if it helps the needy and the poor" అన్నారు. వెంకటేశ్వర్లు గారి తమ్ముడు వల్లూరి బసవరాజు గారు వి.బి.రాజుగా ప్రసిద్ధులు. పూర్వ హైదరాబాద్ రాష్ట్రంలో వెల్లోడి, బూర్గుల రామకృష్ణరావు మంత్రి వర్గాలలో పని చేసి సమర్థుడైన మంత్రిగా పేరు తెచ్చుకొన్నారు. నేను హైదరాబాద్ వచ్చిననాటికి ఏదో కారణం వల్ల బూర్గుల మంత్రివర్గం నుంచి రాజీనామా చేశారు. అప్పట్లో స్వామీ రామానందతీర్థ ఆశీస్సులతో విశాలాంధ్ర కోసం ఉద్యమం చేస్తుండేవారు. తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఉండాలనే వాదం అప్పటికే బలంగా ఉండేది. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి ప్రతాపగిర్జీ కోఠీ వరకు విశాలాంధ్ర కోసం ఒక ఊరేగింపు తీసినప్పుడు నేను వి.బి.రాజు తదితర నాయకుల వెంట నడిచాను. 1952 సంవత్సరంలో గుంటూరు టౌన్‌హాల్ వద్ద స్వామీ సీతారామ్ నిరవధిక నిరాహార దీక్ష జరిపినప్పుడు హిందూ కాలేజీ విద్యార్థిగా నేనూ అక్కడ ఒక వలంటీరును. అలా నాకు భాషారాష్ట్ర ఉద్యమంతో కొద్దిపాటి సంబంధం ఉంది; ఉద్యమం పట్ల అవగాహన ఉంది. హైదరాబాద్‌లో నా పెద్దక్క, బావగారు నన్ను తమవద్ద కొన్నాళ్లు ఉండమన్నారు. వెంకటేశ్వర్లు గారు గొప్ప న్యాయవాదే గాక వేదాధ్యయనం చేసారు. సంస్కృతంలో మహా పండితుడు. ఆయన "ధాతు ప్రక్రియ" అనే ఒక ప్రామాణిక

గ్రంథాన్ని రచించారు. నన్ను "లా" చదవమనీ, సంస్కృతం నేర్చుకొనమనీ చాలా వత్తిడి చేశారు. నాకు అది సాధ్యం కాలేదు. కానీ, ఆయన ఇంట్లో ఉండగా నాకు పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, లా ఆఫ్ ఎవిడెన్స్, భారత రాజ్యాంగం మొదలైన పుస్తకాలు చదివే అవకాశం కలిగింది. పెద్ద పత్రికల కార్యాలయాలకు వెళ్లి ఉద్యోగం అడిగితే "అనుభవం ఉందా?" అని అడిగేవారు. ఆ స్థితిలో వి.బి.రాజు గారిని అడిగాను 'నాకు జర్నలిజంలో ఆసక్తి ఉంది– మీకు తెలిసిన తెలుగు, ఇంగ్లీషు పత్రికలలో ఎవరికైనా సిఫారసు చేయవలసిం'దని. ఆయన "మొదట నేర్చుకో. తరువాత ఉద్యోగం చేయవచ్చు" అని సూచించి, అప్పట్లో 'ఆంధ్రజనత' పత్రిక సంపాదకులుగా ఉండిన శ్రీ కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యం గారికి టెలిఫోన్‌చేసి "జర్నలిజంలో ఆసక్తి ఉందంటున్న ఒక యువకుడిని పంపిస్తున్నాను. పనికొస్తాడేమో చూడండి" అని చెప్పాడు. ఆయన "మనకు మనుషులు కావాలి, చూద్దాం, పంపండి" సమాధానం పలికాడు. అలా ఒక సాయంత్రం వేళ మొజంజాహి మార్కెట్ ప్రాంతంలోని 'విలాప్' అనే పత్రిక ఆవరణలోని 'ఆంధ్రజనత' కార్యాలయానికి వెళ్లాను. అక్కడ సంపాదకుడు సుబ్రహ్మణ్యంగారు నాకు ఒక టెండర్ నోటీసు ఇచ్చి అనువాదం చేయమన్నాడు. నేను చేశాను. "మీరు ఇంతకు ముందు ఏదో పత్రికలో పని చేసి ఉండాలి. లేకపోతే ఇలా చేయగలిగేవారు కాదు. నిజం చెప్పండి. మీకే మంచిది" అన్నారు. నేను మళ్లీ "నిజమే చెప్పాను" అని వివరించాను. ఆయన "రేపటి నుంచి పనిలోకి రాండి. జీత భత్యాల విషయంలో మీరు అడగవలసిన పని లేదు. ఎంతో కొంత ఇవ్వకపోరు" అన్నారు. అలా నేను జర్నలిజంలో ప్రవేశించాను. అది 1957వ సంవత్సరం. ప్రారంభంలో నా జీతం నెలకు వంద రూపాయలు. ఆ రోజుల్లో జీతాలు అంతే. అప్పట్లో సిగరెట్లు కాల్చడం అలవాటై, వచ్చిన జీతాన్ని సిగరెట్లకు ఖర్చు చేసేవాడిని. కుటుంబాన్ని హైదరాబాద్‌కు తెచ్చాను. ఇల్లు గడవడం కోసం అప్పటినుంచి ఉన్న ఆస్తులనూ, నా తల్లి గాజులతో సహా ఆమె నగలనూ, వెండి పళ్లేలనూ, పొలాలనూ, పొత్తూరులోని, గుంటూరులోని ఇళ్లనూ అమ్మి వేశాను. అలా చేస్తేనేగాని ఇల్లు జరగని పరిస్థితి. 1975 దాకా ఇదే స్థితి కొనసాగింది. 1962లో చైనా మన దేశం పై దాడి చేసినప్పుడు పేదలు కూడా దేశ రక్షణ కోసం ఏమైనా ఇస్తూ ఉంటే నేనేమీ ఇవ్వలేక పోయాననే బాధ కలిగింది. అప్పుడు నేను సిగరెట్లు మానేశాను.

జర్నలిజం వృత్తిలో సంతృప్తి అప్పుడూ ఉంది, ఇప్పుడూ ఉంది. కాని, జర్నలిజంలోకి వచ్చిన తొలి రెండు దశాబ్దులలో (60లూ, 70లూ) ఆర్థికంగా చాలా కష్టాలు పడవలసి

వచ్చింది. ఉద్యోగంలో చేరిన రెండవ సంవత్సరంలో నాకు ఆడపిల్ల పుట్టి పోయింది. సరైన వైద్యం చేయించలేక బిడ్డను పోగొట్టుకొన్నాననే బాధ అప్పటి నుంచి ఇప్పటిదాకా ఉంది. ఖననానికి పదిహేను రూపాయలు అప్పు చేయవలసి వచ్చింది. అక్కా బావలను అడగలేక మానసిక వ్యధకు గురయ్యాను. నా తల్లి, సంపన్న కుటుంబం నుంచి వచ్చిన నా భార్య కష్టాలను భరిస్తూ సహకరించడం వల్ల నేను వృత్తి మీద దృష్టిని కేంద్రీకరించగలిగాను. రెండు మూడు రోజులు ఇంటికి వెళ్లకుండా ఆఫీసులోనే ఉండి పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. చిన్న పత్రికలలో అలా పని చేయక తప్పని పరిస్థితులు ఉండేవి. ఆంధ్రజనతలో 1957 నుంచి 1964 వరకు పని చేశాను. సబ్ ఎడిటర్‌గా చేరినా చిన్న పత్రిక కావడం వల్ల రిపోర్టింగ్ అవకాశాలు కూడా నాకు కలిగాయి. అది మా సంపాదకుల అనుగ్రహం. నాటి కేంద్ర కమ్యూనిటి డెవలప్‌మెంట్ శాఖ మంత్రి ఎస్.కె.డే హైదరాబాద్ సమీపంలోని పటంచెరువు (మెదక్ జిల్లా) వద్ద కొత్త పంచాయితీ రాజ్య వ్యవస్థ ఏర్పాటు నిమిత్తం శిక్షణ శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు. ఆ కార్యక్రమాన్ని నేను రిపోర్టు చేశాను (పటం చెరువు అసలు పేరు పొట్ల చెరువు). బలవంతరాయ్ మెహతా కమిటీ నివేదిక ఆధారంగా అధికార వికేంద్రీకరణకు దేశంలోకెల్లా మొదటిసారిగా జరిగిన ప్రయోగం అది. అటు తరువాత కొంతకాలానికి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మహబూబ్‌నగర్ (పాలమూరు) జిల్లా షాద్‌నగర్‌లో మన రాష్ట్రంలో కెల్లా మొదటి బ్లాకుకు ప్రారంభోత్సవం చేశారు. అది రిపోర్టు చేసే మహదవకాశం కూడా నాకు దక్కింది. నెహ్రూగారి "డిస్కవరీ ఆఫ్ ఇండియా" మొదలైన పుస్తకాలను చదివి ఉండటం వల్లా, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన నాయకత్వం గురించి అవగాహన ఉండటం వల్లా ఆయనను దగ్గరనుంచి చూడటం గొప్ప అనుభవం అనిపించింది. పత్రికా విలేకరులకు వసతిగా షాద్‌నగర్ ట్రావెలర్స్ బంగళాలో నెహ్రూగారి గది పక్క గదే ఇచ్చారు. ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారూ, ఇతర మంత్రులు మరెక్కడో బస చేశారు. మధ్యాహ్నం నెహ్రూగారు కొంచెం సేపు పడుకొని లేచేవేళకు మేము పెద్దగా నవ్వుతూ మాట్లాడుతూ ఉన్నాము. అది ఆయన విశ్రాంతికి భంగం కలిగించినదేమో తెలియదు. చూద్దామని నేను గది బయటకు వచ్చి చూస్తే నెహ్రూగారు కూడా అప్పుడే బయటికి వచ్చి ఒక చిరునవ్వు నవ్వి మళ్లీ లోపలకు వెళ్లిపోయారు. ఆ చిరునవ్వు చాలు తప్పు చేశామని మేము గ్రహించుకొనడానికి. అప్పటినుంచి నా మట్టుకు నేను త్యాగధనులూ, మహనీయుల విషయంలో పిల్ల చేష్టలు చేయకూడదనీ, చాలా బాధ్యతాయుతంగా ఉండాలని

నిశ్చయించుకొన్నాను. అలాగే ఉన్నాను కూడా. చిన్న సంఘటనేగానీ నాకు అది పెద్ద గుణపాఠం. రిపోర్టింగ్‌లో మరో మంచి అనుభవం నాకు ఆంధ్రజనతలో ఉండగా కలిగింది. యు.ఎస్.ఎ.ఐ.డి. (అమెరికా ఆర్థిక సహాయ సంస్థ) కార్యక్రమం క్రింద దక్షిణాదిలో కొన్ని ప్రాజెక్టులకు అమెరికా ఆర్థిక సహాయం అందిస్తున్నది. ఆ ప్రాజెక్టులను చూడటానికి దక్షిణాది రాష్ట్రాల నుంచి కొందరు జర్నలిస్టులను ఒక బృందంగా తీసుకొని వెళ్లారు. హైదరాబాద్ నుంచి ఒక విమానంలో పొద్దున్న బయలుదేరితే తిరువనంతపురంలోనో కొచ్చిన్‌లోనో ఒకటి రెండు ప్రాజెక్టులు చూసి సాయంత్రం బెంగుళూరు చేరి అక్కడ కొందరు అధికారులతో మాట్లాడి మరునాడు పొద్దున మద్రాసు (ఇప్పుడు చెన్నై) చేరి అక్కడ ఇంకా కొన్ని ప్రాజెక్టులు చూసి సాయంత్రం ఇంకేదో పట్టణం చూసి రాత్రికి తిరిగి హైదరాబాద్ చేరాము. ప్రత్యేకించి మా కోసం మద్రాసులోని అమెరికా రాయబార కార్యాలయ శాఖ విమానాన్ని ఏర్పాటు చేసింది. విమాన ప్రయాణం నాకు అదే మొదటిసారి. అందులోనూ పొద్దున ఒక రాష్ట్ర రాజధానిలో బ్రేక్‌ఫాస్టూ, మధ్యాహ్నం మరో రాష్ట్రంలో లంచ్, రాత్రికి ఇంకొక రాష్ట్ర రాజధానిలో డిన్నరూ రెండు రోజుల్లో అలా నాలుగు దక్షిణాది రాష్ట్రాలను చూపించారు.

మొదటి సారి జర్నలిజంలో ప్రవేశానికి సిఫారసు అవసరమైంది గానీ అటు తరువాత నాకు అవకాశాలు వాటంతట అవే వచ్చాయి. 1964 సంవత్సరంలో ఆంధ్రభూమి పత్రిక నుంచి నాకు ఆహ్వానం వచ్చింది. నన్ను అక్కడికి న్యూస్ ఎడిటరుగా రమ్మన్నారు. అప్పటికి ఆంధ్రజనతలో నేను అసిస్టెంట్ ఎడిటరుగా ఉన్నాను. ఆంధ్రజనతనూ, నాకు జర్నలిజంలో అక్షరాలు నేర్పిన సుబ్రహ్మణ్యం గారినీ వదిలి వెళ్లడం కష్టమనిపించినా ఉన్నచోటనే ఉంటే జీత భత్యాలు పెరిగే అవకాశం కనిపించలేదు కనుక మాతృ సంస్థను అయిష్టంగానే వదిలి వెళ్లాను. నా జీతం రెండు వందల రూపాయల నుంచి రెండు వందల ఎనభై ఐదు రూపాయలకు పెరిగింది. ఆంధ్రభూమిలో న్యూస్ ఎడిటరుగా పని చేయడం సంతృప్తికరంగానే సాగినప్పటికీ పత్రికను మరింత మెరుగ్గా తీర్చిదిద్దడానికి ఆస్కారం లేకపోయింది. మేనేజ్‌మెంట్ సూచనపై ఆదివారం సంచికలో కొన్ని మార్పులు చేద్దామని ప్రయత్నించాను. మా సంపాదకులు గోరా శాస్త్రిగారు "నేను అజయ్ ముఖర్జీ, మీరు జ్యోతి బసు అన్నమాట" అని వ్యాఖ్యానించారు. (పశ్చిమ బెంగాల్‌లో 1967, 1969 సంవత్సరాలలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు బంగ్లా కాంగ్రెస్‌కు చెందిన అజయ్ ముఖర్జీ ముఖ్యమంత్రి, జ్యోతి బసు ఉప ముఖ్యమంత్రి. జ్యోతి బసు మాటే నాటి

సంకీర్ణ ప్రభుత్వంలో చెల్లుబాటు అవుతుండేది.) నిజమే. నేను చేసినది పొరపాటే. సంపాదకుడు ఉన్నప్పుడు నేను స్వతంత్రించి ఆదివారం సంచికలో మార్పులు చేయాలనుకోవడం సరికాదు. సంపాదకుడిని సంప్రతించి ఆ పని చేసి ఉండవలసింది. గోరా శాస్త్రిగారి మనస్సును అర్థం చేసుకొని నేను న్యూస్ ఎడిటింగ్ వరకే పరిమితమైనాను. అక్కడ కూడా నా బాధ్యత పరిమితమైనదే. నాకు ముందునుంచే అక్కడ పని చేస్తున్న మరో న్యూస్ ఎడిటర్ శ్రీ జి.యస్. వరదాచార్య ఉన్నారు. ఆయన నాకు సీనియర్. కనుక నాది పరిమితమైన బాధ్యత. వార్తల ఎంపిక విషయంలో ఎడిటరుగానీ, మరొకరు గానీ జోక్యం చేసుకొనే వారు కాదు. 1969లో తెలంగాణా ఉద్యమం ఉవ్వెత్తున ఎగసినప్పుడు ఆంధ్రభూమిలో దానికి సంబంధించిన వార్తలు వివరంగా వస్తుండేవి. ప్రభుత్వంలో ఉన్న అప్పటి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి గారికి అది కొంత బాధ కలిగించేది. ఐనప్పటికీ ఆయన మాపై ఒత్తిడి తీసుకొని రాలేదు. ఉద్యమ నాయకులకు సంపాదక విభాగంలో మేము సంపూర్ణ సహకారాన్ని అందించాము. సంపాదకులు గోరాశాస్త్రి సమైక్యవాదాన్ని సమర్థిస్తూ సంపాదకీయాలు రాస్తుండేవారు. మేము వార్తలను ప్రచురించే విధానం "ఈ పత్రిక ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని బలపరుస్తున్నది" అనే అభిప్రాయాన్ని కలిగిస్తుండేది.

ఆంధ్రభూమిలో పని చేస్తున్నప్పుడు నాకు వస్తున్న జీతం చాలక రేడియోలో ప్రాంతీయ వార్తలు చదువుతుండేవాడిని. రోజుకు పదిహేను రూపాయలు ఇచ్చేవారు. పదిహేను రోజుల కాంట్రాక్టు ఇచ్చేవారు. అది అయ్యాక తిరిగి పదిహేను రోజుల కాంట్రాక్టు ఇచ్చేవారు. అవసరమైతే రిపోర్టింగ్, న్యూస్ రీల్, అసెంబ్లీ సమీక్షలు రాసే జర్నలిస్టుల స్క్రిప్టులు చదవటం మొదలైన పనులు కూడా చేయించేవారు. నాకు న్యూస్ రీడింగ్‌లో శిక్షణ ఇచ్చినవారు పన్యాల రంగనాథరావు గారు. అప్పుడాయన ఆలిండియా రేడియో హైదరాబాద్ కేంద్రం ప్రాంతీయ వార్తా విభాగంలో న్యూస్ ఎడిటర్‌గా ఉండేవారు. ఒకప్పుడు ఆయన న్యూస్ రీడర్‌గా ప్రసిద్ధులు. న్యూస్ రీడర్‌గా మొదట కొంత కంగారు ఉండేది. క్రమంగా భయం తొలగింది. మంచి పేరే వచ్చింది. టాకర్ గానూ అంతకు ముందు నుంచి కాస్తంత మంచి పేరే ఉండటం కొంత ఉపయోగపడింది.

నేను ఆంధ్రభూమిలో పని చేసిన కాలంలో 1969 తెలంగాణా ఉద్యమం గురించి ముందే చెప్పాను. 1972లో ప్రత్యేకాంధ్ర ఉద్యమం జరిగింది. ఈ రెండు ఉద్యమాలూ రాష్ట్ర చరిత్రను మారుస్తాయేమో అన్నంత ఉధృతంగా సాగాయి. కాసు బ్రహ్మానంద రెడ్డి

గారి నిష్క్రమణతో తెలంగాణా ఉద్యమం, పి.వి. నరసింహారావు గారి రాజీనామాతో ప్రత్యేకాంధ్ర ఉద్యమం సమసి పోయాయి. తెలంగాణా ఉద్యమ కాలంలో నేను అప్పటి ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీతో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మాట్లాడి ఒప్పించడం వల్ల ఆమె తెలంగాణా ఉద్యమం నడుపుతున్న విద్యార్థి నాయకులనూ, మరి కొందరు ఇతర నాయకులనూ మొత్తం పదహారు మందిని ఢిల్లీకి ఆహ్వానించారు. ఈ ప్రయత్నంలో నాతో పని చేస్తున్న కొందరు జర్నలిస్టులూ, విద్యార్థి నాయకులైన శ్రీ మల్లికార్జున్, శ్రీ శ్రీధర్ రెడ్డి ప్రభృతులూ సహకరించారు. నిజానికి పదహారు పేర్లూ ఇచ్చినది విద్యార్థి నాయకుడు శ్రీ మల్లికార్జున్‌గారే. అప్పట్లో విద్యార్థి ఉద్యమంలో ముఖ్య పాత్రధారి ఆయనే. కాంగ్రెస్ నాయకులలో వి.బి.రాజుగారు ఫరీదాబాద్ కాంగ్రెస్ మహాసభల సమయంలో శ్రీమతి గాంధీ గారితో మాట్లాడటానికి సహాయం చేశారు. ఇందిరా గాంధీ గారి పిలుపు వార్తను పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. దురదృష్టవశాత్తు అంతవరకు తెరవెనక ఉన్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి గారు చర్చల ప్రతిపాదనను వ్యతిరేకించి ఆహ్వానాలను తిరస్కరింపజేశారు. తెలంగాణా నాయకులు ఢిల్లీ వెళ్లి ఉంటే తెలంగాణా ప్రాంతానికి ప్రత్యేక ప్రతిపత్తి లాంటిది అప్పుడే సాధ్యమయ్యేదని నా అవగాహన. శ్రీమతి ఇందిరా గాంధీ I am not prepared to concede seperation, but short of it I am willing to discuss any proposal. I have my compelling reasons for this అన్నారు. చెన్నారెడ్డిగారి సారధ్యంలో ప్రజాసమితి ఇందిరా గాంధీ గారి ఆహ్వానాన్ని తిరస్కరించిన తరువాత ఆమె నాతో మాట్లాడలేదు. చొక్కారావు గారి పట్టుదలపై ఒక అర్ధరాత్రి వేళ ఆమె హైదరాబాద్ వచ్చినప్పుడు నాకు కబురు పెట్టలేదు. నేను సైతం ఆమెను కలిసే ప్రయత్నం చేయలేదు. చర్చలు జరగకపోవడం చాలా పెద్ద వైఫల్యం అని భావించాను. నైరాశ్యం కలిగింది. కాని, నేను చేయగలిగింది మరేమీ కనపడలేదు. ఉద్యమ సందర్భంగా జరిగిన కాల్పులలో వందలాది మంది మరణించడం నన్ను బాగా కలతపెట్టింది. నేను జోక్యం చేసుకొని, చర్చలు జరపాలని ప్రయత్నం చేయడానికి కారణం అదే. అప్పటి నుంచే నేను తెలంగాణ ప్రత్యేక వాదాన్ని సమర్థిస్తూ, రాష్ట్ర విభజనను కోరుతూ వచ్చాను. చర్చల కోసం చేసిన ప్రయత్నం ఫలించకపోవడం నా అపజయం అనిపించి కొన్నాళ్లు బాధ పడ్డాను.

1975లో నా జీవితంలో మరో ముఖ్య ఘట్టం ప్రారంభమైంది. ఆంధ్రభూమి యాజమాన్యం అంతవరకు ఇస్తూవచ్చిన టెలిఫోన్ అలవెన్సును ఆపివేసింది. ఆంధ్రభూమి

డెక్కన్ క్రానికల్ సంస్థ ప్రచురణ. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆపామని చెప్పారు. కాని నాతోటి న్యూస్ ఎడిటరుకు ఇస్తూ వచ్చారు. మేనేజ్‌మెంట్ ఇలా విచక్షణ చూపడం నాకు చాలా కష్టం కలిగించింది. మరో గూడు చూసుకొందామన్న ఆలోచన మొలకెత్తింది. ఈ పరిస్థితులలో నాకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ చైర్మన్ శ్రీ రామోజీరావు గారి నుంచి పిలుపు వచ్చింది. కబురు తెచ్చినవారు నాకు ఆప్తులు, అంతకు ముందే రామోజీ రావుగారు కొత్తగా స్థాపించిన ఈనాడు పత్రికకు బ్యూరో చీఫ్‌గా పని చేస్తున్న వై. శేఖర్ గారు. 1974 చివరి నెలలో రామోజీరావు గారు విశాఖపట్నంలో ఈనాడు పత్రికను ప్రారంభించారు. ఎ.బి.కె. ప్రసాద్‌గారు ఎడిటరు. ఎందువల్లనో ప్రసాద్‌గారి పట్ల అసంతృప్తి కలిగి, హైదరాబాద్‌లో పెట్టబోయే పత్రికకు మరో ఎడిటరును నియమించే ఆలోచన చేశారు శ్రీ రామోజీరావు. అలా నాకు పిలుపు వచ్చింది. ఈనాడుకు ఆయన చీఫ్ ఎడిటర్. వారం రోజుల పాటు నన్ను ఇంటర్వ్యూ చేశారాయన. నా ఆలోచనా విధానం, నా సిద్ధాంతాలు, విశ్వాసాలు, అలవాట్లు మొదలైన అనేక విషయాలను ఆయన తెలుసుకునే ప్రశ్నలు వేశారు. ఉద్యోగం మారాలనే ఆలోచన అప్పటికే వచ్చినందువల్ల నేను ఓపికగా సమాధానాలు చెప్పాను. ఇక్కడ నా విశ్వాసాలకు సంబంధించిన ఒక విషయం చెప్పవలసి ఉంది.

1959 ప్రాంతంలో నా మొదటి సంతానం ఆడపిల్ల పోయి, మానసికంగా నేనూ, నా భార్యా కుంగిపోయి ఉన్నప్పుడు గుంటూరులోని నా మిత్రులు కొందరూ, నా మామగారూ జిల్లెళ్లమూడి అమ్మ గురించి చెప్పి, "ఒకసారి వెళ్లి చూసిరా కూడదా" అన్నారు. నాకు అప్పటికి నాస్తిక భావాలే ఉండేవి. మనుషుల మహిమలను గురించి గానీ, వారి ఆధ్యాత్మిక ఔన్నత్యం గురించి గానీ నాకు మంచి అభిప్రాయం లేదు. ఐనా, పరిస్థితులు తోసుకువచ్చి, నేను డాక్టర్ ప్రసాదరాయ కులపతీ, మరికొందరు మిత్రులతో కలసి జిల్లెళ్లమూడి వెళ్లాను. అప్పుడు వెళ్లిన బృందంలో రమణ మహర్షి ప్రత్యక్ష శిష్యుడూ, గొప్ప పండితుడూ అయిన శ్రీకృష్ణభిక్షు, వ్యాకరణ పండితుడు శ్రీ మిన్నిగంటి గురునాధశర్మ, డాక్టర్ మారుటూరి పాండు రంగారావు, మరికొందరు ఉన్నారు. జిల్లెళ్లమూడిలో హేతువుకు అందని కొన్ని విశేషాలు జరిగినాయి. అవన్నీ అలా ఉంచితే అమ్మలో మానవత్వ లక్షణాలు నన్ను ఆకర్షించాయి. నాకు దేవుడిలో విశ్వాసం లేదని అమ్మకి చెప్పాను. "అవసరం లేదు నాన్నా" అన్నారామె. అప్పటి నుంచి నేను జిల్లెళ్లమూడికి వెళ్లడం మొదలైంది. నా విశ్వాసాలూ క్రమంగా మారాయి. ఈ సమస్త విశ్వాన్నీ, సృష్టినీ నడిపిస్తున్న ఒక మహా

శక్తి ఏదో ఉందన్న భావం బలపడింది. హేతువాదం వర్తించని సందర్భాలు ఉన్నాయనే అభిప్రాయం కలిగింది. అమ్మను అప్పటి నుంచి ఆరాధిస్తూ వచ్చాను.

రామోజీరావు గారు నాస్తికుడని, ఒకప్పుడు కమ్యూనిస్టు అనీ మిత్రులు చెప్పారు. ఐనా, నా విశ్వాసాలను గురించి నిజాయితీగా చెప్పాను. ఆయన నా నిజాయితీని హర్షించారనిపించింది. నన్ను ఎడిటరుగా ఉద్యోగంలో చేరమన్నారు. నా విశ్వాసాలు పత్రికలో రాకుండా ఉంటే చాలన్నారు. నేను మరెక్కడా, రేడియోతో సహా, పని చేయకూడదనే షరతు పెట్టారు. ఆంధ్రభూమిలోనూ, రేడియోలోనూ పని చేస్తే వచ్చే ఆదాయానికి సరిపడే జీతం ఇస్తామన్నారు; ఇచ్చారు. ఈనాడులో మొదటి బ్యాచి జర్నలిస్టులను నేను తయారు చేసుకొన్నాను. జిల్లాలకు వెళ్లి నిజాయితీపరులైన వ్యక్తులను కరెస్పాండెంట్లుగా నియమించాను. తెలుగు పత్రికలలోకెల్లా మొదటిసారి అన్ని జిల్లాలలోనూ కరెస్పాండెంట్లను నియమించిన కీర్తి ఈనాడుకే దక్కుతుంది. వారందరిని హైదరాబాద్‌లో సమావేశపరచి, అవసరమైన శిక్షణ ఇచ్చి, జిల్లాలకు పంపాను. రామోజీరావు గారు ఖర్చుకు వెనుదీసే వ్యక్తి కాదు. ఆయనకు ఫలితాలు చూపించాలి. అంతే. 1976లో గౌహతిలో కాంగ్రెస్ మహాసభలు జరిగినప్పుడు అవి రిపోర్టు చేయడానికి నేను స్వయంగా వెళ్లాను. ఆయన "ఎలా వెళుతున్నారు?" అని అడిగారు. నేను "ట్రెయిన్లో" అన్నాను. ఆయన నన్ను విమానంలో వెళ్లమని చెప్పి తగిన ఏర్పాట్లు చేశారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. "మనం friends for life. మీ పిల్లల చదువులు, పెళ్లిళ్లు మొదలైనవి నేను చూసుకొంటాను" అన్నారు. అది ఔదార్యంతో కూడిన మాట. నేను అక్కడ పని చేసినంతకాలం ఆయన పట్ల విధేయతతో పని చేశాను. నిజాయితీతో పని చేశాను. కాని, రామోజీరావు గారి ప్రమేయం లేని కొన్ని సంఘటనలు జరిగి నేను మరెంతో కాలం ఈనాడులో పని చేయలేనేమో అనిపించిన తరుణంలో నాకు ఆంధ్రప్రభ నుంచి పిలుపు వచ్చింది. రామోజీరావు గారితో చెప్పాను. ఆయన వద్దన్నారు. "It is a snake pit of politics. మీరు తట్టుకోలేరు" అన్నారు. నేను ఆంధ్రప్రభ యాజమాన్యం పంపిన వారికి "రాలేను" అని చెప్పి, ఆఫరును తిరస్కరించాను. కాని, ఈనాడులో మరి కొన్ని సంఘటనలు జరిగి, వెళ్లి ఉంటే బాగుండేదనే ఆలోచన వచ్చింది. మళ్లీ, ఆశ్చర్యకరంగా, ఆంధ్రప్రభ యాజమాన్యం కబురు పెట్టింది. తిరిగి రామోజీరావుగారితో చెప్పి, వెళ్లడానికి అనుమతించ మన్నాను. ఆయన సరే అన్నారు. నన్ను గౌరవించి పంపారు. నేను ఈనాడులో పని చేసినది రెండున్నర సంవత్సరాలు మాత్రమే. ఐనా అక్కడ నేను నేర్చినది చాలా ఉంది. ముఖ్యంగా

రామోజీరావుగారి నుంచి కష్టపడి పని చేయడం, క్రమశిక్షణ నేర్చుకొన్నాను. ఈనాడులో నేను ఆర్థికంగా ఇబ్బందిపడలేదు. ఆదాయం ఖర్చుకు సరిపోయేది. నిజానికి అప్పటికి నేను ఉన్న ఇల్లు తప్ప ఆస్తి ఏమీ మిగలలేదు. 1969 ప్రాంతంలో నేను జర్నలిస్టుల హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీకి అధ్యక్షుడుగా ఎన్నికైనాను. నేను అధ్యక్షుడుగా ఉండగా దేశంలోకెల్లా మొదటిసారిగా జర్నలిస్టుల కాలనీ హైదరాబాద్‌లో రూపు దిద్దుకొన్నది. దానికి కోటంరాజు రామారాజుగారి పేరు పెట్టి అప్పటి రాష్ట్రపతి శ్రీ వి.వి.గిరి గారి చేత ప్రారంభోత్సవం జరిపించాము. ఈ కార్యక్రమం నా గొప్ప కాదు. పేరు నాదేగాని, హైదరాబాద్‌లోని పలువురు సీనియర్ జర్నలిస్టులు సమష్టిగా చేసిన కృషి ఫలితమే ఈ కాలనీ. దురదృష్టమేమిటంటే నాకు వ్యవహార దక్షతలేక పోవడం వల్ల నేను కట్టుకొందామనుకొన్న ఇంటిని పూర్తి చేయలేక, అప్పుల పాలై, జీతం రాళ్ల నుంచి వడ్డీలు కట్టలేక, వాటిని తీర్చలేననే భయంతో నేను ఖర్చు పెట్టిన డబ్బు ఇస్తే చాలు అమ్ముతానని చాలా మందికి ఆఫర్ ఇచ్చాను. జర్నలిస్టు కాని ఒకరు ముందుకు వచ్చారు. ఆయనను నమ్మి దెబ్బ తిన్నాను. బహుశా ఎవరూ నమ్మరేమో అని అనుకొంటున్న ఒక విశేషమేమిటంటే, నేను ఇంటిని అమ్మినప్పుడు ఇంటి స్థలం ఖరీదు నేను గణనలోకి తీసుకోలేదు. ఇంకా ఆశ్చర్యకరం ఏమిటంటే, నేను వెయ్యి రూపాయల బయానా తీసుకొని ఇంటిని స్వాధీనం చేస్తే, దానిని కొన్న పెద్ద మనిషి అప్పుడు కాస్తా అప్పుడు కాస్తా ఇస్తూ అప్పుల నుంచి బయటపడటానికి సరిపడే డబ్బు మాత్రం ముట్టజెప్పాడు. నేను నా సొంత వనరుల నుంచి పెట్టిన డబ్బు రాలేదు. తాను ప్రభుత్వం నుంచి ఇల్లు కొనడానికి అప్పు తీసుకొన్నాననీ, మొత్తం డబ్బు ముట్టినట్లు నేను రసీదు ఇవ్వకపోతే తన ఉద్యోగం పోతుందనీ చెప్పి నా చేత సంతకం పెట్టించుకొని వెళ్లాడు. తాను నాకు అన్యాయం చేస్తున్నందుకు బాధ పడుతున్నట్లు అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తుండేవాడు. అవి ఇంకా నా వద్ద ఉన్నాయి. ఇలా రెండు దశాబ్దాలకు పైగా జరిగాక కొన్న పెద్ద మనిషి చనిపోయాడు. ఆయన పోయాక అనేక సంవత్సరాలకు ఆయన కుమారుడు ఏక మొత్తంగా బాకీపడిన డబ్బు ఇచ్చాడు. ముప్పదేండ్ల తరువాత నేను ఒక్క పైసా అదనంగా తీసుకొనకుండా ఆ ఇంటిని రిజిస్టరు చేశాను. కాని, అప్పటికి, భూముల ధరలు కొన్ని వందల రెట్లు పెరిగాయి. ఇప్పుడు అక్కడ స్థలం ఖరీదే కోట్లలో ఉంటుంది. ఎవరికైనా అమ్మి వచ్చిన డబ్బు చెరిసగం తీసుకొందామని కొన్న వ్యక్తి కుమారుడికి చెప్పాను. అతడు ఒప్పుకోలేదు.

1977 ద్వితీయార్థంలో నేను ఆంధ్రప్రభకు హైదరాబాద్‌లో రెసిడెంట్ ఎడిటరుగా

బాధ్యతలు తీసుకొన్నాను. అప్పటికి ఆంధ్రప్రభకు ఎడిటరు నాకు గురువైన కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యంగారు. ఆంధ్రప్రభ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపుకు చెందిన పత్రిక. యాజమాని శ్రీ రామనాథ్ గోయంకా. ఆయన కుమారుడి పేరు భగవాన్‌దాస్ గోయంకా. నన్ను గురించి విని పిలిపించినది భగవాన్‌దాస్ గారే. విమానంలో ఎక్కడినుంచి ఎక్కడికో వెడుతూ విమానాశ్రయంలో కొద్ది సేపు ఆగి నన్ను పిలిపించి మాట్లాడుతుండేవాడు. అలా ఒక రోజు ఆగి మాట్లాడుతున్నప్పుడు ఆయన తాము నన్ను ఎడిటరుగా నియమించడం కోసమే ఆహ్వానించామనీ, అందుకు సిద్ధంగా ఉండమనీ చెప్పారు. నేను షాక్ తిన్నాను. సుబ్రహ్మణ్యంగారు నాకు గురువనీ, ఆయనను తీసి వేసి నన్ను ఆ పదవిలో పెట్టడం నాకు ఆమోదం కాదనీ ఖండితంగా చెప్పాను. ఆయన సరే అన్నట్లు తలూపి వెళ్లిపోయారు. ఇది మరెవరికీ చెప్పేది కాదు కనుక నాలోనే దాచుకొన్నాను. 1980లో నన్ను ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికకు ఎడిటరుగా బదలీ చేసి, అంతవరకు నేను పని చేసిన స్థానంలో ఎ.బి.కె. ప్రసాద్ గారిని రెసిడెంట్ ఎడిటరుగా నియమించారు. నాకు పీరియాడికల్ జర్నలిజంలో అనుభవం లేదు. ఉద్యోగం వదిలేద్దామంటే వెంటనే ఇంకో చోట ఉద్యోగం దొరుకుతుందన్న పూచీ లేదు. నాకు అంతకు ముందు వార పత్రికకు సంపాదకులుగా ఉన్న విద్వాన్ విశ్వం గారు ధైర్యం చెప్పారు. మీరు చేయగలరని విశ్వాసం నూరి పోశారు. నన్ను వీక్లీకి బదలీ చేసిన వార్త జర్నలిస్ట్ సర్కిల్స్ వేగంగా వ్యాపించింది. అదే రోజు రాత్రి గోరా శాస్త్రిగారు టెలిఫోన్ చేసి "మీకు వచ్చినది చాలా మంచి అవకాశం. వార పత్రికలో పని చేస్తే త్వరగా మంచి పేరు వస్తుంది. నాకు ఆంధ్రభూమి ఎడిటర్‌గా కంటే, ఒకప్పటి స్వతంత్ర ఎడిటరుగానే ఎక్కువ మంది గౌరవం ఇస్తున్నారు. మీ తత్వాన్ని బట్టి రాజీనామా చేస్తారేమో అనే అనుమానం వచ్చి ఫోన్ చేస్తున్నాను" అని చెప్పారు. ఆయన సహృదయతకు కృతజ్ఞత తెలియజేశాను. సుబ్రహ్మణ్యంగారు కూడా "ఇదే ఆఫీసులో పని కదా. మీరు బాధపడకండి" అని సలహా ఇచ్చారు. వీక్లీ ఎడిటరుగా ఉండిపోవడానికి నిశ్చయించుకొన్నాను. చాలా మంది ఊహించినట్లే సుబ్రహ్మణ్యం గారిని త్వరలోనే తొలగించి ప్రసాద్ గారిని యాక్టింగ్ ఎడిటరుగా యాజమాన్యం నియమించింది. "నేను ఇంత బాగా పని చేస్తుంటే నన్ను ఎందుకు ఇలా తొలగించారు?" అని సుబ్రహ్మణ్యంగారు చాలా బాధపడ్డారు. నిజమే. ఆయనను ఎందుకు తొలగించారో తెలియదు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపులో ఇవి సర్వసాధారణమని మిత్రులు వ్యాఖ్యానించారు. "నా వంతు ఎప్పుడు వస్తుందో" అనుకొన్నాను. ఆ రోజుల్లో వీక్లీల సర్క్యులేషన్ సీరియల్స్‌ను బట్టి పెరగడమో, తగ్గడమో జరుగుతుండేది. మరో వీక్లీ

ప్రచురించిన క్షుద్ర శక్తుల సీరియల్‌తో దాని సర్క్యులేషన్ అమాంతంగా పెరిగి ఆంధ్రప్రభకు అప్పటివరకు వీక్లీలో ఉన్న ప్రథమ స్థానం పోయింది. నన్ను కూడా అలాంటి సీరియల్ వేయమని మిత్రులు సలహా ఇచ్చారు. నేను అంగీకరించ లేదు. నన్ను యాజమాన్యం తొలగించినా పరవాలేదనుకొన్నాను. అదృష్టవశాత్తు యాజమాన్యం "కథలూ నవలల విషయంలోగానీ, ఇతర శీర్షికల విషయంలో గానీ రాజీపడవలసిన అవసరం లేదు" అని నాకు సందేశం పంపింది. ఆపద తొలగిందనుకొన్నాను. మరో సంవత్సరం గడిచేసరికి ఎ.బి.కె.ప్రసాద్‌గారు తప్పుకోవలసి వచ్చి, నన్ను దిన పత్రికను కూడా వేరే ఎడిటరును నియమించేదాకా చూడమన్నారు. అలా నేను ఆంధ్రప్రభ దిన పత్రికకు యాక్టింగ్ ఎడిటరుగా కూడా పని చేయవలసి వచ్చింది. మరెవరూ దొరకనందువల్లనో, గడచిపోతున్నదిగదా అనో నన్ను దిన పత్రికకూ, వార పత్రికకూ కూడా ఎటిటరుగా యాజమాన్యం ఖరారు చేశారు.

గతంలో "ఆంధ్ర పత్రిక"లో ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నం ఒకటి ఉంది దాన్ని గురించి కూడా చెప్పాలి. వాఙ్మయమహాధ్యక్ష శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య గారి సూచనపై అప్పటి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ కొత్త రఘురామయ్యగారు నాకు ఒక సిఫారసు లేఖ ఇచ్చి ఆంధ్రపత్రిక యాజమాని శంభుప్రసాద్ గారి వద్దకు పంపారు. అది నేను ఆంధ్రభూమిలో పని చేస్తున్నప్పటి మాట. నాకు రిపోర్టర్‌గా పని చేద్దామనే కోరిక ఉండేది. రఘురామయ్య గారు సహాయం చేద్దామనుకొన్నారు. శంభుప్రసాద్‌గారు నన్ను మద్రాసు వచ్చి డెస్క్‌జాబ్ చేయమన్నారు. అది నాకు ఆమోదం కాలేదు. నేను అడిగినది హైదరాబాద్‌లో రిపోర్టర్ పని. ఏమైనా నేను రిపోర్టర్ కాలేకపోయాను. కాని రిపోర్టింగ్ చేసే అవకాశాలు మొదటి నుంచి లభిస్తూ వచ్చాయి. అందులో కొన్ని– ఆంధ్రప్రభ రెసిడెంట్ ఎడిటరుగా చేరిన మూడునాలుగు నెలలకే అప్పటి ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయ్ సోవియట్ యూనియన్ సందర్శిస్తుంటే ఎక్స్‌ప్రెస్ గ్రూపు ప్రతినిధులలో ఒకరుగా నేను కూడా రిపోర్టింగ్ పని మీద ఆయనతో వెళ్లవలసి వచ్చింది. విదేశాలలో దేశాధినేతల పర్యటనలు రిపోర్టు చేసిన మొదటి అనుభవం అప్పుడు నాకు కలిగింది. జి.కె.రెడ్డి, అజిత్ భట్టాచార్య లాంటి ప్రసిద్ధ జర్నలిస్టులతో కలసి తిరిగే అవకాశం రావడం అదృష్ట మనుకొన్నాను. ఒకసారి శ్రీ రాజీవ్ గాంధీ నన్ను తన విమానంలో వెంట తీసుకొని వెళ్లి దారిలో ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇలా మరికొన్ని అవకాశాలు సైతం వచ్చాయి. పి.వి.నరసింహారావు గారు ప్రధానమంత్రిగా అమెరికా

సందర్శించినప్పుడు ఆయన వెంట వెళ్లిన సీనియర్ జర్నలిస్టులలో నేనూ ఒకడిని. వైట్‌హౌస్ నుంచి రిపోర్ట్ చేసిన అనుభవం అప్పుడు కలిగింది.

ఆంధ్రప్రభలో ఎడిటరుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పుడు మూడు సార్లు రాజీనామా లేఖలను పంపవలసి వచ్చింది. మూడు సార్లూ యాజమాన్యం వాటిని తిరస్కరించింది. ఇందులో ఒక సందర్భానికి రాజకీయ వాసన ఉంది. విజయవాడలో రంగా హత్య తరువాత జరిగిన విధ్వంసకాండ దీనికి నేపథ్యం. విధ్వంసకాండలో భాగంగా ఈనాడు కార్యాలయంపై కూడా దాడి జరిగింది. విజయవాడ విధ్వంసకాండను పరిశీలించడానికి జాతీయ స్థాయి ఎడిటర్స్ గిల్డ్ కొందరు ప్రసిద్ధ జర్నలిస్టులను పంపింది. అప్పట్లో రామోజీరావు గారు గిల్డ్ అధ్యక్షులు. ఆయన నన్ను కూడా విజయవాడ పరిస్థితిని చూడమని కోరారు. మిగతా గిల్డ్ ప్రతినిధులతో గాక నేను వేరుగా విజయవాడ పరిస్థితిని చూసి నాదైన నివేదికను గిల్డ్ అధ్యక్షులకు పంపించాను. మిగతా గిల్డ్ ప్రతినిధులు కలిసి ఇచ్చిన నివేదికకూ, నా నివేదికకూ తేడా ఉంది. ఢిల్లీకి తిరిగి వెళ్లిన జర్నలిస్టు ప్రముఖులలో ఒకరు (బహుశా ఎక్స్‌ప్రెస్ సంపాదకులు) నా నివేదికను రామనాథ్ గోయంకాకు చూపించారు. ఆయన వెంటనే నాకు ఒక లేఖ వ్రాశారు. అందులో I am appalled to read your report అనే ఒక వాక్యం ఉంది. యజమానికి అలాంటి అభిప్రాయం కలిగించిన తరువాత నేను సంపాదకుడుగా కొనసాగటం ధర్మం కాదని భావించి నేను తక్షణం రాజీనామా లేఖను పంపాను. నిజానికి నా నివేదిక పత్రికలో ప్రచురణకు ఉద్దేశించినది కాదు. అది విజయవాడ ఘటనలపై నా అభిప్రాయాలు వ్రాసిన నివేదిక. కనుక ఆయన ఆక్షేపించవలసిన పని లేదు. నా రాజీనామా చూసిన మరనాడే నన్ను ఆయన మద్రాసుకు పిలిపించారు. ఆయన ఇంగ్లీషులో అన్నమాటలకు అర్థం ఇదీ. "ఇంత పెద్ద వాడిని. మీతో విభేదించే హక్కు నాకు లేదా? నేను నా అభిప్రాయం వ్రాసాను అంతే. మీరు రాజీనామా చేయవలసిన పనేముంది?" అన్నారు. "నాకు అలాంటి హక్కు ఉన్నట్లే మీకూ ఉంది" అన్నాను. ఆయన రాజీనామా లేఖను తిరిగి ఇచ్చారు. రామనాథ్ గోయంకా గురించి ఎవరు ఏమని అనుకొన్నా నాకు మాత్రం ఆయనకు కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయని గట్టి అభిప్రాయం కలిగింది. ఆయన ఎన్నడూ నేను పత్రికలో వ్రాసిన దానిని తప్పు పట్టలేదు. "మీరు ఎడిటరుగా ఉన్నంతకాలం మీ అభిప్రాయాలు మీరు స్వేచ్ఛగా వ్రాయవచ్చు" అని ఆయన చెప్పిన మాటలను నేను ఎన్నటికీ మరువలేను. ఎన్.టి.రామారావు గారు తెలుగుదేశం పార్టీ పెట్టినప్పుడు నేను "గాలి మారింది" శీర్షికతో ఆంధ్రప్రభ సచిత్ర వార

పత్రికలో సంపాదకీయం వ్రాశాను. అది నచ్చని కొందరు నన్ను విమర్శిస్తూ గోయంకా గారికి లేఖలు వ్రాసారు. మద్రాసులో ఒకరు నా సంపాదకీయాన్ని విమర్శిస్తూ ఆర్టు పేపరు మీద నాలుగు పేజీల కరపత్రం ప్రచురించారు. దానిలో నా సంపాదకీయాన్ని పునః ముద్రించడమేగాక, అది రామారావుగారు నన్నూ, గోయంకా గారినీ ప్రలోభపెట్టి రాయించినదనే నింద వేశారు. గోయంకా గారు దానిని పట్టించుకొనలేదు. అది ఎవరో వ్రాయించినదని నాకు అనిపించింది. అందువల్ల నేను కూడా దానిని పట్టించుకోలేదు. నిజానికి గోయంకా గారికి గాని, నాకు గాని అప్పటివరకు రామారావుగారితో పరిచయం లేదు.

రామారావు గారు ఎందుకు పార్టీ పెట్టారో, ఆయన విధానాలేమిటో ప్రజలు తెలుసుకోవాలని ఉంటుంది కనుక నేను రామారావు గారిని ఒప్పించి పాఠకుల ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చే ఏర్పాటు చేశాను. అక్షరాలా ఒక బస్తా (గోనె సంచీ) నిండా ఉత్తరాలు వచ్చాయి. రామారావుగారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత ఆయన విధానాలపై అవసరమైతే విమర్శలు చేశాను. మంచి పనులని నాకు అనిపిస్తే అభినందించాను. వారసత్వ గ్రామాధికార వ్యవస్థను ప్రత్యామ్నాయం లేకుండా ఆయన రద్దు చేసినప్పుడు నేను తీవ్రంగా విమర్శించాను. రామారావు గారు స్వయంగా పత్రికలు చదవరు. ఎవరో ఏదో చెపితే నమ్ముతారు. నేను ఆయనను నిత్యం విమర్శిస్తుంటాననీ, కమ్మవారికి నేను వ్యతిరేకమనీ ఎవరో ఆయనకు నూరిపోశారు. గతంలో నేను ఆయన పార్టీని స్వాగతించిన సంగతిని రామారావు గారు విస్మరించి నన్ను తీసివేయవలసిందని రామనాథ్ గోయంకా గారిని కోరారు. గోయంకా గారు నన్ను తీసివేయలేదు. కాని, ఒకసారి రామారావుగారిని కలుసుకొనమని సలహా ఇచ్చారు. నేను వెళ్లి స్వయంగా ముఖాముఖి మాట్లాడిన తరువాత రామారావుగారు తన అభిప్రాయాన్ని మార్చుకొన్నారు. తాను ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొన్నప్పుడు నాకు నచ్చకపోతే తనతోనే మొదట చెప్పమని అడిగారు. నేను సరే అన్నాను. అలా ఆయనకు మొదటే నా అభిప్రాయాలు చెప్పి నిర్ణయాలను ప్రభావితం చేసిన సందర్భాలు ఉన్నాయి.

1991లో రామనాథ్ గోయంకా తరం ముగుస్తున్న సమయంలో పరిస్థితులు మారుతున్నాయనీ, సంపాదకులకు పూర్వ గౌరవం ఉండటం సందేహాస్పదమనీ గుర్తించి, 58 సంవత్సరాలు పూర్తయినప్పుడు ఉద్యోగ విరమణ చేద్దామనుకొన్నవాడిని కొన్ని నెలల ముందుగానే స్వచ్ఛంద పదవీ విరమణ కోరుకొన్నాను. అంతకు నాలుగైదు నెలల ముందే

నా జీతాన్ని మేనేజ్ మెంట్ పెంచింది. మానుకొంటే ఇల్లు ఎలా జరుగుతుందనే ప్రశ్న వచ్చి అప్పుడే చార్టర్డ్ అకౌంటెంట్‌గా సొంత ప్రాక్టీసు పెట్టిన నా పెద్ద కుమారుడినీ, భార్యనూ అడిగాను. ఆదాయం కొన్నాళ్లపాటు సరిపోనప్పటికీ క్రమంగా తన ఆదాయం పెరుగుతుందని మా పెద్ద కుమారుడు భరోసా ఇచ్చాడు. మా రెండవ కుమారుడు అప్పట్లో అమెరికాలో చదువుతున్నాడు. అతడి చదువుకి మా సహాయం అవసరం లేదు. ఉన్న దాని తోనే సర్దుకొందామనీ మనస్సుకు కష్టం అనిపిస్తే ఉద్యోగం మానుకోవలసిందనీ నా భార్య చెప్పింది. అలా నాకు కుటుంబం సహకరించింది. ఇంతలో ఒక అనుకోని సహాయం వచ్చినట్లే వచ్చి పోయింది. అదెలాగ అంటే, ఒక రోజు గోయంకా గారు నాకు జీవిత కాలం పింఛనుగా నెలకు ఐదు వేలు ఇమ్మని ఉత్తరువు ఇచ్చారని మేనేజ్‌మెంట్ పక్షాన ఎవరో చెప్పారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపులో శ్రీ ములగావ్ కర్ అనే పూర్వ సంపాదకుడికీ, నాకూ గోయంకా గారు అలాంటి ఏర్పాటు చేశారట. ఇష్టమైతే ఏమైనా వ్రాస్తుండవచ్చు. వ్రాయకపోతే ఇబ్బంది లేదు. రెండు మూడు నెలలు అలా ఇంటికి చెక్కు తెచ్చి ఇచ్చారు.

ఇంతలో మరొక అనుకోని పరిణామం వచ్చింది. తిరుమలతిరుపతి దేవస్థానం ప్రచురణలకు నన్ను గౌరవ ముఖ్య సంపాదకుడుగా నియమిస్తున్నట్లు అప్పటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ ఎమ్.వి. ఎస్. ప్రసాద్ గారు తెలియజేశారు. ఒకప్పుడు విద్వాన్ విశ్వం గారు ముఖ్య సంపాదకుడుగా టి.టి.డి.లో ఉద్యోగం చేశారు. నేను ఉద్యోగంగా గాక, అప్పుడప్పుడు తిరుపతికి వెళ్లి పని చేసే పద్ధతిలో గౌరవ ముఖ్య సంపాదకుడుగా బాధ్యత తీసుకోవడానికి ఇష్టపడ్డాను. ఇది పత్రికలలో వచ్చింది. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ కార్యాలయం మేనేజరు నా వద్దకు వచ్చి టి.టి.డి. గౌరవ సంపాదకుడైనందుకు అభినందించి, "సర్, మీకు పింఛను కొనసాగించమంటారా, ఆపమంటారా?" అని అడిగాడు. "నేను అడిగితే ఇచ్చినది కాదు కనుక మీ ఇష్టం" అన్నాను. "మీరే వద్దని వ్రాసిస్తే బాగుంటుంది" అన్నాడతడు. ఒక వేళ యజమానులే అలా చెప్పి పంపారేమో అని అనుమానం వచ్చి ఆయన చెప్పినట్లే వ్రాసి ఇచ్చాను. పింఛను ఆగిపోయింది. రామనాథ్ గోయంకా గారు పెద్ద మనసుతో చేద్దామని అనుకొన్న సాయాన్ని ఎవరో పుణ్యం కట్టుకొని ఆపించారు. అది ఎవరు ఆపించారో ఇప్పటికీ నాకు తెలియదు. మనుషుల మనస్తత్వాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకొనడానికి ఇదొక సంఘటన. నేను ఆంధ్రప్రభ దిన, వార పత్రికలకు ఎడిటరుగా పని చేసిన చివరి సంవత్సరంలో ఎన్.టి.రామారావు గారి ప్రభుత్వం

నన్ను "స్టేట్ కమిషనర్ ఫర్ రిడ్రెసల్ ఆఫ్ కన్స్యూమర్ గ్రీవెన్సెస్" అనే వినియోగదారుల రాష్ట్ర స్థాయి న్యాయ నిర్ణయ యంత్రాంగానికి ఒక సభ్యుడుగా నియమించింది. మరొక సభ్యురాలు డాక్టర్ వనజా అయ్యంగార్. అధ్యక్షులు హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎ. లక్ష్మణరావు గారు. వారంలో ఒక్క శనివారం నాడు మాత్రమే ఈ న్యాయస్థానం పని చేసేది. మిగతా ఐదు వర్కింగ్ డేస్‌లో న్యాయమూర్తి లక్ష్మణరావు గారు హైకోర్టు పని చూసేవారు. స్టేట్ కమిషన్ కూడా హైకోర్టు ప్రాంగణంలోనే పని చేసేది. కోర్టుకూ, దీనికీ పెద్ద తేడా ఏమీ లేదు. కాకపోతే, న్యాయమూర్తితో పాటు అనధికార సభ్యులమైన మేమిద్దరం న్యాయ నిర్ణయంలో భాగస్వాముల మయ్యేవారం. న్యాయవాదులు మమ్మల్ని కూడా "యువర్ లార్డ్‌షిప్" అని సంబోధించేవారు. 1986 సంవత్సరం నాటి కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ కింద ఈ న్యాయ యంత్రాంగం ఏర్పాటైంది. సభ్యులమైన ఇద్దరికీ సిట్టింగ్ ఫీజు ఇచ్చేవారు. తీర్పులు రాయడం, న్యాయం చేశామన్న సంతృప్తి మాకు కలిగిన ప్రయోజనాలు. న్యాయ శాస్త్ర గ్రంథాలు మరికొన్నింటిని చదివే అవకాశం కలగడం కూడా మరొక మేలు. న్యాయమూర్తి కమిషన్ అధ్యక్షుడుగా పదవీ స్వీకారం చేసేటంతవరకు నేను తాత్కాలికంగా అధ్యక్ష పదవీ బాధ్యతలను నిర్వహించే అపూర్వ అవకాశం కలిగింది. చట్టంలో అలా ఒక నిబంధన ఉంది. కొత్త న్యాయమూర్తి కమిషన్ అధ్యక్ష బాధ్యతలు తీసుకొన్న తరువాత ఆయనా, ఆయనతో పాటు మేమూ పూర్తికాల సభ్యులుగా పని చేశాము. మా కమిషన్ హైకోర్టు ప్రాంగణంలో ఉన్నప్పుడు నేను ఒక తీర్పును తెలుగులో వ్రాసి చదివాను. అది హైకోర్టు ప్రాంగణంలో మొదటి తెలుగు తీర్పు. కనుక చరిత్రాత్మకం. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కోర్టు హాలులో ఈ తీర్పు పట్ల హర్షామోదాలు ప్రకటించారు. ఇక్కడ మరొక సంఘటన గురించి చెప్పవలసి ఉంది. 1955వ సంవత్సరంలో మా బావ వల్లూరి వెంకటేశ్వర్లు గారితో హైకోర్టుకు వెళ్ళినప్పుడు నేను విజిటర్ల బల్ల మీద కాలు మీద కాలు వేసుకోని కూర్చొన్నాను. అక్కడి బంట్రోతు వచ్చి కాలు మీద కాలు వేసుకోవడం తప్పని హెచ్చరించి తీయించి వెళ్లాడు. చిత్రమేమిటంటే, సరిగా అదే కోర్టు హాలులో నేను న్యాయమూర్తి స్థానంలో కూర్చొని తీర్పులు ఇచ్చాను. మరొక సంఘటన కూడా ఇక్కడ చెప్పవలసి ఉంది. నేను ఎడిటరుగా ఉన్నప్పుడు నాపై "డిఫమేషన్" కేసు ఒకటి ఒకానొక జిల్లాలో విచారణకు వచ్చింది. నేను కోర్టు హాలులోకి వెళుతుంటే బంట్రోతు నన్ను చెప్పులు బయట వదలి వెళ్లమన్నాడు. న్యాయవాదులు ఎందుకు చెప్పులతో కోర్టు హాలులోకి వెళ్ల వచ్చునో, నేను ఎందుకు వెళ్లకూడదో అర్థం

కాలేదు. మా న్యాయవాదిని అడిగితే అది చాలా కాలంగా వస్తున్న సంప్రదాయం అని చెప్పారు. నేను హైదరాబాద్‌కు తిరిగి వచ్చాక ఆ విషయాన్ని మా కమిషన్ చైర్మన్ జస్టిస్ లక్ష్మణరావు గారికి చెప్పాను. అప్పుడు ఆయన యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా కూడా ఉన్నారని జ్ఞాపకం. ఆయన వెంటనే రిజిస్ట్రారును పిలిచి ఈ సంప్రదాయం పాటించవద్దని అన్ని జిల్లాల కోర్టులకూ ఆర్డర్లు పంపించారు. ఆ విధంగా ఒక పనికిమాలిన సంప్రదాయాన్ని తప్పించిన తృప్తి నాకు కలిగింది.

నేను పూర్తికాల సభ్యుడుగా ఉన్నప్పుడు ఉదయం దిన పత్రికకు చీఫ్ ఎడిటరుగా రమ్మని పిలుపు వచ్చింది. ఆ పిలుపు వెనుక అంతవరకు ఉదయం చీఫ్ ఎడిటరుగా ఉన్న గజ్జెల మల్లారెడ్డి గారు, మిత్రులు ఎస్. వీరనారాయణ రెడ్డిగారు (ఐ.పి.ఎస్. రిటైర్డ్) ఉన్నారు. అప్పటికి టి.టి.డి. ప్రచురణల గౌరవ ముఖ్య సంపాదక పదవీకాలం పూర్తి కావచ్చింది. ఈ దశలో న్యాయస్థానం పదవికి రాజీనామా ఇచ్చి ఉదయం బాధ్యతను చేపట్టాను. అక్కడ ఒక సంవత్సరం మాత్రమే పని చేసి, ఒక వార్తను ప్రచురించే విషయంలో అప్పటి పత్రిక యజమాని మాగుంట సుబ్బరామిరెడ్డి గారికి ఇబ్బందికర పరిస్థితి వచ్చినందువల్ల వార్తను ఆపమన్నారు. అది సంపాదకీయ స్వేచ్ఛలో జోక్యం అవుతుంది. కనుక నేను రాజీనామా చేసి బయటికి వచ్చాను. సుబ్బరామిరెడ్డి గారు అప్పుడు పార్లమెంట్ సభ్యుడు. కొన్నాళ్ళ తరువాత ఆయన ఆంధ్రపత్రికను కూడా కొన్నారు. కొన్నాక నన్ను కలుసుకొని తన రెండు పత్రికలకూ ఎడిటరుగా ఉండమన్నారు. అలా ఒక ఎడిటరు రెండు దినపత్రికలను నడపటం కుదరదని చెప్పాను. రెండు కంపెనీలకు తాను మేనేజింగ్ డైరెక్టరుగా ఉన్నట్లే నేను రెండు పత్రికలకు ఎడిటరుగా ఉండవచ్చునని ఆయన వాదించారు. మరి ఇంక పత్రికలలో పని చేయకూడదనే ఒక నిర్ణయానికి అప్పటికే వచ్చాను కనుక అది జరుగలేదు.

నేను పొత్తూరులో నిర్మించుకొన్న చిన్న ఆశ్రమంలో ఎక్కువకాలం గడపాలనీ, నేను చేస్తున్న ఆధ్యాత్మిక సాధన మీద ఎక్కువ దృష్టి పెట్టాలనీ, రాయాలనుకొన్న, రాస్తున్న పుస్తకాలను పూర్తి చేయాలనీ ప్రయత్నం చేశాను. అవన్నీ నెమ్మదిగా సాగుతున్న దశలో ఒకరోజు అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు "మీరు కొంత సర్వీస్ చేయవలసి ఉంటుంది." అన్నారు. అంతకు ముందు హిందూ డిప్యూటీ ఎడిటరూ, నాకు మిత్రులూ అయిన శ్రీ రాజేంద్ర ప్రసాద్ సలహాపై అప్పటి (పదవ) శాసనసభ స్పీకరు శ్రీ యనమల రామకృష్ణుడు నన్ను "ఎథిక్స్ కమిటీ" స్టడీ గ్రూపు సభ్యుడుగా

నియమించారు. శాసనసభ ఎథిక్స్ కమిటీకి వరంగల్ జిల్లా శాసనసభ్యుడూ, మాజీ మంత్రీ శ్రీ యతిరాజారావు అధ్యక్షులు. స్టడీ గ్రూపులో అడ్వొకేట్ జనరల్, లా సెక్రటరీ, ఒక మాజీ హైకోర్టు న్యాయమూర్తి ఇతర సభ్యులు. నేను శాసనసభ నియమావళినీ, పార్లమెంటరీ సంప్రదాయాలకు సంబంధించిన గ్రంథాలనూ చదివిన అనభవం ఉన్నవాడను కనుక అంగీకరించాను. అడ్వొకేట్ జనరల్, లా సెక్రటరీ ఎప్పుడూ బిజీగా ఉండేవారు. మాజీ న్యాయమూర్తి, నేను ఎక్కువ భాగం కలసి పని చేశాము. మాజీ న్యాయమూర్తి నాకు డ్రాఫ్టు తయారు చేసే బాధ్యతను అప్పగించారు. అభిప్రాయాలూ, నిర్ణయాలూ కమిటీవే అయినా, వాటిని అక్షర బద్ధం చేసే బాధ్యత స్టడీ గ్రూపుది. చర్చలలో స్టడీ గ్రూపు సభ్యులం సైతం పాల్గొనేవాళ్లం. నివేదిక తృప్తికరంగా రూపొందింది. శాసనసభ ఒక ప్రత్యేక సమావేశంలో దానిని ఆమోదించింది. నేను ఆ రోజు ఆఫీసర్ల గాలరీలో కూర్చొని స్పీకరుగారికి అవసరమైన సహకారాన్ని అందించాను. ఈ విషయాన్ని ఇక్కడ ఎందుకు ప్రస్తావించవలసి వచ్చినదంటే, మిత్రులు రాజేంద్ర ప్రసాద్ గారు నేను ఎథిక్స్ కమిటీ స్టడీ గ్రూపులో పని చేసినందువల్లనే ముఖ్యమంత్రి దానిని గుర్తించి నన్ను ప్రెస్ అకాడమీ చైర్మన్ చేసి ఉంటారని చెప్పారు (మిత్రులు రాజేంద్ర ప్రసాద్ గారు, ఉద్యోగ విరమణ చేసిన తరువాత కొద్దికాలానికే అనారోగ్యంతో మరణించారు). ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా పాత పత్రికల "డిజిటైజేషన్" లాంటి కార్యక్రమాలను చేపట్టాను. తెలుగునాట వివిధ గ్రంథాలయాలలో నిక్షిప్తమై ఉన్న పాత పత్రికలన్నింటిని సీ.డీ.ల రూపంలో, ఎమ్.ఓ.డీ.ల రూపంలో భద్రపరచడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. భావి తరాల పరిశోధకులకు ఉపయోగపడే చాలా సమాచారం పాత పత్రికలలో లభిస్తుంది. పాతపడిన పత్రికలు శిథిలమై ఎందుకూ పనికిరాకుండా పోయేలోగా వాటిని భద్రపరచగలిగామన్న సంతృప్తి నాకు ఉంది. శిక్షణ తరగతులూ, కార్టూన్ ఎగ్జిబిషన్లూ, ఉపన్యాస కార్యక్రమాలూ, చర్చాగోష్ఠులూ మొదలైనవి అత్యంత విజయవంతంగా జరిగాయి. పత్రికలలో భాషను ప్రమాణీకరించడానికి ఒక ప్రయత్నం చేశానుగాని అది ఫలించలేదు. భాషను ఆధునికీకరించడంలో భాగంగా కొత్త పదాల సృష్టి అవసరమని గుర్తించి "నియొలాజిజమ్స్ కమిటీ"ని ఏర్పాటు చేశాను. అందులో పత్రికా సంపాదకులూ, భాషా శాస్త్రంలో పండితులూ సభ్యులుగా ఉండేవారు.

ఇరవయ్యో శతాబ్ది చివరి దశకంలో మాన్యులు శ్రీ ఎస్.ఆర్. శంకరన్ గారి నాయకత్వంలో కొందరు మిత్రులం "పౌర స్పందన వేదిక" (కమిటీ ఆఫ్ కన్సర్న్డ్

సిటిజన్స్) అనే సంస్థను ఏర్పాటు చేసుకొన్నాము. సుప్రసిద్ధ న్యాయవాది, పౌర హక్కుల ఉద్యమ జాతీయ స్థాయి నాయకుడూ శ్రీ కె.జి. కన్నాబిరాన్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్, ప్రొఫెసర్ కోదండరామ్ మొదలైనవారు ఇందులో సభ్యులు. రాష్ట్రంలో, ప్రత్యేకించి తెలంగాణా ప్రాంతంలో నక్సలైట్లకూ, పోలీసులకూ మధ్య జరుగుతున్న పోరు వల్ల భయాందోళనలకు గురవుతున్న ప్రజల సమస్యలను తెలుసుకొని ఏమైనా పరిష్కార ప్రయత్నం చేయగలమేమో చూద్దామని వేదిక ఆలోచన. ఇదే లక్ష్యంతో తెలంగాణా జిల్లాలో మేము పర్యటించాము. స్వయంగా పరిస్థితులను చూసిన అనుభవం తీవ్ర ఆందోళన కలిగించింది. పీపుల్స్‌వార్ నాయకులకూ, ప్రభుత్వానికీ మధ్య చర్చల కోసం ఎందుకు ప్రయత్నించకూడదని ఆలోచన చేశాము. వరవరరావు గారి లాంటి మిత్రులతో మాట్లాడినప్పుడు ప్రయత్నం చేయవచ్చుననే విశ్వాసం కలిగింది. మొదట పీపుల్స్ వార్ నాయకులతో మాట్లాడా లనుకొన్నాము. సెంట్రల్ కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. మూడు రోజుల చర్చల అనంతరం చర్చలకు వారు అంగీకరించారు. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడటం ప్రారంభించాము. వివిధ పార్టీల నాయకులను కలుసుకొని చర్చించాము. సుదీర్ఘ ప్రయత్నాల అనంతరం అటు పీపుల్స్ వార్, ఇటు ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించారు. ఆరు నెలలు రాష్ట్ర ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవించారు. 2004లో ఉభయ పక్షాల మధ్య హైదరాబాద్‌లో చర్చలు జరిగాయి. పీపుల్స్‌వార్ అప్పుడే మావోయిస్టు పార్టీగా పరిణామం చెందింది. దురదృష్టవశాత్తు చర్చలు కొనసాగలేదు. చర్చలు విఫలం కానూలేదు. ఎందుకు కొనసాగలేదన్నది ఎవరికీ అంతుపట్టలేదు. ప్రతిష్ఠంభన ఏర్పడే అంశం ఏదీ చర్చకు రానేలేదు. ఏమైనప్పటికీ సత్ఫలితం లేకుండా చర్చలు ముగిశాయన్నది వాస్తవం. పౌరస్పందన వేదికలో చర్చల ప్రతిపాదన చేసిన వ్యక్తిగా 2004 చర్చలు ముందుకు సాగకపోవడం వ్యక్తిగతంగా నాకు పరాజయం అనిపించింది. తెలంగాణా సమస్యపై ఇందిరా గాంధీ నుంచి వచ్చిన పిలుపును తెలంగాణా ప్రజాసమితి నాయకులు తిరస్కరించడం కంటే ఎక్కువగా, నాకు 2004 చర్చల అనుభవం బాధ కలిగించింది. దీని నుంచి నేను నేర్చుకొన్న పాఠం ఏమిటంటే మరెప్పుడూ రాజకీయ నాయకుల మాటలను యథాతథంగా నమ్మకూడదు అని.

తిరుమల–తిరుపతి దేవస్థానం ప్రచురణలో ఒక ముఖ్యమైనది అర్థ తాత్పర్య విశేష వ్యాఖ్యలతో ఆంధ్ర మహాభారతం ప్రచురణ. చాలా నెమ్మదిగా జరుగుతున్న ఈ ప్రచురణ

విషయంలో నేను జోక్యం కలిగించుకొని ఎవరు ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా ఉన్నా వారికి పదే పదే విజ్ఞప్తి చేస్తూ పదిహేను సంపుటాలుగా మహాభారత ప్రచురణకు నా వంతు కృషి చేశాను. ఒక ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నన్ను చీఫ్ ఎడిటరుగా ఉండమని కోరితే నాకు అంత పాండిత్యం లేదని ఆయనకు నచ్చజెప్పి సంపాదకులలో ఒకరుగా మాత్రమే పని చేశాను. మొదటి సారి ప్రచురణలో తప్పులు వస్తే గుర్తించి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా ఉన్న డాక్టర్ రమణాచారి గారిని అర్థించి ఒక పండిత పరిషత్తును ఏర్పాటు చేయించి వీలైనంతవరకు తప్పులు తగ్గించడానికి కృషి చేశాను. పండిత పరిషత్తులో నేనూ సభ్యుడుగా ఉన్నాను. ఇది నాకు ఆత్మ సంతృప్తిని ఇచ్చిన సేవా కార్యక్రమం.

వృత్తి రీత్యా అధ్యయనం ఎక్కువ అవసరం కనుక పుస్తకాలు చదివేటప్పుడు చాలా నోట్సు తీసుకొనేవాడిని. అలా నా వద్ద విలువైన సమాచారం చాలా చేరింది. ఉద్యోగ విరమణ తరువాత కొన్ని పుస్తకాలు రాయడానికి ప్రణాళిక తయారు చేసుకొన్నాను. ఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ లైబ్రరీ మొదలు, మన రాష్ట్రంలోని కొన్ని ముఖ్యమైన గ్రంథాలలో "ఆంధ్రుల అక్షర సంపద – తెలుగు పత్రికలు" (ప్రెస్ అకాడమీ ప్రచురణ) మొదలైనవి ఉన్నాయి. సరికొత్త ప్రచురణ "పారమార్థిక పదకోశం" (ప్రపంచంలోని ప్రసిద్ధ మతాల పారిభాషిక పదాల కోశం).

జర్నలిజం వృత్తిలో నేను పాటించడానికి ప్రయత్నించిన ఒక రీతిని గురించి చెప్పి ఈ ప్రసంగాన్ని ముగిస్తాను. వ్యక్తుల పట్లనో, వర్గాల పట్లనో రాగ ద్వేషాలతో గాక మొత్తం సమాజం శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని సత్యాన్ని నిజాయితీగా, నిర్భయంగా చెప్పడం పత్రికలు పాటించవలసిన నీతి అని నా నమ్మకం. సంపాదక విభాగానికి నేను సంపూర్ణంగా ఆధిపత్యం వహించినప్పుడు ఈ నీతిని పాటించానో లేదో చెప్పవలసింది పాఠకులే గాని నేను కాదు. "ఆంధ్రప్రభ" దినపత్రికకు సంపాదకుడుగా ఉన్నప్పుడు సంపాదకీయానికి ఎగువన ఒక ఆశయంగా, ఆదర్శంగా, నీతిగా "సత్యమేశ్వరులోకే.." అనే ఆర్య ధర్మం శ్లోకాన్ని ప్రచురించేవాడను. సత్యాన్ని మించిన ధర్మం మరొకటి లేదని దాని భావం.

నా అనుభవాల నుంచి ఏ ఒక్కరికైనా ఉపయోగపడే ఏ ఒక్క అంశమైనా ఉంటే నా ఈ రచనకు ప్రయోజనం సిద్ధించినట్లే.



శ్రీ కె. శివారెడ్డి

ఎవడి కథయినా ఎక్కడ మొదలవుతుంది! పుట్టుకతోనే– అందరి పుట్టుకలు ఒకటి కావు. వారి వారి ప్రాంతాల నేపథ్యాల నుంచి– వర్ణం, కులం, ఆర్థికస్థాయి– మొదలవుతుంది. ఇన్నేళ్ళ తర్వాత, వెనుతిరిగి చూసుకొని, నా గురించి, నా సాహిత్య ప్రస్థానం గురించి మాట్లాడడం మొదలెడితే దుఃఖ భరితంగానూ, ఆనందంగానూ, సంభ్రమాశ్చర్యంగానూ వుంటుంది. ఎన్నో పాదులు, ఎన్నో అంశాలు గలగలిసి ఒక అవగాహనాధార ఏర్పడుతుంది– 'ఊహ' తెలిసి నప్పటినుంచి నిన్ను ప్రభావితం చేసిన పరిస్థితులూ, వ్యక్తులూ, విద్యా నిన్ను తీర్చిదిద్దటంలో ఒక నిర్ణాయక పాత్ర తీసుకుంటాయి. సమాజంలో పుట్టి పెరుగుతున్న ప్రతివాడికీ– సామాజిక స్పృహ వుందనుకుంటాం– అది Correct గాదని నువ్వు ఎదిగే కొలదీ, చుట్టూ సమాజాన్ని– సమాజ పరిణామాన్ని– ఒక సమాజపు చోదక శక్తుకేమిటో అర్థమయ్యాక పుట్టుకతో వచ్చేది వర్గస్పృహ కాదు, నీ కులానికి, నీ ప్రాంతానికి సంబంధించిన స్పృహ మాత్రమే అని అర్థం మౌతుంది. ఒక రచయిత, లేదు, కవి సృజనలో, అతని నేపథ్యం ప్రధాన పాత్ర వహిస్తుంది. మూలాలు చాలా బలంగా లోతుగా వుంటాయి. ఒక కవి, తదనంతరం అనేక మార్పులకు లోనయి, అనేక పరిణామాలు జరిగి ఎదుగుతున్న క్రమంలోనూ అతని నేపథ్యపు మూలతత్వం అంతరించదు. అది అంతర్లీనంగా అతని సృజన అంతటా అదృశ్యంగా పరచుకుని వుంటుంది. ఒక కవి కవిత్వం భాష అతని Diction ఏర్పడే క్రమంలోనూ దీనిది పరిహరించలేని పాత్ర తర్వాత తన బరువు– అధ్యయనం – కొత్త దర్శనాలు, తాత్విక ధోరణులు ప్రాపంచిక దృక్పథాలు సామాజిక అవగాహనా క్రమంలోనీ పదసముదాయం,

కవితా భాష- ఏర్పడి అభివృద్ధి చెందుతుంది. అప్పుడు గూడా నీ వేళ్ళ జీవ సారం నీ కవిత్వంలో ప్రతి ఫలిస్తుంది. జీవితపు విశ్వరూపం ప్రత్యక్షమయ్యేకొలది, సమాజపు వైరుధ్యాలు, వైవిధ్యాలు అంతు బట్టే కొలది, కవి, వస్తు రూపాలు విస్తృత మవుతాయి- విశాల మయి, వై విధాన భరిత మౌతాయి- తనకీ తన చుట్టూ వున్న మనుషులతో, తన చుట్టూ వున్న సమాజంతో నిత్యం ఘర్షణే. దాని నుంచే సృజన నిరంతరం కొనసాగి ననలు వేస్తుంది.

మాది తెనాలి దగ్గర ఒక చిన్న పల్లెటూరు- కార్మూరు వారి పాలెం. కార్మూరు ఇంటి పేరున్న కుటుంబాలున్నాయి. మా అమ్మ ఆ కార్మూరు ఇంటి పేరు గలిగిన వారి ఆడపడుచు. మా యింటి పేరు కాల్లి. కింద మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. రెండు, మూడెకరాలు పొలం కింద మధ్య తరగతి రైతు, రైతు కూలీతో సమానం. తనూ పొలంలో దిగి పని చెయ్యాల్సిందే. ఒడ్డున-గనెం మీద కూర్చుని పని చేయించుకునే కుటుంబం కాదు. పని చేయించుకునే కుటుంబానికీ, పని చేసే కుటుంబానికీ తేడా వుంటుంది. ఈ ఇద్దరిదీ ఒకే కులమయినా ఒక సంస్కారం గాదు. చాలా వాటిని నీ సామాజిక కార్యాచరణ నిర్ణయిస్తుంది. నాకు ఐదారేళ్లప్పుడు మా అమ్మ చనిపోయింది. మా నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. నాకొక తమ్ముడు. అమ్మ చనిపోయినప్పుడు వాడికి మూడేళ్ళుండవచ్చు. మా అమ్మ T.B.తో ఒక సంవత్సరం పైగా బాధపడి చనిపోయింది. ఆమెని రాజమండ్రి సానిటోరియంలో ఒక సంవత్సరం వుంచాడు. మా నాన్న ఒక అరెకరం పొలం అమ్మాడు. బండీ, ఎడ్లూ, అమ్మాడు. అమ్మ చనిపోయే సరికి కుటుంబం అప్పుల్లో మునిగి పోయింది. మా నాన్నకి శుక్లాలు వచ్చాయి. నాకు బాబాయిలిద్దరు. మానాన్న కంటే చిన్న వాళ్ళే. మా రెండో బాబాయి యిల్లరికం పోయి, భార్య చనిపోయిన తర్వాత తన ఇద్దరి పిల్లల్ని తీసుకుని మావూరు వచ్చి, మామూడో బాబాయి ఇంట్లోనే వుండేవాడు. మూడో బాబాయికి ఒక కొడుకు. రెండో బాబాయికి ఒక కూతురు, ఒక కొడుకు. మా నాయనమ్మ వుంది; మా మూడో బాబాయి దగ్గరే వుండేది. మమ్మల్ని కని పెట్టుకుని వుండేది. ఈ సోదంతా ఎందుకంటే - ఏ దుర్భర స్థితిలో ఒక పిల్లవాడు ఎదిగాడు; యుద్ధం చేశాడు; తదుపరి అతని కవిత్వం నిండా నిండి నిబిడీకృత మయినదేమిటి అని చెప్పటానికే! గోర్కి అన్నట్టు బాల్యంలేని బాల్యం నాది. అమ్మ చనిపోయిన దగ్గరునుంచీ, యింటిపని, పొలంపనీ, పశులపనులు అన్నీ నెత్తిమీద పడ్డాయి. తర్వాత అనేక యుద్ధాలందు ఆరితేరటానికిది మూలం. తల్లిలేని పిల్లాడు, ఆర్థిక వసతిలేని

పిల్లాడు– ఎంత దీనంగా ఎంత దరిద్రంగా బతికాడో అర్థం చేసుకోవచ్చు కానీ, చిన్నతనం నుంచీ అర్థించటం కానీ, లొంగి వుండటం కానీ అలవడలేదు.

బహుశ మా నాన్న నుంచి సంక్రమించిన లక్షణంగావచ్చు. ఇంటి పనీ, వంటపనీ, పొలం పనీ అన్నీ చేసుకుంటూ ఈదు కొస్తున్న తరుణంలో– చదువుకోవాలనే కోరిక. "ఎలారా నువ్వు బడికెళ్తే – ఈ పనులన్నీ ఎట్టారా" అని మా నాన్న; "అన్నీ చేసి, అన్నీ సర్దుకుని చదువుకుంటూ"– నా సమాధానం. ఆయనకీ చదువంటే ప్రేమే – ఆయనో గొప్ప గాయకుడు. మా మూడో బాబాయి పద్యాలు అర్థవంతంగా పాడేవాడు. వర్షా కాలం ముసురు పట్టినప్పుడు నన్ను తనవళ్ళో కూర్చో పెట్టుకుని హరిశ్చంద్ర పద్యాలు నేర్పేవాడు మానాన్న. తల్లిలేని పిల్లలయిన మమ్మలిద్దరినీ చెరోపక్క పక్కలో వేసుకుని తెల్లార్లూ భజన కీర్తనలు పాడేవాడు. చెరువు పక్క తాడి చెట్ల కవతల పొద్దు పొడవటాలు – వరిపొలాల కవతల పొద్దుగూకటాలు – చావిళ్ళలో పశువుల మేత తినే చప్పుళ్ళు– ఊరు మొత్తం ఒక చెరువులోనో, తూటి పూవులోనో కొట్టు కోవటాలు, విచ్చు కోవటాలు – వర్షాకాలం మట్టి డొంకల బురదలు, చీకటి నిండిన యిళ్ళూ– కాలవలూ, పంట పొలాలు, రైతు కూలీల పాటలూ, జానపద కథలూ – ఓహో– ఏమి జీవితం– ఎక్కడా వైదొలగలేదు. అంతా నాలో యింకిపోయి– తవ్వుతుంటే తీగలు బయట పడ్డట్టు– తర్వాత కవిత్వం మొదలయ్యాక అన్ని సంగతుల సందర్భాలు బయటపడ్డాయి.

అలా మొదలయిన నా చదువు దగ్గరలో – ఒక అయిదు కిలో మీటర్ల దూరంలో వున్న కూచిపూడి స్కూలుకు పోవటం రావటం, అన్ని పనులు చేసి టిఫిను పెట్టుకుని స్కూలు కెళ్ళటం, మళ్ళీ సాయంత్రం అయిదింటికొచ్చి అన్ని పనులూ చేసుకోవడం. ఇప్పుడు వెనుదిరిగి చూసుకుంటే – నేనేనా అన్ని పనులు చేసింది. యింత దూరం నడిచి వచ్చింది అన్పిస్తుంది. ఏ ఆర్తి, ఏ స్ఫూర్తి, ఏ ధైర్యం, ఏ మొండితనం నన్నింత వరకు తీసుకు వచ్చాయో– వాటన్నిటికి పాదు ఆ చిన్న వయసులోనే పడింది. నేను కవిగా మొలవటానికి బహుశ రెండు కారణాలు– ఒకటి మా వంశంలో వున్న గానకళ– రెండు మా పెద్దనాన్న గారి అబ్బాయి మా అన్నయ్య వెంకటరామరెడ్డి లైబ్రరీ కారణ మనుకుంటాను. సంగీత కారుణ్ని కావాలిసిన నేను కవి నయ్యాను. ఆ ఒంటరితనం, ఆ దుఃఖభరిత సందర్భం నుంచి, నన్ను నేను విముక్తుణ్ణి చేసుకోవటానికి కవిత్వం ఎక్కువ ఉపయోగపడిందనుకుంటా! మామూలు జీవితం కాదు; మామూలు యుద్ధంగాదు; ఏడో తరగతిలో వుండగా మా తెలుగు మాస్టారు జాస్తి శ్రీ రాములు గారు– పద్యం చదివి,

విపులీకరించి, విశదకరించే పద్ధతీ – నన్ను ఆకట్టుకుని తెలుగు పట్ల మమకారం పెంచుకునేట్టు చేసింది. ఆయన చంధస్సు నేర్పారు. అప్పుడే మొదలయింది రాయటం– వున్న పదజాలంతో, తెలిసిన మాటలతో పద్యాలు రాయటం చదవటం. మా అన్నయ్య దగ్గర వున్న గ్రంథాలయాన్ని కొల్ల గొట్టాను. ఆ రోజుల్లో ఆ మారుమూల పల్లెటూరికి ఆయన క్రమం తప్పకుండా ఆంధ్రపత్రిక వారపత్రిక, దినపత్రిక తెచ్చేవాడు. అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు నవలా సాహిత్యం, కథా సాహిత్యం– అనువాద సాహిత్యం – అంతా ఆయన గ్రంథాలయంలో వుండేది. ఆయన శరత్ మీద అథారిటీ. వచనం అద్భుతంగా చదివేవాడు. శ్రీనివాస శిరోమణి రాస్తున్న రామాయణం అందర్నీ కూర్చోబెట్టి అద్భుతంగా చదివి విన్పించేవాడు SSLC అయిపోయే లోపల అది అర్థమయినా, కాకపోయినా శరత్, జైనేంద్రాకుమార్ దగ్గరనుంచి, శ్రీపాద చలం, గోపిచంద్, బుచ్చిబాబు యిత్యాదులను చదివేశా. శెలవుల్లో అన్నంతిని, ఒక నవల తీసుకుని సావిట్లోకి పోయి బండి తొట్లో పడుకుని సాయంత్రానికి నవల చదివేసేవాణ్ణి– రాత్రి కూడా పొద్దు పోయిందాకా.

అందుకే అప్పుడప్పుడూ చెబుతూ వుంటా– వచనం నుంచి కవిత్వంలోకి వచ్చిన వాణ్ణనని. బహుశ నా స్వభావికి కవితా ప్రక్రియ సరిపోయిందను కుంటా– ఉద్వేగ భరిత స్వభావం – కోపిష్టి గుణం– వెంటనే wild గా react అయ్యే లక్షణం బహుశ నన్ను కవిని చేశాయేమో!

చదువు ఎప్పటికప్పుడు ఆగిపోతుందనే భయం. కారణం ఆర్థికమే. అయితే చదువు పట్ల నాకున్న శ్రద్ధా పట్టుదల చూసి, మా కజిన్ బ్రదర్ దన్నుగా నిలబడ్డాడు. ఈ చదువు కొనసాగటానికీ, సాహిత్య వ్యాసంగం కొనసాగటానికీ ఆయన ప్రత్యక్ష పరోక్ష అండదండలు కారణం.

కవిత్వం మీద ప్రేమ మెడిసిన్ చేయకుండా బి.ఎ.డబుల్ లిటరేచర్ చదివేట్టు చేసింది. హిస్టరీ, ఇంగ్లీషు లిటరేచర్, తెలుగు లిటరేచర్ – ఇదీ కాంబినేషన్. మాకు ప్రబంధాలు బోధించిన గురువు గారు దర్శనాచార్య కొండూరి వీర రాఘవాచార్యులుగారు. ఆముక్త మాల్యద, వసు చరిత్ర ఆయన క్లాసులో పాఠాలు చెబితే బయట తెనాలి త్రిపురనేని రామస్వామి గ్రంథాలయంలో కళా పూర్ణోదయం, ప్రభావతీ ప్రద్యుమ్నలాంటి ప్రబంధాలు అనేకం ఆ రోజుల్లోనే ఇన్వాల్వ్ అయి చదువుతూ పద్య సాధన చేసిన రోజులు– ప్రబంధ

శైలిలో పద్యాలు రాయటానికి ప్రయత్నాలు. విస్తృతంగా క్లాసికల్ లిటరేచర్ చదవటాలు. అదొక పద్యసాధన దశ. గురువుగారు క్లాసులో పద్యం నెమ్మదిగా చదివి, విపులీకరించి, విశ్లేషించి, ముగింపుగా మళ్ళా పద్యం మొత్తం చదివేవారు. ఆయన రెండో మారు పద్యం చదివేసరికి మాకు నోటికి వచ్చేట్టు సాధన చేసేవాళ్ళం. కొన్నాళ్ళ తర్వాత ఆయన రెండో సారి పద్యం చదవగానే మేము అప్పచెప్పేవాళ్ళం. కాలేజీకి 3,4 కిలో మీటర్ల దూరంలో వున్న రూం నుంచి కాలేజి వచ్చే లోపల, ఎన్ని పద్యాలు గుణించుకుంటూ కాలేజికి రావటం. మధ్యాన్నం విరామంలో బొర్డుమీద రాయటం. ఏదో ఒక వస్తువనుకుని పద్యాలు చెప్పటం– ఇంటర్వెల్ అయ్యాక ఆచార్యులు గారి క్లాసుండేది లేదు, సాల్మన్ రాజు అనే మాడం క్లాసుండేది. క్లాసు ఎవరిదయినా – బోర్డు మీద పద్యాలు చదివి దిద్దేవారు, 'ఎవరయ్యా రాసింది. బాగున్నాయి' అనేవారు. ముఖ్యంగా కొండూరి వీర రాఘవాచార్యులు వారు సూచన లిచ్చి వివరించేవారు. కాలేజి మాగజైన్‌లో మొదటి సంవత్సరం ఒక కథ, రెండో సంవత్సరం మా అమ్మ మీద రాసిన పద్యాలు ఒక పాతిక అచ్చయ్యాయి. ఆ మూడు సంవత్సరాలు చదవటం, ధారణ చేయటం, కొత్త పద్యాలు రాయటం. ఆధునిక కవిత్వం గొడవ లేమీలేవు; తెలియవు. మాగురువు లెవ్వరూ ఆ ప్రసక్తి తెచ్చేవారు కారు.

తర్వాత తెలుగు ఎం.ఎ. చేయాలని తపన పడ్డా. తెలుగు ఎం.ఎ. చేస్తే భాషాధికారం వస్తుందనీ, ఉత్తరోత్తరా అది కవిత్వ పరిపుష్టికి పనికి వస్తుందని తెలుగు ఎం.ఎ. ఉస్మానియాలో చేయటానికి మొదటిసారి మా అన్నయ్యను తీసుకుని హైద్రాబాదు వచ్చా. నేను వచ్చి క్రితం రోజే పొడిగించిన తేది కూడా అయిపోయింది. తర్వాత ఆంధ్రా యూనివర్సిటీలో ఆంగ్లంతో ఎం.ఎ. చేశాను. 64–66– ఆ రెండు సంవత్సరాలు ఆంధ్రాయూనివర్సిటీ, పానుబీచ్ వెన్నెల సముద్రం– విశాఖ కొత్త అనుభవం– సముద్రం హోరు హాస్టల్ రూంకి వినిపించేది– గది పక్కనే సముద్రం వున్నట్టు. జీడి మామిడి తోటలో చెట్టుకింద చదువుతూ ప్రకృతితో సరస సల్లాపాలు నెలకు పదిహేను రోజులు బీచ్‌లోనే శుక్లపక్షం మొత్తం కృష్ణశాస్త్రి కవిత్వం, ఎంకి పాటలు అదొక అద్భుతమయిన జీవితం. మావూరి తర్వాత నేనెక్కువగా ప్రేమించింది విశాఖనే. విశాఖ అప్పుడో ఒక పెద్ద గ్రామం. వావిళ్ళ వారి పుస్తకాలు షాపు చౌక్‌ట్రీ, జగదాంబ జంక్షన్ – ఈ నేపథ్యం నుంచి – పద్యాలు, పాటలు– ఆ రెండు సంవత్సరాల్లో రాసినవి ఒక పుస్తకానికి సరిపోతాయి. హైద్రాబాదు వచ్చి కొత్తల్లో పుస్తకం వేద్దామనీ ఆలోచన – వేయక పోవటం మంచిదయింది. విశాఖలో వున్నన్నాళ్ళు భారతి, స్రవంతి లాంటి పత్రికలు చదవటం

తప్ప వేరే సాహిత్య పుస్తకాలు చదివింది తక్కువ తెచ్చుకోవటం ముఖ్యం. 50% రాకపోతే లెక్చరర్ అవ్వటానికి అర్హతరాదు. ఆ రెండు సంవత్సరాలు దృష్టంతా దాని మీదే. 66లో యం.ఎ. ఇంగ్లీష్ సెకండ్ క్లాస్‌లో పాసయి, మార్క్స్ లిస్ట్ తీసుకుని హైద్రాబాదులో కాలు పెట్టాను. కవిత్వం కోసమే హైద్రాబాద్ వచ్చాను; ఉద్యోగం కోసం కాదు. నేను చదువుకున్నా కాలేజి VSR Colleg తెనాలి వాళ్ళు పిలిచారు. Govt. College appointment వచ్చింది. మొదట హైద్రాబాదు తర్వాత గద్వాల్‌లో చేరలేదు. దృష్టంతా కవిత్వం మీద; ఆ వయసులో 23,24 ఏళ్ళ వయసులో కవిత్వాభి వృద్ధికి, కవి ఎదుగుదలకీ హైదరాబాదు కేంద్రమనీ, అది అన్నింటినీ కలిపే ఒక జంక్షన్ అనీ; అప్పుడా నిర్ణయం, మొండిగా చేసిందే; ధైర్యంతో చేసిందే. నాటి శివారెడ్డి లోకానికి తెలియదు– కాలేజీ మాగజైన్‌లో తప్ప. కవిత్వం పట్ల అపారమయిన ప్రేమ; ఒక ఉద్విగ్న భావం – గాఢ ప్రేమికుడికి ఉండే ఒక ఉన్మాదపు స్వభావం పని చేశాయి. భవిష్యత్తులో నేనేమవుతానో నాకు తెలియదు. కవిత్వం సంగతి తేల్చుకోవాలి. అది సవాలు. అందుకే, ప్రభుత్వోద్యోగాలు కాదని. V.V.College లో చేరా. అంతకు ముందు కొన్ని నెలలు బహుశ ఐదారు నెలలు అన్వరున్‌లూం కాలేజీలో చేశా. అది కూడా ఒక అదృష్టమే. ఎందుకంటే అక్కడే M.L. నరసింహారావుగారు, (శ్రీ కృష్ణ దేవరాయ గ్రంథాలయ కార్యదర్శి) S.V. రామారావు గారు పనిచేసేవాళ్ళు. అవూరే శ్రీ కృష్ణ దేవరాయ భాషా నిలయంలో కవి కథకులు సమ్మేళనం ఏర్పాటు చేశారు. M.L. నరసింహారావుగారు, నన్నూ చదవమన్నారు. మహామహు లొస్తున్న ఆసభలో ఒక అనామక కవి చదవటమేమిటని వాటిని నేను ఒక 'నువ్వు కవివయ్యా – చదువు ఏంగాదు అని పోత్సహించటం. ఆనాటి ఆ అద్భుత సభలోనే సి.నా.రె. గారినీ, దాశరథి గారినీ, వీర్రాజు గారినీ, బుచ్చి బాబు గారినీ, సింగరాజు లింగమూర్తి గారినీ, కుందుర్తి గారినీ– అందర్నీ తనివితీరా చూసింది. అప్పటి వాళ్ళందరూ లబ్ధ ప్రతిష్ఠలు. ఆయా రంగాల్లో నిష్ణాతులు .... ఒక సంభ్రమం, ఒక ఆశ్చర్యం, ఒక ఆనందం, అప్పుడు నేను ఉస్మానియా యూనివర్శిటీ దగ్గర్లో మిత్రుడు సీతారాంరెడ్డి ఇంట్లో వుండే వాణ్ణి యూనివర్శిటీ రోడ్లన్నీ తెల్లారేప్పటికి పున్నాయి పూలతో నిండి పోయేది. అందమయిన దృశ్యం– రోడ్డంతా పూల ప్రవాహమయినట్టు, దట్టమయిన ముదురు వెన్నెల పరిచినట్టు, ఈ దృశ్యం మీద మాత్రా చందస్సులో రాసిన కవిత, గానం చేశా. నారాయణ రెడ్డి గారికి గుర్తుండి వుండదు. దగ్గరకు పిలిచి, 'కవిత్వం గానం చేయకూడదు రిసైట్ చేయాలి. చాలా బాగుంది' అన్నారు. నేత వార పత్రిక ఎడిటర్ పి.వి. రామ నరసయ్య గారు ఆ సభలోనే పరిచయం. తర్వాత

నేత వారపత్రికలో నా తొలి కవితలు అచ్చయ్యాయి. నేత వారపత్రిక ఆఫీసులోనే మహా స్వప్నను చూశాను. కాలేజీ అయి పోయింతర్వాత ఇంటికి పోతూ పోతూ ఇన్ఫర్మేషన్ ఆఫీసులో శీలావీర్రాజు గారిని, తద్వారా కుందుర్తి గారిని, గోపాల శాస్త్రిగారిని, చలసాని ప్రసాదరావుగారిని కలిసేవాణ్ణి చలసాని అప్పుడు ఆ డిపార్టుమెంటులో ఆర్టిస్ట్ పని చేశేవాడు. అలా కింద కొస్తే రేడియోస్టేషన్, ఎదురుగ్గా అసెంబ్లీ– అక్కడ అసెంబ్లీ పనిచేసే నవలారచయిత సింగరాజు లింగమూర్తిగారి ద్వారా నగ్నముని పరిచయం – ఆయన ద్వారా అక్కడ యితర దిగంబర కవులూ, వేగుంట స్మైల్ తదితరుల పరిచయం. అప్పటి దిగంబరకవుల దిగంబర కవిత రెండు సంపుటాలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఒక సంచలనం సృష్టించాయి. చర్చలు వాదోపవాదాలు జరుగుతున్నాయి. మూడో సంపుటిలో రాబోయే నగ్నముని కవితలు చదివి విన్పించేవారు గంభీర స్వరంతో.

1967లోని సంగతులివి. ప్రపంచం రెండుగా విడిపోయింది. చైనా, రష్యా రెండు క్యాంపులుగా కమ్యూనిస్టులు భావ జాలు పరంగా చర్చలు వాదోపవాదాలు; మార్క్సిజాన్ని ఆయాదేశాలకు అన్వయించే విషయంలోనూ, అభివృద్ధి చేసే విషయంలోనూ అనేక సైద్ధాంతిక పార్టీలు ఉత్పన్నం. మరొక్క సారి వర్గ పోరాటం ఎజెండాలోకి. దిగంబర కవుల మూడో సంపుటిలో మార్క్సిజపు స్పర్శ వర్గపోరాటాన సీరాపాన్ని సూచించే కవితలు. యజ్ఞం కథావిర్భావం. నగ్జల్ బరీ భూపోరాటం ప్రారంభం. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం కేంద్రం దాని ప్రభావాలు, ప్రతి ఫలినాలు. అనంతరం అది కరీంనగర్, అదిలాబాద్ గోదావరిలోయ దాకా కోవటం అల్లు శ్రీ శ్రీ షష్టిపూర్తి, విద్యార్థుల సవాల్, సెవెన్‌నిర్మర్థులసవార్ సెలెనో స్రాక్స్ సిండికేట్ శ్రీశ్రీని సన్మానించ బూనటం– విరసం ఆవిర్భావం– దాని మేనిఫెస్టో.

ఇదీ 67 లనాటి నుంచి 70లదాకా ఆంధ్రప్రదేశ్ సాహిత్య రాజకీయ రంగంలో తొంగిచూసిన స్థితి. ఫక్తు పల్లెటూరి వాడిగా తెనాలి, విశాఖ నుంచి హైద్రాబాదుకు ఎగుమతి చేయబడ్డ నాకంతా అయోమయం. ఏది, ఏమిటి, ఎందుకు అని వివరంగా చెప్పే వాడు లేడు; నాకు దొరక లేదు. దొరికిన వాళ్ళు నా డౌట్లూ తీర్చలేదు. ఇక చదవటం మొదలెట్టా– మొదట మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాలు 'కమ్యూనిస్టు మానిపెస్టో'తో మొదట పెట్ట – భౌతిక వాదం, గతి తార్కిక భౌతికవాదం లెనినిజం, మావోయిజం– యీ దొరికిన సిద్ధాంత గ్రంథాలన్నీ చదవడం– అర్థం చేసుకుంటూ భారత దేశ సమాజానికి

అన్వయించుకోవటం.

నా జీవితాన్ని, సాహిత్య జీవితాన్ని మలుపు తిప్పిన పుస్తకం – కమ్యూనిస్టు – అది నా ప్రాపంచిక దృక్పథాన్ని మార్చి వేసింది. కింద మధ్య తరగతి వ్యావసాయిక కుటుంబాల నుంచి వచ్చిన నా మీద అనేక ప్రభావాలు – అశాస్త్రీయ ధోరణుల వాటినన్నింటినీ అది వడకట్టింది. ఒక స్పష్టమయిన చూపు నిచ్చింది. ప్రపంచాన్ని, దాని వర్గాలను, వర్గ స్వభావాలను కుటుంబం, పెట్టుబడి– భూస్వామ్య విధానం– దాని స్వభావం– పెట్టుబడి దాని స్వభావం– దాని సంస్కృతి – యిలా ఇన్ని విషయాలు నిన్నటిదాకా అమోమయంగా అర్థం కాకుండా వున్న విషయాలు చాలా అర్థమయ్యాయి.

ఆ సందర్భంలోనే ప్రపంచవ్యాప్తంగా వామపక్ష భావజాల ప్రభావపు గొప్ప రచయితల్నీ కవుల్నీ చదవడం అర్తం చేసుకోవటం సిద్ధాంతం వేరు; సిద్ధాంతాన్ని అర్థం చేసుకొని చుట్టూ వున్న సమాజానికి అన్వయించి – జీవనాను భవాన్ని కళగా మార్చటం – కవిత్వం చేయటం వేరు అన్న విషయం బోధపడటం.

అప్పుడే తెలంగాణాలో విద్య, ఉద్యమాలు ప్రారంభము, పరివ్యాప్తి చెందే దశ. విద్యార్థులు గ్రామలకు తరలండి అనే నినాదం. అది PDSU కానీ RSU కానీ అవి వ్యాప్తి చెందే క్రమంలో నేను విస్తృతంగా తిరగటం– విద్యార్థులనుద్దేశించి మాట్లాడటం కవిత్వం చదవటం– ప్రైమరీ స్కూలు, హైస్కూలు, జూనియర్ కాలేజి, డిగ్రీ కాలేజి, సాహిత్య సంస్థలు – అన్నింటా అంతర్భాగమై కదలబాటే వాతావరణమంతా వేడెక్కి ఉండేది. ఎక్కడ చూసినా ఘర్షణే పోరాటమే.

కరెక్ట్‌గా రావాల్సిన సమయంలో హైదరాబాదు రావటం; దూకాల్సిన సమయంలో అన్ని రకాల ఉద్యమాల్లో దూకటం; విస్తృతంగా సైద్ధాంతిక గ్రంధాలు, సాహిత్యం ముఖ్యంగా కవిత్వం చదవటం రాయటం–

నిన్నటి దాకా కవిత్వ సాధన– అంటే పద్య సాధన చేసిన వాణ్ణి వచన కవిత్వంలోకి దిగటం. పరిపూర్తిగా పాత రోతని వదలాల్సి వచ్చింది. వస్తు రూపాల్లోనూ; భాష పరిపూర్తిగా మార్చాల్సి వచ్చింది. పద్య రచనకి కావాల్సిన సాధనవేరు, భాషవేరు. వామపక్ష భావజాలపు నేపథ్యం నుంచి ప్రపంచాన్ని అర్థం చేసుకుంటూ – సమాజాన్ని దాని సకల వైరుధ్యాలతో అనుభవం చెందుతూ, కవిత్వీకరించటానికి కావాల్సిన భాషా శిల్పాలు వేరు. అందుకని, దరిదాపు పది సంవత్సరాలు నిష్ఠతో సాధన చేసిన దాన్ని వదలి, కొత్త మార్గం తొక్కాల్సి

వచ్చింది– కొత్త వస్తువు, కొత్త భాష, కొత్త వ్యక్తీ కారణాలు – వ్యూహాలు, శైలీ అవసరమయి

ఈ మారిన ప్రాపంచి దృక్పథనుంచి చక్రాన్ని విశ్లేషించుకుంటూ, అన్వయించుకుంటూ, అనుభూతి చెందుతూ రాసి, అచ్చయిన కవితల్లో కొన్నింటిని ఎంపిక చేసి 1973లో వేసిన పుస్తకం రక్త సూర్యుడు. 70 నుంచి 72 దాకా 'వేకువ' అనే త్రైమాసిక నడిపాను నన్నిందులోకి దించిన వాడు యిప్పుడు కృష్ణా జిల్లా రచయితల సంఘం బాధ్యుడు – మిత్రుడు గుత్తికొండ సుబ్బారావు నువ్వు ఎడిట్ చేయిచాలు, తత్తిమ్మావన్నీ నేను చూసుకుంటానన్నాడు. అతనికి LIC లో ఉద్యోగం రాకుండా వుండి వుంటే– మచిలీపట్నం పోకండా వుంటే – ఆయనన్నట్టు తానే చూసుకునే వాడు. కవీ సాహిత్య కార్యకర్త– 'స్పందన' అనే సంస్థను మచిలీపట్నంలో నెలకొల్పి, దిగ్విజయంగా నడిపాడు – ఆయనెళ్ళి పోతే ఆ బాధ్యత మొత్తం నా మీద పడింది. అలా 6 సంచికలు, రెండేళ్ళు 'వేకువ' సమరం. అదొక అనుభవం. అదొక వేదికగా నడపాలని నా కోరిక. అదొక చర్చా వేదిక కావాలని అన్ని విషయాలు ప్రజా స్వామికంగా చర్చించుకుంటానికి అది కేంద్రం కావాలని. ఆ రోజుల్లోనే భారతిలో కవితలు రావటం శివవె లెంక శంభు ప్రసాద్ గారి పరిచయం పుస్తక సమీక్షులు విస్తృతంగా చదవటం రాయటం– 'విరసం' ఏర్పడ్డాక నేనందులో సభ్యుణ్ణి కాదు గానీ, అంతకంటే ఎక్కువగానే మమేకమయ్యాను– ఆ క్రమంలో అరసం మిత్రులు, విరసం మిత్రులు అందరూ నాకు సన్నిహితులే, నగ్నముని అన్నట్టు నేను సంపాదకుడిగానే మిగలటం యిష్టంలేక 'వేకువ' ఆపేశా– దాని బాధ్యత తక్కువదేమీ కాదు. యిప్పటి శివారెడ్డి లేదు. అప్పటి శివారెడ్డి వేరు. వేరంటే యింత మందీ మార్బలం లేదు అప్పుడు ఒక రకంగా ఒంటరి పోరాటం. కవిత్వం నా సర్వస్వం. దానికోసమే హైద్రాబాదు వచ్చాను. జీవిక కోసం ఒక ఉద్యోగం. నా అదృష్టం బాగుండి; అద్భుతమయిన కావేజి వివేక వర్ధని కాలేజిలో చేరటం. యాజమాన్యం మహారాష్ట్రము ఆర్య సమాజపు నేపథ్యం నుంచి వచ్చిన వాళ్ళు. ఒక విధమయిన ప్రజాస్వామ్యం వుండేది. నా కవిత్వం, నా యుద్ధాలు, నా భావజాలం కాలేజికి పోలీసు వచ్చి పోవటాలు అన్నీ తెలిసే, నన్నెప్పుడూ యిబ్బంది పెట్టలేదు. హెరాస్ చేయలేదు. నన్ను గర్వంగానే హెరాస్ చేసేవాళ్ళు.

తర్వాత తర్వాత చాలా మంది కవిమిత్రులకు – నా తర్వాత వచ్చిన తరపు కవులకు – ఒక్క విషయం చెప్పే వాణ్ణి "నీ మొదటి ప్రాధాన్యత కవిత్వం కాదు. అది నిరంతర చర్య – నిత్యవికాసి, అదొక క్రమం. జీవితాంతం చేయాల్సిన పని. నువ్వు పరిపూర్తిగా

ఇన్వాల్వ్ అయితే తప్ప సాధించలేనిది నువ్వీభావజాలపు నేపథ్యం నుంచి లోకాన్ని చూసినా కవిత్వం చేసే క్రమం దాని మెలకువలు, అన్నీ నీ ముందుతరం కవుల్నుంచీ – అన్ని రకాలు కవుల్నుంచీ నేర్చుకోవాలి. కవిత్వం ఒక కళ గాబట్టి ఒక వస్తువు కళగా మారటం అంటే బలమయిన కవితగా రూపు దిద్దుకునే విషయంలో సిద్ధాంత మొక్కటే చాలదు. ఆ సిద్ధాంతపు వెలుగులో వచ్చిన గొప్ప కవితల్ని చదవాలి. ఒక కవిత్వమే గాదు, అన్ని ప్రక్రియలు చదవాలి. ఒక గొప్ప కవి చాలా మెలకువలు, కొత్త మార్గాలు నీకు చూపుతాడు. అక్కడ్నుంచి నువ్వు అల్లుకుపోవాలి. అందుకని నీ ముందున్న గొప్ప కవుల్ని, సమకాలీన కవుల్ని ప్రపంచ వ్యాప్తంగా గొప్ప కవుల్ని శ్రద్ధగా, లోతుగా చదవాలి. వాళ్ళు నిన్ను నిలవ నీరులా కాకుండా వుండేట్టు చూస్తారు" అని. నా ప్రతి కవితా సంపుటి ఒక రకంగా ఒక ప్రయోగ దశే. అన్ని విషయాల్ని సంలీనం చేసుకుని – అభివృద్ధి చెందే క్రమంలో ప్రతి కవితా సంపుటి ఒక దశ. ఒక నిర్దిష్ట సామాజిక దశ నుంచి అది పుట్టింది. ఆ నిర్దిష్ట సామాజిక దశ కనుగుణంగా వస్తు రూపాల్ని మార్చుకునే ఒక క్రమం– ఒక ప్రయోగం వుంది.

రక్తం సూర్యుడు' పాతదోవని వదలి కొత్త మార్గం వేసుకునే క్రమంలో వచ్చింది. 73లో వచ్చింది. బాగా ఆదరించబడింది. అయినా అది తొలిదశ. కాస్త మొరటుగానే, వున్నట్టు, అంత నాజూకుతనంలేనట్టు యిప్పుడన్పిస్తుంది. తర్వాత 'చర్య'. 'చర్య'లో దరిదాపు 80 చిన్న కవితలు. అప్పటి ఆలోచన ఏమిటి? భాష తప్పకుండా మామూలు– మాట్లాడుకునే భాష– మరీ అలంకారం కానక్కర లేదు. ముఖ్యంగా కవిత మొత్తం ఒక ఇమేజ్‌లానే– ఒక బొమ్మలానే – శీర్షికగూడా కవితలో భాగమే. శీర్షిక తీసేస్తే, కవితలో మొదటి– వాక్యం లేనట్టుగా వుంటుంది. 'చర్య' పేరే Forever action, there is an equal and apposite 'చర్మ' కవిత మొత్తం ఒక గ్రామీణ కోడి దూడ బొమ్మలో ఆవిష్కరించబడుతుంది. విరసం ఆవిర్భావం వర్గపోరాట ఆవశ్యకతను రంగం మీదికి తెచ్చింది. ఆ కోణం నుంచి చాలా కవితలు అందులో ఉన్నాయి. 'చేగువేర' ఆనాటి యువతకి (బహుశ యిప్పటి యువతకీ) ఒక హీరో గెరిల్లా వార్ ఫేర్– రెగిల్ డెబ్రిస్ రాసిన Revolution in Revolution లాంటి పుస్తకాలు 'మావో' రెడ్ బుక్ యిత్యాదుల పుస్తకాలు, పఠనం– బహుశ అప్పటిచోదక శక్తులేమో.

అన్ని పుస్తకాల నేపథ్యాలు– రూపాలు–మార్పులు–యిప్పుడు యిక్కడ విస్తృతంగా రాయటం, చర్చించటం సాధ్యం కాదు– కానీ– యీ నలభై అయిదేళ్ళు– కాదు యాభై

ఏళ్ళలో– నన్ను సమూలంగ మార్చిన పుస్తకాలు, వ్యక్తులు లోనా బయటా– చాలా వున్నాయి – చాలా మంది వున్నారు. 'ఆసుపత్రిగీతం' 76లో రాసిన కావ్యం. దానికి మోడల్ ఏమీలేదు. 'ఒక సంవత్సరం పాటు నీలోఫర్ ఆసుపత్రిని దగ్గరగా చాలా దగ్గరగా దాని అంతర్లోకం చూసూ పరిస్థితి సంభవించింది. నోట్స్ తీసుకుని అన్ని సిద్ధం చేసుకున్నా కానీ, ఓ కావ్యం– ఎలా ఎత్తుకోవాలో దాని స్వరూప స్వభావామేమిటో దాని శరీరం – ఆత్మమేమిటో ఎలా వ్యక్తీకరించాలో తెలియక– నరక యాతన పడ్డాను. బహుశ ఒక ఐదారు నెలలు ఒకానొక సందర్భంలో మళ్ళీ ఒక సారి ఆసుపత్రి చూసి వచ్చాక, మొదలయింది – మొదటి అం ఆసుపత్రి వర్ణనతోనే. ఇక ఆగలేదు. క్రమక్రమంగా అదొక నాటకంగా రూపొందిం దనుకుంటా! ఆసుపత్రి గీతాన్ని చాలా తేలిగ్గా నాటకంగా మార్చి ప్రదర్శించవచ్చు. కావ్యం నిండా పాత్రలే. వాతావరణమే– ఆసుపత్రి. నేటి సామాజిక వాతావరణమే.

నిజానికి 'చర్య', 'ఆసుపత్రిగతం' ఎమర్జెన్సీలో వచ్చాయి. 75లో ఎమర్జెన్సీలో అరెస్టు చేయబడి లకడికాపూల్ పోలీస్ స్టేషన్‌లో ఒక వారం రోజులు– అదొక అనుభవం. అనుభవం ఆధారంగా ఒక నాటిక రాయాలని– ఎప్పటికయినా రాయాలి. దాని పేరు P.S. 'చర్య' కిష్టమ్మ, భూమయ్య గౌడ్‌లకి అంకితం. ఆ పుస్తకం అచ్చయి బయటికొచ్చే నాటికి వాళ్ళు బతికే ఉన్నారు. ఆ విషయం వాళ్ళకి తెలిసిందో లేదో తెలియదు. ఎమర్జెన్సీలో వాళ్ళు ఉరిదీయబడ్డారు.

ఆరోజుల్లోనే మన సైద్ధాంతిక భూమిక వదలకుండా గొప్ప కవిత్వం రాయలేమా అనే చర్చ. విరసంలో కవిత్వ మేముంది. 'కొట్టు చంపు నరుకు' అనేదేగా అనే ఒక విమర్శ, ఒక చులకన భావం ప్రచారమవుతున్నదశ. అప్పుడే ఉస్మానియా విద్యార్థులుగా సిధారెడ్డి, రఘునాథం, సుంకిరెడ్డి శంకరం, కశ్రీ యిత్యాదులు రోజూ కాలేజిలో సిద్ధార్థ హోటల్లోనో ఆ చర్చల ఫలితంగా, ఆత్మ విమర్శల ఫలితంగా, 'కొత్తధనుసులోని భావా కవితలు వచ్చాయి. రఘునాథం గొప్ప కవిత పద్యంలో యిమడాల్సిన అందం అనే పద్యం నుంచి వచ్చింది. వస్తువును చూడటం గురించీ, ఎత్తుగడ, ముగింపుల గురించీ చాలా తీవ్రంగా చర్చలు జరిగేవి – ఆ నేపథ్యాలోంచే–

1. ఆకులో ఆకాశాన్ని, ఆకాశంలో అడవుల్ని

చూడలేనివాడు

మనుషుల్లోని మహత్తర ఆకాశ అటవీ సౌందర్యాన్ని చూడలేదు. అని మొదలయిన 'చూపు' అనే కవిత ఎప్పటికప్పుడు ఆనాటి నిర్దిష్ట సామాజిక రాజకీయ సాహిత్య సాంస్కృతిక సందర్భం మీద ఆధారపడి – 'వస్తువు'తో పాటు రూపాన్ని మార్చుకోవటానికి ప్రయత్నం– కొత్త పరిభాష నెన్నుకునే ప్రయత్నం కన్పింస్తుంది.

చాలా మంది విమర్శకులు, కవిమిత్రులంటూ వుంటారు. 'శివారెడ్డి కవితా యాత్రలో 'భారమితి' ఒక మైలురాయి అని, అక్కడ్నుంచే శివారెడ్డి బలమయిన ముద్ర తెలుగు కవిత్వంపై పడుతూ వచ్చిందని నిజమేనేమో, నాకు తెలియదు. కానీ ఎప్పటికప్పుడు up to date చేసుకోవటం ప్రపంచవ్యాప్తంగా వస్తున్న అన్ని దేశాల కవిత్వాన్ని లోతుగా చదవటం, యిష్టమయిన కవుల కవిత్వాన్ని తాగి, తిరిగి చదవటం, అంతర్లీనం చేసుకోవటం, జీర్ణించేసుకుని రక్త నిష్ఠం చేసుకోటం ఆగకుండా అప్పట్నుంచి జరుగుతూనే వుంది. 'భారమితి' 1983లో వచ్చిందనుకుంటా. అవిచ్ఛిన్నంగా విద్యార్థి ఉద్యమాల్లో కలిసి పనిచేయటం, స్కూళ్ళు కాలేజీల్లో ఉపన్యసించటం, విద్యార్థులకు కవిత్వం చదివి విన్పించటం ఆనాటి నా కవిత్వ శైలిపై గొప్ప ప్రభావం చూపిందనుకుంటూ. నా కవితా సంపుటుల్లో ఖచ్చితమయిన, ప్రత్యక్షమయిన రాజకీయ అంశంవున్న పుస్తకాలు రెండు– ఒకటి 'భారమితి' రెండు 'అజేయం' అమ్మజ సాగుతున్న భూపోరాట రైతాంగ ఉద్యమాలు– దీన్ని ముందుకు తీసుకెళ్తున్న వామపక్ష పార్టీల భావజాలం– మార్క్సిస్టు మావో ఆలోచనా విధానాన్ని నమ్మటం, అత్యవసర పరిస్థితి, బూటకపు ఎన్‌కౌంటర్లు ప్రజారాశులు వెర్సెస్ రాజ్యం– ఈ నేపథ్యంలో–

అవన్నీ పోరాట దేశాలు. జాతి విద్వేశానికి వ్యతిరేకంగా పోరాడుతున్న దేశాలు. పోరాట నేపథ్యం నుంచి చూస్తే, వాళ్ళ కవిత్వానికి మన కవిత్వానికి చాలా పోలికలున్నాయి. అధి వాస్తవికత స్పర్శతో ఉత్తమ ప్రజా కవిత్వం ఎలా రాయాలో చూయించారు. West indian poet Aime cerair రాసిన Returw to my Native Land కావ్యం నన్నూ పేసింది. ఆంద్రేబ్రితాన్ అధివాస్తవిక ఉద్యమ నాయకుడు. దాన్ని Raster piase అభి వర్ణించాడు.

ఇన్ని ప్రభావాల మధ్య మరెన్నో సునిశిత అంశాలు మరెంత మంది కవుల్నించో స్వీకరించాను. అంతర్లీనం, ఆత్మగతం చేసుకునే క్రమంలో అనువాదాలు చేశాను. నువ్వు ఇష్టపడ్డ కవి వస్తు రూపాయి నీలోకి యింకాలంటే, చేయాల్సిందే. అనువదించాల్సిందే. ఈ క్రమం నుంచి భారమితి అజీయాల్ని ఒక దగ్గర పెట్టొచ్చు. వక్తృత్వ శైలి' అనీ,

మరొకకు అనీ విమర్శకులు ముద్ర వేశారు. బహుశ అది కొంత కోణం, కొంత కవిత్వానికే వర్తిస్తుంది.

1988లో వచ్చిన 'మోహనా! ఓ! ఓ మోహనా' దగ్గరకి వచ్చే సరికి – రాజకీయ స్పర్శ అంతర్వాహినిగా ఉండి మానవ సంబంధాలవైపు దృష్టి మళ్ళింది. అంతిమంగా ఏ ప్రభావమైనా ఎక్కడ ప్రతిఫలిస్తుంది అంటే మానవ సంబంధాలమీదే. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలవ్వటం – క్రమక్రమంగా మానవ జీవితంలో ఒక ఖాళీ ఒక శూన్యం ఏర్పడటం మొదలయింది. అప్పుడే అనుకుంటూ అన్నాను– కరెక్టుగా కవిత్వం రాసే వయసొచ్చిందని'. ఒక లోతైన అవగాహన, ఒక అమోఘమయిన ప్రేమ – ఒక పరిపక్వత– గొప్ప స్పందనాయుత ధార– ప్రతి దానికీ కవి, చలించిపోవటం నెరూదాని, మమకొ విస్కీని, యతుసెంకుని, రష్యన్ వచన మహా రచయితలందర్నీ, లోతుగా చదవటం – ఆ దశలోనే, గ్రీకు మహాకవి ANIS RITSOS నీ, 'అమిచమ్‌నీ, 'లోర్కాని, వ్లా మీర్ హోలన్‌నీ మరెంతో మంది మహాకవుల్ని తిరిగి తిరిగి చదవటం సంలీనం చేసుకోవటం, నా చుట్టూ జీవితానికీ అన్వయించుకుని, నా చుట్టూ వున్న జన జీవితం నుంచీ, వాళ్ళ అనుభవాల నుంచీ కవిత్వం తోడుకోవటమెలా–

ఇదొక సుదీర్ఘ క్రమం. అంతంలేని క్రమం అన్వయించుకుని, అంతర్లీనం చేసుకుని పటిష్టమయ్యే క్రమం.

నిన్న గణనలోకి రాని అంశాలు నేడు గణనలోకి వస్తున్నాయి. నిన్న గమనించని వాటిని నేడు గమనిస్తున్నాను. జీవితాన్ని దాని సకల అంశాలతో వైవిధ్యాలతో, వైరుధ్యాలతో, పట్టుకునే ప్రయత్నం మొదలయింది. No stagnation వస్తువుచుట్టూ తిరగటం మాని పైపైన చూడటం నుంచి కాక వస్తువులోనికి ప్రవేశించటం లోపలన్నుంచి విస్తృతి చేయటం.

అందుకని ఆ దశలో కవిత దృశ్యమానమవటం మొదలుయింది. ఒక image చొరబడుతుంది. పాఠకుడు శ్రోత, ఒక దృశ్యం మిస్సయినా, మరో దృశ్యాన్ని అందుకుంటాడు. అన్నీ దృశ్యాలన్నీ పాఠకుణ్ణి, శ్రోతని ఒక Climax కి ఒక రసానుభూతికి నడిపించుకెళతాయి 'మోహనా! ఓ! మోహనా! నుంచి మొదలయిన ఈ శైలి, రాను రాను మరీ సునిశితమయింది. బహు స్పందనా భరితమయింది. నేనందుకుంటున్న ప్రపంచాన్ని, అన్ని యింద్రియాలతో అనుభవాన్ని అదే స్థాయిలో పాఠకుడి అందించాలి. అదీ తపన.

ఈ స్థితిలోనే నా మూలాల్లోకి వెళ్ళటం మొదలయింది. ఒక నా స్పార్జియా స్పర్శ కూడా తోడయింది.

అయి సాహిత్య సామాజిక రాజకీయ రంగాల్లో త్వరితగతిని వస్తున్న మార్పులు స్త్రీవాద, దళిత వాద, మైనారిటీ వాద – తర్వాత అస్తిత్వ వార ఉద్యమాలు, ప్రపంచీకరణ, ముక్కల సంస్కృతి.

సరళీకరణ–మన సంస్కృతి మీద సామ్రాజ్యవాద సంస్కృతీ ప్రభావం వాటిన్నింట ఫలితంగా మనిషి ఎన్నడూ కనంగా పరాయీకరణ పొందటం– ఏకాకి గావటం–ఆధునిక విషాద నాయకుడవ్వటం–యివన్నీ లోలోపల లోకాన్ని ముట్టించిన అంశాలే Ritsos Halaw తర్వాత పోర్చుగీస్ కవిది అంద్రేదా– కవిత్వం అప్రధానమనుకున్నవి ఎలా ప్రధాన మవుతాయో– నిన్ను నీవు ఎలా ఎల్లప్పుడూ సజీవంగా ఉంచుకోవాలో చూపించాయి. దేన్నీ పరిహరించ నక్కరేలేదే– అన్నీ in elvusive - elesive ఏదీకాదు. విస్తృతీ, లోతూ, నిర్మాణ రూపు పద్ధతులూ 'నా కలల నది అంచున' కవితా సంపుటిలో పాలరవై విశాలమవుతూ సర్వాన్ని సంలీనం చేసుకుంటూ ముందుకెడుతూనే వుంది.

కవిత్వం రాచుటానికేమీ అక్కరలేదు. ముఖ్యమయింది. 'నువ్వు బతికుండటం' మానవుడు అమానవుడయ్యే స్థితి అంతో Fragmentation విచ్ఛిత్తి – ఏ విలువలూ లేని విషాద స్థితి. మానవుడు తను చనిపోయి చానాళ్ళయినా బతికున్నానని భ్రమపడుతున్న దశ.

ఈ దశలో 2001లో ప్రమాదం జరగటం, ఆసుపత్రిలో 2 సంవత్సరాలుండటం– నాలుగు ఆపరేషన్లు జరగటం గదికి, మంచానికి పరిమితం కావటం. ఒక కొత్త చూపును, ఒక కొత్త మెలకువను, కొత్త మృదుత్వాన్ని ప్రసాదించింది. అక్కడ్నుంచి వచ్చిందే అంతర్జనం పూర్తిగా వస్తురూపాల్లో పూర్వపు శివారెడ్డి కన్పించని భాష శైలి. తరచి తరచి చూడటం, వస్తువులో లోతుల కెళ్ళటం– సారాన్ని గ్రహించటం– భాష, శైలి పూర్వపు శివారెడ్డివి కావు. తర్వాత వచ్చిన వృత్త లేఖిని అతను చరిత్ర, పొసగుని నన్నీ, గగన మంత తలతో ఈ అంశాన్నే బహుముఖం చేస్తూ, Multi limensional చేస్తూ ముందుకు సాగాయనుకుంటూ.

దేన్నీ పరిహరించటం లేదు. అంతా, అన్నింటికీ స్వీకరించటమే యిముద్దుకుని, అనుభవాలు– కవిత్వం రూపాల్లో పాఠలోకాని కందించటం rUnsivareddi అయిందా

శివారెడ్డి కవిత్వం? కాదనుకుంటా; నా రాజకీయ విశ్వాసాన్ని విడనాడ లేదు. తర్వాత వచ్చిన వాదాలన్నింటినీ ఆహ్వానించా. అవి అందించిన పలు అంశాల్ని స్వీకరించి నా కవిత్వాన్ని పరిపుష్టం చేసుకున్నా. సారాంశంలో నేను మార్క్సిస్ట్‌నే నీవు యిప్పటికీ మార్క్సిష్టు లెనినిస్ట్ మావోయిస్ట్ భావాజాలాన్ని నమ్ముతున్నా. అది ఆచరించే అందించే కార్యాచరణలో భాగమయ్యేవున్నా– ఒక మార్క్సిష్టు అయిన వాడు తప్పకుండా ప్రజాస్వామిక వాది కావాలి. మార్క్సిజం ఒక శాస్త్రం కాబట్టి తర్కించి విశ్లేషించి శాస్త్రీయంగా యితరుల్ని ఒప్పించాకే తప్ప నియంతలా అభిప్రాయాలను రుద్దడం కూడదనుకుంటా; జడంగా ఉండటమూ కుదరదు. నీ సామాజికాచరణకి సంబంధించి, సాహిత్యాచరణి సంబంధించి ఒక విశాల ప్రాతిపదికతో ప్రజాస్వామికీకరణ చెందుతూ ముందుకు సాగాలనుకుంటూ.

యిరవయ్యేకటో శతాబ్దం విసిరిన సవాళ్ళను అన్ని రంగాల్లో మనం చాలా సంయమనంతో all incluvitive తో స్వీకరించి ముందుకు సాగాలనుకుంటూ–

సామాజికాచరణ, సాహిత్యాచరణా విడదీయరానిని. పరస్పర ప్రేరకాలు పూర్వం. Basical గా నేను literary artist నే సమాజంలో interaerఅయ్యేది నేను సాహిత్యం ద్వారానే. word is deed అని సార్త్రే అన్నట్టు.

ప్రపంచ మహాకవులందరూ నాకు ప్రేరకులే, అలాగే ప్రపంచ గొప్ప వచన రచయితలూ నన్ను ప్రభావితం చేశారు. కవులెంతగా కదిలించి, ఊపివేశారు. కొత్త కొత్త విషయాలు చెప్పారు– అలాగే వచన రచయితలు. చాలా సార్లు వాళ్ళ మధ్య అభేదమే.

రాను రాను ప్రపంచ సమాజాలు– ముఖ్యంగా భారతీయ సమాజం సంకీర్ణమౌతూ సంక్లిష్ట మౌతూ వస్తుంది. ఈ కొత్త జీవన సందర్భాన్ని పరిపూర్ణంగా కవిత్వీకరించాల్సిందే, మడిగట్టుకుంటే కుదరదు.

ఒకో తాత్విక దర్శనం ప్రపంచాన్ని ఒకో రకంగా వ్యాఖ్యానించి చూడటం నేర్పింది. ఏ దర్శనమయితే నిన్ను చలన శీలగా, క్రియాశీలిగా, సంస్పందనా భరితునిగా తయారు చేస్తుందో, పదునయిన నేలగా మార్చుతుందో, నీ భ్రమల్ని భయాల్ని పారదోలుతుందో అది మార్క్సీయ తత్వదర్శనమని నేను నమ్ముతున్నాను. దీన్ని దేశకాల పరిస్థితులకు అన్వయించుకుంటూ అభివృద్ధి చేసుకుంటూ పోవాల్సిందే– కవిత్వమూ అంతే.



అంపశయ్య నవీన్

నేను డిసెంబర్ 24, 1941వ సంవత్సరంలో మద్దిరాల అనే గ్రామంలో జన్మించానని ఆ గ్రామంలోని ఓ జ్యోతిష్య పండితుడు రాసిన నా జాతకం ద్వారా తెలిసింది. ఆ జాతకం ప్రతి ఇప్పటికీ మా ఇంట్లో ఉంది.

మద్దిరాల మా అమ్మమ్మగారు. ఈ గ్రామం నల్లగొండ జిల్లా సూర్యాపేట తాలూకాలో ఉంది. మా మేనమామ ఆ ఊరికి పోలీసుపటేల్‌గా ఉండేవాడు. "పిచ్చమ్మకు కొడుకు పుట్టాడని (పిచ్చమ్మ మా అమ్మపేరు) మా అమ్మమ్మ వచ్చి పెదమామగార్కి చెప్పినప్పుడు అక్కడ ఆ ఊరి జ్యోతిష్య పండితుడు - ఆయన పేరు అనంతారామయ్య - ఉన్నాట్ట. ఆయన వెంటనే అప్పుడు టైమెంతయ్యిందని తెలుసుకోవడం కోసం పూర్యుని వైపు చూసి, ఓ కాగితం తీసుకొని, టైమ్‌నూ తేదీని రికార్డు చేశాట్ట. తర్వాత ఆయనే ఓ జాతకం కూడా రాసి మా నాయన గార్కి ఇచ్చాట్ట. ఈ కారణం చేత నా పుట్టిన తేదీని నేను కచ్చితంగా తెలుసుకోగల్గాను.

మా స్వగ్రామేమో వావాలాల. అప్పుడు మా తాలుకా జనగాం నల్లగొండ జిల్లాలో ఉండేది. 19053లో జిల్లాల పునర్విభజన జరిగినప్పుడు జనగాం తాలూకాను వరంగల్ జిల్లాలో కలిపారు.

మాది వ్యవసాయ కుటుంబం. ఓ చిన్నపాటి జమీందారుకున్నన్ని భూములు మాకుండేవి. మాది చాలా పెద్ద ఉమ్మడి కుటుంబం. మా తాతగారి పేరు దొంగరి మల్లయ్య. చాలా తెలివైనవాడని, ఆరోజుల్లోనే ఆయన శాస్త్రాలు, పురాణాలు చదివేవాడని

చెప్పుకునేవాళ్లు. ఆయన బోల్డు ఆస్తిని సంపాదించాడు. దాదాపు రెండువందల ఎకరాలకు పైగా భూముల్ని సంపాదించాడట. ఆశ్చర్యమేమిటంటే ఆయనకు పిల్లల్లేరు. ఆయనకిద్దరు తమ్ముళ్ళు. ఆ ఇద్దరి తమ్ముళ్ళలో ఒకరికి ముగ్గురు కొడుకులు, ఐదుగురు కూతుళ్ళు. మరొకరికి ఇద్దరు కొడుకులు, ఐదుగురు కూతుళ్ళు. తన ఈ ఇద్దరు తమ్ముళ్ళకోసమే ఆయన అంత ఆస్తి సంపాదించారు. ఆ ఇద్దరి తమ్ముళ్ళ పిల్లలందర్నీ పెంచి పెద్దచేసి, వాళ్ళ పెళ్ళిళ్ళు చేసి వాళ్ళను ప్రయోజకుల్ని చేసిన ఘనత కూడా ఈ దొంగరి మల్లయ్యదే. వీళ్ళకోసం ఆయన ఓ పెద్ద భవంతిని కూడా నిర్మించాడు.

ఈ దొంగరి మల్లయ్యగారి ఇద్దరు తమ్ముళ్ళలో ఒక తమ్ముడిపేరు రాజలింగయ్య. ఆ రాజలింగయ్య గారి ఇద్దరు కొడుకులు – పెద్దకొడుకు పేరు దొంగరి నారాయణ. ఈ దొంగరి నారాయణగారే మా నాయన.

దొంగరి మల్లయ్యగారి ఇద్దరు తమ్ముళ్లు, ఆ తమ్ముళ్ళ పిల్లలు– చాలా కాలం వరకు ఉమ్మడి కుటుంబంగా ఉండేవారు. ఐదుగురు అన్నదమ్ములు, పదిమంది అక్క చెల్లెళ్ళు– వీళ్ళందరి పిల్లలు – దాదాపు 40 మంది వరకు ఒకే కుటుంబంగా ఉండేవాళ్ళు. దొంగరి మల్లయ్యే వీళ్ళందరికీ యజమాని. ఆయన జీవించి ఉన్నంత వరకు వీళ్ళను వేరుపడనీయలేదు. ఆయన చనిపోయాక ఆస్తులు పంచుకోవడం ప్రారంభమయ్యింది. మొదలు రెండు పెద్దపాళ్ళు – తర్వాత ఒక తమ్ముని ముగ్గురు పిల్లలకు మూడు పాళ్ళు, మరో తమ్ముని ఇద్దరు కొడుకులకు రెండు పాళ్ళు – ఇలా ఈ ఆస్తులు పంచుకునే గొడవ చాలా వరకు సాగింది. పాళ్ళు కుదరలేదని ఎవరో ఒకరు పంచాయితి పెట్టడం – దాంతో మళ్ళీ పంచుకోవడం ఇలా ఐదారు సార్లు భూముల్ని పంచుకున్నారు. అలాగే దొంగరి మల్లయ్య గారు నిర్మించిన లంకంత భవంతిని ఐదు భాగాలుగా పంచుకోవడంతో ఆ భవంతి స్వరూపం పూర్తిగా మారిపోయింది.

ఉమ్మడి కుటుంబంగా ఉన్నంతకాలం మా ఊర్లో మాదే అందరికంటే ఆర్థికంగా ఉన్నత కుటుంబమని చెప్పుకునేవాళ్ళు. కానీ ఆస్తిని ఐదు భాగాలుగా పంచుకున్న తర్వాత పరిస్థితి మారిపోయింది.

ఎన్నో భూములున్నప్పటికీ నీటి వసతి లేకపోవడం వల్ల విరివిగా వర్షాలు కురిస్తే తప్ప పంటలు పుష్కలంగా పండేవి కావు. అయినప్పటికి మా ఊర్లో మమ్మల్ని బాగా ఉన్నవాళ్ళుగానే భావించేవాళ్ళు.

ఆ కుటుంబంలోని ఐదుగురు అన్నదమ్ముల్లో మా నాయనగారు, మా చిన్నాయనగారు మాత్రమే ఆనాటి కాన్గీ బళ్ళల్లో చదువుకున్నారు. మిగతా ముగ్గురు నిరక్షరాస్యులు.

మా నాయనగారు కాన్గీ బడిలో రెండో తరగతి వరకు చదువుకున్నానని చెప్పేవాడు. అమాత్రపు చదువుకునే ఆయన భారత, భాగవతాలు చదువుతుండేవాడు. ఉర్దూ మాట్లాడుతుండేవాడు. ఆ రోజుల్లో తెలంగాణ గ్రామాల్లో ఉర్దూలో మాట్లాడగల్గటమంటే చాలా గొప్పగా భావించేవాళ్ళు. మా నాయనగారు భాగవతంలోని కొన్ని పద్యాల్ని రాగయుక్తంగా పాడి వినిపిస్తుండేవాడు. భాగవతాన్ని రచించిన పోతన్న బమ్మెర గ్రామస్తుడని, బమ్మెర మా ఊరికి చాలా దగ్గర్లోనే ఉంటుందని మా నాయనగారు చెబుతుండేవాడు. పాల్కుర్తి సోమనాథుడు జన్మించిన పాలకుర్తి కూడా మా ఊరికి చాలా దగ్గర. ప్రస్తుతం మా ఊరు పాలకుర్తి మండలంలోనే ఉంది.

మా వావిలాల గ్రామం మరీ పెద్దదిగానీ, మరీ చిన్నదిగానీ కానీ ఒక మధ్యతరగతి గ్రామం. ఆశ్చర్యమేమిటంటే మా ఊర్లో అగ్రకులాలకు చెందిన కుటుంబాలేవీ లేవు. బ్రాహ్మణులు, రెడ్లు, వెలమలు – ఈ కులాలవాళ్ళెవరూ లేరు. మా ఊరి పక్కనే ముత్తారం అనే గ్రామం – ఆ ఊర్లో ఉండే బ్రాహ్మణులే మాకు పురోహితులు. మా ఊరికి దగ్గర్లో ఉండే మరో గ్రామం విస్నూరు. ఆ ఊర్లో ఉండే రాపాక రామచంద్రారెడ్డే మా ఊరి దొర (ఆయన 60 గ్రామాలకు దొర అని చెప్పేవాళ్ళు.

మా ఊర్లో అగ్రకులాల వాళ్ళెవరూ లేకపోవడం వల్ల తెలగాలు, పెరుక, కాపు కులాల వారినే అగ్రకులాల వారుగా భావించేవారు (మేం పెరుకవాళ్ళం). మా ఊరి దొర మా ఊరికి దూరంగా ఉండటం వల్ల ఆయన పెత్తనం గానీ, పీడన గానీ, దౌర్జన్యం గానీ ఎక్కువగా కనిపించేది కాదు. గ్రామంలోని అన్ని కులాల మధ్య చక్కని సామరస్యం ఉండేది. అందరూ అక్కా, చెల్లె, బావ, మామ, తాత అని వరసలు కలుపుకొని ప్రేమానురాగాలతో హాయిగా సహజీవనం చేసేవాళ్ళు.

మా అమ్మ తల్లిగారి ఊరు మద్దిరాలను గూర్చి కూడా కొంత చెప్పాలి. మద్దిరాల గ్రామం మ ఊరికి – అంటే వావిలాలకు మూడు ఆమడల దూరం (అంటే 24మైళ్ళు) ఉంటుందని అనుకునేవారు. ఆ రోజుల్లో ఎడ్లబండ్లే ప్రయాణ సాధనాలు. తెల్లవారకముందే – అంటే కోడికూయంగానే, బండి కట్టుకొని బయల్దేరితే మద్దిరాల చేరుకున్నప్పటికి

సాయంత్రమయ్యేది. ఈ రెండు గ్రామాల మధ్యన మా చిన్నప్పుడు – ఎన్నో సార్లు ఎడ్ల బండ్ల మీద ప్రయాణం చేశాం.

మా వావిలాల గ్రామం కంటె మా అమ్మమ్మగారి ఊరైన మద్దిరాల పెద్దది. మా వావిలాల ఎత్తుమీద ఉండటం వల్ల నీటి వసతి ఉండేది కాదు. చేదబావులు చాలా లోతుగా – 40,50 అడుగుల లోతుగా ఉండేవి. వేసవికాలం వచ్చిందంటే ఆ బావుల్లో నీళ్ళే ఉండేవి కావు (బహుశాః ఈ కారణం వల్లనే మా ఊర్లో బ్రాహ్మణ కుటుంబాల వాళ్ళెవరూ నివాసం యేర్పరచుకోలేదు) మా ఊర్లోని చెరువులు కూడా చాలా చిన్నవి. బాగా వర్షాలు కురిసి రెండు మూడు సార్లు నిండితే తప్ప వరిలాంటి పంటలు పండేవికావు.

మద్దిరాలలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండేది. పెద్దపెద్ద చెరువులు – కొద్దిపాటి వర్షాలకే అవి నిండుతుండేవి. ఒకసారి నిండితే రెండు పంటలకు సరిపోయేటన్ని నీళ్ళొచ్చేది. ఇలా నీటి వసతులుండటం వల్ల ఈ గ్రామం ఎప్పుడూ సుభిక్షంగా ఉండేది.

మద్దిరాల గ్రామానికి మా తాతగారే పోలీసుపటేల్‌గా ఉండేవాడు. నేను జన్మించిన ఆరునెలలకే ఆయన చనిపోయాడట. ఆయనకు ముగ్గురు కొడుకులు, ఐదుగురు బిడ్డలు. ఆయన రెండో కూతురే మా అమ్మ. మా తాతగారు చనిపోయాక ఆయన పెద్ద కుమారుడు – అంటే మా పెద్దమామ గారు పోలీసుపటే లయ్యాడు. ఆయన తర్వాత మా నడిపిమామ గారు – ఆయన పేరు వడ్డాణం శంకరయ్య – పోలీసు పటేల్‌గా చాలా కాలం పనిచేశాడు. పంచాయత్ రాజ్ వ్యవస్థ యేర్పడ్డాక సర్పంచ్‌గా కూడా పనిచేసి మంచి సమర్థుడైన పరిపాలనాదక్షుడుగా పేరు తెచ్చుకున్నాడు. ఈయన కూతుర్నే – ఆమె పేరు అనసూయను, నేను తర్వాత – అంటే 1962లో బి.ఏ. పూర్తి చేశాక, పెళ్ళి చేసుకున్నాను. అనసూయ నాలుగేళ్ళ పసిపాపగా ఉన్నప్పుడే ఆమె తల్లి చనిపోయింది. ఈమెను వాళ్ళ నాయనమ్మ – అంటే మా అమ్మమ్మే పెంచి పెద్ద చేసింది. మా అమ్మమ్మ, మా అమ్మ కోరిక మేరకు నేను అనసూయను పెళ్ళి చేసుకున్నాను. అనసూయ నాకన్నా 8 యేళ్ళు చిన్నది. మా మేనమామలది కూడా చాలా పెద్ద కుటుంబమే. వాళ్ళది కూడా వ్యవసాయ కుటుంబమే. వాళ్ళకూ బోల్డు భూములు... నీటి వసతులుండటం వల్ల పంటలు కూడా బాగా పండేవి. మా ముగ్గురు మేనమామలు కూడా చదువుకున్నవాళ్ళే. అందరికంటె చిన్న మామ ఆరోజుల్లోనే సూర్యాపేట హైస్కూళ్ళో పదోతరగతి వరకు చదివాడు.

నా బాల్యం ఈ రెండు గ్రామాలు – వావిలాల, మద్దిరాలల్లోనే గడిచిందని చెప్పాలి.

ఉమ్మడి కుటుంబంగా ఉన్నంతకాలం మా నాయనగారి ఆర్థిక పరిస్థితి బావుండేది. ఆస్తిని ఐదు భాగాలుగా పంచుకున్న తర్వాత పరిస్థితి మారింది. మా మేనమామలేమో చాలా కాలం వరకు ఉమ్మడి కుటుంబంగా కొనసాగారు. దీంతోబాటు వాళ్ళవి మంచి భూములు. నీటి వసతి కూడా బావుండేది. ఈ కారణాల వల్ల మా నాయనగారి కంటె మా మేనమాల ఆర్థిక పరిస్థితే ఎంతో మెరుగ్గా ఉండేది.

మొత్తమ్మీద ఈ రెండు కుటుంబాల్లో సాహిత్యానికి సంబంధించిన ఎలాంటి వాతావరణం కూడా ఉండేది కాదు. ఇలాంటి వాతావరణంలో జన్మించిన నేను ఓ రచయిత నవుతానని ఇటు మా నాయన తరపువారు గానీ అటు మా అమ్మ తరపు వాళ్ళుగానీ ఊహించలేదు.

మా నాయనగారు అంతో ఇంతో చదువుకున్నారు గానీ మా అమ్మ యేమీ చదువుకోలేదు. (నిరక్షరాస్యులు). కానీ అమెకు అద్భుతమైన లౌకికజ్ఞానం ఉండేది. మా బంధువులందరిలోనూ ఆమె చాలా తెలివైందనీ, అందరితోనూ చాలా కలుపుగోలుగా ఉంటుందనీ, చాలా ఉత్తమురాలని చెప్పుకునేవాళ్ళు. చాలా చిన్న తనంలోనే నాకు చదువుకోవడం ఆమె నాలో ఎవరిలో లేని ప్రత్యేకత యేదో ఉందని, నేను భవిష్యత్తులో చాలా గొప్ప వాడినౌతానని నమ్మేది. నాలో ఉన్న సృజనాత్మక ప్రతిభను గుర్తించిన మొట్ట మొదటి వ్యక్తి మా అమ్మే!

నాతోడి పిల్లలందరూ ఆటల మీదనో, వ్యవసాయపు పనులమీదనో, ఆట పాటల మీదనో ఎక్కువ శ్రద్ధను కనబరిస్తే నేను మాత్రం ఎక్కడ పుస్తకం కనిపిస్తే అక్కడే కూర్చుని ఆ పుస్తకం చదువుతుండేవాడిని. చాలా చిన్నప్పట్నించే – అక్షరాలు నేర్చుకున్నప్పట్నించే, అక్షరాలు కనిపిస్తే చాలు వాటిని చదవాలని ఉత్సాహపడ్తుండేవాడిని. మా నాయనగారు భాగవతంలోని పద్యాల్ని చదువుతోంటే నాకూ భాగవతం చదవాలనిపించేది. అలాగే ఎవరైనా కథలు చెబుతోంటే వెంటనే అక్కడికి పరిగెత్తేవాడిని. అప్పుడప్పుడు మద్దిరాలలోనూ, వావిలాలలోనూ హరి కథలు చెబుతుండేవాళ్ళు. వెంటనే అక్కడికి పరిగెత్తి గంటలగ్గంటలు కూర్చొని హరికథ మొత్తం విన్నాకే అక్కడ్నించి కదిలేవాడిని. హరికథలు చెబుతున్న అయ్యగారు మధ్యమధ్యలో కొన్ని పిట్ట కథలు చెబుతుండేవాడు. కొన్ని సార్లు అసలు కథకంటె ఈ పిట్ట కథలు భలే నచ్చేవి.

ఎండాకాలం వచ్చిందంటే మా ఊరికి దాసరివాళ్ళొచ్చి పౌరాణిక నాటకాలు

ఆడుతుండేవాళ్ళు. రాత్రి ఎనిమిదింటికో, తొమ్మిదింటికో ప్రారంభమయ్యే ఈ నాటకాలు పూర్తయ్యేటప్పటికి తెల్లవారేది. చాలా చిన్నతనంలోనే ఈ నాటకాలంటే పిచ్చి ఇష్టం యేర్పడింది. ఈ నాటకాలు చూస్తూ మధ్యలోనే నిద్రపోతుండేవాడిని. ఎవరో ఇంటికి తీసికెళ్ళి పడుకోబెట్టేవాళ్ళు.

నాకు ఐదేళ్ళొచ్చాక అక్షరాభ్యాసం చేయించి మా ఊరి బళ్ళో వేశారు. అక్షరాభ్యాస కార్యక్రమం శ్రీకారం పెట్టించడం అనేవాళ్ళు - మా ఇంట్లో మా నాయనగారు చాలా ఘనంగా జరిపించారు. మా పురోహితుడొచ్చి సంస్కృత శ్లోకాలు చదివి నాచేత శ్రీ అక్షరాన్ని రాయించాడు. మా ఊరి ప్రముఖులందర్నీ ఆ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఆరోజుల్లోనే మా ఊర్లో ఓ ప్రభుత్వ పాఠశాల ఉండేది. మూడో తరగతి వరకు బోధించేవారు. ఆ పాఠశాల మా ఇంటిముందే ఉండేది. ఒకే ఒక టీచర్ ఉండేవాడు. ఆయనే పేరు మొహ్మద్‌జాఫర్ గారి తమ్ముడైన సాబీర్ అనే అతడు చూసేవాడు. ఈ సాబీర్ పరమ క్రూరుడు పిల్లల్ని దారుణంగా బెత్తంతో కొడ్తుండేవాడు. స్కూలుకు రాకపోయినా, సరిగ్గా చదవకపోయినా పిల్లల్ని కోదండం ఎక్కించేవాడు. అతన్ని చూస్తే చాలు, పిల్లలం ఝుడుచుకునేవాళ్ళం. అయితే నన్నుమాత్రం ఆయన ఎప్పుడూ కొట్టలేదు.

ఆ రోజుల్లో ఊర్దూ నేర్చుకోవడం తప్పనిసరి

నాకు తెలుగు నేర్చుకోవడం చాలా సులభమనిపించేది. కానీ ఉర్దూ పెద్ద సమస్య అయ్యింది. అలీఫ్, బేలు నేర్చుకొని, బోల్తాఖాయిదా - అంటే బాలశిక్షలాంటిది చదువుతున్నప్పుడు ఆంధ్రమహాసభ ఉద్యమం వచ్చి స్కూలు మూతపడటంతో నా చదువుకు బ్రేక్ పడింది.

భోనగిరిలో 1944లో 11వ ఆంధ్రమహాసభ జరిగిన సందర్భంగా మా ఊర్లో ఆ మహాసభకు సంబంధించిన సన్నాహక సభొకటి జరిగింది. దాన్ని ఆ ఊరి ప్రముఖులు కొందరు నిర్వహించారు. వాళ్ళళ్ళో మా నాయన, చిన్నాయనగార్లు కూడా ఉన్నారు. ఆ సభకు రావి నారాయణరెడ్డి, బద్దం యెల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి గార్లొచ్చారు. వాళ్ళ ముగ్గుర్ని పదకొండు జతల ఎడ్లను కట్టిన బండ్లో కూర్చోబెట్టి ఊరేగించారు. నా బాల్యానికి సంబంధించిన మొట్ట మొదటి జ్ఞాపకం ఈ ఊరేగింపే. అప్పుడు నాకు నాలుగేళ్ళనుకుంటాను. ఈనాటికి ఆ పదకొండు జతల ఎడ్లను కట్టిన బండి, ఆ బండ్లో కూర్చున్న ఆ ముగ్గురు నాయకులు నాకళ్ళళ్ళో మొదల్తూ ఉంటారు, నేనో రచయితగా

స్థిరపడ్డాక, ఈ దృశ్యంతో మొదలెట్టి ఓ నవల రాయాలని, ఆ నవలలో ఆనాటి తెలంగాణ గ్రామాల చరిత్రను చిత్రించాలని అనుకుంటుండేవాడిని (2002వ సంవత్సరంలో "కాలరేఖలు" నవల రాయడం ద్వారా 20 సంవత్సరాలుగా నా మస్తిష్కంలో మెదిలిన ఈ నవలను కాగితం మీద పెట్టగలిగాను).

1944 నుండి ఆంధ్ర మహాసభ ఉద్యమం ఉధృతమైంది. ఆంధ్ర మహాసభ కార్యకర్తలను "సంగపోల్లు" అనేవాళ్ళు, ఈ సంగపోల్లు దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడటం వల్ల మధ్య తరగతి రైతులు, నిమ్న వర్గాల వారు వారికి తమ సంపూర్ణ సహకారం అందించారు. మా కుటుంబం కూడా సంగపోల్లతో మమేకమయింది. చాలాసార్లు నల్ల నరసింహులు లాంటి సంగపు నాయకులు మా ఇంటి కొస్తుండేవాళ్ళు. దళం ఫలానా చోట ఉంది. వాళ్ళకు భోజనాలు పంపించాలంటే, మా ఇంటి నుండి భోజనాలను పంపించేవాళ్ళు. అట్లా భోజనాలు తీసుకెళ్తున్న వాళ్ళతో నేను వెళ్ళి సంగపోల్లను చాలా మందిని చూశారు.

ఆగస్టు 15, 1947 తర్వాత రజాకార్లు పల్లెలమీద పడి ప్రజల్ని ఊచకోత కోయడం మొదలెట్టారు. మా కుటుంబం సంగపోల్లకు సపోర్టు చేస్తున్నదని తెలిసి రజాకార్లు రెండు సార్లు మా ఇంటిమీద దాడి చేశారు. మా నాయన, చిన్నాయనలు ఇంట్లో లేకపోవడం వల్ల బతికిపోయారు. రజాకార్లు మరోసారి దాడిచేస్తారని తెలుసుకొని మేం 1948 జనవరిలో కృష్ణాజిల్లాలోని బందర్‌కు వెళ్ళి 6 నెలలపాటు అక్కడే ఉండిపోయాం. సెప్టెంబర్ 1948లో పోలీసుయాక్షన్ జరిగాక తెలంగాణలో పరిస్థితులు చక్కబడ్డాయి. 1946 నుండి 1948 వరకు దాదాపు రెండేళ్ళు నా చదువుకు బ్రేక్ పడింది. ఈ కాలంలోనే మా కుటుంబంలో అత్యంత విషాదకరమైన సంఘటన జరిగింది. నాకో అక్క ఉండేది, నాకన్న రెండేళ్ళు పెద్దది. "మా తమ్ముడు - తమ్ముడు" అంటే నేనంటే ప్రాణమిచ్చేది. చాలా అందంగా ఉండేది. అక్కగానే కాకుండా నా మొట్టమొదటి స్నేహితురాలు ఆమే అని చెప్పాలి. ఆమెకు 1947లో ఎనిమిదేళ్ళకే మా మేనత్తకొడక్కిచ్చి పెళ్ళిచేశారు. పెళ్ళైన ఆరునెల్లకే యేదో జబ్బుచేసి, సరి అయిన వైద్యసౌకర్యంలేక ఆమె చనిపోయింది. అప్పుడు మా అమ్మ గుండెలు పగిలేలా యేడ్చిన యేడ్పు ఈనాటికి నాలో ప్రతిధ్వనిస్తుంటుంది. ఇప్పటికీ ఎక్కడ బిగ్గరగా యేడ్చినా ఆనాటి మా అమ్మ యేడ్పే నాకు వినిపిస్తుంది.

మూడో తరగతి వరకు మా ఊర్లో చదువుకొన్నాను. నాల్గో తరగతి చదవటానికి

నన్ను మా నాయన మా ఊరికి దగ్గర్లోనే ఉండే కొడకండ్ల అనే గ్రామానికి తీసికెళ్ళాడు. కొడకండ్లలో మా ఇద్దరు మేనత్తలుండేవాళ్ళు. వాళ్ళింట్లోనే ఉండి నేనా ఊర్లో నాల్గవ తరగతి చదివాను. (ఆ ఊరి స్కూల్లో నాల్గో తరగతి వరకే ఉండేది.)

మా ఇద్దరు మేనత్తల్లో ఒకామె బాల వితంతువు. ఆమెకు ఎనిమిదేళ్ళ వయస్సున్నప్పుడే ఆమె భర్త చనిపోయాడు. ఆమెకు మళ్ళీ పెళ్ళి చెయ్యలేదు. చాలా అందంగా ఉండేది. నేనంటే చాలా ఇష్టపడేది. ఆమె ఎప్పుడూ నాకు చాలా ఆసక్తికరమైన ముచ్చట్లు చెబుతుండేది. మా కుటుంబ చరిత్రంతా ఆమెకు బాగా తెలుసు. ఆ చరిత్రంతా చెబుతుండేది. అలాగే ఆమెకు రామాయణ, భారతాలకు సంబంధించిన కథలన్నీ తెలుసు. అవన్నీ నాకు చెబుతుండేది. కథలు వినడం అంటే నాకు చిన్ననాటి నుండే చాలా ఆసక్తిగా ఉండేది. ఆమె చెప్పిన కథల్నే కొంచెం మార్చి, వాటికి నా కల్పనను కొంత జోడించి నాతో చదువుకుంటున్న నా క్లాస్‌మేట్స్‌కు చెప్పేవాడిని. ఇలా కథలు వినడం, కథలు చెప్పడం నేను చాలా చిన్నప్పట్నించే అలవరచుకున్నాను. హరికథలు, బుర్రకథలు, వీధి నాటకాలు, తోలు బొమ్మలాటలు, కాకిపడగల వాళ్ళు పటం చూపిస్తూ చెప్పే మహాభారత కథలు– వీటన్నిటినీ ఎంతో ఇష్టపడేవాడిని.

నాల్గో తరగతి చదువుతున్నప్పుడే మొదటిసారి నాకో కథ రాయాలనిపించింది. కథ రాయాలని నాకెవరూ చెప్పలేదు. మా కుటుంబంలో గానీ, మా బంధువుల్లోగానీ కథలుగానీ, కవిత్వంగానీ రాసిన వాళ్ళెవరూ లేరు. అయినా కథలు రాయాలన్న కోరిక నాకు చాలా చిన్నతనంలోనే చాలా సహజంగా కల్గింది. ఓ హరికథ వింటున్నప్పుడు, ఆ హరికథ చెప్పినాయన చెప్పి ఓ పిట్టకథ నాకు బాగా నచ్చింది. ఆ పిట్ట కథను చాలా మార్చి, దానికి నా కల్పనను జోడించి నేనో కథ రాశాను. ఆ కథకు "రత్నాకరుడు" అని పేరు పెట్టాను. మాకు తెలుగు చెప్పే టీచర్‌కు "నేనిలా కథ రాశాను సార్!" అని చూపిస్తే ఆయన దాన్ని చదివి "బావుందిరా!" అన్నాడు. ఆ టీచరే నాకు మద్రాసు నుండి "చందమామ" అనే ఓ పిల్లల మేగజైన్ వస్తుందని, నీ ఈ కథను ఆ మేగజైన్‌కు పంపించమని సలహా ఇచ్చి "చందమామ" అడ్రస్ కూడా ఇచ్చాడు. నేను ఈ రత్నాకరుడు అనే కథను రెండుమూడుసార్లు రాసి, చాలా బాగా వచ్చిందనుకున్నాక దాన్ని ఫెయిర్ చేసి "చందమామ"కు పంపించాను. ఇది 1950లోనో, 1951లోనే జరిగిన రచయితగా నా మొట్ట మొదటి ప్రయత్నం ("చందమామ" వారు ఆ కథను ప్రచురించలే దనుకోండి. అది వేరే విషయం.

కొడకండ్లలో చదువుకుంటున్నప్పుడే మా మేనత్త మా కుటుంబంలో జరిగిన ఓ సంఘటనను గూర్చి నాకు చాలాసార్లు చెబుతుండేది. అదేమిటంటే: మా నాయనకో అన్న ఉండేవాడట. చాలా అందంగా ఉండేవాడట. ఆయనకు పెళ్ళయ్యింది. ఆయన భార్య కూడా చాలా అందంగా ఉండేదట. అలా వెళ్ళినప్పుడు ఆమె ఇద్దరన్నలు బాగా తాగి భూముల పంపకం విషయంలో గొడవపడి కర్రలతో కొట్టుకుంటున్నారట. వాళ్ళను శాంతింపజెయ్యడానికని ఆమె వాళ్ళిద్దరి మధ్యలోకెళ్ళిందట. వాళ్ళ కర్రలు ఆమె తలకు బలంగా తాకడంతో ఆమె అక్కడికక్కడే మరణించిందట. మా మేనత్త ఈ సంఘటనను పూసగుచ్చినట్టు వర్ణించి చెప్పినప్పుడు నేను చాలా చలించిపోయాను. ఈ సంఘటన నా మైండ్‌లో చాలాకాలం ఉండిపోయింది. నేను హైస్కూలులో చదువుకుంటున్నప్పుడు చాలా నవలలు చదివాను ఈ సంఘటనను ఆధారం చేసుకొని ఒక నవల రాయాలన్న ఆలోచన కల్గింది. సగానికిపైగా రాశాను కూడా. తర్వాతెందుకో ఆ రచన ఆగిపోయింది. తర్వాత కాలేజిలో చదువుకుంటున్న రోజుల్లో ఈ సంఘటన ఆధారగా ఒక కథ రాశాను. (ఈ కథ "సుధ" పేరుతో "జయశ్రీ" అన్న మాపత్రికలో 1965లో ప్రచురించబడింది).

కొడకండ్ల నాల్గో తరగతి పూర్తిచేసి, ఐదవ తరగతి చదవటానికి మహబూబాబాద్ దగ్గరుండే కొరివి గ్రామానికి వెళ్ళాను. ఆ ఊర్లో మా చిన్నమ్మ – అంటే మా అమ్మ చెల్లెలు ఉండేది. ఆమె ఇంట్లో ఉండి ఐదవ తరగతి పూర్తి చేశాను. (అక్కడి స్కూల్లో ఐదవ తరగతి వరకు మాత్రమే ఉండేది.)

6,7 తరగతులు చదవటానికి నన్ను మా నాయన సూర్యాపేట తాలుకాలోని తిర్మలగిరి అనే ఊరికి తీసికెళ్ళి అక్కడే మిడిల్‌స్కూలులో చేర్పించాడు. తిర్మలగిరిలో మా బంధువులెవరూ లేరు. ఆ ఊరు కొడకండ్లకు చాలా దగ్గరుంటుందని, శనివారం కొడకండ్లకొచ్చి ఆదివారం మా మేనత్తల ఇంట్లో ఉండి సోమవారం తిర్మలగిరికి వెళ్ళొచ్చునని నన్ను తిర్మలగిరి స్కూల్లో చేర్పించాడు. తిర్మలగిరిలో కొడకండ్లకు చెందిన విద్యార్థులు చాలామంది చదువుకుంటుండేవాళ్ళు. వాళ్ళతో బాటు ఓ అద్దె ఇంట్లో ఉండి, స్వంతంగా వంట చేసుకొని చదువుకొమ్మని మా నాయన నన్ను తిర్మలగిరి స్కూళ్ళో చేర్పించాడు. 1952–54 మధ్యలో – రెండేళ్ళు స్వంత వంట సరిగ్గా చేసుకోరాక, ఆకలితో అలమటిస్తూ, నానా కష్టాలు పడి 6,7 తరగతులు – ఫస్ట్ క్లాసు మార్కులతో పాసయ్యాను. ఇలా చదివిన ప్రతిచోటా నా చుట్టూ క్లాస్‌మేట్స్ చేరుతుండేవాళ్ళు. కథలు చెప్పమని మరీమరీ అడిగి చెప్పించుకునేవాళ్ళు. టీచర్లు చెప్పకముందే క్లాసు పుస్తకాలన్నీ నేను

మొదలే చదివేస్తుండేవాడిని. ఎప్పుడూ నా చుట్టూ జరుగుతున్న సంఘటనల్ని గూర్చి, నా చుట్టూ ఉన్న వ్యక్తుల మనస్తత్వాలను గూర్చి, మాకు పాఠాలు చెప్పే టీచర్లను గూర్చి ఆలోచిస్తుండేవాడిని. వీటిని గూర్చి యేదన్నా రాయాలనిపిస్తుండేది. బుర్రలోకొచ్చే ప్రతి భావాన్ని నా మిత్రులకు చెప్పాలనిపించేది. నాకు పాఠాలు చెప్పిన ప్రతి టీచర్, నా చుట్టూ ఉన్న నా క్లాస్‌మేట్స్ నేనంటే చాలా ఇష్టపడ్తుండేవాళ్ళు. ఎన్ని కష్టాలొచ్చినా వీళ్ళను చూసి నా కష్టాల్ని మరచిపోతుండేవాడిని. తిర్మలగిరి స్కూళ్ళో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు నాకు చదువు మీదున్న శ్రద్ధను చూసి నన్నెంతో ప్రోత్సహించారు.

7వ తరగతి పూర్తిచేశాక 8వ తరగతి చదవటం కోసం నన్ను మా నాయనగారు వరంగల్లుకు తీసికెళ్ళాడు. మా ఊరి చుట్టుపక్కలెక్కడా హైస్కూల్స్ లేవు.

ఆ రోజుల్లో వరంగల్లులో రెండే రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలుండేవి. ఒకటి వరంగల్ పాపయ్యపేట చమన్ దగ్గరుండేది. దాన్ని "వస్తానియా' అనవేవాళ్ళు, రెండవది హనుమకొండలో – దాన్ని "కాలిజియేట్ హైస్కూలు" అనేవాళ్ళు. మా నాయనగార్కి నన్ను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఉండేది. – ఎందుకంటే అక్కడ ఫీజులుండవని. ఆయన వ్యవసాయపు పనులన్నీ పూర్తిచేసుకొని తీరికగా నన్ను వరంగల్‌కు తీసుకొచ్చేప్పటికి ఈ రెండు ప్రభుత్వ హైస్కూల్‌లోనూ అడ్మిషన్స్ క్లోజయిపోయాయి. మా నాయనగారు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని సిఫారసులు తెచ్చినా నాకు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ దొరకలేదు. చివరకు నన్ను వరంగల్‌లోని ఏ.వి. హైస్కూల్‌లో – దాన్ని "చందా కాంతయ్య బడి" అని కూడా పిలిచేవారు. చేర్పించాడు. అది ప్రైవేట్ స్కూలు. ఫీజులెక్కువ. అయినా నన్నా స్కూళ్ళో చేర్పించటం మా నాయనగార్కి తప్పలేదు. ఏ.వి. హైస్కూల్లో అడ్మిషన్ దొరికాక నన్ను ఎక్కడుంచాలన్నది సమస్య అయింది. వరంగల్లులో గిర్మాజిపేటలోని ఓ దూరపు బంధువులింట్లో చాలా అధ్వాన్నంగా ఉందా ఇల్లు – ఒక చిన్న రూం లాంటిదాన్ని వెదురు తడికలతో తయారు చేయించి, దాంట్లో నన్నుండమని చెప్పి మా నాయనగారు మా ఊరు వెళ్ళిపోయాడు. ఆ చిన్న రూంలాంటి దాంట్లో నేను ఒక్కడినే స్వతంగా పొయిలకట్టెలతో వంట చేసుకుంటూ ఏ.వి. హైస్కూలుకు వెళ్ళి చదువుకోవాలి. ఆ రూంను, ఆ ఇంటిని, ఆ ఇంట్లో ఉన్న మనుషుల్ని చూస్తోంటే కళ్ళకు నీళ్ళొచ్చాయి. కట్టెల పొయ్యి మీద వంట చేసుకోవడం నరకప్రాయంగా ఉండేది. అట్లా ఉడికి, ఉడకని అన్నం తిని సగం ఆకలితో స్కూలుకెళ్ళి చదువుకోవాలి. ఆ కష్టంకంటె ఇంటికెళ్ళిపోవాలనిపించేది. కానీ చదువుకోవాలన్న బలమైన కోరిక నన్నా కష్టాల్ని ఎదురుకునేలా చేసింది.

1954 వరంగల్‌లో 8వ తరగతిలో చేరటంతో రచయితగా నా జీవితంలోని రెండవ ప్రధాన ఘట్టం ప్రారంభమయ్యింది. ఇంతవరకు నేను చూసింది పల్లెటూరు జీవితం – ఇప్పుడు నగరజీవితం నా జీవితాన్ని సమూలంగా మార్చేసింది.

వరంగల్ పట్టణం నాకు నచ్చింది. ఏ.వి. హైస్కూల్‌లో చేరటం గొప్ప అవకాశం. ఆ స్కూళ్ళో మాకు పాఠాలు చెప్పిన టీచర్లందరూ ఎంతో గొప్ప వాళ్ళనిపించారు. ఆ స్కూలు హెడ్‌మాస్టర్ వై.కె. శాస్త్రిగారు క్రమశిక్షణకు చాలా ప్రాముఖ్యం ఇచ్చేవాడు. ఆయన చాలా గొప్ప టీచర్ కూడా. పదో తరగతిలో ఆయన మాకు చెప్పిన ఇంగ్లీషు పాఠాలు నాకిప్పటికీ గుర్తొస్తాయి. విశ్వనాథ సత్యనారాయణ గారి తమ్ముడు విశ్వనాథ వెంకటేశ్వర్లు ఆ స్కూల్లో తెలుగు బోధించే ఉపాధ్యాయుడుగా పనిచేస్తుండేవారు. నా మొదటి సాహిత్య గురువు వీరే! వెంకటేశ్వర్లు గారు మాకు 8,9,10 తరగతుల్లో తెలుగు పాఠాలు చెప్పారు. పాఠ్యపుస్తకాల్లో ఉన్న విషయాలే కాకుండా సాహిత్యానికి సంబంధించిన అనేక విషయాలు ఆయన క్లాసులో చెబుతుండేవాడు. ముఖ్యంగా వారి అన్నగార్ని గురించి ఆయన చెప్పిన ఎన్నో ఆసక్తికరమైన కథనాలు నన్నెంతో ముగ్ధుణ్ణి చేస్తుండేవి. "వేయి పడగలు" నవలని విశ్వనాథ సత్యనారాయణ గారు డిక్టేట్ చేస్తోంటే తను రాశానని, ఆ బృహన్నవలను 28 రోజుల్లో పూర్తి చేశామని వెంకటేశ్వర్లు గారు చెప్పినప్పుడు నేనెంతో ప్రభావితేణ్ణయ్యాను. నేనూ అలాంటి నవలొకటి రాయాలని కలలుగనటం మొదలెట్టాను. నేను 8వ తరగతిలో చేరిన నెల రోజుల తర్వాత విశ్వనాథ వెంకటేశ్వర్లు గారు మొదటి నెలవారీ పరీక్ష పెట్టారు. ఆ పరీక్షలో నేనొక్కన్నే ప్యాసయ్యాను. అప్పట్నించి ఆయనకు నామీద ప్రత్యేకమైన శ్రద్ధ యేర్పడింది. నేను ధైర్యం చేసి ఆయనకు నేను రాసిన కొన్ని చిన్న చిన్న కథల్ని చూపించాను. వాటి నాయన చదివి "బావున్నాయిరా! నువ్వు రాయటం మీదనే నీ శక్తినంతా కేంద్రీకరిస్తే, మంచి రచయితవవుతావురా!" అన్నాడు. నాలోని రచయితను గుర్తించి ప్రోత్సహించిన మొదటి గొప్పవ్యక్తి విశ్వనాథ వెంకటేశ్వర్లుగారే.

ఆ రోజుల్లో ఏ.వి. హైస్కూలు నుండి ఒక లిఖిత మాసపత్రికను తీసుకురావాలని నిర్ణయించినప్పుడు వెంకటేశ్వర్లుగారు నన్నా పత్రికకు ఎడిటర్ని చేశారు. అలా నాలోని సృజనాత్మకతకు పదును పెట్టిన మొదటి వ్యక్తి వెంకటేశ్వర్లు గారే.

వరంగల్‌లో నాకు బాగా నచ్చినవి అక్కడున్న లైబ్రరీలు.

నేను చదువుకుంటున్న ఏ.వి. హైస్కూలుకు వెళ్ళే దార్లోనే ఒక లైబ్రరీ ఉండేది.

స్కూలు అయిపోగానే నేను వెళ్ళి ఆ లైబ్రరీలో కూర్చొనేవాణ్ణి. ఆ లైబ్రరీకొచ్చే పత్రికలన్నింటినీ చదివేవాడిని. ఆంధ్రపత్రిక, భారతి, ఆంధ్రప్రభ, ఫిల్మ్‌ఫేర్, ది హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మొదలైన పత్రికల్ని చదువుతుండేవాడిని. 'ఫిల్మ్‌ఫేర్' అనే పక్షపత్రికను మొత్తం చదివేవాడిని. అందుక్కారణం నాకు సినిమాల మీదున్న ఇంటరెస్ట్. 'ఫిల్మ్‌ఫేర్' ది హిందూ' లాంటి పత్రికలు చదవటం వల్లనే నాకు ఇంగ్లీషులో మంచి మార్కులొస్తుండేవి.

లైబ్రరీలు తర్వాత వరంగల్‌లో నన్ను బాగా ఆకర్షించినవి సినిమాలు. సినిమాలు చూడటం, సినిమాలను గూర్చి 'ఫిల్మ్‌ఫేర్', కినిమాలాంటి పత్రికల్లో చదవటం, మిత్రులతో సినిమాలను గూర్చి చర్చించటం అలవరచుకున్నాను. ఓ సినిమా చూసినప్పుడు ఆ సినిమాలోని కథను జాగ్రత్తగా పరిశీలించేవాడిన. ఆ సినిమా కథను నేనైతే ఎలా రాసేవాడినో ఆలోచించేవాడిని. ఆ కథలో జరిగిన కొన్ని సంఘటనలు నిజజీవితంలో జరగటానికి అవకాశం ఉందా? అని ఆలోచించేవాడిని. నటీనటుల నటన సహజంగా ఉందా? లేక కృతకంగా ఉందా? అని మిత్రులతో చర్చించేవాడిని. ఆ రోజుల్లో సినిమాల్లో నటునిగానో, కథా రచయితగానో, దర్శకునిగానో చేరాలని సీరియస్‌గా ఆలోచిస్తుండేవాడిని. నేను అందంగా ఉంటానని, నువ్వు సినిమాల్లో చేరితే మంచి భవిష్యత్తు ఉంటుందని నా మిత్రులు కొందరు అంటుండేవాళ్ళు.

ఆ రోజుల్లో డిటెక్టివ్ సాహిత్యం విరివిగా వెలువడ్తుండేది. పాన్ షాపుల్లో డిటెక్టివ్ పుస్తకాల్ని అద్దెకిస్తుండేవాళ్ళు. రోజుకు అణాకో, రెండణాలకో ఒక పుస్తకాన్నిస్తుండేవాళ్ళు. ఇది తెలియగానే ఆ పుస్తకాల్ని తెచ్చుకొని చదివేస్తుండేవాడిని. అలా ఆ మూడేళ్ళలో – 1954 నుండి 1957 వరకు – కొన్ని వందల డిటెక్టివ్ నవలల్ని చదివేశాను. నాకూ అలాంటి డిటెక్టివ్ నవలలు రాయాలనిపించేది. ఇలా టెక్ట్స్ బుక్స్ కంటె వేరే పుస్తకాలు, మాగజైన్స్, దినపత్రికలు తెగ చదవటం అలవాటు చేసుకున్నాను. పాఠ్య పుస్తకాల్ని ఒకసారి చదివితే సరిపోయేది. అలాగే క్లాసుల్లో టీచర్లు చెప్పే పాఠాలు కూడా ఎప్పుడూ గుర్తిండిపోయేవి. ఈ కారణాల వల్ల పరీక్షలు రాయడం, మంచి మార్కులు తెచ్చుకోవడం నాకెప్పుడూ సమస్య కాలేదు.

త్వరలోనే నాకు వరంగల్‌లో చాలామందితో స్నేహం యేర్పడింది. నేను మాట్లాడే పద్ధతి – ప్రతి విషయాన్ని విశ్లేషణాత్మకంగా వివరించే పద్ధతి – నాకు చాలామంది మిత్రుల్ని తెచ్చి పెట్టింది. ఓ పుస్తకాన్ని గూర్చిగానీ, ఓ సినిమాను గూర్చి గానీ, ఓ

వార్తను గూర్చి గానీ, ఓ సంఘటనను గూర్చిగానీ నేనెంతో గాఢంగా ఫీలయి, ఎంతో ఆవేశపు సాంద్రతతో చెబుతుండేవాడిని. అలాగే నా క్లాస్‌మేట్స్ కొందరు నాతో పాఠాలు చెప్పించుకునేవాళ్ళు. మన టీచర్స్ కంటే నువ్వే బాగా చెబుతావని అంటుండేవాళ్ళు.

నేనుంటున్న గది, ఆ గదిలో వంట చేసుకోవటం – ఇదొక్కటే వరంగల్లులో నన్ను వేధించిన సమస్య. ఇదొక్కటి తప్ప, వరంగల్‌లోని మిగతా అన్ని అవకాశాల్ని చేజిక్కించుకొని నేను ఆనందించాను.

1957లో నేను ఏ.వి. హైస్కూలు నుండి పదో తరగతి (హెచ్.ఎస్.సీ) ఇంచుమించు ఫస్టు క్లాసు మార్కులతో ప్యాసయ్యాను.

నా చదువు విషయంలో మా నాయనగారు ఎప్పుడూ ఓ మాట అంటుండేవాడు. "మావాడిని పదో తరగతి వరకు మాత్రమే చదివిస్తాను... ఆ తర్వాత ఉద్యోగం చేయిస్తాను" అంటుండేవాడు. ఆ రోజుల్లో పదో తరగతి ప్యాసయితే చాలు, యేదన్నా ఉద్యోగం చేసుకొమ్మని చెప్పటం మొదలెట్టాడు. నాకేమో ఇంకా చదువాలని – కాలేజిలో చేరాలని! నా క్లాస్‌మేట్స్‌లో కొందరు కాలేజిలో చేరారు. నేనూ చేర్తానని అనుకున్నారు. కానీ ఇక చదివించనని మా నాయనగారు భీష్మించుకున్నారు. మా ఆర్థిక పరిస్థితి కూడా బాగాలేదు. వర్షాలు కురవక – వరసగా రెండు మూడేళ్ళు కరవు పరిస్థితులేర్పడ్డాయి. "నిన్ను కాలేజికి పంపించి చదివించే ఆర్థిక స్తోమత నాకు లేద"ని మా నాయనగారు పదేపదే చెప్పారు. దాంతో ఆయన మీద చదివించమని వొత్తిడి తెచ్చి ప్రయోజనం లేదని నిర్ణయించుకున్నాను. మా అమ్మకూడా "నిన్ను చదివించాలని ఎంతనుకున్నా లాభం లేదు – పరిస్థితి బాగా లేద"ని చెప్పేసింది. దాంతో పదో తరగతి తర్వాత నా చదువు ఆగిపోయింది.

మాది చాలా పెద్ద కుటుంబం. నాకో తమ్ముడు, నల్గురు చెల్లెళ్ళు – ఇంత పెద్ద కుటుంబాన్ని పోషించడం మా నాయనగార్కి పెద్ద సమస్య అవుతుండేది. ఆయనకున్నవన్నీ మెట్టభూములే. పెద్దగా పంటలు పండేవి కావు. (మా తమ్ముడు ఎం.కామ్ చదివి లెక్చరర్ అయ్యాడు. నల్గురు చెల్లెళ్ళలో చిన్న చెల్లెళ్ళిద్దర్ని బాగా చదివించాం. వాళ్ళు స్కూలు టీచర్స్‌గా పనిచేస్తూ ఆర్థికంగా వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిల్చోగల్గారు. మరో ఇద్దరు చెల్లెళ్ళు గృహిణిలుగా జీవితాన్ని గడుపుతున్నారు.)

ఆ రోజుల్లో టీచర్ ఉద్యోగం కోసం బేసిక్ ట్రెయినింగ్ చెయ్యాలి. కానీ ఆ ట్రెయినింగ్ కోసం లాస్ట్‌డేట్ అయిపోయాక అప్లై చెయ్యడం వల్ల నా అప్లికేషన్ను తిరస్కరించారు.

ఆ తర్వాత "విలేజ్ లెవల్ వర్కర్" అనే ఉద్యోగం కోసం అప్లైచేస్తే ఆ ఉద్యోగం దొరికింది. అయితే ఆ ఉద్యోగంలో చేరడానికి ముందు 18 నెలల పాటు హైదరాబాద్ దగ్గరి రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రంలో ట్రెయినింగ్ తీసుకోవాలి. ఆ ట్రెయినింగ్ తీసుకోవటం కోసం జనవరి, 1958లో రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ క్షేత్రంలో చేరాను. చాలా కఠినమైన శిక్షణ అది. వ్యవసాయానికి సంబంధించిన పనులన్నీ – నాగలి దున్నటం, నాట్లు వేయటం, కాలువలు తవ్వటం – ఇలాంటి పనులన్నీ చెయ్యాలి. మాది వ్యవసాయ కుటుంబమే అయినా ఈ పనులన్నీ నేనెప్పుడూ చెయ్యలేదు. ట్రెయినింగ్‌లో జాయినయిన మూడో రోజు గడ్డపారతో తవ్వుతోంటే అది కాలికి తగిలి పెద్ద గాయమైంది. రక్తం కారింది. వెంటనే కళ్ళల్లోంచి కన్నీళ్ళు కూడా కారాయి. ఆ క్షణంలో నిర్ణయించుకున్నాను – ఈ ట్రెయినింగ్‌ను పూర్తిచెయ్యటం నాతో కాదని, వెంటనే అక్కడ్నించి వెళ్ళిపోవాలని.

నా జీవితంలో ఆ క్షణంలో తీసుకున్న ఆ నిర్ణయం ఒక టర్నింగ్ పాయింట్. ఆ క్షణంలో నేనా నిర్ణయం తీసుకొని ఉండకపోతే నా జీవితం మరోలా ఉండేది. బహుశాః నేను రచయితను అయ్యుండేవాణ్ణికాదు ఏ పల్లెటూళ్ళలోనో వి.ఎల్. డబ్ల్యూగా ఉండిపోయేవాడిని.

దొరికిన ఉద్యోగాన్ని వదిలేసి ఇంటికెళ్ళిపోతే మా నాయనగారు క్షమించరని తెలుసు. ఆగ్రహోదగ్రుడవుతాడని తెలుసు. అయినా నేను నా నిర్ణయాన్ని మార్చుకోలేదు. ట్రెయినింగ్‌లో జాయినయిన నాల్గోరోజు (జనవరి 4, 1958) రాజేంద్రనగర్‌కు గుడ్‌బై చెప్పేసి మా ఊరికి వెళ్ళిపోయాను.

మా నాయనగార్కి చాలా కోపం వచ్చింది. కానీ అదెంత కఠినమైన శిక్షణో, ఆ మూడు రోజులు అక్కడవాళ్ళు నాతో యేమేం పనులు చేయించారో చెప్పగానే మా అమ్మ యేడ్చేసింది. అక్కడ్నిండి వచ్చేసి మంచి పని చేశావంది. "వాడినేమన్నా అంటే మీ మర్యాద దక్కద"ని మా నాయనకు చెప్పేసింది. దాంతో ఆయన నోరుమూశాడు. ఇంకేదన్నా ఉద్యోగం చూసుకొమ్మని చెప్పాడు. కానీ ఆ సంవత్సరం జూన్‌లో కాలేజీలు తెరవగానే నేను వెళ్ళి – మా నాయనగారు ఒప్పుకోకపోయినా, ఒప్పుకున్నా కాలేజిలో చేరాలని దృఢంగా నిర్ణయించుకున్నాను.

మా నాయనగారు నేను కాలేజిలో చేర్తానంటే చాల కోపానికొచ్చాడు. "నేనైతే

ఒక్కపైసా కూడా ఇవ్వను" అన్నాడు. ఆయన ఆజ్ఞను ధిక్కరించి నేను వెళ్ళి వరంగల్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో పి.యూ.సీ.లో చేరిపోయాను. నేను వెళ్తోంటే, మా అమ్మ ఓ పదిరూపాయలు మాత్రం చేతిలో పెట్టింది. ఆ పది రూపాయలతో జూన్, 1958లో ఒక సంవత్సరం బ్రేక్ తర్వాత మళ్ళీ చదువు కొనసాగటం -- నా జీవితంలో మరో ముఖ్యఘట్టం.

హైస్కూలుకు, కాలేజికి చాలా వ్యత్యాసం ఉంటుంది. ఒక విశాల ప్రపంచంలో ప్రవేశించినట్టవుతుంది. ఎటు చూసినా మేధావులే మేధావులు కాలేజిలో చదువుకునే విద్యార్థులు, పాఠాలు చెప్పే లెక్చరర్లు నా చైతన్యపరిధిని విస్తరింపజేశారు. ఆనాటి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజిలో చాలా చక్కటి సాహిత్య వాతావరణం ఉండేది. త్వరలోనే సాహిత్యాన్ని సీరియస్‌గా చదివే ఎందరో మిత్రులు యేర్పడ్డారు. ఆ కాలేజిలో అప్పుడు తెలుగు అధ్యాపకులుగా పని చేస్తున్న ఇరివెంటి కృష్ణమూర్తి, జీ.వి. సుబ్రహ్మణ్యం, వేటూరి ఆనందమూర్తిల పాఠాలు వింటోంటే మరో ప్రపంచంలో విహరిస్తున్నట్టుగా ఉండేది. ఇంతకాలం డిటెక్టివ్ సాహిత్యాన్ని మాత్రమే చదివిన నాకు చలం, బుచ్చిబాబు, శ్రీశ్రీ, కొడవటిగంటి, గోపీచంద్ లాంటి రచయితల రచనల్ని చదివే అవకాశం లభించింది. అప్పుడే వరవరరావు, గీట్ల జనార్ధన్‌రెడ్డి, సి.రాఘవాచారి, గంట రామారెడ్డి, తిరుపతయ్య, శివకుమార్, సత్యనారాయణరెడ్డి (సత్తెన్న) లాంటి ఆ కాలేజిలో చదువుతున్న గొప్ప సాహిత్యాభిరుచి ఉన్న విద్యార్థులతో స్నేహం యేర్పడింది. వీళ్ళద్వారా సాహిత్యానికి సంబంధించిన ఎన్నో కొత్త విషయాల్ని తెలుసుకున్నాను. కాలేజి లైబ్రరీలో ఉన్న పుస్తకాలనీ చదివెయ్యడం, వాటిని గూర్చి మిత్రులతో చర్చించటం – అలా అనుక్షణం సాహిత్యంలో జీవించటం అలవరచుకున్నాను. కాలేజిలో చేరిన మొదటి సంవత్సరంలోనే ఒక అద్భుతం జరిగింది.

ఆ రోజుల్లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజిలో ప్రతి సంవత్సరం సాహిత్య పోటీలు జరుగుతుండేవి. కథానిక, వ్యాసం, కవిత్వం, లేఖారచన– ఈ ప్రక్రియల్లో పోటీలు జరిగేవి. ఆ పోటీల్లో పాల్గొనాలనిపించింది. అంతకు ముందే నేనో కథ రాశాను. దాన్ని ఎవరికైనా చూపించాలంటే భయమేసేది – పిచ్చి కథ అని నవ్వుతారేమోనని.

ఒక వాస్తవ సంఘటన ఆధారంగా నేనాకథ రాశాను. ఎక్కడో రాసి పడేసిన ఆ కథను బయటకు తీసి మరోసారి కొన్ని మార్పులు చేసి రాసి, ఫెయిర్ చేసి తెలుగు అసోసియేషన్ సెక్రటరీకిచ్చేశాను. ఆ కథను ప్రైజ్ వస్తుందని నేననుకోలేదు. చాలా

మంది సీనియర్ స్టూడెంట్స్ ఆ పోటీలో పాల్గొంటున్నారని, వాళ్ళకే ప్రైజులొస్తాయని, నీలాంటి జూనియర్‌కు రాదని నా మిత్రుడొకాయన చెప్పాడు. నిజమే అనుకొని నేను పోటీకి కథను ఇచ్చిన విషయమే మరచిపోయాను.

నెలరోజుల తర్వాత తెలుగు అసోసియేషన్ సెక్రటరీ కలిసి "నీ కథకు సెకండ్ ప్రైజ్ వచ్చింద"ని చెప్పినపుడు ఎంతటి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యానో మాటల్లో చెప్పలేను. ఆ పోటీకి జడ్జిగా పనిచేసిన జీ.వి. సుబ్రహ్మణ్యంగారు నన్ను పిలిచి "నీ కథ బావుందోయ్ – కథలు రాస్తుండు. నీకు మంచి భవిష్యత్తు ఉంటుంది." అన్నాడు. ఆ కథ చదివిన ఇరివెంటి కృష్ణమూర్తిగారు కూడా నన్ను పిలిచి "ఇదొక్కటేనా? ఇంకా యేమైనా రాశావా? నీ కథ చదువుతోంటే ఎంతో అనుభవమున్న రచయిత రాసిన కథను చదువుతున్నట్టనిపించింది" అన్నాడు. నా ఆనందానికి అవధుల్లేవు. ఆ తర్వాత ఈ కథను కథ పేరు "చితికిన జీవితం"– కాలేజి నుండి ప్రతి సంవత్సరం వెలువడే మాగజైన్‌లో ప్రచురించారు. ఆ కథను చదివిన ఆ కాలేజి విద్యార్థులెందరో "కథ చాలా బావుంది. కథలాలేదు. నిజంగా జరిగినట్టే ఉంది" అన్నారు. "ఫస్ట్ ప్రైజ్ వచ్చిన కథ కంటె ఈ సెకండ్‌ప్రైజ్‌ను గెల్చుకున్న కథ బావుందన్నారు. ఈ సంఘటన నాలో ఒక రచయిత ఉన్నాడన్న ప్రగాఢ నమ్మకాన్ని సృష్టించింది. ఆ నమ్మకాన్ని దృఢసంకల్పాన్ని కూడా నాలో కల్గించింది.

కళాశాల జరుపుకునే వార్షికోత్సవంలో బహుమతి ప్రదానం జరిగింది. అప్పటి ఉస్మానియా యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ డీ. ఎస్. రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీల్లో బహుమతుల్ని గెల్చిన విద్యార్థులకు వాటిని ప్రదానం చేశాడు. నేను రాసిన కథకు బహుమతిగా రెండు పుస్తకాలిచ్చారు. ఒకటి: చలం మ్యూజింగ్స్. రెండవది: బుచ్చిబాబు కథలు – ఈ రెండు పుస్తకాల ద్వారా నేను చలాన్ని, బుచ్చిబాబును తెలుసుకున్నాడు. ఈ ఇద్దరు రచయితలు నన్ను ఎంతో ప్రభావితం చేశారు. ఆరోజుల్లో ఆ కాలేజిలో పనిచేస్తున్న మరో అధ్యాపకుడు వేటూరి ఆనందమూర్తి గారు మాకు "ఆముక్తమాల్యద"ను బోధించాడు. ఒక సెమినార్‌లో నేను "ఆముక్తమాల్యద" మీద సమర్పించిన వ్యాసాన్ని ఆయన ఎంతో ప్రశంసించాడు. దాంతో నేను విమర్శకుడిగా కూడా రాణించగలనన్న నమ్మకం కల్గింది.

సరిగ్గా ఆరోజుల్లోనే వరంగల్ నగరంలో మిత్రమండలి అనే ఒక సాహిత్య సంస్థను కాళోజీ సోదరులు స్థాపించారు. ప్రజాకవి కాళోజి అన్నగారైన కాళోజీ రామేశ్వరరావు

గారి మానసపుత్రికే ఈ "మిత్రమండలి". తమతమ రచనల్ని చదివి వినిపించుకోవడం, తర్వాత ఆ రచనల్లోని మంచి చెడ్డల్ని గూర్చి చర్చించుకోవడం - ఇదీ మిత్రమండలిలో జరిగే ముఖ్య కార్యక్రమం. దీనొకొక కన్వీనర్ మాత్రమే ఉంటాడు. సభ్యత్వం అంటూ, సభ్యత్వ రుసుం అంటూ యేమీ ఉండవు. సాహిత్య మీద ఇంటరెస్ట్ ఉన్నవాళ్ళెవరైనా ఈ సమావేశాలకు రావచ్చు. తమ రచనల్ని వినిపించవచ్చు. లేదా చర్చల్లో పాల్గొనవచ్చు. కాళోజీ సోదరులతో బాటు పీజీలాలె, ఇరివెంటి కృష్ణమూర్తి, జీ.వి. సుబ్రహ్మణ్యం, వేటూరి ఆనందమూర్తి, ఎం.ఆర్. సత్యనారాయణ, అనుములు కృష్ణమూర్తి, కేతవరపు రామకోటిశాస్త్రి, సంపత్కుమార, సుప్రసన్న, పేర్వారం జగన్నాథం, పొట్లపల్లి రామారావులాంటి ఎందరో మహానుభావులు మిత్రమండలి సమావేశాలకు హాజరవుతుండేవాళ్ళు. బాసిరి సాంబశివరావు అనే మిత్రుడు నన్ను మొట్ట మొదటిసారి ఈ మిత్రమండలి సమావేశాలకు తీసికెళ్ళాడు.

వరవరరావు మిత్రమండలికి మొదటి కన్వీనర్. 1959తో ఎం.ఏ. చదవటానికి వరవరరావు హైదరాబాద్ వెళ్ళాల్సి వచ్చినపుడు సాహిత్య మీద నాకున్న అభినివేశాన్ని గమనించిన వరవరరావు మిత్రమండలికి రెండవ కన్వీనర్‌గా నన్ను నియమించాడు. మిత్రమండలికి కన్వీనర్‌గా పనిచేస్తున్న వారెవరైనా వ్యక్తిగత కారణాల వల్లనో, ఇతర కారణాల వల్లనో ఆ బాధ్యతను వదులుకోవాల్సి వచ్చినప్పుడు తమ తర్వాతి కన్వీనర్‌ను వారే నామినేట్ చేసి వెళ్ళాలని కాళోజి రామేశ్వర్‌రావు నిర్ణయించాడు. అందుకే వరవరరావు నన్ను కన్వీనర్‌ను చేసి హైదరాబాద్ వెళ్ళిపోయాడు. నేను 1959 నుండి 1962 వరకు మిత్రమండలి కన్వీనర్‌గా పనిచేశాను. ఈ సమయంలో ఎందరో రచయితలను కలుసుకునే అవకాశం లభించింది. ఎన్నో సాహిత్య సభల్ని, సమావేశాల్ని నిర్వహించాను. ఎన్నో సాహిత్య పాఠాల్ని నేర్చుకున్నాను. మిత్రమండలిలో నేర్చుకొన్న ఈ పాఠాలు నన్నో రచయితగా తీర్చి దిద్దటానికి ఎంతో దోహదం చేశాయి.

వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజిలో నాల్గు సంవత్సరాలు (1958-1962) నాల్గు క్షణాల్లా గడిచిపోయాయి. ఆ కాలేజిలో ప్రతి సంవత్సరం జరిగే సాహిత్య పోటీలకు కథలు, వ్యాసాలు రాస్తుండేవాడిన. బహుమతుల్ని గెల్చుకుంటుండేవాడిని. ఒక సంవత్సరం ఆ కాలేజినుండి వెలువడే మాగజైన్ గొప్ప సాహిత్య సంచికగా వెలువడిందని అందరూ ప్రశంసించారు.

బి.ఏ. చదువుతున్నప్పుడు అడివి బాపిరాజు నవల "నారాయణరావు" మాకు నాన్‌డీటెయిల్డ్‌గా ఉండేది. ఆ నవలతో బాటు బాపిరాజు రాసిన ఇతర నవలలన్నింటినీ చదివేసి "అడివి బాపిరాజు నవలలు" పేరుతో ఒక సుదీర్ఘమైన విమర్శనాత్మకమైన వ్యాసం రాశాను. వ్యాసాల పోటీలో ఈ వ్యాసానికి ప్రథమ బహుమతి లభించింది. ఈ వ్యాసాన్ని చదివిని మా గురువుగారు ఇరివెంటి కృష్ణమూర్తిగారు "ఇంత చిన్న వయస్సులో ఇన్ని పెద్ద నవలలు చదివి ఇంత అద్భుతమైన వ్యాసం రాశావంటే నువ్వు సామాన్యుడివి కాదోయ్" అన్నాడు. ఈ వ్యాసం ఆ సంవత్సరం వెలువడిన కాలేజి మేగజైన్‌లో ప్రచురించబడింది. ఈ వ్యాసాన్ని చదివిన వాళ్ళందరూ ఈ రచయితకు గొప్ప భవిష్యత్తుందని ప్రశంసించారు.

ఈ నాలుగేళ్లలో ఆర్థికపరమైన ఇబ్బందులు, వంట చేసుకోవడంలో ఎదురైన ఇబ్బందులు తప్ప నేను మరే రకమైన ఇబ్బందుల్ని ఎదురుకోలేదు. తన ఇష్టానికి వ్యతిరేకంగా నేను కాలేజిలో చేరానని కోపగించుకున్న మా నాయనగారు నాకు డబ్బులిచ్చేవాడు కాదు. ఎప్పుడైనా మా అమ్మ బలవంతం మీద ఇచ్చినా చాలా కోపంగా ఇచ్చేవాడు. నాకొస్తున్న మంచి మార్కుల కారణంగా నాకు కాలేజి నుండి "బర్సరీ" అని – స్కాలర్‌షిప్ సంవత్సరానికి రెండు సార్లు 75రూ. చొప్పున ఇస్తుండేవాళ్ళు. ఈ 'బర్సరీ'యే నేను చదువుకోవడానికి తోడ్పడింది.

1962లో నేను బి.ఏ. పూర్తిచేసి హైదరాబాద్‌కు వెళ్ళి ఉస్మానియాలో ఎం.ఏ.లో చేరాను. ఎం.ఏ. తెలుగుతో గానీ, రాజనీతి శాస్త్రంతో గాని చెయ్యాలనుకున్నాను. అయితే వరవరరావు, గంట రామన్న – నా ఈ ఇద్దరు మిత్రులు ఎకనామిక్స్‌తో చేస్తే త్వరగా ఉద్యోగం దొరుకుందని సలహా ఇచ్చి నాతో ఎం.ఏ. (ఎకనామిక్స్) చదివించారు.

నేను ఎం.ఏ. చదవటం కూడా మా నాయన గార్కి ఇష్టంలేదు. బి.ఏ. తర్వాతనైనా యేదన్నా ఉద్యోగం చూసుకోమని బలవంతం చేశాడు. నేను ఎం.ఏ. చదివితీర్తానని పట్టుపట్టాను. బి.ఏ. పూర్తిచేశాక – 1962, మేలో మా మేనమామ కూతురుతో నాకు వివాహమైంది. ఎం.ఏ. ఒక సంవత్సరం చదవటానికయ్యే ఖర్చును భరిస్తానని మా మేనమామగారు అంగీకరించటంతో ఇంకో సంవత్సరపు ఖర్చును తను భరిస్తానని మా నాయనగార్కి అంగీకరించక తప్పలేదు. ఎం.ఏ. చదివితే మా వాడికి చాలా పెద్ద ఉద్యోగం దొరుకుతుందని ఆయన అనుకున్నాడు. అలా నా జీవితంలో మరో ముఖ్యమైన ఘట్టం ప్రారంభమైంది.

ఎం.ఏ. చదవటానికి హైదరాబాద్‌లాంటి మహానగరానికి వెళ్ళటం, ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కాలేజిలో చదవటం, యూనివర్శిటీ హాస్టల్స్‌లో ఉండటం నా జీవితంలో ఒక అద్భుతమైన అనుభవం.

ఇంతకాలం – అంటే 1952 నుండి 1962 వరకు స్వంతంగా వంట చేసుకుంటూ, ఎలాంటి సౌకర్యాలు లేని చిన్న అద్దె రూముల్లో ఉంటూ చదువుకున్న నేను, అన్ని సౌకర్యాలు పుష్కలంగా ఉన్న అద్భుత సౌందర్యంతో తళతళ మెరిసే ఆర్ట్స్ కాలేజిలో చదవటం, రకరకాల మనస్తత్వాలున్న వందల మంది విద్యార్థులతో సహజీవనం చెయ్యడం – ఇవన్నీ నన్ను చాలా మర్చేశాయి.

హైదరాబాద్ నగరం నన్ను అమితంగా ఆకర్షించింది. కళ్ళకు మిరిమిట్లు కొలిపించింది. ఆ నగరంలోని సొగసులు – ముఖ్యంగా సినిమాలు, హోటళ్ళు, స్నేహితులు, సౌకర్యాలు, ఆర్ట్స్ కాలేజిలోని ఆకర్షణలు నన్ను యే చదువుకోసమైతే నేనింతకాలం తపించానో ఆ చదువుకు దూరం చేశాయి. ఆర్ట్స్ కాలేజిలో మాకు ఎకనామిక్స్ పాఠాలు చెప్పే వాళ్ళు. ఉర్దూలో రాసుకున్న నోట్స్ ముందరపెట్టుకొని అతి కష్టంగా దాన్ని ఇంగ్లీషులోకి అనువాదం చేస్తూ మాకు పాఠాలు చెప్పేవాళ్ళు. అబ్దుల్ ఖాదర్ అన్న ఒక ప్రొఫెసర్‌గారైతే ఓ పుస్తకం తెచ్చి దాన్లోని యేదో ఒక చాప్టర్ చదివేసి వెళ్ళిపోతుండేవాడు. ఇలాంటి లెక్చరర్స్ పాఠాలు చెబుతోంటే నాకు క్లాసుల్లో కూర్చోవాలనిపించేది కాదు.

ఆర్ట్స్ కాలేజిలో ఎకనామిక్స్ ఎం.ఏ. చదివే విద్యార్థులు మరో సమస్యను ఎదురుకోవలసి వచ్చేది. అదేమిటంటే వారంలో మొదటి మూడు రోజులు మాకు ఆర్ట్స్ కాలేజిలో క్లాసులుండేవి. తర్వాత మూడు రోజులు నిజాం కాలేజిలో క్లాసులుండేవి. యూనివర్శిటీ హాస్టల్లో ఉంటున్న మేం రెండు సిటీ బస్సులు మారి నిజాం కాలేజికి వెళ్ళాల్సివచ్చేది. అంత కష్టపడి నిజాం కాలేజికి వెళ్ళాల్సివచ్చేది. అంత కష్టపడి నిజాం కాలేజికి వెళ్తే మాకు క్లాసు తీసుకోవాల్సిన మేడమ్ జస్వాలా గారు కాలేజికి వచ్చేదేకాదు. ఎవరో వచ్చి "ఈ రోజు మేడమ్ రావడం లేదు. మీరు వెళ్ళిపొండి" అని చెప్పేవారు. దాంతో నిజాం కాలేజి నుండి ఉస్మానియా క్యాంపసుకు కాళ్ళీడ్చుకుంటూ వచ్చేవాళ్ళం.

ఈ కారణాల వల్ల నాకు చదువు మీద ఇంటరెస్ట్ పూర్తిగా పోయింది. బోల్డు మంది ఫ్రెండ్స్ ఉండేవాళ్ళు. వాళ్ళతో సిటీ అంతా తిరిగేవాణ్ణి. సిటీకి వెళ్ళి సినిమాలు చూసేవాణ్ణి. ఫ్రెండ్స్‌లో ఎవరో ఒకరి దగ్గర డబ్బుండేది. వాళ్ళే సినిమాలకు, హోటళ్ళకు

తీసికెళ్తుండేవాళ్ళు. చదువుకోకుండా ఇలా ఫ్రెండ్స్‌తో తిరుగుతూ, సినిమాలు చూస్తూ టైమంతా వేస్ట్ చేస్తున్నామని, మనమీద ఎన్నో ఆశలు పెట్టుకున్న మన తల్లిదండ్రుల్ని మోసం చేస్తున్నామన్న అపరాధభావన హృదయాన్ని తొలిచేస్తుండేది.

ఆర్ట్స్ కాలేజిలో ఉండే వాతావరణం బోయ్స్ అండ్ గర్ల్స్ కలిసి ఫ్రీగా తిరుగుతుండటం, గర్ల్స్‌ని గురించి బోయ్స్ చేసె కామెంట్స్, ఎప్పుడూ హాస్టల్స్‌లో ఉండే బోయ్స్ సెక్స్‌ను గురించే మాట్లాడుకోవడం, హాస్టల్స్‌లో ఉండే బాయ్స్‌లో కొందరు హోమో సెక్సువల్స్ ఉండటం – అలాంటి ఒక హోమో సెక్సువల్ నాతో ఫ్రెండ్‌షిప్ చెయ్యడం – ఇవన్నీ నన్ను తీవ్రంగా కలచి వేశాయి. నా క్లాస్‌మేట్స్‌లో చాలా మంది మా ప్రొఫెసర్‌కు యేదోలా దగ్గరైతే తప్ప మంచి మార్కులు రావని చెబుతుండేవారు. "నువ్వెప్పుడూ క్లాసుకు రావు. నువ్వు యే ప్రొఫెసర్ దృష్టిలో కూడా పడలేదు. నువ్వు ఎం.ఏ. ఎలా ప్యాసవుతావు" అని అడుగుతుండేవాళ్ళు. నాకు ఇంటినుండి సరిపోయేటన్ని డబ్బులొచ్చేవికావు. ఎప్పుడన్న వస్తే అవి క్షణాల్లో అయిపోతుండేవి. మెస్‌బిల్ కట్టలేకపోయేవాణ్ణి వీటితోబాటు మనస్సులో ఎప్పుడూ తీవ్రమైన అలజడి. ఆ వయస్సులో ప్రతి యువకుడిలో తలెత్తే లైంగిక అలజడి – సెక్సువల్ రెస్ట్‌లెస్‌నెస్. ఆరోజుల్లో విద్యార్థుల్లో రెండు పరస్పర విరుద్ధమైన భావజాలాలుండేవి. ఇవన్నీ నన్ను చాలా డిస్టర్బ్ చేస్తుండేవి.

చాలా మందిలో సోషలిస్టు లేక కమ్యూనిస్టు భావాలు – వీళ్ళను లెఫ్టిస్టులు అనేవాళ్ళు.

రెండవ భావజాలాన్ని రైటిస్టు భావజాలం అనేవాళ్ళు. వీళ్ళు జాతీయ వాదులమని చెప్పుకునేవాళ్ళు. కమ్యూనిజం మన భూమ్మీద పుట్టింది కాదనీ, విదేశాల నుండి అరువు తెచ్చుకున్నామని, అది మన గడ్డమీద నిలువదని, మన ప్రాచీన వారసత్వమే మనల్ని రక్షిస్తుందని వీళ్ళంటూ ఉండేవాళ్ళు.

మేం సోషలిస్టు విధానాలతో ప్రభావితులైనవాళ్ళం. మాకో పెద్ద గ్రూపుండేది. వరవరరావు, సి. రాఘవాచారి ఈ గ్రూపుకు నాయకులు. నేనూ ఈ గ్రూపుతో మమేకమయ్యాను. మరో గ్రూపు రైటిస్టులు – వీళ్ళెప్పుడూ కమ్యూనిస్టులను, నెహ్రూ విధానాలను దుయ్యబడ్తుండేవాళ్ళు. మాకూ, వీళ్ళకూ అప్పుడప్పుడు తీవ్రమైన వాగ్వాదాలు జరుగుతుండేవి. ఒకరిమీదొకరు చెయ్యిచేసుకునేంత వరకు వెళ్తుండేవాళ్ళం.

సాహిత్యంలో కూడా రెండు గ్రూపులు – మేమంతా శ్రీ శ్రీ, చలాల భావాలను నమ్మి వాటిని ఆచరించటానికి ప్రయత్నించేవాళ్ళం.

మరో గ్రూపు - విశ్వనాథ సత్యనారాయణను తలకెత్తుకునే గ్రూపు. వీళ్ళకూ, మాకు తరచుగా వాగ్యుద్ధాలు జరుగుతుండేవి.

ఇలాంటి వాతావరణంలో జీవిస్తున్న నాకు ఒకే రోజు నాకే రోజు జరిగిన మూడు నాల్గు సంఘటనలు తీవ్రంగా కలచివేశాయి. మెస్‌బిల్ చెల్లించలేదని, మెస్‌లో భోజనం దొరకదని మెస్ అధికారులు తెలియజేశారు. అదేరోజు టర్మ్‌ఫీజు చెల్లించలేదు కాబట్టి నీకు హాల్‌టికెట్ - పరీక్షలు రాయడానికి రాదన్నారు.

అదేరోజు - ఆర్ట్స్ కాలేజి బస్‌స్టాప్ దగ్గర కనిపించిన ఓ బిచ్చపుది ఎప్పుడో మా ఊర్లో జరిగిన ఓ పీడకల లాంటి సంఘటనను గుర్తు చేసింది. చాలా రోజుల క్రితం కాలేజి నుండి కొందరు విద్యార్థులం ఎక ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళినప్పుడు ఓ ముస్లిం అమ్మాయి నాకు చాలా దగ్గరగా వచ్చింది. ఆ ముస్లిం అమ్మాయి ఈరోజు ఆర్ట్స్ కాలేజిలో కనిపించి తను దుబాయికి వెళ్ళిపోతున్నానని చెప్పింది. ఇలా ఇన్ని సంఘటనలు ఒకేరోజు జరగటంతో - నా బుర్రలో ఒక ఐడియా ప్రవేశించింది- వీటన్నింటినీ చిత్రిస్తూ ఒక నవల రాయాలని. ఈ ఐడియా రెండు మూడేళ్ళు నా బుర్రలో నలిగాక అది "అంపశయ్య" నవలగా రూపొందింది.

ఎప్పుడూ క్లాసులు అటెండ్ చెయ్యని నేను, యే ప్రొఫెసర్ దృష్టిలో పడని నేను ఎం.ఏ. ప్యాసవుతానని నా క్లాస్‌మేట్స్ ఎవరూ అనుకోలేదు. పరీక్షలకు ముందు ఒక నెలరోజులు మాత్రం టెక్ట్స్ బుక్స్ చదివి ఎం.ఏ. ప్రీవియస్‌లో నేను ఇంచుమించు ఫస్ట్‌క్లాస్ మార్కులు తెచ్చుకున్నాను. నా క్లాస్‌మేట్స్ కొందరు నా మార్కులు చూసి షాకైపోయారు.

ఎం.ఏ. ఫైనల్లోనైనా రోజూ క్లాసులు అటెండ్ చేసి, ప్రొఫెసర్లను ఇంప్రెస్ చేసి ఫస్ట్‌క్లాసు తెచ్చుకొమ్మని నా మిత్రులు కొందరు చెప్పారు. ఎం.ఏ.లో ఫస్టుక్లాసు తెచుకుంటే నీకు వెంటనే యూనివర్శిటీలోనే లెక్చరర్ జాబ్ దొరుకుతందన్నారు. అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందన్నారు. కానీ నేను వాళ్ళ సలహాలను ఆచరణలో పెట్టలేకపోయాను.

ఎప్పుడూ ఫ్రెండ్స్‌తో సిటీ అంతా తిరగటం, సినిమాలు చూడటం, వరవరరావుతో కలిసి సిటీలో ఎక్కడ సాహిత్య సమావేశాలు జరిగినా వెళ్ళిపోవడం, నవలల్ని, మేగజైన్స్‌ని చదవటం, వాటిని గురించి చర్చించటం - యేదన్న కథకో, వ్యాసానికో మ్యాటర్ దొరికితే రాసెయ్యటం - ఇలా గడిపానేతప్ప ఎకనామిక్స్ పుస్తకాలు మాత్రం చదవలేదు. మళ్ళీ పరీక్షల ముందు ఒక నెలరోజులు కష్టపడి ఎం.ఏ. ఫైనల్ ఎగ్జామ్స్ కూడా రాసి హైయర్

సెకండ్‌క్లాసులో ప్యాసయ్యాను. "ఇంకొంచెం కష్టపడ్తే ఫస్ట్‌క్లాస్ వచ్చేది కదా" అన్నారు కొందరు మిత్రులు. (కేవలం 10 మార్కులతో ఫస్ట్‌క్లాస్ మిస్సయ్యాను).ఎం.ఏ. ప్యాసు కాగానే రెండు మూడు నెలల తర్వాత లెక్చరర్ ఉద్యోగం వచ్చేసింది.

ఎం.ఏ. చదవడం కోసం హైదరాబాద్‌లో ఉన్న ఈ రెండేళ్ళు ఒక విపరీతమైన మానసిక వైక్లబ్యానికి గురయ్యాను. మనమీద ఎన్నో ఆశలు పెట్టుకొని బతుకుతున్న మన తల్లిదండ్రులను మోసం చేస్తున్నానేమో అన్న అపరాధ భావన, ఆ వయస్సులో మనల్ని అనుక్షణం వేధించే సెక్సువల్ అన్‌రెస్ట్, ఎం.ఏ. ప్యాసు కాలేమోనన్న భయం, ప్యాసైనా ఉద్యోగం దొరకదేమోనన్న అనిశ్చితి, టెంపుల్స్ ఆఫ్ లెర్నింగ్‌గా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలు ఇంత దిగజారిపోతున్నాయేమిటన్న బాధ, దేశంలోని అభ్యుదయ శక్తులు – అంటే లెఫ్టిటిస్టులు, ఇలా ముక్కలు చెక్కలుగా విడిపోతున్నారేమిటన్న ఆందోళన, స్వతంత్రభారతంలో కులతత్త్వం, మతత్వం లాంటి సంకుచిత వ్యవస్థలు పూర్తిగా నిర్మూలించబడ్తాయనుకుంటే రోజు రోజుకు అవి బలపడ్తున్నాయేమిటన్న ఆవేదన, నా చుట్టూ ఉన్న విద్యార్థుల్లో కనిపించే కుసంస్కారాన్ని గమనించినప్పుడు కల్గే జుగుప్స ఇవన్నీ నన్ను చాలా కలచివేశాయి. ఎం.ఏ. చదువుతున్నప్పుడు ఒక రోజులో జరిగిన కొన్ని సంఘటనల్ని చిత్రించే నవల రాయాలనుకున్న ఐడియా నల్గొండలో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నప్పుడు బలోపేతమయ్యింది.

మొదట్నించి నేను ఆర్థికంగా నా కాళ్ళమీద నేను నిలబడగల్గే ఉద్యోగం సంపాదించుకున్నాక రాయడం మీద కేంద్రీకరించాలనీ నిర్ణయించుకున్నాను. సాహిత్యం అన్నం పెట్టదని తెలుసు. ఎం.ఏ. చదివి లెక్చరర్ ఉద్యోగం సంపాదించాలనుకున్నాను. ఎందుకంటే రచయితగా నిలబడటానికి ఈ ఉద్యోగమైతేనే సాధ్యపడ్తుందనుకున్నాను. మంచి లైబ్రరీ, మంచి లెక్చరర్ల కంపెనీ, రాసుకోవడానికి కావలసిన తీరిక – ఇవన్నీ లెక్చరర్ ఉద్యోగంలో ఉంటాయి. అందువల్ల నల్గొండలో లెక్చరర్ జాబ్ రాగానే వెళ్ళి జాయినయ్యాను. ఆవెంటనే రెండుమూడేళ్ళుగా నా మైండ్‌లో నలుగుతున్న ఒకరోజు యూనివర్శిటీ విద్యార్థి జీవితాన్ని చిత్రిస్తూ రాయాలనుకున్న నవలను రాయడం మొదలెట్టాను. అప్పుడు నల్గొండ కాలేజిలో షిఫ్టుసిస్టమ్ ఉండేది. ఉదయం సైన్స్ క్లాసెస్ – మధ్యాహ్నం నుండి ఆర్ట్స్ క్లాసెస్. నాకు ఉదయం నుండి ఒంటిగంట వరకు తీరిక – అలాగే నల్గొండ కాలేజిలో పనిచేస్తున్న ఇద్దరు, ముగ్గురు లెక్చరర్లు నాకు దగ్గరి

స్నేహితులయ్యారు. వాళ్ళతో సాహిత్యానికి సంబంధించిన అనేక విషయాలు చర్చిస్తుండేవాడిని.

"అంపశయ్య" నవలను రాయడం మొదలెట్టినప్పుడు నాకు చైతన్యస్రవంతి శిల్పాన్ని గూర్చి యేమీ తెలీదు. ఒక విద్యార్థి మైండ్‌లో వచ్చే అనేక ఆలోచనల్ని చెప్పాలని, ఆ ఆలోచనల ద్వారా అతని మనస్తత్వాన్ని చిత్రించాలని అనుకున్నాను. అనుకున్నట్టే ఆ నవలను రాయడం మొదలెట్టాను. ఇలాంటి ఒక నవలను రాస్తున్నానని నల్గొండ కాలేజిలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న సీతారామారావు అనే ఆయనకు చెప్పాను. ఈయన కామర్స్ లెక్చరరే అయినా సాహిత్యాన్ని గూర్చి చాలా ఆసక్తికరమైన విషయాలెన్నో చెబుతుండేవాడు. నేను కేవలం ఆలోచనలు, జ్ఞాపకాలు – వీటినే ప్రధానంగా చూపిస్తూ నవల రాస్తున్నానని సీతారామారావుకు చెప్పగానే ఆయన, ఇలా రాయటాన్ని చైతన్యస్రవంతి శిల్పమంటారని, మీరు జేమ్స్‌జాయిస్ రాసిన "యులీసెస్" చదివారా అని అడిగాడు. చదవలేదనగానే "మన కాలేజి లైబ్రరీలో ఉంది. తీసుకొని చదవండి" అన్నాడు. "యులీసెస్" తోబాటు "స్టడీ ఆఫ్ యులీసెస్" అనే జాయిస్ శిష్యుడు "స్టువర్ట్ గిల్బర్ట్" అనే ఆయన రాసిన పుస్తకాన్ని కూడా తీసుకొని, దాన్ని పక్కన పెట్టుకొని "యులీసెస్" చదవండి అన్నాడు సీతారామారావు. ఈ రెండు పుస్తకాల్ని మన లైబ్రరీకి నేనే తెప్పించానని కూడా చెప్పాడు.

వెంటనే ఆ రెండు పుస్తకాల్ని లైబ్రరీ నుండి తీసుకొని చదవటం ప్రారంభించాను. కానీ త్వరలోనే "యులీసెస్" నవలను అర్థం చేసుకొని ఆస్వాదించటం చాలా కష్టమని, అది మేధావుల కోసం రచించబడిన నవల అని తెలిసిపోయింది. నేను అలాంటి నవలను రాయలేదని, నా పద్ధతిలో నేను రాయాలని నిర్ణయించుకున్నాను.

1965 నుండి నేను అంపశయ్య నవలను రాయడం మొదలెట్టాను. ఎప్పుడు వీలైతే అప్పుడు రాస్తుండేవాడిని... ఎలా రాయాలనిపిస్తే అలా... ఇలా రాయడం సరి అయినదేనా... దీన్ని నవలని అంగీకరిస్తారా... ఇవేవీ ఆలోచించలేదు. ఎలా తోస్తే అలా పేజీలకు పేజీలు రాసేశాను. 1967లో ఇంచుమించు పూర్తిచేశాను. నా చేతిరాత బావుండదు. ఎవరితోనైనా ఫెయిర్‌గా రాయించాలనుకున్నాను. నల్గొండ కాలేజిలో పనిచేస్తున్న మరో మిత్రుడు కొత్తపల్లి రవిబాబు "నేను నీ నవలను ఫెయిర్ చేస్తా" నన్నాడు. 1968లో నేనూ, రవిబాబు ఉస్మానియా యూనివర్శిటీలోని బీహాస్టల్‌ల్లో ఓ మిత్రుని

రూంలో కూర్చొని, రోజూ 12 గంటలు వర్క్‌చేసి అంపశయ్యకు శుద్ధ ప్రతిని తయారుచేశాం. నేను రెండోసారి రాసిస్తోంటే రవిబాబు ఫెయిర్ చేశాడు. అలా 15 రోజులు రాత్రింబవళ్ళు కష్టపడి "అంపశయ్య" నవలకొక రూపం ఇచ్చాం. ఆ నవలను పూర్తిచేసిన రోజు నేను రవిబాబుతో అన్నాను. "ఇక నేను ఈ లోకంలో లేకున్నా ఫరవాలేదు" అని. "ఎందుకలా అన్నావని రవిబాబు అడిగితే నేను లేకపోయినా నా ఈ నవల ఉంటుంది" అన్నాను. "అంత నమ్మకమా?" అని చూద్దాం?" అన్నాడు చాలా తక్కువగా మాట్లాడే కొత్తపల్లి రవిబాబు (ఈనాటి "ప్రజాసాహితి" ఎడిటర్).

"అంపశయ్య"ను పూర్తిచేశాక ఇద్దరు ముగ్గురు మిత్రులకు చదవండని ఇచ్చాను. ఆ మిత్రుల్లో ఒకరు: గంట రామారెడ్డి. రెండవ వ్యక్తి శ్రీపతి. మూడోవ్యక్తి: వరవరరావు. ముగ్గురూ నవల చాలా బావుందన్నారు. ఆ తర్వాత నల్గొండలోనే ఉండే నోముల సత్యనారాయణ చదివి "ఇట్స్ వెరీరిచ్" అన్నాడు.

ఆ తర్వాత ఈ నవల ప్రచురణ: శ్రీపతికి ఎమ్మెస్కో వాళ్ళతో మంచి సంబంధాలున్నాయని వరవరరావు చెప్పి అతని ద్వారా ఎమ్మెస్కో వాళ్ళను కలుసుకొని ప్రచురణ గురించి ప్రయత్నించమన్నాడు. శ్రీపతి నవలను చదివి బాగుందన్నాడు. కానీ ప్రచురణ విషయంలో నేనేం చెయ్యలేనన్నాడు. అప్పుడు "ఆంధ్రజ్యోతి" వీక్లీకి ఎడిటర్‌గా ఉన్న పురాణం సుబ్రహ్మణ్యవర్మ సాహిత్యంలో కొత్తదనాన్ని ప్రోత్సహిస్తాడని కొందరు మిత్రులు చెప్పారు. విజయవాడకు వెళ్ళి, అద్దేపల్లి రామమోహనరావుతో కలిసి వెళ్ళి పురాణం గారిని కలుసుకొని అతనికి "అంపశయ్య" రాతప్రతినిచ్చాను. రెండుమూడు నెలల్లో చదివి మేం ప్రచురించేది, లేనిది చెబుతానన్నాడు. కానీ ఆరునెల్లదాకా యేమీ చెప్పలేదు. ఒకసారి అద్దేపల్లి వెళ్ళి అడిగితే "నేనింకా చదవలేదు. కావాలంటే పట్టుకెళ్ళండి" అన్నాట్ట." "పురాణం గారి ధోరణి చూస్తే ఇప్పట్లో చదివేట్టులేదు. అందుకే నవలను తీసుకొని మీకు పంపిస్తున్నాను" అని చెప్పి అద్దేపల్లి పోస్టు ద్వారా నవలను నాకు పంపించేశాడు. ఆతర్వాత దండమూడి మహీధర్ "నేను యువలో ప్రచురించటానికి ప్రయత్నిస్తానని తీసుకున్నాడు. కానీ నెలరోజుల్లోనే ఆయన నవలను నాకు తిప్పి పంపిస్తూ "యువలో ప్రచురించటానికి చక్రపాణిగారు అంగీకరించలేదు" అని ఉత్తరం రాశాడు.

1967లో కొందరు సాహితీ మిత్రులం కలిసి "సృజన" అనే త్రైమాసిక పత్రికను ప్రారంభించాం. వరవరరావు "సృజన" సంపాదకుడు. "అంపశయ్య"ను సృజనలో

సీరియల్‌గా ప్రచురిద్దామా అని వరవరరావును అడిగాను. "త్రైమాసికలో సీరియల్ అంటే చాలా కాలం పడ్తుందికదా! అందుకని నీ నవలను మరోలా ప్రచురిద్దాం. నీది ప్రయోగాత్మక నవల కాబట్టి ప్రయోగాత్మకంగానే ప్రచురిద్దాం. సృజనలో రెండు భాగాలు ప్రచురించాక పుస్తకాన్ని తీసుకొద్దాం" అన్నాడు. "సరే" అన్నాను. "సరే" అన్నాను. అలా "సృజన" ప్రచురణల పేరుతో వరవరరావు పుస్తకాల్ని ప్రచురించటం మొదలెట్టాడు. సృజన ప్రచురణల ద్వారా వెలువడిన మొదటి పుస్తకం పింగళి రంగారావు "వినడానికో కథ..." అన్న కథా సంకలనం. రెండవ పుస్తకం "అంపశయ్య"

"అంపశయ్య" పుస్తకంగా వెలువడగానే పాఠకుల నుండి చాలా గొప్ప స్పందన లభించింది. "తెలుగు నవలా సాహిత్యంలో ఈ నవలొక మైలురాయి" అన్నారు. ఆనాటి చాలా పత్రికలు నవలలోని కొత్తదనాన్ని ప్రశంసిస్తూ సమీక్షల్ని ప్రచురించాయి.

అంపశను చాలా పత్రికలు సమీక్షించాయి. నవలలో ఉన్న కొత్తదనాన్ని అందరూ ప్రశంసించారు. తెలుగు నవలా సాహిత్యంలో ఈ నవలకు శాశ్వతస్థానం ఉంటుందన్నారు.

తను చదవకుండానే తిప్పిపంపించిన నవలకు ఇంత పేరు రావడాన్ని పురాణం సుబ్రహ్మణ్యశర్మ జీర్ణించుకోలేకపోయాడు. "సంవేదన" అనే త్రైమాసిక, రా.రా.గారి సంపాదకత్వంలో వెలువడ్తుండేది. "సంవేదన" వారు అంపశయ్యను సమీక్షించమని పురాణం గార్కి పంపించారట. పురాణంగారు "అంపశయ్య"ను చీల్చిచెండాడుతూ ఓ సమీక్ష రాసి "సంవేదన"కు పంపిద్దామనుకున్నాట్ట. అయితే ఆయన ఆ సమీక్ష రాసి పంపించేలోగానే "సంవేదన" ఆగిపోయింది (ఈ విషయాన్ని పురాణం గారు స్వయంగా ఓ చోట రాశాడు). మొత్తమ్మీద "అంపశయ్య" నవల నేను ఊహించినట్టుగానే తెలుగు సాహితీ ప్రపంచంలో గొప్ప సంచలనాన్ని సృష్టించింది. ఆనాటి నుండి ఈనాటి వరకు ఈ నవల 9 ముద్రల్ని పొందింది. ఈ నవలను చదివి ఆనాటి పాఠకులెలా స్పందించారో ఈనాటి పాఠకులు కూడా అలాగే స్పందిస్తున్నారు. ఈ నవలను రాయడం, ప్రచురించటం రచయితగా నేను సాధించిన మహత్తర విజయమని నేను భావిస్తాను.

నేను 1964 నవంబర్ నుండి 1970 డిసెంబర్ వరకు నల్గొండలో పనిచేశాను. నల్గొండలో పనిచేస్తున్నప్పుడే నేను రాసిన మరో నవల "విచలిత". విజయవాడ నుండి వెలువడ్తున్న "ప్రగతి" అనే వారపత్రికలో సీరియల్‌గా వెలువడింది. ప్రగతి పత్రిక వారు నన్నో సీరియల్ నవల పంపించమని అడిగారు. మా మేనమామల ఇంట్లో జరిగిన ఒక

సంఘటన ఆధారంగా ఒక నవల రాయాలని ఎప్పట్నించో అనుకుంటేవాడిని. "ప్రగతి" వారు "నవల పంపించండి" అని అడగ్గానే ఈ నవలను రాయడం ప్రారంభించి నెలరోజుల్లో పూర్తిచేశాను పల్లెటూర్లలో వివిధ వర్గాల మధ్య ఉండే సంబంధాలను, సెక్స్ పట్ల పల్లె ప్రజలు కనబరచే చూసీ చూడనట్లు ఉండే వైఖరిని ఈ నవలలో చిత్రించాను. అలాగే మధ్య తరగతి ఉమ్మడి కుటుంబాల్లో ఉండే వాతావరణాన్ని, పురుషుడు ఎంతమంది స్త్రీలతో తిరిగినా క్షమించే ధోరణిని, ఒక తప్పు చేసిన స్త్రీని అథఃపాథాళానికి అణచివేసే ధోరణిని ఈ నవలలో చిత్రించాను.

"ప్రగతి"కి ఈ నవలను పంపించిన సంవత్సరం తర్వాత వాళ్ళు దీన్ని సిరియల్‌గా ప్రచురించారు. తర్వాత ఈ 'విచలిత' నవలను దేశీ ప్రచురణల వాళ్ళు 1975లో పుస్తకంగా ప్రచురించారు. ఈ నవలకు కూడా పాఠకుల నుండి మంచి స్పందన లభించింది. ప్రఖ్యాత విమర్శకుడు ఆర్.ఎస్. సుదర్శనంగారు ఈ నవల బాగుందని ప్రశంసిస్తూ మంచి సమీక్ష రాశాడు.

1970 చివర్లో నాకు నల్గొండ నుండి కరీంనగర్‌కు ట్రాన్సఫరయింది. 1971నుండి 1982 వరకు నేను కరీంనగర్‌లోని ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ బోయ్స్ డిగ్రీ కాలేజీలో పనిచేశాను.

కరీంనగర్‌లో పనిచేస్తున్న రోజుల్లోనే "అంపశయ్య"కు సీక్వెల్స్‌గా "ముళ్ళపొదలు", "అంతస్స్రవంతి" అన్న నవలల్ని రాశాను. "అంపశయ్య"లో యూనివర్శిటీ విద్యార్థుల జీవితాలను చిత్రిస్తే, ''ముళ్ళపొదలు''లో ఆ విద్యార్థులు డిగ్రీలు పుచ్చుకొని ఉద్యోగాన్వేషణలో ఉన్నప్పటి పరిస్థితులను చిత్రించాను. "అంతస్స్రవంతి"లో అవే పాత్రల్ని తీసుకొని వాళ్ళ ఉద్యోగ జీవితాలను చిత్రించాను. ఈ మూడు నవలల్లోను కథాకాలం ఒకరోజు మాత్రమే. "అంపశయ్య" విద్యార్థుల జీవితంలోని ఒకరోజును, "ముళ్ళపొదలు" నిరుద్యోగుల జీవితంలోని ఒకరోజును, "అంతస్స్రవంతి"లో ఉద్యోగుల జీవితంలోని ఒకరోజును–చైతన్య స్రవంతి శిల్పంలో చిత్రించాను. ఈ మూడు నవలల్ని విడివిడిగా చదువుకోవచ్చు. ఇవి తెలుగులో వెలువడిన మొదటి "ట్రిలోజి" నవలలు అనుకుంటాను.

కరీంనగర్‌లో పనిచేస్తున్నప్పుడు నేను రాసిన మరో ముఖ్యమైన నవల "చీకటిరోజులు". ఈ నవలలో 1975 నాటి అత్యవసర పరిస్థితిని (ఎమర్జెన్సీ) విధించిన రోజుల్లో జరిగిన దురాగతాలను చిత్రించాను. పోలీసుల నిర్బంధలో ఉన్న ఒక



డా॥ సి. నారాయణ రెడ్డి

ఈ రోజు నా పరిస్థితి కొంత విచిత్రంగా, విలక్షణంగా వుంది. ఇదే వేదికపై నుంచే ఈ పరిణతవాణి ప్రసంగ పరంపరను ఏర్పాటు చేసిన వాణ్ణి. పరిణతవాణి అంటే పరిణత వయస్కుల వాణి. 'వృద్ధుల' అనకుండా జాగ్రత్తగా 'పరిణత' అన్నాను. ఇది పరిణత వయస్కుల వాణి. పరిణతి పొందిన వాణి. ఏ వాక్కు పరిణత వయస్కుల నోట వినబడుతుందో, ఏ వాక్కు పరిణతమైందో అది పరిణతవాణి. అలాంటి వారు ప్రసంగించే కార్యక్రమం ఇది. లోగడ డా॥ ఆవంత్స సోమసుందర్, శ్రీ కాళోజీ నారాయణరావు, డా॥ తిరుమల రామచంద్ర, డా॥ బోయి భీమన్న– ఈ రకంగా ఎందరెరందరో ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరందరూ నాకంటే వయోధికులే. ఇంతవరకు నలభై తొమ్మిది మంది ప్రసంగించారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, సంయుక్త కార్యదర్శి డా.జె. చెన్నయ్య, కోశాధికారి శ్రీ మంత్రి రామారావు, పరిపాలనాధికారి శ్రీ పాండురంగయ్య, వీరితో పాటు ప్రముఖంగా చెప్పుకోతగింది పరిషత్తు కార్యక్రమాల సలహాదారు శ్రీ గోవిందరాజు రామకృష్ణారావు. అందరూ ఒకటై ఒకే గొంతుకతో నా గొంతుకలో పరిణతవాణిని పలికించాలని పట్టుబట్టారు. ఇది 'స్వర్ణోత్సవ ప్రసంగం' అన్నారు. అంటే యాభైయవ ప్రసంగం.

ఆహ్వానంలో కొన్ని సంస్థల పేర్లు ఉన్నాయి. 'రసమయి' సంస్థ మొదలుకొని 'వేదగిరి కమ్యూనికేషన్స్' వరకు యాభై రెండు సంస్థల పేర్లు కనిపిస్తాయి. ఈ భాషా సాంస్కృతిక

సంస్థల కార్యక్రమాల్లో నేను పాల్గొన్నాను. కాబట్టి కృతజ్ఞతా పూర్వకంగా వీటి పేర్లు చేర్చారు. ఇక ప్రసంగ విషయం.

శ్రోతల్లో ఎందరెందరో శ్రేయోభిలాషులున్నారు; నా పూర్వ విద్యార్థినీ విద్యార్థులున్నారు; కవులున్నారు. వీరందరి ముందు ఈ ప్రసంగం చేస్తున్నాను. ఇంతవరకు నేను అధ్యక్ష స్థానంలో ఉండి ఈ కార్యక్రమాలు నిర్వహించాను. అంటే ఈ కార్యక్రమాలకు పౌరోహిత్యం వహించాను. నలభై తొమ్మిది ప్రసంగాలకు నేను 'పౌరోహిత్యం' వహించాను. పురోహితుణ్ణి వరుడుగా కూర్చోబెడితే ఎలా ఉంటుందో అలా వుంది నా పరిస్థితి. కాని వరుడు కూడా ఇపుడు మాట్లాడుతున్నాడు.

పరిణతవాణి ప్రసంగంలో బాల్యదశ నుంచి ఇప్పటివరకు జీవితంలో జరిగిన వివిధ ఘట్టాలను చెప్పాలి. జీవితంలోని విభిన్న పార్శ్వాలను ఆవిష్కరించాలి. కేవలం కవి అయితే కవిత్వం గురించి అది ఎలా ప్రారంభమైందో చెబుతాడు. అలాగే కేవలం పండితుడయితే ఎలా విద్వత్తును సముపార్జించుకున్నాడో చెప్పే వీలుంది. నాకున్న సమస్యేమిటంటే నేను కవిగా వున్నాను; విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పని చేశాను; పార్లమెంటు సభ్యుణ్ణయ్యాను; ఎన్నో పదవులు నిర్వహించాను; సినీగీత రచయితనయ్యాను. ఇవన్నీ కలిపేసరికి ఎదురయ్యే చిక్కేమిటంటే ప్రసంగం గంట దాటుతుందేమోనని భయం. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే అప్పుడు నా పరిణతవాణి ప్రసంగానికి వార్ధక్యం వచ్చిందని భావించి కూర్చుని మాట్లాడుతాను. అంతవరకు నిలబడే ప్రసంగిస్తాను. నా జీవన రేఖలలోకి ప్రవేశించడానికి ముందు ఒక సన్నివేశం గురించి చెప్పడం అవసరం.

అది 1981 సంవత్సరం. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్యగారు నా పట్ల చాలా కాలంగా ఉన్న అభిమానంతో, నన్ను అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా అంటే లోగడ వావిలాల గోపాలకృష్ణయ్య గారు అధ్యక్షులుగా ఉన్న సంఘానికి అధ్యక్షుడిగా ఉండాలని నాకు కబురు చేశారు. 'నేను ఒకవైపు విశ్వవిద్యాలయంలో అధ్యాపకత్వం వహిస్తున్నాను. మరోవైపు సినీగీత రచనలో ఉన్నాను. పైగా ప్రవృత్తి రీత్యా నాకు పరిపాలనా వ్యవహారాలపై అంత ఆసక్తి లేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడిగా ఉండమంటే నాకు కుదరదని అప్పటి ఉపకులపతికి చెప్పాను' అని ముఖ్యమంత్రికి నా అభిప్రాయం తెలియపరిచాను. ఆయన కాదు కాదు మీరే ఉండాలని పట్టు పట్టారు. అప్పటి మంత్రివర్గంలోని శ్రీ అయ్యపురెడ్డిగారు,

శ్రీ భాట్టం శ్రీ రామమూర్తిగారు స్వయంగా నా దగ్గరకు వచ్చి "మీరంగీకరించాలి. చేయవలసిన కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి. మీరుంటే బాగుంటుంది" అని అన్నారు. వారిపట్ల గౌరవభావంతో నేను అంగీకరించాను. కాకతాళీయంగా అది నాకు యాభై ఒక సంవత్సరాలు పూర్తయిన ఘట్టం. 'స్వర్ణోత్సవ సభ' సందర్భంగా గేయం రాసాను.

ఇది ఎందుకు చెబుతున్నానంటే ఆ గేయంలో నేను ప్రసంగించబోయే అంశాలన్నీ పిండీకృతమయ్యాయి. ఆ గేయం ఇలా ప్రారంభమవుతుంది-

ఎవరికి ఈ సన్మానం
ఎందుకు ఈ సన్మానం?
చెట్టంతటి పేరొందిన
చిగురుకు ఈ సన్మానం.
అమ్మగ, సింగిరెడ్డి బు
చ్చమ్మగ కమ్మగ నను కని
పెంచిన మా హనుమాజీ
పేటకు ఈ సన్మానం.

అంటే సింగిరెడ్డి బుచ్చమ్మ నా తల్లి. హన్మాజీపేట మా వూరు. అందులో కన్నతల్లి, పుట్టిన ఊరు ఈ రెండు కలిపి చెప్పడం జరిగింది. ఇక తండ్రి గురించి చెప్పాలి. మాది వ్యవసాయ కుటుంబం. దాదాపు వంద ఎకరాల సేద్యం ఉండేది. ఇప్పుడు రెండెకరాలు మిగిలాయి. ఆ గేయంలో ఇంకా ఇలా అన్నాను.

*పదుగురు పాలేర్లున్నా
పదరా అని మా నాయన
మల్లన దున్నిన రేగడి
మట్టికి ఈ సన్మానం.
"నీ యవ్వా అరే" అంటు
నీల్గే నా గొంతుకలో
కవితలు స్వరపరిచిన హరి
కథలకు ఈ సన్మానం.*

ఉర్దూనే విద్యార్థిగ
ఊపిరిలా పీల్చుకున్న
నాలో తెలుగును మలచిన
నాల్కకు ఈ సన్మానం.

ఎంతపైకి ఎదుగుతున్న
ఇంకా పై కెదుగుమనీ
దీవించే నా ప్రియ గురు
దేవుల కీసన్మానం.

ఏ రుతువైనా నరాల
తీరాలను ఒరుసుకునీ
ఏటి పాయలా ఉరికే
పాటకు ఈ సన్మానం.

సముద్రాలతో గీసిన
సరిహద్దులు చెరిపివేసి
మనుషుల ముడివేసిన నా
మాటకు ఈ సన్మానం.

అనుభవాల వెన్నముద్ద
లారగించినా; మనసుకు
జిడ్డంటని నారాయణ
రెడ్డికి ఈ సన్మానం.

పేరేమో సింగిరెడ్డి
నారాయణ రెడ్డి గాని
కులం కీళ్లు విరిచే నా
కలాని కీసన్మానం.

కులాల కీళ్లు విరిచాను అని ఎందుకన్నానంటే - నా బాల్యంలో మా వూళ్లో మాదిగవాడ ఉండేది. ఆ మాదిగ వాడకు వెళ్ళి ఒక మాదిగ కుర్రాడితో బాల్యంలో ఆడుకునేవాణ్ణి.

అప్పుడు అస్పృశ్యత భయంకర వ్యాధిలాగా ఉంది. ఇప్పటిలా కాదు. పైగా ఊళ్లో పెద్ద రైతు కొడుకుని నేను. అతను మాదిగ. అయితే అక్కడితో ఆగలేదు. ఎగిరి ఎగిరి దాహమేసి 'దూప' అయి, మాదిగోల్ల బాయికాడ కుండతో చేదుకుని నీళ్లు తాగాను. పక్కనున్న మరో కులస్థుడు - నేను కాదు, మాదిగ కుర్రాడు కాదు - మధ్యలో ఉన్న అతను వెళ్లి మా అమ్మతో ఈ సంగతి చెప్పాడు. "అమ్మా! అమ్మా! బుచ్చవ్వా బుచ్చవ్వా! బాబు మాదిగోళ్ల నీళ్లు తాగిండు" అని. "అయ్యెయ్యో! ఎంత పనైపాయే. కులం జెడిపాయే" అని మా అమ్మ జానెడు రాగితీగ అంచును కొంచెం కాల్చి నా నాలుకపై పెట్టి 'ఇక పోయింది, ఇక పోయింది' అని ప్రాయశ్చిత్తం చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో పెరిగిన వాళ్లం. అందువల్లనే ఈ తరం వాళ్లకు 'కులం కీళ్లు విరిచే నా కలానికీ సన్మానం' అన్నాను.

నేను పుట్టింది 29-07-1931 ఆషాఢ (గురు) పూర్ణిమనాడు. కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం, హన్మాజీపేట గ్రామం. తండ్రి మల్లారెడ్డి, తల్లి బుచ్చమ్మ, ఇంటిపేరు సింగిరెడ్డి. నాకు పుట్టినప్పుడు పెట్టిన పేరు సత్యనారాయణరెడ్డి. ఎందుకంటే మా అమ్మకు చాలాకాలం వరకు సంతానం కలగలేదట. సంతానం కోసం కోమట్ల ఇంట్లో సత్యనారాయణ వ్రతం చేసినపుడు నేను పుట్టానట. అందుకే నాకా పేరు పెట్టారు. సిరిసిల్లలో 'వస్తానియా' మాధ్యమిక పాఠశాలలో మా నాయన నన్ను చేర్పించినపుడు 'క్యా నామ్ హై?' అని అడిగితే, 'సత్యనారాయణ రెడ్డి' అని చెబితే. 'చోటా నాం బోలో' అని సూచించాడు నాల్గో తరగతి అధ్యాపకుడు. 'నారాయణరెడ్డి' అన్నాడు మా నాయన. ఇంటి పేరు చెప్పమంటే 'సింగిరెడ్డి' అని మా నాయన చెబితే 'సి' రఖో' అన్నాడు. నిజానికి 'ఎస్' ఉండాలి ఇప్పటి లెక్కలో. కాని దానికి బదులు 'సి' వచ్చి చేరింది. మా హన్మాజీపేటలో పాఠశాల లేదు. ఒక ఖానిగి (ప్రైవేటు) పంతులు బడి నడిపేవాడు. ఇష్టముంటే పోవడం లేకుంటే ఊరుకోవడం. అక్కడే కొంతవరకు చదివాను. అప్పుడే కొన్ని పద్యాలూ అవీ పాడేవాణ్ణి. ఇక మాధ్యమిక స్థాయిలో నాల్గవ తరగతి నుంచి సిరిసిల్లలోనే చదవాలి. మా వూరి చుట్టు పక్కల ఎక్కడా బడి లేదు. నిజాం పరిపాలన రోజులవి. సిరిసిల్లలో చదువు ఉర్దూ మాధ్యమంలోనే. తెలుగు ఒక ఐచ్ఛికాంశంగా తీసుకుని

చదివాను. ఉన్నత పాఠశాల కోసం నేను కరీంనగర్ వెళ్లాను. అక్కడ 'ఫోకానియా' అయిపోయింది. నేను ఏడవ, ఎనమిదవ తరగతులప్పుడే పద్యాలు రాయడం ప్రారంభించాను.

"ఒకనాడు ఒక నక్క ఒక అడవిలోపల

పొట్ట కోసర మెటో పోవుచుండె" అని రాశాను.

ఇది శతావధానులు శేషాద్రి రమణ కవుల్లో ఒకరైన దూపాటి వెంకట రమణాచార్యులు గారి దృష్టిలో పడింది. ఆయన గొప్ప విద్వాంసుడు, విమర్శకుడు, మంచి ఉపాధ్యాయుడు. నా పక్కన కూర్చున్న విద్యార్థి "సార్! ఈయన మంచి పద్యాలు రాస్తాడు చూడండి" అని చూపించాడు. "ఒకనాడు ఒక నక్క అని యతులు కుదిరాయే" అన్నారు. కొన్ని కొన్ని సందర్భాల్లో 'కా' బదులు 'కి' పెట్టేవాణ్ణి. అంటే 'కమ్మనైన వాణ్ణి గిన్నెలోపల' అన్నట్లుగా ఇక్కడ 'గి' బదులు 'క' ఉండాలి, కై ఉండాలి అని ఆయన చెప్పేవారు. "ఎట్లా రాస్తావోయ్" అని సహాధ్యాయులు అడిగేవారు. 'రా' అనేవారు కాదు. తెలంగాణాలో ఆ పదం వాడేవారు కాదు. సహాధ్యాయులంటే గుర్తుకొచ్చింది. ఉన్నత పాఠశాల స్థాయిలో వెలిచాల కొండలరావు, నేను సహాధ్యాయులం. ప్రార్థన ఉండేది. అపుడు దీన్ని 'దువా' అనేవారు. ఆ దువా పాడేటపుడు మేం నిలబడేది. ఎత్తును బట్టి నిలబడాలి. మేం అప్పుడు చిన్నగా ఉన్నాం. నేను, కొండలరావు కీచులాడేవాళ్లం. నువ్వు చిన్నోడివి, కింద నిలబడు అనుకునేవాళ్లం.

తర్వాత ఇంటర్మీడియట్‌లో చేరేందుకు హైదరాబాదుకు వచ్చాను. ఉర్దూ మాధ్యమం కాలేజి చాదర్‌ఘాట్‌లో వుంది. కనుక అక్కడ చేరాను. వేరే చోట ఇంగ్లీషు మాధ్యమం వుంది. ఉర్దూ మాధ్యమం నుంచి ఇంగ్లీషు మాధ్యమంలోకి మారడంలో చాలా ఇబ్బందులుంటాయి. అందుకని ఇందులో సుఖంగా ఉంటుందని చాదర్‌ఘాట్ కళాశాల ఎంచుకున్నాను. చదువు ఉర్దూ మాధ్యమంలోనే సాగింది. తెలుగు ఒక పాఠ్యాంశం మాత్రమే. అప్పుడే నేను శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో తొలిసారిగా ఆధునికాంధ్ర మహాకవుల రచనలు చదివాను. రాయప్రోలు, గురజాడ, కృష్ణశాస్త్రి, జాషువా, కరుణశ్రీ, శ్రీశ్రీ, భావకవుల, అభ్యుదయ కవుల రచనలు చదివాను. ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు ఇరివెంటి కృష్ణమూర్తి నా సహాధ్యాయి. చాలా ఆత్మీయుడు, గొప్పవాడు– ఇప్పుడు లేడు. అప్పుడే మా సహాధ్యాయుల్లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ

చేసిన జస్టిస్ జీవన్‌రెడ్డి గారు ఒకరు. చాలామంది రాజకీయ నాయకులయ్యారు. పి.రామచంద్రారెడ్డి మాజీ సభాపతి, యం.బాగారెడ్డి మాజీమంత్రి, యం. నారాయణ రెడ్డి పార్లమెంట్ సభ్యులు, సి. జగన్నాథరావు ఉపముఖ్యమంత్రి– నేనొక్కడినే సాహిత్య రంగం ఎంచుకున్నాను. ఆ రోజుల్లో నేను ఆశువుగా పాటలు చెప్పే వాడిని. అప్పుడే 'బర్సాత్' సినిమా వచ్చింది. 'బర్సాత్ మే హమ్ సె మిలే తుమ్ సజన్ సెమిలే హమ్ బర్సాత్‌మే, దీనిని "జడివానలో నాతో నీవు నీతొ నేను కలిసిపోదమా, జడివానలో" అన్నాను. "ప్రీత్ నే సింగార్ కియా మై బనె దుల్హన్" 'ప్రేమ నన్నలంకరించ పడుచునైతిని' 'గాయ్ చలేజా, గాయ్ చలేజా ఏక్‌దిన్ తేరభీ జమాన ఆయేగా' 'పాట పాడుబే, పాటపాడుబే ఒక్కనాడ్ నీదిభీ బొక్కలిరుగుబే' అన్నాను. బొక్కలంటే ఆంధ్ర ప్రాంతంలో 'రంధ్రాలు' అని అర్థం. తెలంగాణాలో దీని అర్థం 'ఎముకలు'. తర్వాత బి.ఏ, ఎం.ఎ పూర్తి అయ్యాయి. ఇక పి.హెచ్‌డి. చేయాలి. బి.ఏ.లో ద్వితీయభాషగా హిందీ తీసుకున్నాను. తర్వాత కాలంలో అది ఎంతో ఉపయోగపడింది నాకు. "ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు – ప్రయోగములు" నా పరిశోధన విషయంగా ఎన్నుకున్నాను. ఇది ఎలా జరిగిందంటే – దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు మహాకవులు. 1957 ప్రాంతంలో తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏర్పడక ముందు వేంకటేశ్వర కళాశాల అనేది ఉండేది. అక్కడికి మమ్మల్నిద్దరినీ పిలిచారు. తెలుగుభాష గురించి మాట్లాడమని తెలుగు సంఘం వారు కోరారు. కార్యక్రమం అయిపోయింది. అలా కొండపైన నడుస్తున్నాం మేము. అలా నడిచిపోతుంటే నన్ను గుర్తించే వారెవరు? అప్పుడప్పుడే పైకొస్తున్న వాణ్ణి. కృష్ణశాస్త్రి గారిని 'మీ పక్కనున్నది మీ కుమారులా' అని ఒకరు అడిగారు. "అలా కనిపిస్తున్నామా! అయినా దీనివల్ల (జుట్టును చూపిస్తూ) అనిపిస్తున్నామేమో!" అని అన్నారు వారు. జుట్టేకాదు సరుకు కూడా ఇద్దరిదీ ఒకటే. ఆయన పెద్దవాడు. నా కంటే 25–27 ఏండ్లు పెద్దవాడు. 'ఏం చేస్తున్నారు?' అని నన్ను అడిగారు. అప్పుడు పి.హెచ్‌డి. చేయాలనుకుంటున్నాను అన్నాను. "ఏ సబ్జక్టు?" Convention and Revolt in Modern Telugu poetry అని పెట్టండి. "Convention and Revolt in Modern English poetry అనే పుస్తకం వచ్చింది చూడండి" అన్నారు. ఆ తర్వాత అది నేను చదివాను. Convention అంటే సంప్రదాయము, Revolt అంటే 'తిరుగుబాటు' అనే అర్థాలున్నాయి. "Tradition and Experiment in modern Telugu Poerty అని అంటే బాగుంటుందేమో" అని ఆయనతో అన్నాను. ఆయన ఆమోదించారు. ఆ దృష్టితోనే

అధ్యాపకుడిగా ఉంటూ 'ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు- ప్రయోగములు' అనే అంశంపై పరిశోధన చేశాను. అది ఆధునికాంధ్ర కవిత్వము మీద సమగ్రస్థాయిలో జరిగిన పిహెచ్.డి. గ్రంథం అని పేరుపొందింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాలలో మా అధ్యాపకులు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు, శ్రీ కె. గోపాలకృష్ణారావు గారు, శ్రీ పల్లా దుర్గయ్య గారు, శ్రీ దివాకర్ల వేంకటావధాని గారు. ఆ తర్వాత అధ్యాపకుడిగా అప్పటి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా॥ డి.ఎస్.రెడ్డి గారు నన్ను ఎంపిక చేసుకున్నారు. సికింద్రాబాదు ఆర్ట్స్- సైన్సు కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా వెళ్ళాను. తర్వాత నిజాం కళాశాలకు బదిలీ అయింది. అక్కడ అధ్యాపకుడిగా పని చేశాను, రీడర్‌గా చేశాను. తర్వాత తిరిగి విశ్వవిద్యాలయానికి వచ్చేశాను. ప్రొఫెసర్‌గా పని చేశాను. ఇంకా పదకొండు సంవత్సరాలు పదవిలో కొనసాగే వీలుంది. ఇంతకు ముందు ప్రస్తావించినట్టు ముఖ్యమంత్రి అంజయ్యగారు నన్ను అధికార భాషా సంఘ అధ్యక్షుడిగా నియమించారు. అధ్యాపకరంగం నుంచి పాలనారంగంలోకి వచ్చాను.

'పరిణతవాణి' ప్రసంగ విస్తృతి అధికం. కారణం? వ్యక్తి స్వీయ జీవిత, సాహిత్య విశేషాలను సంగ్రహంగా, సర్వాంగీణంగా చెప్పాలి. అందుచేత నా కుటుంబం గురించి చెప్పి తర్వాత నిర్వహించిన వివిధ పదవీ బాధ్యతలను గురించి ప్రస్తావిస్తాను.

నా భార్య శ్రీమతి సుశీల. దివంగతురాలు. ఆమె స్మృత్యర్థం 'శ్రీమతి సుశీలా నారాయణ రెడ్డి ట్రస్టు'ను స్థాపించాను. ప్రతి సంవత్సరం ట్రస్టు ఉత్తమ రచయిత్రికి రూపాయల పదివేలతో ప్రారంభమై ఇప్పుడు యాభై వేలు పురస్కారంగా అందజేస్తుంది. ఆమె పేరిట పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో, డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు స్వర్ణ పతకాలను ఏర్పాటు చేశాను. నాకు నలుగురూ కుమార్తెలే. 'కొడుకు పుట్టాలె, కొడుకు పుట్టాలె' అని మా పెద్దలు అనవసరంగా ఆశలు పెట్టుకుంటే అందరూ కూతుళ్లే పుట్టారు. దానివల్ల ప్రయోజనం ఏమిటంటే, కూతుళ్లు కాబట్టి అందరూ నా మనసుకు అనుకూలంగా ఉన్నారు. కొడుకులయితే ఒకరు అమెరికా, ఒకరు ఆస్ట్రేలియా వారి ఇష్టంగా వెళ్లేవారు. కుమార్తెల పేర్లు గంగ, యమున, సరస్వతి, కృష్ణవేణి. ఈ చతుర్వేణులు నా కూతుళ్లే. అల్లుళ్లు భాస్కరరెడ్డి, సురేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి. అప్పుడప్పుడు సరదాగా దేవుళ్ల గురించి

ప్రస్తావన వచ్చినపుడు అనుకుంటాను– అల్లుళ్లే నా దేవుళ్లని. ఎందుకంటే కూతుళ్లకు అనుకూలంగా ఉంటూ నేనున్న ఇంట్లోనే కింది అంతస్తు నుంచి మొదలై మొదటి, రెండు అంతస్తుల్లో వారి వారి గదుల్లో ఉంటున్నారు. కూతుళ్లు, మనుమలు, మనుమరాండ్రు కలుపుకుని మొత్తం ఇరవైమంది ఒకే ఇంట్లో వుంటున్నాం. ఇద్దరు, ముగ్గురు విదేశాలకు వెళ్లే వారున్నారు. అది వేరే సంగతి. ఇక మునిమనవరాలు 'వరేణ్య' బాల ఆంగ్ల కవయిత్రి. ఇటీవలే ఆమె పుస్తకం ఆవిష్కరింపజేశాం. ఆమె రచించిన 'Tender Rays' ఆంగ్ల కవితా సంపుటిని 'లేత కిరణాలు' అని అనువాదం చేశాను నేను. అమ్మాయి ఆంగ్లంలో రాయడానికి కారణం పుట్టింది అమెరికాలో, పెరిగింది అమెరికాలో. పదవుల ఇక విషయానికొస్తాను.

అధికార భాషా సంఘ అధ్యక్షతలో కొన్ని ముఖ్యమైన ఘట్టాలు ఉన్నాయి. తొలిసారిగా మూడుకోట్ల రూపాయలు వ్యయంతో పద్నాలుగు వేల తెలుగు టైపు రైటింగ్‌యంత్రాల సేకరణ చేశాం. ఒకేసారి ఇన్ని యంత్రాలు కొనుగోలు చేయడం భారతీయ భాషల్లో రికార్డుగా నిలిచింది. నలభై ఐదుకు పైగా ప్రభుత్వ శాఖల పదకోశాలను రూపకల్పన చేశాం. కార్యాలయ పదావళి, నమూనా లేఖలను ప్రచురించాం. రాష్ట్రమంతటా విస్తారంగా పర్యటన జరిపి తెలుగు వాడకం పట్ల ప్రజలలో, ఉద్యోగులలో అవగాహన పెంచగలిగాం. జిల్లా స్థాయిలో అమలు నేనున్నప్పుడు 75% వరకు పెరిగింది. కార్యాలయాలు తెలుగును అధికంగా వినియోగించాయి. ఇప్పుడు పరిస్థితి ఎలా వుందో అందరికీ తెలిసిందే? కాన్వెంటు స్కూళ్లలో ప్రాథమిక స్థాయిలో తెలుగు మాట్లాడితే కొట్టడం, వారికి శిక్షా సూచకంగా అట్టమీద రాసి వారి మెడలో వేయడం వంటి భయంకర దుఃస్థితి ఏర్పడింది. ఈ దశ తెలుగు భాషకు ఏనాడు ఏర్పడలేదు. చెప్పేవాళ్లు చెప్తూనే ఉన్నారు. చేసేవాళ్లు మానడం లేదు. ఇది శోచనీయం. దీన్ని ప్రభుత్వం దుమ్ము దులపాలని కోరుతున్నాను. తెలుగు రోజు రోజు క్షీణించి పోతోంది. ఇది కార్యాలయాలలో మాత్రమే కాదు, విద్యారంగం ప్రాథమిక దశ నుంచీ జరుగుతోంది.

అధికార భాషా సంఘం అధ్యక్ష పదవి నడుస్తోంది కదా? అనుకున్నాను. అప్పటి ముఖ్యమంత్రి డా॥ ఎన్టీ రామారావు గారు "ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా ఉండాలి. అది ప్రాథమిక దశలో ఉంది" అన్నారు. డా.జి.రామిరెడ్డి గారి తర్వాత రెండో ఉపాధ్యక్షుణ్ణి. ప్రస్తుతం అది డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయమైంది. దానిని నేను 1985 నుంచి 1989 వరకు నాలుగు సంవత్సరాలు

నిర్వహించాను. అప్పుడు సాధించిన కొన్ని ఫలితాలు పేర్కొంటాను. జూబ్లిహిల్స్‌లోని 54 ఎకరాల స్థలం కేటాయింపు పొందడం నా కాలంలో జరిగినందుకు సంతోషిస్తున్నాను. ఇప్పుడు అది 'వికాస్‌నగర్'గా మారింది. జాతీయ స్థాయిలో విశ్వ విద్యాలయానికి 55 అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేశాం. అప్పుడు విద్యార్థుల సంఖ్య 50 వేలు దాటింది. ఇప్పుడు ఇంకా అధికమై ఉంటుంది. విశ్వవిద్యాలయం ఆరుబయలు స్థలంలో 1987 మార్చిలో ప్రథమ స్నాతకోత్సవం నిర్వహించాం. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పాఠక్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పిమ్మట ఎన్టీ రామారావు గారు 1989 నుండి 1992 వరకు తెలుగు విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా నన్ను నియమించారు. ఇక్కడ కూడా నేను రెండవ వైస్ ఛాన్సలర్‌నే. మొదటి వైస్–ఛాన్సలర్‌గా ఆచార్య తుమాటి దొణప్పగారు, తర్వాత నేను. తెలుగు విశ్వవిద్యాలయానికి యూ.జి.సి. గుర్తింపు తీసుకురాగలిగాను. దానివల్ల చాలా ప్రయోజనాలు చేకూరాయి. పబ్లిక్ గార్డెన్స్‌లో ఇచ్చిన స్థలంలో భవన నిర్మాణం, భవన ప్రవేశం నేనున్నప్పుడే జరిగింది. కూచిపూడిలో కళాక్షేత్రాన్ని విశ్వవిద్యాలయ పరిధిలోకి తీసుకొచ్చాం. 1989లో ప్రథమ స్నాతకోత్సవం నిర్వహించాలనీ నిర్ణయించాం. అప్పటికింకా యూ.జి.సి గుర్తింపు రాలేదు. యూ.జి.సి గుర్తింపు రాకపోతే విశ్వవిద్యాలయానికి గవర్నరు బదులు ముఖ్యమంత్రే ఛాన్సలర్‌గా ఉంటారు.

అప్పుడు నటమూర్ధన్యులు ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు గారే ఛాన్సలర్ స్థానంలో ఉన్నారు. మొదటిసారి స్నాతకోత్సవం కొత్తదనంగా ఉండాలని మేమిద్దరం కూర్చొని ఆలోచించాం. తెలుగుదనం కావాలనుకున్నాం. ముట్నూరి కృష్ణారావు గారి తలపాగా నమూనా తీసుకుని రామారావుగారికి చూపించాను. అప్పుడు ముట్నూరి కృష్ణారావు, కందుకూరి వీరేశలింగం ఇద్దరి తలపాగాలు కలిపి రామారావు గారు కొత్త తలపాగా, గౌను కాగితం పై వేసి చూపారు. ఉపరాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మగారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. రెండవ స్నాతకోత్సవం విశేషమేమిటంటే నాటి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు గారు ముఖ్య అతిథిగా వచ్చారు. ఆయన తెలుగులో ప్రసంగించారు. "ఢిల్లీకి రాజైనా, తల్లికి కొడుకే" అనే నానుడి తీసుకుని "నేను తెలుగువాడిని కాబట్టి, తెలుగు విశ్వవిద్యాలయం కాబట్టి నేను వచ్చాను" అని చెప్పారు. తెలుగు విశ్వ విద్యాలయంలో నిర్వహించిన మరికొన్ని ముఖ్య కార్యక్రమాలు – 'వీడియో డాక్యుమెంటేషన్' అనేది ఒకటి కొత్తగా చేపట్టాం. అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారి

ద్వారా ఇరవై లక్షల రూపాయల గ్రాంటు పొంది ముప్పైమంది ప్రముఖులపై 'వీడియో డాక్యుమెంటేషన్' చేయించాం. ఇక ఆ పని నేటి వి.సి. ఆచార్య అనుమాండ్ల భూమయ్య చూసుకోవాలి. పరిష్కృత విజ్ఞాన సర్వస్వ సంపుటాలతో పాటు 150 పైగా ఉత్తమ గ్రంథాల ప్రచురణ జరిగింది. మరొక విశేషం 1990 మార్చిలో మూడు రోజుల పాటు బెంగుళూరులో 'మూడవ అఖిల భారత తెలుగు మహా సభలు' తెలుగు విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించాం. అక్కడ ఎం. రాధాకృష్ణరాజు మొదలైన వారి సహకారం పొందాం. నాటి ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డి గారి ప్రోత్సాహంతో తెలుగు విశ్వవిద్యాలయం 1990 చివర్లో మారిషస్‌లో 'మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు' నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున మారిషస్‌లో జరపడం విశేషం. విశ్వ విద్యాలయ పక్షాన 'విశిష్ట పురస్కారం' ఏర్పాటు చేశాం. దీనికింద స్వీకర్తకు యాభై వేల రూపాయల నగదు లభిస్తుంది. ఆ కాలంలో యాభై వేలు అంటే ఎంతో గొప్ప. మొట్ట మొదట యాభై వేల రూపాయలతో డా॥ బోయి భీమన్న గారిని సత్కరించాం. సాహిత్యరంగంలో, కళారంగంలో, సాంస్కృతిక రంగంలోనే గాక సినిమా రంగంలో కూడా 'డాక్టరేట్' ఇవ్వడం మొదలు పెట్టాం. సినిమా రంగంలో 'డాక్టరేట్' ఇచ్చింది గుమ్మడి వెంకటేశ్వరరావు మహానటునికి. నేను తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షునిగా ఉన్న కాలంలో రెండు నెలలకు పైగా కాకతీయ విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జి ఉపాధ్యక్షునిగా పదవీ బాధ్యతలు నిర్వహించాను. అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డిగారు బాగా సన్నిహితులు. ఆయన 'మరొక పదవీకాలం కొనసాగుతారా విశ్వ విద్యాలయానికి' అన్నారు. 'వద్దండి– చేసిన పనిని చేయను నేను' అని నా సమాధానం.

పిమ్మట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో 'భాషా సాంస్కృతిక వ్యవహారాల సలహాదారు' పదవిని చేపట్టాను. ఎప్పటికప్పుడు భాషా సాంస్కృతిక వికాసాలపై ప్రభుత్వానికి సూచనలు చేశాను. ఒక ముఖ్య సూచన గురించి తప్పక చెప్పాలి. అది రాజధానిలో కళానికేతన్ నిర్మాణ పథకం. ఇది సర్వాంగీణ కళాప్రాంగణం వంటిది. ఆధునిక దృశ్య శ్రవణ సాంకేతిక విజ్ఞానం నింపుకున్నది. చరిత్ర, సాహిత్యం, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రకళ, శిల్పకళ, జానపద, గిరిజన కళాభాగాలు, ప్రదర్శన శాలలు, రంగస్థలాలు, డాక్యుమెంటేషన్ విభాగాలు మొదలైనవి దీనిలో ఉంటాయి. ఇలాంటివి భోపాల్, కొచ్చిన్ మొదలైన చోట్ల భిన్న భిన్న రూపాలలో ఉన్నాయి.

ఆ తర్వాత నారా చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 'రాష్ట్ర సాంస్కృతిక మండలి' అధ్యక్ష పదవి ఇచ్చారు. అది కేబినెట్ హోదాలో వుంది. 1997 నుంచి 2004 వరకు ఈ పదవీ బాధ్యతలు నిర్వహించాను. ఎన్నో విలక్షణమైన కార్యక్రమాలు జరిపాం. ముఖ్యంగా సాంస్కృతిక విధానంపై జాతీయ సదస్సు జరిపాం. జాతీయ విధానమనేది ఒకటి ఉండాలని ప్రత్యేక సదస్సు నిర్వహించాం. రాష్ట్రంలోని 75 ప్రముఖ సంస్థలు సాంస్కృతిక వికాసానికి 103 సూచనలు చేశాయి. 'హంస' పురస్కారాలు రూపొందించాం. హంస నీరక్షీర న్యాయానికి మరో పేరు. కాబట్టి వికాసానికి ప్రతీక హంస. సాహిత్యం, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రకళ, శిల్పం, జానపద గిరిజన కళలు వంటి రంగాలన్నింటిని ఈ పురస్కార పరిధిలోకి తీసుకు వచ్చాం. 'హంస' పురస్కారానికి ఆ రోజుల్లో ముప్పైవేల రూపాయలు నగదు, బంగరు పూతతో ఉన్న హంస ప్రతిమ, ప్రశంసాపత్రం, శాలువా లభించాయి. ఈ పురస్కారాలను ప్రతి సంవత్సరం క్రమంగా అందించాను. కాలం మారింది కదా! ఇప్పుడు హంసకు బదులు 'కళారత్న' అని పేరు పెట్టారు. అది వారి ఇష్టం – మనం కాదనం.

ఇక నవల, కథానిక, పద్యం, గేయం, వచన నాటకం, సాహిత్య విమర్శ, ప్రసార మాధ్యమ రచనా విధానాలు – ఈ ప్రక్రియల్లో అధ్యయన శిబిరాలు నిర్వహించాం. ఇవికాక ముఖ్యమైనవి రెండున్నాయి. ఇవి నా ఊహతో జనించినవి. 'సమైక్య రాగాత్మ'– రాగాల ధోరణులు వేరైనా, వ్యక్తీకరణ విధానాలు వేరైనా, ఆత్మ ఒక్కటే'. ఒకే వేదికపైన ఒక కర్నాటక విద్వాంసుడు, ఒక హిందుస్థానీ గాయకుడు, ఒక అరబిక్ గాయకుడు, ఒక పాశ్చాత్య సంగీత నిపుణుడు– నలుగురిని కూర్చోబెట్టి మొట్టమొదట ఒక జానపద గీతం పాడించాను. జానపద గీతం పాడించి అందులో రాగమేముందో కర్నాటక సంగీత గాయకుడు లక్షణాలు వివరించి వినిపిస్తాడు. ఎంతో విద్యాత్మకంగా ఉంది ఆ కార్యక్రమం. మళ్లీ ఎక్కడా రాలేదు. చూద్దాం! ఎవరైనా చేస్తారేమో! తెలుగు విశ్వ విద్యాలయమే చేయాలి ఇవన్నీ– తెలుగు విశ్వవిద్యాలయం అన్ని కళలకు సంబంధించింది కాబట్టి. ఈ కార్యక్రమంలోని విశేషమేమంటే ఉదాహరణకు–

ఉ... బండెన్క బండిగట్టి.... ఓ చిన్నారి లచ్చు"

ఇందులో రాగం కనుక్కోవాలి. కర్నాటక సంగీతంలో పాడాలి. నూకల చిన సత్యనారాయణ ప్రధాన పాత్ర వహించారు. తర్వాత గాయకులు దాన్నందుకుని

హిందుస్థానీలో పాడాలి. అదే రాగంలో పాశ్చాత్య సంగీతంలో పాడాలి. ఈ రకంగా సరదాగా నేను చెబుతున్నా దీని వెనక ఎంతో కృషి వుంది. అంటే ఒక జానపద గీతంలోని రాగం, కర్నాటక రాగం, హిందుస్థానీ రాగం, అరబిక్ రాగం, పాశ్చాత్యం వీటి మూలాలను ఆవిష్కరిస్తూ నిర్వహించిన అపూర్వ సంగీత కార్యక్రమమిది. 'లయ సంగమం' అని మరొకటి ఉంది. ప్రముఖ మృదంగ విద్వాంసుడు డా॥ యెల్లా వెంకటేశ్వరరావు సహకారంతో ఈ కార్యక్రమం జరిపాం. ఇందులో అన్నీ చర్మవాద్యాలే ఉపయోగించాలి. ఇప్పుడొస్తున్నవన్నీ ప్లాస్టిక్కులే. అసలు చర్మవాద్యాలు (తోలు డప్పులు) తీసుకురమ్మన్నాను. చర్మ వాద్యాల్లో రకరకాలున్నాయి. డప్పు, డోలు, కంజర, రుంజు, మృదంగం వంటి పది చర్మ వాద్యాల లయగతుల సమ విన్యాసం చూపించాం. పద్య నాటకోత్సవాలు జరిపాం. గిరిజన భాషా సాహిత్యాలపై సదస్సు ఏర్పాటు చేశాం. రాష్ట్ర స్థాయి చిత్ర లేఖన శిల్ప కళల పోటీలు నిర్వహించాం.

నేను రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షుడిగా ఉండగానే అనుకోకుండా భారత రాష్ట్రపతి నన్ను రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేశారు. దీని కాలపరిమితి ఆరు సంవత్సరాలు. సంగీతం, సాహిత్యం, నాటకం, నటన, పత్రికా రంగాల నుంచి లబ్ధ ప్రతిష్ఠులైన వారిని నామినేట్ చేస్తారు. దక్షిణ భారతంలోనే జ్ఞానపీఠ పురస్కారం పొందిన కవిని అప్పట్లో వున్నది నేనొక్కణ్ణే కావడం వల్ల నామినేట్ చేశారని తర్వాత తెలిసింది. అప్పటి ప్రధానమంత్రి ఐ.కె. గుజ్రాల్ గారు ఈ సంగతి నాతో చెప్పారు. నాతో పాటు డా. రాజారామన్న (విజ్ఞానశాస్త్రం), షబానా ఆజ్మీ (చలన చిత్రరంగం), కులదీప్ నయ్యర్ (పత్రికారంగం)- ఇంకా కొందరున్నారు.

రాజ్యసభలో నేను క్రియాశీల సభ్యుడిగా కృషి చేశాను. రాజ్యసభ సభ్యత్వం పదవీకాలంలో 'క్వశ్చన్ అవర్'లో మొత్తం 624 ప్రశ్నలు వేశాను. అందులో ప్రధాన ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు చాలా ఉన్నాయి. కొన్ని ముఖ్యమైనవి పేర్కొంటాను. గాంధీజీని న్యూనపరుస్తూ 'మాక్సిమ్' అనే పత్రిక ఒక కథనం ప్రచురించింది. గాంధీజీని వ్యక్తిగతంగా అగౌరవ పరిచే రీతిలో రాశారు. నాకు ఒళ్లుమండి సభ దృష్టికి తీసుకొచ్చాను. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సాంస్కృతిక వికాసానికి దోహదకరంగా ఆర్థిక సహాయం చేసే నిమిత్తం 'సాంస్కృతిక నిధి' ఏర్పాటు చేయాలని సూచించాను. కంప్యూటర్ భారతీయ భాషలలో వినియోగం గురించి అడిగాను. వైద్య కళాశాలలో శిక్షణ పొందకుండా దొంగ సర్టిఫికేట్‌లతోనో, మరొక విధంగానో వైద్యులుగా చలామణి అవుతూ ప్రజల ప్రాణాలతో

ఆడుకుంటున్న నకిలీ వైద్యుల ఆటకట్టించాలన్నాను. సంస్కృత భాషా వ్యాప్తికి తోడ్పడే నిమిత్తం కేంద్ర విశ్వవిద్యాలయాలలో సంస్కృత పీఠాలను పెట్టమని చెప్పాను. ఇతర దేశాలలో తెలుగు వారికోసం ఆకాశవాణి ప్రసారాలను నిర్వహించాలని కోరాను.

'స్పెషల్ మెన్షన్' అనేది ఒకటుంది. అదే ప్రత్యేక ప్రస్తావన. దీనిని రాతపూర్వకంగా ఇవ్వాలి. 32 సార్లు ప్రస్తావన చేశాను. దీనిలో వాచవిగా కొన్ని ఉదాహరిస్తాను.

గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో గాంధీజీ చదివిన 'ఆల్ఫ్రెడ్ హైస్కూల్' దుఃస్థితి. దాని పేరు ఇప్పుడు మోహన్‌దాస్ గాంధీ హైస్కూల్. ఇందులో ఉన్న పద్దెనిమిది గదుల్లో పది గదులకు తలుపులు, కిటికీలు లేవు. ప్రార్థనా మందిరాన్ని పనికిరాని వస్తువులుంచేటందుకు వాడుతున్నారు. నేను దానికి యం.పి. లాడ్స్ (నిధుల) నుంచి రూపాయలు ఐదులక్షలు ఇస్తానని సభాముఖంగా ప్రకటించి, ఇచ్చాను. రాజ్యసభ సభ్యునిగా ఎం.పి లాడ్స్ నిధుల కింద రూపాయలు పదకొండున్నర కోట్లు నాకు కేటాయించారు. నామినేటెడ్ మెంబర్ అయితే భారతదేశంలో ఎక్కడైనా సంస్థలకు ఈ నిధి నుంచి ఇవ్వవచ్చు. మిగతా సభ్యులకు, లోకసభ సభ్యులకు వాళ్ల నియోజక వర్గాలకే పరిమితమై ఉంటుంది. అలా నేను సద్వినియోగం చేసుకున్నాను. ప్రత్యేక ప్రస్తావనలో ముఖ్యమైనవి కొన్ని తెలియజేస్తాను.

ఒరిస్సా రాష్ట్రం కటక్‌లో నేతాజి సుభాష్ చంద్రబోస్ పుట్టి పెరిగారు. నిజానికి అతనిది బెంగాల్. ఆయన జన్మించిన 'జానకీనాథ్' భవనం దుఃస్థితిని స్వయంగా చూశాను నేను. ఈ భవనాన్ని పునరుద్ధరించాలని ప్రత్యేక ప్రస్తావనలో కోరాను. నా ఎం.పి.లాడ్స్ నిధుల నుంచి తర్వాత రూపాయలు పది లక్షలు కేటాయింపు ప్రకటించాను. నేటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, రాజారామన్న, చిత్తరంజన్, టి.ఎస్.చతుర్వేది, విదుత్తలై విరుంచి మొదలైన ప్రముఖులు నా ప్రస్తావనను బలపరిచారు.

ఇంకొక ప్రస్తావన చాలా ముఖ్యమైనది. నేను 'ఆస్ట్రేలియా తెలుగు సంఘం' ఆహ్వానిస్తే ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్ళాను. 'మెల్‌బోర్న్' సమీపంలో 'గోల్డ్ మ్యూజియం' చూశాను. గుప్తుల కాలం నాటి బంగారు నాణేలపై లక్ష్మీదేవి చిత్రాలున్నాయి. వాటి గురించి తెలిపే అసభ్యకర వివరణ ఉంది. 'సెన్సువస్ లక్ష్మి' 'సెడిక్టివ్‌లక్ష్మి' అంటే సమ్మోహనకరమైన లక్ష్మి, పంచేంద్రియాలను రెచ్చగొట్టే లక్ష్మిగా వర్ణించారు. రాసినవాడి దృష్టిలో 'లక్ష్మి' అంటే రంభ, ఊర్వశి అనుకున్నాడు. దేవత అని జగన్మాత అని, తెలియదు. ఇది నేను చెబితే రాజ్యసభలో సభ్యులు సమర్థించారు. ఇలా నెల తిరుగక ముందే ఆ రాతలు తీసేసి

'గాడెస్' అని రాసుకున్నారు. ఇందులో విశేషమేమంటే రాజ్యసభకు నేను సాహిత్య ప్రతినిధిగా వెళ్ళాను. కనుక సంస్కృతి పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి.

మరో ప్రస్తావనలో భారత జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు సముచిత గౌరవం ఇవ్వాలని కోరాను. కృష్ణాజిల్లా భట్ల పెనుమర్ర గ్రామంలో ఆయన గృహాన్ని నేడు 'పశువుల పాక'గా వాడుతున్నారు. ఆ ఇంటిని స్మారక చిహ్నంగా గుర్తించి, జీర్ణోద్ధరణ చేయాలని సూచించాను. తర్వాత అమలు జరిగిందని తెలిసింది. మాతృభాష నిర్బంధ బోధనపై బిల్లు ప్రతిపాదించాను. ఈ ప్రతిపాదన విద్యార్థి చదివే భాషల్లో మాతృభాష తప్పక ఉండాలని నిబంధిస్తుంది. అప్పుడు నేను ఏదో కొండంత ఆశతో ప్రతిపాదించాను. కొండలకే రంధ్రాల్లాగా ఏర్పడి ఇప్పుడు మాతృభాష పరిస్థితి ముందే చెప్పినట్లు తెలుగులో మాట్లాడితే దెబ్బలు తినడం, అదీ ఆంధ్రప్రదేశంలోనే కావడం– అంతకంటే దారుణమైన పరిస్థితి మరొకటి లేదు.

అధికార భాషా వ్యవహారాల సంఘం, శాస్త్రీయ సాంకేతిక, పర్యావరణ సంఘం వంటి కొన్ని పార్లమెంటరీ సంఘాలలో నేను సభ్యునిగా ఉన్నాను. వీటి పనిలో భాగంగా భారతదేశంతో పాటు, విదేశీ పర్యటనలు కూడా చేశాం. 'మొరాకొ'లో 2003లో జరిగిన ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ సమావేశాల్లో భారత ప్రతినిధి వర్గ సభ్యునిగా పాల్గొన్నాను. పారిస్‌లోని యునెస్కో కార్యాలయం సందర్శించి హైదరాబాద్ నగరానికి ప్రపంచ వారసత్వ నగరం ప్రతిపత్తి World Heritage status ఇవ్వాలని కోరుతూ నగర ప్రాచీనత్వం గురించి వివరించాను.

ఎం.పి. లాడ్స్ కింద నాకు పదుకొండున్నర కోట్లు ఇచ్చారని ఇంతకు ముందు చెప్పాను. వీటిని సద్వినియోగం చేశానని సగర్వంగా చెప్పుకుంటున్నాను. వీటిని సక్రమంగా అనేక సంస్థలకు కేటాయించాను. 'సద్వినియోగం'అని ఎందుకంటున్నానంటే నా కళ్లముందే తోటి లోకసభ సభ్యులు, రాజ్యసభ సభ్యులు "మీకు 10% ఇస్తాం, ఫలానావారికివ్వండి" అని చెప్పి బేరాలాడిన మహానుభావులున్నారు. అంతకంటే భయంకరమైనది. మరొకటి లేదు. ఆ రూపాయలు పదకొండున్నర కోట్లు నుంచే ఇరవై యైదు లక్షలు 'ఆంధ్ర సారస్వత పరిషత్తు'లో భవన నిర్మాణానికి అందించాను. పరిషత్తు నిజాం పరిపాలనలో వెలసిన తెలుగు భాషా సంస్థ. ఒరిస్సా వరద బాధితులకు కొంత ఇచ్చాను. గుజరాత్ భూకంప బాధితుల సహాయనిధికి మరికొంత ఇచ్చాను. షోలాపూర్‌లోని

పద్మశాలీ విద్యా సంస్థ భవన నిర్మాణానికిచ్చాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'నీరు-మీరు' అనే పథకానికి, కరీంనగర్‌లోని 'సారస్వత సదనం'కు బోయినపల్లి వెంకటరామారావు కోరిక మీద రూపాయలు పది లక్షలు ఇచ్చాను. వేములవాడలో భవనానికి, సిరిసిల్లలో మున్సిపల్ ఆడిటోరియానికి, కరీంనగర్ మట్టేపల్లిలో అంబేద్కర్ కమ్యూనిటి భవన నిర్మాణానికి నిధులిచ్చాను. అన్నీ సమదృష్టితో చేశాను. గాంధీని, అంబేద్కర్‌ను సమదృష్టితో చూశాను. వంశీ రామరాజు నిర్వహిస్తున్న 'వేగేశ్న' వికలాంగుల సంస్థ'కు రూపాయలు 40 లక్షలు ఇచ్చాను. భవన నిర్మాణం జరిగింది. కడపలో సి.పి.బ్రౌను గ్రంథాలయ భవన నిర్మాణానికి నేనిచ్చిన నిధులతో ఒక ప్రత్యేకమైన భవనమే ఏర్పడింది.

ఇక నా సాహితీ ప్రస్థానంలో రచయితగా కొన్ని దశలు చెపుతాను. నా ప్రసంగం ప్రారంభంలో దీనిని ప్రస్తావించాను. నేను హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడే పద్య నాటకాలు రాశాను. 'ప్రహ్లాద చరిత్ర' ఎక్కడ పోయిందో తెలియదు. అలాగే 'సీతాపహరణం' అనే నాటకం రాశాను. అదెక్కడ పోయిందో తెలియదు. 'భలే శిష్యులు' సాంఘిక నాటిక రాశాను. ఇవన్నీ మావూళ్లో ప్రదర్శించే వాళ్లం. నేనూ పాత్ర ధారణ చేసేవాణ్ణి మొట్ట మొదట. నేను పద్యరచన చేశాను. పల్లా దుర్గయ్యగారు నా పద్యాలు విన్నారు. "ఏమిటి రెడ్డి ఏం రాశావు?' అంటే అది "అసిత వారివాహ చ్ఛటావృతమయి బుగులు గొల్పుచు పొగరేగా గగనసీమ" అని అన్నాను. 'అసిత వారి వాహచ్ఛటావృతమయి ఎందుకు రెడ్డీ? ఇంత పెద్ద సమాసం మాకే అర్థం కాలేదు" అన్నారు. ఆ వరుసలో నేను పద్యాలు రాస్తూ, దాశరథికి అంకితం చేసిన 'జలపాతం'లో పద్యాలు పుంఖాను పుంఖాలుగా చేర్చాను.

"దాశరథీ! మనోజ్ఞ కవితాశరథీ శరదిందు చంద్రికా
పేశల కావ్య ఖండముల పిండిన నీ కలమందునన్ మహా
గ్రోశని పాతముల్ వెలయునౌర! మహేశుని కంటిలో సుధా
రాశి తరంగముల్ పటు హాలహల కీలలు పొంగినట్లుగా"

అంటూ దాశరథికి అంకితం చేస్తూ పద్యాలు రాశాను. ఆ వరుసలోనే

"అన్నలు లేని చింత హృదయాంతిక మందు జనింపలేదు నా
కెన్నడు; పైకి నవ్వు ప్రసరించి విషమ్మును దాచు దొంగ నా

గన్నల గుండియల్ బెదరగా; కవితాధ్వజ మెత్తినట్టి తె
ల్గన్నలు అన్నలౌదురు సుమా! నను కన్నులలోన నిల్పగన్"

ఇలా సాగి పోయింది నా పద్యధార.

నా కంటె ముందు జాషువ, విశ్వనాథ, రాయప్రోలు, కరుణశ్రీ, దాశరథి వంటి వారు పద్య రచనలో ఉద్దండులైన వారున్నారు. నేను గేయాన్నెన్నుకున్నాను. నా 'నాగార్జున సాగరం' కావ్యం ప్రప్రథమ కథాత్మక గేయ కావ్యం అని డా॥ తిరుమల శ్రీనివాసాచార్యుల వంటి విద్వాంసులు, విమర్శకులు చెప్పారు. ఇక ఇందులో కూడా సమాసాలు పెట్టాను.

"ఇక్ష్వాకు వంశ క్షి
తీంద్ర చంద్రుల కీర్తి
కౌముదులు నల్గడల
కలయ విరిసిన నాడు;
కృష్ణవేణీ తరం
గిణీ పయఃకింకిణులు
త్రిశరణ క్వాణాల
దెసల నింపిననాడు;
నేను జీవించి యు
న్నానంచు భావించి
పలికింతు గేయ కా
వ్యమును హృదయము పెంచి" అన్నాను.

ఇప్పుడైతే ఇంతగా ప్రౌఢ సమాసాలు వాడను.

నా కర్పూర వసంతరాయలు, విశ్వనాథనాయుడు కథాత్మ గేయ కావ్యాలు. 'ప్ర'పంచ పదులు కొత్త ప్రక్రియ. సినారె గీతాలు, సినారె గజళ్లు, ఋతుచక్రం, మరోహరివిల్లు,

గాంధీయం, ముత్యాల కోకిల, మంటలూ–మానవుడు, మార్పు నా తీర్పు ఇత్యాదులు, భూమిక, విశ్వంభర, 'మట్టీ–మనిషీ–ఆకాశం' వెలువరించాను. 'విశ్వంభర'కు జ్ఞానపీఠ పురస్కారం వచ్చింది. మట్టీ–మనిషీ–ఆకాశం దీర్ఘకావ్యం. ఇలా నా కవితాత్మక నిరంతర గమనం సాగుతోంది. 30,40 ఏళ్లుగా. ఏటేటా ఒక కవితా సంపుటిని నా జన్మదిన సందర్భంగా ఆవిష్కరించాలని ఒక నియమం పెట్టుకున్నాను. నాకు 'సన్మానం' అంటే ఒప్పుకోను నేను. నా జన్మదినం నాకు సన్మానోత్సవం కాదు, నా నూతన 'కవితా సంపుటి' ఆవిష్కరణోత్సవమే నా సన్మానం. ఆ రకంగా ప్రతి సంవత్సరం కవితా సంపుటిని ఆవిష్కరింప జేస్తున్నాను. 'రామప్ప' రూపకం అన్ని భారతీయ భాషల్లోకి అనువాదమైంది. అది రేడియో సంగీత రూపకం. అందులో ఒక పాత్రధారిగా డా॥ మంగళంపల్లి బాలమురళీ కృష్ణగారు పాడారు. 'ఈ నల్లని రాలలో, ఏ కన్నులు దాగెనో..." అని ఆయన గొంతులో పలికింది. నేను సినీ కవిగా రంగ ప్రవేశం చేసిన తర్వాత దాన్ని 'అమరశిల్పి జక్కన'లో పాటగా మలచుకున్నారు. నా రచనల్లో కొన్ని ఫ్రెంచ్, సంస్కృతం, హిందీ, కన్నడం, ఉర్దూ, మలయాళం, తమిళం మొదలైన భాషల్లోకి అనువాదాలయ్యాయి.

ఇక చలనచిత్ర గీత రచన ఘట్టం మిగిలింది. 'గులేబకావళి' చిత్రంలో పది పాటలు రాయమని ఆహ్వానించారు నట మూర్ధన్యులు ఎన్టీ రామారావు గారు. మొదటి పాట "నన్ను దోచుకొందువటే వన్నెల దొరసానీ..."– అది ఇప్పటికి నలభై తొమ్మిది సంవత్సరాలు అయిందనుకుంటాను. ఇప్పటికీ చైతన్య వంతంగా వినిపిస్తుంది సంగీత విభావరుల్లో. ఇక ఆ వరుసలో నేను రాసినవి కొన్ని ముఖ్యమైనవి అన్నపూర్ణ వారికి, ప్రతాప్ ఆర్ట్స్ వారికి ఎన్నో పాటలు రాశాను. ఇక ఎన్టీఆర్‌కు నాకు ఒప్పందం ఏమిటంటే 'సెలవుల్లో నేను వస్తాను' అని చెప్పాను. ఆయన పిలిచినప్పుడు నేను నిజాం కళాశాలలో లెక్చరర్‌గా ఉన్నాను. ఒక సంవత్సరం గడిచింది. నేను యూనివర్సిటీ రీడర్‌గా వెళ్లాను. వేసవి సెలవులు యాభై రోజులుగా ఉండేవి మాకు. సెలవు రోజుల్లో మదరాసులో ఉండేవాణ్ణి. అనేక సినీ సంస్థలు పాటలు రాయించుకునేవి. సెలవులే కాక శని, ఆది వారాల్లో కూడా వెళ్లేవాణ్ని. వారు రప్పించుకునేవారు. దాదాపు యాభై మంది సంగీత దర్శకులతో పనిచేశాను. అందులో తమిళంలో చాలామంది గొప్పవారున్నారు. ఎం.ఎస్. విశ్వనాథన్, మూడు భాషల్లో గొప్పవాడైన మహదేవన్, తెలుగు భాషలో సాలూరి రాజేశ్వరరావు వంటి వారితో కలిసి మూడు వేలకు పైగా 50 మంది సంగీత దర్శకులకు పాటలు రాశాను.

ఇవి కాక కొందరు హిందీ నిర్మాతలు నాచేత పాటలు రాయించారు. శంకర్-జై కిషన్‌కు రెండు పాటలు రాశాను. వారు ట్యూన్ ఇచ్చి పాటలు రాయించుకునే వారు. పూటకో పాట రాయించుకునేవారు. ఇక సి.రామచంద్ర ట్యూన్ ఇచ్చేవాడు కాదు "ఆప్ లిఖియే రెడ్డి సాబ్!" అనేవారు. అప్పుడు సి.రామచంద్ర 'అక్బర్ సలీం అనార్కలి'కి నేను రాసిన పాటలకు బాణీలు సమకూర్చారు. మచ్చుకు ఒకటి-

"సిపాయీ, ఓ సిపాయీ.... నీకై ఎంత ఎంత వేచి వేచి ఉన్నానో, ఈ పూల మనసు నడుగు అడుగు చెబుతుంది." ఇక ఓపి నయ్యర్‌కు రెండు పాటలు రాశాను. 'నీరాజనం'లో అద్భుతంగా ట్యూన్ ఇచ్చాడు. 'నిను చూడక నేనుండలేను, ఈ జన్మలో మరి ఆ జన్మలో ఇక ఏ జన్మకైనా... ఇలాగే". ఇక రవీంద్రజైన్ పుట్టుగుడ్డి; హిందీలో రామాయణానికి సంగీతం కూర్చాడు. అతణ్ణి ఎన్టీఆర్ 'బ్రహ్మర్షి విశ్వామిత్ర'కు పిలిచాడు. జైన్ స్వయంగా స్వరకర్త, పదకర్త. హార్మోనియం వాయిస్తూ బాణీ వినిపిస్తే నేను రాయాలి. అలా రాసిందే "జయహే విశ్వామిత్ర మహర్షీ జయహే సత్యాన్వేషీ, జయహే విశ్వామిత్ర మహర్షి". తర్వాత ఉషాఖన్నా అనే మహిళామణి తీసిన చిత్రానికి రెండు పాటలు రాశాను. బప్పీలహరి సంగీత దృష్టితోనే చూస్తాడు. అతనికి రెండు, మూడు పాటలు రాశాను. ఇందులో ప్రముఖ హిందీ గాయకుడు తెలుగు పాటలు పాడాడు. ప్రధానంగా చెప్పుకోదగ్గ వాడు మహమ్మద్ రఫీ. మహమ్మద్ రఫీ వినయ సంపన్నుడు. 'రెడ్డి సాబ్! ఏ కైసే బోల్తే హై తెలుగు మే' అని అనేవాడు. నాకు రెండు భాషలు తెలుసు కాబట్టి నేను వినిపించేవాణ్ని- యహ ఫర్ దేఖ్, తెలుగుమే 'సా' హై, 'జా'హై అని. సాధ్యమైనంత వరకు 'స'కారం, 'జ'కారం లేకుండా మాటలు పొదిగేవాణ్ణి.

'ఎంతవారుగానీ వేదాంతులైన గాని వాలు చూపు చూడగానె తేలిపోదురోయ్ కైపులో, కైపులో కైపులో' అని 'భలే తమ్ముడు' చిత్రానికి పాటలు రాశాను. ఈ రకంగా అనేక గీతాలు తెలుగు అర్థమయ్యే పద్ధతిలో చెప్పి గీతాలు రాశాను. ఇంకా ఎంతోమందికి ఎన్నో విధాలుగా పద స్వరూపం తెలిపి వారు పాడుతున్నప్పుడు సవరించడం జరిగింది. నా గీతాలు ఎక్కువగా ఘంటసాల వారు గానం చేశారు. వారు పాడిన పాటల్లో గీతరచయితగా చూసుకుంటే అత్యధిక సంఖ్యలో నేను రాసిన గీతాలు వారు పాడారు అని తెలుసుకుని గర్వపడుతున్నాను.

ఎంతటి ప్రబంధానికైనా క్షీణ ప్రబంధయుగం వస్తుంది. క్షీణ ప్రబంధంలో మాటల విలువలు పోయి రకరకాలుగా మరో రకంగా మారిపోతాయి. తెలుగులో కూడా

మారిపోయింది. ఎప్పటి ధోరణి అప్పుడు ఉంటుంది. ఇటీవల రామానాయుడి 'ప్రేమించు' సినిమాలో 'అమ్మ'పైన 'కంటేనే అమ్మ అని అంటే ఎలా, కడుపు తీపి లేని బొమ్మ అమ్మే కదా, రాతిబొమ్మే కదా" అని రాశాను. దాని తర్వాత మరొకటి 'మేస్త్రీ'– దాసరి నారాయణరావు దర్శకత్వంలో తెలుగు భాష గురించి 'మన మాతృభాష తెలుగు మన రక్త ఘోష తెలుగు' రాశాను. నాకు ఎక్కడ అవకాశం ఉన్నా సినిమాల్లో కూడా తెలుగు భాషా వైభవాన్ని ప్రశంసించాను. 'తెలుగు భాష మనది– నిండుగ, వెలుగు జాతి మనది– అన్నాను. 'మేస్త్రీ' పాటలో కూడా "గోదావరీ కృష్ణ తుంగభద్రా నదుల సాధు సలిల క్షీర ధారలే సాక్షులుగ, ప్రత్యేక భాష మనది– ప్రాచీన భాష మనది" అంటూ మన ప్రాచీన భాష గురించి చెప్పుకున్నాను.

అవార్డుల విషయానికి వస్తే నా 'ఋతుచక్రం' కావ్యానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, 'మంటలూ–మానవుడు' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చాయి. ఇంకా భారతీయ భాషా పరిషత్ పురస్కారం, సోవియట్ లాండ్ ఏ కేటగిరి అవార్డు, కుమరన్ ఆశాన్ (కేరళ) అవార్డు, రాజలక్ష్మీ అవార్డు, 'విశ్వంభర' కావ్యానికి భారతీయ 'జ్ఞానపీఠ' పురస్కారం లభించాయి.

సత్కారాల విషయానికి వస్తే మీరట్, నాగార్జున, ఆంధ్రా, కాకతీయ, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి. భారతీయ ప్రభుత్వం నుంచి పద్మశ్రీ, పద్మభూషణ్ గౌరవాలు అందుకున్నాను. ఇతర రాష్ట్రాల్లోని ఆంధ్రా సంఘాల ఆహ్వానం మేరకు ఢిల్లీ, ముంబయి, మైసూర్, భువనేశ్వర్, కొల్‌కతా, షోలాపూర్, నాగపూర్ కొచ్చిన్ వంటి ప్రదేశాలు సందర్శించి తెలుగు సాహిత్యం గురించి ప్రసంగించాను.

విదేశీ పర్యటనల్లో నా మొట్ట మొదటి పర్యటన 1981 'చికాగో'లో తానా సంస్థ జరిపిన 'తెలుగు మహా సభ'లకు వెళ్లాను. అక్కడి పదిహేడు ఇతర నగరాలు, రాష్ట్రాలు ఆహ్వానించాయి. అక్కడి వారు నన్ను గుండెల కద్దుకున్నారు. జ్ఞాష్వేల్ డా. రామయ్య అని ఉన్నారు. వీరు నా మిత్రుడు మధుసూదనరావు సహకారంతో 'కర్పూర వసంత రాయలు' కావ్యగానం రికార్డింగు ఏర్పాటు చేశారు. ఇది మంచి కార్యక్రమంగా మిగిలిపోయింది. ఇక అమెరికాతో పాటు ఇంగ్లండ్, ఫ్రాన్స్, జపాన్, రష్యా, కెనడా, ఇటలీ, డెన్మార్క్, థాయ్‌లాండ్, యుగోస్లేవియా, గల్ఫ్‌దేశాలు, ఆస్ట్రేలియా, సింగపూర్,

మలేషియా, మారిషస్ మొదలైన దేశాల ఆహ్వానాల మీద వారు పంపిన టికెట్ల పైన వెళ్లాను నేను. సగర్వంగా చెప్పేదేమిటంటే ఎన్ని దేశాలు తిరిగినా ఏ ఒక్క దేశానికీ నా జేబులో నుంచి పైసా ఖర్చు పెట్టకుండా వెళ్ళొచ్చాను నేను. యుగోస్లేవియా లోని 'స్ట్రూగా'లో జరిగిన అంతర్జాతీయ 'కవి సమ్మేళనం'లో భారతీయ భాషల ప్రతినిధిగా పాల్గొన్నాను. అక్కడ నన్ను తెలుగులో చదవాలన్నారు. తెలుగులో కొంచెం స్వరబద్ధంగా పాడుతుంటే చప్పట్లు కొట్టారు. దీనితో భాష అర్థం కావలిసిన అవసరం లేదు అని తెలిసింది. తర్వాత అర్థం చెప్పాను.

ఎన్నో సాంస్కృతిక సంస్థలతో నాకు సన్నిహిత సంబంధం వుంది. 'రసమయి' ఎం.కె. రాము 'సుశీలా నారాయణరెడ్డి' పురస్కారం ప్రారంభించి ఇప్పటికీ జరుపుతున్నాడు. 'వంశీ' సంస్థ నా జన్మదిన సందర్భంగా నా గ్రంథావిష్కరణ సభ జరుపుతుంది. కరీంనగర్‌లో నా సాహిత్యాభిమానులు ముఖ్యంగా గంద్ర లక్ష్మణరావు సారథ్యంలో ప్రతి సంవత్సరం సినారె సాహిత్య పురస్కారంగా ఒక ఉత్తమ కవితా సంపుటికి ద్రవ్యరూపంలో రూపాయలు పదివేలు ప్రదానం చేస్తున్నారు. పాలకొల్లులో నా గజల్ మానస పుత్రుడు డా॥ గజల్ శ్రీనివాస్ 'సినారె కళాపీఠం' నెలకొల్పి ప్రతి ఏటా రూపాయలు పదివేలు ప్రదానం చేస్తున్నాడు.

లోగడ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యుడిగా ఉన్నాను. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడిగా ఉన్నాను.

చివరికి చెప్పేది–నేను ప్రసంగం ప్రారంభించింది ఆంధ్ర సారస్వత పరిషత్తుతో. ముగింపు కూడా ఆంధ్ర సారస్వత పరిషత్తుతోనే. ఇది మా మాతృసంస్థ అని చెప్పుకోవచ్చు. ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలంగాణలోని తెలుగు వారందరికీ భాషాపరంగా మాతృ సంస్థగా ఉందని నేను భావిస్తున్నాను. ఆ రోజుల్లో మాడపాటి హనుమంతరావుగారు, సురవరం ప్రతాపరెడ్డి గారు, దేవులపల్లి రామానుజరావుగారు వంటి మహనీయులు దీన్ని నెలకొల్పారు. రూపకల్పన చేశారు. దీనికి ఏవో కొన్ని వన్నెలు, చిన్నెలు దిద్దింది నేను. దేవులపల్లి రామానుజరావు గారి కృషి అసమానమైంది. నా తర్వాత నారాయణరెడ్డి గారే ఉండాలి అని డా॥ రామానుజరావు గారు అన్నారు. ఇప్పటి వరకు ఉన్నాను. పరిషత్తు పక్షాన "పరిణతవాణి" ప్రసంగాలు, చర్చా గోష్ఠులు, వివిధ కళోత్సవాలూ, సదస్సులూ, ప్రసంగాత్మక ప్రదర్శనలూ, గ్రంథావిష్కరణలూ, అధ్యయన శిబిరాలూ వంటి

విలక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పండిత శిక్షణ కళాశాల వుంది. ప్రాచ్య కళాశాలలో తెలుగులో స్నాతకోత్తర స్థాయి కోర్సులున్నాయి.

ఈ ప్రసంగంలో యువతరానికి ఇచ్చే సందేశం– నా ప్రసంగంలోని ముఖ్య అంశాలు రాబోయే తరంవారు కూడా ఒక ప్రతీకగా, ఒక గుర్తుగా భావించి, వాళ్ళ జీవితాన్ని చక్కదిద్దుకోవడం, మలచుకోవడం అవసరం ఎంతైనా వుంది అని నా ప్రసంగమే చెప్పింది. నా జీవిత ప్రస్థాన క్రమమే నా సందేశం. కాబట్టి మరోసారి ఇలా ఉండాలి, అలా ఉండాలని తెలుపను. ఆంధ్ర సారస్వత పరిషత్తు సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తెలుగు భాషకు మరింత వైభవం చేకూరాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.



కె.వి.రాఘవాచార్యులు

య త్ప్రసాదాద్బహుజనాః

ప్రాపురుద్యోగమిహచాక్షరాస్యతామ్॥

సేయ మాంధ్ర సారస్వత

పరిషదేధతా మా చంద్రతారకమ్॥

ఆంధ్రసారస్వత పరిషద్వేదిక మీద విద్వత్తల్లజులు, కవులు, వయోజ్ఞాన వృద్ధులెందఱో, 'పరిణతవాణి' ప్రసంగం ద్వారా తమ జీవితానుభవాలను వ్యక్తం చేశారు. కాని కేవలం ఎనిమిది పదులు దాటిన సామాన్య వ్యక్తినైన నేను 'పరిణతవాణి' కలవాడనని, ప్రసంగించడం సముచితమనుకోవడం లేదని విన్నవించుకొంటున్నాను.

ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితిని పొందడానికి సాధించిన ప్రగతిని సమీక్షించుకోవడ మవసరమనియే కాబోలు, నన్ను ఎంపిక జేసిన ఆంధ్ర సారస్వత పరిషదధ్యక్షులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు, పద్మభూషణ్ ఆచార్య సి. నారాయణరెడ్డిగారికి, ప్రసంగం వాయులీనం కాకుండా, దానికి అక్షరాకృతిని కల్పించి, అందించవలసిందిగా ఆదేశించిన ఆం.సా. పరిషత్ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారికి హార్దికాభివందనాలు.

కరీంనగరం జిల్లా, శిరిశిల్ల తాలుకాలో 'రాచర్ల పరగణ' అనే పేరుతో ఏడు గ్రామాలు 'మఖ్తి'గా పరిగణింపబడేవి. ఈ సప్త గ్రామాలకు నీటి పారుదల గల పెద్ద చెఱువుకు పర్వతాల మధ్య ఆనకట్ట వేసిన కిషన్ దాసు రాజావారికి నాలుగు ఊళ్ళను (011=6

దస్సానదా) ఇచ్చి, మూడు ఊళ్లను (01=6 ఛయ్యానగా) మాత్రముంచుకొన్న మఖ్తేదార్ (దేశపాండ్య) నారాయణపురంలో నివసించేవాడు. ఏడు గ్రామాలకు (మఖ్తాకు) ఎల్లారెడ్డిపేటలో తహశీలు కచ్చేరి ఉండేది.

నారాయణపురంలో శ్రీ సీతారామస్వామి దేవాలయం, ఎల్లారెడ్డి పేటలో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం ఉన్నాయి. ఈ ఆలయాల్లో నిత్యం త్రికాలాల్లో ధూపదీప నైవేద్యాలు, తిరు నక్షత్రోత్సవాలు, ధనుర్మాసోత్సవం, బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతుంటాయి. వేద మూర్తులు, సంస్కృత పండితులు, సంగీత విద్వాంసులు, విద్వత్కవులు, కళాకారులు, దేవదాసీలు, భగవత్సేవా వాహకులు, భజంత్రీవారు - ఒకరికేమిటి - అందరికీ భూములను 'ఇనాం'గానిచ్చి మఖ్తేదార్ ఆదరంగా చూచేవాడు.

మా పూర్వులు దక్షిణ దేశం నుంచి సంచారార్థమై వచ్చినందువల్ల 'మా గ్రామంలో ఆచార్య పీఠస్థులు నివాసులై యుండవలె'నని ఉదారాశయంతో ఐదుపుట్ల వరి ధాన్యమున్న (గరిశను) పెద్ద గృహాన్ని దానమిచ్చి, దేవాలయంలో స్థానాచార్యులుగాను, నాల్గు ఎకరాల భూమిని ఇనాముగా నిచ్చి, నారాయణపురంలోనే నిల్పి యుంచారని పెద్దలు చెప్పినమాట.

ఇప్పుడు ఎల్లారెడ్డిపేట (మండలం) గ్రామానికి ఒక కిలో మీటర్ దూరాన ఉన్న, ఆ నారాయణ పురమే నా జన్మస్థానం. నేను త్వరగా మాతృ గర్భం నుంచి బయట పడడానికి (గడి) కోట గుమ్మానికి కాపలాదారులైన నల్గురు అరబ్బీ జవాన్లు వచ్చి, ఇంటి ముందు పద్దెనిమిది సార్లు తుపాకులను పేల్చి బాగా శబ్దప్రకంపన జేశారట. అది విభవనామ సంవత్సరం. 1929 క్రీ.శ. పుష్య శుద్ధ ద్వాదశి నాడు జన్మించానని జన్మ పత్రికలో వ్రాసియున్నది. తల్లి వేంకటమ్మగారు. తండ్రి శ్రీమాన్ కారంచేటి తిరుమల మనోహరాచార్యస్వామి వారు. నాకు కారంచేటి తిరుమల వేంకట రాఘవాచార్యులని నామకరణం చేశారు. నాకు నలుగురు తమ్ములు, ఇద్దఱు చెల్లెండ్రు. చివరి తమ్ముడు డా॥ టి. వెంకటరమణాచారి (M.S.O.U) 22మే2010 నాటి రాత్రి పరమపదించాడు.

మాతండ్రిగారు నాకు మాటలు వచ్చినప్పటినుంచి స్తోత్ర పాఠాలను, ఎక్కాలను కంఠస్థం చేయించారు. నాకు ఐదవయేట, నాతమ్ముడు పార్థసారథికి మూడవయేటనే, తహశీల్ కచ్చేరిలో పేష్కారుగా ఉన్న శ్రీమాన్ శేష భట్టర్ శ్రీనివాసాచార్యుల చేత అక్షర స్వీకారం జరిపించారు. క్రమంగా కట్టె పలకల మీద కాకృతం, పెద్ద బాలశిక్ష లోని పదాలను, ఎక్కాలను, బొట్టు, పరక, వీసం, పుట్టి లెక్కలు వ్రాయడం, వ్రాసిన కార్డులను

ఉత్తరాలను చదివించడం నియమంగా ఉండింది.

మొట్ట మొదట 'తల్లీ నిన్ను దలంచి పుస్తకము జేతన్ బట్టితిన్? క్షోణితలంబు నన్నుదురు సోకగ మ్రొక్కి నుతింతు అంబ! నావాంబుజోజ్జ్వల కదాంబుజ!' అనే మూడు పద్యాలను పలకల మీద వ్రాసి చెప్పగా వాటిని మరునాడు చూడకుండా నిర్దుష్టంగా మేము వ్రాసి చూపించడం ఒక నేర్పు.

తరువాత ఆంధ్రనామ సంగ్రహం, సాంబ నిఘంటువు పద్యాలు, అమరకోశం ఉదయాన చెప్పిన పాఠాలను చింతన (పూటకు 25సార్లు ఆవర్తి. 4 పూటలు 4×25=100 ఆవృత్తులు) చేసి మఱునాడు వాటిని నోటికి అప్పజెప్పాలి. పగలు గం.3లకు కంచెలో మేసివచ్చిన ఎడ్లను కచ్చరానికి పూన్చి, అందులో పరుపు, రెండు దిండ్లు పెట్టి మమ్ములిద్దరిని కూర్చోపెట్టి, మా తండ్రిగారు రెండుగంటలవరకు 4,5 క్రోసుల దూరం గజ్జెల చప్పుడుతో ఎడ్లు పరుగుదీయునట్లు సారథ్యం చేస్తూనే, ఉల్లసిల్లిన మాకు ద్రావిడ దివ్య ప్రబంధాన్ని – పాశురాలను– సంథ చెప్పేవారు. ముఖ్యంగా నాకు ఎనిమిదవయేట ఆవునూరిలో శ్రీమాన్ ఆచి నృసింహాస్వామివారు జరిపే ధనుర్మాస కొఠాయి ఉత్సవంలో దివ్య ప్రబంధ్యాపకులందఱు ఒక వరుసలో, మేమిద్దఱము వారి కెదురుగా కూర్చొని పుస్తకం పట్టకుండా మూడు రోజులు దివ్య ప్రబంధాన్ని–మున్నడి, పిన్నడిగా శేవకాలం చేయాలని అనుశాసించారు. ఉత్సవాంతంలో 'మీ కుమారులను శురా ధ్యాపకులను చేశావయ్యా!" అని మా తండ్రిగారిని ప్రశంసిస్తూ, పెద్దలతో సమానంగా మాకు సంభావన ఇచ్చి 'వార్షికం' ఏర్పాటు జేశారు ఆచి. స్వామి వారు. విద్యాభ్యాసానికి బాల్యమే యోగ్యమన్నారు.

తర్వాత శబ్దమంజరిలోని శబ్దాలను, ధాతువులను, సమాసవృత్తిని, రామాయణ సంగ్రహాన్ని మాకు పాఠం చెప్పారు. ఉదయాన నాలుగు గంటలకే లేపి, ఒకనాడు స్తోత్రాలను, మరొకనాడు అమరాన్ని, ఇంకొకనాడు దివ్వ ప్రబంధాన్ని ఆవర్తి చేయించే వారు. ఒక ఏడాది తేడాతో మా అన్నదమ్ములకు ఉపనయం చేశారు. వెంటనే మా తండ్రిగారే మాకు పంచ సంస్కారాలనూ కృపజేశారు. మాయూరిలో బ్ర.శ్రీ. వేదమూర్తుల జోగా వెంకయ్య శర్మగారు క్రమాంత స్వాధ్వాయిగా ప్రసిద్ధులు. వారివద్ద విద్యార్థులెందఱో పంచదశకర్మలనేకాక, వేద విద్యనునేర్చి, ప్రతిష్ఠాంత యాజ్ఞకులుగా పేరుగాంచినారు. ప్రతిదినం మేము ఉ.గం. 8లనుంచి గం12 వరకు దావళిని గట్టుకొని పోతే, మాకు శర్మగారు సంధి చెప్పి, పలకల మీద వ్రాసిన వేద పాఠాన్ని వల్లెవేయించడమూ వారి ఇంట్లోనే జరిగేది.

ఉ.వే. శ్రీమాన్ నమిలికొండ శ్రీ రంగాచార్య శాస్త్రిగారు మా యింటి ప్రక్కన ఉన్న వారి యింట్లో సంస్కృత విద్యార్థులకొక పదుగురికి తామే భోజన వసతులను కల్పించి, విద్యనభ్యసింప జేసేవారు. ఎల్లారెడ్డిపేట శ్రీ వేణుగోపాల దేవాలయం లోనే సంస్కృత పాఠశాల నేర్పరచి, భగవాన్‌దాసు రాజాగారు నెలకు (రూ.15/లు) పదునైదు రూపాయిలనిస్తూ, శాస్త్రి గారిని సంస్కృతాధ్యాపకులుగా నియమించారు. మధ్యాహ్నం ఎల్లారెడ్డిపేటకు శాస్త్రిగారితో పాటు అందరం పోయి, ఇతర గ్రామాలనుంచి వచ్చిన విద్యార్థులతో పాటు పాఠాలు చెప్పించుకొని, చింతన చేసే వాళ్ళం. పాఠశాలవేళ నాలుగు గంటలు మాత్రమే యుండేది. సాయం గం. 5లకు గృహోన్ముఖుల మవడం జరిగేది.

ఇక, శర్మగారు వైదికంగా మాకు పంచ దశకర్మలను, దేవయాజ్ఞిక ప్రక్రియను ప్రయోగాత్మకంగా నేర్పినారు. తాళపత్ర గ్రంథాల్లో ఉన్న పాఠ్య భాగాన్ని జూచి, కట్టె కలాలను శిరాబుడ్డిలో ముంచి దొడ్డుకాగితాలపైన వ్రాసుకొని భద్రంగా ఉంచడం అలవాటైనది. ఒకనాడు బందరు మచిలీపట్నంలో చల్లావారి యాజుషస్మార్త మన్త్ర పాఠం ప్రథమభాగాన్ని V.P. ద్వారా తెప్పించుకొన్నాను. నాలుగుతూముల పడ్లను కోమటికి కొలిచి ఇస్తే, నాలుగు రూపాయిలిచ్చాడు. ఆ నాలుగు రూపాయిలతో V.P. విడిపించుకొని పుస్తకం తీసుకొన్నాను. ధాన్యం అంత చౌకగా ఉండింది.

ఒకప్పుడు శర్మగారు, రాఘవాపురంలో శ్రీ రఘునాథరావుగారి కూతురు వివాహానికి నన్ను తోడ్కొని పోయి, నాతో వైవాహిక ప్రక్రియను జరిపించారు. అక్కడ వధూజన పక్షాన బ్ర.శ్రీ.వే. జగదేకపురం రామచంద్రయ్యగారు ఉన్నారు. వారు నన్ను వధూ గృహ ప్రవేశ హోమం చేయుమని ఆజ్ఞాపించారు. మా గురువుగారు ప్రోత్సహించారు. నేను ఆ హోమం చేస్తున్నప్పుడు తద్విధానాన్ని చూస్తూ, రామచంద్రయ్య గారు "ద్వంద్వం న్యంచి పాత్రాణి ప్రయునక్తి" అంటే ఏం జేస్తున్నావని అడిగారు. 'అయ్యా!' న్యంచి కాదు. 'న్యంచి' అనే పదమది. బోర్ల వేసి అనే అర్థం కలది కదా! అగ్ని హోత్ర వేదికకు ఉత్తర దిశలో దర్భలను పరచి, వాటిపైన దక్షిణోత్తర సమాంతరంగా రెండేసి పాత్రలను –దర్వి, ఆజ్యస్థాలి; ప్రోక్షణ, పూర్ణపాత్ర; ఇధ్మ, సృవా'లనే – షట్పాత్రలను తలక్రిందులుగా ఆసాదించడం విధి కదా!" అంటూనే క్రియను చేస్తున్నాను. నా హస్త విన్యాసాన్ని (చేయి తిరుగడాన్ని) గమనించి, వారు మా గురువు గారితో 'మీ అంతే వాసి క్రియా ధక్షడే నండోయ్; అలాగా విధిని అర్థం చేసుకొని క్రియను ఆచరించే వారు అరుదుగా ఉంటారు'

అనగారె వేరు మీరు వాణ్ని పొగడవద్దు, దీవించాలి అని పలికారు. రామచంద్రయ్యగారు నాతో, నీవు 'హరిదత్త భాష్యం' చదువు, కర్మకౌశలం కలుగుతుంది' అన్నారు. 'అది మీ ఆశీర్బలం' అని నమస్కరించాను.

నాలుగేండ్ల వేదాధ్యయనకాలంలో ఒకనాడు 'ధమస్తద్వాతో' అనే 'పనస' కు 'ఘన'పాఠం అప్పజెప్పుతున్నప్పుడు 'కౌలు' తప్పిజెప్పినాను. 'ధనుర్దక్షిణాత్' అనే చోట 'ధనురుత్తరాదుత్తరాద్ధనుర్ధను రుత్తరాత్' అని చెప్పబోతుండగా గురువుగారు తమచేతికఱ్ఱతో, ఆనాడే గీయుంచుకొన్న గుండు మీద బలంగా కొట్టారు. మంట మండింది. ఏడ్చాను. 'సరి ఈనాటికి చాలు, రేపు తప్పకుండా అప్పజెప్పు'మని పొమ్మన్నారు. దండం సమర్పించి ఇంటికి వచ్చాను. ఆకాలాన ప్రతి శుక్రవారం సెలవు కాబట్టి, సంస్కృత పాఠశాలకు ఆనాడు పోలేదు.

గురువుగారు తమ ఇంటికెదురుగా ఉన్న మా ఇంట్లోకి వచ్చి, వరండాలోనున్న ఒక కుర్చీలో కూర్చొని 'రాఘవా! ఇలారారా!' అని పిలిచాడు. ఎదుటికి పోగానే నన్ను తమ ఒడిలోకి తీసుకొని 'ఈనాడు పరధ్యానంలో నున్నావా? ఎన్నడూ ఒక్క దెబ్బతినలేదు. నీ తల మీద కొట్టాను. ఇంత బొడుసు వచ్చిందేమిరా' అంటూ నా గుండును నిమురుతుండగా, వారి కన్నీటి చుక్కలు రెండు నాగుండు మీద పడ్డాయి. నేను తలనెత్తి చూచాను. ఉత్తరీయంతో తమ కన్నులను తుడుచుకొంటున్నారు. నేనూ ఏడ్చాను. గురువుగారు గద్గద స్వరంతో 'ఇదే మొదటి దెబ్బ, చివరిది కూడా! ఇక నిన్ను కొట్టను రా" అన్నారు.

"శ్రద్ధావాన్ లభతేజ్ఞానం తత్పరస్సం యతేంద్రియః" అని గీతాచార్యులు చెప్పినట్లు, శ్రద్ధ, తత్పరత, ఇంద్రియనిగ్రహం– ఈ మూడూ జ్ఞానార్జనకు, విజయానికీ సాధకాలు. జ్ఞానం అనే పదంలో 'జానాతి, ఇచ్ఛతి, యుతతే' అనే అర్థాలున్నాయి. జ్ఞానం అనుష్ఠాన పర్యవసాయి అన్నమాట. 'జ్ఞానస్యతు తిస్రోభార్యాః బుద్ధిర్మేధా స్మృతిస్తథా!" సమగ్ర వ్యవహార గ్రహణశీలమైనది జ్ఞానం. జ్ఞానాన్ని అనుసరించేవి బుద్ధి, మేధ, స్మృతి. ఈ హోమాలచే కార్యాన్ని సాధించేది బుద్ధి– సంగతానుభవాలను ధారణ చేసేది మేధ. సద్యఃస్ఫురణశక్తి స్మృతి యనబడుతుంది. తల్లిదండ్రులు శారీరకమైన జన్మనిస్తారు. ఆచార్యోహి విద్యాతస్తం జనయతి' గురువు జ్ఞానజన్మనిచ్చి, తత్ఫలితంగా పునః జన్మ లేకుండా చేస్తాడు.

భారతీయ తత్త్వశాస్త్రరీత్యా, మానవుడు జన్మతోనే ఋణత్రయంతో పుడుతాడు.

వాటిలో తత్త్వజ్ఞానాన్ని మనకు పరంపరగా అందించిన ప్రధానమైన ఋష్యృణాన్ని వేదశాస్త్రాధ్యయనం చేతనే మనం తీర్చుకోవలసి యుంటుంది. రాఘవా! నీకు ద్వయో పనిషత్తును చెప్పినాను కదా! 'షట్పదో యంద్విఖండః' అనబడే ద్వయమంత్రాన్ని సంధ్యావందన మాచరించిన తర్వాత శ్రద్ధతో అర్థాన్ని స్మరిస్తూ పునశ్చరణ చేయాలి నీవు" అన్నారు. సరే! అన్నాను.

ఈ సన్నివేశాన్ని తిలకిస్తున్న మా తల్లిదండ్రుల కన్నులూ చెమ్మగిల్లాయి. మా నాన్నగారు "వాత్సల్య మంటే దోషాన్ని గుణంగా మల్చుకోవడమని కదా అర్థం. 'గురవో దీనవత్సలాః అన్న మాట క్రియాసాపేక్ష మయింది. 'చదువుకో దెబ్బ, సాముకోపోటు' అన్నట్లు నీ ప్రయత్నమంతా వాణ్ని చక్కదిద్దడానికే కదా! ఎందుకింత చింత పడుతున్నా వన్నయ్యా" అని మాగురువు గారిని అనునయిస్తూ తన నశ్యపు డబ్బిని వారికి అందిచ్చి, ఇర్వురూ (ముక్కు పొడుమును) పీల్చుకొన్నారు. 'స్థాలిత్యేశాసితారం' అనేమాటకు గురువు అంటే ఎంతో శ్రేయోభిలాషి కదా! అని అప్పుడు నాకు అర్థమయింది.

సంస్కృత పాఠశాలలో (5) ఐదు సంవత్సరాలు చదివిననూ, ఐదు కావ్యాలు పూర్తి కాలేదు. రఘు వంశంలో చతుర్థ సర్గ నారంభించి ముందు వెనుక మొత్తం తొమ్మిది సర్గలు వ్యాఖ్యానంతో సహ కంఠస్థం చేస్తే గాని ముందు పాఠం చెప్పేవారు కాదు. కుమార సంభవంలో మొదటి రెండు సర్గలు, ఐదు, ఆరు సర్గలు సవ్యాఖ్యగా చదివినాము. మేఘసందేశం పూర్వోత్తరాలు, వీటితో పాటు హితోపదేశం, భర్తృహరి శతకత్రయం, కాలామృతం ఉపవాచకాలుగా పాఠం చెప్పినారు. మాతోపాటు బ్ర.శ్రీ. దోర్భల విశ్వనాథ శర్మ, తిగుళ్ళ వేంకటేశ్వరశర్మ, రాచెర్ల వెంకటేశ్వర్లు, శ్రీమాన్ (గుమ్లాపురం) శ్రీనివాసాచార్యులు (భారవి) కిరాతార్జునీయం వరకు సహాధ్యాయులుగా నున్నారు. ప్రతిదినం రెండు, మూడు శ్లోకాలను మాత్రమే వ్యాఖ్యాన సహితంగా పాఠం చెప్పేవారు. మఱునాడు వ్యాఖ్యానంతో (నోటికి) అప్పజెప్పవలసిందే. మాకంటె పూర్వవిద్యార్థులైన బ్ర.శ్రీ. బొప్పాపురం గోపయ్యగారు, శిరాశనగల్ల కృష్ణమాచార్యులు వ్యాస భాగవతాన్ని, శ్రీమద్రామాయణాన్ని, వ్యాఖ్యానంతో సహ, పదిహేను శ్లోకాలను చదివేవారు. శాస్త్రిగారు పాఠప్రవచనార్థం వారికై ఎక్కువ సమయాన్ని కేటాయించేవారు.

విద్యార్థులకు ఇక్కడ ఎన్నాళ్ళు చదివినా, ఉపాధిపత్రం మాత్రం (Certificate) లభించదనే భావం పొటమరించింది. అంతలో కరవు వచ్చింది. ఎకరానికి కొంత ధాన్యం

సర్కారుకు కొలచి ఇవ్వవలసిన కంట్రోల్ కాలం దాపరించింది. శాస్త్రిగారు బ్రాహ్మణ, శ్రీవైష్ణవుల గృహాల్లో- ఇంటికొక విద్యార్థిని భోజన వసతులకై నియమించి ఉంచారు. ఇక శాస్త్రిగారి యింట్లో వారి బంధువుల బాలురే ముగ్గురు, నల్గురు ఉండేవారు. ఆ సందర్భంలో బ్ర.శ్రీ. దోర్బల విశ్వనాథశర్మగారు 'తెనాలి'కి వెళ్ళారు. శ్రీ. శిరిశనగళ్ళ శ్రీనివాసాచార్యులు సీతారాంబాగ్-హైదరాబాదుకు పోయారు. మా సతీర్థ్యులందఱికి మద్రాసుకు విద్యాభ్యాసం కోసం వెళ్ళిన బ్ర.శ్రీ. దొంతి శివ్వంపేట విశ్వనాథశాస్త్రి గారు ఆదర్శంగా ఉన్నారు.

'నాన్నగారూ! మాతోటి విద్యార్థులలో కొందఱు పట్టణాల్లో విద్యాభ్యసనం చేస్తే ఉపాధి పత్రం లభిస్తుందని వెళ్ళిపోయారు. మీరు మా ఇద్దరిని కూడా తెనాలికో, హైదరాబాదుకో దయతో పంపిస్తే, పోయి అక్కడ చదువుకొంటా'మని ప్రార్థించాము.

“పరస్థలానికి పోతే సమయానికి ఆహారం లభించదు. మీ దుస్తులు మీరే ఉతికి ఆరవేసుకోవాలి. మీదు మిక్కిలి విద్యార్థులందఱు సహన శీలురుగా ఉండదు. జగడాలతోనూ దెబ్బలాడుతుంటారు. ఎంతో కష్టపడవలసివస్తుంది. అయినా, మిమ్ములను విడిచి పెడితే మాకు నిద్రాహారాలు సరిగా ఉంటాయా? ఇక్కడ చదువుకేం కొదువ ఉంది? శాస్త్ర పురాణాలను మన ఊరిలోనే ఉండి చక్కగా నేర్చుకోవచ్చు. వేరే చోటికి వెళ్లి విద్యనార్జిస్తామనే తలపును తలకెక్కించుకోక, మన యింట్లోనే తృప్తిగా భోజనం చేస్తూ, ముప్పొద్దులు నిర్విరామంగా చదువును సాగిస్తే, మీరే బాగుపడుతారు” అని నయాన భయాన బోధించారు నాన్నగారు.

తత్ఫలితంగా, మా యిద్దఱన్నదమ్ములకు లౌక్యం తెలియకుండా అయింది. గోటి గొట్టరాదు; బొంగురం వేయరాదు;. మోట రెక్కలేదు; రైలు జూడలేదు; కూపస్థ మండూకంలా ఉండింది మా స్థితి. మాకు ప్రవచన చాతుర్యం కలుగుతుందని గుడిలోనో, గడిలోనో పురాణమో, హరికథయో జరుగుతుంటే అక్కడ మమ్ములను కూర్చో పెట్టేవారు. గూటిలో ఆముదపను దీపకాంతిలో, మడత పడితే ముక్కలయ్యే పుటలలోని చిన్న అక్షరాలు గల జీర్ణగ్రంథాలలో పాఠ్యాంశాలను చింతన చేసిన రీతిని ఇప్పుడు తలచుకొంటే ఆశ్చర్యమనిపిస్తుంది. పండితులు, కవులు పెట్రోమాక్స్ వెలుగులో రాత్రిపూట సాహిత్య చర్చలను, ఆధ్యాత్మిక విషయాలపైన వివాదాలను జరిపేవారు. ఆ రోజుల్లో మహారాజశ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు యా యూరికి వచ్చి కవులను సమావేశపరిచారట. శ్రీమాన్

ఆచి. నృసింహాచార్య స్వామివారు, పదిర కృష్ణమూర్తిగారు, శ్రీరంగాచార్యశాస్త్రిగారు, బావి కృష్ణశాస్త్రిగారు ఆశువుగా చెప్పిన కవితలను రెడ్డిగారు వ్రాసుకొని, తర్వాత తమ గోలకొండ సంచికలో ప్రచురించిన వాటిని మాగురువుగారు నాకు చూపించారు. ఆ పద్యాలను చదివి చకితుడనయ్యాను. 'ప్రసన్నగంభీర పదా సరస్వతీ' అంటే ఇలాగే ఉంటుందనుకొన్నాను.

కొన్నాళ్ళకు ఒక 'వ్యాసావళి' పుస్తకంలో ఆ పండితులు, విద్వత్కవులున్న నారాయణపురం, జనగామ తాలుకాలోనిదని వ్రాసియున్న వాక్యం శోధనీయం కదా! అని మానసికంగా ఆవేదన కలిగింది)

ఒకనాడు దేవాలయంలో కూర్చుండి 'కవిత' నాకు అబ్బుతుందో లేదో అని ప్రయత్నించాను.

తల్లి వేంకటమ్మ తండ్రి మనోహరా చార్యులిడిరి మాకు జ్ఞాన భిక్ష।
తిరుమలాన్వయమ్ము హరితస గోత్రమ్ము కవిత వ్రాయుధిషణ కలుగవలయు॥
చతురుండగు మా జనకుడు
అతులితగతి వసుచరిత్ర సమరము నేర్పెన్।
మతి మంతుడు తోబుట్టవు
హితముగ తద్బోధ మాదు యెందలో వెలసెన్॥

అని నేను వ్రాసిన కాగితాన్ని 'గీతాభాష్య' మనే గ్రంథంలో పెట్టాను. ఎలాగో దాన్ని నా తమ్ముడు చూచి, సంతోషంతో 'అన్నయ్య పద్యాలను వ్రాశాడు' అని ఆ కాగితాన్ని నాన్నగారికి జూపించాడు.

"వెంకట్రాఘవా! పరిణత బుద్ధి కలవారు కవితా కళను ఆరాధిస్తారు. చక్కని కవిత్వాన్ని విద్వత్కవులు విని సంతోషించినప్పుడే 'కవి' అనే యశస్సు కలుగుతుంది. సమాజం ఆకవిని సన్మానిస్తుంది. ఆనందోప దేశాత్మకంగా మహాకావ్యాలను వ్రాసిన కవికుల గురువైన కాళిదాసే "మందః కవి యశః ప్రార్థీ" అని "ఆపరితోషాద్విదుషాం నసాధుమన్యే" అని ఎంతో వినయాన్ని ప్రకటించుకొన్నాడు. దృశ్యాన్ని వర్ణించినా, స్వీయ భావాలను సరసంగా ప్రకటించినా, ప్రతిచరణమందు గణ యతిప్రాసల నియమ

పాటించబడిందా లేదా అనే విచారం అధికంగా అవసరమవుతుంది. ఇప్పుడే కవిత్వం చెప్పదగినంత గొప్పవాడ ననుకొంటున్నావా? నీవు వలసినంత శాస్త్ర జ్ఞాన మార్జింప దగిన వయస్సులో ఇతర విషయాల మీద మనస్సును లగ్నం చేయక, విద్యార్జన మందే నిమగ్నుడవై యుండు'మని హెచ్చరించారు మా తండ్రిగారు.

మా యింటికి కుడి వైపున్న 'బంగళా'లో గ్రామపురోహితులుగానూ, నిగమాగమశాస్త్ర విద్వన్మణిగానూ పేర్గాంచి యున్నవారు బ్ర.శ్రీ. బావి కృష్ణశాస్త్రిగారు. "అన్నయ్యా! నాకు నాటకాలంకార సాహిత్య జ్ఞానాన్ని ప్రసాదించండి" అని వేడుకొన్నాను. 'నీకు శ్లోక సమన్వయ జ్ఞానమున్నందువల్ల నాకు పాఠం చెప్పడం కష్టమనిపించదు. రేపే ప్రారంభించు'మన్నారు. కృష్ణశాస్త్రిగారు. పగలు శ్రీరంగాచార్య స్వామి వద్ద మాఘకావ్యం, లఘు సిద్ధాంతకౌముది, గీతాభాష్యం, సంప్రదాయ గ్రంథాలను అభ్యసించాను. బ్ర. శ్రీ కృష్ణ శాస్త్రి వద్ద (ఒంటిగంట) అర్ధరాత్రిదాకా నైషధం, తర్క సంగ్రహం, భారత చంపువు, శాకుంతలం, ఉత్తరరామచరిత్ర, సాహిత్యదర్పణం వీరరాఘవీయ వ్యాఖ్యతో సమా వ్యాస భాగవతంలో నాలుగు స్కంధాలను క్రమంగా నేర్చుకొన్నాను. గోరక్‌పూర్ నుంచి 'మహాభారతం' (రూ. 60/కే సెట్టు) పోస్టు ద్వారా తెప్పించిన కృష్ణశాస్త్రి గారు సభాపర్వాన్ని, విరాట పర్వాన్ని నాతో చదివించారు. మాఊళ్ళో పండితులెవ్వరూ లేనప్పుడు (కొన్ని రోజులు) ఆరు మైళ్ళ దూరాన ఉన్న 'ఆవునూరు'కు పోయి శ్రీ.ఆచి. వేంకటా చార్యుల వద్ద పాఠం చెప్పించుకొని సాయంకాలం మాయూరికి చేరుకొన్న రోజులు కూడా విస్మరించరానివి. ఇలాగా రెండేండ్లు నిరంతర చింతనతో గడిచాయి.

నా పెద్ద చెల్లెలు- కొండమ్మ వివాహం, దేశపాండ్య వేంకటరావు కూతురు, బావి కృష్ణశాస్త్రి కూతురు, శ్రీరంగాచార్య శాస్త్రి కూతురు- ఈ నల్గురి వివాహ శుభలగ్న ముహూర్తం ఒక రోజే అయినందువల్ల, వేదశాస్త్ర సంగీత కళాభిజ్ఞులతో ఊరంత కళకళలాడునట్లు వైభవంగా, నాలుగు రోజులు జరిగింది. అప్పుడు వచ్చిన బంధువులలో పాపన్నపేట నుంచి మా పెద్దనాన్న, పెద్దతల్లి, వారి కుమారుడు శ్రీమాన్ తిరుమల వేంకట నరసింహాచార్యులు కూడా వచ్చి వారం రోజులున్నారు. మెదక్ హైస్కూలు టీచర్‌గా ఉన్న ఆ TVN చారిగారి చెల్లెలు కుమార్తెను 10.సం.ల పద్మావతిని నాకోసం పెద్దలు నిర్ణయించారు. మరుసటి సంవత్సరమే (జమ్మికుంట మండలం) 'వావిలాల'లో పద్మావతితో, నావివాహ కార్యక్రమం నాలుగు రోజులు బాగా జరిపించారు. తదుపరి సంవత్సరంలో తమ్ముడు పార్థసారథికి పెండ్లి అయింది.

ఆకాలన వరుడు వధువును వివాహమయ్యేంతవరకు చూచే అవకాశం కల్పించక, పెద్దలే చూచి నిశ్చయించే నియమ ముండింది.

నేను, నా సహాధ్యాయి బ్ర.శ్రీ.కె.మురళీధరశర్మగారును వైదికులు అభిమానంతో ఆహ్వానిస్తే, ఉపనయన, వివాహాది శుభకార్య కలాపాలను నిర్వహించడం ఉత్సాహకరంగా ఉండేది.

సీతారాంబాగ్–హైదరాబాదులో శ్రీ మహావిష్ణుయాగానికి మా తండ్రిగారు నన్ను, నా తమ్ముణ్ని తోడ్కొని పోయారు. అచ్చట పెద్దవారిని ఋత్విక్కులుగానూ, హోతలుగానూ, బాలురను పరిచారకులుగా వరించడానికి రెండు వరుసలలో కూర్చోబెట్టారు. మానాన్న గారు పెద్దవారి పంక్తిలోనే కూర్చుండబెట్టారు. ఎన్నుకొనే స్వాములు వచ్చి మీరు పరిచారక శ్రేణిలో చేరండి, లెండి' అని గద్దించారు. వెంటనే లేచిన మేము గళమెత్తి ఒకే స్వరంతో "ఆడితోనపైతేజ ఓజోబలం యశశ్చక్షు శ్శ్రోత్ర"మని ఆరంభించి "లోకపాలః కిం కం తత్సత్యమన్న మమృతం" అని పఠిస్తుండగానే 'బుడతలు పిడిగులే' అంటూ మాకు దీక్షా హస్త్రా లిచ్చారు. ఋత్విగ్వరణమయింది. మాతండ్రిగారి Joy knew no bounds యాగం పూర్తి అయిన మరునాడు ఒక బంధువు విద్యానగర్ బ్రిడ్జ్ దాటిన తర్వాత ఒక ప్లాట్‌ను చూపి '(01–6) పాంచానకు గజం చొప్పున ఈ స్థలం కొన్నా'నన్నారు. న్యూ నల్లకుంట అన్న పేరు అప్పటి కేర్పడలేదు. 'అదుగో! అక్కడ రామాలయంకోసం పునాదులు తీస్తున్నారు' అని చెప్పగా పోయి చూచాము. చాలా ప్లాట్లు అమ్మబడినాయి. ఎప్పుడైనా హైదరాబాదులో నివసించక ఉంటామా? అని అప్పుడు ఒక ప్లాటైనా కొనక పోతిమి కదా! అని ఇప్పుడనిపిస్తుంటుంది.

నారాయణపురం చేరిన తరువాత ఒక సంవత్సరం నిజామాబాదు, ఆదిలాబాదు, కరీంనగరం జిల్లాల్లో (ఉన్న రెండువేల కడప) సకుటుంబంగా శిష్యసంచారం చేసి వచ్చాము. ఇక నేనెన్నడూ అలా సంచరించలేదు. ఇప్పటికీ అభిమాను లాహ్వానించిన చోటుకు తప్ప ఎక్కడికీ పోవడం లేదు. అది కూడా భగవదాజ్ఞాపాలనగా ఆచార్య ధర్మాన్ని నిర్వహించవలసి యుటుంది. ఆస్తు.

మేమైతే స్కూలులో చేరి చదువలేదు. రెండవతమ్ముణ్నైనా చదివిద్దామని నరసింహాచార్యులను శిరిశిల్లకు తీసుకొని పోయి "అవ్వల్ దర్జా తహతాన్య' మదరసాలో నాల్గవ తరగతిలో చేర్పించాను. తమ్ముణ్ని చక్కగా చదివించుమని మా చెల్లెలుకు చెప్పి,

వాణ్ని వాళ్ళయింట్లో విడిచి వచ్చాను.

15 ఆగష్టు 1947న భారతదేశం (విభక్తమై) స్వాతంత్ర్యాన్ని పొందింది. జాతి సంతోషం అంబరమంటుతున్న సమయంలోనే జాతిపిత మహాత్మాగాంధీ హత్య (30 జనవరి 1948) జరిగింది.

దేశమంతటా విషాదచ్ఛాయలు వ్యాపించాయి. గాంధీజీ అమర్‌హై, వందేమాతరం, అంటూ పల్లెపల్లెలోనూ నినాదాలు చెలరేగాయి. నైజాం రాష్ట్రంలో రజాకార్ల వల్ల ప్రతిగ్రామంలో అలజడులు అధికమయినాయి. ముఖ్యంగా మాయూరిలో యువకులు తెల్లటోపీలు ధరించి, చిన్న జండాలను పట్టుకొని 'స్వతంత్ర భారత మాతాకీ జై' అంటూ నినాదాలతో ఊరేగి సమావేశ జరుపుతుంటే, ఎస్–ఐ; పోలీసులు వచ్చి గుంపులో యువకులను లేపి, ఈడ్చి లాఠీ దెబ్బలు కొట్టేవారు. అలాగా మమ్ము– యువకులను పోలీసులు తుపాకీ గుండ్లతో కొట్టుకుంటూ ఠానా – గంభీర్‌రావుపేటకు తీసుకొని పోతుండగా, ఊరిలోని పందమంది పెద్దలు వారికి అడ్డుపడి జగడమాడుతుంటే, (దొరవారి పంపున) మాలీపటేలు, పట్వారి, పోలీసుపటేలు వచ్చి వారితో సంప్రదించగా, మమ్ము– యువకులను విడిచిపెట్టడమూ, వాళ్ళకు జల్సాలు ఏర్పరచడమూ మామూలుగా సాగుతుండేది.

రాష్ట్రంలో ఎందఱో మగువలు, మగవారు రజాకర్ల ఆయుధాలకు బలి అయ్యారు. గ్రామీణుల దైనందిన జీవితం దుర్భరమయింది. మాగ్రామస్థులు సామూహిక మరణం సంభవిస్తే మేలు కదా! అని భయ భక్తులతో శ్రీ సీతారామస్వామి దేవాలయంలో నిత్య పూజలను జరుపుతామని నిశ్చయించారు. ఆలయానికి సున్నం వేశారు. స్తంభాలకు రంగులు వేశారు. యాగశాలలోనూ, కల్యాణ మంటపంలోనూ గోడల పైన భగవల్లీలను తైలవర్ణ చిత్రాలు– చిత్రించారు. ఆలయంలోనే తిరుగడానికి పల్లకిని, చిన్న రథాన్ని వడ్ల అనంతరాములు, కమ్మరి రాజయ్య నిర్మించి సమర్పించారు. కుమ్మరి వాళ్ళు దీపప్రమిదలను, కంచుళ్లను ఇచ్చారు. నిత్యం ఇప్ప నూనెతో ఆలయం లోపల, బయట, పైన లక్ష దీపాలను వెలిగించారు. రజకులు చెరువులలో నుంచి తామర పూవులను, తోటల్లో నుంచి రంగు రంగుల పూవులను తెచ్చేవారు. సువాసినులు పూల మాలికలను అల్లి, తోమాలలనూ కూర్చి సమర్పించేవారు. కోమట్లు, రైతులు, గౌడులు, గొల్లలు రోజు కొకరు ఐదు కుంచాల పులిహోర, రెండుకుంచాల చక్కెర పొంగళి, రెండు కుంచాల

దధ్యోదనం నైవేద్యం కోసం అర్చక స్వయంపాక స్వాములతో చేయించేవారు. కళాకారులు హరి కథలను చెప్పేవారు. సప్తాహ భజనలు చేసి గోపాల కాల్వలను నిర్వహించేవారు. బ్ర.శ్రీ.కే. మురళీధర శర్మ అలంకార పరికరాలను సిద్ధం చేసి ఇచ్చేవారు. బ్రాహ్మణులు వేదాధ్యయనం చేసేవారు. శ్రీ వైష్ణవులు దివ్య ప్రబంధాలను పారాయణం చేసేవారు. రోజుకొక అలంకరణం- మోహిని అవతారం, కాళియమర్ధన, గోపికా వస్త్రాపహరణం(పొన్నసేవ), గోవర్ధన గిరిధారణం, గజేంద్ర మోక్షం ఇత్యాదిగా అలంకరించి, తులసీ పుష్పమాలికలను సమర్పించి, భగవంతునికి కైంకర్యం చేసేభాగ్యం, ఆ శ్రియః పతి కృప చేత నాకు కల్పింపబడింది. తమ్మళి సన్నాయివాళ్ళు, బ్యాండు వాళ్ళు, డప్పుల వాళ్ళు ఒక్కరు కూడా ప్రతిఫల మాశించక, భగవత్కైంకర్య పరులయ్యారు. ఏడు గ్రామాల జనులు వచ్చి, భగవత్సేవలో పాల్గొని, రోజు తీర్థ ప్రసాదాలను స్వీకరించి పోయి, వచ్చేవారు. రేయింబవళ్ళు కల్యాణోత్సవ, రథోత్సవాలతోనూ, చైత్రమాసంలో వసంత నవరాత్రులతో పాటు బ్రహ్మోత్సవం జరిగినప్పుడు, విశేషంగా శ్రావణ మాసోత్సవాలతో వైకుంఠంగా ప్రకాశించిన ఆ దివ్యధామాన్ని ఆబాలగోపాలం సేవించి ధన్య జీవులయ్యారన్న రమణీయ వృత్తాంతం మరపురానిది.

రాష్ట్రమంతా రజాకార్ల దౌర్జన్యంతో అల్లకల్లోలంగా ఉన్నప్పుడు మాగ్రామం మధురాతి మధురమైన భగవత్సేవా ధురంధురత్వం చేత 'ఇది నారాయణపురం' అనే నామాన్ని సార్థకంగా నిల్పుకొన్నది. శ్రీ వల్లభాయ్ పటేల్ యొక్క నిరుపమాన సామర్థ్యం వల్ల 17 సెప్టెంబర్ 1948వ నాడు నిజాం ప్రభువు లొంగి పోయాడు. కోటి రత్నాల వీణ యైన తెలంగాణ విముక్తి పొందిందని (గడిలో) రేడియో వార్త శ్రవణానందంగా వినిపించింది. ప్రతి వ్యక్తి యొక్క డెందమానంద కందళిత మయింది. రాష్ట్రమంతా పండుగ దినం నెలకొన్నది.

నేనొక మనిషినయ్యాను. ఇంటికి పెద్దవాణ్ని అయినా, మాకుటుంబానికైనా నేనేమి సహాయపడడం లేదు కదా! అనే దుగ్ధ-చింత- నాకు అమితంగా ఏర్పడింది. ఇట్టి విచారంతో రోజు ఒకే పూట భోజనం చేసేవాణ్ని. అంతలో ఈప్రాంతానికి వలె, మాగ్రామానికీ ప్లేగు తగిలింది. ఎలుకలు పడడం, రోగాలతో జనులు బాధ పడుతుండడం వల్ల ఊరు విడిచి, బాహ్య ప్రదేశంలో గుడిశలు వేసుకొని కాపురం చేయడమయింది. బ్రాహ్మణులు, కోమట్లు ఒకే ప్రాంతంలో ఉన్నారు. కాపులు, తదితరులు వారి వారి చేలల్లో నివాస మేర్పరచుకొన్నారు.

బ్ర.శ్రీ. జోగా వెంకన్న శర్మ (గురువు)గారు (85 ఏండ్లకు) గుడిశలోనే దివంగతులయ్యారు. వారికి ఊర్ధ్వలోక క్రియలను శ్రీ మురళీధరశర్మ పూర్తిచేసి, వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామిని దర్శించి వచ్చేదాకా నేను వారి వెంట తోడుగా ఉండి, స్వస్థలం చేరుకొన్నాను.

ఏమీ తోచని స్థితిలో నున్న నన్ను మా నాన్నగారు 'సుందరకాండ' పారాయణం చేయుమని ఆదేశించారు. పెందలకడనే లేచి, నదిలో స్నానం చేసి, భగవదారాధన చేసిన తర్వాత నిత్యం పారాయణం, పగలు గం. 3లకు భోజనం చేయడం నియమంగా ఉండింది. సాయం సమయాన శ్రోతల కోరిక మేరకు 'విష్ణుసహస్ర నామం' సామూహిక పారాయణానంతరం, శ్రీమద్భగవద్గీతోపన్యాసాలతో మూడు మాసాలకాలం గడిచింది. 1949వ సంవత్సరం, శివరాత్రి దాటగానే గ్రామాన్ని శుభ్రపరచి, ఇండ్లకు సున్నం జాజులు వేసి, తోరణాలతో అలంకరించి, తిరిగి ప్రవేశించడమయింది. చైత్రమాసంలో వసంత నవరాత్రులు, సీతారామ కల్యాణం, పంచాహ్నిక బ్రహ్మోత్సవ సమయమయింది. సుందరకాండ పారాయణం సమాప్తమయిన దినమందు, ఆలయంలో స్వామి భోగానికి, బ్రాహ్మణ శ్రీవైష్ణవుల భోజనానికి వారివారి యిండ్లకు సాహిత్యాలు పంపించబడినాయి.

హనుమదాలయంలో శ్రీ రామదాసుకు మనుసూక్తంతో అభిషేకించి, సిందూర లేపనం, పుండ్రధారణం, పూల హారాలు, వడల మాలికతో నలంకరించి, నారికేళ, కదళీ ఫలాదులు నైవేద్యమర్పించి, హారతినిచ్చి, భజనతో ప్రదక్షిణ నమస్కృతులొనర్చి, తిరిగి సీతారామ స్వామి సన్నిధికి వచ్చి, మంగళా శాసనానంతరం తీర్థ ప్రసాదులకు స్వీకరించడమయింది. సాయంకాలం పెద్దలందఱు ఇంటికి వచ్చి ఈ అల్పజ్ఞునికి మహదాశీర్వచనం చేశారు; చందనగోష్ఠి తర్వాత దక్షిణ తాంబూలాది సత్కారాలను కృపతో స్వీకరించారు.

బ్ర.శ్రీ. బావి కృష్ణశాస్త్రిగారు తమ ఉపన్యాసంలో "చిరంజీవి రాఘవుడు మందుడు కాడు. అతడు మేధావి. సదాచారుడు. ఉపాధి పత్రాన్ని పొందే విద్య నభ్యసించక పోతినన్న తపన, ఏదైన ఉద్యోగం చేయాలనే ఆరాటం అతనికి ఇటీవల అధికమై, లోలోన కృశిస్తున్నాడు. మన మధ్యలో గారాబంగా పెరిగినందువల్ల మనను విడిచిపోయి, బయట లోకాన్ని చూడలేకున్నాడు.

"అ చేష్టమాన మాసీనం శ్రీః కంచిన్నోపతిష్ఠతి" ఏమీ చేయక, ఊరక యుండేవానికి

సంపత్తు లభించదుకదా! ఈ జాడ్యం తొలగిపోవడానికి, ఇంటినుండి అతడు కాలు బయట పెట్టిననాడు అతని ప్రజ్ఞ పలు దెసల ప్రకాశిస్తుంది. యువకుడైన తాను రెండు పూటలు తప్పక భోజనం చేయాలి. "శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం" అన్నమాట అతనికి తెలియనిది కాదు. దృఢమైన దేహమందే మేధస్సు వికసిస్తుంది. అతడు బుద్ధిమంతుడని తెలిసిన ఇక్కడున్న పదుగురిలోని భావాలను నేను దృఢాధ్యవసాయంతో బాహిరంగా ప్రకటిస్తున్నాను. తల్లిదండ్రులు కూడా అతనికి ప్రోత్సాహాన్ని కల్పించి, బయటకు పంపిస్తే, ఉద్యోగమూ లభిస్తుంది. కుల దీపకునిగా భగవానుడు కటాక్షించగలడని మంగళాసనం చేస్తున్నా"మన్నారు.

వారి అభిభాషణతో నాకు కొండంత స్థైర్య మేర్పడింది. ఒక వార మాలోచించాను. గ్రామంలో శ్రీ. కె. మురళీధరశర్మ కార్యదర్శిగా చిన్న గ్రంథాలయ మేర్పరచి, యువకులను సభ్యులను చేర్చి రోజూ అక్షరాస్యులు వచ్చి శ్రద్ధతో గ్రంథాలను, పోస్టు ద్వారా తెప్పించిన భారతి, స్వతంత్ర, సుజాతేత్యాది పత్రికలను చదివే పాటవాన్ని కల్పించడమయింది.

తెలుగు భాషను వృద్ధి జేయడానికి శిరిశిల్లలో శ్రీమాన్ నేరెళ్ళ వేంకటాచార్యులు ఆంధ్ర సారస్వత పరిషత్ శాఖను స్థాపించి పరీక్షలు నడుపనున్నారని తెలిసింది. నేను పోయి వారినడిగితే 'ప్రథమ, మధ్య, ప్రవేశ, పరీక్షలను క్రమంగా వ్రాయాలి. ఒకేసారి పై పరీక్ష వ్రాయదలచిన వారు హైదరాబాదు పరిషత్తు నుంచి అనుమతి పత్రాన్ని పొందవలసి యుంటుందన్నారు. ఒక పక్షపు రోజుల తర్వాత మా తల్లిగారిచ్చిన పది రూపాయిలతో బయల్దేరాను. బొగ్గుతో నడిచే బస్సులు రోజుకు మూడు మాత్రమే కాబట్టి, గం. 12లకు బస్సెక్కి స్టేషనులో (....) అర్థ రూపాయి టిక్కెటుతో కామారెడ్డికి చేరాను. గం.4లకు స్టేషనులో ఒక రూపాయి అయిదణాల టిక్కెట్టుకొని రైలులో కాచీగూడకు చేరుకొన్నాను. ఆ రాత్రి స్టేషన్ వెనుక ఉన్న శ్రీ యోగి రావు (సుందర్ రావు గారి జామాత) గారి భవనంలో నిద్రించాను. ఉదయాన నిత్యానుష్ఠా నానంతరం 'జెట్కా'లో సారస్వత పరిషద్భవనానికి పోయాను. అక్కడ అరుగు మీద కూర్చున్న కాసేపటికి ఒక మహానుభావుడు ఆఫీసులోకి వెళ్ళుతూ నన్ను జూచి 'ఇక్కడెందుకు కూర్చున్నావు? నీకేం కావాలి? అని అడిగాడు. వారి ముందు బద్ధాంజలితో నిల్చి "ప్రవేశ పరీక్షకు అనుమతిని పొందడానికి వచ్చాను" అనగానే లోనికి రమ్మన్నారు. టేబుల్ ముందు నిలబడిన" నన్ను 'నీవేమి చదువు కొన్నా'వన్నారు. 'నేను స్కూల్లో చదువలేదు. వేదం, సంస్కృత కావ్య నాట కాలంకార సాహిత్యాన్ని అభ్యసించాను. ప్రవేశ పరీక్ష నిచ్చి, ఉపాధి పత్రాన్ని పొందితే

ఏదైనా ఉద్యోగం లభిస్తుందేమో అని ఆశించి వచ్చాను; అనుమతించండి' అన్నాను. వారి ప్రక్కన ఉన్నవ్యక్తి 'భారవి' కావ్యంలోని ఒక శ్లోకం చదివి, తాత్పర్యం చెప్పుమన్నాడు.

"సఖీనివ ప్రతీయుజోను జీవిన స్సమానమానాన్ సుహృదశ్చబంధుభిః ససంతతం దర్శయతే గత స్మయఃకృతాధిపత్యామివ సాధుబంధుతామ్" ధర్మరాజులాగా పేర్గాంచవలెనని తలచిన సుయోధనుడు కపట రహితుడై తన భృత్యులను మిత్రులనువలెనూ, మిత్రులను బంధువులను వలెనూ, బంధు వర్గాన్ని ఆధిపత్యం నిర్వహిస్తున్న వారిగానూ, వారికి ఉన్నత పదవులను కల్పించి సాదరంగా చూస్తున్నాడు. అందువల్ల,

"సమున్నయన్ భూతి మనార్యసంగమాత్
వరం విరోధోసి సమం మహాత్మభిః"

ఐశ్వర్యాభివృద్ధిని కోరే వ్యక్తికి దుర్జన సహవాసం కంటె సజ్జనులతో విరోధమైననూ మేలేకదా! అని శ్లోకార్థం. మరొకరు 'ఒక పద్యం చదివి అర్థం చెప్పండి' అని అడిగినారు. 'వల్లెవేయని కారణాన పద్యాలు కంఠస్థంగాలేవు. మీరు చదివితే భావం చెబుతానండి' అని విన్నపించాను.

"అభ్రంలిహోదభ్ర విభ్రమ బ్రభ్రమాకృన్నీల దీర్ఘ శరీర మమర" ఈ వాక్యార్థాన్ని వినిపించుమన్నారు.

"ఆకసాన్ని తాకుతూ, గొప్ప ప్రళయకాల మేఘమనే భ్రమను గొల్పుతున్న నల్లని సుదీర్ఘ దేహం కల వాడని అర్థం కదా" అన్నాను.

"భళా! యోగ్యత ఉంది. ప్రవేశ పరీక్షకై వీరికి అనుమతి పత్రమీయండి" అని ఒకరిని పిలిచి చెప్పి. 'ఆ గదిలో కూర్చొండి' అని నాతో పలికారు.

ఆగదిలో మాకంటె పూర్వ విద్యార్థి బ్ర.శ్రీ. పదిరె రాజేశ్వరశర్మగారు చేస్తున్నారని తెలసి నాకు చాలా తృప్తి కలిగింది. కాసేపట్లో, శర్మగారే అనుమతి పత్రాన్ని తెచ్చి, ఇచ్చి "త్వం భాగ్య వానేవ, విజయీ భవ!" అని ఆశీర్వదించారు. 'ఆ మహాను భావుల పేర్లు చెప్పండి' అన్నాను. ఒకరు పులిజాల హన్మంతరావు గారు. మరొకరు దేవులపల్లి రామానుజరావుగారు అని చెప్పినారు. ధన్యోస్మి.

అవధిలేని ఆనందంతో నేరుగా శిరిశిల్లకు చేరి శ్రీ. ఎన్. వేంకటాచార్యులకు అనుమతి పత్రాన్ని చూపించాను. వారు నేను శ్రీయుత మామిడిపల్లి హన్మంతరావును కలిసి, పరీక్షాభ్యర్థులు చదువుకోవడానికి స్థల మడిగినాము. వారు కాంగ్రేసు ఆఫీసు భవనానికి వెనుక భాగంలో ఉన్న పెద్దయింటిని ఉపయోగించుకొమ్మన్నారు. మాయూని నుంచి స్వయం పాకానికి వంట సామగ్రిని తెచ్చుకొని ఆ యింటిలో నివసించాను. ప్రథమ పరీక్షార్థులకు బోధించడానికి శ్రీ పీచర్ రామానుజచార్యులు. మధ్యమకు నేను, ప్రవేశకు శ్రీ. ఆచి వేంకటాచార్యుల వారు ఉపాధ్యాయులుగా నిర్ణయింపబడినాము. ఉ.గం. 9వరకు సాయం. గం. 6 నుంచి 8వరకు బోధన జరిగేది. నేను ప్రవేశ పాఠ్యాంశాలను చదువుకొనేవాణ్ని. పెందలకడలేచి వంటవండి, స్కూల్లో చదువుకొనే ఇద్దఱు తమ్ములకు–తిరుమల నరసింహ చార్యులు, శ్రీనివాసాచార్యులకు, ఎల్లారెడ్డిపేట తిరుమల కృష్ణమూర్తికి కూడా భోజనం పెట్టి, నా వద్దనే చదివించేది. ఏదేమైనా, కష్టసుఖాలను జీవితంలో సమంగా భావించే వ్యక్తియే రసరాట్టు అనిపించేది.

శ్రీ. మామిడిపల్లి హన్నంతరావుగారు 26జనవరి1950వనాడు వ్యాసరచన పోటీ ఏర్పరచారు. 'మహాత్మాగాంధి జాతిపిత' అనే శీర్షికపై సంస్కృత భాషలో వ్యాసరచనకు ముగ్గురు పాల్గొనగా, నన్ను ప్రథమునిగా నిర్ణేతలు ప్రకటించి బహుమానించారు. ద్వితీయ బహుమతి బ్ర.శ్రీ. కోశిగ కృష్ణమూర్తికి లభించింది. (నిర్ణేతల్లో ఒకరు ఒక అభ్యర్థితో కోడ్ నంబర్ 2 నీదే అనుకొన్నాను అన్నమాట నా చెవిలో పడింది.) ముఖ్యంగా 'కృషితో నాస్తి దుర్భిక్ష' మనే నానుడి రిత్తపోదని సంతోషించి 'ఈ ప్రథమ ప్రయత్న ఫలం భగవంతునిదే" అని మనసా సమర్పించుకొన్నాను. తర్వాత 'మార్చిసెలలో పరిషత్ పరీక్షలు శిరిశిల్ల గవర్నమెంట్ మిడిల్ స్కూల్లో జరిగాయి. ప్రవేశ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడనయ్యానని (రెండు నెలల తర్వాత ప్రకటింపబడినట్లు) శ్రీ. ...వేంకటాచార్యులు నాతో చెప్పినారు. హైదరాబాదుకు హాల్‌టిక్కెట్టుతో వెళ్ళి, పరిషత్తునుంచి ధ్రువ పత్రాన్ని పొంది, మెదక్కు చేరి శ్రీ. టి.వి.ఎన్. చారి అన్నయ్యకు ఆ పత్రాన్ని ఇచ్చాను. 'నాకు ఉద్యోగం లభించే ప్రయత్నం నీవే చేయాలి' అని కోరగానే, రెండు తెల్ల కాగితాల మీద నా సంతకం పెట్టించుకున్నారు.

'నేను లేఖను వ్రాసిన వెంటనే చూచుకొని ఉద్యోగానికి సిద్ధమై నా దగ్గరికి రావాలి. ఆలస్యం చేస్తే ఆ యుద్యోగం మరొకరికి దక్కుతుంది' అని నొక్కి చెప్పినాడు. 'అన్నయ్యా! తప్పక అలాగే చేస్తా'నని చెప్పి, నారాయణపురం చేరుకొన్నాను. 1950 సెప్టెంబర్ 22న

లేఖ వచ్చింది. మెదక్కు వెళ్ళాను. ఉర్దూ భాషలో ఉన్న ఆర్డర్ చదివి వినిపించాడు. (స్టేషన్) మాసాయిపేట గ్రామం. తమాతాన్యాలో రాయ్‌లాపురం శ్రీ. లక్ష్మణరావు మెట్రిక్ ట్రేనింగుకు వెళ్ళినందున, ఆస్థానంలో నెలకు రూ.25/-(హాలి వేతనంపై (మున్సరం) టీచర్‌గా నియమింపబడినానని వివరించారు. అన్నయ్య తన స్కూల్లో చదువుతున్న ఒక విద్యార్థి తండ్రి పరిచయమున్నాడని ఒక లేఖ వ్రాసి యిచ్చాడు. 24వనాడు ఆలేఖను, ఆర్డర్‌ను పట్టుకొని మాసాయిపేటలో శ్రీ దమ్మన్నగారి వెంకటరెడ్డి ఇంటికి చేరినాను. వసతి సౌకర్యాలను వారి అంగణంలోనున్న మేడ మీద కల్పించాడు. ఆరాత్రి మాతృప్రసాదంగా తెచ్చుకొన్న అటుకులను పెరుగుతో కల్పి ఆహారంగా తీసుకొన్నాను. ఉదయాన వండుకొని భోజనం చేసిన తర్వాత ఆయన తమ్ముడు శ్రీ ముత్యంరెడ్డి నన్ను స్కూలుకు తీసుకొని పోయి. హెడ్మాస్టర్‌కు పరిచయం చేశాడు. 25 సెప్టెంబర్ 1950నాడు స్కూల్ టీచర్‌గా ఉద్యోగ మారంభమయింది. 2&3వ తరగతులకు పాఠాలు, కథలు చెప్పడం, చిన్న చిన్న పద్యాలను, ఎక్కాలను వ్రాయించడం నియమంగా ఉండింది. విధి బలీయ మనుకొన్నాను.

శరన్నవరాత్రులు కాబట్టి రాత్రి 8గం. వరకు ఆ మేడమీదనే రోజు శ్రీమద్రామాయణంలో సీతాదేవి మహిమను ఉపన్యాస రూపంగా చెప్పగా (ముత్యంరెడ్డి ప్రచారం వల్ల), జనం ముప్పదికి పైగా వచ్చి విన్నారు. దసరా పండుగనాడు 'సీతాదేవి చరిత్ర' సర్వశ్రుతి మనోహరంగా ఉన్నదంటూ, మిత్రులందఱు సన్మానించారు. అందఱిలో శ్రీ. తిరునగరి నరసింహులు-సమవయస్కుడు- ఈ స్వగ్రామంలోనే పోస్టు మాస్టర్- నాకు పరమ మిత్రుడయ్యాడు. అతని సహకారంచేత కరణం శ్రీ రాజేశ్వరరావు గారి వద్ద ABCలు మొదల్కొని ఇంగ్లీషు (బొమ్మ) బాలశిక్షను నేర్చుకొన్నాను. ఒక ముస్లిం టీచర్ దగ్గర 'అలీఫ్, బె,పె-సె'లు ఆరంభించి క్రమంగా మూడు నెలల్లో ఏడవ తరగతి పుస్తకం వరకు బాహ్యంగా చదువడం, వ్రాయడం నేర్చుకొన్నాను. ముఖ్యంగా ముదాసిలాలు (వక్రమైె అక్షరాలు కలవి) చదివి అర్థం చేసుకోగలిగాను. సహృదయులైన ఆ గురువులు నన్ను సంస్కరించారు. వారికి కృతజ్ఞతా పూర్వక నమస్కృతులు.

జన్మించిన తేదిగల సర్టిఫికెటు బరావర్దుతో జత పరచనందువల్ల నాలుగు నెలలవరకు జీతం రాలేదు. మెదక్కుపోయి అన్నయ్యకు చెప్పాను. నేను అన్నయ్యతో మున్సిఫ్‌కోర్టుకు పోయినాము. అక్కడ శ్రీ. కాశీనాథరావు, మహమ్మదలీ వకీళ్ళను సంప్రదించాము. మఱునాడు అదాలతుకు రమ్మన్నారు. ఏదో జన్మ పత్రికను వ్రాయించుకొని మా

అన్నయ్యతో సంతకం పెట్టించుకొన్నారు. అదాలతుకు వారు చెప్పిన సమయానికి పోగా, పగటి వరకు 'అఫిడవిట్' తెచ్చి చేతికిచ్చారు. వారికో 'అయిదు పది' సమర్పించాము. మాసాయిపేటకు పోయి 'ఆపిడవిట్'కు నఖలు పత్రాన్ని హెడ్మాస్టర్‌కు ఇవ్వగా, వారొక లేఖను 'అసలు' పత్రానికి జత పరచిన ఒక కవరును నాచేతికి ఇచ్చి, నీవే సంగారెడ్డికి వెళ్ళి అక్కౌంట్ ఆఫీసులో దాఖల్ చేస్తే త్వరగా జీతం వస్తుందన్నారు. ఆ మరునాడే హైదరాబాదు మీదుగా సంగారెడ్డిలో కలెక్టర్ ఆఫీసుకు పోయి అక్కౌంట్ ఆఫీసర్ శ్రీ నరసింగరావుకు ఆ కవరును ఇచ్చాను. ఆయన 'అఫిడవిట్'ను చూచి, 'ఒక వారంలో మీ బిల్లును పాస్ చేసి మీ స్కూలుకు పంపిస్తాను, విచార పడకు'మని చెప్పారు. తిరిగి నేను స్కూలుకు వచ్చిన వారానికే 'బరావర్దు' మంజూరై వచ్చింది. మరుసటి రోజున నాలుగు నెలల జీతం రూ. 100/లు (హాలీ) చేతికందినాయి. ఆ వారంలో మా తండ్రిగారు వచ్చారు. "నీ చెల్లెలు తొలి కాన్పులో ఆడ శిశువు జన్మించింది; నామకరణానికి పోదాము – పద" అన్నారు. హెడ్మాస్టరును సెలవు కోసమడిగితే, మున్సరంటే టీచర్‌కు సెలవు ఈయబడ దన్నారు. ఆ సంగతిని నాన్నగారికి చెప్పి, మొదటి జీతమిది అని వందరూపాయిలను సమర్పించుకొన్న సంతృప్తి నాకు కలిగింది. 'నిన్ను ఉద్యోగం చేయు మన్నానా? స్వేచ్ఛ ఉండదు. కష్టపడుతున్నావు కదారా' అనగానే, 'నాన్నగారూ! మీ జీవన విధానం వేరు. మీ ఆశీః పటిమతో నాజీవితం సుఖమయంగానే ఉన్నది; ఉంటుంది కూడా. నా విషయమై మీరు 'చింత' పడవద్దు' అని పాదాభి వందనం చేసి పంపించాను.

ఆసంవత్సరం టీచర్లకు 'హప్తుమ్' మిడిల్ పరీక్షను వ్రాయడానికి ప్రభుత్వం అనుమతించిందని తెలిసింది. ఒకనాడు సంగారెడ్డికి పోయి, నా విషయమంత ఒక లేఖలో వివరించి, దానితో మిడిల్ పరీక్షకు అనుమతిని కోరుతూ ఒక దరఖాస్తును జతపరచి, మొహతెమీమ్ తాలిమాత్ గారికి నమస్కరించి ఆ కవరును అందించాను. వారు 'ఇదేమిటి? అన్నారు. 'గుజారిష్' అన్నాను. దరఖాస్తును చూచుకొని 'రెండు సంవత్సరాలు టీచర్‌గా ఉన్నవారికే ఈ పరీక్షకు అనుమతించాలని 'రూల్' ఉంది. నీకు అనుమతీయబడదు' అన్నారు.

"మీరు ఒక జిల్లాకు విద్యాధికారులుగా ఉండి, ఒక సంస్కృత పండితునికి సామాన్యమైన చిన్న పరీక్షను వ్రాయడానికి అనుమతించలేరా సార్! దయచేసి అనుమతించండి అని మనవి చేస్తున్నాను" అన్నాను.

"నీవు అరసున్న, సున్నను చెబుతావా?" అని వారనగానే "సార్! దయచేసి తెలుగుభాషను గూర్చి హేళన చేయకండి. ఆ విధానం ఒక్క తెలుగు భాషకే ఉంది. అనుస్వారమే 'కచటతప'లను 'గజడదబ'లుగా చేసి, సరళభాషగా మారుస్తున్నది. అనుస్వారంవల్ల మధురమైన ఎన్ని ముద్దులొలుకుతున్నాయో! చూడండి. 'మోనుస్వారః' అని సూత్రం.

"నన్నును కౌగిలించుకొని నా వదనంబునకున్ నిజాస్య మా
సన్నము జేసి యొక్క మృదు శబ్దము సేసె మనోహరంబుగా
నెన్నడు నట్టిశబ్దము మునీశ్వర! మున్వినియే నెఱుంగ న
య్యన్నువ బ్రహ్మచారి ముఖమంబురహంబు సమంబు సూడగన్॥"

(నన్నయ భారతం). తీయని తేనె సొనలు జాలువారే భాష 'తెలుగు' ఒక్కటే కదా!

"నేను పనిచేసే అవకాశం ఇక రెండు నెలలే ఉంది. మీరు అనుమతిస్తే మీ దయవల్ల బాగు పడుతాను. పరీక్షలో పాస్ కాకపోతే, మళ్ళీ మీకు నా ముఖాన్ని చూపలేను సార్! కటాక్షించండి" అని వేడుకొన్నాను. 'చూద్దాము. ఇక నీవు పోవయ్యా!' అన్నారు విద్యాధికారి.

ఫిబ్రవరి 8, '51లో మొహతెమీమ్‌గారు స్కూళ్ళనిఖీ కోసం వచ్చి, కొత్తగా నిర్మించిన స్కూలులో బస చేశారు. హెడ్మాస్టర్ ద్వారా మిడిల్ పరీక్షానుమతి కోసం నాదరఖాస్తు అందించబడింది. దానిపై అధికారి సంతకం చేశారని తెలిసింది. దరఖాస్తు పెట్టిన తేది 'మజారియా నంబర్' హెడ్మాస్టర్ వేసి నా చేతికొక పత్రమిచ్చి పైరవి చేసుకొమ్మన్నాడు. ఆపత్రాన్ని ఒక మిత్రునిద్వారా అన్నయ్యకు పంపించి, ఒక పక్షంరోజు లైతే ఉద్యోగం ఊడిపోతుంది. ఆ లోపల అనుమతిని తెప్పించేయత్నం చేయుమని చెప్పి పంపడమయింది. 31 మార్చినాడు స్కూలులో వీడ్కోలు జరిగింది. మిత్రులనుంచి సెలవదీసుకొని మెదక్కు చేరుకొన్నాను. 'అనుమతి తెచ్చాను, పరీక్షకు ఫీసుకట్టినాను' అని అన్నయ్య చెప్పి నాకు పరీక్ష హాల్ టిక్కెట్టు చూపించాడు.

అన్నగారి యింట్లో ఇద్దఱు విద్యార్థులు ఏడవతరగతి చదువుతున్నవారు ఉన్నారు. ప్రతి సబ్జెక్టులో బోధింపబడిన పాఠాలు – సిలెబస్ – వ్రాసుకొన్నాను. 1951 ఏప్రిల్ రెండవ వారంలో పరీక్షలారంభమయ్యాయి. ఆయిద్దరు రాత్రి నిదుర పోగానే, వారి పుస్తకాలను తెల్లవార్లు చదివి, పగలు పరీక్షవ్రాసి రావడం నా దైనందిన కార్యక్రమం.

పరీక్ష పూర్తికాగానే, నారాయణపురం చేరుకొని రెండు మాసాలు కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలం గడిపినాను.

జులై 1951లో మిడిల్ పరీక్షలో ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణుడ నైనందువల్ల నన్ను రమ్మని లేఖ వ్రాశారు. అటు తానే సంగారెడ్డి వెళ్ళి, నాకోసం అన్నయ్యనే ఆర్డర్ తెచ్చి పెట్టినట్లు చెప్పాడు. సంగారెడ్డికి దగ్గర 'చక్ర్యాల' గ్రామంలో ఏకోపాధ్యాయ పాఠశాలలో 16 జులై 1951నాడు ఉద్యోగిగా చేరినాను. మఱునాడు సంగారెడ్డికి పోయి, రెండు హాలీ రూపాయిలకు డజన్ పెద్ద బత్తాయిపండ్లను కొని, విద్యాధికారికి ప్రాభృతంగా సమర్పించి, జాయినింగ్ రిపోర్టు నిచ్చాను. 'చక్ర్యాల గ్రామస్థులకు బ్రాహ్మణులంటె చాలా గౌరవం. అవసరమైనప్పుడు ఆఫీసుకు వచ్చి పనులు పూర్తి చేసుకొంటూ, సంతోషంగా పై పరీక్షలకు సాధన చేయండి' అని ఆఫీసర్ సాదరంగా పలుకగా, కృతజ్ఞత లర్పించి వచ్చాను.

ఆవారంలోపల 'సాలానాతఖ్తా' పంపుమని ఆర్డరు వచ్చింది. స్కూలులో పాఠాలు చెప్పడం సులభమేకాని 'క్లర్కు'పని చేయడంలో 'ఎత్తుజిత్తులు' అవసర మనిపించింది. శివ్వంపేటలో టీచర్‌గా పని చేస్తూ వచ్చే ఈ గ్రామవాసిని సంప్రదించగా, నాలుగురోజుల్లో 'తఖ్తా' సిద్ధంచేసి యిచ్చాడు. పాత 'దప్తర్'ను పరిశీలించాను. నా స్కేల్ (హాలీ) 42 42 టు 54 18

చక్ర్యాల గ్రామంలో శ్రీ. గాజుల చెన్నయ్య, తమ్ములతో కూడియున్న, గొప్ప సంపన్న కుటుంబి. సదాచారం కలవారు. వారి పెద్ద భవనంలో– ఒక భాగాన్ని – ప్రత్యేకంగా నాకు వసతి కల్పించడమే కాక రెండేండ్లు–అక్కడ ఉన్నంత కాలం– మాకు భోజన సామగ్రిని సమకూర్చారు. ఆషాఢ పున్నమకు; మాఘ పున్నమకు – ఏడాదిలో రెండు సార్లు గ్రామంలో ఆబాలగోపాలం, అన్నదానం చేసి, పెద్దల ఆశీర్వాదం పొందేవారు.

పక్షం రోజుల వేతనం రాగానే, నేను నారాయణపురానికి పోయి నా పత్నిని, రెండవ తమ్ముడైన నరసింహాచార్యులను (శిరిశిల్ల స్కూలు TC తో పాటు) తోడ్కొని వచ్చాను. తమ్ముణ్ని సంగారెడ్డి హైస్కూలు, 8వ తరగతిలో ప్రవేశ పెట్టాను. ఆ స్కూలులో శ్రీమాన్ గోవర్ధనం దేశికాచార్యులు టీచర్‌గా ఉన్నారు. వారు మాకు బంధువులు. వారి యింటికి పోయి 'స్వామీ! నాకు H.S.C పరీక్షార్థం ఇంగ్లీషు నేర్పండి. రోజు సాయంత్రం వచ్చి, ఉదయం వెళ్ళి పోతాను' అని విజ్ఞప్తి చేశాను. 'అదెంతభాగ్యం! నా దగ్గర మీ ఇష్టానుసారంగా

ప్రవర్తించవచ్చు'సన్నారు. చక్ర్యాలలో జొన్నరొట్టెలు, కందిపప్పు, వంకాయకూర బాగా రుచికరంగా ఉండేది. పాఠశాల వేళ 9 నుంచి 4 గం.లు. సాయం 5గం.కు సంగారెడ్డికి పోయి, మొదట జ్ఞానోదయ రీడర్ (10వ తరగతి)లో గాంధీజీని గూర్చి కృష్ణాఔథీ సింగ్ వ్రాసిన ఆంగ్లపాఠం (నాలుగు పేజీలు) చెప్పించుకొన్నాను. తలగడ నున్నగోడకు ఎక్కాదీపాన్ని వెలిగించి, ఆరాత్రి, ఉదయాననూ వల్లించాను. తెల్లవారగానే లేచివచ్చిన దేశికస్వామిని 'మీరు చెప్పిన పాఠంలో దయచేసి నా దోషాలను సవరించండి, వినండి, అనగానే వారు పుస్తకం పట్టుకొని, కొన్ని పదాలను అడిగితే వాటి అర్థం చెప్పినాను. చదివితే మీకు నా ఉచ్చారణ కూడా తెలుస్తుందని గబగబా పాఠమంత (నోటికే) చదివాను. 'బాపురే! వేదంలాగా పూర్తి పాఠాన్ని ఒక్క రాత్రి కంఠస్థం చేశావు! రోజు ఒక్క పేజీ కూడా వ్రాయడం మంచిది. H.S.C. తప్పక పాసవుతా'వన్నారు. కొన్నాళ్ళ కృషి తర్వాత, కథలను అనువదించి చూపగా సవరణ చేసేవారు. Hanuman fire lanka అన్నదానికంటె He set lanka on fire అంటె బాగుంటుందని వివరించేవారు. 'టేల్స్ ఆఫ్ షేక్స్పియర్, వికార్ ఆఫ్ ఏ వేక్ ఫీల్డ్' హైస్కూలు గ్రామర్ అనే బుక్స్ తానే ఇచ్చి, వీటిని వీలునుబట్టి చదువుకొమ్మన్నాడు.

1952లో వారికి ఒక పుత్రుడు జన్మించాడు. ఫిబ్రవరిలో నాకు ఒక సూనుడు ఉదయించాడు. మా తల్లిగారికి మగపిల్లవాడు జన్మిస్తే తిరుమలేశుని దర్శనానికి వస్తాము స్వామీ! అని మా అమ్మమ్మగారు మ్రొక్కినారట. కాని అట్టి మ్రొక్కిబడి నేనుపుట్టిన ఇన్నాళ్ళకు కూడా దీర్చుకో లేదు. నాకూ సంతానమైనందువల్ల, దర్శనం చేసుకోకపోతే భగవన్ని గ్రహపాత్రుల మవుతా మనిపించింది.

'తిరుమలకు వెళ్ళదలచానండి' అని తెల్పగానే, చెన్నయ్య, తమ్ముడైన రాములు, పుత్రుడైన అనంతయ్య, బ్ర.శ్రీ.గోపాలకృష్ణయ్యగారు, పట్వారి శ్రీ. లక్ష్మణ్‌రావు, ఆయన సుతుడు రామారావు పోదామని సిద్ధమయ్యారు. నాకు పురుడు వెళ్ళిన పిమ్మట శంకరపల్లి నుంచి విజయవాడ, గూడూరు, తిరుపతికి చేరడానికి రెండురోజుల సమయం పట్టింది. ఏడుగురం ఏడు కొండలస్వామిని దర్శనం చేసుకొన్నాము. ఆకాశగంగకు తెల్లవారెవరకు పోయి తీర్థమాడివచ్చి, మళ్ళీ తలకు రూ 13/చొప్పున ఒక 40 మంది భక్తులతోపాటు శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకొనే భాగ్యం కలిగింది. తిరుచానూరులో పద్మావతీ దేవిని సేవించి, నాలుగు రోజుల్లో చక్ర్యాలకు చేరుకొన్నాము. తిరుపతికిపోయి రావడానికి మనిషికి రూ 30/లు (రైలు చార్జీలు) అవసరమైన కాలమది. ఇంటికి వచ్చిన తర్వాత యాత్రోత్సవం

జరుపబడింది. మా తల్లిదండ్రులను పుత్రుని నామకరణానికి రమ్మని అన్నయ్య తెల్పినందున వారు మెదక్కు వచ్చారు. వందరూపాయిలకు ఒకతులం బంగారం జోగిపేటలో కొనుక్కొని నేనూ మెదక్కు వెళ్ళినాను. బంధువులు వచ్చారు. సప్తగిరి నాథుడైన వేంకటరమణుని సేవించి వచ్చినానని అందఱు సంతోషించారు. మా పుత్రునికి 'వేంకటరమణ' అని నామకరణం చేశాము. మాకు పుత్రుడు జన్మించిన తర్వాతనే, శ్రీ వేంకటేశ్వరస్వామి తనను దర్శించుకొనే సుకృతం ఈ సేవకునికి కల్పించాడని పెద్దలు మంగళా శాసనం చేశారు.

తర్వాత స్కూలు పరీక్షలు, వేసవి సెలవులు, తిరిగి యథావిధి ఉద్యోగం, చక్ర్యాలకు కుటుంబం మా తల్లిదండ్రులతో పాటు చేరుకొన్నది. 1952 సం. గడిచింది. 1953 జులైలో దేశికాచార్యస్వామి BEd Traininig కోసం హైదరాబాదుకు వెళ్ళాడు. ఆ యేడు అక్టోబర్‌లో డిప్యుటేషన్‌గా నాకు మెదకు హైస్కూలుకు తబాదిలా అయింది. ఏడవ తరగతి క్లాసు టీచర్ గాను 8,9 తరగతులలో సంస్కృత పాఠ (ఐచ్ఛికం) బోధకునిగానూ నియమించి, టైం టేబుల్ చేతికిచ్చారు. తక్కిన ఇద్దరు తమ్ములను (తిరుమల శ్రీనివాసాచారి, వెంకటరమణచారి) కూడా హైస్కూలులో (7,5వ తరగతుల్లో) చేర్చాను. అక్కడి తోటి టీచర్లతో సమాన యోగ్యత ఎప్పుడు కలుగుతుందో కదా! అన్న ఆర్తి పెరిగింది.

గ్రాడ్యేట్ టీచర్స్‌కు H.S.C. తెలుగు వాచక పరీక్షలో అవశ్యంగా ప్యాసు కావాలని ప్రభుత్వ శాసనమేర్పడింది. 'విద్యయావిద్యం' అన్నట్లు శ్రీ. సలాం సామోబు అనే గణితోపాధ్యాయుడు 'నీకు లెక్కలను నేర్పుతాను, నాకు తెలుగు నేర్పండి' అని కోరినాడు. ఆవిధంగానే కృషి చేశాము. హైస్కూలులో మొదట అన్ని సబ్జెక్టులలో H.S.C.పరీక్షలో పాసైన విద్యార్థులను హైదరాబాదు పబ్లిక్ H.S.C.పరీక్షకు పంపేవారు. నాకు 45% మార్కులు వచ్చాయి. నాకు అనుమతి లభించింది. ఫీసు చెల్లించాను. 16 మార్చి 1954 నుంచి, రోజు రెండు సబ్జెక్టుల చొప్పున వివేకానంద హైస్కూలు, హైదరాబాదులో పరీక్ష వ్రాయడానికి టైంటేబుల్‌తో పాటు హాల్‌టికెటు నాకు అందింది. 15 మార్చినాడు హైదరాబాదుకు చేరినాను. అక్కడ శ్రీ.జి.దేశికాచార్యులు, జి.ఎస్ వరదాచార్యులు ఏర్పరచుకొన్న బడీ చావిడీ గల్లీలో ఉన్న 'మెస్సు'లో నేను చేరడానికి వారు అంగీకరించారు. H.S.C. పరీక్ష వ్రాశాను.

ఆ సమయాన నారాయణపురంలో బ్ర.శ్రీ. బావి కృష్ణశాస్త్రి గారు స్వర్గస్థులయ్యారని హైదరాబాదులో తెలిసింది. నారాయణపురం చేరుకొన్నాను. వారి కుటుంబానికి సంతాపం తెల్పడమయింది. ఆ యేటనే శ్రీ.బి. రామరాజుగారు, జానపదగేయాల తాళపత్రాలను కె. మురళీధర శర్మ, బి. అచ్యుతరాజు సేకరించి పెట్టినందువల్ల, నారాయణపురం వచ్చి తీసుకొని పోయినారని తెలిసింది.

"విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమం,

నమీవంధ్యా విజానాతి గుర్వీం ప్రసవ వేదనామ్" అన్నట్లు మహానుభావులు తెలుగు సాహిత్యాభివృద్ధికై ఎంతో శ్రమ పడుతుంటారు కదా! అని యెద ఆర్ద్రమయింది.

మెదక్కు వచ్చాను. స్కూల్స్ ఆరంభమయినాయి. హెడ్మాస్టర్ శ్రీ సర్దార్ ఖాన్‌గారు 'నేను H.S.C.పరీక్షలో ద్వితీయ శ్రేణిలో - ఉత్తీర్ణుడనయ్యాను' అని చెప్పినారు. భగవత్కటాక్షంవల్ల కృషి ఫలించిందని సంతోషించాను. 1955 ఫిబ్రవరిలో కూతురు శకుంతల జన్మించింది. నాకు అంతలోనే 54-96 (Scale) వేతనంపై రంగంపేట హెడ్మాస్టర్‌గా ట్రాన్స్‌ఫర్ అయింది. ఆఱు మాసాలు కాగానే తిరిగి మెదక్ హైస్కూలుకు తబాదిలా అయింది. 1957లో F.A. పరీక్షను చాదర్‌ఘాట్ కాలేజిలో వ్రాసి పాసయ్యాను. శ్రీ వి. నరసింహాచారి అన్నగారు మెదకులో, హైదరాబాదు హిందీ ప్రచార సభా పరీక్షలను నడుపుతుంటే నేను సూరత్, కిల్లాపార్డీ - స్వాధ్యాయ మండల్ సంచాలితాఖిల భారతీయ సంస్కృత భాషా పరీక్షా సమితి - ప్రవేశిక మొదల్కొని విశారద పరీక్షలను నిర్వహించాను. మిషన్ కాంపౌండులో బ్రిటిషు వారికి ఆఱు మాసాలు (ఆదివారం తప్ప) తెలుగు భాషను బోధించాను. గంటకు రూ10/- ల చొప్పున వారానికొకసారి నాకు చెల్లించేవారు. 'హిందీ భూషణ్' పాసయిన నేను 'హిందీ విద్వాన్' పరీక్షార్థులకూ పాఠాలను బోధించే అవకాశం కలిగింది.

తమ్ముడు నరసింహాచారి 1956లో H.S.C. పాసై ప్రైమరీస్కూల్ హెడ్మాస్టర్‌గా ఉద్యోగంలో చేరాడు. 1958 ఫిబ్రవరిలో రెండవ కూతురు-రమాదేవి- జన్మించింది. 1959లో హైస్కూల్, మల్టీపర్పస్ స్కూలుగా పరివర్తనం చెందింది. తమ్ముడు నరసింహాచారి టీచర్స్ ట్రేనింగ్ పాసైనందువల్ల ఆయేడు సిద్దిపేట డిగ్రీకాలేజిలో PUC పరీక్ష వ్రాసి ఉత్తీర్ణుడయ్యాడు. నేను 12వ తరగతి F సెక్షన్‌కు క్లాసు టీచర్‌గా ఉన్నాను. మూడవ తమ్ముడు. టి. శ్రీనివాసాచారి 12వ తరగతి (మల్టీపర్పస్) పరీక్ష వ్రాసి, ప్రథమ శ్రేణిలో

ఉత్తీర్ణుడయ్యాడు. ఆ తర్వాత ఇంజనీరింగ్ కాలేజి (ఓ.యు)లో అడ్మిషన్ లభించింది. కాని మూడు మాసాల తర్వాత అడ్మిషన్ ఫార్మును పరిశీలించిన ఇం. కాలేజివారు '21సం.లు దాటి, మూడు రోజులే ఎక్కువగా'నున్నందువల్ల నిరాకరించారు. లేకుంటే ఆ తమ్ముడు ఇంజనీర్ అయ్యేవాడు. నేను పోయి ప్రిన్సిపాల్ శ్రీ. రంగాచారిని అడిగితే మూడు రోజుల వయస్సు అధికంగా ఉందని చెప్పి, నేనిచ్చిన బాండు, కట్టిన ఫీజు నాకు వాపసు ఇచ్చారు. ఇక అందరం Edu. Dept.లోనే ఉద్యోగులమయ్యాము. అన్నదమ్ములము ముగ్గురము 1960-61లో B.A. - 3y Dc. (O.U.లో) వ్రాసి ఉత్తీర్ణులమయ్యాము. మిత్రుడు టి.వి. నరసింహులు పరీక్షను హైదరాబాదులో తన గృహమందే మాకు వసతి కల్పించి ఆదరించిన పద్ధతి జీవితంలో మరపు రానిది. 1962లో నేను ఎం.ఏ. మొదటి సం. ద్వితీయానుజుడు పొలిటికల్ సైన్సు M.A., తృతీయానుజుడు తెలుగు MA మొదటి సం. పరీక్షను వ్రాసి ఉత్తీర్ణులమయ్యాము. 1962 సెప్టెంబర్‌లో మా తండ్రిగారు పరమపదించారు. శోక పరితప్తులమైనందున, ఆ సంవత్సరం ఉద్యోగం తప్ప, మరేమి చేయ తోచలేదు. MA Iyr పరీక్షను మాతో పాటు బ్ర.శ్రీ. దోర్బల విశ్వనాథశర్మగారు, శ్రీ. రవ్వా శ్రీహరిగారు, శ్రీమాన్ మరింగంటి శ్రీరంగాచార్యస్వామి కూడా వ్రాశారు.

1963 మేలో నా ద్వితీయ పుత్రుడు-మనోహరాచారి-జన్మించాడు. చివరి తమ్ముడు టి. వెంకటరమణాచారి 12-మల్టీపర్పస్- పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనందున తమ్ముల సహాయంతో ఉస్మానియా మెడికల్ కాలేజిలో చేర్పించడ మయింది. 'రా(గ్రాజ్యేట్స్'కు ప్రొమోషనీయడం రద్దు అయినందువల్ల నేను 1964లో వరంగల్ బి.ఎడ్ ట్రేనింగ్ కాలేజిలో చేరి, మొట్టమొదట స్టుడెంటు అనుభవాన్ని పొందాను. హైదరాబాదులో తమ్ముడు టి.నరసింహాచారి బి.ఎడ్. ట్రేనింగును ఆఱునెలల్లో పూర్తి చేసుకొన్నాడు. 1965లో నేను బి.ఎడ్ ట్రేనింగ్ పాసైనందువల్ల M.P.H.S మెదకులోనే ప్రొమోషన్ లభించింది. రెండవ చెల్లెలుకు శ్రీనివాసమ్మకు-పెండ్లి చేసిన అప్పును తీర్చుకొన్నాము. తమ్ముడు టి.శ్రీనివాసాచార్యులు యం.ఏ. తెలుగు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణుడై, ఖమ్మం డిగ్రీ కాలేజిలో ట్యూటర్‌గా చేరాడు. 1966 ఫిబ్రవరిలో నా మూడవ కూతురు- సువర్ణ పుట్టింది. నా పెద్ద తమ్ముడు పార్థసారథి తెలుగు డిప్, ఓ, ఎల్ పాసై కొడిపల్లి హైస్కూల్‌లో పండిట్‌గా ఉద్యోగి అయ్యాడు. నా పుత్రుడు M.P.H.S పరీక్షలో ఉత్తముడుగా ఉత్తీర్ణుడయ్యాడు. జులై 1966లో వెంకటరమణ-కొడుకు-ను సిద్దిపేట డిగ్రీ కాలేజిలో (B.Sc.) అడ్మిట్ చేశాను. జె.బి.హైస్కూల్ సిద్ధిపేటకు నేను తబాదిలా చేయించుకొని వచ్చాను.

సిద్ధిపేటలో పండిత సభలు, కవి సమ్మేళనాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు అధికంగా జరుగుతుండడం వల్ల పురప్రముఖులతో సాన్నిహిత్య మేర్పడింది. విద్వత్కవి శ్రీ. వేముగంటి నరసింహాచార్యులు, కళాకోవిదులు, చిత్రకారులు శ్రీ.కె. రాజయ్యగారు సుప్రసిద్ధులు గీతా భవనంలో నిత్యం ఆధ్యాత్మిక ప్రవచనం సాగుతుండేది. సాహిత్య మండలి పక్షాన నెలకు ఒకటి, రెండు సమావేశాలు జరిపి, జనచైతన్యం కల్పింపబడేది. శ్రీ. A రామరాజుగారు, శ్రీ వెంకట్రావుగారు (Advocates) సంస్కృత కావ్యాలు అభ్యసించేవారు, ఉపే. శ్రీమాన్ ఎలిజర్ల సీతారామాచార్యుల వారి సన్నిధిలో నేను శ్రీ A. రామరాజుగారును ఆఱు మాసాలు ఆళ్వార్ల దివ్య ప్రబంధం – భగవద్విషయాన్ని సేవించాము. శ్రీ శ్రీ శ్రీ త్రిదండి పెద్ద జీయర్స్వామి వారి స్వాధ్యాయ యజ్ఞంలోనూ ఉభయ దాన్త సభలలోనూ పాల్గొనే అవకాశం నాకు లభిస్తుండేది. 1967లో యం.ఏ. సంస్కృతం పూర్తి చేశాను. టి. శ్రీనివాసాచారి (తమ్ముడు) కరీంనగరం డిగ్రీ కాలేజిలో లెక్చరర్గా ఉండి, 'ఉదయరాగం' అనే పుస్తకాన్ని రచించి ఆవిష్కరణ సభ నేర్పరచాడు. ఆసభలో వేదికపైన డా॥ దివాకర్ల అవధానిగారు, డా॥ జి.వి. సుబ్రహ్మణ్యంగారు పేంచేసి యున్నాడు. పుస్తకావిష్కరణం, పరిచయం అయిన తర్వాత తమ్ముణ్ని ఆశీర్వదించాను.

'ఉస్మాన్యా విశ్వవిద్యాలయ గురుపదవీ భ్రాతతేయస్యధామ్నా"అనీ శ్రీ వేంకటావధానీతి సుప్రసిద్ధాభిధానతః వయంత్వాంతు కథం బ్రూమః హృదయాబ్జ దివాకరమ్" అని అవధానిగా సుశ్లోకించాను. తిరిగి కారులో సిద్దిపేటకు చేరగానే 'ఆపండి!' అని దిగినాను. శ్రీ. సుబ్రహ్మణ్యంగారు 'ఇక్కడ లెక్చరర్గా ఉన్నారా? అని అడిగారు" ఆ భాగ్యం లభించలేదు. మాతంద్రిగారు రామశబ్దంతో సంస్కృతాన్ని ఆరంభిస్తే, ఆ భాషలో యం.ఏ. పట్టం పొందాలనే అభిలాష చేత పూర్తి చేశాను. కాని 49-5% మార్కులు మాత్రమే పొందగలిగాను. కాబట్టి టీచర్గానే ఉన్నా"నండి అన్నాను. 'తెలుగు యం.ఏ. కూడా పూర్తి చేయండి' అని అవధానిగారు చెప్పినారు. "వాచమర్థోనుధావతి" అన్నట్లు, దివ్యమైన దీవెనగా భావించి, "సరె! నమస్కారం' అన్నాను.

1969లో కె.వి. రమణ బిఎస్సి ప్రథమ శ్రేణిలో పాసైనాడు. తెలంగాణ అలజడులు అధికమయ్యాయి. కాకతీయ యూనివర్సిటీలో M.Sc కెమిస్ట్రీలో అడ్మిట్ అయ్యాడు. 1971 డిసెంబర్లో O.U.పరీక్షలు జరిగాయి.

ఆ డిసెంబర్లోనే ఎం.ఏ (II yr) తెలుగు ద్వితీయ శ్రేణిలో పాసయ్యాను. పుత్రిక లిద్దరు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. నేను 1972 సెప్టెంబర్ 25న నాడు ఆదిలాబాదు

డిగ్రీ కాలేజిలో ట్యూటర్‌గా చేరినాను. అక్కడ శ్రీ. పాలకొల్లు రామచంద్రరావుగారు ప్రిన్సిపాలుగా ఉన్నారు. తర్వాత శ్రీ జగన్నాథరావుగారు ప్రిన్సిపాలుగా వచ్చారు. శ్రీ. ఎన్. సత్యనారాయణ (తోటి లెక్చరర్) ఆదరించి, వసతి కల్పించాడు. బ్ర.శ్రీ. వెంకట నారాయణశర్మగారు పరిచయమయ్యారు. వీరు ఉపనిషదర్థాలను గూర్చి అడిగితే, యథామతి ప్రామాణికంగా వివరిస్తే సంతోష పడేవారు. 'ఉపాసనలు వేర్వే రైనా ఉపాస్యుడొక్కడే' అని వేదాన్త వాక్యాలను వినిపిస్తే చాలా తృప్తిపడేవారు. వీరు ఆదిలాబాదులో రిజిస్ట్రారుగా ఉన్నారు. వీరి పుత్రుడే రఘునందన్. వినయం, మృదుహృదయంగల (డిగ్రీ) విద్యార్థి. (ఇప్పుడు ఈయన హైదరాబాదు సెక్రెటేరియట్‌లో ఉద్యోగిగా ఉన్నాడు). డా॥ మధుసూదన్‌రాజుగారు డిస్ట్రిక్ట్ మెడికల్ సూపరిండెండెంటు ఆధ్యాత్మిక సంపన్నులు. వీరితో సాన్నిహిత్య మేర్పడింది. ప్రతిరాత్రి శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, పోతన భాగవత పఠనం చేసేవారు. జటిలమై ప్రశ్నలు వేస్తే, నేను శర్మగారు యథాశక్తి సంశయరహితమైన సమాధానాలను పూర్వగాథలను వివరించి, చెప్పేవాళ్లము. ప్రసిద్ధులైన శ్రీ.సదాశివగారు ఉర్దూభాషలో గొప్ప విద్వాంసులు. వారితో కలిసినప్పుడు జోష్, ఎక్బాల్, గాలిబ్ వంటి మహాకవుల గేయ పంక్తులను వినిపించి ఆనంద పరచేవారు.

1973, పరీధావి సంవత్సరం, ఉగాది నా కలెక్టర్ ఆఫీసు ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. తిరుపతి వేంకటకవుల 'శ్రవణానంద' కావ్యంలోని 'వయసువాడట, ఆ మీద వైష్ణవుడట' అని, రాగయుక్తంగా బోలెడు పద్యాలు చదివే అవకాశం నాకు లభించింది. శ్రీ రాధాకృష్ణగారి (లెక్చరరు) డైరెక్షన్‌తో 'కన్యాశుల్కం'లోని ముఖ్య ఘట్టాలు ప్రదర్శింపబడినాయి.

ఇంతకాలందాకా ప్రసరించిన ప్రసాదచ్ఛాయలు అడుగంటాయి. విషాదచ్ఛాయలు పరంపరగా వ్యాపించడ మారంభించాయి. నా భార్య ఆరోగ్యం 'క్షీణించిందని సిద్దిపేట నుంచి 'ఫోన్' వచ్చింది. డాక్టర్ సలహాతో ఆదిలాబాదుకు తీసుకువచ్చాను. డా॥ మధుసూదన్‌రాజుగారు వలసినంత ఉపచారం చేశారు. కాలేజిలో వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. డాక్టర్‌గారు 'అది బోన్ ట్యూమర్' అని నిర్ణయించారు. 'ఆపరేషన్ ఆవశ్యంగా చేయించాలి' అని ఉస్మాన్యా హాస్పిటల్ డా. చలపతి రావుగారికి లేఖ వ్రాసి నా చేతికిచ్చాడు. వేసవి సెలవులు కలిసివచ్చాయి. వెంటనే సిద్ధిపేట మీదుగా హైదరాబాదుకు ఆమెను తీసుకపోయాను. 'హౌస్ సర్జన్'గా ఉన్న చిన్న తమ్ముని యింట్లో నేను నివసిస్తూ, ఆమెను ఉస్మాన్యా హాస్పిటల్‌లో చేర్చాను. మే 20వ తేదీన స్పైనల్ కార్డు

D 7-9 ఆపరేషన్ చేసి, డా॥ చలపతిరావుగారు ఆమెకు నాలుగు మాసాల ట్రీట్‌మెంటు అవసరమని చెప్పినారు. ఒకనాడు 'ఆపరేషన్ షీట్'ను పట్టుకొని విద్యాశాఖ డైరెక్టర్ ఆఫీసుకు పోయాను. శ్రీ ఆదినారాయణ గారికి 'షీట్' చూపించాను. 'హైదరాబాదు ఉస్మానియాలో పత్ని పేషంట్‌గా ఉంది. సిద్ధిపేటలో పిల్లలు ఉన్నారు. ఆదిలాబాదులో నేను ఉద్యోగిని కదా! ఎలా నిర్వహించాలో తోచకుండా ఉంది' అని విన్నపించాను. ట్రాన్స్‌పర్ కోసం అప్లికేషన్ వ్రాసి ఇచ్చాను. వారు కృపాపూర్ణులై 18 జూన్ నాడు మళ్ళీ ఈ ఆఫీసుకు నన్ను రమ్మని చెప్పినారు. ఆపరేషన్ సంగతి పిల్లలకు తెల్పలేదు. చికిత్స జరుగుతున్నదని మాత్రం పిల్లలనుకొన్నారు. '18 జూన్'నాడు ఆఫీసుకు వెళ్ళే సరికి అక్కడ శ్రీ.జగన్నాథరావు ప్రిన్సిపాల్ గారు కలిశారు. వారు నన్ను డైరెక్టర్ వద్దకు తోడ్కొని పోయి, 'మా రాఘవాచార్యులు కష్టంలో ఉన్నారు. ట్రాన్స్‌పర్ చేయండి' అన్నారు. 'ఉండండి' అని ఒక గంటలో, సిద్ధిపేట కాలేజిలో లెక్చరరుగా, ఆర్డరు తెచ్చి ఇచ్చారు. ప్రిన్సిపాలుగారు నాలుగు తెల్ల కాగితాల మీద సంతకం చేసి యిచ్చి, త్వరగా ఆదిలాబాదుకు పోయి 'ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్' నుంచి 'రీలీవింగ్ ఆర్డర్ తెచ్చుకొండి' అన్నారు. 22 జూన్‌నాడు రిలీవింగు ఆర్డరు తీసుకొని 23 జూన్ నాడు సిద్ధిపేట కాలేజిలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చి, హైదరాబాదుకు చేరుకొన్నాను. 'ఆపదలందు ధైర్యము' అనే పద్యం స్మృతికి వస్తుండేది.

కాలేజి ఆరంభమైన తర్వాత నా తల్లితో పాటు నా పిల్లలను తెచ్చి సిద్ధిపేటలో శ్రీ A. రామరాజుగారి (వకీలు) ఇంట్లోనే ఒక భాగమందు నివసించేశాను రామరాజుగారి ఉపకారమూ విస్మరించరానిది. నేను హైదరాబాదు నుంచి ఉదయాన చాందా బస్సులో సిద్ధిపేటకు చేరి, కాలేజిలో పని పూర్తికాగానే, సాయం గం.4లకు బస్సులో ఉస్మాన్యా హాస్పిటల్‌కు చేరుతుండడం నిత్య ప్రక్రియ. జయలక్ష్మి అనే సిస్టర్, రోజూ రూ.10లు ఒక ఆడమనిషికి ఇస్తే, ఆమె పేషంట్‌ను ఆదరంగా ఉపచరించే ఏర్పాటు చేసింది. 1973 అక్టోబర్ 17న రాత్రి పుత్రిక శకుంతలకు వివాహం;18న ఉదయం పుత్రుడు కె.వి. రమణకు పుష్పలతతో పెండ్లి చేయడం, శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధి (ముప్పిరితోట)లో జరిగింది. కె.వి. రమణ సైఫాబాద్‌కాలేజిలో రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడుగా చేరాడు. ఉస్మాన్యా హాస్పిటల్ ప్రక్కన కోల్సావాడలో అద్దె యింట్లో నివసిస్తూ, ఉద్యోగ నిర్వహణతోపాటు, హాస్పిటల్‌లో తల్లికి సేవ చేసే బాధ్యతను వహించాడు. శ్రీ. సి. రామయ్య లెక్చరర్‌గారి చొరవ వల్ల లెక్చరర్లకు హౌజింగ్‌బోర్డు –

ప్రశాంతనగర్ – కాలనీ కేటాయింపబడింది. అందు H.B./4B1 క్వార్టర్ నేను తీసుకొన్నాను. అప్పుడు ఆర్ట్స్ & సైన్స్ కాలేజ్, వరంగల్లులో లెక్చరర్‌గా ఉన్నాడు. 1977లో ఏలూరు (W.G. Dist) లో R.D.Oగా చేరడానికి వెళ్ళాడు. అక్కడి నుంచి 1978లో నారాయణపేటకు ట్రాన్స్‌పర్ అయ్యి వచ్చాడు. 1979లో నాకు పౌత్రుడు 'కిరణానంద్' జన్మించాడు. 1981లో నాకు 'డిస్క్ ప్రొలాప్స్' అయినందువల్ల ఉస్మాన్యా హాస్పిటల్లో డా॥ పి.రంగాచారి ఆపరేషన్ చేశారు. మూడు మాసాలు అక్కడే క్వార్టర్స్‌లో ఉండగా, నారాయణపేట నుంచి కుటుంబంగా వచ్చి ఉపచరించాడు.

సిద్ధిపేటలో శ్రీ వేంకటేశ్వరదేవాలయ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. సదస్సులో శ్రీ వేముగంటి మొదలైన కవులతో పాటు నేనూ కొన్ని పద్యాలను వ్రాసి, చదివాను. అందులో నొకటి –

"శ్రీ త్రిదండి యతీంద్రులు స్నిగ్ధ పూర్ణ
హస్త సరసీరుహముల, సమస్త నూరి
దివ్య వైకుంఠనాథు బ్రతిష్ఠ జేయ
పరమ పదమయ్యె మోహినీ పురము భువిని"

ఆసందర్భంలో శ్రీ.శ్రీ.శ్రీ. త్రిదండి శ్రీమన్నారాయణ పెద్ద జీయర్ స్వామి వారి ఆధ్వర్యవమున స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞమూ జరుపబడింది.

సిద్ధిపేట కోటిలింగాలయ ప్రతిష్ఠ జరిగినప్పుడు చదివిన కవితలో–

"మంగళ గౌరిని మనసా
రంగని పెండ్లాడి, నాట్య రంగము నంద
ర్ధాంగము నిడి, భూతేశుడ
మాంగల్యము వీడి సర్వమంగళుడయ్యెన్"

"శివుని ధ్యానము జేసి చిచ్ఛక్తి తోడ త
ద్వాహన మగునట్లు వరలెనెవడు?
ధవళాచలేశుని ధ్వజముగా వెలయుచు

ప్రమథాది గణముల పనిచెనెవడు?

కైలాసమున శివ లీలలం గననేగు

దశకంఠు నెదిరించి తరిమెనెవడు?

భువిలోన శివభక్తి దివిదాక పెంచుచు

బసవన్న యనుపేర బరిగెనెవడు

సర్గస్థితి లయకారియౌ భర్గునాజ్ఞ విశ్వమున పంచి మంచిని పెంచెనెవడు?

'శృంగి' యాతడు కొందఱు 'భృంగి' యనగ, నందికేశ్వర నామ మన్వర్థమయ్యె' ఇలా అవసరమని వ్రాయడమేకాని, సాధన చేసిన 'కవిత' కాదని స్పష్టమవుతున్నది కదా! సాహిత్య వికాసమండలి పక్షాన జరిగిన ఒక సభకు మంత్రి శ్రీ వల్లూరి బసవరాజుగారు అధ్యక్షత వహించినప్పుడు, వారిని ఒక పద్యంతో–

"రాజన శశధరుడౌనట

రాజన యక్షేశుదుర్వరా పతియగునే

రాజన దుశ్చ్యవ నాఖ్యుడె

రాజన వల్లూరి బసవ రాజే రాజా॥" అని ప్రశంసించి,

"న కృష్ణాజలం తర్షతీ మాం ధరిత్రీం

న గోదావరీ సేతుర ద్యాపి బద్ధః

నిరుద్యోగ వృద్ధి ర్నిధీనాంఖిలత్వం

అహో! జాగృతిస్తే తెలంగాణ సీమ్నః॥" అని వినిపించాను.

సిద్ధిపేట గీతాభవనంలో గీతాభాష్యం, దేవీ భాగవతం, కోటిలింగాలయంలో శ్రీ.శ్రీ. మదనానంద యతీంద్రుల ప్రేరణతో శ్రీమద్రామాయణం, శ్రీ రాజేశ్వరరావు లెక్చరర్ కోరిక మీద హరివంశ పురాణం, ఇత్యాది ప్రవచనాలను చేసే అవకాశమూ కలిగింది.

1983లో 'యువభారతి' అధ్యక్షులైన బ్ర.శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి గారి ప్రోత్సాహం చేత వ్రాయబడిన "మాఘకావ్య వైభవం" అనే పుస్తకాన్ని ఆ సంస్థయే ప్రచురించింది. చీరాల, ఒంగోలు, గుంటూరు విద్వత్కవులనుంచి 'ఆ విధంగా మాఘ కావ్యమంతా

పూర్తిగా వ్యాఖ్యానిస్తే బాగుంటుంద'ని నాకు లేఖలు అందినందు వల్ల తర్వాతి రచనలకు ఉత్సాహం కలిగింది. 13-14 శతాబ్దిలో పాండిత్య పాథో నిధులై వెలసిన శ్రీ వేదాన్త దేశికుల స్తోత్రకావ్యాలను తెలుగులో ఎవరూ వ్యాఖ్యానించలేదు. వారిని గూర్చి ప్రచారమూ ఇక్కడ ఎక్కువగా లేదు. పూర్వాచార్య సంబంధాభినివేశం చేత దేశికుల రచనలను తెలుగులో వివరించాలనే కుతూహల మేర్పడింది.

1987లో 'గోదాస్తుతి'కి పరిమళ వ్యాఖ్యను రచించి ప్రచురించాను. "1988 (మార్చి 18 శుక్రవారం) ఉగాది పర్వదినాన్ని 'నన్నయ భట్టారక పీఠం' వార్షికోత్సవంగా జరుపుకొంటున్నాము. మీరు పాల్గొనాలన్నదే మా కోరిక" అని 'తణుకు' నుంచి ప్రధానకార్శి శ్రీ సుశర్మగారు ఆహ్వాన పత్రాన్ని పంపించారు.

దేశికులవారు అవతరించింది 'విభవ' నామసంవత్సరమే. నేను పుట్టినది 'విభవ'లోనే లేఖ కూడా యాదృచ్ఛికంగా వచ్చింది కదా! "విభవ– నన్నయ భట్టారక పీఠం, తణుకు" అనే అక్షరాలలో ఒక్కొక్క అక్షరాన్ని పద్య పాదాద్యక్షరంగా రచించి. 'పద్యపంచకం' అనే శీర్షికతో పోస్టుద్వారా పంపినాను. అక్కడ 'కవితల పోటీలో' ప్రథమ బహుమతిమీదే' అని యమ్.ఓ పంపించారు.

"సతాంహివాణీ గుణమేవ భాషతే" అన్నట్లు, శ్రీ సుశర్మగారి వంటి పెద్దల (లేఖలోని) వాగ్విలాస విషయమై "భద్రైషాం లక్ష్మీర్నిహితాధివాచి" అనే శ్రుతి వాక్యార్థం ఎదలో పదిలంగా మెదలింది.

హైదరాబాదు, ఆంధ్ర సారస్వత పరిషద్భవనంలో శ్రీ శ్రీ త్రిదండి పెద్దజియ్యర్ స్వామి వారు ఉభయ వేదాన్త సభలను నిర్వహించారు. అప్పుడు ఉ.వే.శ్రీమాన్ తె.కం. గోపాలాచార్యుల వారి పర్యవేక్షణలో, శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులవారి అధ్యక్షతన 'ఒషివిల్కాల మెల్లాం' అనే దివ్య ప్రబంధ పాశురాలను గూర్చి ప్రసంగించే భాగ్యం నాకు లభించింది. "కున్ద మేన్దుం కు ళిర్మషైకాత్తవన్" "తిరువేంగడమ్ నంగళ్కు శమంగొళ్ వీడు తరుం తరుం కున్తమే" అ తిరుమలేశుడు అంటే శ్రీ వేంకటేశ్వరస్వామి అనే అర్థమే కాక 'అనగాధి రాజు' అనే అర్థమూ ఉంది. ద్వాపరయుగంలో శ్రీ కృష్ణుడు గోవర్ధన గిరిని ఎత్తినాడు.

కలియుగమందు తల మీద శ్రీనివాసభగవానుణ్ని ఎత్తుకొన్న నగాధిరాజమైన వేంకటాచలమే భక్తితో నమస్కరించిన వ్యక్తులకు పాపాలనన్నిటినీ తొలగించి 'సామ్య'మనే

మోక్ష ఫలాన్ని ప్రసాదిస్తుంది ఇది ఆ తిరువాయ్‌మొడి' యొక్క సారార్థమని ప్రసంగించడమయింది. అనాడు మహా మహోపాధ్యులైన ఉ.వే.శ్రీమాన్ న.చ.రఘునాథాచార్యుల వారి సూచన ప్రకారంగా డాక్టర్ శ్రీ భాష్యం రామాచారి గారు నాకు 'శ్రీ భాష్య'మనే గ్రంథాన్ని సమర్పించారు.

అది మొదలుగా వార్షికంగా నిర్వహింపబడే ఉ.వే.సభలలో పాల్గొనే అవకాశం కలిగింది. 1985, రక్తాక్షి ఫాల్గుణ శుద్ధ విదియనాడు మా తల్లిగారు పరమ పదించారు. భగవానుడు నిరంకుశ స్వతంత్రుడు కదా! 1989 జనవరి మాసాంతాన సిద్దిపేట కాలేజి నుంచి రిటైరయిన తర్వాత హైదరాబాదుకు చేరుకొన్నాను. నా యిద్దఱు కొడుకులు హైదరాబాదులోనే ఉద్యోగం చేస్తున్నారు. వాళ్ళ తల్లికి రెండవసారి ఆపరేషన్ జరుగడం వల్ల, నేను ఎక్కువ సమయం ఉస్మాన్యా హాస్పిటల్ క్వార్టర్‌లోనే గడిపాను. నిత్యానుష్ఠానం, స్వయంపాకం, రేయింబవళ్ళు రచన హాస్పిటల్లోనే సాగేది.

1990లో 'భగవద్విషయం–ఈడు అవతారిక' తమిళానికి అనువాదం మరియు 'భగవద్ధ్యానసోపానం' అనే స్తోత్రానికి 'మనోరమా వ్యాఖ్య' రెండు పుస్తకాలను రచించాను. శ్రీమాన్ వి.పి. రాఘవాచారి గారు–చైర్మన్ 'అహోబిలమఠమునందు మొట్టమొదట తెలుగులో తిరుప్పావై కాలక్షేపం మీరే చేయా'లని ఆదేశించడం వల్ల 90&91 ధనుర్మాసాలలో తిరుప్పావై ప్రవచించాను.

1992లో 'శ్రీమద్రామానుజులు–వర్ణాశ్రమధర్మాలు' అనే గ్రంథాన్ని రచించగా, శ్రీమాన్ ధనకుధరం వరదాచార్యులు తమ 'శ్రీ రామానుజ కీర్తికౌముది, 12వ భాగమందు గుంటూరులో ప్రచురించారు? శ్రీ దేశికుల గ్రంథాలను మీరు వ్యాఖ్యానం వ్రాస్తున్నారని తెలిసింది. ఆగ్రంథాలను 'శ్రీమాలోల గ్రంధమాల–అహోబిలమఠం, హైదరాబాదు' పక్షాన ప్రచురిస్తా"మని పత్రం వ్రాసి యిచ్చారు. ఆ విధంగానే, 1996లో 'శ్రీరంగనాథపాదుకా సహస్రం–రమణీయాంధ్ర టీకా తాత్పర్య, వ్యాఖ్యాసహితం, మొదటి భాగం మొదలుకొని 2003వరకు వ్రాసిన 5 ఐదు సంపుటాలను 'అహోబిలమఠం'వారే ప్రచురించారు.

1997లో 'గరుడదండకం–సుషమా వ్యాఖ్య'తో ప్రచురింపబడింది.

1998లో ఆళ్వారులు – భక్తి ప్రపత్తి మార్గములు' – 'భక్తినివేదన,

స్వర్ణోత్సవ సంచిక'లో ప్రచురితమయింది.

2001లో అమెరికాకు పోయి వచ్చినాను.

2002లో నారాయణ శతకానికి 'రాఘవీయ వ్యాఖ్య'ను శ్రీ చల్లా సాంబిరెడ్డిగారి అభీష్టానుసారం రచించగా శ్రీ పావనీ సేవా సమితి (హైదరాబాదు) ప్రచురించింది. ఆ సంవత్సరమే 'దివ్య ప్రబంధత్రయి (తమిళం), ఆంధ్రటీకాతాత్పర్య వివరణం' ముద్రితం. 2003లో ద్రవిడోపనిషత్తాత్పర్యరత్నావళికి ప్రకాశికావ్యాఖ్యను రచించగా కరీంనగరం జూ.కాలేజి ప్రిన్సిపాల్ శ్రీమాన్ చక్రవర్తుల లక్ష్మీనరసింహాచార్యులుగారు ప్రచురించారు.

2004లో శ్రీ సుదర్శనాష్టకం – జ్వాలావ్యాఖ్యానం

2005లో 'చతుఃశ్లోకీ–దీపికా వ్యాఖ్యాసహితం' (రెండింటినీ) 'అహోబిల మఠం' ప్రచురించింది.

2006లో శ్రీ రుక్మిణీ కల్యాణం – వైష్ణవీ వ్యాఖ్యను 'శ్రీ పావనసేవా సమితి' ప్రచురించింది. కృష్ణారెడ్డి (అడ్వకేట్) గారు అచ్చు వేయించారు.

2007లో 'యతి రాజ సప్తతి – చంద్రికా వ్యాఖ్య'ను కరీణ్నగరం శ్రీయుత మాదాడి కృష్ణారెడ్డి (అడ్వకేట్) గారు అచ్చు వేయించారు.

2008లో 'అభీతిస్తవం–సంజీవనీ వ్యాఖ్య' పెద్దపల్లి శ్రీయుత నుంద సునీల్ రెడ్డిగారిచే ముద్రితం.

2009లో 'శ్రీస్తుతి–హిరణ్మయీ వ్యాఖ్య' కరీణ్నగరం శ్రీయుత మాదాడి కృష్ణారెడ్డి గారిచే ప్రచురితం.

2010లో 'శ్రీ వేదాన్తదేశిక దర్శనం' మా తిర్మల చారిటబుల్ ట్రస్టుచే ప్రచురింపబడింది. (వార్షికంగా వేద సంస్కృత పండితులను సన్మానించుకోవడం పరిపాటి)

'శ్రీనివాస దయాశతకం–అమృతాస్వాదినీ వ్యాఖ్యానం' అహోబిల మఠం వారు ప్రచురించారు.

2011లో 'న్యాస వింశతి–శ్రేయసీ వ్యాఖ్య' వరంగల్, ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులవారిచే ప్రచురింపబడుతున్నది.

'యాదవాభ్యుదయ మహాకావ్యం–సుబోధినీవ్యాఖ్య'

తిరుపతి నివాసులైన శ్రీ. ఎన్. వేంకటరమణగారి ప్రేరణ చేత రచన సాగుతున్నది.

రేడియోలో వేదపఠనం, కోలాచల మల్లినాథసూరి ప్రేరణచేత రచన సాగుతున్నది.

వేదాన్త దేశికులు, హంస సందేశం, ఋతువర్ణనలు, దూరదర్శన్‌లో శ్రీపాదుకా సహస్ర వైభవం, నిఘంటువుల ప్రయోజనం ఇత్యాది ప్రసంగాలు సంస్కృతాంధ్ర భాషల్లోనూ (కొంతకాలం వరకు) చేయబడినాయి.

ఇప్పుడు, ఐదు సంవత్సరాలనుంచి హైదరాబాదు, అహోబిలమఠం నుంచి వెలువడుతున్న 'శ్రీ నృసింహప్రియ' మాస పత్రికకు సహాయ సంపాదకునిగా ఉన్న, భాగవత విధేయుడను.

బిరుదులు:–

1. విశిష్టాద్వైత వేదాన్త విశారద–శ్రీ.రా.కౌ గ్రంథమాల, గుంటూరు.

2. శాస్త్ర విద్వన్మణి – వేద విశ్వవిద్యాలయం, తిరుపతి.

3. వాచస్పతి – రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

సన్మానాలు:

1. ఉభయ వేదాన్త పండిత సన్మానం. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద, చిన్న జీయర్ స్వాముల వారి అనుగ్రహం.

2. శ్రీ శివానంద సద్గురు ఎమినెంట్ సిటిజన్ అవార్డు.

3. సంస్కృత పండిత సన్మానం. తెలుగు యూనివర్సిటీ, హైదరాబాదు.

4. ఉగాది పురస్కారం–దిండిగల్, శ్రీ గణపతిసచ్చిదా నందస్వామి వారిచే స్వర్ణ కంకణం.

5. సంస్కృత విద్వత్సన్మానం–ఆం.ప్ర.ఉగాది పురస్కారం 2007

6. ఆచార్యవరివస్య –త్రైవర్ణ్యరామానుజకూటం, విజయనగరం 2008

7. ఉభయవేదాన్త విద్వత్సన్మానం–నర్సాపురం, పశ్చిమ గోదావరి జిల్లా

8. ఉ.వే.విద్వజ్జన పురస్కారం–వరంగల్, మహామహోపాధ్యాయ, కవి శాబ్దిక కేసరి,

శాస్త్రరత్నాకర శ్రీ. న. చ. రఘునాథాచార్యస్వామి వారి తిరునక్షత్రోత్సవం 2009

9. మహా వ్యాఖ్యాతృ పురస్కారం – శ్రీ రంగం శ్రీమదాండవన్ ఆశ్రమం, భాగ్యనగరం. 2010.

"మేధాదేవీ సరస్వతీ" "సారస్వతీరపః" అనే వేద వాక్యాలకు "బ్రహ్మజల ధారణ ప్రశ్చ్యోతనాభ్యాం వేదాః పరాంసి, తన్మయత్వాత్ తద్వతీ సరస్వతీ" అని శంకరభాష్యం. "బ్రహ్మతత్వతపోవేదే" అనే నిఘంటు వచనం వల్ల బ్రహ్మ శబ్దానికి వేదమని అర్థం. వేదశబ్దరాశి జలమని రూపింపబడింది. జలానికి ధరించడం, ప్రవహించడం ధర్మం– స్వభావం. వేద వాఙ్మయానికి ఆశ్రయించడం, అంతట వ్యాపించడం దాని ధర్మం. రూపంలోనూ, గుణంలోనూ బృహత్వం కలది కాబట్టి (అనంతావైవేదాః– అనంతత్వం కలదైనందు 'బ్రహ్మ' అనబడింది. బ్రహ్మమనేజలాన్ని ధరించి, ఆయా అధికారులకు ప్రవహింపజేయడం వల్ల వేదాలు సరస్సులు. సరోమయమవడంవల్ల సరస్సులు కలది 'సరస్వతి' అని నిర్వహింపబడింది.

(వే=వ+ఈ) వకారం అమృత వాచి. ఈకారం సంపద్వాచి. వశ్చ ఈశ్చ=వయౌ. వయౌదదాతీతి=వేదః భుక్తి ముక్తులనిచ్చేది వేదం, అని అర్థం. "బ్రహ్మణి వేదే నిద్యాః ప్రతిపాదితాః " సకల విద్యలకు మూలం వేదవాణి. వణ్యతే ఇతి=వాణీ వణశబ్దే (ఈకారంతం, స్త్రీ లింగం) నినదించేది (పలుకబడునది) అని అర్థం.

"నకారప్రాణమిత్యాహుః, దకారమనిలం విదుః" నకారమంటె ప్రాణం, దకారమనగా అగ్ని. ఈ రెండింటి కలయికయే నాదం..' గాలివలె సర్వత్ర వ్యాపించి జీవింపజేసేది. అగ్నివలె తేజస్సును కలిగించేది. తాను అంతట వీచుతూ ఇతరులను బ్రతికించేది గాలి. తాను జ్వలిస్తూ ఇతర వస్తువులను ప్రకాశింపజేసేది అగ్ని (వస్తువు యొక్క కిరణాలు కంటిలోకి ప్రసరించి, పరావర్తనంకాగా, ఆ వస్తువును కంటికి కనబడునట్లు చేసేది తేజస్సు). అగ్నికి వాయువుతోడుగా ఉన్నట్లు, జ్యోతీరూపమైన శబ్దం హృదయం నుంచి ఊర్ధ్వగమనంగా ముఖోద్గతమై, నేరుగా ఇతరుల చెవులద్వారా వారి హృదయం (హృత్+ఆయతి)లోకి ప్రవేశిస్తుంది. భౌతిక ద్రవ్యం కంటికి కనబడుతుంది. "శ్రోత్రేణ హితద్వీందతే"– జ్ఞానద్రవ్యం చెవి ద్వారా ఆస్వాదింపబడుతుంది. శ్రుతి పేయమని భావం.

'వాణి' శబ్దానికి నేయుట అనే అర్థముంది. 'వయనం వాణిః'– ఇకారాంతం స్త్రీలింగం, వేఞ తంతుసంతానే' అనే ధాత్వర్థం కలది కాబట్టి, ఇది భౌతిక ద్రవ్యం. అది, యిది

ఒకటే అని పొరపడరాదు).

సర్వశ్రుతిమనోహరమైన సరస్వతికి సంబంధించిన మహిమయే సారస్వతం కదా! వాఙ్మయం కంటె సారస్వత పరిధి చిన్నదైనా, పరిశ్రమైక సాధ్యమైన దీని దీధితి గొప్పది. అంతస్సారం కల్గిన సారస్వతం వర్ధిష్ణువుల చేత భజనీయమైనది.

అన్వర్థాభిధానులై స్వేచ్ఛతో కల్పించిన 'పరిణతవాణి' కార్యక్రమాలను నిర్వహిస్తూ, నాకు ఈ అవకాశాన్ని సౌమనస్యంతో ప్రసాదించిన, ఆంధ్రసారస్వత పరిషదధ్యక్షులైన శ్రీయుత సి.నారాయణరెడ్డిగారికి, ప్రధాన కార్యదర్శిగా ఉన్న శ్రీ. ఎల్లూరి శివారెడ్డిగారికి, నేను వాగుతున్నంత సేపు నిశ్శబ్దంగా ఉన్న రసజ్ఞులైన శ్రోతలకు కృతజ్ఞతతో హార్దాంజలి ఘటిస్తున్నాను.

స్వస్తిశ్రీర్దిశతాత్–



డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న పరిణతవాణి ప్రసంగ పరంపరంలో నాజీవిత విశేషాలను ప్రసంగించే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు.

నేను అనంతపురం జిల్లా రాయదుర్గంలో జానకమ్మ సుబ్రహ్మణ్యశాస్త్రి గార్లకు మూడవ సంతానంగా 5-6-1926న జన్మించాను. రాయదుర్గం శ్రీ కృష్ణదేవరాయలు సామంతుడైన భూపతిరాయుడు నిర్మించిన గిరిదుర్గం. నా ప్రాథమిక విద్య రాయదుర్గం కోటలోని వీరభద్రస్వామి ఆలయంలో జరిగింది. అది ఒక వీధి బడి. ముంజోజీ అనే ఒక ఫించనుదారు ఆ బడిని నడిపేవాడు. 1, 2 తరగతులకు ఒక అణా, 2 అణాలు ఫీజు వసూలు చేసేవాడు. నేటివలే ఆనాడు వాచకాలు అందుబాటులో లేవు. ఒక చిన్ని నోట్‌బుక్‌లో కొన్ని ఊర్లపేర్లు, తాలుకాల పేర్లు, ఎక్కాలు, నెలలు, తిథి, వార, నక్షత్రాల పేర్లు రాసి ఇచ్చేవాడు. అదే నా మొదటి వాచకం. ఉదయం 7 గంటలకల్లా బడి ప్రారంభమయ్యేది. కృష్ణ శతకం, సుమతీ శతకం పద్యాలు వల్లె వేయించేవారు.

ఆకాలంలో డబ్బు విలువ మరీ ఎక్కువగా ఉండేది. రూపాయికి ఎనిమిది సేర్లు బియ్యం. మా తాతగారు స్థానిక నగరేశ్వరాలయంలో అర్చకులుగా వుండేవారు. ఉదయాన్నే లేపి అమరకోశం వల్లె వేయించేవారు. 9 గంటలకు బాలరామాయణం అప్పజెప్పి భోజనం చేసి, మైలు దూరంలో వున్న హైస్కూల్‌కు పరుగు తీసేవాళ్లం.

రాయదుర్గం తెలుగు కన్నడ భాషల కూడలి. నా మాతృభాష తెలుగు. హైస్కూల్‌లో కోరుకొని కన్నడం రెండవ భాషగా చదివాను. మా ప్రధానోపాధ్యాయుడు ఎన్. సుందరం

అయ్యర్. ఎస్.ఎస్.ఎల్.సి తరగతిలో ఆయన మాకు ఇంగ్లీష్ పాఠాలు చెప్పేవారు. ప్రతి విద్యార్థి వద్ద టెక్స్టుబుక్‌తో పాటు మైకెల్‌వెస్ట్ ఇంగ్లీషు డిక్షనరీ, రెన్ & మార్టిన్ గ్రామర్ పుస్తకం తప్పక ఉండాల్సిందే. ప్రతి రోజూ పాఠాలు చెప్పేముందు, జరిగిన పాఠాలపై ప్రశ్నలు వేసేవారు సరైన సమాధానాలు చెప్పకపోతే బెత్తం దెబ్బలు తప్పేవి కావు.

మా చరిత్ర ఉపాధ్యాయులు నేత్రపల్లి సంజీవరావుగారు జాతీయ భావాలు గలవారు. మహనీయుల జీవితాలను ఉత్తేజకరంగా చెప్పేవారు. వారాంతంలో సారస్వత సమావేశాలను జరిపి విద్యార్థులలో రచనాశక్తిని, వక్తృత్వ శక్తిని పెంపొందించేవారు.

1942 సంవత్సరంలో **"క్విట్ ఇండియా"** ఉద్యమం ముమ్మరంగా సాగుతుండేది. స్థానిక కాంగ్రెస్ నాయకులు విద్యార్థులను ఉద్దేశించి ఉపన్యాసాలిచ్చేవారు. కొంత మంది మిత్రులతో పాటు రాత్రి భోజనం తర్వాత ఒక గదిలో చదుకోవడానికి చేరేవాళ్లం. పంచాంగం సుబ్బరామశర్మ కాంగ్రెస్ యువనాయకుడు బయటి ఊర్ల నుంచి వచ్చే ఉద్యమ కరపత్రాలను సిరాతో నకళ్లు రాయించేవాడు. వేకువనే లేచి మా ఊరు చుట్టూ ఉన్న కొండ రాళ్లపై "డు ఆర్ డై", "క్విట్ ఇండియా" అన్న నినాదాలు సున్నంతో రాసేవాళ్ళం. అదే ఆనాటి మా దేశసేవ.

1942 అక్టోబర్ 2వ తేది గాంధి జయంతి. ప్రార్థనానంతరం తరగతులు ప్రారంభమయ్యేవి. కొందరు మిత్రులతో కలిసి గాంధీ జయంతి రోజున ప్రార్థన తర్వాత "మహాత్మాగాంధికి జై" అని కేకలు వేశాం. ప్రార్థన సమావేశాల్లో ప్రధానోపాధ్యాయుడు తప్పక హాజరయ్యేవారు. మా కేకలు విని నాతో పాటు మరో నలుగురు విద్యార్థులను పిలిచి వరుసగా నాలుగు దెబ్బలు వేశారు. అటువంటి కేకలు వేయడం మంచిది కాదని హెచ్చరించారు.

నా హైస్కూల్ చదువు బాగా సాగింది. మంచి మార్కులు వచ్చాయి.

వేసవి సెలవుల్లో నా స్వగ్రామం జానమద్దికి వెళ్ళేవాడిని. మా ఊరు నది తీరంలో ఉంది. నదీతీరంలో కపిలబావి నుంచి నీటిని పొలాలకు మళ్లించేవారు. ముగ్గురు జీతగాళ్లు ఆ పనులు చూసేవారు. వారి సహకారంతో నేను కూడా మోటపై కూర్చుని కపిలె తోడేవాణ్ణి.

హైస్కూలు చదువు తరువాత జిల్లా కేంద్రమైన బళ్ళారి చేరాను. వైశ్యకుల గురువుగా,

పండితులుగా వుండిన భాస్కరాచార్య రామచంద్రస్వామి గారింట్లో వుండి 1944-46 మధ్య టీచర్ ట్రైనింగ్ స్కూల్‌లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా శిక్షణ ముగించాను. మంచి మార్కులు రావడంతో ట్రైనింగ్ పూర్తి అయిన తరువాత వారం రోజులలోనే 'ట్రైనింగ్ స్కూల్‌కు అనుబంధంగా ఉన్న మోడల్ స్కూల్‌లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా నా ఉద్యోగ జీవితం ప్రారంభించాను. బళ్ళారిలోని హింది ప్రశిక్షణ కళాశాలలో హిందీ తరగతులకు వెళ్లేవాడిని. మా అధ్యాపకులు టి.బి. కేశవరావు, కె. గౌడప్ప స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. బళ్ళారిలో రెండేళ్ళు ఉపాధ్యాయుడుగా పనిచేసిన తరువాత నేను కన్నడం కూడా చదివినందున 1951లోనే జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతిపై బళ్ళారి జిల్లాలోని కన్నడ తాలుకా కూడ్లిగికి బదిలీ చేశారు. అప్పుడు నిర్బంధ ప్రాథమిక విద్య అమలులో ఉండేది. ఆంధ్ర ప్రాంతానికి వయోజన విద్య గౌరవ డైరక్టరుగ వుండిన గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు బళ్ళారి జిల్లాలోని వయోజన విద్యా కేంద్రాలను, గ్రామ పంచాయితి గ్రంథాలయాలను చూస్తూ జిల్లాలోని కన్నడ తాలుకాలలో పర్యటించారు.

గాడిచర్లవారు స్వాతంత్ర్య సమరయోధులు. తెలుగువారిలో మొట్టమొదటి మూడేళ్లు కఠిన కారాగార శిక్ష అనుభవించిన ఎం.ఏ. పట్టభద్రుడు. పగటివేళ గ్రామీణ గ్రంథాలయాలను చూచేవారు. రాత్రిబడులను దర్శిస్తూ ఉపాధ్యాయులకు చక్కని బోధనా పద్ధతులను వివరించేవారు. వారి తెలుగు ప్రసంగాలను కన్నడంలోకి అనువదిస్తూ వారితో జిల్లాలోని కన్నడ తాలుకాలన్నిటికీ వెళ్లాను. ఆయన ఆదర్శ దేశభక్తుడు; మూర్తీభవించిన త్యాగమూర్తి.

వారం రోజుల పర్యటన తరువాత నా అనువాద రీతిని మెచ్చుకొని "నేను నీకు ఏమి చేయగల"నని కోరారు. "అయ్యా, నేను బళ్ళారిలో ఉద్యోగం చేస్తూ ప్రైవేట్‌గా ఇంటర్‌మీడియట్ పాసయ్యాను" ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత మద్రాస్ యూనివర్శిటివారు బి.ఏ. చదవటానికి అనుమతించలేదు. ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నందున ఆంధ్ర యూనివర్సిటిలోనే బి.ఎ. చదువ వలసి వచ్చింది. నేను చరిత్రహిందీలతో ఇంటర్ మీడియట్ చదివాను. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆ గ్రూప్ లేదు. అందుకు ప్రత్యేక అనుమతి పొందాల్సి వచ్చింది. హరిసర్వోత్తమరావుగారు ఆంధ్ర యూనివర్శిటి సెనెట్ మెంబర్‌గా ఉండేవారు. వైస్-చాన్స్‌లర్ డా.వి.యస్.కృష్ణగారికి గారికి రాసి నాకు ప్రత్యేక

అనుమతి ఇప్పించారు. ఆ రీతిగా ఉద్యోగం చేస్తూ బి.ఏ. పరీక్ష పాసయ్యాను. తర్వాత ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ఎం.ఏ. పట్టాలందుకొన్నాను.

రాష్ట్ర విభజనానంతరం మా ఊరు రాయదుర్గానికి జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా చేశాను. ఒక ఏడాది పాటు పని చేశాను. విద్యార్థి దశనుండే నాకు సాహిత్యం పట్ల ఆసక్తి ఉండేది. స్థానికులైన పెద్దలు ప్రారంభించిన 'విజయకళాసమితి' అన్న సాహిత్య సంఘానికి కార్యదర్శిగా వుండి శ్రీనాథ జయంతి, కాళిదాస జయంతి కార్యక్రమాలను గొప్పగా జరిపాం. సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా వుండిన రత్నగిరి పద్మనాభన్ కార్యదక్షుడు, మంచి వక్త. అపుడు జరిగిన శ్రీనాథ జయంతి సభలో పుట్టపర్తి నారాయణాచార్యులు బ్రహ్మాండంగా ఉపన్యసించారు.

ఏడాది తరువాత నెల్లూరు జిల్లా దర్శి తాలూకాకు బదిలి జరిగింది. అది చాలా వెనుకబడిన ప్రాంతం. రెండేళ్ల ఉద్యోగం చేసిన తరువాత సెలవుపై నెల్లూరులోని ప్రభుత్వ టీచర్ ట్రైనింగ్ కాలేజిలో బి.ఎడ్. పూర్తిచేశాను. సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది బాపట్ల, గుంటూరు జిల్లాలో పనిచేసి, 1960లో కడపలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్లానింగ్ విభాగం ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై కడపకు వచ్చిన తరువాత నా జీవితంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది.

1960–63 వరకు ఇన్‌స్పెక్టరుగా పనిచేసి 1964 బెంగుళూరులోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ ఆంగ్ల బోధనలో శిక్షణ పొందాను. ఇన్‌స్పెక్టరుగా 1965లో రాజంపేటకు బదిలీ అయ్యాను. రాజంపేటకు 6కి.మీ దూరంలోని తాళ్ళపాకలోని ప్రాథమిక పాఠశాల ఇన్‌స్పెక్షన్ ముగించాను. గ్రామ పెద్దలు పాఠశాలను అప్పర్ ప్రైమరి పాఠశాలగా పెంపొందించమని కోరారు. రాజంపేటకు వచ్చి సమితి అధ్యక్షులను సంప్రదించమని సూచించాను. అధ్యక్షులు పోలా వెంకటరెడ్డి విద్యా వినయ సంపన్నులు; నిజాయితీపరులు. ఇన్‌స్పెక్టర్ శాస్త్రిగారు రెకమెండ్ చేస్తే అనుమతిస్తామన్నారు. గ్రామస్థులకు నేనొక షరతు పెట్టాను. మీ ఊళ్ళో గొప్ప భక్త కవి అన్నమాచార్యులు జన్మించారు. ఆయన పేర చిన్న ఆలయం నిర్మిస్తామని వాగ్దానం చేయమన్నాను. ముందుగ పాఠశాలలో అన్నమాచార్యుల చిత్రపటం పెట్టించమని కోరాను. కవి, చిత్రకారుడైన మైనంపాటి సుబ్రహ్మణ్యంగారు అన్నమయ్య చిత్రాన్ని రాసిచ్చారు. అంతలోనే జిల్లా విద్యా విషయక సర్వే ఆఫీసరుగా

కడపకు బదలి జరిగింది. ఆ రీతిగా అన్నమయ్యను లోకానికి పరిచయం చేసే అదృష్టం నాకు లభించింది.

కడపలో రాచుపల్లె రాజగోపాలరెడ్డిగారి కృష్ణ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫీసులో రోజూ కొందరు రచయితలం కలుసుకొని సాహిత్య చర్చలు జరిపేవాళ్ళం. రెడ్డిగారు **"మాసీమ"** పక్షపత్రిక సంపాదకులుగా ప్రారంభించారు.

1973లో చిత్తూరు జిల్లా రచయితల మహాసభలకు, కడప ప్రతినిధిగా పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. సభలు చాలా బాగా జరిగినట్లు, అట్టి సంఘాన్ని కడపలో కూడా ప్రారంభించటం మంచిదని పి. రామకృష్ణారెడ్డి సూచించారు. ఆయన అధ్యక్షుడుగా, జానమద్ది హనుమచ్ఛాస్త్రి (నేను) కార్యదర్శిగా సంఘం ఏర్పడింది.

1973 ఆగస్టు 11,12 తేదీలలో కడప జిల్లా రచయితల మొదటి మహాసభ జరిగింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అధ్యక్షులు డా. బెజవాడ గోపాలరెడ్డి ముఖ్య అతిథిగా వచ్చారు. శివభారత కావ్యకర్త గడియారం వేంకటశేషశాస్త్రి గారు అధక్ష్యత వహించారు. ఏడాది తర్వాత రామకృష్ణారెడ్డి ఆంధ్రజ్యోతి వార పత్రిక సబ్ ఎడిటరుగా విజయవాడ వెళ్ళారు. డా. మల్లెమాల వేణుగోపాలరెడ్డిగారు అధ్యక్షులుగా, నేను ప్రధాన కార్యదర్శిగా ఇరువదేళ్ళలో 8 మహాసభలు, కొన్ని వందల సాహిత్య సభలు, యువతను ప్రోత్సహిస్తూ ఎన్నో సభలు జరిపాం. ఈ మహాసభల్లో విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ శ్రీ, దాశరథి కృష్ణమాచార్య, పురిపండా అప్పలస్వామి, దేవులపల్లి రామానుజరావు, పుట్టపర్తి నారాయణాచార్యులు, కుందుర్తి, ఆరుద్ర, జ్వాలాముఖి, గజ్జెల మల్లారెడ్డి, రా.రా., కేతు విశ్వనాథరెడ్డి, దివాకర్ల వెంకటావధాని, ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ, మధురాంతకం రాజారాం మున్నగు వారెందరో పాల్గొన్నారు. జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా, ఆ తరువాత అధ్యక్షులుగా సభలు నిర్వహించి రాష్ట్రంలో ఎందరో సాహిత్యవేత్తల పరిచయం సంపాదించుకొన్నాను.

సి.పి.బ్రౌన్ గ్రంథాలయ భవన నిర్మాణం:

1976లో ఆరుద్ర, బంగోరె (బండి గోపాలరెడ్డి) కడప వచ్చారు. వారు తమవద్దనున్న బ్రౌన్ రీడర్ల ఆధారంతో కడపలో బ్రౌన్ నివసించిన స్థలాన్ని, బంగళా శిథిలాలను పరిశీలించారు. అప్పటి కలెక్టర్ డా. పి.ఎల్.సంజీవరెడ్డి గారిని కలుసుకొని తెలుగు

భాషా సాహిత్యాలకు ఎంతో కృషి చేసిన బ్రౌన్ స్మృతి చిహ్నంగా గ్రంథాలయం నిర్మించాలన్న తమ ఆశయాన్ని కలెక్టరుకు చెప్పారు.

సాహిత్యాభిమానియైన కలెక్టర్ డా. పి.ఎల్. సంజీవరెడ్డి నన్ను పిలిపించారు. అప్పట్లో నేను ప్రభుత్వ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడుగా పనిచేస్తుండేవాడిని. బ్రౌన్ స్మృతి చిహ్నంగా గ్రంథాలయ నిర్మాణానికి నన్ను పురమాయించారు.

డా॥ సంజీవరెడ్డిగారు బ్రౌన్ బంగళా శిథిలాలున్న స్థల యజమాని ఆడిటర్ కృష్ణస్వామిగారిని ఆహ్వానించి, బంగళా శిథిలాలున్న 20 సెంట్ల స్థలాన్ని బ్రౌన్ స్మృతి చిహ్నంగా గ్రంథాలయ నిర్మాణానికి విరాళంగా ఇవ్వమని కోరారు. ఆయన వెంటనే సమ్మతించారు. 1977నాటికి బంగళా మొండిగోడలు మాత్రమే మిగిలాయి. ట్రస్టు కార్యదర్శిగా ఉండమని నన్ను ఆదేశించారు. 1977నుండి 1987దాకా జిల్లా ప్రణాళికా మండలి వారికి గ్రంథాలయ భవన నిర్మాణానికి సహాయం కోరుతూ వినతి పత్రాలు సమర్పించాం. పదేళ్ళు ప్రయత్నించాను కాని ప్రజాప్రతినిధులు ఏమాత్రం ఆసక్తి చూపలేదు.

1986 జూలైలో జంధ్యాల హరినారాయణగారు కలెక్టరుగా వచ్చారు. వారు స్థలదాత ఆడిటర్ సి.కె. సంపత్‌కుమార్ అధ్యక్షులుగా, నన్ను కార్యదర్శిగా ఉండమని సూచించారు. ట్రస్టు ప్రధానపోషకులుగా కలెక్టరు, అధ్యక్షుడుగా ఆ స్థలదాత సి.కె. సంపత్‌కుమార్, జానమద్ది హనుమచ్ఛాస్త్రి ప్రధాన కార్యదర్శిగా, మరో ఏడు మంది సభ్యులుగా రిజిష్టర్ చేయబడింది. కలెక్టరుగారు తెలుగు గ్రామీణ పథకం నిధుల నుంచి రూ.3.5 లక్షలు మంజూరు చేశారు. అంతలోనే వారికి బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. మా విన్నపం మేరకు హరినారాయణగారు మరుసటి రోజు 22.1.1987 ఉదయం భవనానికి శంకుస్థాపన చేశారు. 'సరస్వతీపుత్ర' పుట్టపర్తి నారాయణాచార్యులు నాటి సభకు అధ్యక్షత వహించారు. ఆ రోజు సాయంత్రం రైల్లో హైదరాబాద్ వెళ్ళుతూ **"భగవంతుడు ఈ సత్కార్య నిర్వహణ కోసమే నన్ను కడపకు పంపారు కాబోలు"** అన్నారు. మేము సాదరంగా వీడ్కోలు పలికాం.

అందిన ప్రభుత్వ నిధులతో భవన నిర్మాణం ప్రారంభించాం. ఎందరో దాతల సహకారంతో మూల భవన నిర్మాణం పూర్తి చేశాం. విద్యాశాఖాధికారి డా. ఆర్. సత్యనారాయణ, ప్రాంతీయ విద్యాశాఖాధికారి శ్రీ రామస్వామిరెడ్డి సహకారంతో కడప, ప్రొద్దుటూరు విద్యార్థులు కూర్చిన 25వేల పైకంతో ప్రహరిగోడ పూర్తి చేశాం.

కలెక్టర్, శ్రీ ఎ.కె. పరిడ్సాగారు, 60,000/లు గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు.

కడప సమీపంలోని వల్లూరి గ్రామానికి చెందిన పోలేపల్లి వెంగన్నశ్రేష్ఠి గారు తాము నిర్వహిస్తున్న సీతారామచంద్ర గ్రంథ భాండాగారంలోని 2 వేల గ్రంథాలను బ్రౌన్ గ్రంథాలయానికి అందజేశారు. 1992 నుంచి సేవలందిస్తున్న గ్రంథాలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు దర్శించి, 20.11.1995న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వావిలాల గోపాలకృష్ణయ్యగారిచే ప్రారంభోత్సవం కావించారు.

1994లో గ్రంథాలయ నిర్వహణకు నిధుల కొరతను గ్రహించిన కలెక్టర్ కె.వి. రమణాచారిగారు ప్రభుత్వం నుంచి 5 లక్షల నిధులను సమకూర్చి మాకెంతో ఊరట కల్పించారు.

28.7.1996లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య నాయని కృష్ణకుమారిగారు గ్రంథాలయంలో వేమన చిత్రపటాన్ని ఆవిష్కరించారు. నాటి సభకు అధ్యక్షులుగా ఉండిన ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.గిరిధర్‌గారు నన్ను పిలిపించారు. ప్రస్తుత భవనంపై సమావేశ మందిరం నిర్మంచమని సూచిస్తూ రూ.2.5లక్షలు విడుదల చేశారు. వారి తరువాత వచ్చిన కలెక్టర్ వి. నాగిరెడ్డి గారు లక్ష రూపాయలు సహాయం అందజేశారు. సమావేశ మందిరం పూర్తి అయింది. పరిశోధకులకు తాత్కాలికంగా బసచేయుటకు వీలుగా డా.బి.శ్రీరామమూర్తి, డా. కనుపర్తి రాధాకృష్ణ, వేంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.గంగిరెడ్డి గార్ల విరాళంతో మూడు గదులు నిర్మింపబడ్డాయి.

1998 నవంబర్ 14,15 తేదీలల్లో బ్రౌన్ ద్విశతి జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుపబడ్డాయి. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత. డా.సి.నారాయణరెడ్డిగారు, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య నాయని కృష్ణకుమారిగారు, స్థలం ఇప్పించిన డా. పి.యల్.సంజీవరెడ్డి, కలెక్టరు డా.పి.సుబ్రహ్మణ్యం, రిటైర్డ్ చీఫ్ సెక్రటరి మామిడిపూడి గోపాలకృష్ణన్, తమిళనాడు ప్రభుత్వ కార్యదర్శి జె.టి.ఆచార్యులు, ఇన్‌కంట్యాక్స్ కమీషనర్ జి.ఆర్.రెడ్డి, ఎ.వి.యస్ రెడ్డి, ఇన్‌చార్జ్ కలెక్టర్ బలరామయ్య, లోకాయుక్త జస్టిస్ జగన్నాథరాజు, ప్రముఖ పారిశ్రామికవేత్త జి.యస్.నాయుడు, ఎందరో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హెచ్. జె. దొర, కడప

ఎస్.పి. గోవింద్‌సింగ్ గ్రంథాలయాన్ని దర్శించి 100 కుర్చీలు 6 రీడింగ్ టేబుల్స్ విరాళంగా అందజేశారు.

అమెరికాలో పనిచేస్తున్న ఆచార్య సి. ఆదినారాయణరెడ్డి వారి శ్రీమతి శశికళారెడ్డి ప్రారంభించిన సుమబాల ట్రస్టు అధ్యక్షులు సి. రామసుబ్బారెడ్డి, డా. పి. సంజీవమ్మ, డా, డి. కృష్ణారెడ్డి బ్రౌన్ గ్రంథాలయానికి ఒక్కొక్కరు రు. 50వేలు విరాళంగా ఇచ్చారు.

నానాటికి పెరిగిపోతున్న పుస్తకాల సంఖ్య, పరిశోధకుల కోరిక మేరకు రెండవ అంతస్తు నిర్మాణానికి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా. సి.నారాయణరెడ్డిగారు రాజ్యసభ సభ్యులుగా తమ విచక్షణ నిధుల నుంచి రూ.10లక్షలు అందజేశారు. అలా నిర్మింపబడిన అంతస్తుకు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి.నారాయణరెడ్డి పరిశోధన కేంద్రంగా ఏర్పడింది. ఆ కేంద్రాన్ని 9.10.2003 న డా. సి.నారాయణరెడ్డిగారే ప్రారంభించారు. **'ఇంతితై వటుడింతయై'** అన్నట్లు బ్రౌన్ గ్రంథాలయం విస్తరించింది. పలు ప్రచురణ సంస్థలు, పండితులు వేలాది గ్రంథాలను విరాళంగా అందజేశారు.

కడప జిల్లాకు చెందిన డా. వై.యస్. రాజశేఖరరెడ్డిగారు 2006లో బ్రౌన్ గ్రంథాలయాన్ని దర్శించి మా సేవలను అభినందిస్తూ గ్రంథాలయాన్ని కడపలోని యోగి వేమన విశ్వ విద్యాలయానికి అప్పగింపజేశారు. ప్రభుత్వం నుంచి రు. 30 లక్షలు వార్షిక గ్రాంటు మంజూరు చేశారు. బ్రౌన్ గ్రంథాలయ ప్రగతిని సూచించుటకు ఆధారంగా మొండిగోడల నుండి మహాసౌధం దాకా అన్న పేరుతో 250 పుటల ప్రత్యేక గ్రంథం ప్రచురింపబడింది. సందర్శకుల చేతి రాతలతో వారి అభిప్రాయాలను ఫోటోలతో సహా ప్రచురింపబడింది. దాదాపు పాతికేళ్లుగా కొనసాగించిన గ్రంథాలయ నిర్మాణ యజ్ఞం పూర్తికావటంతో నా జన్మ సార్థకమైంది అన్న తృప్తి నాకు మిగిలింది. సి.నా.రె. వంటి పెద్దలు, కలెక్టర్లు, మరెందరో దాతలు నన్ను అభినందించారు. డా. సి.నారాయణరెడ్డిగారు నాకు "బ్రౌన్ శాస్త్రి" అన్న ప్రశక్తి ప్రకటించారు.

2006 నవంబర్ 10వ తేదీన కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డిగారి అధ్యక్షతతో సలహాసంఘం ఏర్పడింది. ఒకనాటి బ్రౌన్ గ్రంథాలయం సి.పి.బ్రౌన్ భాషా కేంద్రంగా రూపొందింది.

పత్రికా రంగంలో

బళ్లారిలో విద్యార్థిగా ఉన్నప్పుడే పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవాడిని, కన్నడ కవులను గురించిన వ్యాసాలు "కృష్ణపత్రిక" ప్రచురించేది. అట్లే తెలుగు కవులను గురించి బెంగుళూరు నుండి వెలువడుతున్న 'సుబోధ' మాసపత్రిక ప్రచురించేది. క్రమంగా ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, దిన, వార పత్రికలలో నా వ్యాసాలు ధారావాహికంగా ప్రచురింపబడ్డాయి. నాటినుండి నేటి వరకు ప్రముఖ తెలుగు పత్రికలన్నింటిలో నా రచనలు ప్రచురిస్తున్న సంపాదకులకు నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. కడపలోని ఆకాశవాణి కేంద్రం ద్వారా దాదాపు 150 ప్రసంగాలు ప్రసారమైనాయి. దాదాపు 12 ఏళ్లు కడప ఆకాశవాణి కేంద్రం సలహా సభ్యుడుగా పనిచేశాను. ఇప్పటికి దాదాపు 2500 వ్యాసాలు పత్రికల్లో వెలువడినాయి.

సాహిత్యరంగం

బాల్యం నుండి పుస్తక పఠనం పట్ల ఎంతో ఆసక్తి ఉండేది. తెలుగు, కన్నడ, ఇంగ్లీషు, హిందీ భాషల్లోని గ్రంథాలను తరచుగా చదివేవాడిని. పలు ప్రాంతాల్లో- రాష్ట్రంలోనే కాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో పలు చోట్ల సాహిత్య, సాంస్కృతిక విషయాలపై ఉపన్యాసాలిచ్చాను. "కన్నడ సాహిత్య పరిషత్తు" వజ్రమహోత్సవ సందర్భంగా పరిషత్ కార్యదర్శి. జి. నారాయణగారి ఆహ్వానంపై ఆ సమావేశాల్లో పాల్గొన్నాను. కన్నడ సాహిత్య దిగ్గజాలైన మాస్తి వెంకటేశ అయ్యంగార్, శివరామ కారంత్, బేంద్రే మున్నగు మహనీయుల పరిచయం లభించింది.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి కార్య నిర్వాహక సమావేశం కడపలో జరిగింది. ఆ సందర్భంలో ఎందరో సాహితీవేత్తలతో పరిచయం లభించింది.

సాంస్కృతిక సేవా రంగం

కడపలోని సాయిబాబా అనాథ శరణాలయం సభ్యుడుగా జె.సి.సుబ్బయ్యగారి సారథ్యంలో సాయిబాబా అనాథ శరణాలయ నిర్మాణానికి నా వంతు సహాయం అందజేశాను. మిత్రసమూహ ఒక సాంస్కృతిక సేవా సంస్థ. కడపలోని హోటల్ యజమాని

అధ్యక్షుడు. నన్ను గౌరవాధ్యక్షుడుగా ఎన్నుకొన్నారు. మిత్రసమూహ ప్రధాన కార్యదర్శి కుంభాశి జనార్దన పౌరాణిక సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

గాడిచర్ల ఫౌండేషన్

ఇదివరలో గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు నాకు అందజేసిన ప్రోత్సాహానికి కృతజ్ఞతాపూర్వకంగా 1997 సెప్టెంబర్ 14వ తేదీన కడపలో 10 వేల రూపాయల విరాళంతో గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఫౌండేషన్ ఏర్పాటు చేశాను. గత 13 ఏళ్లుగా చంద్రశేఖర్ కల్కూర అధ్యక్షులుగా గాడిచర్ల అవార్డును వివిధ సేవా రంగాలలో కృషి చేసిన పెద్దలకు ఏటా రావుగారి జయంతి సందర్భంగా అందజేస్తున్నాము.

రచనల వివరాలు

కడపనుంచి వెలువడుతున్న 'మాసీమ' పత్రికలో రాయలసీమ కవులు గురించిన వ్యాసాలను **"మాసీమ కవులు"** అన్న పేరుతో మాసీమ రాజగోపాలరెడ్డిగారు ప్రచురించారు. అది నా మొదటి పుస్తకం. క్రమంగా మరికొన్ని గ్రంథాలు వెలువడ్డాయి. అవి:

2. బళ్లారి రాఘవ జీవిత చరిత్ర
3. కస్తూరి కన్నడ సాహిత్య సౌరభం – రెండు ముద్రణలు పొందింది.
4. గణపతి – కన్నడం నుంచి తెలుగులోకి, ఇంగ్లీషులో అనువదించిన రచన,
5. మహనీయుల జీవితాల్లో రసవద్ఘట్టాలు
6. మన దేవతలు – శ్రీ శైల దేవస్థానం ప్రచురణ
7. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరాయ– తెలుగులోను, ఇంగ్లీషులోను ప్రచురింపబడింది.
8. సుప్రసిద్ధుల జీవిత విశేషాలు
9. సి.పి. బ్రౌన్ చరిత్ర – తెలుగు అకాడమి ప్రచురణ
10. వ్యాసభారతి
11. ఎందరో మహానుభావులు
12. నీరాజనం

13. సంగీత మేరుశిఖరాలు

14. ప్రగతి పథంలో భారత మహిళ

అనువాదాలు

"Man Thou Can" **"మనిషీ నీకసాధ్యమేది"** శ్రీ బదరీనారాయణ సిన్హాగారి కుమారుడు కలెక్టర్ అరద్‌సిన్హాగారి కోరిక మేరకు కట్టా నరసింహులు సహకారంతో తెలుగులో గేయాత్మకంగా వెలువడింది.

పై రచనలే కాక ఇప్పటికి మొత్తం 30 పుస్తకాలు రచించాను.

సాహితీ ప్రస్థానంలో ముఖ్య ఘట్టాలు

నాకు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, కన్నడ భాషల్లో పరిచయం ఉన్నందున ఆయా భాషలలో విశిష్ట రచనలను చదివే అవకాశం నాకు కల్గింది.

నేనేరిగిన పెద్దలు

నా సాహిత్య జీవితంలో ఎందరో పెద్దలను కలుసుకొనే భాగ్యం నాకు లభించింది. సాహిత్య సంగీత విద్యానిధి రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు బళ్లారిలో ఆయన కుమార్తె అల్లుడుగార్లను చూడడానికి వచ్చినప్పుడు మా పెద్దనాన్న రామచంద్రస్వామి గారి ఇంట్లో వారిని కలుసుకొన్నాను. తరువాత తిరుపతిలోను, బెంగుళూరులోను వారిని కలుసుకొని పరిచయం పెంచుకొన్నాను. కడపలో శివభారతకర్త డా॥ గడియారం వెంకటశేషశాస్త్రి గారిని పలుమార్లు కలుసుకొన్నాను. సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు కడపకు రాకముందే నాకు పరిచితులు. కడపలో కొన్నేళ్లపాటు వారితో ముచ్చటించే అవకాశం అభించింది. వారి షష్టిపూర్తి సన్మాన కార్యక్రమానికి నేనే కార్యదర్శిగా వుండి **"సాహితీవిస్మేరం"** అన్న అభినందన సంచికను సమర్పించాం. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారికి కడపలో జరిగిన ఘన సన్మానికి నేను కూడా సహకరించాను. కడప కళాశాలలో సంస్కృత అధ్యాపకులైన పేరాల భరత శర్మ, కథా రచయితగా సుప్రసిద్ధులు మధురాంతకం రాజారాం, శ్రీ భుజంగరాయశర్మ గార్లతో నాకు సాన్నిహిత్యం లభించింది. శంకరంబాడి సుందరాచారి నా అతిథిగా కడపలో మూడు రోజులు గడిపారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యవర్గ సమావేశాలు కడపలో జరిగాయి. ఆ సందర్భంగా

సాహిత్య దిగ్గజాలైన దివాకర్ల వేంకటావధాని, డా. ఆరుద్ర, శ్రీ.శ్రీ. కాళోజి నారాయణరావు, సంజీవదేవ్ మున్నగు వారితో సభలు నిర్వచించి వారి ఆదారాభిమానాలు చూరగొన్నాను. రాజకీయరంగంలోను, సాహిత్య రంగంలో కూడా లబ్ధప్రతిష్ఠులైన డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు జిల్లా రచయితల ప్రథమ మహాసభలను ప్రారంభించారు. తర్వాత బ్రౌన్ గ్రంథాలయాన్ని దర్శించి నా కృషిని ప్రోత్సహించారు.

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ సి.నారాయణరెడ్డిగారు, గొల్లపూడి మారుతిరావుగారు, గ్రంథాలయశాస్త్రవేత్త వెలగా వెంకటప్పయ్య, ప్రముఖ పత్రికా సంపాదకులు నార్ల వేంకటేశ్వరరావు, పొత్తూరి వేంకటశ్వరరావు, శివలెంక రాధాకృష్ణ, కె. రామచంద్రమూర్తి, ఎం.వి.ఆర్. శాస్త్రిగార్లు బ్రౌన్ గ్రంథాలయాన్ని దర్శించి మా కృషిని ప్రోత్సహించారు.

విశ్వవిఖ్యాత నటులు బళ్లారి రాఘవగారిని బళ్లారిలో పలుమార్లు కలుసుకొన్నాను. వారి జీవితచరిత్రను తెలుగు విశ్వవిద్యాలయం ఆ తరువాత విశాలాంధ్ర ప్రచురణ సంస్థ వారు ప్రచురించారు. రాఘవ చివరిదశలో బళ్లారిలో ప్రదర్శించిన పాదుకాపట్టాభిషేక నాటకంలో చిన్న పాత్ర దర్శించే అవకాశం కూడా నాకు లభించింది. ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీపాద పినకపాణి, గేయధార ప్రక్రియకు ఆద్యులైన డా. సాయికృష్ణయాచేంద్ర మున్నగువారిని పలుమార్లు కలుసుకొన్నాను. కడపజిల్లా రచయితల సంఘ కార్యదర్శిగా సి.పి.బ్రౌన్ గ్రంథాలయ వ్యవస్థాపక కార్యదర్శిగా ఎందరో సాహితివేత్తలతో కళామూర్తులతో పరిచయ భాగ్యం లభించింది.

ఆధ్యాత్మికరంగంలో విశిష్టులైన పేజావర పీఠాధిపతి శ్రీ విశ్వేశతీర్థ ఆ తరువాత మరికొందరు పీఠాధిపతుల ఆశీస్సుల లందుకొన్నాను.

పురస్కారాలు

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ అందుకొన్నాను.

సాహిత్య సాంస్కృతిక రంగాలలో నా కృషిని గుర్తించిన పెద్దలనుంచి సత్కారాలు అందుకొన్నాను. వార్త దినపత్రిక ప్రారంభోత్సవ సందర్భంగా ప్రధాని పి.వి.నరసింహారావుగారు మధురాంతకం రాజారాంగారితో పాటు నాకు కూడా సత్కారం చేశారు. సి.పి.బ్రౌన్ ద్విశత జయంతి సందర్భంగా జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డిగారు హైదరాబాదులోని ఆంధ్ర సారస్వత పరిషత్తులో రెడ్డి ల్యాబ్ అధినేత

డా. కె. అంజిరెడ్డి ధర్మనిధి సాహిత్య పురస్కారం అందుకొన్నవారిలో నేను మొదటి వాడిని. ఆచార్య బిరుదురాజు రామరాజుగారు తాము రచించిన 'ఆంధ్రయోగులు' గ్రంథావిష్కరణ సందర్భంగా సత్కరించారు. ఎందరో పెద్దల నుంచి పురస్కారలందుకొనే భాగ్యం నాకు లభించింది.

ఢిల్లీ తెలుగవాణి సంస్థవారు డా.పి.యల్. సంజీవరెడ్డిగారి అధ్యక్షతన సత్కరించారు. రాఘవ శత జయంతి సందర్భంగా బెంగుళూరులో కర్ణాటక రాష్ట్ర ఆర్థిక మంత్రి యాహ్యాఅలీగారు, "అభిరుచి" సంస్థపరంగా ప్రముఖనటి శ్రీమతి జయమ్మగారు సన్మానం చేశారు. బందరులో శ్రీవాణి మాసపత్రిక ద్విశత సంచిక విడుదల సందర్భంగా ఆ ప్రాంత ప్రముఖులచే సత్కార మందుకొన్నాను. ఎన్నో సాహిత్య సంఘాలకు సలహాదారుగా సహకరించాను. తిరుపతిలో జరిగిన తెలుగు భాషా బ్రహ్మోత్సవాల సందర్భంగా పురస్కారాన్ని అందుకొన్నాను. నెల్లూరులోని కవిత్రయ జయంతిలో రెండు మార్లు ప్రసంగాలు చేసి డా. బెజవాడ గోపాలరెడ్డి గారిచే సత్కారం అందుకొన్నాను.

నిరంతర ఉద్యమ కృషిని గుర్తించి కడపలో మిత్రసమూహ అధ్యక్షులు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డి అధ్యక్షతన అభినందన సంచికను అందజేయటం నా జీవితంలో మరువరాని సంఘటన. ఆ సంచిక ప్రధాన సంపాదకులు కట్టా నరసింహులు. కుంభాసి జనార్దన పురాణిక, డా. వెలగా వెంకటప్పయ్య కడప జిల్లా సంస్కృతి అన్న అభినందన సంచికను సమర్పించారు.

సాహిత్య సాంస్కృతిక రంగాలలో యువతరంవారిని ప్రోత్సహిస్తూ వారి అభిమానాన్ని సంపాదించాను. యువతరం రచయితలు ఉత్తమ గ్రంథాలను చదువుతూ అధ్యయన శీలాన్ని పెంచుకొనవలసినదిగా పలుమార్లు ఉద్బోధించాను.

సాహిత్య, సాంస్కృతిక సేవారంగాలలో నా అల్పమైన కృషికి పురస్కారా లందజేసిన పెద్దలకు, సాహిత్య సాంస్కృతిక రంగాల అధినేతలకు నేనెంతగానో ఋణపడినాను.

బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణం, నాకు వినయాన్ని, సేవాభావాన్ని, సహనాన్ని నేర్పింది.

"పరిణతవాణి" ప్రసంగం చేసే అవకాశం కల్పించిన జ్ఞానపీఠ పురస్కారగ్రహీత, పద్మభూషణ డా॥ సి. నారాయణరెడ్డిగారికి ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డికి నా కృతజ్ఞతాంజలులు సమర్పిస్తూ సెలవు.



జి.యస్. వరదాచారి

ఆంధ్ర సారస్వత పరిషత్ నిర్వహిస్తున్న ఈ పరిణతవాణి ప్రసంగ పరంపరలో పాల్గొనే అవకాశం దక్కడమే గొప్ప గౌరవం. ఈ గౌరవాన్ని నాకు దక్కించిన పరిషత్ అధ్యక్షులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీతులు, పద్మభూషణులు డాక్టర్. సి. నారాయణరెడ్డి గారికి, ఇతర కార్య నిర్వాహకులకు ముందుగా నా కృతజ్ఞతలు.

నాకథను కరీంనగర్ జిల్లా వేములవాడ నుంచి మొదలు పెట్టాలి. మాతాత గోవర్ధన ధర్మాచార్యుల నివాస స్థలం అది. ఆయనకు ముగ్గురు కొడుకులు. రెండవ వారు మా నాయన గోవర్ధన కృష్ణమాచార్యులు. పినతండ్రి గోవర్ధన వెంకటాచార్యులు దత్తత తీసుకున్నందున్న మానాయన నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో స్థిరపడ్డారు. దగ్గరలో ఉన్న - ఇప్పుడు జక్రాన్‌పల్లి అని పిలువబడుతున్న పూర్వపు జగడంపల్లి వాస్తవ్యులు చక్రవర్తి రంగాచార్యుల పెద్దకూతురు జానకమ్మతో ఆయన వివాహం జరిగింది. వారికి మేము ఆరుగురం సంతానం. నలుగురు అన్మదమ్ములం. ఇద్దరు అక్కా చెల్లెళ్లు. నేను వరుసలో మూడవవాణ్ణి. మగ పిల్లలో రెండవవాణ్ణి. వారసత్వంలో వచ్చిన ఇల్లు ఉండగా మానాయన తన సంపాదనతో కొత్తగా కట్టించుకున్న మిద్దె ఇంటిలో పుట్టిన మొదటివాణ్ణి నేనే. ఆంగీరసనామ సంవత్సర ఆశ్వయుజ బహుళ దశమి అంటే 1932 అక్టోబర్ 15వ తేదీ నా పుట్టినరోజు. నేను కడుపులో ఉండగా మా అమ్మ, నాయన బంధువులతో కలసి దక్షిణ దేశయాత్రలకు వెళ్లారట. కంచిలో వరద స్వామిని దర్శించుకున్నప్పుడు తమకు మగపిల్లవాడు పుడితే సుందర వరద అని పేరు పెట్టుకుందా మనుకున్నారట. అలా నా పేరు గోవర్ధన సుందర వరదాచారి అయింది. నేను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఉండగా మా అమ్మ కలరాసోకి చనిపోయింది. మా నాయన మరో పెళ్లి చేసుకున్నారు.

ఆమెకు ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు, మా నాయన 84 ఏళ్లు బతికారు. పిల్లలందరూ జీవితంలో స్థిరపడేటట్టు చదివించారు. అందరూ సుఖ ప్రదమైన జీవితమే గడుపుతున్నారు.

ఆర్మూరు నేను పుట్టే నాటికి ఐదారు వేల జనాభా ఉన్న పెద్ద ఊరు; తాలుకా కేంద్రం. తహసీలాఫీసు, మున్సిఫ్‌కోర్టు, పోలీస్‌స్టేషన్, పోస్టాఫీసు, అలోపతీ యునానీ వైద్యశాలలు, బాలుర మాధ్యమిక పాఠశాల, బాలికల ప్రాథమిక పాఠశాల ఉండేవి. ఊరవతల నిజాంసాగర్ ఏటి కాలువ ఒడ్డున ఎత్తయిన ప్రదేశంలో చక్కని ఉద్యానవనం మధ్య ఒక డాక్ బంగ్లా ఉంది. కాని ఊళ్లోగాని, బడిలోకాని గ్రంథాలయం లేదు. ఊరు కోసుపొడవు నల్ల రాళ్లగుట్టకు సమాంతరంగా ఉంటుంది. 80 ఏళ్ల కిందటే వేరే ప్రాంతాలకు వెళ్లే మోటారు వాహనాలు ఊళ్లోకి రావలసిన అవసరం లేకుండా గుట్టవెనుక వైపునుంచి వెళ్లిపోవడానికి– ఇప్పుడు బైపాస్ రోడ్డు అని పిలువ బడుతున్నట్టు కంకర రోడ్డు ఉండేది. గుట్టను సిద్దులగుట్ట అంటారు. పైన పెద్ద గుహలో వనాథ సిద్ధేశ్వరాలయం ఉంది. గుట్ట పడమటి చివర పైభాగంలో రెండు రాతి స్తంభాలు ఉన్నాయి. ఒక స్తంభ శిఖర భాగంలో చిన్న మంటపం చూడముచ్చటగా ఉంటుంది. వాటి చరిత్ర తెలియదు. ఇప్పుడు గుట్ట మీద దేవాలయం వరకు కార్లు వెళ్లేటట్టు రోడ్డు వేశారు.

విద్యాభ్యాసం

ఆ రోజులలో పిల్లలను ఆరవ ఏట పాఠశాలలో చేర్చుకునేవారు. అయితే ఇంట్లోనే చదువు అంతకు ముందే మొదలైంది. అక్షరాభ్యాసం తెలుగులో జరిగినా, దేవనాగరలిపి కూడా అప్పుడే నేర్పించారు. సంస్కృత గ్రంథాలు చదవడానికి నాగరలిపి అవసరమనే భావన ఉండేది. మా నాయన గారికి పౌరోహిత్యం, పురాణ ప్రవచనాలే ప్రధాన ఆదాయ మార్గం. జ్యోతిష్యంలో మంచిపేరు ఉండేది. జటిల విషయాలపై ఆయనను సంప్రదించేవారు. ఇంటి చదువులు శబ్ద మంజురితో మొదలయ్యేవి. శబ్దాలు, ధాతువులు నేర్చుకుని, సమాసాల గురించి కొంత తెలుసుకున్నాక బాలరామాయణం చదివించే వారు. ఆ తర్వాత అమరకోశం బట్టీ పట్టడం. ఇంట్లో సంస్కృతాంధ్ర భాషల రామాయణ, భారత, భాగవత గ్రంథాలు, జ్యోతిష సంబంధమైన ధర్మ సింధు, నిర్ణయ సింధు, కాలామృతం, శ్రీ వైష్ణవ సంప్రదాయ గ్రంథాలైన నిత్యాను సంధానం, తిరుప్పావు, నాలాయిర ప్రబంధాలు మొదలైనవి ఉండేవి. కాశీ కృష్ణాచార్యుల సంస్కృత బాల బోధినీ అవశ్య

పాఠ్యగ్రంథం. పురుష లక్ష్మీసూక్తాలు, ఆశీర్వచనప్పనుసలు, తిరుప్పావు పాశురాలు, జ్యోతిష శ్లోకాలు కంఠస్థం చేశాను. మా నాన్నగారితో పురాణ ప్రవచనాలకు వెళ్లి విన్నాను. కొంత భాషా జ్ఞానం, పురాణ కథల పరిచయం కలుగడానికి ఇవే ఆధారం. ఆరేళ్లు వచ్చాక ప్రభుత్వ పాఠశాలలో చేరాను. సర్కారీ బడిలో నాలుగవ తరగతి వరకు తెలుగు మాధ్యమం. ఐదు నుంచి పై చదువులన్నీ, అంటే స్నాతకోత్తర దశవరకే కాక ఇంజినీరింగ్, మెడిసిన్, వెటరినరీ, వ్యవసాయ కోర్సులన్నీ కూడా ఉర్దూ మాధ్యమంలోనే సాగేవి.

మా ఇంటి పక్కనే ఆంజనేయస్వామి గుడి ఒకటి ఉంది. మా అన్నయ్య ఆంజనేయ స్వామి భక్తుడు. మారుతీ భజన మండలి అని స్థాపించి రోజూ మందిరంలో రాత్రి భజన చేసేవారు. గంటకు పైగా సాగే భజనలో తెలుగు, హిందీ భజనలు ఢోలక, తాళాలు వాయిస్తూ పాడేవారు. భజన తర్వాత ఆరతి, ప్రసాద వితరణ ఉండేది. బ్రహ్మచారిని గనుక ఆరతి నేనే ఇచ్చేవాడిని. భజన మండలి దైవ భక్తిని, కార్యనిష్ఠను, జాతీయ భావాలను పాదుకొల్పడానికి తోడ్పడిందనాలి.

వివాహం

నేను ఆరవతరగతి ఉత్తీర్ణుడనైన సంవత్సరం వేసవి సెలవుల్లో ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి అర్చకులు నంబి సీతారామయ్య చిన్న కూతురు సరోజినితో నా వివాహం జరిగింది. అప్పుడు నాకు 13 ఏళ్ళు. సరోజినికి ఎనిమిదేళ్లు. ఆ వయసులో పెళ్లిళ్లు ఆరోజులలో సర్వ సాధారణం. అమ్మాయి అత్తవారింటికి వచ్చి కొన్నాళ్లుండటం, దీపావళివంటి పండుగలకు అబ్బాయి అత్తవారింటికి పోవడం అవన్నీ సరదా వేడుకలు. పిల్లలు పెద్దవాళ్లయాక అంటే ఏడెనిమిదేళ్ల తర్వాత శోభనాలు, కాపురాలు పెట్టడం జరిగేది. మా విషయంలోనూ అంతే. మాకు నలుగురు పిల్లలు కలిగారు. ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు.

సరే మళ్లీ వెనక్కి వెళితే, పెళ్లయ్యాక నేను ఏడవ తరగతి ఉత్తీర్ణుడ నయ్యాను. ఆ రోజుల్లో ఏడవ తరగతిలో తొంభై శాతం మంది చదువు ఆపేసేవారు. మొదటి కారణం. జిల్లాకు ఒకటే హైస్కూలు ఉండటం; జిల్లా కేంద్రంలో ఉండి చదువుకోవడం కష్టసాధ్యమవడం రెండవది– అప్పటికే చాలా మందికి 18ఏళ్ల వయసు దాటి పోయి ఉండటం. అదీగాక ఏడవతరగతి ఉత్తీర్ణులైనవారికి బడిపంతులు ఉద్యోగమో, తహసీలాఫీసు గుమాస్తా ఉద్యోగమో దొరకుతుండటం. ఎక్కువ మంది ఉపాధ్యాయులుగా చేరేవారు.

ఆ ఉద్యోగాల్లో వారికే ఇప్పటి దూరవిద్య పద్ధతిలో నేరుగా ఇంటర్, డిగ్రీ, పి.జి. పరీక్షలు రాసే అవకాశం ఉండేది. అందుచేత ఆర్థిక స్తోమతేకాక, ఇతర వసతులు కూడా ఉన్నవారే పై చదువులకు వెళ్లేవారు. నాకు పై చదువు విషయంలో ఇబ్బందేమీ కలుగలేదు. అదిలాబాద్ జిల్లా హైస్కూలు నిర్మల్‌లో ఉండేది. మా నాయన అక్క కొడుకు సముద్రాల పురుషోత్తమా చార్యులు అక్కడ వేణుగోపాలస్వామి గుడిలో అర్చకుడుగా ఉండేవారు. ఆయన ఇంట్లో ఉండి ఎనిమిదవ తరగతి చదివాను. రోజు రాత్రి ఆరతి తర్వాత పురుషోత్తమాచారి దంపతులు రామదాసు కీర్తనలు పాడేవారు. అప్పుడే భక్తి తత్వాన్ని గురించి, నిందాస్తుతి గురించి తెలిసింది. పురుషోత్తమాచారి భార్య కాన్పు కష్టమై మరణించడంతో తొమ్మిదవ తరగతిలో నిజామాబాద్‌కు మారవలసి వచ్చింది. ఎనిమిది, తొమ్మిది తరగతిలోనూ, సెక్షన్‌లోను ఫస్టు నాలుగు సెక్షన్‌లు కలిపిన తరగతి మొత్తానికి ఫస్టు. స్కూలు ఫస్టు కూడా నేనే! కాని పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో ఫస్ట్‌క్లాస్ రాలేదు. ఇంకొక విషయం చెప్పాలి. మేము ఎనిమిదవ తరగతిలో ఉండగా హైదరాబాద్ రాష్ట్రంపై పోలీసు చర్య జరిగింది. నిజాం లొంగి పోయాక సైనిక ప్రభుత్వం ఏర్పడింది. తర్వాత ఏర్పడిన పౌర ప్రభుత్వ పాఠశాలలో బోధనా భాషను మాతృభాషలోకి మార్చేసింది. అలా మేము తొమ్మిదవ తరగతిలో ఉండగా ఎనిమిది వరకు బోధనా భాష తెలుగు అయింది. మరుసటి సంవత్సరం తొమ్మిది, ఆపై సంవత్సరం పదవతరగతి కూడా తెలుగుకు మారాయి. అంటే పదవతరగతి వరకు ఉర్దూ మాధ్యమంలో చదివిన చివరి బ్యాచ్ మాదే అయింది.

నిజామాబాద్‌కు వచ్చిన తర్వాత తొలిసారి గ్రంథాలయాన్ని చూశాను. సార్వజనిక వాచనాలయం అనే పేరుతో ఉండేది. దానిలో పత్రికలు చదువు కోవడమే తప్ప, పుస్తకాలు విద్యార్థులకు ఇంటికి ఇచ్చేవారు కాదు. పత్రికలు చదివే అలవాటు నాకు మా ఊళ్లో ఉండగానే అబ్బింది. మా వాడలో రాజయ్య అని మేర ఆయన ఒకరు ఉండేవారు. ఆయన కేదో కొత్త పని చేయాలన్న తపన. ఒక రోజు స్కూలు నుంచి ఇంటికి వస్తుండగా షాపులోకి రమ్మని పిలిచాడు. అక్కడ ఉన్న కొత్తాయనను కృష్ణా పత్రిక ఏజెంటు అని పరిచయం చేసి పత్రికకు చందా కట్టినట్టు చెప్పాడు. నీకు చదువు రాదు కదా చందాకట్టి ఏం చేస్తావన్నాను. చదువొచ్చిన వాడివి నీవు ఉన్నావు కదా అని సమాధానమిచ్చాడు. అంటే నేను చదివి వినిపించాలా అనడిగితే "ఏమద్దు చదివి సారం చెప్పు" అన్నాడు అలా కొత్త పత్రిక రాగానే ఇచ్చేవాడు. దానితో పత్రిక చదవడం, విషయం అర్థం చేసుకోవడం,

విశేషాలు క్లుప్తంగా చెప్పడం అలవాటైంది. రాజయ్య తెలిసి చేసింది కాకపోవచ్చు కాని అది నా జ్ఞాన పరిధిని పెంచింది.

తొలిరచన

మా ఇంట్లో కాలేజి (ఇంటర్) చదువుకు హైదరాబాద్ వచ్చిన మొదటి వాణ్ణి నేనే. మా నాయన స్వయంగా తీసుకువచ్చి గౌలీగూడలో మరింగంటి నర్సమ్మ ఇంట్లో భోజన వసతి ఏర్పాట్లు చేసి వెళ్లారు. నాకు నిజాం కాలేజిలో సీటు వచ్చినా గౌలీగూడనుంచి సిటి కాలేజి దగ్గర ఉంటుందనీ, పైగా నిజాం కాలేజిలో పల్లెటూరి కుర్రాళ్లు నెగ్గుకురావడం కష్టమని భయం చెప్పి మా బంధువు ఒకాయన తాను చదివే కాలేజిలో నన్ను చేర్పించాడు. మేము సిటీ కాలేజీలో ఉండగా అక్కడి నుంచే ముల్కీ ఉద్యమం మొదలైంది. గోర్వాలా కమిటీ గోబ్యాక్ అంటూ విద్యార్థులు పెద్ద ఊరేగింపు తీశారు. అఫ్జల్‌గంజ్ వద్ద పోలీసు కాల్పులు జరగగా ముగ్గురు విద్యార్థులు మరణించారు. ఈ ఆందోళన విషయం అలా ఉంచితే, సిటీ కాలేజిలో నాకు గొప్ప మేలు జరిగింది. అక్కడి గ్రంథాలయంలో చాలా తెలుగు పుస్తకాలు ఉండేవి. దొరికిన ప్రతీ పుస్తకం, ముఖ్యంగా వచన సాహిత్యం, విడవకుండా చదివాను. సిటీ కాలేజీలో వెంకటాచారి అని ఇంగ్లీషు లెక్చరర్ ఉండేవారు. ఆయన తెలుగు సాహితీ సమితి హితవరి. గ్రంథపఠనం పట్ల ఆసక్తిని గమనించి ఒక రోజు కాలేజి మ్యాగజిన్‌కు ఏదైనా రచన ఇవ్వమని పురమాయించారు. ప్రయత్నిద్దాం అనుకొని ఆరోజే రాత్రి కాగితం, కలం పట్టుకు కూర్చున్నాను. ఏదో పిచ్చి ప్రేమకథ. ఇందిర అనే అమ్మాయికి తోటి విద్యార్థి మీద ప్రేమ పుడుతుంది. కష్టాలలో ఆదుకుంటుంది. ఇంట్లో ఆశ్రయమిస్తుంది. ఆయనకు అప్పటికే పెళ్లయిపోయిందని బెంగతో మరణిస్తుంది. ప్రియుడు తానూ చచ్చిపోతే బాగుంటుం దనుకుంటాడు. "అని మరణించినూ లేను. జీవిస్తున్నాను జీవచ్ఛవంలా– ఇందిర నా హృదయంలో మాసిన పటంలా మిగిలిపోయింది. అప్పుడప్పుడు ఆ పటాన్ని రెండు కన్నీటి బిందువులతో తుడవటానికి ప్రయత్నిస్తున్నాను" అన్నది ముగింపు. మర్నాడు చదువుకుంటే బాగానే ఉందనిపించింది. పేరు పెట్టలేదు. వెంకటాచారిగారికి ఇచ్చాను. ఆయన బాగుందోయ్. 'ప్రేమపుష్పం' అని పేరు పెట్టానన్నారు. అలా 1951లో కాలేజి మ్యాగజిన్‌లో ప్రచురితమైంది నా మొదటి రచన.

ఇంటర్ చదువుతున్నప్పుడే సెలవుల్లో మిత్రులమందరం కలుసుకున్నప్పుడు ఊళ్లో కొన్ని అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నట్టు గమనించాం. చెడుపై పోరాడటం

మంచిని పెంచడం యువశక్తిగా మన బాధ్యత అని నిర్ణయించాం. గ్రామ సుధార్ సమితి ఏర్పాటు చేశాం. సుధార్ అంటే సరిదిద్దడం అని అర్థం. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారికి వ్యతిరేకంగా కరపత్రాలు రాసి రాత్రి ముఖ్య కూడళ్లలో అతికించేవాళ్లం. ప్రచారం ద్వారా చెడును అరికట్ట వచ్చునన్న ఆలోచన. ఇది కాక, క్రీడలను ప్రోత్సహించడం వంటి పనులు చేశాము. బ్యాడ్మింటన్ క్లబ్ ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించేవాళ్లం. చెరువులో గంటల తరబడి ఈదుతూనే ఉండటం అభ్యాసం చేశాం. వీటివల్ల ప్రశ్నించేతత్వం, పోటీల్లో పాల్గొనాలనే, గెలవాలనే, తోటి వారిలో పైచేయి సాధించాలనే పట్టుదల పెరుగుతాయని ఆశ.

హైదరాబాద్‌లో ఆరోజుల్లో కోటి, సుల్తాన్ బజార్ ప్రాంతాలు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ కార్యకలాపాలకు కేంద్ర స్థానాలుగా ఉండేవి. ఎక్కువ సభలు అక్కడే జరిగేవి. కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలంయలోనే సాహిత్య సభలన్నీ జరిగేవి. తెలుగు కవులు, సాహితీ వేత్తలు, ఇతర ప్రముఖులందరినీ చూసే అవకాశం వీలైతే కలిసిమాట్లాడే అవకాశం అక్కడే దక్కింది చిన్న బహిరంగసభలు సుల్తాన్ బజారులోని క్లాక్ టవర్ వద్ద, లేదా హష్మత్ గంజ్‌లో జరిగేవి. కొంచెం పెద్ద సభలైతే ఇప్పుడు ఇఎన్‌టి ఆస్పత్రిగా మారిన ప్రతాపగిరిజీ కోటి ఆవరణంలో జరిగేవి. ప్రధాని నెహ్రూ వంటి జాతీయ నాయకులు వచ్చినప్పుడు జన సంఖ్య అధికంగా ఉంటుంది. గనుక ఫతేమైదానంలో జరిగేవి. అదే ఇప్పుడు లాల్ బహదూర్ స్టేడియంగా మారింది. ఏ సభలోనైనా మా మిత్ర బృందం పాల్గొనవలసిందే. లోక జ్ఞానాన్ని పెంచుకోడానికి ఈ సభలు బాగా ఉపయోగపడేవి. భాషా నిలయంలో జరిగే తెలుగు సభలు విజ్ఞాన దాయకంగా ఉండేవి. తెలుగు ప్రముఖులందరినీ మొదటిసారి అక్కడే చూశాను. గ్రంథాలయంలో సభ్యుడుగా చేరి చాలా పుస్తకాలు చదివాను. స్కూల్లో, కాలేజిలో రెండవభాషగా తప్ప తెలుగు చదువని నాకు డిగ్రీలో తెలుగులో డిస్టింక్షన్ రావడానికి కారణం గ్రంథ పఠనమే.

ఆ రోజుల్లో అంతర్ కళాశాల విద్యార్థి సాంస్కృతికోత్సవాలు యేటా నిజాం కళాశాల ఆవరణంలో జరుగుతుండేవి. "ఆంధ్రాభ్యుదయోత్సవాలు–నిజాం కళాశాల నిలయం" అంటూ ఆ ఉత్సవాలలోనే సి.నారాయణరెడ్డి ప్రత్యక్ష వ్యాఖ్యానానికి వరవడి దిద్దారు. సిటీ కాలేజి తరఫున మేమూ "నిరుద్యోగి" అనే నాటకం వేశాము. దానిలోని నిరుద్యోగిని నేనే. తర్వాత ఎ.ఆర్. కృష్ణ ప్రభావం వల్ల కొంత కాలం నాటక బృందంతో తిరిగాను. వేషాలు వేయలేదు కాని వారి "మన ఊరు" ప్రణాళికా ప్రచార నాటకానికి ప్రార్థనాగీతం

పాడుతుండేవాడిని. అయితే మా ఊళ్ళో మిత్ర బృందంతో కలిసి కొన్నేళ్లు ప్రతిసంవత్సరం రెండు నాటకాలు వేస్తుండేవాళ్లం. అలా సర్వవ్యాపకత్వం వల్ల ఇంటర్ పరీక్ష తప్పలేదు గాని బి.ఇ.లో సీటు రావడానకి సరిపడా మార్కులు రాలేదు. దాంతో డిగ్రీలో బి.ఏ.గణితంలో చేరాను. మ్యాత్స్, అప్లయిడ్ మ్యాత్స్, స్టాటిస్టిక్స్ ఆప్షనల్.

మెస్సు నిర్వహణ

బి.ఏ.లో చేరే ముందు వేసవిలో ఒక అనుభవం గురించి చెప్పాలి. మా దగ్గరి చుట్టం ఒకాయన ప్రత్యేకంగా నన్ను కలవడానికి వచ్చాడు. ఆయన తమ్ముడు పదవ తరగతి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. 'ఇంజనీరు కావాలని కోరిక. ఇంటరైనా, తర్వాత బి.ఇ. అయినా హైదరాబాద్‌లో చదువాల్సిందే. ఎవ్వరూ తెలియదు. ఒక్కడు ఉండలేడు. ఏం చేయాలి? నీవే ఏదో దారి చూపా'లన్నాడు. అప్పటికి హైదరాబాద్‌లో రెడ్డి హాస్టలు పద్మశాలి హాస్టలు ఉన్నాయి. మనవాళ్లందరం కలిసి మెస్సు పెట్టుకుంటే ఇలాంటి వారి సమస్యలు తీరుతా యనిపించింది. దగ్గర బంధువులం, హైదరాబాద్‌లో చదువుతున్న వాళ్లం ఐదారుగురం ఉన్నాం. ఇతనొక్కడు సిద్ధంగా ఉన్నాడు. వసతి ఉండి, నిర్వాహకులు మనవారేనని తెలిస్తే మరికొందరు రావచ్చు. ఉన్నవాళ్లం మాట్లాడుకుని ధైర్యం చేసి రామ్‌కోటి ప్రాంతంలో ఆరు గదులున్న ఇల్లొకటి అద్దెకు తీసుకుని, వంట వైష్ణవుణ్ణి కుదుర్చుకొని ఎస్.వి. మెస్సు ప్రారంభించాం. పన్నెండు మంది కూడారు. పిహెచ్‌డి చేస్తున్న లక్ష్మణరావును అధ్యక్షుడుగా పెట్టుకుని, నేను కార్యదర్శిగా రెండేళ్లు నిరాటంకంగా నడిపాను. మామెస్సులో ఉండి ఇంటర్ చదివిన విద్యార్థులు తర్వాత బి. ఇ., బి.టెక్‌లలో సీట్లు సంపాదించి పెద్ద ఉద్యోగాలు చేశారు.

మేము సహకార పద్ధతిలో అవస్థలు పడుతున్న రెండేళ్ల కాలంలోనే వైశ్య హాస్టల్, గౌడ హాస్టల్, వెలమహాస్టల్ భారీ యెత్తున ఏర్పాటయ్యాయి. వైష్ణవ విద్యార్థులకు కూడా శాశ్వత వసతి ఏర్పాటు చేస్తే ఎక్కువ మంది ఉన్నత విద్యకు వచ్చే అవకాశం ఉంటుంది. డిగ్రీ అయిపోతున్నందున తర్వాత మేం ఎవరి దారి వారు చూసుకొని వెళ్లి పోతాము.

కనీసం ఒక భవనమైనా ఉంటే విద్యార్థులు తామే నిర్వహణ ఖర్చులు సమకూర్చుకొని మెస్ నడుపుకుంటారనే ఆలోచన కలిగింది. దాంతో మెస్ డే అని ఏర్పాటు చేసి ముఖ్య అతిథిగా అప్పటి హైదరాబాద్ శ్రీ వైష్ణవ మహాసభ అధ్యక్షుడు, ప్రఖ్యాత డాక్టర్ రంగాచార్యులను ఆహ్వానించి గోడు చెప్పుకున్నాము ఆయనా, ఇతర పెద్దలు సముఖంగానే

స్పందించారు. కాని పనిజరగలేదు. యాభైఏళ్లనాటి ఆ కల ఇప్పుడు శ్రీ వైష్ణవసేవా సమితి కృషి వల్ల ఎల్‌బినగర్ దగ్గరలోని చంద్రపురంలో మూడంతస్తుల భవన రూపంలో సాకారం అయింది.

ఆంధ్ర సారస్వత పరిషత్తులతో నా అనుబంధాన్ని గురించి చెప్పాలి. నా భార్యకు చదవడం, రాయడం వచ్చు కానీ, స్కూలుకు వెళ్లి చదుకోలేదు. సారస్వత పరిషత్తు నిర్వహించే పరీక్షలు రాస్తే మంచిదిక కదా అనే ఆలోచన వచ్చింది. ఆమె ప్రోత్సాహంతో మా బంధువులిద్దరి భార్యలు కూడా ప్రవేశ పరీక్ష రాశారు. ఉత్తీర్ణులయ్యారు. పరిషత్ వారి పరీక్షలు హైదరాబాద్ రాష్ట్రంలోని జిల్లాలలోనే గాక ఆంధ్ర ప్రాంత జిల్లాలలో కూడా చాలా చోట జరిగేవి. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైంది. కర్నూలు రాజధాని. తొలి తెలుగు రాష్ట్ర రాజధానిని చూడాలని కోరిక. కాని ప్రయాణ ఖర్చులు భరించే శక్తి లేదు. దేవులపల్లి రామానుజ రావు డిగ్రీ విద్యార్థులను కూడా పరీక్షలకి పర్యవేక్షకులుగా పంపుతున్నారని మిత్రుడొకరు చెబితే వెళ్లి కలిశాను. కర్నూలు వెళ్లాలన్న కోరిక కూడా చెప్పాను. ఆయన వెంటనే ఏర్పాట్లు చేశారు. అక్కడ మించన్ బజారు శర్మగారు శాఖ నిర్వహిస్తున్నారు. అన్ని ఏర్పాట్లు ఆయనే చేశారు. మనం ప్రశ్న పత్రాలు తీసుకెళ్లి, పరీక్షలు సవ్యంగా జరిగేట్టు చూసి సమాధాన పత్రాలను జాగ్రత్తగా తెచ్చి ఇవ్వాలి. బస, భోజనం శర్మగారి ఇంట్లోనే. పరీక్షలయ్యాక ఆయన పుర ప్రముఖులతో ఓ సభకూడా ఏర్పాటు చేసి సత్కరించి పంపారు. అలా స్వామి కార్యం, స్వకార్యం – అంటే ఆంధ్ర రాష్ట్ర రాజధానిని చూడడం నెరవేరింది.

భాషాభిమానం

ఎక్కడ ఏ సభ జరిగినా, ఏ పోటీ జరిగినా మా మిత్ర బృందం మనం లేకుండానా అంటూ ఏదో ఘనకార్యం చేస్తున్నట్టుగా వాటిల్లో పాల్గొనే వారం. డిగ్రీ మొదటి సంవత్సరంలో ఒక రోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నోటీసు బోర్డు మీద మ్యాథమేటికల్ ఇంటెలిజెన్స్ టెస్ట్ జరుగబోతున్నట్టు చూశాం. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు పోటి బి.ఎ., బి. ఎస్‌సి., ఎం. ఏ., ఎం.ఎస్‌సి. గణితం విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చు. గంట వ్యవధి కూడా లేదు. అయితే ఏమి వెళ్లాల్సిందేనని వెళ్లాం. ఎనిమిది తరగతుల విద్యార్థులలో నాకే ప్రథను బహుమతి వచ్చింది. ఆ సంవత్సరమే చెప్పుకోదగిన మరో అనుభవం, వివేకవర్ధనీ కళాశాలలో బహుభాషా బాల సాహిత్య

సమ్మేళనం జరిగింది. తెలుగు ప్రతినిధులు తప్ప హిందీ, ఉర్దూ, మరాఠీ భాషలవారు తమ భాషలలో వచ్చిన బాల సాహిత్యాన్ని గురించి గొప్పగా చెప్పుకున్నారు. తెలుగులో కొత్త పుస్తకాలేమీ ఆ యేడు రాలేదని చెప్పారు. చాలా బాధ కలిగింది. ఇంటికి వచ్చి వెంటనే "దేశ భాషలందు తెలుగు లెస్స- ఏనాడో" అని శీర్షిక పెట్టి నా ఆవేదనంతా గుమ్మరించాను. ఎవరు ప్రచురిస్తానసే శంక. మామూలు కథల పత్రికలకు భిన్నంగా ఉన్న తెలుగు స్వతంత్రకు పంపించాను. రెండు వారాల తర్వాత నేను కాలేజి నుంచి తిరిగి వచ్చే సరికి మెస్సులో మా వాళ్లు స్వతంత్ర్య పత్రికను ఆసక్తిగా చదువుతున్నారు. దీనిలో నీ వ్యాసం అచ్చయిందని సంతోషంగా చెప్పారు. నేను రాసిన శీర్షికకు అదనంగా "ఎదుగూ బొదుగూ లేని తెలుగుభాష" అనే ప్రధాన శీర్షిక జోడించి ప్రచురించారు. కొన్నేళ్ల తర్వాత గోరాశాస్త్రి తమ షష్టి పూర్తి సంచికకు రచనలు ఎంపిక చేయడానికి పాత స్వతంత్రలను తిరగేస్తున్నప్పుడు జి.ఎస్.వరదాచారి అని పేరు కనిపిస్తే చూపి ఇది మీరేనా అని అడిగారు. ఆ వ్యాసం చదివాకనే స్వతంత్రలో ఉగాది సాహిత్య సింహావలోకనం శీర్షిక ప్రవేశ పెట్టినట్టు తెలిపారు. ప్రతి ఉగాది సంచికలో క్రితం సంవత్సరం తెలుగులో వివిధ ప్రక్రియలో వచ్చిన సాహిత్యాన్ని యండమూరి శ్రీ వాత్సవ సమీక్షిస్తుండేవారు. స్వతంత్ర ఉన్నంతకాలం ఆశీర్షిక కొనసాగింది. స్వతంత్ర ఆగిపోయాక ఆంధ్ర పత్రికలో కూడా కొంతకాలం కొనసాగించారు.

వైష్ణవ పత్రిక ప్రచురణ

నాకు పదేళ్ల వయసులో ఫైలేరియా వ్యాధి సోకింది. ఎడమకాలు ఉబ్బి, విపరీతమైన జ్వరం వచ్చేది. పసరు మందు తాగితే తగ్గిపోయింది. కాని ఎందుకో నేను హైదరాబాద్ వచ్చాక ప్రతీయేడు మార్చి ఏప్రిల్ నెలలో మలేరియా జ్వరం తీవ్రంగా వస్తుండేది. ఆస్పత్రిలో చేర్చవలసిన పరిస్థితి. పరీక్షలు రాస్తానా అన్న సందేహం. డిగ్రీ ఫైనల్‌లో అదే జరిగింది. సెప్టెంబర్‌లో పరీక్షలు రాసి రెండవ శ్రేణిలో ఉత్తీర్ణుడనయ్యాను. ఎం.ఏ సీటు రాదు. దానికి తోడు మా తమ్ముడు పదవతరగతికి వచ్చాడు. మరుసటి సంవత్సరం పైచదువులకు వస్తాడు. ఇద్దరినీ చదివించడం భారమని మా నాయన నన్ను ఉద్యోగం చూసుకొమ్మన్నారు. నేను ఇంటర్‌లో చేరినప్పటినుంచి ఆయన నాకు నెలకు 50 రూపాయలు పంపుతుండేవారు. అందులో రు. 40 భోజన వసతికే పోయేవి. అందుచేత ట్యూషన్లు చెప్పి మరో 50 సంపాదించేవాణ్ణి. గణితం డిగ్రీకల వాణ్ణి కనుక నాకు వెంటనే బడి పంతులు ఉద్యోగం

వచ్చింది కాని డిగ్రీకి తోడుగా ఇంకేదైనా పట్టా ఉంటే భవిష్యత్ బాగుంటుందని నేను ఆ ఉద్యోగంలో చేరక జర్నలిజం పి.జి. డిప్లోమా కోర్సులో చేరాను. మా మెస్సు మిత్రులలో చాలా మంది ఉద్యోగాలు రావడంతో జిల్లాలకు వెళ్లిపోయారు. హాస్టల్ పెట్టాలని పెద్దల మీద ఒత్తిడి తేవడానికి ఉన్న ఇద్దరు ముగ్గురిని కూడగట్టుకుని శ్రీ వైష్ణవ యువజన సంఘం అని ఒక కాగితపు సంస్థను పెట్టాను. జర్నలిజంలో చేరాను గనుక ఒక పత్రిక పెడదామన్న ఆలోచన కలగింది. ఉభయతారకంగా ఉంటుందని 'వైష్ణవ' అనే పేరుతో మాసపత్రికకు డిక్లరేషన్ సంపాదించాను. ఆధ్యాత్మిక విషయాలకు కూడా సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేట్టు చెప్పాలని సంకల్పం. కోఠిలో జ్యోతి ప్రెస్ అని ఉండేది. కాని యజమానిని సంప్రదించగా ఆయన నా ఆదాయ వనరుల గురించి తెలుసుకొని తొమ్మిది, పదవతరగతులు చదువుతున్న తన కూతుళ్లిద్దరికీ ఇంగ్లీషు, లెక్కలు ట్యూషన్ చెబితే ప్రతిఫలంగా తెలుగు స్వతంత్ర సైజులో 16పేజీల పత్రిక అచ్చు వేసి పెడతానన్నాడు. అలాగే యేడాది వేసిచ్చాడు కూడా. 500 ప్రతులు అడ్రసులు తెలిసిన వారందరికీ ఉచితంగా పంపేవాడిని. చందాలు కడితే పత్రికను కొనసాగిస్తామనీ, మెరుగు పరుస్తామనీ రాసేవాణ్ణి. చందాలు రాలేదు. కాని పత్రిక ప్రతులను ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు, మధ్య ప్రదేశ్ గవర్నర్ డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యకు పంపితే వారినుండి ప్రోత్సాహకరమైన జవాబులు వచ్చాయి. జర్నలిజాన్నే వృత్తిగా చేపడదామన్న నిర్ణయానికి వచ్చేశాను. అందుకే నెల్లాళ్లు ఇంటర్న్‌షిప్ చేయవలసి ఉంటే మద్రాసు వెళ్లి హిందూ పత్రికలో చేసి వచ్చాను. దానిలో నేను సేకరించిన వార్తలు కూడా ప్రచురితమయ్యాయి. జర్నలిజం విద్యార్థులు ప్రచురించే అభ్యాస పత్రిక 'కొరియర్'కు ఆయేడు నేనే విద్యార్థి సంపాదకుడిని

ఆంధ్రజనతలో ఉద్యోగం

1956 జూన్ జూన్ 24నాడు మాజర్నలిజం ఫలితాలు వెలువడ్డాయి. 'ఆంధ్రజనత' దినపత్రికలో అవకాశాలున్నాయని మా లెక్చరర్ చెబితే వెళ్లి దాని నిర్వాహకులు వల్లూరి బసవరాజుగారిని కలిశాను. స్వతంత్రలో అచ్చు అయిన నా వ్యాసాన్ని, మరో కథను వెంట తీసుకుపోయాను. ఉస్మానియాలో డిప్లోమా చేసినట్టు చెప్పాను. జర్నలిజం తరగతి గదిలో బోధించదగిన విషయం కాదని ఆరోజుల్లో కొందరు సంపాదకులు అనుకునేవారు. అలా సంపాదకీయాలు కూడా రాశారు. రాజుగారూ ఆ మాటే అన్నారు. పాఠ్యాంశాలుగా

ఉన్న విషయాలను పేర్కొని వీటన్నిటి గురించి ప్రాథమిక సూత్రాలన్నా తెలిశాయి గదా అని అంటే అంతవరకు నిజమేనని ఒప్పుకున్నారు. కథ చూపిస్తే 200 మాటలు తెలిస్తే అవార్డు కథ రాయవచ్చు, జర్నలిజం వేరు ఆకాశమే హద్దు అన్నారు. భాష మీద పట్టు ఉన్నట్టు తెలుస్తుంది గదా అని అంటే అదీ నిజమేనన్నారు. చివరకు నేనే చొరవ తీసుకొని వారం రోజులు పని చూడండి. నచ్చితే ఉంచుకోండి. కాదంటే వారం రోజుల జీతం కూడా అడగకుండా వెళ్లిపోతానన్నాను. ఈమాట వినగానే నీవు నాకు నచ్చావయ్యా అని వెంటనే సంపాదకుడు కూచిమంచి సుబ్రహ్మణ్యం గారికి ఫోన్ చేసి ఈ కుర్రాన్ని పంపుతున్నాను సబ్ ఎడిటర్‌గా పెట్టుకో అని చెప్పారు. అక్కడి నుంచి నేరుగా సికిందరాబాద్ గాంధీ బొమ్మ దగ్గర ఉన్న 'ఆంధ్రజనత' ఆఫీసుకు వెళ్లాను. ఎడిటర్‌గారిని కలిసి పరిచయం చేసుకోగానే రాత్రి షిఫ్టులో రా అన్నారు. ఏడు గంటల కల్లా ఇక్కడ ఉండాలన్నారు.

రాత్రి 7గంటలకు వెళ్లే సరికి షిఫ్టు ఇన్ చార్జి ఇవటూరి గౌరీనాథ్, ఎడిటర్ సుబ్రహ్మణ్యం వాదులాడుకుంటున్నారు. "ఉండనుగాక ఉండను, మీరేం చేసుకుంటారో చేసుకోండి" అని ఖండితంగా చెప్పేసి గౌరీనాథ్ వెళ్లిపోయారు. ఎడిటర్ దిగ్భ్రాంతిలో ఉండిపోయారు. నేను కల్పించుకుని "టెలిప్రింటర్ వార్తలను తీసుకుని రాస్తూ ఉంటాను మీరు చూచి పంపుదురుగాని" అన్నాను. ఆయన తేరుకొని "అలాగే కానివ్వండి. నేను ఇంటికి వెళ్లి స్నానం చేసి వస్తాను" అని వెళ్లిపోయారు. ఆయన వచ్చే సరికి నేను చాలా వరకు పని పూర్తి చేశాను. నాలుగు పేజీల పత్రికే ఆయన చూసి కంపోజింగ్‌కు పంపించారు. పేజ్ మేకప్‌లో కూడా నేను ఆయనకు సహాయ పడ్డాను. రాత్రి ఒకటిన్నరకు పత్రిక అచ్చుకివ్వాలి. సమయానికి ఇచ్చేశాము. అలా మొదటిరోజే షిఫ్టు నిర్వహించగలడు అనిపించుకునే అవకాశం దొరికింది.

మర్నాడు రాత్రి డ్యూటీకి నేను వెళ్లే సరికి ఎడిటర్‌గారు కాచుకుని ఉన్నారు. 'గాన్ విత్ ది విండ్' సినిమా టివోలీలో ఆఖరు రోజు. ఆయన చూడాలి. రెండవ ఆట మాత్రమే మిగిలింది. నన్ను చూసి "నిన్న మీరు బాగానే చేశారు. ఇవాళ రాత పూర్తి చేసి కంపోజింగ్‌కు పంపించండి. నేను రాగానే మేకప్ పని పూర్తి చేద్దా"మన్నారు. సరేనని నేను పనిలో పడిపోయాను. ఇంగ్లీషు సినిమా– అర్ధరాత్రికల్లా వచ్చేస్తా రనుకున్నాను. అది నాలుగు గంటల సినిమా. రెండుకు ముందు రాలేరని ఎవరో చెప్పారు. పేజీ మేకప్ కూడా పూర్తి చేశాను. పేపరు సిద్ధంగా ఉంది. ఎడిటర్ వచ్చి స్ట్రయిక్ ఆర్డర్ ఇస్తే అచ్చు వేయడం

మొదలవుతుంది. అంతిమ గడువు రాత్రి 1:30 అయింది. ఎడిటర్ రాలేదు. మీరే సంతకం చేయండి అని ఫోర్‌మన్ ఒత్తిడి. ఉద్యోగంలో చేరిన మర్నాడే పెత్తనం నెత్తిన వేసుకుంటే ఊరకుంటారా? అన్నాను. ఇంతలో ప్రెస్ యజమాని వచ్చాడు. పేపర్ ఆలస్యంగా వస్తున్నదని రాజుగారు కోప్పడుతున్నారు. నీవు ఇంకా ఆపితే ఎట్లా? సరే నీవు కొత్తగా వచ్చావు. నేనే స్ట్రయిక్ ఆర్డర్ ఇస్తా అని సంతకం చేసి అచ్చు ప్రారంభించమని ప్రింటర్‌ను ఆదేశించాడు. మరో పావుగంటకు ఎడిటర్ వచ్చాడు. బయటి నుంచే యంత్రం నడుస్తున్న చప్పుడు గమనించి లోపలికి వస్తూనే మంచి పని చేశారు. లేకపోతే పత్రిక ఆలస్యమయ్యేదన్నారు. అచ్చయిన పత్రిక ఒకటి తీసుకొని చూచి అంతా బాగుంది. ఏం భయం లేదు అన్నారు.

ఉద్యోగంలో చేరిన నెల్లాళ్లకు నా భార్య, పెదతమ్ముడూ వచ్చారు. విఠల్ వాడిలో రెండు గదుల వాటా అద్దెకు తీసుకుని కాపురం పెట్టాము. తమ్ముడిని నిజాం కాలేజిలో చేర్పించాను. డాక్టర్ చదివించాలని ఆలోచన. 'ఆంధ్ర జనత'లో గౌరీనాథ్ వెళ్లిపోయాక అజంతా, నేను ఇద్దరమే ఎడిటోరియల్‌లో సిబ్బంది. ఎడిటర్‌తో పాటు, అజంతాకు కూడా నాపై గురి కుదిరింది. అజంతా అప్పటికే కవిగా పేరున్నవాడు. చాలా మొహమాటస్తుడు. నచ్చని వారెవరైనా ఎదురువస్తుంటే దూరం నుంచే "చుంచుమొహంవాడూ ఎదురొస్తున్నాడు, మనం అటు పోవద్దు" అని పక్క సందులోకి తిరిగేవాడు. ఆ విపరీత ప్రవృత్తి కూడా ఆయనకు ఆభరణంగానే ఉండేది. వార్తలు తప్ప సంపాదకీయాలు రాయననేవాడు. ఎడిటర్ సెలవులో వెడితే సంపాదకీయాల బాధ్యత నాకు అప్పజెప్పమనేవాడు. ఆ విధంగా తరచూ సంపాదకీయాలు రాసే అవకాశం నాకు దక్కింది. కొన్నాళ్లకు అడ్లూరి అయోధ్యరామ కవి మూడవ ఉప సంపాదకుడుగా చేరారు. ఆయన చాల బుర్ర కథలు రాశారు. ఇంగ్లీషు పెద్దగారాదు గనుక ఆభాషతో పనిలేని వ్యాసాలు, లేఖలు, ఆదివారం అనుబంధాలు చూస్తుండేవారు. ఓ రోజు సుబ్రహ్మణ్యంగారు నన్ను పిలిచి మీరేవో కథలు రాశారు గదా! ఈ ఆదివారం అనుబంధానికి ఓ కథ రాసి ఇవ్వడమన్నారు. నేను "దొరకని దొంగ" అనే కథ రాసి ఇచ్చాను. 'ఆంధ్రజనతలో వార్తలు, సంపాదకీయాలే గాక నేను కొన్ని కథలు, గల్పికలు, సమీక్షలు కూడా రాశాను. ఏ పని అప్ప చెప్పినా కాదనకుండా, శక్తి వంచన లేకుండా చేస్తుండేవాణ్ణి. ఒక రోజు అయోధ్య రామయ్య "నిన్నేదో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పనులు నీకు ఇస్తున్నాడని

పొంగి పోకు" అన్నారు. ఎందుకిస్తేనేమి? భిన్న ప్రక్రియలలో రాసే అవకాశం దొరుకుతున్నది గదా అని నా సమాధానం.

పల్లవించిన పాళీ

జూన్‌లో చేరాను గదా! నవంబర్ ఒకటి ఆంధ్ర ప్రదేశ్ అవతరించబోతున్నది. అవతరణ దినోత్సవ ప్రత్యేక సంచిక 32 పేజీలు వెయ్యాలని సంకల్పించారు. ఎడిటర్‌గారు నన్ను పిలిచి ప్రత్యేక సంచికలో వేయదగ్గ ప్రమాణాలు ఉన్న మంచి వ్యాసం రాయమన్నారు. నేను జర్నలిజం కోర్సులో భాగంగా తెలుగు పత్రికల చరిత్ర పై ఆంగ్లంలో సమగ్రమైన అధ్యయన పత్రం ఒకటి రాసి సమర్పించాను. దాన్ని చూపి తెలుగులో రాసి ఇస్తానంటే బాగుంటుంది ఇవ్వమన్నారు. ఆఫీసులోనే డ్యూటీ తర్వాత కూర్చొని రాసి ఇచ్చాను. దిన పత్రిక సైజులో మూడు పేజీల వ్యాసం, తొలి తెలుగు పత్రిక నుంచి 1955లో ప్రారంభమైన నేను పని చేస్తున్న 'ఆంధ్ర జనత' దిన పత్రిక వరకు 120 సంవత్సరాల తెలుగు పత్రికల చరిత్రను స్థాలీపులాకంగా సమీక్షిస్తున్న వ్యాసమిది. మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు రైలు ప్రయాణంలో ఆ వ్యాసం చదివారట. ఓ రోజు 'ఆంధ్రజనత' ఆఫీసుకు వచ్చారు. ఎడిటర్‌గారిని కలిసి ఆవ్యాసం చూపించి వ్యాసకర్త చిరునామా కావాలని అడిగారు. ఈ కుర్రాడు మా దగ్గరే పని చేస్తున్నాడు. పిలిపిస్తానుండండి అన్నారాయన. అలావద్దు. మనమే ఆయన దగ్గరికి వెళ్దామని పక్కనున్న గదిలోకి వచ్చారు. వ్యాసాన్ని మెచ్చుకొని తెలుగులో "శ్రీయక్షిణి" మొదటి పత్రిక అనడానికి మీరు పేర్కొన్న సురవరం ప్రతాపరెడ్డి వ్యాసం కాక మరేదైనా స్వతంత్ర ఆధారం దొరికిందా అని అడిగారు. "సత్యదూత" మొదటి పత్రిక కావచ్చునే అనుమానం ఉన్నా ప్రతాపరెడ్డిగారు రాసిందాన్ని కాదనడం ఇష్టంలేక అలా రాశానన్నాను. చరిత్ర పరిశోధనలో ఇష్టానిష్టాలు పనికిరావు. ఒకటికి రెండు స్వతంత్ర ఆధారాలు వెతకాలన్నారాయన. ఇదొక మరుపురాని అనుభవం. అభావాన్నే మెరుగు పరచి "దిద్దుబాటు" పాఠాలలో జర్నలిస్టులు వాస్తవాలకోసమే వెతకాలి. తప్పు రుజువులు కోసం కాదని సూత్రీకరించాను. రుజువు అనగానే మనకిష్టమైన దాన్ని సమర్థించే ఆధారమని భావం. ఈ వ్యాసంలోనే ఆంధ్రప్రభలో నార్ల వెంకటేశ్వరరావు సంపాదకీయాల విశిష్టత గురించి ఇలా రాశాను: "ఆంధ్రప్రభ నేడు ఇంత అధిక సంఖ్యలో అమ్మకం అవుతున్నదంటే దానికి కారణం నార్ల సంపాదకీయాలే. శ్రీనార్లవారి కలానికున్న పాళీ అయస్కాంతంతో చేయబడినట్లున్నది." దీన్ని "నవమేధావి" నార్ల అనే పేరుతో

రాసిన జీవిత చరిత్ర పుస్తకంలో శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య ఉల్లేఖించారు. ఇది మరొక తీపి గుర్తు.

నేను జర్నలిజంలో చేరిన కొత్తలోనే ఆంధ్ర సారస్వత పరిషత్ ఆవరణంలో తెలుగు రచయితలంతా సాహిత్య అకాడమీ లాటి సంస్థను ఏర్పరచుకోడానికి మహాసభను ఏర్పాటు చేశారు. అందులో తల్లావఝుల శివ శంకర స్వామి, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ శ్రీ మొదలుగాగల ప్రసిద్ధ తెలుగు రచయితలందరూ శతాధికంగా పాల్గొన్నారు. దాని మీద విశ్లేషణాత్మక కథనం రాయమన్నారు మా ఎడిటరు. వివరణాత్మక, విశ్లేషణాత్మక వార్తా రచన కూడా మాకు పాఠ్యాంశంలో భాగంగా ఉండేది. కనుక నాకున్న అవగాహనతో, నాకు సమంజస మనిపించిన వైఖరులను సమర్థిస్తూ రచయితల సభ, దాని తీర్మానాల మీద సంపాదకీయ పుటలో ప్రధాన వ్యాసం రాశాను. అది అచ్చయిన రోజున అబ్బూరి రామకృష్ణారావు, అబ్బూరి వరద రాజేశ్వరరావు ఆంధ్ర జనత 'ఆఫీసుకు వచ్చి అది రాసిందెవరని వాకబు చేశారు. ఎడిటర్‌గారు నన్ను పరిచయం చేయగా సరైన విశ్లేషణ అని మెచ్చుకొన్నారు. అది మరొక గుర్తుంచుకోదగిన సందర్భం. ఆ వ్యాసం నా దగ్గర లేదు కాని జర్నలిజం విద్యార్థుల పాఠ్యాంశంలో చేర్చదగింది.

రేడియోలో అసెంబ్లీ సమీక్ష

కొన్ని అవకాశాలు మన ప్రతిభను గుర్తించినందువల్ల కాక ఒకరి అశక్తత, మరొకరి అవసరం కొద్దీ మనకు దక్కుతుంటాయి. అలాంటిదే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ కార్యక్రమాలపై ఆకాశవాణికి మొదటి సమీక్ష రాసే అవకాశం. ఇప్పటివలె రోజువారీగా కాక అప్పుడు వారాంత సమీక్షలే ప్రసారం చేసేవారు. దీని తొలి కాంట్రాక్టు అప్పుడు ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ రాయప్రోలు రాజశేఖర్, మా అజంతాకు ఇచ్చారు. అసెంబ్లీకి వెళ్లకుండా ఆఫీసులోనే కూర్చొని పత్రికలు చూసి సమీక్ష రాయవచ్చు. కాని రేపు రికార్డింగ్ అనగా ఆయన చేతులెత్తేశారు. ఇప్పుడెలాగయ్యా అని రాజశేఖర్ నిలదీస్తే నా పేరు సూచించారు. నన్నడిగితే అలవాటు ప్రకారం సరే నన్నాను. అలా అసెంబ్లీ సమావేశాల తొలి సమీక్ష రాసి ఇచ్చే అవకాశం దొరికింది. ఆ తర్వాత లెక్కలేనన్ని సార్లు అసెంబ్లీ సమీక్షలు రాసిచ్చాను. విశ్లేషణాత్మకంగానే గాక విమర్శనాత్మకంగా కూడా రాశాను. ఆపాదనా సూత్రాన్ని పాటించి నెగ్గుకు వచ్చాను. అసెంబ్లీ ఇవాళ చేపలబజారును తలపించింది అని మనమాటగా రాశామనుకోండి. అది సభాధిక్కార నేరమవుతుంది. ఆ మాట సభలో

వావిలాల గోపాలకృష్ణయ్య అన్నారు. దాన్ని ఆయనకు ఆపాదిస్తూ ఆయన సభలోనే అన్నట్టు అలా తలపించిందని రాశామనుకోండి అధి ధిక్కారం కాదు. దూరదర్శన్ వచ్చిన తర్వాత వార్తా సంబంధమైన కార్యక్రమాలన్నీ నిర్వహించాను. నారాయణరెడ్డిగారు అధికార భాషా సంఘం అధ్యక్షులైనప్పుడు తొలిబులెటిన్‌లో తొలివార్త ఇందిరాగాంధీ సందేశం నేనే రాశాను. సమీక్షలైనా, చివరకు ఇంటర్‌వ్యూలైనా ఎత్తుగడ, విశ్లేషణ, ముక్తాయింపు పద్ధతిలో శ్రోతకు ఆ అంశాన్ని గురించిన సంపూర్ణ అవగాహన కలిగించేట్టు రాయాలని ప్రయత్నించేవాణ్ణి.

ఆంధ్ర జనతలో దాదాపు ఐదేళ్లు పని చేశాను. చిన్న పత్రికే అయినా ఆధునిక శైలిలో ఉండేది. ఆలోచనలకు అక్షర రూప మివ్వడానికి అవకాశ మిచ్చింది. 1960లో ఓ రోజు నార్ల వెంకటేశ్వరరావు 'ఆంధ్రజనత' ఆఫీసుకు వచ్చారు. 'ఆంధ్ర జ్యోతి' దినపత్రికను ప్రారంభించే ప్రయత్నంలో ఉన్నారు. యోగక్షేమాల తర్వాత ఆయనొక మరవరాని మాట అన్నారు– రాతలో ఏకరూపతకు సంబంధించి. ఆంధ్ర ప్రభలో ఏకరూపత సాధించడానికి తాను చాలా ప్రయత్నించారట. జనతలో మీరు సాధించారు. ఎలా సాధ్యమైందని అడిగారు పత్రికారచయితల కుటుంబంలో పెద్దాయన. ఆయనతో దాపరికాలెందుకు? ఉన్న జనం తక్కువ. అందులో కీలక స్థానాల్లో ఉన్న వారం యాధృచ్ఛికంగా ఒకేలా రాస్తాము. ప్రతిదీ పూర్తిగా చదివాకే కంపోజింగ్‌కు పంపుతాము అని. పెద్ద పత్రికలలో ఇప్పుడు ప్రచురణ కేంద్రాలు విస్తరించిన తీరులో, రాసినవన్నీ, ఏఒక్కరూ ముందే చదవడం సాధ్యం కాని పని.

ఆంధ్రజనత తర్వాత 1961లో 'ఆంధ్రభూమి'లో న్యూస్ ఎడిటర్‌గా చేరాను. మొదట పండితారాధ్యుల నాగేశ్వరరావు ఎడిటర్. యేడాది తర్వాత ఆయన వేరే పత్రికకు వెళ్లిపోగా రాబోతున్న సంపాదకుడు కె.యస్. సుబ్రహ్మణ్యం సూచన మేరకు యజమానులలో ఒకరు తన పేరే మేనేజింగ్ ఎడిటర్ అని వేసుకొన్నాడు. చివరకు ఆయన రానేలేదు. కొన్ని నెలల తర్వాత గోరాశాస్త్రి ఎడిటర్‌గా రావడానికి నేనే దారి కల్పించాను. చాలా కలుపుగోలుగా ఉండే వాళ్లం. ఆ రోజుల్లో ఆంధ్రభూమిలోనే కాదు. తెలుగుపత్రిక లన్నిటిలో ఎడిటరే రోజూ సంపాదకీయాలు రాసేవారు. ఆయన సెలవులో వెళ్ళినప్పుడే రెండవ వారికి అవకాశం దొరికేది. అందుచేత ప్రధానవ్యాసాలు, లఘు వ్యాఖ్యలు, ఇతర శీర్షికలు రాసి మా భావాలను ప్రకటించుకునేవాళ్లం. గోరాశాస్త్రి సంపాదకీయాలు రాసేముందు నాతో కొంత మాటలు కలిపేవారు. అభిప్రాయాల ఘర్షణకు ఆస్కారం ఉండేది కాదు.

కాని చైన దండయాత్ర జరిపినప్పుడు అలాంటి పరిస్థితి ఎదురైంది. నేను సమస్యమూలాలలోకి వెళ్లి ఆనాటి భారత ప్రభుత్వ రక్షణ విధానం, పంచశీల సిద్ధాంతం కారణంలో సైనిక సన్నద్ధతను ఉపేక్షించిన తీరు తదతర అంశాలను లోతుగా విశ్లేషిస్తూ వ్యాసపరం రాయాలనుకున్నాను. శాస్త్రిగారిని సంప్రదించి నాలుగు వ్యాసాలకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాను. ఇవి సంపాదకీయ పుటలో ప్రధానవ్యాసాలుగా పై భాగంలో ప్రచురితమవుతాయి. సామాన్యంగా ఈ వ్యాసాలకు సంపాదకీయాలతో వైరుధ్యం ఉండదు. కాని మూడు వ్యాసాలు అచ్చువగానే శాస్త్రిగారు ఈ వ్యాసాలలోని నిర్ధారణలను ఖండిస్తూ సంపాదకీయం రాశారు. దేనికదే మీ నాలుగో వ్యాసం రాయండి అని ఆయన అన్నా నాకిదేదో అసంబద్ధంగా ఉంటుందనిపించి ఆఖరు వ్యాసం రాయకుండా వదిలేశాను.

ఇంతకు మించి ఇరవై ఏళ్ల మా సాహచర్యంలో ఎన్నడూ పొరపొచ్చాలు రాలేదు. ఆయన సంపాదకీయ రచనాశైలి ప్రత్యేకంగా ఉండేది. ఆయనకో అభిమాన బృందం ఉండేది. కనుక ఆయన లేనప్పుడు నేను రాస్తే ఆ శైలిని అనుకరించే వాడిని. ఆయన మేనల్లుడు గోపాలశాస్త్రి కూడా ఒక రోజు నా సంపాదకీయాన్ని ఆయన రాసిందనుకుని ఆయనను అభినందించారు. శాస్త్రిగారు నావైపు చూసి ఆయనను అభినందించు నన్నుకాదు అన్నారు. అదొక అనుభవం. ఆయనపోయాక అదేశైలిని అనుకరిస్తే అప్పుడు జనం మెచ్చరు. కనుక ఆ జోలికి పోకండా పకడ్బందీ వాదనలతో నాదైన శైలిలో రాయడం సాగించాను. ఇదీ బాగానే ఉందే అని ఆయన అభిమానులు స్పందించడం మరొక అనుభవం.

బోధనారంగానికి

గోరాశాస్త్రి చనిపోయిన తర్వాత సహజంగా సంపాదక బాధ్యత నాకు రావాలి. కాని యజమానుల బంధువొకరు యోగ్యత లేకున్నా తన పేరు సంపాదకుడుగా వేసుకున్నారు. అందుకు నిరసనగా నేను ఆంధ్రభూమి నుంచి రాజీనామా చేసి బయటకు వచ్చాను. తర్వాత 'ఈనాడు'లో సహ సంపాదకుడిగా చేరాను. దాదాపు ఆరేళ్లు పని చేశాను. 'ఈనాడు'లో కూడా సంపాదకీయాలతో పాటు, ప్రధాన వ్యాసాలు రాశాను. జర్నలిజం విద్యార్థులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమంలో ప్రధాన పాత్ర వహించాను. జర్నలిజం బోధనలో నాకు అంతకు ముందు నుంచే అనుభవం ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జర్నలిజం పి.జి. డిగ్రీ విద్యార్థులకు పాఠాలు చెప్పాను. పద్మావతిలో

పాఠాలు చెప్పాను. ఈ విశ్వవిద్యాలయాలలో ప్రవేశ పరీక్షతో మొదలుకొని బోధన, ప్రాయోగిక అంశాలు, అధ్యయన పత్రం, వార్షికపరీక్షతో సహా పనులన్నీ, ఇంగ్లీషు మాధ్యమంలో సాగుతున్నందువల్ల ఇంగ్లీషు భాషలో అభినివేశం, అభిరుచిగలవారికే తప్ప తెలుగు వారికి సరైన స్థానం లభించేదికాదు. ఆ పట్టభద్రుల తెలుగు పత్రికలకు పెద్దగా ఉపయోగపడేవారు కాదు. ఈ అంశాన్ని బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో లేవనెత్తినప్పుడు ఐచ్ఛిక విషయంలో తెలుగు జర్నలిజం అని ఒక పేపర్ ప్రవేశపెట్టారు. అలా కాక అన్ని విషయాలు తెలుగు మాధ్యమంలో బోధించే ఏర్పాటు ఉండాలని నేను పోరుతుండేవాడిని. తెలుగు విశ్వ విద్యాలయంలో ఇప్పుడాపని చేయదలచామని శాఖాధిపతిగా వచ్చి ఆ బాధ్యత నిర్వహించాలని 1988లో చేకూరి రామారావుగారు ఒత్తిడి తెచ్చి రప్పించారు. 'ఈనాడు' నుంచి తెలుగు విశ్వ విద్యాలయంలో చేరాను. అక్కడ పదేళ్లకు పైగా శాఖాధిపతి, విసిటింగ్‌లో ప్రొఫెసర్‌గా పని చేశాను. అక్కడ చేరగానే చేసిన మొదటి పని కోర్సు పేరు మార్పించడం. వారెవరి సూచన మీదో బ్యాచిలర్ ఆఫ్ తెలుగు జర్నలిజం (బిటిజె) అన్నారు. మాధ్యమం తెలుగైనా కోర్సు పేరు, పాఠ్యాంశాలు ఇతర యూనివర్సిటిలలో ఉన్నట్టుగానే ఉండాలి. అందుచేత కోర్సు పేరును బిసిజెగా మార్చాము. కమ్యూనికేషన్ భాగాన్ని ఇతర విశ్వ విద్యాలయాలతో సరిసమానంగా ప్రవేశపెట్టాము. దానితో తెలుగు యూనివర్సిటిలో బిసిజె ఉత్తీర్ణులైన వారికి ఉస్మానియాలో ఎంసిజెలో చేరే మార్గం ఏర్పడింది. కొన్నేళ్లు తెలుగు విశ్వ విద్యాలయ విద్యార్థులే ఎక్కువ సీట్లు దక్కించుకుంటూ వచ్చారు. మీరు ఎంసిజి పెట్టుకొండయా అని ఉస్మానియా ప్రొఫెసర్లు ఒత్తిడి తెచ్చారు కూడా. దానితో తెలుగు విశ్వవిద్యాలయంలో కూడా ఎంసిజె ప్రారంభించాము. కోర్సుకు విశేషమైన ఆదరణ లభించింది. పత్రికలలో అప్పటికే ఉద్యోగాలు చేస్తున్న వారెందరో కోర్సులో చేరి విద్యాత్మకయోగ్యతలు సంపాదించుకొన్నారు. డిగ్రీ స్నాతకోత్తర కోర్సులు నిర్వహించడమే గాక గ్రామీణ విలేఖరులుగా పని చేస్తున్న వారి కోసం స్వల్ప కాలిక పునశ్చరణ తరగతులు కూడా నిర్వహించాము. ఈ కోర్సు కూడా జర్నలిస్ట్ వర్గాల ఆదరాభిమానాలు పొందింది. అప్పటికి ప్రెస్ అకాడమీ లేదు. ఒక రకంగా ప్రెస్ అకాడమీకి పథనిర్దేశం చేశాము. తెలుగు విశ్వవిద్యాలయంలో ఉంటూనే కేశవ స్మారక విద్యామందలి వారు ఏర్పరచిన రచన జర్నలిజం కళాశాల నిర్వహణ మండలిలో ఉంటూ అక్కడ పాఠాలు చెప్పాను. 2010లో తెలుగు విశ్వ విద్యాలయంలో స్వచ్ఛంద పదవీ విరమణ చేశాను. అది తెలిసి మిత్రులు శ్రీ.కె. రామచంద్రమూర్తిగారు తమ హెచ్ఎంటివి

అనుబంధ సంస్థ అయిన ఇండియన్ స్కూల్ ఆఫ్ జర్నలిజంలో చేరమంటే అక్కడ ప్రొఫెసర్‌గా చేరాను. తర్వాత 2011 జనవరి ఒకటవ తేదీన మూర్తిగారే తమ టీవీ వార్తా చానల్‌కు అంబుడ్స్‌మన్ (తీర్పరి)గా ఉండమన్నారు. దేశంలో ఒక టీవీచానల్ ఆంతరంగిక తీర్పరిని నియమించుకోవడం ఇదే మొదటి సారి.

పురస్కారాలు

1976లో కలకత్తాలో సర్వభాషా పత్రకార్ సమ్మేళనం జరిగింది. తొలి హిందీ పత్రిక "ఉదంతమార్తాండ్" వెలువడి 150 ఏళ్లు పూర్తయిన సందర్భం. నిర్వాహకులు వివిధ భాషల పత్రికా రచయితలను 'పత్రకార్ శిరోమణి' అనే బిరుదుతో సత్కరించారు. వారు ఎంపిక చేసిన వారిలో నేనూ ఒకణ్ణి. తిరుమల రామచంద్ర కూడా ఆసత్కారం అందుకున్నవారిలో ఉన్నారు. అదే నాకు జరిగిన మొదటి సత్కారం. 1980లో కిన్నెర ఆర్ట్స్ సంస్థ ఉత్తమ జర్నలిస్టుగా నన్ను సన్మానించాలని నిర్ణయించింది. జర్నలిస్టులకు సన్మానాలేమిటనే భావన నాకు ఉండేది. వృత్తి సంఘాలు గుర్తించి సత్కరిస్తే అది వేరు. కాని మిత్రుల ఒత్తిడితో అంగీకరించాను. దాసరినారాయణరావు గారికి ఫిలిమ్ జర్నలిజంలో విశేష కృషి చేసిన వారిని గౌరవించాలనే కోరిక కలిగింది. వంశీ సంస్థ నిర్వాహణలో ఆయన కొన్నేళ్లు బంగారు పతకాలు ఇచ్చారు. 1986లో ఆ స్వర్ణపతకం నాకు దక్కింది. నేను 22 ఏళ్లు ఆంధ్రభూమిలో సినిమా శీర్షిక నిర్వహించాను. అంతేకాక 'పొలికేక', 'ప్రజాతంత్ర' వార పత్రికలలో 'స్టైలైన్' ఇంగ్లీషు దినపత్రికలో కూడా సినిమా శీర్షిక నడిపాను. నా చిత్ర సమీక్షలకు పరిశ్రమలో గుర్తింపు ఉండేది. ప్రేక్షకులలో విశేష ఆదరణ ఉండేది. ఒక సినిమా శతదినోత్సవ సభలో ముఖ్య అతిథి సమాచార మంత్రి నాపేరు పేర్కొని ఇలాంటి వారికి ట్రోఫీలివ్వాలనడం నిదర్శనం.

1992లో కిన్నెర సంస్థవారే నాషష్టి పూర్తి సన్మాన సభను ఘనంగా నిర్వహించారు. అప్పుడు పి.ఎస్. ఆర్. ఆంజనేయశాస్త్రి ప్రోద్బలంతో పత్రికారచనాచార్య అనే బిరుదం ప్రదానం చేశారు. 1999లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారు ప్రతిభా పురస్కారం ఇచ్చారు. 2006లో విజయ ఉగాది సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశిష్ట పురస్కారం ఇచ్చింది. 2007లో తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 2005 సంవత్సరానికిగాను ఉత్తమ జర్నలిస్టుగా నార్ల స్మారక జీవన సాఫల్య పురస్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. ఇవికాక ఢిల్లీ ఆంధ్రా అకాడమీ వారి విశాల

భారతి గౌరవ పురస్కారం, హయగ్రీవాచారి స్మారక పురస్కారం, మాదాల వీరభద్రరావు స్మారక పురస్కారం, ఆంజనేయశాస్త్రి స్మారక పత్రికా రచయిత పురస్కారం మొదలైనవి లభించాయి. 2006 ఫిబ్రవరి 16నాడు పొత్తూరి వెంకటేశ్వరరావు నేతృత్వంలో మిత్రులు కలిసి నా పాత్రికేయ జీవిత స్వర్ణోత్సవం జరిపి 'వరద స్వర్ణాక్షరి' పేరిట అభినందన సంచిక ప్రచురించారు. నవతరం జర్నలిస్టులకు ఆ గ్రంథం ఉపయుక్తంగా ఉంటుంది.

అమెరికా, మరికొన్ని దేశాలలో జర్నలిస్టులు తాము వృత్తి ధర్మంలో భాగంగా చేసిన రచనలలో మంచివనుకున్న వాటిని ఎంపిక చేసి పుస్తకాలుగా ప్రచురిస్తూ ఉంటారు. అలాగే తమ అనుభవాలను కూడా రాసి ప్రచురిస్తూ ఉంటారు. ఇవి భావితరాల వారికి దారి చూపుతాయి. మెలకువలు నేర్పుతాయి. మన దేశంలో కూడా ఇంగ్లీషు పత్రికా రచయితలు ఇలాంటివి ప్రచురించారు. కాని ప్రాంతీయ భాషలలో ఇలాంటివి ప్రచురించడానికి రెండు దశాబ్దాలక్రితం వరకు అవకాశాలుండేవి కావు. పుస్తక ప్రచురణ వ్యాపారం. లాభసాటికాని పని ఏ వ్యాపారీ చేయడు. చేయాలనుకోవడం దురాశ. కవితలు రాసిన వారు స్వంత ఖర్చులతో పుస్తకాలు వేసుకున్నా అమ్మకాలు తక్కువ. ఉచిత పంపకాలే ఎక్కువ. పత్రికా రచయితలు అలాంటి సాహసాలు చేయలేరు. నేను తెలుగు విశ్వ విద్యాలయంలో చేరాక జర్నలిజం పాఠ్య, పఠనీయ గ్రంథాల కొరత తీర్చాలని యత్నించాను. సెమినార్ పత్రాలను విశ్వ విద్యాలయం తరఫున ఒక పుస్తకంగా వేశాము. నా రచనలలో నుంచి కొన్ని ఎంపిక చేసిన సంపాదకీయాలు, లఘు వ్యాఖ్యలు, ప్రధానవ్యాసాలు, వార్తాలేఖలు, సమీక్షలతో ఇలాంటి భిన్న ప్రక్రియల రచనలు ఎలా చేయాలో పరిచయం చేసే పుస్తకం వేయాలనుకున్నాను. 1990లో ఓ ప్రెస్ యజమానితో బేరమాడుతుండగా అక్కడికి వచ్చిన వంశీ రామరాజు మీ పుస్తకాన్ని మా సంస్థ తరఫున అచ్చు వేసి పెడతామని ముందుకు వచ్చారు. 'నామాట' అచ్చువేసి ఇచ్చారు. దానికి నారాయణరెడ్డిగారు, పొత్తూరి వెంకటేశ్వరరావు ముందుమాట రాశారు. జి.కృష్ణ దాన్ని పత్రికలో సమీక్షిస్తూ ఉదాహరణ సాహిత్యమన్నారు.

దిద్దుబాటు

పత్రికా రచయితలం మేమే ఏర్పాటు చేసుకున్న రచనా సూత్రాలకు భంగకరంగా పత్రికలలో వస్తున్న అంశాలను సరిదిద్దడానికి ఒక ఫీచర్ రాయాలని నాకు కొంత కాలంగా కోరిక ఉండేది. ఇంగ్లీషులో మీడియా వాచ్‌కాలమ్ అంటారు. ఎం.వి. కామత్,

జి.ఎస్. భార్గవ రాసినది అలా ప్రాచుర్యం పొందినది. అలాంటి శీర్షిక ఒకటి తెలుగులో రావడం చాలా అవసరమని నేను భావించాను. ఎం.వి.ఆర్. శాస్త్రిగారు 'ఆంధ్రభూమి'లో ప్రచురించడానికి అంగీకరించారు. 1997 ఏప్రిల్ నుంచి 'దిద్దుబాటు' పేరుతో ధారావాహికంగా ఆ శీర్షిక సాగింది. పాత్రికేయ వర్గాలలో విశేష ఆదరణ పొందింది. 1999లో రచన జర్నలిజం కళాశాల వారు పుస్తకంగా ప్రచురించారు. అందరి మన్నన పొందింది. రెండు ముద్రణలు అమ్ముడు పోయాయి. ఒక సమీక్షపకుడు దాన్ని "క్లాసిక్" అని వర్ణించాడు.

జర్నలిజంలో 'వార్త పవిత్రం' వ్యాఖ్య రాసేవారి ఇష్టం- అని ఆంగ్ల నానుడి ఒకటుంది. అంటే వార్తలో మన ఇష్టాయిష్టాలతో పని లేదు. వాస్తవాలు రాయాల్సిందే. వ్యాఖ్యలో మీకు నచ్చకపోతే ఆమాట చెప్పవచ్చు. కాని వార్తాంశం ఆధారంగా చేస్తున్న దైనందున వ్యాఖ్యలో కూడా తార్కికత లోపించగూడదు. 'దిద్దుబాటు'లో వార్తాంశాలను ఎత్తుకుని తప్పులు దిద్దే ప్రయత్నం చేశాను. వ్యాఖ్యలలో కూడా అసంబద్ధమైన వాటిని ఎత్తి చూపుదామని పత్రికలలో సంపాదకీయాలకు, విశ్లేషణాత్మక కథనాలకు, వ్యాసాలకు పరిమితమవుతూ ఈ కొత్త శీర్షిక రాశాను. దాన్ని రచన జర్నలిజం కళాశాల వారే 2003లో "ఇలాగేనా రాయడం" అనే పేరుతో పుస్తకంగా వేశారు. దాని మీద స్పందన బాగానే వచ్చింది.

అంతకు ముందు 1976లో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ సమాచార శాఖ వారి కోరిక మేరకు 'తెలుగు చిత్ర పరిశ్రమ' అనే లఘు పుస్తకం రాశాను. అంబేద్కర్ విశ్వ విద్యాలయం వారు తెలుగు పత్రికా రచన కోర్సు పెట్టినప్పుడు వారికి భారత రాజ్యాంగం, పత్రికా చట్టాలు అనే పాఠ్యాంశం రాశాను. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ వారికి 'లా ఆఫ్ డిఫమేషన్ అండ్ జర్నలిస్టిక్ డిఫెన్సెస్" అనే పాఠం రాశాను. అంతకు ముందే 1986లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ వారి 'మీడియా హ్యాండ్ బుక్' కోసం పత్రికా చట్టాల మీద ఆంగ్లంలో పాఠం రాశాను. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి దూర విద్యా కోర్సు కోసం "ఎడిటింగ్, పత్రికా చట్టాలు" అనే పాఠ్య పుస్తకానికి సంపాదకత్వం వహించాను. ప్రెస్ అకాడమీ వారి కోసం 'పత్రికా భాష' అనే పుస్తకం రాశాను. 2009లో కేంద్ర సాహిత్య అకాడెమీ వారు భారతీయ సాహిత్య నిర్మాతలు అనే శీర్షికతో ప్రచురిస్తున్న

గ్రంథ పరంపరలో భాగంగా "నార్ల వెంకటేశ్వరరావు" మీద పుస్తకం రాశాను. హిందూ పత్రిక ప్రశంసిస్తూ సమీక్ష రాసింది.

ఇతరాలు

ఇవికాక నాకు శ్రామిక సంఘాలలో పని చేసిన అనుభవం కూడా ఉన్నది. వర్కింగ్ జర్నలిస్టుల రాష్ట్ర సంఘంలో అధ్యక్ష పదవితో సహ నేను నిర్వహించని పదవి లేదు. ప్రెస్ క్లబ్‌కు నేను స్థాపక కార్యదర్శిని. జర్నలిస్టుల సహకార గృహ నిర్మాణ సంఘానికి అధ్యక్షుడుగా చేశాను. బంజారాహిల్స్ జర్నలిస్టు కాలనీ సంక్షేమం సంఘానికి అధ్యక్షుడుగా ఉన్నాను. హైదరాబాద్ ఫిలమ్‌క్రిటిక్స్ అసోసియేషన్‌కు చాలా కాలం అధ్యక్షుడుగా ఉన్నాను. ఇప్పుడు వయోధిక పాత్రికేయ సంఘానికి, ఆంధ్ర ప్రదేశ్ సినీ గోయర్స్ అసోసియేషన్‌కు, తెలుగు భాషా చైతన్య సమితికి అధ్యక్షుడుగా ఉన్నాను. ప్రెస్ అకాడమీ సభ్యుడుగా పని చేశాను.

నందీ చలన చిత్ర అవార్డుల కమిటీలో మూడు సార్లు సభ్యుడుగా ఉన్నాను. నందీ టీవీ అవార్డుల కమిటీలో ఒకసారి ఉన్నాను. రాష్ట్ర ప్రభుత్వం చలన చిత్రాలకు సబ్సిడీ ఇవ్వడానికి నిర్ణయించినప్పుడు మంత్రిగారు ఏర్పాటు చేసిన పత్రికాగోష్ఠికో అనుకోకుండా నేను హాజరైనాను. సబ్సిడీ కైనా కనీస ప్రమాణాల నియమం లేకపోతే అది దుర్వినియోగ మవుతుందని సోదాహరణగా చెప్పినప్పుడు నచ్చి మంత్రి కమిటీ వేయడానికి ఒప్పుకున్నారు. బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షుడుగా కనీస ప్రమాణాల కమిటీ వేశారు. సూచించింది మీరే గనుక మీరూ ఒక సభ్యులుగా ఉండాలన్నారు. కమిటీ ఉన్నంత కాలం అంటే మూడేళ్లు కొనసాగాను. తర్వాత దాన్ని రద్దు చేశారు. మలేషియాలో తెలుగు మహా సభలు జరుగుతున్నప్పుడు ప్రతినిధులుగా వెళ్లాలన్న వారి ఒత్తిడి బాగా పెరిగింది. ముఖ్యమంత్రి అంజయ్య పత్రికా గోష్ఠిలో "ఏమయ్యా! సాంస్కృతిక బృందాలంటే ఆటలోళ్లు, పాటలోళ్లేనా" అని తన సహజ ధోరణిలో నవ్వుతూ ప్రశ్నవేశారు. ప్రభుత్వానికి ఓ సాంస్కృతిక విధానమంటూ ఉండాలని, అదేమిటో నిర్ణయించడానికి ఓ కమిటీ వేయమని సూచిస్తే 1981లో ఆయన 49 మందితో సాంస్కృతిక వ్యవహారాల సలహా మండలి నియమించారు. దానిలో నన్నూ సభ్యుడుగా వేశారు.

నేను ఎక్కడ మాట్లాడినా స్వచ్ఛంద నియమపాలన గురించి, ప్రశ్నించే అలవాటు గురించి, సూక్ష్మ పరిశీలన ఆవశ్యకత గురించి చెబుతుంటాను. పత్రికా రచయితలకు

ఇవి చాలా అవసరం. ప్రతీరంగంలోని వారికి అవసరమే. ఇవాళ వైజ్ఞానికంగా, సాంకేతికంగా సమాజం చాలా ముందుకు సాగింది. వృత్తి కుశలత, సంపాదనా పెరిగాయి. మరి సమాజంలో ఎందుకింత అశాంతి? ఎందుకింత అసహనం? ఎందుకింత అల్లకల్లోలం? మానవ సంబంధాలు సజావుగా లేకపోవడానికి కారణమేమిటి? ఏమిటి పరిష్కారం? పాత్రికేయ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు తమ పత్రిక వివేక వర్ధనికి మకుటంగా పెట్టుకున్న భారతంలోని పద్యమే కనబడతున్నది.

ఒరులేయవి యొనరించిన

నర రవయ ప్రియంబు

తన మనంబునకగదా

నొరులకవి సెయకునికియే

పరాయాణము పరమ ధర్మ పథములకెల్లన్

ఈ భావాన్ని జనంలోకి సమర్థంగా తీసుకెళ్లడంలో పాత్రికేయుల, కవుల, రచయితల, మేధావుల పాత్ర ముఖ్యమైంది. ఎందుకంటె సమాజాన్ని చైతన్య పరచి కార్యోన్ముఖులుగా చేయగలిగిన బాధ్యత ఇతరుల కంటె వారి మీదే ఎక్కువగా ఉంటుంది గనుక.



ముదిగంటి సుజాతారెడ్డి

నేను ఆకారం గ్రామం నల్లగొండ జిల్లాలో పుట్టాను. నల్లగొండ జిల్లా తెలంగాణలో మిగతా జిల్లాలకన్నా వెనుకబడ్డ ప్రాంతం. సారవంతమైన భూములేవు. వర్షపాతం తక్కువ. ఒక మూసీనది ప్రవహిస్తున్నది. కాని అది పెద్దనది. నీళ్ళున్న నది కాదు. అంతా వర్షం మీదనే ఆధారపడి వుంటుంది. మా అమ్మ– వెంకటమ్మ. మా బాపు రాంరెడ్డి. మాది పెద్ద భూస్వాముల కుటుంబం. వందల కొద్ది ఎకరాల భూములున్నా వర్షం వుంటేనే పంటలు; లేకపోతే కరువు. నేను పుట్టక ముందు ఎన్నో కరువులు వచ్చాయి. ఘనుషులో మనుషులను అనే కరువు, మానెడు జొన్నల కరువు– ఇట్లా కరువులకు పేర్లుండేవి. అటువంటి కరువులు వచ్చినప్పుడు పేద ప్రజలు వచ్చి తమ పిల్లలను మానెడు జొన్నలకు సోలెడు సజ్జలకు అమ్మిపోయేవాళ్లు. కొందరైతే ఇంత అన్నం పెట్టి బతికిచ్చుకోండి అని పిల్లలను విడిచిపెట్టి పోయేవాళ్లు. అట్లాంటి పిల్లలే మా ఇండ్లల్లో ఆడబాపలు సేవికలుగా పెరిగే వాళ్ళు. ఇంటిపని, బయటి పనులు చేసే వాళ్లు. ఇంగ్లీషు వాళ్ళు అంటె మన పాలకులు. వాళ్ళు చేసిన మొదటి, రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఇంకా ఇతర సమయాల్లో తమకు కావలసిన ధాన్యాన్ని వాళ్ళ ప్రజల అండకోసం మన రైతుల దగ్గర లెవీ ధాన్యం మొదలైన ఎన్నో పేర్లతో బలవంతంగా ధాన్యాలను వసూలు చేసి తమ దేశానికి తరలించుక పోయే వాళ్ళు. మన దేశంలో కష్టపడి పండించిన రైతులు కరువు కాటకాలకు గురయి తినడానికి తిండి లేక మలమలమాడి చచ్చి పోయేవాళ్ళు.

మేం పేరుకు పెద్ద భూస్వాములం. ఆడ సేవకులున్న, పెద్ద మేడలున్న కుటుంబాలయినా, ఆర్థికంగా పెద్దగా ఏమీ వుండేది కాదు. భూములు, అప్పుడప్పుడు

కొన్న లేదా పెండ్లిళ్లకు కోడండ్లకు పెట్టిన బంగారం వుండేది. డబ్బు ఉండేది. కాదు. డబ్బు కరువే! పిల్లల్ని చదవించటం తక్కువే. ఉద్యోగాలు చెయ్యటం ఊడిగంగా భావించేవాళ్ళు. కాబట్టి చదువు మీద శ్రద్ధలేదు. ఇక ఆ పరిస్థితుల్లో ఆ పిల్లలను చదువులను ఎవరూ పట్టించుకునే వాళ్ళు కాదు. నేను సంక్రాంతి వెళ్ళిన ఇరవై ఇరవై రెండు రోజులకు పుట్టానని మా అమ్మ అనేది. సంవత్సరం 1942 అని మా అన్న పుట్టిన సంవత్సరాన్ని బట్టి నేను పుట్టిన సంవత్సరం అంచనా. 1942 నాటికే తెలంగాణలో భూస్వాముల అధికారంలో మార్పులు ప్రవేశిస్తున్నాయి. బయట భారత్‌లో గాంధీజీ కల్పించిన ప్రకంపనలు నైజాం ప్రజలకు సూచాయగా తెలుస్తూనే వున్నాయి. గాంధీజీ గురించి మా నాయనమ్మ శాంతమ్మ మాట్లాడేది. ఆమె తల్లి గారు హైద్రాబాదు సమీపంలో ప్రతాప సింగవరం కాబట్టి వస్తూ పోతూ వున్నప్పుడు హైద్రాబాదులో ఏమవుతుందో ఆమెకు తెలిసేది. మా నాయనమ్మ అక్కని– రవణమ్మను– అదే వూరులో ఒకే ఇంటికి అన్నదమ్ముల కొడుకుల కిచ్చి పెండ్లి చేసారు. రవణమ్మ నాయనమ్మ చాల తెలివైనది. ఆమెకు పరిస్థితుల అవగాహన ఎక్కువ. ఆమె తన బంగారు నానును అమ్మి తన కూతురు ఆండాళును రాజ బహదూరు వెంకటరామారెడ్డి స్థాపించిన చిలుకల వసతి గృహంలో చేర్పించి చదివించింది. అది మా కుటుంబంలో ఆడపిల్లలను చదివించాలనే ప్రేరణకు కొంతవరకు దారి తీసింది.

ఇక 1946 వచ్చే సరికి కమ్యూనిస్టు ఉద్యమం ఆరంభమైంది. 1947 ఆగస్టు 15వ తేదీన భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చింది. బ్రిటిషు పాలన నుంచి విముక్తి లభించింది. దాంతో నైజాంలో కాంగ్రెసు, కమ్యూనిస్టుల నైజాం స్వాతంత్ర్యం పోరాటం తీవ్రతరమైంది. ఇంకోవైపు నిజాంను గద్దె మీదవుంచి నైజాం ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగానో పాకిస్తాన్‌లో భాగంగానో చేయాలని రజాకార్లు పోరాటం ముమ్మరం చేసారు. దోపిడీలు, హత్యలు, స్త్రీల మానభంగాలు చేయటం మొదలు పెట్టారు. ఈ పరిస్థితులను వర్ణిస్తూ అడ్లూరి అయోధ్యా రామకవి కొన్ని కథలు వ్రాసి విజయవాడ నుంచి 1948లో “తెలంగాణ మంటల్లో” అనే కథల సంపుటి ప్రచురించాడు. కమ్యూనిస్టులు భూపోరాటం చేసారు. భూస్వాములను చంపటం మొదలు పెట్టారు. దాంతో తెలంగాణ అగ్నిగుండంలా తయారయింది. మా భూముల్లో కౌలు భూములను కిచ్చిన కౌలుదార్లు సొంతం చేసుకున్నారు. రాత్రి కమ్యూనిస్టులు వచ్చి అప్పుల కాగితాలో, కౌలుదారు కాగితాలో, ఇంకా ఏవేవో తీసుకొని చింపేసే వాళ్లు. భూములు పేదలకు పంచమని భయపెట్టే వాళ్ళు. రజాకార్లు పగలు వచ్చి భయపెట్టె వాళ్ళు; దోపిడీ చేసే వాళ్ళు. ఈ అల్లకల్లోల

పరిస్థితుల్లో నేను అఆలు దిద్దుకునే ఆలోచనకు అవకాశమే లేకుండా పోయింది. కమ్యూనిస్టులు వచ్చి దొరల బంగ్లాలను కూల్చేసే వాళ్లు. భూస్వాములను చంపేవాళ్ళు. ఈ పరిస్థితులను ఆసరాగా తీసుకొని కొందరు దొంగలు, దోపిడీగాండ్లు ప్రజలను దోచుకునే వారు. ఈ అంశాన్ని వట్టికోట ఆళ్వారు స్వామి "మాకంటె మీరేం నయం" అనే కథలో కొంతవరకు రికార్డు చేసాడు. ఈ పరిస్థితుల్లో మా కుటుంబం మా మేనమామల కుటుంబంతో కలిసి ఆంధ్రప్రాంతాలకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాందిశీకులుగా పారి పోయారు. కేవలం బట్టలు బంగారం తీసుకొని పారిపోయారు. బంగారం అమ్ముకొని జీవితం సాగించారు. మొదట మేం అద్దంకిలో కొన్ని నెలలున్నామని నాకు లీలగా గుర్తు. మా అమ్మ మేనత్తలు దగ్గరలో వున్న గుండ్లకమ్మ నదికి పోయి నీళ్ళు మోసుక వచ్చేవాళ్ళు. మేమూ చెంబులతో నీళ్ళు తెచ్చే వాళ్లం. మేం అక్కడ వున్నప్పుడే గాంధీజీని హత్య చేసిన వార్త వచ్చింది. అంటే 1948 జనవరి 30వ తేది. అద్దంకి దుమ్ము కొట్టుకపోయే కుగ్రామం (అప్పుడు). అయినా నాలుగు బజార్లో మైకు పెట్టి గాంధీజీ చనిపోయిన వార్తను ప్రకటించిన దృశ్యం లీలగా నా స్మృతి పథంలో నిలిచిపోయింది.

కొన్ని రోజులకే మేము అద్దంకి నుంచి నరసరావు పేటకు మారాము. అక్కడ నన్ను చిన్న వీధిబడిలో చేర్పిచినట్లు గుర్తుంది. అఆలు అక్కడే దిద్దటం ఆరంభమైంది. నాతో పాటు మా మేనమామ కొడుకు, కూతురు కూడా వుండేవాళ్ళు. వాళ్ళు నా వయస్సువాళ్ళే. అక్కడున్నప్పుడే నేను మా వాళ్లతో కలిసి "చంద్రలేఖ" సినిమా చూసినట్లుగా గుర్తుంది. అక్కడ వాళ్ళకు నైజాం నుంచి బాధలో వుండి ఇల్లు, ఊరు విడచి వచ్చారే అని ఏమీ సానుభూతి వుండేది కాదు. పైగా వీళ్ళు రావటం వల్ల ఇండ్ల కిరాయిలు పెరిగాయి; ధరలు పెరిగాయి అని గుర్రుగా చూసేవాళ్లు. తరువాత భాషను కూడా వెక్కిరించటం మొదలయింది. ఈ పరాయీకరణం చేతినే బాధితులై తెలంగాణ వాళ్ళు మొదటి నుంచి మేము వేరే రాష్ట్రంగా వుంటామని అంటున్నారు. అది కోస్తా ప్రాంతం వాళ్లు ఆప్యాయతలు, ఆత్మీయతలు లేని తెలుగుదనమే కారణమని చెప్పాలె. అదే హైద్రాబాదులో మహారాష్ట్రయన్లకు పునా నుంచి పూర్తిగా సహాయ సహకారాలు లభించేయి. మహారాష్ట్రులు ఎక్కువ జాతీయ స్పృహతో తమ వేష భాషలను పరిరక్షించుకొని తమ విద్యా సంస్థలను స్థాపించుకున్నారు. నిజాం ప్రభుత్వంలో ఉద్యోగులు ముస్లింల తర్వాత వాళ్ళే ఎక్కువగా వుండేవాళ్ళు. తెలుగు వాళ్ళలో అక్షరాస్యత తక్కువగా ఉండేది. అందుకని ఉద్యోగాల్లో తక్కువే వుండేవాళ్ళు.

1948 సెప్టెంబరు 17వ తేదీనాడు నైజాం భారత్ యూనియన్‌లో కలిసిన వార్త వచ్చింది. మేమందరం వరంగల్ జిల్లాలో స్టేషన్ ఘనపురం దగ్గరున్న వెంకటాద్రిపేట మా మేనమామల ఊరికి పోయాం. నల్లగొండ జిల్లాలో మొదట నుంచి కమ్యూనిస్టుల కార్యకలాపాలు ఎక్కువ. కమ్యూనిస్టు ఉద్యం మొదలైంది జనగాం దగ్గర విసునూరు, కడివెండి లోనే. విసునూరు రాంచంద్రారెడ్డి ప్రతిఘటనతో కమ్యూనిస్టు ఉద్యమం అక్కడనే పుట్టి వ్యాపించింది. ఆనాటి కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు రావి నారాయణరెడ్డి, ఆరుట్ల సోదురులు, ఆరుట్ల కమలాదేవి, బి.ఎన్.రెడ్డి, మల్లు స్వరాజ్యం, నల్లా నరసింహం, దేవులపల్లి వేంకటేశ్వరరావు మొదలైన వాళ్ళందరు నల్లగొండ జిల్లా వాళ్ళే. కమ్యూనిస్టు ఉద్యమానికి నల్లగొండ జిల్లా ఎపి సెంటర్‌గా వుండేది. నిజాం లొంగి పోయిం తర్వాత కూడా నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమం కొనసాగింది. కాబట్టి ఆకారం వెళ్ళలేక పోయాం. అందులో మా బంగ్లాను కమ్యూనిస్టులు కూల గొడ్తామని వస్తే, మా చినతాత– ఊరిలోనే వుండిపోయిన ఆయన– వాళ్ళ కూలగొడ్తే అడ్డదిడ్డంగా కూలగొడ్తారని, కూళ్ళు ఇచ్చి కూలివాళ్ళ చేత బంగ్లాను కూలగొట్టించారు. అదీ పోలీసు చర్యకు అంటె, భారత్ యూనియన్ సైన్యం నైజాంలో ప్రవేశించే ముందు రోజే! ఒక్కరాజు ఆలస్యం చేస్తే బంగ్లా వుండి పోయేది. సూర్యాపేట ద్వారా బెజవాడ నుంచి భారత్ పెద్ద సైన్యం మోహరించిన విషయం మా తాతకు తెలియక పోరాటంతో ఇంత పెద్ద పొరపాటు జరిగిపోయింది. ఆకాలంలో రేడియోలు, ఫోన్లు లేవు కద! కమ్యూనికేషన్ సిస్టమ్ లేనేలేదు. దాంతో ఇంత ఘోరం జరిగిపోయింది. కాబట్టి మేము ఊరిలో వుందామన్నా ఇల్లులో ఆశ్రయం లేదు. మేము మా అమ్మతో మా మేనమామల దగ్గరే రెండేండ్లు వుండి పోయాం. మా బాపు అటుయిటూ ఆకారం, హైద్రాబాదు తిరిగి మా దగ్గరికి వస్తుండేవాడు. కాని మాకు– పిల్లలకు మా బాపుతో చనువు వుండేది కాదు. ఆ కాలంలో తండ్రి అంటె అంతే! పిల్లల్ని ఎత్తుకోవటం, గారాబం చేయటం వుండేది కాదు.

వెంకటాద్రి పేటలో వున్నప్పుడు నన్ను ఒక పంతులు పెట్టిన వీధి బడిలో మా అమ్మ చేర్పించింది. అక్కడ నేను గుణింతం, ఎక్కాలు, కూడికలు, తీసివేతలు నేర్చుకున్నాను ఆ రెండేండ్లు కాలంలో.

నల్లగొండ జిల్లా కొంత శాంతించిం తర్వాత మేము ఆకారం పోకుండా నల్లగొండలోనే కిరాయి ఇంట్లోకి చేరాం. ఊరికి పోయి వుండలేము. ఇంకోటి– అప్పుడే అందరికి పిల్లలకు చదువు చెప్పించాలని స్పృహ కలిగింది. ముఖ్యంగా మగ పిల్లలకు

సరే, ఆడపిల్లలు పెండ్లి అయ్యేంతవరకు ఇంట్లో ఏం చేస్తారు? అని బడిలో చేర్పించటం జరిగేది. అప్పుడు నన్ను నల్లగొండలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నాల్గవ తరగతిలో చేర్పించారు. నేను ఎనిమిదో క్లాసుకు వచ్చినప్పుడు మా స్కూలుకు 'మృగశిర' అనే ఆవిడ హెడ్ మిస్ట్రెస్‌గా వచ్చింది. లెక్కలు, సైన్స్‌కు కొత్త టీచర్లు ఆంధ్రానుంచి వచ్చారు. వాళ్ళు బాగా పాఠాలు చెప్పేవాళ్ళు. ముఖ్యంగా మా స్కూలుకు వచ్చిన వాళ్ళంతా మంచి టీచర్లు. మృగశిర మ్యాడమ్ వాళ్ళ అక్క చెల్లెళ్ళకు అందరికి ఆరుద్ర, పునర్వసు అని నక్షత్రాల పేర్లేనట. వాళ్ళు ఆరుగురు అక్కా చెల్లెండ్లు. అందరు విద్యా సేవలోనే వున్నారట. మృగశిర టీచరు స్కూలు అభివృద్ధికి చాల శ్రద్ధ తీసుకునేది. మాకు హోమ్ సైన్స్, కుట్లు, తోటపని, డ్రాయింగ్ వంటి కొత్త విషయాలు ప్రవేశపెట్టి నూతనోత్సాహం కలిగించటమే కాక, ఎన్నో చోట్లకు విహార యాత్రలకు తీసుకపోయేది. అట్లా మేము పదో క్లాసులో వున్నప్పుడు నాగార్జున సాగరం సందర్శించాం. ఆ యాత్రను నేను చిన్న వ్యాసంగా వ్రాసి ఆంధ్రప్రభ ప్రమదావనం మాలతీ చందూర్‌కు పంపించాను. అది ప్రమదావనంలో అచ్చయింది. ఇక నా ఆనందానికి అవధుల్లేవు. మృగశిర టీచరు లైబ్రరీ కోసం చాలా పుస్తకాలు కొన్నది. వాటినన్నిటిని మాతో సర్దించి మమ్మల్నే రిజిస్టరులో పేరు ఎక్కించమనేది. వాడేవీడు, నేనే, మొగలాయి దర్బారు వంటి పుస్తకాలే కాక, ప్రేమ్‌చంద్, శరత్ చంద్ర, టాగూరు కథల నవలలు అనువాద గ్రంథాలు జరుపడే విశ్వనాథ నవలలు వుండేవి. ఆ పుస్తకాలను తాకడం ఒక అనుభూతిగా వుండేది. వాటిని శ్రద్ధగా అమర్చేవాళ్ళం. నాకయితే మరీ అందంతా ఒక గొప్ప అనుభూతిగా వుండేది. ఆ పుస్తకాలను ఆ చిన్ని వయస్సులో చదివాను కూడా. అట్లా నాకు సాహిత్యం, కథలు నవలలతో పరిచయం ఏర్పడింది. వాటిని చదవటం నాకిష్టం అని తెలుసుకున్నాను. మా ఇంట్లో నేనెప్పుడు పుస్తకాన్ని చూసి ఎరుగను. మా క్లాసు పుస్తకాలు తప్ప వేరే పుస్తకాలు ఎప్పుడూ నేను చూడలేదు. చేతిలోకి తీసుకోలేదు. లైబ్రరీకి మృగశిర టీచరు తెప్పించిన పుస్తకాలను ఆసక్తిగా చదివేదాన్ని. ఆ వయస్సులో కొంత అర్థమయ్యేది; కొంత అయ్యేది అయితే ఆ పుస్తకాలను మళ్ళీ చదివినప్పుడు అర్థం చేసుకున్నాను. ఇక వాడేవీడు, నేనే, మొగలాయి దర్బారు చదవి భయపడే దాన్ని- కాని ఆసక్తిగా చదివాను.

టెన్త్ పరీక్షలు మా స్కూల్లో నుంచి పది మందిమి వ్రాసాం. అయితే రిజల్టు వచ్చినప్పుడు పది మందిలో నేనొక్కదాన్నే సెకండు క్లాసులో పాసయ్యాను. ఎట్లా పాసయ్యానో నాకే తెలియదు. పరీక్షలంటె ఏమిటో, దాని సీరియస్ నెస్ ఏమిటో తెలియదు.

ఇంట్లో నన్ను చదువు కొమ్మని చెప్పేవాళ్ళెవరూ లేరు. మా అమ్మగాని, బాపుగాని, ఎవరూ గాని చదువుకో అనే వాళ్ళు కాదు. పరీక్షలొస్తున్నాయి. చదువుకో అని గట్టిగా ఎన్నడూ ఎవరూ అనలేదు. ఆఖరికి బి.ఏ., ఎమ్.ఏ పెండ్లి అయిపోయింతర్వాత చదివాను. అప్పుడు నా భర్తకూడా పరీక్షలు కదా చదువుకో అని అనలేదు. పరీక్షలు అని భయంతో ఎప్పుడూ నేను పడి పడి చదువకపోయేదాన్ని. అంతే ఏదో పరీక్ష హాలుకు పోయి పరీక్షలు వ్రాసేదాన్ని. పాసయ్యేదాన్ని. ఎమ్ఏలో మాత్రం ఫస్టియర్‌లో 60% మార్కులు వచ్చాయి. కాని రెండు సంవత్సరంలో సాహిత్య విమర్శలో మార్కులు కొద్దిగా తగ్గినయి-అఖిజీ దివాకర్ల వేంకటావధాని గారి పేపరు. అందకని ఫైనల్లో నాకు 59.6% మార్పులు వచ్చి ఫస్టుక్లాసు పోయింది. అయినా దివాకర్ల వేంకటావధానిగారు చాల శిష్యవాత్సల్యం చూపేవారు. ఎవరు పోయి మాట్లాడినా చాలా గౌరవంగా మాట్లాడేవారు. నేను 1972లో 'నాటక లక్షణములు" పుస్తకం అచ్చువేసినాం. వేంకటావధాని గారు చాల చక్కని ముందుమాట వ్రాసి యిచ్చారు.

నాకు బి.ఏ. మొదటి సంవత్సరం పరీక్షలు వ్రాసినంక సెలవుల్లో గోపాలరెడ్డితో వివాహం జరిగింది. అప్పుడు నాకు 17,18 సంవత్సరాలు. అప్పటికే మా అమ్మ నాకు పెండ్లి కాలేదని ఆరాట పడుతున్నది. చింతే పెట్టకున్నది. ఏ సంబంధం వచ్చినా వ్యవసాయం చేసేవాళ్ళ సంబంధం నాకు వస్తున్నది. నాకేమో చదువు కోవాలని వుండేది. ఇంతలో మా పెద్ద మేనమామ గోపాలరెడ్డి సంబంధం తెచ్చాడు. ఎమ్.ఏ సంస్కృతం చదివాడు. ఉద్యోగం లేదు. ఎమ్.ఏ అంటే ఏమిటో ఎవరికి అప్పటి మా వాళ్ళకు తెలియదు. పెండ్లి కొడుకుగా డాక్టర్లు మాత్రం తెలుసు. డాక్టర్లకు ఎక్కువ కట్నం ఇయ్యాలె. అంతడబ్బు మా బాపు దగ్గరలేదు. సరే! ఏమ్.ఏ అయినా ఫర్వాలేదు. గాని సంస్కృతమంటె బాపనోళ్ళ చదువు! మంత్రాలు చదవటం కద!- అని అందరికి బంధువుల్లో సందేహాలు. ముక్కు విరుపులు మూతివిరరుపులు. ఇక చదువుకున్న సంబంధం వచ్చించి కద; నేను ముందు ముందు చదువుకునే అవకాశముంటుందని నేను ఈ సంబంధమే చేసుకుంటానని నోరు తెరిచి అన్నాను. గోపాలరెడ్డి తండ్రిగారు కొండల్‌రెడ్డిగారు కూడా మాతో వియ్యమందాలని ఆసక్తి చూపారు. ఆయన ఆర్యసమాజం స్వీకరించాడు. ఆ ఆదర్శంతో నన్ను కట్నం లేకుండా కోడలిగా చేసుకుంటానన్నారు. దాంతో అందరూ బాపు ఆర్థిక పరిస్థితి తెలిసిన వాళ్ళు 'బాగానే వుంది. ఈ సంబంధానికి ఒప్పుకొ'మ్మన్నారు. ఆర్య సమాజం పద్ధతిలో మా వివాహం జరిగింది.

తర్వాత నేను బి.ఏ., ఎమ్.ఏలు చదివాను. ఎమ్.ఏ. ఫలితాలు వచ్చాయి. నేను తల్లినయ్యాను. మా అమ్మాయి వాసవిక పుట్టింది. ఆమె పుట్టిన పది నెలలకే మా మామగారు కొండలరెడ్డిగారు మరణించటంతో మేము పొత్కెపల్లి మా అత్తవారి ఊరిలో సంవత్సరకాలం వుండి పోవలసి వచ్చింది. ఆ సంవత్సరంలో నా కొడుకు ఉదయన పుట్టాడు. ఉదయనకి యేడాది పూర్తికాలేదు; నా భర్త గోపాలరెడ్డికి జర్మనీకి పోయి జర్మన్ భాషలో ఎమ్. ఏ చేసేందుకు స్కాలర్‌షిప్ వచ్చింది. ఆయన జర్మనీ వెళ్ళిపోయాడు. అప్పుడు నేను ఇద్దరు పిల్లలతో యూనివర్సిటీ క్వార్టర్స్‌లో ఇంట్లో వుండేదాన్ని. నాతోపాటు నా చెల్లెండ్లు, తమ్ముండ్లు వుండేవాళ్ళు. అప్పుడు నేను ఆర్థికంగా సపోర్టు కావాలని నృపతుంగ మల్టీ పర్పస్ స్కూలులో టీచరుగా ఒక అకడమిక్ సంవత్సరం పని చేసాను. అప్పుడు ఆ స్కూలు చాల మంచి స్కూళ్ళలో ఒకటిగా పరిగణింపబడేది. మంచి విద్యార్థులు చేరే వాళ్ళు. అప్పుడే మొదటి సారి ఎమ్. ఏ తర్వాత మళ్ళీ సాహిత్యం చదవటం, టీచ్ చేయటం చేసాను. లేకపోతే 1963లో ఎమ్. ఏ పాసయింతర్వాత 2,3 యేండ్లు తెలుగు సాహిత్య పుస్తకమే పట్టుకో లేదు. కాని ఈ కాలంలో నేను హిందీలో ప్రేమ్‌చంద్, శరత్ చంద్ర – ఇంకా హిందీ రచయితల కథలు నవలలు చదివాను. నాకు చతుర్‌సేన్ శాస్త్రి కథలు నవలలు చాల నచ్చేయి. ఆయన వ్రాసిన "గోలీ", "వయం రక్షామః" నవలలు చాలు మంచి నవలలు. 'గోలీ' అంటె తెలంగాణలో 'ఆడబాప' లంటారు. రాజస్థాన్ ఆడబాపను గోలీ అంటారు. వాళ్ళ వృత్తాంతం రామాయణ కథను తీసుకొని రావణాసురుని నాయకునిగా చేసి చతురసేన శాస్త్రి "వయం రక్షామః" నవల వ్రాసాడు. చాల బాగుంది.

తర్వాత 1966 మేలో నేను కూడా మా అమ్మాయి వాసవికను తీసుకొని నా భర్త గోపాలరెడ్డి దగ్గరికి పశ్చిమ జర్మనీ వెళ్ళాను. మా కొడుకును మా అమ్మ దగ్గరే వదిలి పెట్టాను. ఇద్దరు పిల్లలతో కష్టమవుతుందని అట్లా చేయవలసి వచ్చింది.

జర్మనీలో ఎమ్.ఏ అయింతర్వాత గోపాలరెడ్డి ట్యుబింగెన్ విశ్వవిద్యాలయంలో ఇండాలజీశాఖలో హిందీ సంస్కృత భాషలు నేర్పేందుకు లెక్చరరుగా చేరారు. అయితే పార్ట్‌టైం కాబట్టి వాళ్ళు ఇచ్చేజీతం తక్కువ. అందులో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇండాలజీ వంటి శాఖలకు ఫండ్స్ చాల తక్కువయ్యాయి. అప్పుడు ఇండాలజీ శాఖకు ఆచార్య పౌల్‌థీమ్ అధ్యక్షుడుగా వున్నాడు. పౌల్‌థీమ్ మాక్స్ ముల్లర్, అవుఫ్‌రెస్టు, ఓల్డెన్ బెర్స్ రోడ్ వెంటి ఇండాలజీ పండితుల సరసన నిలువదగిన పండితుడు. ఆయన 1940 దశకారంభంలో బెనారస్ వచ్చి సంప్రదాయ పండితుల దగ్గర పాణిని వ్యాకరణాన్ని

చదువుకున్నాడు. ఎన్నో వ్యాకరణ సంబంధమైన పరిశోధన గ్రంథాలను పత్రాలను జర్మన్ భాషలో ప్రచురించాడు. గోపాలరెడ్డితో ఆయన సంస్కృతభాషలో సంభాషించేవాడు. అటువంటి గొప్పపండితుడు ఇండాలజీశాఖ అధ్యక్షుడు. గోపాలరెడ్డి జీతం ఆయన కుటుంబానికి సరిపోదని ఆలోచించి నన్ను లైబ్రరీలో ఉద్యోగం చేస్తావా అని అడిగి, నేను తెలుగు సాహిత్యంలో ఎమ్.ఏ చేసానని కొద్దోగొప్పో ఇంగ్లీషు వచ్చునని అడిగి తెలుసుకున్నాడు. ఒకరోజు ఆయన తన వెంట కాలి నడకన (ఇండాలజీశాఖ బిల్డింగ్ పక్కన విశ్వవిద్యాలయం లైబ్రరీ బిల్డింగ్ వున్నది.) విశ్వవిద్యాలయం లైబ్రరీలో ఓరియంటల్ శాఖ డైరెక్టరు డా. క్యుమ్మరర్ దగ్గరకు తీసుకుపోయి నన్ను పరిచయం చేసాడు. అంతకు ముందే పొలీథిమే నా విషయం గురించి డైరక్టరుతో ఫోనులో మాట్లాడవుంటాడు. డా. క్యూమ్మర్‌రు వెంటనే నన్ను ఉద్యోగంలో తీసుకోవటానికి అంగీకరించాడు. నా పనిని గురించి ఆయన వివరిస్తూ "నీకు రంగనాథ్య గ్రేట్ లైబ్రేరియన్ ఇండియన్ తెలుసుననుకుంటాను" అని మొదలు పెట్టాడు. రంగనాథన్ పేరు నేనెన్నడు ఇండియాలో వినలేదు. అందులో నా విషయం లైబ్రరీసైన్స్ కాదు గద! నిశ్శబ్దంగా డా॥క్యుమ్మెరర్ వైపు చూసాను. లోపల గుండె దడదడ మంటుంది. మొఖం కూడా పాలిపోయి వుంటుంది. ఎందుకంటె ఆ తర్వాత ఆయన ఏమంటాడో అని భయం. ఆయన నాకోసం ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నాడు. సామాన్యంగా జర్మనీ దేశంలో ఇంగ్లీషు చాలా తక్కువ మందికి వచ్చు. వాళ్ళ ఇంగ్లీషు నేర్చుకోరు. మేము– అక్కడున్న భారతీయులం– వేరు వేరు భాషలవాళ్ళం పరస్పరం కలుసుకున్నప్పుడు ఇంగ్లీషులో మాట్లాడుతుంటె "ఏమిటి? మీకు ఇండియన్ భాష ఒకటి లేద?"– అని విచిత్రంగా చూసేవాళ్ళు. జర్మన్స్‌కు ఇంగ్లీషు అంటె నచ్చదు– కొన్ని చారిత్రక కారణాలవల్ల. సరే! నాగుండె ఇంకా శ్రుతి తప్పకముందే నా అజ్ఞానం బయట పడక ముందే డా. క్యుమ్మెరర్ "రంగనాథ్య సబ్జెక్ట్స్ క్యాటలాగు పద్ధతిని మేము ఇప్పుడు అనుసరిస్తున్నాం. కాబట్టి మేము కొంటున్న కొన్న సంస్కృత గ్రంథాలను ఒక్కొక్కటి పరిశీలించి ఆ గ్రంథం ఏ విషయానికి సంబంధించిందో చిన్న నోట్స్ వ్రాసి పుస్తకంలో పెట్టాలె. తర్వాత దాన్ని బట్టి మేము నెంబరింగు చేస్తాం" అన్నాడు. నేను లోలోపల నిట్టూర్చాను. పనిలో చేరాను. విచిత్రమేమంటె ఆచార్య గోపాలరెడ్డి కన్న నా జీతం ఎక్కువ వుండేది.

పని చేసే చోట టేబిల్‌కు కుడి పక్క ఈజిప్టోలజీ గ్రంథాలను పరిశీలించే మిస్టర్ రామకరన్ కూర్చునేవాడు. ఎడమ పక్క "ఇరానోలజ్" పర్షియన్ పుస్తకాలను పరిశీలించే

జర్మన్ యువతి ఫ్రౌలైన్ ఫ్లయిన్ కూర్చునేది. అప్పుడప్పుడు మాత్రమే వేం మాట్లాడుకునేవాళ్ళం. ఎక్కువ సమయం పని! పని! జర్మన్లకు పని తప్ప వేరే ఏదీ పవిత్రం కాదు. రెండో ప్రపంచ యుద్ధం వినాశం నుంచి అంత తొందరగా జర్మనీ అభివృద్ధి చెందిందంటె వాళ్ళకు పని అంటె వున్న ఆరాధనే కారణం!

రిజ్వ్యా ఈజిప్టోలజీలో పిహెచ్‌డి చేస్తున్నాడు. ఆయన ఈజిప్టు దేశీయుడు. కాని అరబ్ జాతి చెందినవాడు కాక, ప్రాచీన ఈజిప్టు నాగరికతను రచించిన "కోప్ట్" జాతికి చెందినవాడు. ఇప్పుడు కోప్ట్‌లంతా క్రిస్టియన్లు అయ్యారు. వాళ్ళ 'కోప్ట్' భాష ఆధారంగానే ఆర్కియాజిస్టులు ప్రాచీన ఈజిప్టు వ్రాతలను చదువగలిగారు. అదే మన దేశంలో ఇంకా సింధు నాగరికతలో దొరికిన సీళ్ళ మీద చిత్రలిపిని ఏ భాషనో తెలియక చదువలేకపోతున్నాం. మకరన్ నుంచి ఈజిప్టు నాగరికత గురించి, స్టయిన్ నుంచి ఇరాన్ నాగరికత గురించి చాల తెలుసుకున్నాను. తర్వాత నేను ఈజిప్టును సందర్శించాను. ఆ యాత్రను వర్ణిస్తూ "నైలునదీ నాగరికత" అనే పుస్తకాన్ని ప్రచురించాను.

నేను టుబింగెన్ విశ్వ విద్యాలయం లైబ్రరీలో పని చేసేప్పుడు ఎన్నో సంస్కృత గ్రంథాలను, కవుల చరిత్రను, కావ్య విమర్శలను, దేశ విదేశీయులు రచించిన గ్రంథాలను, పరిశీలించే అవకాశం దొరికింది. అట్లా చదువుతున్నప్పుడు నాకున్న చరిత్ర జ్ఞానంతో ఎన్నో కొత్త ఆలోచనలు కలిగాయి. దాన్నంతా తెలుగులో చెప్పాలె; తెలుగు పాఠకులకు తెలియజేయవలె అనే ఆలోచన నాకు కలిగి ఎంతో నోట్స్ తయారు చేసాను. 1969లో ఇండియా వచ్చింతర్వాత నేను 1970లో రెడ్డి కాలేజ్‌లో లెక్చరరుగా చేరే అవకాశం అనుకోకుండా లభించింది. లెక్చరరుగా చేరింతర్వాత పిహెచ్.డిలో చేరాను. అప్పుడు హెడ్‌గా వున్న దివాకర్ల వెంకటవధాని గారు నాకు "మను వసు చరిత్రల తులనాత్మక పరిశీలనము" విషయాన్ని పరిశోధనకు ఇచ్చారు. ఆ విషయాన్ని చదువుతూ చదువుతూ వుంటె ఆ విషయంలో నాకెంతో ఆసక్తి కలిగింది. ఒక వైపు పిహెచ్.డి చేస్తూ ఇంకోవైపు నేను "సంస్కృత సాహిత్య చరిత్ర" వ్రాయటానికి పూనుకున్నాను. మళ్ళీ ఎన్నో పుస్తకాలు లైబ్రరీ నుంచి తెచ్చుకోవలసి వచ్చింది. గోపాలరెడ్డికి సంస్కృత సాహిత్య గ్రంథాల పరిచయం ఎంతగానో వుంది. ఆయన ధారణాశక్తి గొప్పది. గురుకులంలో శ్రుతిరూపంగా వేదాలు చదువుకోవటం వలను యేమో, ఆయనకు ఏక సంథా గ్రాహిత్యం ఏర్పడిం దనుకునేదాన్ని. ఒక్కసారి శ్లోకం, మంత్రం ఏది చదివినా ఆయన నోటికి వచ్చేసేది. అట్లా ఆయన ఇంట్లో ఎప్పుడూ సంస్కృత శ్లోకాలను, వేద మంత్రాలను, చంపూభారతం, నల చంపువు,

కాదంబరి వంటి కావ్యాల నుంచి గద్య భాగాలను చదువుతూ వుండేవారు. అట్లా చదువుతుంటె నాకెంతో సంస్కృత సాహిత్య పరిచయం కల్గింది. ఆ విధంగా గోపాలరెడ్డి సంస్కృత సాహిత్య పాండిత్యం, నాకున్న చరిత్ర పరిచయంతో నేను జర్మనీలో తయారు చేసిన నోట్స్ సహాయంతో దాదాపు 1000 పేజీలున్న "సంస్కృత సాహిత్య చరిత్ర"ను మేమిద్దరం కలిసె రచించింది. అది వ్రాయటానికి దాదాపు పదేండ్లు పట్టింది. ఇంకోవైపు నేను పి. హెచ్‌డి సిద్ధాంత గ్రంథం పూర్తి చేసి, 1976లో పి. హెచ్‌డి డిగ్రీని పొందాను. సంస్కృత సాహిత్య చరిత్ర 1986లో తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించారు. అది 6,7 ముద్రణలను పొంది చాల ప్రాచుర్యం పొందింది. ఎక్కడికి పోయినా ఎవరైనా ఆ పుస్తకం చదివాము చాల బాగుంది అని చెప్తుంటారు.

ఇక నా తెలుగు సాహిత్య కృషిని గురించి చెప్పాలంటె 1976 "నాటక లక్షణములు" అనే చిన్న పుస్తకాన్ని విద్యార్థుల ఉపయోగం కోసం ప్రచురించాను. రచయితగా ఆ పుస్తకంలో "యమ్. సుజాత రెడ్డి" అని వ్రాసాను. అది చూసి ఇరివెంటి కృష్ణమూర్తి గారు తెలుగులో ఆదిలో 'య' వుండకూడదని అన్నారు. నేనేమో ఇంగ్లీషు ఉచ్చారణకు దగ్గరగా వుండాలని ఆ విధంగా వ్రాసాను. అప్పుడు గోపాలరెడ్డి ఎందుకిదంతా 'ముదిగంటి' అని వ్రాయమన్నారు. అప్పట్నుంచి నేను "ముదిగంటి సుజాతరెడ్డి" అని "నా పేరును వ్రాయటం ఆరంభించాను. ఆ తర్వాత 1981లో నేను నా సిద్ధాంత వ్యాసం "మను వసు చరిత్రల తులనాత్మక పరిశీలనము" ప్రచురించాను. అదే సంవత్సరం– నేను యమ్.ఏ.లో వున్నప్పట్నుంచి శ్రీనాథుని గురించి వ్రాస్తున్న విమర్శ వ్యాసాలను "శ్రీనాథుని కవితా సౌందర్యం" పేరుతో ప్రచురించాను. నేను ఎమ్.ఏలో వున్నప్పుడు కాలేజి మ్యాగజైన్‌కు "శృంగార నైషధం" పై ఒక విమర్శ వ్యాసం వ్రాసాను. ఆ వ్యాసాన్ని నా క్లాసుమేటు అయిన డా. ముదిగొండ వీరభద్రయ్య చదివి "ఈ వ్యాసం మీరు వ్రాయ లేదండి" అని సవాలు విసిరినట్లుగా అన్నాడు. నాకేం చెప్పాలో తెలియలేదు. నవ్వి "నేనే వ్రాసాను. ఎందుకు ముఖం చూస్తే నేను వ్రాస్తానని ఎందుకనకోరు ఎవరు" అని అడిగాను. ఎవ్వరేమన్నా నేను వ్రాస్తూనే వున్నాను. నాలో కలిగిన భావాలను వ్రాయాలని అనిపిస్తుంది. వ్రాయలేకుండా వుండలేను. నేను చిన్నప్పట్నుంచి తక్కువ మాట్లాడేదాన్ని. అందుకే మా బంధువుల్లో అనేవారు– "సుజాత మాట్లాడదు వ్రాస్తుంది" అని. చిన్నప్పట్నుంచి స్కూలులో వున్నప్పట్నుంచి కూడా చదవటం, వ్రాయటం నాకిష్టం. చిన్నప్పుడు చందమామ చాల ఇష్టంగా చదివేదాన్ని. నా దగ్గర ఏ కొద్దిగా డబ్బు వున్నా చందమామ కొనుక్కొని చదివేదాన్ని.

ఒకొొక్కసారి కథలు వ్రాసి చందమామకు పంపేదాన్ని కాని అవి ఎప్పుడూ అచ్చు కాలేదు. స్కూలు, కాలేజీ మ్యాగజెన్‌లకు వ్రాసేదాన్ని. కోఠి వుమెన్స్ కాలేజీలో బి.ఏ రెండో సంవత్సరంలో వున్నప్పుడు శ్రీశ్రీ "మహాప్రస్థానం" చదివి ఆ ఊపులో లయలో శ్రీశ్రీ మీద ఒక వచన కవిత వ్రాసాను. దాని కాలేజి మ్యాగజైన్‌కు ఇచ్చాను. ఆ కవితకు మ్యాగజైన్‌లో "బెస్ట్ ఆర్టికల్"– ఉత్తమ రచనగా బహుమానం వచ్చింది. బహుమానంగా నాకు "మను చరిత్ర" కావ్యం ఇచ్చారు. దాని మీదనే తర్వాత పి.హెచ్‌డి చేసాను.

ఆ తర్వాత నేను 1986 నుంచి నవలలు, కథలు, సృజనాత్మక రచనలు చేయటం ఆరంభించాను. చిన్నప్పుడు పియుసి చదివేప్పుడు 2,3 కథలు వ్రాసి గోలకొండ పత్రికకు పంపిస్తే అచ్చయ్యాయి. కాలేజి మ్యాగజైన్‌లో "లావణ్య" అనే కథను వ్రాసాను. తర్వాత విమర్శ వ్యాసాలే వ్రాసాను. కాని కథలు వ్రాయలేదు. 1986నుంచే కథలు, నవలలు వ్రాసాను. రెండు నవలలు "మలుపు తిరిగిన రథ చక్రాలు, తెగిన సంకెళ్ళు" ప్రచురించాను. "మలుపు తిరిగిన రథ చక్రాలు" ఒకటి రెండు పత్రికలకు ఇచ్చాను కాని ఎవరూ అచ్చువేయలేదు. తిరిగి ఇచ్చేసారు. అది తెలంగాణ పోరాటాన్ని చిత్రించేది కాబట్టి దాశరథి రంగాచార్యులు గారికి చూపించాను. ఆయన ఈ నవలను మీరే డైరెక్టరుగా ప్రచురించండి అన్నారు. అదే విధంగా డైరెక్టుగా రెండు నవలలను ఒకే సంవత్సరంలో ప్రచురించాను. రివ్యూలకు పంపాను. రివ్యూలో మాత్రం మంచి రివ్యూలు వచ్చాయి. నాకు ఎప్పటి నుంచో నా అనుభవాలు, నేను చూసిన దృశ్యాలను చిత్రిస్తూ తెలంగాణ పోరాటం ఇతివృత్తంగా వున్న నవల వ్రాయాలని తపన వుండేది. "టేల్ ఆఫ్ టు సిటీస్" నవల "డాజివాగో" సినిమా చదవటం, చూడటం ఆ కోరిక బలంగా ఏర్పడింది. "మలుపు తిరిగిన రథ చక్రాలు" నవలను వ్రాసాను. విప్లవ నవలలో ప్రేమ వుండటం, విప్లవవీరుడు ప్రజాస్వామ్యాన్ని కోరుకుని జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లుగా వ్రాయటం కొందరికి నచ్చలేదు. జీవితంలో ప్రేమ ఒక భాగం. పై రెండు నవలల్లో ప్రేమ వృత్తాంతం వుంది. గొప్ప నవలలుగా పేరు పొందాయి. కాబట్టి ప్రేమ వృత్తాంతం వుండ కూడదనటంలో ఔచిత్యం లేదు. అందులో ఆ ప్రేమ వృత్తాంతం ప్రతీకాత్మకంగా వుంది. ఇక సంకెళ్ళు తెగాయి– నాకు తెలసిన మంగలి కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకోని వ్రాసాను. నాది మూడో నవల– "ఆకాశంలో విభజన రేఖల్లేవు". స్త్రీ వాదంలో వచ్చే అతివాద ధోరణులను, పురుష ద్వేషాన్ని విమర్శిస్తూ ఈ నవలను వ్రాసాను. పాశ్చాత్య దేశాల్లో స్త్రీ స్వేచ్ఛకు సమలింగ సంపర్కం ఒక మార్గమని కూడా చెప్పిన గుంపు వుంది. దాన్ని విమర్శిస్తూ

మంచి చెడు అనేది స్త్రీలల్లో, పురుషులల్లో వుంటుందని చెప్తూ వ్రాసాను. ఈ నవలకు ప్రతి స్పందన, ఖండనమండనాలు– రెండూ వచ్చాయి.

నేను కథలు వ్రాసి పత్రికలకు పంపాను. కాని అచ్చు కాలేదు. ఒకటి రెండు కథలు అన్ని పత్రికల్లో అచ్చయ్యాయి. కథలను కూడా "విసుర్రాయి" పేరుతో 1998లో డైరక్టుగా పుస్తకంగా ప్రచురించాను. ఈ కథలకు చాలా ప్రశంసలతో పాటు అవార్డులు కూడా వచ్చాయి. "విసుర్రాయి" కథలన్నీ స్త్రీల సమస్యలను గురించి వ్రాసినవి. ఈ కథలతో నాకు కథా రచయిత్రిగా పేరు వచ్చింది. ఈ కథా సంపుటికి విశాఖపట్నం నుంచి జ్యేష్ఠ లిటరరీ అవార్డు, జగిత్యాల నుంచి విశాల సాహిత్య పురస్కారం లభించాయి. నేను ఏమీ ప్రచురించక ముందే నా నవల వ్రాతప్రతిని పరిశీలించి దాశరథి రంగాచార్య తమ భార్య పేరు మీద దాశరథి కమలమ్మ సాహితీ పురస్కారం ఇచ్చారు. ఆ తర్వాత "మింగుతున్నపట్నం" అచ్చు వేసాను. ఇందులో ఎక్కువ రియల్ ఎస్టేట్ వ్యాపారం, ప్రభుత్వం భూ సేకరణ కథలున్నాయి. "వ్యాపార మృగం" నా మూడో కథల సంపుటి. ప్రపంచీకరణం నేపథ్యంలో మానవ సమాజంలో ప్రతీ వ్యాపారం లాభనష్టాలుగా మారటం, మావన సంబంధాల్లో పరిణామం గురించి కథలున్నాయి. ఈ కథల సంపుటికి కరీంనగర్ వారి "రంగినేని సాహితీ పురస్కారం" లభించింది. నా నాలుగో కథల సంపుటి "మరో మార్క్ పుట్టాలె" విశాలాంధ్ర పబ్లిషింగు హౌస్ వారు ప్రచురించారు. దీన్ని నేనొక గౌరవంగా భావించాను. దీనిలో సాఫ్ట్ వేరు రంగంలో జీవన విధానాన్ని గురించి కథలు వ్రాసాను.

నా కథల్లో చాలా వాటిలో గ్రామీణ నేపథ్యం వుంటుంది. నేను స్కూలులో చదువు కున్నప్పుడు సెలవుల్లో గ్రామానికి పోవటం, మధ్యలో ఎమ్.ఏ అయినాక 1964–66ల్లో మా మామగారు కొండల్ రెడ్డి చనిపోయాక మా అత్తవారి ఊరు పొత్కపల్లి (కరీంనగర్ జిల్లా)లో వుండటం జరిగింది. అదే విధంగా జర్మనీ నుంచి వచ్చిం తర్వాత 1969–70లో విశ్వవిద్యాలయం తెలంగాణ పోరాటం కారణంగా మూతపడటంతో పోయి పొత్కపల్లిలో వుండటం జరిగింది. ఆ విధంగా నాకు గ్రామీణ జీవితంతో పుట్టుక నుంచే కాక ఆ తర్వాత కాలంలోనూ అనుబంధం, దగ్గరి పరిచయం వుంది కాబట్టి, గ్రామీణ నేపథ్యంలోని పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు నాకథల్లో చాలా కన్పిస్తాయి. అదే విధంగా ఎన్. ఆర్. ఐ.ల జీవితాలను చెప్పే కథలు కూడా వున్నాయి. నగర జీవితాన్ని చిత్రించే కథలు, నగరీకరణం జరగటం, మానవ జీవితాల్లో మార్పులు, పల్లెలు మునుపటి పల్లెల్లాగా లేకపోవటం మొదలైన వాటిని చిత్రిస్తూ కథలు వ్రాసాను. సమాజ పరిణామం,

మానవ జీవితాల స్వభావాల పరివర్తనం నా కథల్లో ఎక్కువగా కన్పిస్తుంది.

తెలంగాణా నుంచి కథలు రాలేదని, 1970ల్లోనే తెలంగాణ కథ పుట్టిందనటం చదివి, నేను తెలంగాణ తొలితరం కథలను తవ్వి తీసి రెండు సంపుటాలుగా ప్రచురించాను. తెలంగాణ కథ తెలుగులో మొదటి కథ గురజాడ "దిద్దుబాటు" పుట్టిన నాడే పుట్టిందని నిరూపిస్తూ ఈ సంపుటాలు ప్రచురించాను. వీటితో తెలంగాణ కథ ప్రాచీనతకు గుర్తింపు వచ్చింది. అంతేగాక తెలంగాణ పెరిగిన ఆడపడచు భండారు అచ్చమాంబ 1898 నుంచి కథలు వ్రాసిందని, ఆమె తెలుగులో మొదటి కథ వ్రాసిందని కూడా నిరూపిస్తూ విమర్శ వ్యాసం వ్రాసాను. తెలుగు విశ్వవిద్యాలయం తరఫున "నూరేండ్ల తెలుగు కథలు" సంపుటం ప్రచురిస్తూ తెలుగులో మొదటి కథ భండారు అచ్చమాంబ కథ తీసుకొని తెలుగు కథకు 2010లో నూరు కాదు నూటపది సంవత్సరాలు నిండాయని వ్రాసాను. వట్టికోట ఆళ్వారు స్వామి కథలో "జైలు లోపల" దొరకక పోవటంతో ఆ కథల సంపుటిని విమర్శనాత్మకమైన ముందు మాటతో ప్రచురించాను.

"తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదం"కు సంబంధించి విమర్శ వ్యాసాలను సేకరించి నా సంపాదకత్వంలో ప్రచురించాను. "ముద్దెర' అనే ఆ విమర్శ గ్రంథంలో నా వ్యాసాలు కూడా వున్నాయి.

2010లో 'రసచర్చ ఆధునికత, ముసురు" అనే పుస్తకాలను అచ్చు వేసాను. రసచర్చ ఆధునికతలో రస సిద్ధాంతాన్ని నవల ప్రక్రియకు అన్వయింపజేస్తూ కొత్తకోణంలో వ్రాసాను. "ముసురు" నా ఆత్మకథ. తెలుగులో స్త్రీలు ఆత్మ కథలను అరుదుగానే వ్రాసారు. అటువంటప్పుడు ఈ ఆత్మకథకు ఒక మంచి గుర్తింపు వచ్చింది.

నేను "సంస్కృత సాహిత్య చరిత్ర"నే కాక, తెలుగు సాహిత్య చరిత్రను "చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర" పేరుతో వ్రాసాను. తెలుగు కవుల కావ్య రచనల వెనుకున్న చారిత్రక సామాజిక నేపథ్యాన్ని చర్చించాను. ఇంతకు ముందున్న సాహిత్య చరిత్రలకు అనుకరణగా కాకుండా భిన్నంగా వుండాలనే ఉద్దేశంతో సాహిత్య ఉద్యమాలకు, వాటి నేపథ్యానికి, వాదాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ ఈ తెలుగు సాహిత్య చరిత్రను రచించాను.



ఆచార్య ఎస్వీ రామారావు

నేను పరిణతుడిని కాకపోవచ్చు కాని నా జ్ఞాపకాలు మాత్రం పరిణతమైనవని చెప్పగలను. 1941 జూన్ 6వ తేదీన (విషునామ సం॥ జ్యేష్ఠ శు॥ దశమి, గురువారం) స్వాతంత్ర్యం రావటానికి ఆరు సంవత్సరాలు ముందు నేను జన్మించాను. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు ప్రైమరీ స్కూలు విద్యార్థిగా జండా పట్టుకుని ఆ సంబరాల్లో పాల్గొన్నాను. ఆ మరుసటి సంవత్సరమే జాతిపిత మహాత్మాగాంధీ అస్తమయంతో కలిగిన విషాదంలో కూడా పాలు పంచుకొన్నాను. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాదు రాష్ట్రానికి మాత్రం స్వేచ్ఛ లభించలేదు. రజాకార్లు వీధిలో కవాతు చేస్తుండగా కిటికీలో నుంచి చూసిన సన్నివేశం నాకు గుర్తుంది. 1948 పోలీసు చర్య తర్వాత మన రాష్ట్రం భారత దేశంలో విలీనమైంది. నేను మూడవతరగతిలో ఉండగా అనుకొంటాను-మా వనపర్తి హైస్కూలు హెడ్మాస్టరు వెంకటేశ్వరావు గారు మా స్కూలుకు వచ్చి ఉర్దూ మీడియం స్థానంలో తెలుగు మీడియం వచ్చినట్లుగా ప్రకటించారు. దాంతో అప్పటి వరకూ నేను నేర్చుకున్న ఉర్దూ అలీఫ్ బేలు (ఓనమాలు) మర్చిపోవటం జరిగింది. కాలేజీ చదువుకోసం హైదరాబాద్ వచ్చిన తర్వాత సినిమాల మీద ఆసక్తితో సియాసత్, మిలాప్ పత్రికలు తిరగేస్తూ (దిలీప్‌కుమార్, మీనాకుమారి మొ॥పేర్లు చదవటం ద్వారా) ఉర్దూ భాషా పరిచయం చేసుకొన్నాను. వ్రాయటం రాకపోయినా నేను ఉర్దూ ధారాళంగా మాట్లాడగలను. ఉర్దూ కవిత్వం అర్థం చేసుకోగలను. ఉర్దూ సినిమా పాటలంటే నాకెంతో ఇష్టం.

1950లో పెద్దక్కయ్య వివాహంతో మా బావగారు సంతపూరు రఘువీరరావు

బంధుత్వం గారి కలుగటంతో ఎందరో ప్రముఖులు, సాహితీ పరులతో నాకు పరిచయం ఏర్పడటం నా భాగ్య విశేషంగా భావిస్తున్నాను. ఆయన సిటీ కాలేజీలో ఇంటర్ చదువును విడిచిపెట్టి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వ్యక్తి. సోషలిష్టు పార్టీతో, సర్వోదయ, భూదానోద్యమాలతో సాన్నిహిత్యం కలవారు. ఆచార్య వినోబా భావే పాలమూరు జిల్లాకు విచ్చేసిన సందర్భంలో మా బావగారి ప్రేరణ వల్లే మా ఊరు శ్రీరంగాపురం వచ్చి మా ఆతిథ్యాన్ని అందుకొన్నారు. ఆయనకు కావలసిన పాలు మొదలైనవి తీసుకొని వెళ్లే బాలవాలంటీరుగా నేను పనిచేశాను. ఆ తర్వాత కూడా బావగారితో కలిసి వనపర్తికి వచ్చిన రాం మనోహర్ లోహియా మేముంటున్న ఇంటికి వచ్చి మా ఆతిథ్యాన్ని స్వీకరించి వెళ్ళారు.

పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ ఫలితంగా ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏర్పడి 1953లో కర్నూలు రాజధానిగా జరిగిన అవతరణోత్సవాలకు నేను ప్రత్యక్ష సాక్షిని. వనపర్తి హైస్కూలు మిత్రులతో కలిసి మాకు సమీపంలో ఉన్న కర్నూలు సభలకు వెళ్లాను. తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఉపన్యాసం, ప్రారంభంలో టంగుటూరి సూర్యకుమారి పాటను ఆలకించాను. ప్రఖ్యాత నటీనటులు ఎన్.టి.రామారావు, జి. వరలక్ష్మి లారీ ఎక్కి విరాళాలు ప్రోగు చేయటం (రాయలసీమ క్షామనిధికి) చూశాను. ఆ రాత్రి కె.బి. సుందరాంబాళ్ నటించిన తమిళ చిత్రం 'అవ్వైయార్' చూసి మరునాడు వనపర్తి తిరిగి వచ్చాం. అంతకుముందు 1952లో హైదరాబాద్ రాష్ట్రం ప్రథమ ఎన్నికలు జరిగిన సందర్భంలో సురవరం ప్రతాపరెడ్డిగారు వనపర్తి శాసన సభ్యులుగా పోటీ చేసి గెలుపొందారు. అప్పుడే వారి 'మొగలాయీ కథలు' చదవటం తటస్థించింది.

మా ఊరు:

మా ఊరు పాలమూరు (మహబూబ్‌నగర్‌కు పూర్వనామం) జిల్లా వనపర్తి తాలూకాలోని శ్రీరంగాపురం. ఇప్పుడది పెబ్బేరు (హైదరాబాద్ –కర్నూలు హైవేలోనిది) మండలంలో ఉంది. వనపర్తి రాజా 'అష్ట భాషా బహిరి' గోపాలరావు 1662లో దక్షిణ దేశ యాత్రలో శ్రీరంగం దర్శించి, వైష్ణవం స్వీకరించి 1665–70 ప్రాంతంలో శ్రీ రంగనాథాలయం నిర్మించటం వల్ల మా ఊరికి ఆ పేరు వచ్చింది. అంతకు ముందు దీనికి 'కొరివిపాడు' అనే పేరుండేదని చరిత్ర చెబుతున్నది. క్రమంగా ఆలయగోపురం, ప్రాకారం, చుట్టూ రంగ సముద్రం అని పిలువబడే పెద్ద చెఱువు, సమీపంలో ఆండాళ్‌గుడి

(చిన్నదేవళం అంటారు), కోనేరు మొదలైనవి ఏర్పడటంతో మా ఊరు అపర శ్రీరంగంగా ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రంగా రూపొందింది. కంచి మొ॥ దక్షిణ దేశ ప్రాంతాల నుంచి వచ్చిన పూజార్లు, వారు పఠించే ద్రావిడ పాశురాలు, కోవెలలో శ్రీరంగని ఉత్సవాలు, ప్రతి ఏటా జరిగే తిరునాళ్లు మొదలైనవి అచ్చంగా శ్రీకృష్ణదేవరాయల 'ఆముక్తమాల్యద'లోని వాతావరణమే ప్రతిబింబించేది. అందుకేనేమో నేను బి.ఏ.లో పాఠ్యగ్రంథంగా చదివిన ఆ దివ్య ప్రబంధం నాపై గాఢమైన ముద్రను వేసింది. పి.హెచ్‌డి. పరిశోధనకోసం నేను తంజావూరుకు వెళ్లిన సమయంలో శ్రీ విల్లిపుత్తూరు దర్శించినపుడు మా ఊరునే చూసినట్లు అనుభూతి చెందాను.

మా వంశం:

మా ఇంటి పేరు సూగూరు. అది వనపర్తి రాజాగారి తొలి రాజధాని. తర్వాత కొత్తకోట, శ్రీరంగాపురం, చివరగా వనపర్తి వారి రాజధానులుగా ఉన్నాయి. వనపర్తి రాజుల వెంట ఉన్న కరణాలు సూగూరు నామ వంశీయులై శ్రీరంగాపురం మున్నగు గ్రామాలకు తరలి రావటం చేత సూగూరు అన్న ఇంటి పేరు స్థిరపడి ఉంటుంది. పాలమూరు చరిత్ర పరిశోధకులైన కపిలవాయి లింగమూర్తిగారు మా వంశ చరిత్రను గురించి సవివరంగా ఇలా పేర్కొన్నారు.

"నేటి వనపర్తి సంస్థానం మొదట పానుగంటి సీమకు చెంది ఉండేది. ఆ సీమలోని పాతపల్లెకు కడపజిల్లాలోని వీరకృష్ణారెడ్డి అనే వీరుడు వచ్చి అక్కడి భూములు వ్యవసాయానికి తీసుకొని నివసించినాడు. అక్కడ కొంత పలుకుబడి సంపాదించుకొని అనంతరం అక్కడి నుండి సూగూరుకు వచ్చి ఈనాటి వనపర్తి సంస్థానానికి పునాది వేసినాడు. ఈతని మరణం క్రీ.శ. 1540. ఇతడు సూగూరు ప్రాంతానికి క్రీ.శ. 1510 ప్రాంతములో వచ్చివుంటాడని వనపర్తి సంస్థాన చరిత్రలో చెప్పబడింది. అప్పుడతని వెంట అతని సోదరులు, భరద్వాజ గోత్రుడైన ఒక స్మార్తుడు, గౌతమ గోత్రుడైన ఒక కరణం వచ్చినారట. వారి పేర్లు చెప్పబడలేదు కాని భువనమోహినీ విలాస కావ్యాన్ని బట్టి వీరకృష్ణారెడ్డి వెంట వచ్చినవాడు పెద్ద వెంకటాద్రి అని తెలుస్తుంది. అతడు వీరకృష్ణా రెడ్డికి మంత్రి. అతని ఇంటిపేరు పెనగలూరు. ఈ పెనగలూరును ఆరవీటి తిరుమల రాయలు క్రీ.శ. 1569 ఉదయగిరి విప్రులకు అగ్రహారంగా ఇచ్చినట్లు ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహములో చెప్పబడింది.

ఒక్క ఈ పెనగలూరి వారే గాక ఇక్కడి స్థానిక వంశ కథనాదులను బట్టి వనపర్తి వారు, సూగూరు వారు కూడా వీరకృష్ణారెడ్డి వెంట వచ్చినట్లే చెప్పుకుంటున్నారు. వీరిలో పెనగలూరు - సూగూరు వారి గోత్రం ఒకటే కాబట్టి ఈ రెండు వంశాలకు మూలపురుషుడు ఒకడే అయి ఉంటాడని అనవచ్చు. కానీ వీరి శాఖ లెప్పటి నుంచి చీలినవో తెలియదు. సూగూరు నుండి ఒకశాఖ ఎప్పుడో శ్రీరంగాపురం చేరి అప్పటి నుండి వారు సూగూరు వారైనారు అనవలసి ఉంది.

ఈ సూగూరు వంశానికి మూలపురుషుడు మంచెరాజు. మంచె అనగా చేనిలో కాపలాదారు ఎత్తుకు ఆకుతో వేసుకునే పందిరి. సంస్కృతంలో గూడ దీనికి మంచ అనియే వ్యవహారం. "మంచా క్రోశంతిం" అనే వాక్యం జహల్లక్షణకు మనకు ధ్వన్యాలోకంలో ప్రసిద్ధమైన ఉదాహరణం. ఆంధ్ర సాహిత్యంలో కేయూర బాహు చరిత్ర కర్త మంచెనకవి ప్రసిద్ధుడు. క్రీడాభిరామంలో టిట్టిభసెట్టి మిత్రుడు మంచన శర్మ ప్రసిద్ధుడు. ఈ విధంగా ఈ మంచెన అనే పేరు విజయనగర ప్రారంభం నాటికే ప్రసిద్ధంగా కనిపిస్తుంది. కనుక ఇప్పటి సూగూరు వంశానికి మూల పురుషుడైన మంచె రాజు పన్నెండు తరాల నాటివాడు. అనగా క్రీ.శ. 17వ శతాబ్ది ప్రారంభం నాటివాడు. వనపర్తి వారి రాజధాని క్రీ.శ. 1688లో సూగూరు నుండి కొత్తకోటకు మార్చబడింది. కాబట్టి ఆ కాలములో ప్రభువులతో పాటు తరలిన వీరి మూలపురుషుడెవ్వరో అక్కడ నిలిచి సూగూరు వాడైనాడు. ఆ తర్వాత అతని వంశం శ్రీరంగాపురానికి వచ్చినా అదే పేరుతో నిలచింది అనవలసి ఉంది. ఇది వీరి వంశనామ పరిచయము (ఫోతేదార్ కేశవాచార్య "శ్రీరంగ శతకము" సంపా. ఎస్వీ రామారావు).

మా నాన్నగారు కీ.శే. సూగూరు వాసుదేవరావు గారు శ్రీరంగాపురం వారికేగాక వనపర్తి, పెబ్బేరు, కొల్లాపూరు తదితర పరిసర ప్రాంతాల ప్రజలకందరికీ అభిమాన పాత్రులు. దానికి కారణం ఆయన సౌహార్దం, సౌజన్యం. ఆయన ఆర్ద్ర హృదయం, మంచి మనసు అందరి మన్ననలు చూరగొన్నాయి. స్వగ్రామం అభివృద్ధికి ఆయన ఎంతో పాటుపడ్డారు. ఊరికి బస్సు సౌకర్యం, విద్యుత్తు, నీటిపారుదల మున్నగు వసతులు కల్పించడానికి ఎంతో కృషి చేశారు. గ్రామ ప్రజలకు ఏ సమస్య వచ్చినా, ఏ తగాదాలు తలెత్తినా ఆయన సమక్షంలో విన్నవించుకొని ఆ 'పెద్దమనిషి' తీర్పును, సలహాలను పాటించి సామరస్యంతో జీవించారు.

మా నాన్నగారు భక్త వరేణ్యులు. శ్రీరంగాపురం సమీపంలో చింతల హనుమాన్ల ఆలయాన్ని నిర్మించి దాన్ని అభివృద్ధి పరిచారు. తమ ఇలవేలుపైన బీచుపల్లి ఆంజనేయ స్వామి క్షేత్రంలో మా దంపతులచేత నాగప్రతిష్ఠ చేయించారు. ఊరిలో హనుమజ్జయంతి కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. హరికథలు మున్నగు పురాణ ప్రవచన కార్యక్రమాలను ఏర్పాటు చేసేవారు. పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా వారికి ఆదినుంచీ భక్తులైన నాన్నగారు స్వగృహములో శ్రీ సత్యసాయి భజన మండలి స్థాపించి ఎన్నో సంవత్సరాల పాటు వార్షికోత్సవాలు నిర్వహించి అన్నదానం మొ॥ పుణ్యకార్యాలు ఆచరించారు.

మా అమ్మగారు రామచూడమ్మ అన్నపూర్ణ కుద్దియౌ గృహిణిగా పేరు గడించింది. పరిసర ప్రాంతాలనుంచి వచ్చినవాళ్లు పగలైనా, రాత్రయినా మా ఇంట్లో ఆతిథ్యం స్వీకరించి వెళ్లవలసిందే. అతిథి అభ్యాగతులతో మా ఇల్లు కలకలలాడుతూ, సెలవుల్లో బంధుమిత్రుల పిల్లా పాపలతో నిత్యకల్యాణం - పచ్చతోరణంగా విలసిల్లుతుండేది.

పరాభవ నామ సం॥ కార్తిక బ॥ దశమి భానువారం పూర్వ ఫల్గుణీ నక్షత్రంలో (1906) జన్మించిన నాన్నగారు తమ బంధుమిత్రుల సమక్షంలో వైభవంగా సహస్ర చంద్ర దర్శనం జరుపుకున్నారు. శ్రీ సత్యసాయి భక్తులవటం చేత గురుపౌర్ణిమ సందర్భంలో పుట్టపర్తి వెళ్లి ఆషాఢ శు॥ త్రయోదశినాడు (1990) తన ఎనభై మూడవ ఏట ప్రశాంతి నిలయంలో స్వామి సన్నిధిలో పరమపదించారు. బాబావారి ఆదేశాన్ని అనుసరించి పర్తిలోనే చిత్రావతినది ఒడ్డున అంతిమ సంస్కార కార్యక్రమం నిర్వర్తింపబడింది. సిద్ధార్థి సం॥ కార్తిక (2011) విదియ కృత్తికా నక్షత్రంలో (28-11-1917) జన్మించిన మా అమ్మగారు నాన్న పరమపదించిన ఎనిమిది సంవత్సరాలకు 27-7-1998న ఎనభైయవ ఏట ఆయన్ను అనుసరించారు.

హైస్కూలు విద్య:

సాహిత్య పోషణకు ప్రసిద్ధి పొందిన సంస్థాన భూమిలో పుట్టినందువల్ల జన్మతః నాలో సాహిత్యాభిలాష ఏర్పడిం దనుకుంటాను. సినిమాలూ, పత్రికలూ, పుస్తకాలూ బాల్యం నుంచీ నా జీవితయాత్రను నడిపించిన ప్రధానాంశాలు. స్వగ్రామంలో ప్రాథమిక విద్యను అభ్యసించి ఐదవతరగతిలో తాలూకా కేంద్రమైన వనపర్తి హైస్కూలులో చేరాను. అక్కడే నాకు సాహిత్యంతో గాఢమైన అనుబంధం ఏర్పడింది. చందమామ, బాలమిత్ర -

రూపవాణి, సినిమారంగం, చిత్రసీమ, డిటెక్టివ్, ప్రజామత, ఆంధ్ర సచిత్ర వార పత్రిక మొ॥ పత్రికలన్నీ విడువకుండా చదువుతుండేవాణ్ణి. వీటితో పాటు మా స్కూలు లైబ్రరీ అంతా గాలించేవాణ్ణి. అది చాలా పెద్ద లైబ్రరీ. ప్రసిద్ధ తెలుగు నవలలన్నీ – ఏకవీర, చివరకు మిగిలేది, అసమర్థుని జీవయాత్ర, వేయి పడగలు, నారాయణరావు, కోనంగి – హైస్కూలులో ఉన్నప్పుడే చదివాను. శరత్ నవలా సాహిత్యంతో పాటు ప్రేంచంద్ నిర్మల, గోదాన్ – ఠాగూర్ పడవ మునక (దిరెక్) మున్నగు ఇతర భాషా నవలలు కూడా నాకు సుపరిచితాలు. ఆంధ్ర పత్రికలో సీరియల్‌గా వచ్చిన ఆంగ్లానువాద నవలలు సరేసరి – కాంచన ద్వీపం (ట్రెజర్ ఐలండ్), టాం సాయర్, హకల్ బెరీఫిన్, రెండు మహా నగరాలు (ఏటేల్ ఆఫ్ టూ సిటీస్), మనిషిలో మనిషి (డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్) నన్ను ఎంతో ఆకట్టుకొన్నాయి. ఘంటారావం (విక్టర్ హ్యూగో ఫ్రెంచి నవల), కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో (అలెగ్జాండర్ డ్యుమా నవల) ఆంధ్ర ప్రభలో ధారా వాహికంగా వచ్చేవి.

బెజవాడ హోటల్ సర్వర్‌గా పని చేసిన నటరాజన్ అనే యువకుడు 'శారద' అన్న కలం పేరుతో వ్రాసిన 'మంచీ చెడూ', 'అపస్వరాలు' నవలలు (ఆంధ్ర పత్రిక) బెజవాడ మధ్య తరగతి జీవితాలను పరిచయం చేశాయి. కొమ్మూరి వేణుగోపాలరావు 'పెంకుటిల్లు' సీరియల్ కోసం బెంగుళూరు నుంచి వచ్చే 'ప్రజామత' పత్రిక కోసం ఎంతో ఆతురతతో ఎదురుచూసేవాళ్లం. ప్రసిద్ధ హాస్యరచయిత ముళ్లపూడి వెంకట రమణ రచనా వ్యాసంగం, బాపూ బొమ్మలు ఆరోజుల్లోనే ఆంధ్రపత్రికలోని 'బుడుగు – చిచ్చుల పిడుగు'తో ప్రారంభమైనాయి. వంగభాషలోని పాంచకడీదేవ్ మున్నగువారి అపరాధ పరిశోధక నవలలు, బంకించంద్ర ఛటర్జీ నవలలు, మద్రాసునుంచి వెలువడుతుండే 'డిటెక్టివ్' మాసపత్రికలోని ఆరుద్ర, టెంపోరావు రచనలు ఆసక్తికరంగా ఉండేవి. పదవ తరగతిలో ఉన్నప్పుడే పరిచయమైన పాలమూరు కవి మిత్రుడు, ఉపాధ్యాయుడు అయిన చౌదూరి గోపాలరావు ద్వారా జాషువా, ఉమర్ అలీషా, కరుణశ్రీ కావ్యాల పరిచయం కలిగి క్రమంగా పద్యకవిత్వం మీద కూడా అభిమానం ఏర్పడింది.

రచనా ప్రారంభం:

నిరంతరం పత్రికలు–పుస్తకాల మధ్య మునిగి తేలటం చేత పద్నాలుగు సంవత్సరాల వయసులోనే నాలో రచనాభిలాష మొగ్గ దొడిగింది. కథలవంటి స్కెచ్‌లు, సినిమా సమీక్షలు వ్రాసి పత్రికలకు పంపగానే వెంటనే అచ్చయినాయి. ప్రజామత వార పత్రికలోని 'గుద్దుల

దెయ్యం' (26-6-1955), ఆంధ్రజనత దినపత్రికలోని 'పద్మిని' (13-3-1956) ప్రచురితమైన నాతొలి రచనలు. వనపర్తి అప్పటికే అభివృద్ధి చెందిన తాలూకా కేంద్రం కావటం వల్ల రెండు సినిమా హాళ్లలో కొత్త సినిమాలు ఆడుతుండేవి. మా ఊరి జాతరలో కూడా టూరింగ్ సినిమా నడిచేది. అందువల్ల సినిమాలు కూడా విరివిగా చూసేవాణ్ణి. గుణసుందరి కథ, బాలరాజు, కీలుగుఱ్ఱం, స్త్రీ, సాహసం, గొల్లభామ, సాధనా వారి సంసారం, విజయావారి పాతాళ భైరవి, షావుకారు, బి.ఎన్.రెడ్డి మల్లీశ్వరి, బంగారుపాప, ఎన్.టి.ఆర్. జయసింహ, చిరంజీవులు, ఏ.ఎన్.ఆర్. దేవదాసు, దొంగ రాముడు మొదలైన సినిమాలు నాడు బాగా విజయవంతమైనాయి. సంసారం సినిమా లెక్క పెట్టుకొని పదిసార్లు చూశాను. 1950 నుంచే హైదరాబాద్‌కు రాకపోకలు కలగటం వల్ల రాజ్‌కపూర్, దిలీప్ కుమార్, దేవానంద్‌ల హిందీ సినిమాలు కూడా చూసేవాణ్ణి. పుస్తకమైనా, సినిమా అయినా విమర్శనాత్మక దృష్టితో వీక్షించటం నా స్వభావం. ధనికొండ హనుమంతరావు, కొలను బ్రహ్మానందరావు కలిసి మద్రాసు నుంచి 'జ్యోతి' సాహిత్య మాస పత్రికతో పాటు, 'చిత్రసీమ' పేరుతో సినిమా పత్రికను నడిపే వారు. జ్యోతిలో ధనికొండ, రావూరి భరద్వాజ రచనలు ఉండేవి. 1956లో విడుదలైన సినిమాలను సమీక్షిస్తూ వ్యాసాలు పంపగానే 'చిత్రసీమ'లో అచ్చయినాయి. మద్రాసు ఫిలింఫాన్స్ అసోసియేషన్ వారి తొలి ఉత్తమ చిత్ర బహుమతి 'బంగారు పాప' సినిమాకు లభించగా నేను వ్రాసిన ఫీచర్‌ను బహుమతి ప్రదాన ఫోటోలతో ప్రత్యేకంగా అందులో ప్రచురించారు. మారుమూల ప్రాంతాలకు చెందిన వర్ధమాన రచయితలకు ప్రోత్సాహాన్ని అందించిన నాటి పత్రికాధిపతుల సౌజన్యానికి ఇది నిదర్శనం.

కాలేజీచదువు:

హైస్కూలు విద్యను ముగించుకొని 1958 జూన్‌లో నిజాం కళాశాలలో పి.యు.సి. విద్యార్థిగా చేరటం నా జీవితంలోని ఒక ముఖ్య ఘట్టం. నాలోని సారస్వతాభిలాషను గమనించి అక్కడ అధ్యాపకులుగా వున్న గురుత్రయం కీ.శే. పల్లా దుర్గయ్యగారు, కీ.శే. కోవూరు గోపాలకృష్ణారావుగారు, సి. నారాయణరెడ్డిగారు నన్ను ఎంతో ప్రోత్సహించారు. తెలుగు ఐచ్ఛికంగా బి.ఏ. చదువు కూడా అక్కడే కొనసాగటంతో నిజాం కళాశాలలో వున్న నాలుగు సంవత్సరాలూ విద్యార్థి సంఘ కార్యకలాపాలలోనూ, సాహిత్య కార్యక్రమాలలోనూ చురుకుగా పాల్గొంటూ వుండేవాణ్ణి. ఈనాడు రాజకీయ రంగంలో ప్రసిద్ధి కెక్కిన కేంద్ర మంత్రి ఎస్. జయపాల్‌రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి పి.వి. రంగారావు

నాకు సహాధ్యాయులుగా, సన్నిహిత మిత్రులుగా వుండేవారు. మాజీ కేంద్రమంత్రి, పార్లమెంట్ సభ్యులు టి. సుబ్బరామిరెడ్డి కూడా నిజాం కాలేజి హాస్టలులో స్నేహితులుగా నా పక్కగదిలోనే ఉండేవారు. జయసింహ మొదలగు ప్రసిద్ధ క్రీడాకారులు మాకు సీనియర్లుగా వుండటం గర్వ కారణంగా అనిపించేది. తెలుగు సారస్వత సంచిక 'విద్యార్థి' సంపాదకునిగా సంపాదకత్వంలోనూ, సంచికా ముద్రణలోనూ ఆనాడే తొలిపాఠాలు అభ్యసించాను.

బషీర్‌బాగ్ చౌరస్తాలోని కాలేజీ హాస్టల్‌లో ఉండటం వల్ల తెలుగు, హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ సినిమాలు విరివిగా చూసే అవకాశం లభించింది. నాకున్న అభిరుచితో తెలుగు, హిందీ సినిమాలపై సమీక్షలు వ్రాసి పంపగా ఆంధ్రవాణి, తెలుగుదేశం, తెలుగు స్వతంత్ర పత్రికలు ప్రచురించాయి. తెలుగుదేశం వార పత్రిక హిమాయత్‌నగర్ నుంచి సూర్యదేవర రాజ్యలక్ష్మి సంపాదకత్వంలో, స్వతంత్ర వారపత్రిక గోరాశాస్త్రి, డా॥పి. శ్రీదేవి (కాలాతీత వ్యక్తులు నవలా రచయిత్రి) సంపాదకత్వంలో సికింద్రాబాద్ జేంస్ స్ట్రీట్ నుంచి వెలువడుతూండేవి.

డిగ్రీ పరీక్షలో ఉత్తీర్ణత పొందాక 1962లో ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. చదివే అవకాశం లభించింది. లబ్ధ ప్రతిష్ఠులైన ఆచార్యులు ఖండవల్లి లక్ష్మీ రంజనం, దివాకర్ల వెంకటావధాని, బిరుదురాజు రామరాజు, చెలమచర్ల రంగాచార్యులు ఎం.ఏ.లో నాకు అధ్యాపకులుగా వున్నారు. నా అదృష్టం కొద్దీ సి.నారాయణరెడ్డిగారు కూడా అప్పుడే నిజాం కాలేజీ నుండి బదిలీ అయి ఆర్ట్స్ కాలేజికి వచ్చారు.

మా తరగతిలో మొత్తం పది మంది విద్యార్థులం – ఐదుగురు అబ్బాయిలు, ఐదుగురు అమ్మాయిలు. నాయని కృష్ణకుమారి సోదరి కోటేశ్వరి నాకు సహాధ్యాయి. ఎం.ఏ. విద్యార్థిగా కూడా ఆర్ట్స్ కళాశాలలోనూ, 'ఏ' హాస్టల్‌లోనూ సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు ఆసక్తితో నిర్వహిస్తూ వుండేవాడిని. విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణశాస్త్రి మున్నగు సుప్రసిద్ధ సాహితీమూర్తులను ఆహ్వానించి సభలు జరిపించాను. గురజాడ జయంతి మొదలగు సభలు ఏర్పాటు చేశాను. డాక్టరేట్ పట్టం పొందిన అధ్యాపకులను (దివాకర్ల వెంకటావధాని, కేతవరపు రామకోటిశాస్త్రి, వేటూరి ఆనందమూర్తి, ముదిగొండ వీరభద్రశాస్త్రి మొ.వారిని) ఆహ్వానించి వారి పరిశోధనాంశాలపై ఉపన్యాస పరంపరను

ఏర్పాటు చేయటం నేను నిర్వహించిన ఒక విశిష్ట కార్యక్రమంగా చెప్పవచ్చు. పరిశోధనా క్షేత్ర ఆసక్తికి ఆనాడే నాలో బీజాలు నాటుకొన్నాయి.

నేను కాలేజి విద్యార్థిగా వున్నంత కాలం నిజాం కళాశాల హాస్టల్‌లోనూ, తర్వాత 'ఏ' హాస్టల్‌లోనూ నివసించటం వల్ల రకరకాల విద్యార్థులతో కలిసిమెలిసి తిరిగే చక్కని అనుభవం నాకు లభించింది. నేనూ, జయపాల్‌రెడ్డి ఒకే హాస్టల్‌లో వుండటంతో రాజకీయాలు, సాహిత్యం, సినిమాలు గురించి ఎక్కువగా చర్చించుకుంటూ వుండేవాళ్లం. బాబూరావు పటేల్ 'మదరిండియా', ఆర్.కె.కరంజియా 'బ్లిట్జ్', సి. రాజగోపాలాచారి 'స్వరాజ్య' పత్రికల్లోని విషయాలు మా చర్చల్లో భాగంగా వుండేవి. కేంద్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు జి. హరగోపాల్ (అప్పుడు బి.ఏ.విద్యార్థి) మొదలగువారు ఈ చర్చల్లో పాల్గొంటూ వుండేవారు. 'అంపశయ్య' నవలా రచయిత నవీన్, నేను ఒక సంవత్సరం పాటు రూంమేట్స్‌గా వున్నాము.

మాకు ముందే ఎం.ఏ. పూర్తి చేసి అప్పుడు రీసర్చ్ స్కాలర్లుగా వున్న మాదిరాజు రంగారావు (కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్), పెండ్యాల వరవర రావు (విరసం), కీ.శే. వే.నరసింహారెడ్డి (చేతనా వర్తకవి) మొదలగు వారితో 'ఏ' హాస్టల్‌లోనే నాకు సన్నిహిత పరిచయం ఏర్పడింది. మహాభారత వ్యాఖ్యాతగా, వక్తగా పేరు గడించిన ఉషశ్రీ రంగారావు ద్వారా పరిచయమై ఆయనతో గడిపిన సందర్భాలు, ఆ ముచ్చట్లు మరపురానివి. ఆత్రేయ అభిమానిగా పరిచయం అయి తర్వాతికాలంలో 'ముత్యాలముగ్గు' వంటి సినిమాల నిర్మాతగా పేరొందిన ఎమ్వీఎల్ (నరసింహారావు), వేంకట పార్వతీశ్వర కవుల్లో ఒకరైన ఓలేటి పార్వతీశం కుమారుడు శశాంక (ఓలేటి సుబ్బారావు) ఎం.ఏ. ప్రీవియస్ విద్యార్థులుగా చేరటంతో వారితో కూడా స్నేహబంధం ఏర్పడింది. వారిద్దరూ తరుణ వయస్సులోనే దివంగతులు కావటం నాకు చాలా బాధను కలిగించిన అంశం. తిరుపతి ఎస్.వి.యూనివర్సిటీలో భాషాశాస్త్ర ఆచార్యులుగా ఉండిన పి.సి.నరసింహారెడ్డి కూడా హాస్టల్‌లో నాకు ఆత్మీయమిత్రులుగా సన్నిహితంగా వుండేవారు.

1964లో ఎం.ఏ పూర్తి కాగానే ఖండవల్లి లక్ష్మీ రంజనం గారు పదవీ విరమణ పొంది దివాకర్ల వెంకటావధానిగారు తెలుగు శాఖ అధ్యక్షులైనారు. తెలుగులో పిహెచ్.డి చేయాలన్న నా ఆకాంక్షకు అనుగుణంగా 1964లోనే నా అభిమాన విషయమైన 'తెలుగులో సాహిత్య విమర్శ'పై పరిశోధనకు అవకాశం లభించటం నా అదృష్టంగా భావించాను.

డా. సి.నారాయణరెడ్డిగారికి పర్యవేక్షకులుగా అప్పుడే గుర్తింపు రావటంతో వారి దగ్గర రిజిస్ట్రేషన్ చేసుకొన్న మొదటి పి.హెచ్.డి. అభ్యర్థిని నేనే కావటం కూడా విశేషం. ఆ విధంగా పి.యు.సి. నుండి పిహెచ్.డి వరకు సి. నారాయణరెడ్డిగారు నాకు ప్రత్యక్ష గురువుగా, మార్గదర్శిగా వుండటం నా అభ్యున్నతికి ఎంతో దోహదం చేసింది. ఆ రోజుల్లోనే ముద్రణ పొందిన వారి సిద్ధాంత వ్యాసం 'ఆధునికాంధ్ర కవిత్వం–సంప్రదాయం, ప్రయోగం' సాహిత్య సమాలోచనలో సంయమనాన్ని, సమవీక్షణాన్ని నాకు అలవరించింది. పిహెచ్.డి. ఫెలోషిప్‌తో 1964–66 వరకు నేను హాస్టల్‌లోనే వున్నాను. బషీర్‌బాగ్ నిజాం కాలేజీ హాస్టల్‌లోనూ, యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఏ హాస్టల్ లోనూ గడిపిన 8 సం.ల విద్యార్థి దశ నాకు ఎంతో అనుభవం గడించి పెట్టిన అమూల్యమైన కాలం. నా జీవిత యాత్రలోని మరపురాని ఘట్టం అది.

ఉద్యోగ దశ:

పిహెచ్.డి. పరిశోధన చేస్తుండగానే 1966 ఆగస్ట్‌లో నగరంలోని అన్వారులూం కాలేజీలో పార్ట్‌టైం లెక్చరర్‌గా చేరే సదవకాశం లభించింది. మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య రావాడ సత్యనారాయణ, సరిపెల్ల విశ్వనాథశాస్త్రి, ప్రిన్సిపాల్ సయ్యద్ అలీ అక్బర్ నన్ను ఎన్నిక చేశారు. (రిటైర్డ్ ఐఏయస్) సెలెక్షన్ కమిటీ సభ్యులుగా మైనారిటీ వర్గం నిర్వహణలో వున్న అన్వారులూం కాలేజీలో తెలుగు విద్యార్థుల సంఖ్య బాగానే వుండేది. నేను చేరిన మరు సంవత్సరమే పి.యు.సి. విద్యార్థుల సంఖ్య నూరుదాటి రెండు సెక్షన్లు కావటంతో పీరియడ్ల వర్క్‌లోడ్ పెరిగి ఎన్నో ఏళ్లుగా పార్ట్‌టైంగా వున్న తెలుగు లెక్చరర్ పోస్టు ఫుల్ టైం అయింది. దాంతో 1967 సెప్టెంబర్ 11వ తేదీన రెగ్యులర్ స్కేలుతో నియమింపబడ్డాను.

పి.యు.సి. స్థానంలో ఇంటర్‌మీడియట్ ప్రవేశంతో ఇంటర్, డిగ్రీ తరగతుల పాఠ్యాంశాల బోధనలో నా అధ్యాపక వృత్తికి చక్కని పునాది పడింది. ఆ కాలేజీలో పని చేసిన ఏడు సంవత్సరాల కాలం నాలో మధుర స్మృతులను మిగిల్చింది. కాలేజిలోని హిందు ముస్లిం అధ్యాపక బృందం, విద్యార్థి సమూహం నాపై ఎంతో అభిమానం చూపేవారు. తెలుగు వార్షిక సంచిక, సారస్వత సంఘం నిర్వహణలో ఎంతో సహకారం అందించారు.

పిహెచ్.డి:

అన్వారులూం కాలేజీలో వుండగానే పిహెచ్.డి పరిశోధన పూర్తి చేసి 1971 డిసెంబర్‌లో సిద్ధాంత గ్రంథం సమర్పించాను. సెలవుల్లో వేటపాలెం, రాజమండ్రి, కాకినాడ, విజయవాడ, మద్రాస్, తంజావూరులలో నెలకొన్న గ్రంథాలయాలను సందర్శించి ఎంతో విలువైన సమాచారాన్ని సేకరించి సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించాను. ఆ రోజుల్లో పరీక్షకులు ఎక్కువ సమయం తీసుకోవటం వల్ల పరిశోధన డిగ్రీ ప్రదానంలో చాలా విలంబనం జరిగేది. నేను థీసిస్ సమర్పించిన సంవత్సరం తర్వాత 1973 ఫిబ్రవరిలో వైవా పరీక్ష జరిగి డాక్టరేట్ పట్టం లభించింది. ఆచార్య జి.ఎన్.రెడ్డి (ఎస్.వి.యూనివర్సిటీ), ఆచార్య బి.వి. సూర్యనారాయణ (బెనారస్ హిందూ యూనివర్సిటీ) నాకు పరీక్షకులుగా ఉన్నారు. అన్వారులూం కళాశాల ఉద్యోగం నా అధ్యాపకవృత్తిని, పరిశోధన ప్రవృత్తినీ సఫలం చేయటం నేను మరచిపోలేను.

పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసాలు ముద్రణ రూపం పొందటం నాడు చాలా అరుదు. ప్రభుత్వం నుంచి లభించిన ఆర్థిక సహకారంతో నా సిద్ధాంత గ్రంథం వెంటనే ముద్రితమై 1975 ఫిబ్రవరిలో ఆవిష్కరణ జరిగింది. నా "తెలుగులో సాహిత్య విమర్శ" గ్రంథం విమర్శ ప్రక్రియను వివేచించిన తొలి గ్రంథం కావటం చేత అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ పాఠ్యగ్రంథంగా ఆదరణ చూరగొని ఇంతవరకు నాలుగు ముద్రణలు పొందింది.

విశ్వవిద్యాలయ ఉద్యోగం:

1973 ఫిబ్రవరిలో పిహెచ్.డి డిగ్రీ రావటం, ఆ సంవత్సరమే యూనివర్సిటీలో లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూ జరిగి నియామకం కావటం నా సాహిత్య జీవితంలో మైలురాయి. అప్పుడు నూకల సరోత్తమ రెడ్డి ఉపాధ్యక్షులుగా, బి.రామరాజు తెలుగుశాఖ అధ్యక్షులుగా వున్నారు. ప్రప్రథమంగా 13 సెప్టెంబర్‌న సికింద్రాబాద్ సాయం కళాశాలలో జాయిన్ అయినాను. వక్తగా పేరు గడించిన ఆంగ్లోపన్యాసకులు పి.ఎల్.ఎన్. శర్మగారు ప్రిన్సిపాల్‌గా, సాహితీమిత్రులు ఇరివెంటి కృష్ణమూర్తి గారి సహాధ్యాపకునిగా పనిచేసే సదవకాశం నాకు లభించింది.

ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు దానికి అనుబంధంగా వున్న వరంగల్ కాలేజీలో రెండు సంవత్సరాల పాటు విధిగా పని చేయాలన్న నిబంధనలో భాగంగా

మరుసటి సంవత్సరమే (1974 జులై) వరంగల్ ఆర్ట్స్ కాలేజీకి బదిలీ అయినాను. అక్కడ పనిచేసిన రెండు సంవత్సరాలూ అదొక అనుభవం. తెలుగుశాఖలో నాతో పాటు చేరిన మిత్రులు హరి శివకుమార్, ఎల్లూరి శివారెడ్డి వరంగల్‌లో నాకు సహాధ్యాపకులు. ఇంకా ఆర్. సోమారెడ్డి (హిస్టరీ), బి. నరసింహాచారి (సంస్కృతం), టి. వెంకటరెడ్డి (మాజీ రిజిస్ట్రార్), కె.వి. రమణ (ప్రస్తుతం ఐ.ఏ.యస్ ఆఫీసర్) అక్కడ పనిచేస్తుండేవారు. హైదరాబాద్ నివాసంగా ఉన్న అధ్యాపకులు రోజూ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఉదయం వరంగల్ వచ్చి సాయంత్రం తిరిగి వెడుతుండేవారు. నేను అలా కాకుండా వరంగల్ ఉద్యోగంలో వున్న రెండు సంవత్సరాలూ సుబేదారిలో ఇల్లు అద్దెకు తీసుకొని సకుటుంబంగా అక్కడే వున్నాను. నగరంతో ఉన్న సంబంధాల వల్ల శని, ఆదివారాలు మాత్రం హైదరాబాద్ వచ్చి వెడుతుండేవాడిని.

రెండు సంవత్సరాలు పూర్తి కాగానే జస్టిస్ జగన్మోహనరెడ్డి ఉపాధ్యక్షులుగా వున్న కాలంలో 1976 జూన్‌లో తిరిగి సికింద్రాబాద్ కళాశాలకు బదిలీ అయివచ్చాను. ఆ ఏడే రీడర్ పోస్ట్‌కు ఇంటర్‌వ్యూ జరిగి యూనివర్సిటీలో చేరిన మూడు సంవత్సరాలకే (1976 ఆగస్ట్) ప్రమోషన్ రావటం నా సుకృత విశేషం. ఆ తర్వాత నేను పూర్వ విద్యార్థిగా వున్న నిజాం కళాశాలలో ఒక సంవత్సరం పాటు, బషీర్‌బాగ్ పి.జి. కాలేజీలో రెండు నెలలపాటు (1978-79) పనిచేసి 1979 సెప్టెంబర్‌లో క్యాంపస్‌లోని ఆర్ట్స్ కళాశాలలో చేరాను. ఆ విధంగా నాకు పాఠాలు నేర్పిన గురువర్యులతో కలిసి పని చేసే మహాభాగ్యం నాకు లభించింది.

ఆచార్య బి.రామరాజు మొదలుకొని ఆచార్య వేటూరి ఆనందమూర్తి వరకు ఎందరో గొప్ప వ్యక్తుల అధ్యక్షతలో పనిచేసి ఎంతో అనుభవం గడించాను. ఆ అనుభవం తర్వాతి కాలంలో నేను అధ్యక్షుడుగా వున్న తరుణంలో ఎంతగానో ఉపకరించింది. 1989లో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, ఆ వెంటనే నవంబర్‌లో తెలుగు శాఖ అధ్యక్ష పదవులు పొందాను. 1991లో ప్రొఫెసర్ నయినా, మెరిట్ ప్రమోషన్ విధానం అమలు కావటంతో 1987 జూన్ నుండే ప్రొఫెసర్‌గా నా ప్రమోషన్ పరిగణనకు వచ్చింది.

1994లో తెలుగు శాఖకు యు.జి.సి. వారు డి.ఆర్.ఎస్. ప్రాజెక్ట్ అవకాశం కల్పించటంతో దానికి కో ఆర్డినేటర్‌గా నియుక్తుడినైనాను. అయితే క్యాంపస్ బయటి కాలేజీలలో వున్న అధ్యాపకులకు క్యాంపస్‌లో పనిచేసే అవకాశం కలిగించాలన్న సూచనను

అనుసరించి దానికి నేనే నాంది పలికాను. 16సం.ల తర్వాత ఆర్ట్స్ కళాశాల నుండి సికింద్రాబాదు పి.జి. కళాశాలకు బదిలీ అయి అక్కడ తెలుగు శాఖ అధ్యక్షుడిగా కొనసాగాను. అక్కడ వుండగానే మరొక సారి బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ పదవి రావటంతో (96-98) డి. ఆర్.ఎస్. కో ఆర్డినేటర్ బాధ్యతను వదులుకున్నాను.

ఆర్ట్స్ విభాగంలోని సీనియర్ మోస్ట్ ఆచార్యునిగా అంతకన్న ముఖ్యమైన బాధ్యత చేబట్టవలసి వచ్చింది. 1999 ఆగస్టు 16వ తేదీన ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి ఉద్యోగ విరమణ వరకు ఆ పదవిలో కొనసాగాను. తెలుగు శాఖ నుండి బి.రామరాజు గారి తర్వాత 20 సంవత్సరాలకు నాకు డీన్ పదవి లభించటం నా అదృష్ట విశేషం. యూనివర్సిటీలో వున్న 28సం.ల ఉద్యోగ కాలంలో పై ఉన్నత పదవులతో పాటు విద్యార్థి సంఘ హితవరిగా, పరిశోధన పర్యవేక్షకునిగా, పరిశోధన పత్రిక 'వివేచన' సంపాదకునిగా, దూర విద్యా కేంద్రంగా పాఠ్య రచయితగా – సంపాదకునిగా, అధ్యాపకుల రిఫ్రెషర్ డైరెక్టర్ కోర్స్ అనేక బాధ్యతలు నిర్వహించాను. నిబంధనల ప్రకారం 2001 ఏప్రిల్ 30వ తేదీన పదవీ విరమణ పొందాను.

1966 నుండి 2001 వరకు 35 సం.ల సుదీర్ఘకాలం నింతరాయంగా తెలుగు అధ్యాపకుడుగా కొనసాగటం నా అదృష్టం. అకాడమిక్ రంగంలో, బోధనలో నేను గడించిన అనుభవం వ్యక్తిగా, ఉత్తమ అధ్యాపకుడిగా నన్ను తీర్చి దిద్దింది.

పరిశోధక పర్యవేక్షణ:

నేను విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడుగా చేరిన కొద్దికాలానికే 1975 డిసెంబర్‌లో ఎం.ఫిల్ పర్యవేక్షకుడుగా, 1976 డిసెంబర్‌లో పిహెచ్.డి. పర్యవేక్షకుడుగా పరిగణింపబడ్డాను. 'తెలుగులో స్మృతి కావ్యములు' అన్న అంశంపై సిహెచ్. రఘుపతిరెడ్డి 1976లో మొదటి ఎం.ఫిల్. పరిశోధకుడుగా చేరి 1978లో డిగ్రీ పొందాడు. అభ్యుదయ రచయితగా పేరుగడించిన ఏటుకూరి ప్రసాద్ 1977లో మొదటి పిహెచ్.డి. పరిశోధకుడుగా చేరటం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. "తాపీ ధర్మారావు జీవితం-సాహిత్యం' పై పరిశోధనకు గాను ఆయన 1982లో డాక్టరేట్ డిగ్రీ పొందాడు. 2008 ఫిబ్రవరి నాటికి నా పర్యవేక్షణలో 19 మంది పిహెచ్.డి., 15గురు ఎం. ఫిల్ పట్టాలు అందుకొన్నారు. వీరిలో జయధీర్ తిర్మలరావు, నాళేశ్వరం శంకర్, తూర్పు మల్లారెడ్డి, టి.వి. భాస్కరాచార్య, వడ్డెపల్లి కృష్ణ, చిల్లర భవాని, ఆచార్య ఫణీంద్ర, వెల్దండ సోదరులు–

సత్యనారాయణ, నిత్యానందరావు మొదలైన వారు ఉన్నారు. మొత్తం 34 పరిశోధనాంశాలలో 14 ప్రాచీన - ఆధునిక ప్రక్రియలకు సంబంధించినవి కాగా, ప్రత్యేక కవులు - కావ్యాలకు చెందినవి పది, నవల-కథా రచయితలు, విమర్శకులపై పది అంశాలు ఉన్నాయి. వీటిలో బుర్ర కథలు, తెలంగాణా రైతాంగ పోరాటం వంటి ప్రక్రియా సమాలోచనతో పాటు, కందుకూరి తాపీ ధర్మారావు, చలం, కొడవటిగంటి, వీవీఎల్ నరసింహారావు, ఊట్ల కొండయ్య, పువ్వాడ శేషగిరి రావు, వేమూరి వెంకట రామనాథం మున్నగు వారి సాహిత్య పరామర్శ ఉండటం గమనార్హం.

ఇతర విశ్వ విద్యాలయాల సంబంధం:

ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలగు శాఖలో ఉన్నత పదవులు నిర్వహించటం చేత రాష్ట్రంలోని, ఇతర రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలతో కూడా నాకు సంబంధం ఏర్పడింది. బెంగుళూరు, బెనారస్ విశ్వ విద్యాలయాలలోను, పుట్టపర్తి శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్, కాకతీయ విశ్వవిద్యాలయంలోను బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా ఉన్నాను. దాదాపు అన్ని విశ్వ విద్యాలయాల సదస్సుల్లో పాల్గొని పత్ర సమర్పణ చేశాను. పిహెచ్.డి పరీక్షకుడిగా ఉన్నాను. ఢిల్లీ యు.జి.సి. సెలెక్షన్ కమిటీల్లోను, జె.ఆర్.ఎఫ్. పరీక్షల పాఠ్య ప్రణాళికా సంఘంలోను సభ్యుడిగా ఉన్నాను. యు.పి.ఎస్.సి, ఏపిపి ఎస్సి సెలెక్షన్ కమీటిల్లోనూ ఎక్స్‌పర్ట్ మెంబర్‌గా ఉన్నాను. పదవీ విరమణ తర్వాత హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం గెస్ట్ ఫ్యాకల్టీగా (2003,04), కాకతీయ విశ్వవిద్యాలయం విజిటింగ్ ఫెలోగా ఎం.ఏ. విద్యార్థులకు పాఠాలు బోధించాను. వివిధ విశ్వ విద్యాలయాల ఆధ్వర్యంలో నిర్వహింపబడిన కళాశాల అధ్యాపకుల పునశ్చరణ తరగతుల్లోను దూర విద్యా సంబంధ. మైన కాంటాక్టు తరగతుల్లోనూ బోధకుడిగా పాల్గొన్నాను.

దూర విద్య పాఠ్య రచన, సంపాదకత్వం:

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దూరవిద్య ప్రారంభమైన నాటి నుంచి ఈనాటి వరకూ డిగ్రీ మొదలుకొని పి.జి. స్థాయి వరకు పాఠాలు రచించటమే కాక, పలుపత్రాల పాఠ్య గ్రంథాలకు సంపాదక బాధ్యత వహించాను. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం పాఠ్య ప్రణాళిక సభ్యుడిగా ఉండి బి.ఏ., ఎం.ఏ తరగతుల పాఠ్య గ్రంథాలకు సంపాదకుడుగా, పాఠ రచయితగా ఉన్నాను. బెంగుళూరు, శ్రీ కృష్ణ దేవరాయ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయాల దూరవిద్యా పాఠాలు రచించాను. ఎస్ఇఆర్‌టి

వారు నిర్వహించిన పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాలకు నేతృత్వం వహిస్తూ, మన రాష్ట్రంలోని ఒకటి నుంచి ఆరవతరగతి తెలుగు వాచకాలకు ప్రధాన సంపాదక బాధ్యతను వహించాను.

సంస్థా నిర్వహణ:

కళాశాల విద్యార్థిగా ఉన్నప్పట్నుంచీ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఆంధ్ర సారస్వత పరిషత్తు సభా కార్యక్రమాల్లో శ్రోతగా ఆసక్తిగా పాల్గొంటూండటం వల్ల దేవులపల్లి రామానుజరావు మున్నగు మహనీయులతో నాకు ఆత్మీయమైన పరిచయం ఏర్పడటం నా అదృష్టం. వారికి నాపై గల అభిమానం వల్ల అకాడమీ రీసర్చ్ కమిటీ సభ్యునిగా, పరిషత్తు కార్య నిర్వాహక వర్గ సభ్యునిగా చేరే అవకాశం లభించింది. సారస్వత పరిషత్తుతో ఉన్న చిరకాల అనుబంధం కార్యవర్గ సభ్యునిగా ఈనాటికీ కొనసాగుతున్నది. రామానుజరావు స్మారకోపన్యాసం, పరిణతవాణి 56వ ప్రసంగం ఈ అనుబంధానికి తార్కాణాలు. నాకు ప్రత్యక్ష గురువు, పర్యవేక్షకులు అయిన ఆచార్య సి. నారాయణరెడ్డిగారు అధ్యక్షులుగా, నా సహాధ్యాపకులు సాహితీ మిత్రులు అయిన ఆచార్య ఎల్లూరి శివారెడ్డి కార్యదర్శిగా ఉన్న ఆంధ్ర సారస్వత పరిషత్తు సదస్సుల్లో, సభల్లో నేను పలుమార్లు వక్తగా పాల్గొనటం జరిగింది. పై సంస్థల సభ్యుడిగా కొనసాగటమే కాక నాకున్న అనుభవంతో నేను స్వయంగా కొన్ని సంస్థలను స్థాపించి పెక్కు కార్యక్రమాలను నిర్వహించటం జరిగింది.

జ్యోతిర్మయి:

నేను ఎం.ఏ.డిగ్రీ పొందిన (1964) తర్వాత చేసిన మంచిపని 1965లో వనపర్తి కేంద్రంగా మా పాలమూరు జిల్లా సాహిత్య సమితిని స్థాపించటం. మా జిల్లాలోని వనపర్తి, గద్వాల, ఆత్మకూరు, జటప్రోలు మున్నగు సంస్థానాల ఆశ్రయంలో ఎంతో సాహిత్య పోషణ జరిగింది. ఎందరో కవి పండితులు ఈ ప్రాంతంలో ప్రభవించి సారస్వత సేవచేసి కీర్తి గడించారు. వారి కృషిని ప్రకాశమానం చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ సమితిని స్థాపించటం జరిగింది. నాతో సమానమైన ఆశయాలుగల మిత్రుడు చౌదూరి గోపాల రావు (జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయుడు) నాకు ఎంతో సహకరించటంతో నేను అధ్యక్షుడుగా, అతడు కార్యదర్శిగా మహబూబ్ నగర్‌తో పాటు వనపర్తి, గద్వాల, అలంపూరు, ఆత్మకూరు, అచ్చంపేట మున్నగు పలు ప్రాంతాల్లో సాహిత్య సభలు, సదస్సులు,

కవి సమ్మేళనాలు నిర్వహించాం. మొదటిసారిగా 1967లో జిల్లా రచయితల మహాసభలు రెండు రోజులపాటు ఘనంగా ఏర్పాటు చేశాం. జ్యోతిర్మయి ఘనకార్యాలలో ముఖ్యంగా పేర్కొనదగినది జిల్లాకవుల కవితా సంకలనం "జ్యోతిర్మయి" (1966) ప్రచురణ. ఆధునిక యుగంలోనే ప్రప్రథమ కవితా సంకలనంగా పేరొందిన సురవరం ప్రతాపరెడ్డి 'గోలకొండ కవుల సంచిక' (1934) తర్వాత, ఆయన స్ఫూర్తితో వెలువడిన 'జ్యోతిర్మయి' తొలి జిల్లా కవుల సంకలనంగా ఉగ్గడింపదగింది. కథా సంకలనంతో పాటు పలువురి కవుల కావ్యాలు ప్రచురించి, ఆవిష్కరణలు జరిపింది జ్యోతిర్మయి సంస్థ. అలంపూరు, ఆత్మకూరు సంచికల ద్వారా జిల్లా సర్వస్వానికి నాంది పలికింది. మహాకవి దాశరథి జ్యోతిర్మయి ప్రతినిధిగా సాహిత్య అకాడమీ కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక కావటం ద్వారా ఆయనతో సాన్నిహిత్యం ఏర్పడటం, గడియారం రామకృష్ణశర్మ, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, కేశవపంతుల నరసింహశాస్త్రి, ఇరివెంటి కృష్ణమూర్తి మా సంస్థకు హితవరులుగా ఉండటంతో వారితో ఆత్మీయమైన సాహిత్యానుబంధం కలుగటం నా అదృష్ట విశేషం. అముద్రితంగా ఉన్న బూర్గుల, గడియారం వారి రచనలను సేకరించి నా సంపాదకత్వంలో జ్యోతిర్మయి పక్షాన ప్రచురించటం జరిగింది. సువరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి సభ్యుడుగా సురవరం సాహిత్య వ్యాసాలు (2భాగాలు) కూడా నా సంపాదకత్వంలో వెలువడ్డాయి.

శ్రీనివాస సాహితీ సమితి:

హైదరాబాద్‌లో తుంగతుర్తి విశ్వనాథశాస్త్రి కార్యదర్శిగా ఏర్పాటైన 'శ్రీనివాస సాహితీ సమితి' ద్వారా జంటనగర వాసులకు సాహిత్య సేవ అందించ గలిగినందులకు ఎంతో ఆనందించాను. డా॥ పి.ఎన్.ఆర్. అప్పారావు అధ్యక్షులుగా ఉన్న తరుణంలో ఉపాధ్యక్షుడుగా, ఆ తర్వాత అధ్యక్షుడుగా కొనసాగాను. శ్రీనివాస సాహితీ సమితి చాలా కాలం పాటు ఎన్నో కావ్యావిష్కరణ సభలు, సదస్సులు నిర్వహించింది. తెలుగు హాస్యరచయితలపై వ్యాస సంకలనం (నవ్వుల నవాబులు), దివి సీమలో వరదల సందర్భంగా కవితా సంకలనం (కడలి-కన్నీరు) మొదలైనవి సమితి పక్షాన ప్రచురితమైనాయి.

ఆంధ్ర పద్య కవితా సదస్సు:

పద్య కవిత్వాభిమాని శిష్టా వెంకట రావు (యలమంచిలి) వ్యవస్థాపక కార్యదర్శిగా ఏర్పాటైన 'ఆంధ్ర పద్య కవితా సదస్సు'కు కూడా రాజధానీ నగరం నుంచి నా వంతు

ప్రోత్సాహం, సహకారం అందించాను. ప్రసిద్ధ పద్య కవి డా॥ నందూరి రామకృష్ణమా చార్యులు అధ్యక్షులుగా, నేను ఉపాధ్యక్షునిగా పద్య కవితా సదస్సు మహా సభలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించాం. సదస్సు ఆధ్వర్యంలో 'సాహితీ కౌముది' త్రైమాసిక పత్రిక నేటికీ కొనసాగుతున్నది.

విశ్వ విద్యాలయ అధ్యాపక సంఘం:

నేను ఉస్మానియా తెలుగు శాఖ అధ్యక్షులుగా ఉన్న సందర్భంలో, నా ప్రోద్బలంతో ఉస్మానియా విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న అన్ని కళాశాలల తెలుగు అధ్యాపకుల సంఘం ఏర్పాటైంది. విద్యా రంగంలో తెలుగు భాషాభివృద్ధికి పాటు పడాలన్న సంకల్పంతో నా అధ్యక్షతలో నెలకొన్న ఈ సంఘం భాషా సదస్సులు, వార్షిక మహాసభలు, ఉత్తమ అధ్యాపకులకు పురస్కారాలు మున్నగు కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించింది. కాని తర్వాతి వారు శ్రద్ధ చూపక పోవటంతో ఇది కొంత కాలం మాత్రమే నడిచింది.

శ్రీరంగాపురం గ్రామ సేవా సమితి:

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" (వాల్మీకి) 'స్వస్థాన వేష భాషాభిమానం' (నన్నయభట్టు) అన్న పూర్వ విజ్ఞుల వాక్కులు నాకు ఆదర్శవంతమైనాయి. సొంత ఊరుకు కొంతయినా సేవలు అందించాలన్న సంకల్పంతో హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న మా ఊరివాళ్లను కలుపుకొని కొన్ని సంవత్సరాల క్రితం గ్రామ సేవా సమితిని స్థాపించటం జరిగింది. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు ప్రారంభం అయ్యే జాతర (రథోత్సవం) నాడు పొరుగు ప్రాంతాల నుంచి విచ్చేసే ప్రజలకు అన్న ప్రసాద వితరణం, ప్రతి ఆగస్టు 15న అధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు, ఉచితవైద్య శిబిరం మొదలైనవి ప్రస్తుతం ఈ సేవాసమితి కొనసాగిస్తున్న కార్యక్రమాలు.

2011 జూన్‌లో సప్తతి పూర్తి చేసుకొన్న నా విశ్రాంత జీవితంలో – తెలుగు భాషా సంస్కృతుల వికాసం లక్ష్యంగా 111 సంవత్సరాల క్రితం నెలకొన్న ప్రాచీన సంస్థ శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంతో, పూర్వ హైదరాబాదు రాష్ట్రంలో తెలుగు భాషాభివృద్ధి ఆశయంతో నెలకొన్న ఆంధ్ర సారస్వత పరిషత్తుతో అనుబంధం ఉండటం వల్ల ఈ రెండు సంస్థల కార్యక్రమ నిర్వహణలో నా వంతు బాధ్యతను నిర్వహిస్తున్నాను.

నా సాహిత్య ప్రస్థానం:

నా జీవనయానంలో ప్రధానమైన అంశం సాహిత్య ప్రస్థానం. పద్నాలుగు సంవత్సరాల వయసులో స్కెచ్‌లు, సినిమా సమీక్షలతో ప్రారంభమైన రచనా వ్యాసంగం తర్వాతి కాలంలో విమర్శకుడిగా గుర్తింపు నార్జించింది. డిగ్రీ తరగతుల్లో పాఠ్యాంశాలుగా ఉన్న మనుచరిత్ర, ఆముక్త మాల్యద కావ్యాలతో పాటు విశ్వనాథ, రాళ్లపల్లి వ్యాసాలు విమర్శ ప్రక్రియపై నాకు అభిరుచిని పెంపొందించాయి. తెలుగు సాహిత్య విమర్శ ప్రక్రియను వివేచించిన గ్రంథాలేవీ అంతవరకు వెలువడలేదు. ఆ లోటును తీర్చాలన్న కోరికతో "తెలుగులో సాహిత్య విమర్శ-అవతరణ వికాసాలు" అన్న అంశంపై పరిశోధన చేసి 1973లో డాక్టరేట్ పట్టం పొందాను. ఒక ఏడాదిలోపే 1974లో నా సిద్ధాంత గ్రంథం ముద్రించే అవకాశం లభించింది. నా తొలి గ్రంథమే ఎంతో పేరు గడించటం నాకు గర్వకారణం.

సిద్ధాంత గ్రంథం:

ప్రప్రథమంగా తెలుగు సాహిత్య విమర్శ పరిణామ వికాసాలను శాస్త్రీయమైన పద్ధతిలో ప్రామాణికంగా విశ్లేషించి వివేచించటం చేత 'తెలుగులో సాహిత్య విమర్శ' గ్రంథం సాహిత్యాభిమాను లందరి ఆదరణను చూఱగొన్నది. "స్థూలదృష్టికి శుష్కంగా తోచే ఆంధ్ర సాహితీ విమర్శ చరిత్రను రసాత్మకంగా సమీక్షించటం వల్ల విమర్శను గూర్చిన ఈ విమర్శ సాహిత్యేతరులకు కూడా చవులు పుట్టించే పోతలో తయారైంది." అని ఆచార్య సి. నారాయణరెడ్డిగారు ఈ గ్రంథ ఆముఖంలో ఉగ్గడించారు. "వేయి వత్సరాల తెలుగు సాహితిని విహంగ దృష్టితో వీక్షించటమే కాకుండా వలసిన పట్టులను కుశాగ్రబుద్ధితో విశ్లేషించి, ఇంతవరకు పాయలు పాయలుగా ఉన్న విమర్శనా రీతులను ఒకచోట గుది గ్రుచ్చి చూపి ప్రామాణికమతితో ఈ సిద్ధాంత గ్రంథాన్ని రచించిన డా॥ రామారావు కృషి ప్రశంసనీయం" అని అభినందించారు.

నన్నయ నుంచి నేటి వరకు వెలువడిన తెలుగు సాహిత్యాన్నంతా అవలోకించి, దానిపై కొనసాగిన విమర్శనా సాహిత్యాన్ని సమదృష్టితో సమాలోచించి సమగ్రమైన విమర్శ వాఙ్మయ చరిత్రను రూపొందించటానికి నేను ఎంతో పరిశ్రమించాను. నా గ్రంథం ద్వారా అనేకమైన పరిశోధనాంశాలను వెలికి తెచ్చాను. విమర్శ ప్రక్రియా పరిణామానికి

సంబంధించిన పెక్కు నూత్న ప్రతి పాదనలను చేశాను. సాహిత్య రంగానికి పరిచయం కాకుండా మరుగున పడిన 19వ శతాబ్ది విమర్శకులు ఎందరో నా గ్రంథం మూలంగా వెలుగులోకి వచ్చారు. విమర్శకులందరూ నా ప్రతిపాదనలను ఆమోదించటమే దీని ప్రామాణికతకు నిదర్శనం. ఇందలి సమాచారం ఆధారంగా పీఠికలు, వ్యాఖ్యానాలు మున్నగు విమర్శరూపాలపై ప్రత్యేక పరామర్శ కొనసాగటం వల్ల భావి పరిశోధకులకు ఆకర గ్రంథంగా నిలిచింది. "ఈ గ్రంథంలో ప్రస్తావితమైన ఎన్నో అంశాలమీద 'డాక్టరేట్లు' వచ్చాయంటే దీని ఔపయోగికతను గమనింపవచ్చు." (డా॥ వెలుదండ నిత్యానందరావు-పరిశోధనోత్సవం).

సిద్ధాంత గ్రంథం తొలి ముద్రణ తోటే నా విమర్శ వివేచన ఆగిపోలేదు. విమర్శ క్షేత్రం విస్తరించిన కొద్దీ అదనపు సమాచారాన్ని జోడించి పునర్ముద్రిస్తూనే ఉన్నాను. 1974 తర్వాత ద్వితీయ పరివర్ధిత ముద్రణ (1989), తృతీయ (1999), చతుర్థ (2007) ముద్రణలు వెలువడ్డాయి. అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ ఎం.ఏ. స్థాయిలో పాఠ్య గ్రంథంగా ఉండటంవల్ల విద్యార్థులకు యుక్తంగా ఉండే విధంగా దీన్ని సవరిస్తూ వచ్చాను. పరిశోధనా శీలానికి, పరిశీలనా వ్యగ్రతకు ప్రతిఫలనమైన నా సిద్ధాంత గ్రంథం నా జీవిత సాఫల్యంగా భావిస్తున్నాను.

నా సాహిత్య విమర్శ నిరంతర ప్రవాహినిలా నేటికీ కొనసాగుతూనే ఉన్నది. ఆంగ్ల భాషీయులకు ఆంధ్ర విమర్శ సాహిత్యాన్ని పరిచయం చేస్తే బాగుంటుందన్న ఆలోచనతో నా సిద్ధాంత గ్రంథంలోని ప్రధాన అంశాలను నూరు పుటల సంక్షిప్త గ్రంథంగా (1990) 'ది ఎవల్యూషన్ ఆఫ్ తెలుగు లిటరరీ క్రిటిసిజం' పేరుతో ప్రకటించాను.

వ్యాస సంపుటులు:

తెలుగు సాహిత్యతత్త్వ ప్రకాశనమే లక్ష్యంగా నా తదుపరి గ్రంథాలు విరచితమైనాయి. ప్రాచీనాధునిక కవులు, ప్రక్రియలపై వివిధ సందర్భాలలో వెలువరించిన వ్యాసాలు నాలుగు సంపుటులుగా ప్రచురితమైనాయి. పత్రికలు - ప్రత్యేక సంచికల వ్యాసాలు, సదస్సు పత్రాలు, రేడియో ప్రసంగాలు మొదలైనవి కింది సంపుటుల్లో చోటు చేసుకున్నాయి.

అన్వీక్షణం (1984)	-	14 వ్యాసాలు
సమవీక్షణం (1992)	-	20 వ్యాసాలు

అభివీక్షణం (1998) - 13 వ్యాసాలు

కావ్యామృతం(2004) - 12 వ్యాసాలు

వీనిలో 'సమవీక్షణం' తెలుగు విశ్వ విద్యాలయం ఉత్తమ విమర్శ పురస్కారానికి (1994), 'అభివీక్షణం' వరంగల్లు సహృదయ సంస్థ బహుమానానికి (2001) పాత్రమైనాయి. విస్తృతమైన అధ్యయన శీలానికీ, నాలోని విమర్శ చైతన్యానికీ నిదర్శనాలు ఈ వ్యాస సంపుటాలు.

కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యమంటే నాకు చిన్ననాటి నుంచీ అభిమానం. ఆ అభిమానంతోనే ఆయన సాహిత్య పరామర్శకు సంబంధించిన వ్యాసాలతో పాటు ఆయన వాఙ్మయ జీవితానికీ సంబంధించిన విపులమైన అనుబంధాలను జోడించి 'విశ్వనాథ దర్శనం' (2011) వెలువరించాను. దీనికి ఇటీవలే విశాఖపట్నంలో కొండేపూడి సుబ్బారావు స్మారక పురస్కారం లభించింది. ఆధునిక కవిత్వ విభాగానికి సంబంధించిన వినూత్న ప్రతిపాదనలతో, ఇరవైయవ శతాబ్ది కవితా ధోరణుల సమాలోచనతో కూడిన 'శతాబ్ది కవిత' (2010) యుజిసి మేజర్ రీసర్చ్ ప్రాజెక్ట్ కింద నేను కొనసాగించిన పరిశోధనా ఫలితం. కవిత్వ ప్రక్రియా విమర్శలు, కవితా సంకలనాల సమగ్ర సూచికల అనుబంధం ఇందలి ప్రత్యేకత. ఈ గ్రంథ ఔపయోగితను గుర్తించి తెలుగు అకాడమీ దీనిని ప్రచురించింది. నా సిద్ధాంత గ్రంథంలో సంక్షిప్తంగా పేర్కొన్న 23 మంది కీర్తి విశేషులైన విమర్శకులపై రచించిన ప్రత్యేక వ్యాసాలను 'విమర్శక వతంసులు' పేరుతో (2011) ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రకటించింది. సి.పి. బ్రౌన్ నుంచి వల్లంపాటి వెంకట సుబ్బయ్య వరకూ గల ప్రముఖ విమర్శకుల వివేచన ఇందులో ఉంది. "విషయ సాంద్రత, అభివ్యక్తి సంక్షిప్తత సంతరించుకొన్న ఈ వ్యాసాలు విద్యార్థులకు, పరిశోధకులకు, పండితులకు ఉపకరించేవిగా ఉన్నాయి." అని పరిషత్తు అధ్యక్షులైన ఆచార్య సి.నారాయణరెడ్డిగారి అభిప్రాయం.

పాలమూరు కవుల చరిత్ర:

జ్యోతిర్మయి సంస్థను స్థాపించిన నాటినుంచీ పాలమూరు జిల్లా సాహిత్య ప్రకాశనమే నా జీవిత ధ్యేయంగా పెట్టుకొన్నాను. మా జిల్లాకు చెందిన సాహితీ మూర్తులు సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, గడియారం రామకృష్ణశర్మ ప్రభృతుల రచనలు

సంకలించటం అందులోని భాగమే. క్రీ.శ. 1000 నుంచి 1800 వరకూ గల ప్రాచీన కవుల చరిత్రను సేకరించి 'పాలమూరు సాహితీ వైభవం' ప్రథమ భాగంగా (2010) వెలువరించాను. తెలంగాణా అస్తిత్వం కాపాడుకోవాలన్న లక్ష్యంతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ప్రబలంగా కొనసాగుతున్న తరుణంలో ఈ గ్రంథం ప్రత్యేకతను సంతరించుకొన్నది. 20వ శతాబ్దానికి చెందిన ఆధునిక కవులను కూడా ఇరవై మాసాలనుంచి 'మూసీ' పత్రిక ద్వారా పరిచయం చేస్తున్నాను. ఈ ద్వితీయ భాగాన్ని కూడా త్వరలో గ్రంథ రూపంలో తేవాలని నా సంకల్పం.

వ్యాఖ్యానాలు:

సాహిత్య విమర్శ ప్రక్రియలో వ్యాఖ్యానం అత్యంత ప్రాచీనమైనది. సంస్కృత తెలుగు కావ్యాలకు, లక్షణ గ్రంథాలకు వ్యాఖ్యానాలు ప్రసిద్ధిగడించాయి. నా సిద్ధాంత గ్రంథం రూపొందిస్తున్న తరుణంలో వాటిని పరిశీలించటం చేత, దూర విద్య పాఠ్య భాగాలకు టీకా తాత్పర్య యుక్తమైన లఘు వ్యాఖ్యలు వ్రాయటం చేత వ్యాఖ్యాన రచనలో నాకు అభిరుచి ఏర్పడింది. తెలుగు కావ్యావతారికలు కవుల సాహిత్య దృక్పథాలను చాటటంతో పాటు పెక్కు చారిత్ర కాంశాలను వెల్లడిస్తున్నాయి. వాటికి వ్యాఖ్యానాలు సమకూర్చటం ద్వారా కవుల కావ్యానుశీలన సుగమ మవుతుందన్న ఆలోచనతో ఆదికవి అయిన నన్నయ భట్టు ఆంధ్ర మహా భారత అవతారికకు విపుల రూపమైన వ్యాఖ్యను 'నన్నయ దర్శనము' పేరుతో (1998) వెలువరించాను. ఇది నన్నయ వాఙ్మయ సూచికగా కూడ రూపొందటంతో విద్యార్థులకు, పరిశోధకులకు కర దీపికగా తోడ్పడుతున్నది. తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించిన ఆంధ్ర మహాభారత వ్యాఖ్యానంలో కర్ణ పర్వంలోని ద్వితీయాశ్వాసానికి (2005) సరళమైన వ్యాఖ్యను రచించే సదవకాశం లభించినందుకు ఎంతో ఆనందించాను. తమ విశ్రాంత జీవితంలో కావ్య రచనకు పూనుకొన్న ప్రముఖ భూగర్భ శాస్త్రవేత్త అయిన ఆచార్య వి.ఎల్.ఎస్. భీమశంకరంగారి కోరిక పై వారి 'దక్షారామ భీమేశ్వర శతకము' నకు కూడా వ్యాఖ్యానం (2006) కూర్చాను.

ఆకాశవాణి అనుబంధం:

ఆకాశవాణితో అనుబంధాన్ని గుర్తుజేసుకుంటే నలభై అయిదు వసంతాల క్రిందటి జ్ఞాపకాలు తలపుకు వస్తున్నాయి. 1961లో నిజాం కళాశాల విద్యార్థిగా వున్న రోజుల్లో

హైదరాబాదు రేడియో కేంద్రం నుంచి నా రచన తొలిసారిగా ప్రసారమైనప్పుడు నేను పొందిన ఆనందం అవధి లేనిది. ఆ ఉత్సాహంతో విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిగా వున్నప్పుడు 'పాశుపతం' పేరుతో ఒక నాటిక వ్రాసి పంపాను. పొరుగు దేశంతో యుద్ధం జరుగుతున్న నాటి పరిస్థితుల్లో మన దేశం ఆయుధ సంపన్నం కావాలన్న భావాన్ని కిరాతార్జునీయం గాథ ఆధారంగా వ్యంగ్యంగా అందులో వ్యక్తపరచాను. ఆనాడు తమ మధుర గంభీర కంఠాలతో శ్రోతలను వశపరచుకొన్న శారదా శ్రీనివాస్, నండూరి విఠల్ ఈ శ్రవ్య నాటికలో ముఖ్య పాత్రలు వహించారు. ఆ నేపథ్యంలోనే విరచితమైన 'పిలుపు' కథానిక కూడా ఆ రోజుల్లోనే ప్రసారమైంది.

అయితే – రేడియో కేంద్రంలో నేను స్వయంగా రికార్డింగ్‌లో పాల్గొన్న 'అరంగేట్రం' మరపురాని మధుర జ్ఞాపకం. నేను తెలుగు అధ్యాపకునిగా పనిచేస్తున్న కాలంలో ఒకరోజు రేడియో కేంద్రం నుండి ఫోన్ కాల్ వచ్చింది– "మీ విమర్శవ్యాసం బాగుంది. రికార్డింగ్‌కు రండి" అని. వేలూరి సహజానందగారి పిలుపు అది. వేలూరి శివరామశాస్త్రిగారి పుత్రుని గానే కాక, 'హసజ' కలం పేరుతో రచయితగా ప్రసిద్ధుడై ఆయన పరిచయం కలిగినందుకు అమితానందం పొందాను.

అప్పటినుంచి ఆకాశవాణి ద్వారా నా సాహితీ ప్రసంగ పరంపర ప్రారంభమైంది. సహజానందతో పాటు కేశవపంతుల నరసింహశాస్త్రి, రావూరి భరద్వాజ, కొత్రా మల్లికార్జున శర్మ, చలపతిరావు, శేషం రామానుజాచార్య, సుధామ, మహేశ్వర్ ప్రభృతుల సంయోజనలో నూరుకు పైగా నా ప్రసంగాలు ప్రసారమైనాయి. మొదట రసమయి, అమరవాణి, ధ్వని, పుస్తక పరిచయం మొదలగు శీర్షికల్లో 10, 15 నిమిషాల వ్యవధిలోని ప్రసంగాలుండేవి. తర్వాత 5 నిమిషాల పరిమితికి చెందిన ప్రసంగాలు అత్యధికంగా ప్రసారమైనాయి. కేవలం సాహిత్య కార్యక్రమాలే గాక, ఇతర విషయాలపై చర్చల్లో (రంగవల్లి మొ॥) కూడా పాల్గొన్నాను. ఒకసారి రవీంద్రభారతి ఆవరణంలోని (కళాభవన్) సాహిత్య అకాడమీలో దేవులపల్లి రామానుజరావు గారి ద్వారా ఎన్‌వియస్ ప్రసాదరావుగారు పరిచయమైనారు. వారి కోరికపై గ్రామస్థుల కార్యక్రమంలో "మా ఊరు–నాడు, నేడు" శీర్షికలో మా ఊరు శ్రీరంగాపురం గురించి మాట్లాడాను. ఆ ప్రసంగాన్ని విన్న మా గ్రామస్థులంతా ఎంతో అభినందించారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక కళా రంగాల వికాసానికి ఆకాశవాణి చేసిన సేవ నిరుపమానమైనది; విశిష్టమైనది. తొలుత చెన్నపురి నుంచి – అనంతరం భాగ్యనగరం నుంచి ఆహ్లాదకరమైన, ప్రయోజనాత్మకమైన పెక్కు

కార్యక్రమాలను పలు రంగాలలో నిష్ణాతులైన ప్రతిభామూర్తులు రూపకల్పన చేశారు. ఆ మహనీయుల్లో కొందరితోనైనా రేడియో కేంద్రం ద్వారా పరిచయభాగ్యం ఏర్పడినందుకు నేను గర్వపడుతున్నాను.

బుచ్చిబాబు, దాశరథి, కృష్ణశాస్త్రి, రజని, పాలగుమ్మి విశ్వనాథం, ఉషశ్రీ, వింజమూరి సోదరీమణులు, రేడియో అక్కయ్య-అన్నయ్య మున్నగువారిని అక్కడ కలుసుకొని సంభాషించే అవకాశం నాకు లభించింది. ముఖ్యంగా నేను అభిమానించే తురగా కృష్ణమోహనరావుగారి ఆత్మీయతను ఎన్నటికీ మరిచిపోలేను. ఆంధ్ర సచిత్ర వార పత్రికలో 'ప్రవీణ్' కలం పేరుతో ప్రచురితమైన 'రాజధాని కబుర్లు' శీర్షిక ద్వారా పరిచయమైన కృష్ణమోహనరావు నెలకొల్పిన "ప్రత్యూష ప్రచురణ" సంస్థలో చేరిన తొలి సభ్యుణ్ణి నేను. రేడియో వార్తా విభాగంలో పనిచేస్తున్న ఆయన్ను తరచూ కలుస్తూండేవాడిని. నేను వెళ్లినప్పుడల్లా అసెంబ్లీ ఆవరణలోని క్యాంటీన్‌లో తనకు ఇష్టమైన రవ్వదోసె తినిపించకుండా నన్ను వదిలి పెట్టేవారు కాదు.

ఈ స్మృతులు అనుబంధాలు అలావుంచి - నాలోని విజ్ఞాన తృష్ణకు, ఆలోచనాశీలతకు, భావ వ్యక్తీకరణకు పదును పెట్టింది ఆకాశవాణి. ఒక అంశంపై ఐదు నిమిషాల పరిమిత కాలంలో శ్రోతలను అలరిస్తూ సరళ సుందరంగా ప్రసంగించే కళను నాకు నేర్పింది. అందుకు దోహదం చేసిన పైన పేర్కొన్న కార్యక్రమ సంయోజకులందరినీ పేరు పేరునా కృతజ్ఞతా పూర్వకంగా స్మరిస్తున్నాను. మకరందం, జ్యోతిపథం, సాహితీ సుధ, భావన మొదలగు శీర్షికల్లో వారు సూచించిన అంశాలపై నా మనసు స్పందించిన భావాల సమాహారమే "మనోవీక్షణం" సంపుటి. 1987-92 మధ్య, 2000-06 మధ్య ప్రసారమైన వాటిలో ప్రత్యేక కవులు, వ్యక్తులపై ప్రసంగాలు మినహాయించి ముప్పైరెండు ప్రసంగాలను ఎన్నుకొని ఈ సంపుటిలో పొందు పరచాను. ప్రభాత వేళలో ప్రసారమైన ఈ ప్రసంగాలు విని నా గురువులు; సాహితీ మిత్రులు నన్ను ఆశీర్వదించారు; అభినందించారు. గ్రూప్ 1,2 పరీక్షల అభ్యర్థులు బుచ్చిబాబు, గోపీచంద్ ప్రభృతులపై సంక్షిప్త ప్రసంగాలు తమకు ఎంతో ఉపకరించాయని చెప్పినప్పుడు ఎంతో సంతోషం కలిగింది.

ఇతర రచనలు:

సాహిత్య రంగంలో విమర్శకుడిగా ఒక ప్రత్యేక స్థానం - గుర్తింపు లభించటంతో

ఎందరో కవులు, రచయితలు, పరిశోధక విద్యార్థులు కోరటంచేత వారి గ్రంథాలకు పీఠికా రూపమైన అభిప్రాయాలు వ్రాయటం జరిగింది. నా షష్టిపూర్తి సందర్భంలో 60 పీఠికలు 'కృత్యాలోకనం' పేరుతో (2000) గ్రంథరూపంలో ప్రచురితమైనాయి. గడచిన పది సంవత్సరాలలో (2011 నాటికి) సాహితీ మిత్రుల అభ్యర్థన మేరకు మరికొన్ని గ్రంథాలకు అభిప్రాయాలు వ్రాశాను. ఇవి సంక్షిప్తమైనవే అయినా ఆ రచనలను అవగాహన చేసుకోవటానికి తోడ్పడగలవని భావిస్తున్నాను. తొలిదశలో కథలు, కవితలు మొ॥ సృజనాత్మక రచనలు చేసినా క్రమంగా విమర్శ ప్రక్రియవైపు దృష్టి మరలటంతో అవి తగ్గుముఖం పట్టాయి. మిత్రుల కోరికపై వాటిని కూడా 'సాహితీ కదంబం' పేరుతో (2010) చిన్న పుస్తకంగా ప్రచురించాను. హైదరాబాదు సాంస్కృతిక చరిత్రలో 1901లోనే స్థాపితమైన శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం స్థానం విశిష్టమైనది. సాహితీ బంధువు డా॥ కె.వి. రమణాచారి కోరికపై 'నూట పది వసంతాల భాషా నిలయం' చరిత్రను (2010) సంక్షిప్త రూపంలో రచించాను.

శ్రీ సత్యసాయి అనుబంధం:

పన్నెండు సంవత్సరాల వయసునుంచే పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దర్శన, స్పర్శ, భాషణలు లభించిన సుకృతం నాది. వారు అవతార ప్రకటన చేసిన (20 అక్టోబర్ 1940) కొన్ని మాసాలకే (5 జూన్ 1941) నేను జన్మించాను. బాబా వారి సమకాలీనులుగా జీవించటమే మన భాగ్యం. మా కుటుంబ సభ్యులందరూ బాబా భక్తులు కావటం వల్ల మేము తరచుగా పర్తి వెడుతుండేవారం. గత అరవై సంవత్సరాలుగా మా ప్రశాంతి నిలయ యాత్ర కొనసాగుతూనే ఉన్నది. మా ఊళ్లో శ్రీ సత్యసాయి భజన మండలిని నెలకొల్పిన మా నాన్నగారు ఒక గురు పౌర్ణమికి పర్తి వెళ్లి ప్రశాంతి నిలయంలోనే తన 83వ (19–7–1990) పరమ పదించారు. నేను నగరంలోని శ్రీ సత్యసాయి స్టడీ సర్కిల్‌లో వక్తగా, నా శ్రీమతి బాలవికాస్ అధ్యాపకురాలిగా సాయి సేవా సంస్థల్లో పాల్గొనే అవకాశం లభించటం సంతోష దాయకం. సనాతన సారథిలోనూ, ఉదయం, వార్త దిన పత్రికల్లోనూ బాబా గురించిన నా రచనలు ప్రచురితమైనాయి. స్వామి 65వ జన్మ దినోత్సవ సందర్భంలో నా ఆంగ్ల గ్రంథం 'ది ఎవల్యూషన్ ఆఫ్ తెలుగు లిటరరీ క్రిటిసిజం'ను వారికి అంకితం చేశాను. తర్వాత 'సత్యసాయి బాలవికాస్' మాస పత్రికలో బాలల కోసం వ్రాసిన దశావతార కథలను కలిపి శ్రీ సత్యసాయి అవతారం–దశావతార గాథలు పేరుతో స్వామి 80వ జన్మదిన సమర్పణగా (నవంబర్ 2005) వెలువరించాను.

సంపాదకత్వం:

నిజాం కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే సారస్వత సంచికకు సంపాదకుడిగా ఉండటం వల్ల సంపాదక బాధ్యతలోని మెలకువలు అర్థమైనాయి. అధ్యాపక వృత్తిలో చేరాక ఆ అనుభవంతో కళాశాల సంచికలు నిర్విఘ్నంగా వెలువరించగలిగాను. ముఖ్యంగా 'జ్యోతిర్మయి' సాహిత్య సంస్థను స్థాపించాక అనేక గ్రంథాలు, సంచికలు నా సంపాదకత్వంలో వెలువడ్డాయి. సురవరం, బూర్గుల, గడియారం వంటి మహనీయుల అముద్రిత రచనలు సంకలించి వెలుగులోకి తేవటం జరిగింది.

వి.ఎల్.ఎస్. భీమ శంకరం సప్తతి సంచిక (2002), వడ్లకొండ నరసింహారావు జయంతి సంచిక (2003), రావికంటి వసునందన్ షష్టిపూర్తి సంచిక (2009) మొదలైనవి నా ఆధ్వర్యంలో ప్రచురితమైనాయి. గురువర్యులు ఆచార్య సి.నారాయణరెడ్డి ప్రోత్సాహంతో 'తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం' నిరూపించే ప్రముఖ సాహితీ వేత్తల వ్యాసాలను వారి సంక్షిప్త పరిచయాలతో పాటు సంకలించిన గ్రంథం (2009) ఆంధ్ర సారస్వత పరిషత్తు పక్షాన ప్రచురితం కావటం ముదావహమైన అంశం.

పురస్కారాలు, సన్మానాలు:

సాహిత్య పురస్కారాలు, సన్మానాలు రచయితల సాహిత్యకృషిని ప్రోత్సహిస్తూ సాహితీ ప్రగతికి దోహదం చేస్తాయన్నది సర్వజన విదితం. విమర్శ రంగంలో నేను చేసిన కృషికి గుర్తింపుగా నాకు లభించిన పురస్కారాలలో మొట్ట మొదట పేర్కొన తగినది తెలుగు విశ్వ విద్యాలయం ఒసగిన ఉత్తమ విమర్శ పురస్కారం. నేను రచించిన 'సమవీక్షణం' వ్యాస సంపుటికి 1994లో విమర్శ ప్రక్రియలో ఉత్తమ గ్రంథంగా ఆ బహుమతి లభించింది. ఆ తర్వాత నేను వెలువరించిన 'అభివీక్షణం' వ్యాస సంపుటి (1998) వరంగల్లు సహృదయ సంస్థ వారి పురస్కారంతో పాటు హైదరాబాదు విశ్వ సాహితి వారి బహుమానం కూడా పొందింది. ఇటీవల ప్రచురితమైన 'విశ్వనాథ దర్శనం' (2001) ప్రసన్న భారతి సంపాదకులైన కీ.శే.కొండేపూడి సుబ్బారావు స్మారక విమర్శ పురస్కారం అందుకోవటం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించిన అంశం. ప్రసన్న భారతి ట్రస్టు వారు 22 డిసెంబర్ 2011న విశాఖ పట్నంలో నిర్వహించిన సభలో 5116/= నగదు, ప్రశంసా పత్రంతో నన్ను సత్కరించారు.

విమర్శరంగంలో లబ్ధ ప్రతిష్ఠులైన ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు జీవియస్ సాహితీ కళా పీఠం స్థాపించి ప్రతి యేటా ప్రసిద్ధ విమర్శకులకు పురస్కారాలు ఏర్పాటు చేయటం ద్వారా విమర్శ ప్రక్రియ అభ్యుదయానికి ఎంతో దోహదం చేశారు. తనతోపాటు ఎనిమిది మంది విమర్శకులను ఎన్నుకొని 'మా విమర్శ ప్రస్థానమ్' (2000) సదస్సును నిర్వహించి సన్మానించటం సాటి విమర్శకుల పట్ల ఆయనకు గల గౌరవానికి నిదర్శనం అందులో నాకు అవకాశం కల్పించటం నా పట్ల ఆయనకు గల అభిమానాన్ని వెల్లడిస్తుంది. తర్వాత జీవియస్ సాహితీ కళాపీఠం పొందటం కూడా నా అదృష్ట విశేషం. సాహితీ రంగంలో ప్రసిద్ధులై కీర్తి శేషులైన సారస్వత మూర్తులు - దాశరథి, బూర్గుల, దివాకర్ల, వానమామలై, ఇరివెంటి, ఉమ్మెత్తల సాహిత్య అవార్డులు నా సాహితీ కృషికి స్ఫూర్తిదాయకమైనాయి. ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ, దేవులపల్లి రామానుజరావు, నాయని సుబ్బారావు స్మారకోపన్యాలు చేసే అవకాశం లభించటం కూడా నాకు ప్రోత్సాహకములైనాయి.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల సాహితీ సంస్థలు నన్ను ఆహ్వానించి గౌరవించటం నాకు ఆనందకరం. నెల్లూరు (శ్రీ నాథ జయంతి), ఒంగోలు (ఎర్రన పీఠం), నంద్యాల (సూరన సారస్వత సంఘం), బందరు (ఆంధ్ర సారస్వత సమితి), విజయవాడ (విశ్వనాథ వరంగలు) (పోతన సాహిత్యపీఠం) మున్నగు ప్రాంతాలు ఈ విధంగా దర్శించగలగటం నాకు ఎంతో ఆనందదాయకం.

స్వరాష్ట్రంలోనే కాక పొరుగు రాష్ట్రాల సభా వేదికలపై కూడా నేను సన్మానాలు అందుకొన్నాను. మద్రాసు తెలుగు మహాసభలు, ముంబై ఆంధ్ర మహాసభ వార్షికోత్సవాలు, ఢిల్లీ ఆంధ్రా అసోసియేషన్ సదస్సుల్లో పాల్గొన్నాను. ముఖ్యంగా అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో జరిగిన (1985) ఐదవ నార్త్ అమెరికా (తానా) తెలుగు మహా సభల్లో ఆహ్వానితుడుగా పాల్గొనటం నా జీవితంలో మరపురాని అనుభూతి.

దేశ, విదేశ పర్యటన:

తానా సభలకు అమెరికా వెళ్లినప్పుడు నలభై అయిదు రోజులపాటు అక్కడ వసించి నాకు ఇష్టమైన నయాగరా జలపాతం, డిస్నీ ల్యాండ్, యూనివర్సల్ స్టూడియో, ప్రభుపాద గోల్డన్ టెంపుల్ (వీలింగ్), పిట్స్ బర్గ్ దేవాలయం, న్యూయార్క్–వాషింగ్టన్ నగరాలు సందర్శించటం నాకు ఎంతో సంతృప్తిని కలిగించింది. విద్యార్థి దశలోనే మన దేశంలోని

ముఖ్య ప్రాంతాలను దర్శించటం వల్ల పర్యాటనంపై (టూరిజం) నాకు ఆసక్తి ఏర్పడింది. హాస్టల్ విద్యార్థిగా నాగార్జున సాగరం, అజంతా ఎల్లోరాలే కాక, ఎం.ఏ. విద్యార్థిగా కాశ్మీర్, ఛండీగడ్, ఢిల్లీ, ఆగ్రా, లక్నో, అలహాబాద్, కాశీ మున్నగు పర్యాటక స్థలాలను చూసే అవకాశం లభించింది. పిహెచ్.డి పరిశోధన నెపంతో సాహితీ మిత్రులు అక్కిరాజు రమాపతిరావు, టి. ప్రభాకర రెడ్డిలతో కలిసి తంజావూరు వెళ్లినప్పుడు శ్రీ విల్లిపుత్తూరు, శ్రీరంగం, చిదంబరం, మదురై, తిరువనంతపురం, కన్యాకుమారి మున్నగు దక్షిణ దేశ క్షేత్రాలు చూడగలిగాను. ఆ సందర్భంలోనే మదరాసులో ఆరుద్ర రామలక్ష్మి దంపతుల ఆతిథ్యాన్ని పొందటం మరువరాని సన్నివేశం.

విశ్వవిద్యాలయం అధ్యాపకునిగా ఆచార్యులైన గోపాలకృష్ణారావు, నాయని కృష్ణకుమారి, కులశేఖరరావు గారలతోనూ, జయప్రభ, యాకుబ్ మొ॥ విద్యార్థి బృందంతో కలిసి కల్చర్ టూర్‌లో భాగంగా కోణార్క, పూరీ, అరకులోయ, అమరావతి మొదలైన ప్రాంతాలు పర్యటించటం ఎన్నో అనుభూతులను మిగిల్చింది. విశ్రాంత జీవితంలో తీరిక లభించటంతో శ్రీమతితో కలిసి ఉత్తరాదిలోని హరిద్వార్, ఋషీకేశ్, బద్రీనాథ్, కేదార్‌నాథ్, సిమ్లా, కులూ-మనాలీ ప్రాంతాలేకాక, థాయిలాండ్, మలేసియా, సింగపూరు మున్నగు విదేశ పర్యాటక కేంద్రాలు చూసి ఆనందించే అవకాశం లభించింది. ముఖ్యంగా గత ఏడాది (2011మే) ఒక టూరిజం సంస్థ ద్వారా పది దేశాలకు చెందిన (ఇటలీ, వ్యాటికన్, స్విట్జర్లండ్, జర్మనీ, హాలండ్, బెల్జియం, ఫ్రాన్స్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మొ॥) 26 ప్రధాన నగరాలను సందర్శించే భాగ్యం కలుగటం నా యాత్రా చరిత్రలోని అపూర్వ సన్నివేశం. జూలియస్ సీజర్‌కు చెందిన రోం నగరాన్ని, పీసా టవర్, ప్యారిస్‌లోని ఈఫిల్ టవర్, లండన్‌లోని థేమ్సనది వంతెన, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ మున్నగు ప్రాంతాలను సందర్శించినప్పటి సంతోషం చెప్పనలవికానిది. దేశ విదేశాల పర్యటనలవల్ల వివిధ జాతి ప్రజల జీవన సంస్కృతి, ఆచార వ్యవహారాల అవగాహన ఏర్పడి మన జ్ఞానచక్షువు విస్తృతి చెందుతుందన్నది నా అభిప్రాయం. కాశ్మీర్ నుండి కన్యాకుమారి మధ్యగల రాజస్థాన్, కలకత్తా, రమణాశ్రమం (అరుణాచలం), అరవిందాశ్రమం (పాండిచ్చేరి) మొదలైన స్థలాలు చూడాలన్న కోరిక ఇంకా అలా మిగిలి ఉంది. ఈ విశ్రాంత జీవితంలో అది నెరవేరగలదనే ఆశిస్తున్నాను.

ముగింపు:

ఈ 'పరిణతవాణి' ద్వారా నాలోతును నేను వెతుకుక్కొనే సందర్భం కల్పించినందుకు గురువర్యులైన పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి. నారాయణరెడ్డి గారికి, సహాచార్య మిత్రులైన కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారికీ నా ధన్యవాదాలు. ఇది ఒక విధంగా నా ఆత్మకథకు సంక్షిప్త కథన రూపం. వివరాల జోలికి పోకుండా నా బ్రతుకుబాటను నడిపించిన ముఖ్య సంఘటనలను మాత్రమే పేర్కొన్నాను. ఈ అనుభవాలను విపులంగా విశ్లేషిస్తే ఇది గడచిన సప్తతివత్సరాల సాంస్కృతిక చరిత్రగా రూపొందగలదు.

ప్రారంభంలో చెప్పినట్లు సినిమాలు, పత్రికలు, పుస్తకాలు నా జీవనయానాన్ని ముందుకు నడిపాయి. సినిమాలనైతే వదిలించుకొన్నాను కాని మిగతా రెండింటితో సంబంధం ఈనాటికీ కొనసాగుతూనే ఉన్నది. మూసీ, చేతన, ధన్వంతరి వాణి, పాలపిట్ట, అక్షరాంజలి, ఆంధ్రప్రదేశ్, సనాతన సారథి (పుట్టపర్తి), సత్యసాయి బాలవికాస్ మాస పత్రికలు – సాహితీ స్రవంతి, సాహితీ కౌముది, ప్రసన్న భారతి (విశాఖ) త్రైమాస పత్రికలు – వార్త, నమస్తే తెలంగాణ దిన పత్రికలు ప్రతినెలా, ప్రతిరోజూ నా టేబుల్ పై ఉండవలసిందే. ధన్వంతరివాణిలో 'తెలుగు ప్రాచీనత' శీర్షిక, తర్వాత 'ప్రాచీనాంధ్ర మహా కవులు' శీర్షిక, 'మూసీ పత్రికలో 'పాలమూరు కవులు' 'శీర్షిక ధారావాహికంగా ప్రచురిత మవుతున్నాయి. ఇక పుస్తకాల సంగతి సరేసరి – మా ఇంటినిండా అవే ఆక్రమించుకున్నాయి. వదిలించుకుందామన్నా వదిలిపోని అనుబంధం వాటిది.

విశ్వవిద్యాలయంలో ఉన్నత పదవులను బాధ్యతాయుతంగా నిర్వహించటం వల్ల తీరిక లభించక నా సాహితీ వ్యాసంగానికి కొంత ఆటంకం కలిగిందనే చెప్పాలి. ఈ విశ్రాంత జీవనంలో దానికి తగిన వ్యవధి లభిస్తున్నందుకు ఆనందంగా ఉంది. గత మూడు సంవత్సరాలలోనే విశిష్టమైన నాలుగు రచనలు (శతాబ్ది కవిత, పాలమూరు సాహితీ వైభవం, విశ్వనాథ దర్శనం, విమర్శక వతంసులు) నా కలం నుంచి వెలువడినందుకు గర్విస్తున్నాను. ప్రస్తుతం బహు గ్రంథ రచనలో నిమగ్నుడనై ఉన్నాను. సమగ్రమైన సంక్షిప్త తెలుగు సాహిత్య చరిత్ర, కీర్తి విశేషులైన పాలమూరు ఆధునిక కవుల చరిత్ర డి.టి.పి. దశలో ఉన్నాయి. ఇవి ముద్రణ పొందితే కాని తెలంగాణా సాహిత్య సాంస్కృతిక చరిత్ర, పాలమూరు సమకాలీన కవుల చరిత్ర, అర్వాచీన విమర్శక వతంసుల వివేచన రూపం దాల్చలేవు. దేనికైనా కాలం అనుకూలించాలి.

మనదేశంలో – ముఖ్యంగా మన రాష్ట్రంలో – మాతృభాషకు సముచితమైన ప్రాధాన్యం లేదన్న విచారం నన్ను ఎప్పుడూ కలత పెడుతూ ఉంటుంది. ప్రస్తుతం అవినీతి కుంభకోణాలతో నిండి ఉన్న దేశ దుస్థితికి మూల కారణం మన ప్రధాన మంత్రులు, ముఖ్య మంత్రులకు జాతీయ – ప్రాంతీయ భాషల పట్ల సరియైన అవగాహన లేకపోవటమే అని నా నిశ్చితాభిప్రాయం. గాంధీ మహాత్ముని చిత్ర పటాలకు పూలదండలు వేసే మన నేతలు "మాతృభాషా నిరాకరణం, మాతృదేవీ తిరస్కారం" అన్న ఆయన సందేశాన్ని పూర్తిగా విస్మరించారు. పాఠశాల స్థాయిలో మాతృభాష నిర్బంధంగా కనీసం ఒక పేపరుగా (మీడియంగా కాకపోయినా) ఉండే శుభఘడియలు నా జీవిత కాలంలో వస్తే ఆనందించాలని నా ఆకాంక్ష.

ఉర్దూ పాటలంటే నాకు ప్రాణం. నిద్రావస్థలో కూడా వాటినే మననం చేసుకొంటూ ఉంటాను. నా అభిమాన గాయకుడు మహ్మద్ రఫీ పాడిన మొగల్ చక్రవర్తి బహద్దూర్ షా కవితలు – "న కిసీకి ఆంక్ కానూర్ హూం", "లగ్‌తా నహీహై దిల్ మెరా ఇస్ ఉజ్‌డే దయార్ మే" (లాల్ ఖిల్లా సినిమాలోవి అని జ్ఞాపకం) మొదలైనవి ఎప్పుడూ నా మదిలో మెదులుతూ ఉంటాయి. నా అసలైన అభిమాన గాయకుడు కె.ఎల్. సైగల్. నా అభిమాన నటుడు చార్లీ చాప్లిన్ ఒక సినిమా ముగింపులో అన్న మాటలతో ఈ 'వాణి'ని ముగిస్తాను – "ఐ వాంట్ టు కంటిన్యూ, బట్ హియర్ ఐయాం స్టక్ అప్".



తురగా జానకీరాణి

విద్య, వికాసం, సంస్కారం, సంస్కృతి ఉన్న కుటుంబంలో పుట్టాను నేను. అమ్మ మందపాకల రాజ్యలక్ష్మి 1940 లోనే బి.ఏ.వరకు చదువుకొన్నది. సుమ కోమలి. వేణువు వాయించేది, కచ్చేరీలు చేసేది. హైదరాబాదు ఆకాశవాణిలో కూడా వాయించింది. నాన్న వెంకటరత్నంగారు స్ఫురద్రూపి. గొప్ప మేధావి. నలభై అయిదులోనే రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు. కమ్యూనిస్ట్. అవనిగడ్డ పంచాయతి సమితి వైస్ ప్రెసిడెంటుగా మండలి వెంకటకృష్ణారావుగారితో పని చేశారు. మాతామహులు దుల్ల పట్టాభి రామయ్యగారు మచిలీపట్టణం హిందూ హైస్కూల్‌లో లెక్కల మాస్టారు. 1909 లో బి.ఏ.ఎల్.టి. చదివారు. భగవద్గీతను అనుష్ఠించి శ్రీకృష్ణుని జాతక చక్రాన్ని సైతం వేశారు. అమ్మమ్మ గుడిపాటి వెంకటాచలంగారి పెద్ద చెల్లెలు. కొమ్మూరి వారి ఆడబడుచు. పాడేది. బుర్రకథలు. కోలాటాలు, నాటకాలు– ఒకటేమిటి అనేక కళల్లో నిష్ణాతురాలు. పెద్దపినతల్లి నలభై ఒకటిలో ఆంధ్ర విశ్వవిద్యాలయములో ఏం.బి.బి.ఎస్. పాసయి విజయనగరంలో ప్రాక్టీసు చేసేది. బాబాయి జయంతి వల్లభ రావు కమ్యునిష్టు; రాజ్యసభ సభ్యులు. రెండవ పినతల్లి విద్యా దేవి నలభై రెండులో మదరాసు యునివర్సిటీ లా గ్రాడ్యుయేటు. ఆమె కర్నాటక సంగీతం పాడేది. కచ్చేరీలు చేసేది. ఆమె భర్త ఓంప్రకాష్ గుప్త బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం డి.లిట్. వీరిద్దరూ మహాత్మా గాంధీ, వినోబాభావే, లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణతో కలిసి కొన్నేళ్ళు పని చేశారు. ఆఖరు పినతల్లి శారద న్యాయవాది. సోషల్ వెల్ఫేరు ఆఫీసర్‌గా పని చేసి స్వామీ చిన్మయానంద శిష్యురాలిగా స్వామిని శారదా ప్రియానందగా భగవద్గీత, భజగోవిందం, ఉపనిషత్తులు పరిష్కారం చేసి, అవి చేసిన

ఏకైక మహిళామణిగా ప్రసిద్ధ పొందినది. ఆమె వీణ వాయించేది. మామయ్య దుల్ల మురళి నారాయణ శాస్త్రవేత్త. స్వంతలాబొరేటరీ నడిపిస్తూ మచిలీపట్నంలో సంఘసేవ చేస్తున్నాడు. ఇంక పితామహులు దివిసీమలో మూడు వందల ఎకరాల ఆసామి. వూరి క్షురకుల మీద కోపం వచ్చి గడ్డం, మీసం పెంచేశారు. పలుగు పట్టి పొలానికి వెళ్ళేవాదు. జీడి పప్పులు, బాదాం, కిస్మిస్సులు దోసిళ్ళతో మా చేతుల్లో పోసేవారు. నాయనమ్మ జానకమ్మ నిత్యాన్నదాత. కాలువ గట్టు మీద నుంచే ఆకు కోసుకొని 'అన్నం పెట్టండి మామ్మగారు' అని వచ్చేవారు. ముగ్గురు మేనత్తలూ యద్దనపూడి వారి కోడళ్ళే. ఇల్లా చెబుతోంటే వీరందరి వ్యక్తిత్వాలు వర్ణించడానికి ఈ పూట సరి పోదు. ఇవన్నీ ఎందుకు చెప్పానంటే నేను నేనుగా ఎదగడానికి అన్ని విధాలా నేపథ్యం ఉంది అని మనవిగా.

పంతొమ్మిది వందుల ముప్పై ఆరు ఆగస్ట్ 31న పుట్టాను నేను. నాకొక తమ్ముడు. టూరిజం శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాడు. రెండు వేల మూడులో చనిపోయాడు. నేను చాలా దిగులు పడి జబ్బు పడ్డాను. నా చిన్నతనం మా పల్లెటూరిలో, మందపాకల, మచిలీపట్నంలో గడిచింది. మా అమ్మమ్మకి ముప్పై ఆరేళ్ళే కనుక మంచి హుషారుగా మమ్మల్ని పెంచింది. శ్లోకాలు, పద్యాలు, పట్టుపంచెలు కట్టుకుని భోజనాలు చెయ్యడం. తాతగారు అన్నీ పద్ధతిగా చేయించేవారు. వినాయక చవితికి మట్టి వినాయకుడిని తేవడం, దసరాకు విల్లంబులు, కోతులు, బొమ్మలు తీసుకు రావడం, దీపావళికి టపాకాయలు ఇంట్లోనే బుట్టలకొద్దీ తయారు చెయ్యడం, సంక్రాంతికి బొమ్మలు పెట్టడం, అట్లతద్దికీ, ఉండ్రాళ్ళ తద్దికీ గోరింటాకులు పెట్టుకుని పెరుగన్నాలు తిని వీధుల్లో పక్కీలు ఆడడం – ఇల్లాగన్నమాట.

నా ఆరవ ఏట మదరాసు వెళ్ళాము. మా నాన్న గారు వ్యాపారం చేసేవారు. ఎగ్మూర్ సెయింట్ కాలనీ సెకెండ్ స్ట్రీట్లో ఉండేవాళ్ళం. అయ్యగారి వీరభద్రరావు గారు, ఉమామహేశ్వరరావు రేడియో తాతయ్య, రేడియో భానుమతి – అంటే జ్యోత్స్న ఇల్యాస్ తల్లి గారు, సాక్షి టీవీ స్వప్న అమ్మమ్మ, వీరంతా ఉండేవారు. నేను చాలా అల్లరి చేసేదాన్ని. నాకు మగపిల్లవాడికి మల్లె జుట్టు క్రాప్ చేసేవారు. పెరగడానికి కొద్ది కాలం పట్టేది. దానితోనే మా అమ్మ పూలజడ వేసేది. మాన్టిస్సోరి స్కూల్లో నన్నూ, మా తమ్ముడినీ చేర్చారు. అక్కడ సంగీతం నేర్పిస్తారు సాయంత్రాలు. ఆ ప్రక్కనే డాన్స్ క్లాస్సు. నేను నేర్చుకుంటానని అడిగాను. నాకు పది రూపాయలిచ్చారు. అది గట్టిగా పుచ్చుకుని సెక్రటరీ సారంగపాణి అయ్యర్ గారింటికి ఒకటే పరుగు. అప్పటికి నాకు ఏడేళ్ళు. తెల్లగా, గుండుగా

ఉండేదాన్ని. "రాణీ ఎత్తినే ఇడ్లి సాపిటే?" అనేవారు మా గురువుగారు పందనల్లూర్ చొక్క లింగం పిళ్ళై గారు. "ఇత్తినే సార్" అనేదానిని. "రాణీ ఎత్తినే మాంబళం సాపిటే?" "ఇత్తినే సార్!". ఇల్లా అనేటప్పుడు నా జుంకీలు కదిలేవి. ఆయనకి అదొక వేడుక. నాకు అడుగులూ, అల్లరిపు, వసంత రాగం, జతిస్వరం, కాంభోజి రాగంలో శబ్దం నేర్పారు రెండేళ్లలో. "ఇంకా ఈ పిల్లకు పద వర్ణాలు, అవీ అర్ధం కావు. పదహారేళ్ళు వచ్చాక తీసుకుని రండి" అని చెప్పారు. నేను ఆ తరువాత ప్రెసిడెన్సీ హై స్కూల్లో అయిదు, ఆరు తరగతులు చదివాను. రేడియో స్టేషన్ కి మనుష్యులు లాగే రిక్షాలో వెళ్ళేవాళ్ళం. నా చేత అన్నయ్య గారు పుట్టిన రోజు పండుగల కార్డులు చదివించేవారు. అప్పుడు మాకు ఫలహారాలు పెట్టేవారు. 1943లో మహాత్మాగాంధీ గారిని చూశాను. నావేలికి ఉంగరం తొడిగారు. ఈ మధ్యలో మేము బందరు వచ్చాము. బృందావన సినిమా హాలులో – అది పన్నెండు వందలు పట్టే హాలు – నాకు డాన్స్ మాస్టర్ గారు "వెన్న పెట్టేదా రారా" అనే నాట్యం నేర్పించారు. అది చూడడానికి హాలు కిటకిటలాడి పోయింది. మా అమ్మ నాకు ప్లేబ్యాకు ఫ్లూటు.

మదరాసులో ఉండగా గొప్ప గొప్ప సంగీత కచేరీలకు వెళ్ళేవాళ్ళం. ఆంధ్ర మహిళా సభలో నళినీ కాంత రావు, రజనీకాంత రావు గారు, టంగుటూరి సూర్యకుమారి– ఇల్లా ఎందరో. కొమ్మూరి వెంకటరామయ్య గారు మా అమ్మ మేనమామ. ఆయన భార్య పద్మావతి గారు, అబ్బాయి కొమ్మూరి సాంబశివరావు. ఆయన పెద్దకూతురు వరూధినిగారికి కొడవటిగంటి రావుగారితో పెళ్ళైంది. ఆ వార్త ఆంధ్ర పత్రికలో పడింది. మా అమ్మ ఒకటే గొడవ– మామయ్య కూతురు పెళ్లి అయ్యిందనీ, చూడాలనీ. వెళ్లి చూశాము. బళ్ళారి రాఘవగారు ఒక్కొక్క సారి అక్కడ ఉండేవారు. గాలి బాల సుందర రావు – లత అన్నగారు, కృష్ణ శాస్త్రిగారు, శ్రీశ్రీ – వీరితో కలిసి ఒక రాత్రి వెన్నెలలో బీచికి వెళ్లడం గుర్తు. పద్మావతి గారు మమ్మల్ని గురించి "అక్కా తమ్ముడూ" అనే కథ రాశారు. అదేమిటంటే మేము మా నాన్న గారు సిగరెట్లు మానేస్తే వెంకటేశ్వర స్వామికి వెండి సిగరెట్టు చేయించి ఇస్తామని మొక్కుకోవడం.

నా బాల్యం చైతన్యంతో గడిచింది. మా నాన్నగారి వ్యాపారం ఎంచేతో నిలిచిపోయి మేము బందరు వచ్చేశాము. నేను ఏడో ఫారంలో లేడి ఆమ్టిల్ స్కూల్లో చేరాను. నాకు ఇంగ్లీషులో బాగా మార్కులు వచ్చేవి. లెఖ్ఖలలో పూజ్యం. మణిపురి డాన్సులు నేర్పింది మా చిన్న అమ్మమ్మగారి అమ్మాయి. వారు కలకత్తాలో ఉండేవారు. మణిపురి డ్రస్సు

కొన్నారు. స్కూల్లో రికార్డ్ పెట్టి అవి చేసేదాన్ని. విచిత్ర వేషధారణలు, మర్చంట్ ఆఫ్ వేనీస్‌లో పోర్షియా వేషం. జడ్జీ కన్న బాబు గారు అయిదు రూపాయలు బహుమానము ఇచ్చారు. వెండి కుంకుమ భరిణే కొనుక్కున్నాను. నేను పొట్టి టింకణానే కానీ స్కూల్ పబ్లిక్ లీడర్‌గా ఎన్నికైనాను.

అప్పట్లో వెంపటి చినసత్యం మాస్టారుగారు బందరులో ఒకటి రెండేళ్లు ఉన్నారు. మళ్ళీ డాన్సు మొదలైంది. ఆయనకి పంతొమ్మిది. నాకు పదమూడు. అయినా గురు భావము, గొప్ప గౌరవం ఉండేవి. ఆయన నాకు చాలా అంశాలు నేర్పారు. బందరులో, చుట్టు ప్రక్క వూళ్ళల్లో ప్రదర్శనలు ఇప్పించేవారు. ఆయన కట్టించిన వెండి పూత పూసిన మువ్వలు నా దగ్గిరున్నాయి. హరి కథలు చెప్పేదాన్ని– బందరులో, విజయవాడలో శరభయ్య గుళ్ళో. నా వైభవం చెప్పతరం కాదు. భక్త మీరాబాయి, సీతా కళ్యాణం, కన్యక– ఇల్లా కొన్ని, మహిళా మండలి కార్యక్రమాలు, కోలాటాలు, జండా వందనాలు. ప్రభాత భేరీలు. (పాటలు)– విపరీతమైన చైతన్యం. అప్పట్లోనే సినారెగారు మా వూరు వచ్చారు. వస్తు ప్రదర్శన – "వింత సంత" అని పెట్టాము 'వింత–సంత' అని ఆయన నవ్వారు. నేను పద్యాలు రాగయుక్తంగా పాడేదాన్ని– 1953 ఆంధ్రావతరణ ఉత్సవంలో రాయప్రోలువారి పద్యాలు వగైరా.

ఈ సమయంలో 1952 లో విజయవాడ రేడియో హరి కథకీ, నాటకానికి ఆడిషన్‌కి వెళ్ళాను. డ్రామా నెగ్గాను, హరికథ పోయింది. అమ్మమ్మగారు లక్ష్మీ టాకీసు పక్కన చలంగారు డాబామీద పచార్లు చేస్తోంటే చూపించింది మా అన్నయ్య అని. అంతకు ముందు ఆమెని ఇంటికి వెడితే ఎందుకొచ్చావ్ అన్నాడని మరి నేను వెళ్ళను అన్నది ఆమె. ఆయన మాత్రం తల్లిని చూడడానికి బందరు మా అమ్మమ్మగారి ఇంటికి వచ్చారు. రేడియోలో నేను హీరోయిన్. చెప్పుకోతగ్గవి అయిదు భాగాల సీరియల్ నాటకం. పద్మరాజుగారు, విశ్వనాధ సత్యనారాయణగారు, కొప్పరపు సుబ్బారావు, వింజమూరి శివరామారావు. ఆ తరువాత బాలమురళి కృష్ణగారితో కలిసి 'కోకిలమ్మ పెండ్లి' నాటకం. నేను చిలుక తల్లిని. అంటే సంస్కృతం. బాలమురళి గారు నన్నయ్య భట్టారకుడు. వాటిల్లో ఎన్నో శ్లోకాలు. కోకిలమ్మ తెలుగు. అది అడవులకి పారిపోతుంది. ఇంకా ఎక్స్టర్నల్ సర్వీసెస్‌కి మేము ఆయనతో కలిసి ఎన్నో పాటలు పాడాము– రికార్డింగులు. మిగతా నాటకాలన్నీ లైవ్.

నేను చదువులో చాలా బాగా ఉండేదాన్ని. ఆంధ్ర యునివర్సిటీ ఇండియన్ హిస్టరీ తెలుగులో ఇంటర్మీడియేట్‌లో ఫస్ట్. బి.ఏ లో ఇంగ్లీషు, ఎకనామిక్స్‌లో యూనివర్సిటీ ఫస్టు. కే.వి. గోపాలస్వామిగారి సంతకంతో బండెడు పుస్తకాలు, బంగారు పతకాలు. కాలేజీ ప్రైజులైతే చెప్పలేనన్ని.

వెంపటి చినసత్యం మాస్టారుగారు అప్పట్లో భరతనాట్యమే చెప్పేవారు. నాకు తంజావూరు నాట్యం మీదే మోజు. మదరాసు వెళ్ళాను. కాసు బంగారం తొంభై ఉన్న రోజుల్లో నూట పాతిక రూపాయలు చొక్క లింగం పిళ్ళైగారి జీతం. రోజూ రెండు పూటలా క్లాసులు. వొళ్ళు హూనమయ్యేది. ఇంద్రాణి రెహమాన్ నా క్లాస్ మేట్. రెండేళ్లు వరసగా వెళ్ళాను. ఎన్నో అంశాలు నేర్పారు– పదవర్ణాలు, తిల్లానా, జతిస్వరాలు, పదాలు, జావళీలు. మా చిన్న అమ్మమ్మగారింట్లో టీ.నగరులో ఉండేదాన్ని. ఎగ్మూరుకి బస్సులో వెళ్ళే దాన్ని. షావుకారు జానకి అప్పట్లో పరిచయమైంది. ఆ సమయంలోనే తిరువన్నామలై ప్రయాణాలు చలం గారిని చూడ్డానికి. 'మా తాతయ్య చలం' పుస్తకంలో ఎన్నో వివరాలు రాశాను.

అప్పట్లో కృష్ణ మోహన రావు గారు నా వెంట పడ్డారు. ప్రేమతో కట్టేశారు. అంటే నా పన్నెండో ఏట నుంచి అనుకోండి. MA ఎకనామిక్స్ చదవడానికి నిజాం కాలేజీలో చేరాను. నా చదువు గుంట పూలు పూసింది. విమెన్స్ కాలెజీ హాస్టల్‌లో మకాము. ఇంటి మీది బెంగా, ఏడుపులు. విద్యార్థి మీటింగులకి భువనగిరి, వైరా, మహబూబ్ నగర్ వగైరా చోట్లకి పట్టుకు పోయే వారు. చేకూరి కాశయ్య, తుమ్మల లక్ష్మారెడ్డి, జే.బాపు రెడ్డి మొదలైన వారు ఉండేవారు. మాక్ యుఎన్ పార్లమెంటు ఇల్లా ఏవో ఉండేవి. ఆంధ్రాభ్యుదయోత్సవాలు, నాటకాలు, పాటలు, రేడియో కార్యక్రమాలు ముమ్మరంగా ఉండేవి. అప్పటి నా క్లాసమేట్స్ శ్యాం బెనెగళ్, జానకీ మేల్కోటే, వైదీశ్వరన్, సీనియర్లు వి.ఎస్.రమాదేవి, సులోచనా నరోత్తమరెడ్డి. అప్పటికే నేను రేడియోలో గోపిచంద్ గారి దర్శకత్వంలో నాటకాలు, విశ్వనాథం గారి అజమాయిషీలో పాటలు పాడుతుండేదాన్ని. పాత ఖైరతాబాద్ స్టూడియోలోనే. అబ్బూరి వరద రాజేశ్వరరావుగారు రాసిన పాటలు. తొంభై నిముషాల జాతీయ నాటకం. లైవ్! అప్పుడే సైఫాబాద్ కొత్త స్టూడియో వచ్చింది. నాటక సప్తాహం ఆరేసి నాటికలు ఒక్కసారి. అక్కడే పడి ఉండేవాళ్ళం. భాస్కరభట్ల కృష్ణారావు దర్శకత్వం. బుచ్చిబాబుగారు ఉండేవారు.

ఆ సమయంలో నేను ఒకసారి నారాయణ రెడ్డి గారింటికి వెళ్ళాను. కరెంటు లేదు. ఆయన కొవ్వొత్తి పెట్టి రాసుకుంటున్నారు. ఏవో మాట్లాడాం. "మీ గొంతులో

కరుణ రసం బాగా పలుకుతుంది" అన్నారాయన. 'ఏహూదీకి లడకీ – యూదుకన్య' అనే నాటికను దృష్టిలో ఉంచుకుని. ఆ రోజుల్లోనే నేను నారాయణరెడ్డిగారి "గోకులవిహారం" సంగీతం రూపకాన్ని నృత్య నాటికగా ప్రదర్శించాను. ఆయనకి చెప్పాలని నాకు తోచలేదు. పద్మ, రాజకుమారి అని తమిళ సోదరీమణుల సాయంతో మాకు తోచిన రాగాలు పెట్టేసి డాన్స్ చేశాను. రమా మేల్కోటే కృష్ణుడు. ఆ తరువాత ఆయన నన్ను "వెన్నెలవాడ" చెయ్యమని అడిగారు. పాలగుమ్మి విశ్వనాధంగారు సంగీతం. చిత్తరంజన్ మొదలైన వారు పాట. తెలంగాణ రచయితల సభలో ఎగ్జిబిషన్ హాలులో ఆకాశమే నేపథ్యంగా చేశాను. మేము రిహార్సల్స్ రెడ్డి కాలేజి నిర్మాణంలో ఉన్న భవంతిలో చేసేవాళ్ళం. అప్పుడో సారి నారాయణరెడ్డిగారు చూడ్డానికి వచ్చారు. ఆయన వెళ్లిపోతోంటే నేను మొహమాటంగా "కొంచెం ఖర్చు అవుతుంది" అన్నాను. 'ఎంత?' అన్నారాయన. "పది రూపాయలు" అన్నాను నేను. ఆయన పదిహేను రూపాయలు జేబులోంచి తీసి ఇచ్చారు. అవి ఎందుకూ అంటే మేదరవాళ్ళ దగ్గిర పెద్ద రింగు చేయించి వాటితోనే కలువరేకుల ఆకారం చేసి తెల్ల క్రేప్ కాగితం అంటించి మెరుపులు చల్లి ఆ పువ్వు ఆకారంలోంచి కలువల రాణి బయటికి రావడం కోసం. అది అందరిని ఆకట్టుకొంది.

నేను సోషల్ వెల్ఫేర్ బోర్డ్ ఉద్యోగంలో చేరాను. అదీ దుర్గాబాయమ్మ గారి ప్రేరణ వల్లే.

నాకు రేడియోతో సంబంధం చాలా గట్టిగా సాగుతోంది. నాటికలు, శ్రవ్య నివేదికలూ, నాటికల నిర్వహణ, స్టేజీ కార్యక్రమాలు, ప్రతి ముఖ్యమైన కార్యక్రమానికి నా ప్రమేయము ఉండేది.

మా అమ్మావాళ్లకి చెప్పకుండా యాదగిరి గుట్ట మీద కృష్ణ మోహన్ రావు గారిని పెళ్లి చేసుకొన్నాను. కోదాటి నారాయణ రావు గారు, వి.ఎస్.రమాదేవి గారు వచ్చారు.

సోషల్ వెల్ఫేర్ బోర్డ్‌లో నా ఉద్యోగం మొదట డెస్క్ పనే అయినా ఆ తరువాత టూరింగ్. శ్రీకాకుళం నుంచి ఆదిలాబాద్ వరకు ఆరేసి జిల్లాలకి ఒక్కోసారి నేను ఇన్ చార్జీ. చాలా ముమ్మరంగా టూర్లు చేశాను. నాలుగు వందల స్వచ్ఛంద సంస్థల ఇన్స్పెక్షన్. ముగ్గురం ఉండేవాళ్ళం. నా రిపోర్టులు ఎక్కువగా ఢిల్లీ వాళ్ళు నమ్మేవారు. గడ్డు కేసులన్నీ పట్టుకోనేదాన్ని. అక్రమంగా తినే వాళ్ళు నన్ను రావద్దని వైర్లు ఇచ్చేవారు. ఎనిమిది, తొమ్మిదేళ్ళు చేశాను. గిరిజన ప్రాంతాల్లో శ్రీకాకుళం సీతంపేట, తూర్పు గోదావరి అడ్డ

తీగల, రాజవొమ్మంగి, విశాఖ చింతపల్లి, నర్సీపట్నం, ఆదిలాబాదు వాన్ఖిడీ– ఇల్లా ఎన్నో ప్రాంతాలు. జీపుల్లో ప్రయాణాలు. రైళ్ళలో అర్ధరాత్రి అని లేకుండా ఫస్టు క్లాస్ ప్రయాణాలు. నా పిల్లలు పుట్టాక వాళ్ళతోనూ ఆయాలను వెంట బెట్టుకొని తిరిగాను. చివరన వరంగల్ ఏటూరునాగారం కాశ్మీరీ ఆఫీసర్ వస్తున్నాడని వెడదామని బెడ్డింగ్ కట్టుకుని కూర్చున్నాను. ఎందుకు ఈ ఉద్యోగం అన్నారు కృష్ణ మోహనరావ్ గారు. ఈ ఒక్కసారీ కమిట్మెంట్ అన్నాను నేను. రెండేళ్ళు వెళ్ళలేదు. రాజీనామా ఇవ్వలేదు; సెలవు పెడుతూ వచ్చాను అప్పట్లో శశాంక చనిపోయాడు. ఆ రోజు "నిన్ను ఉద్యోగం మానెయ్యమంటాను గానీ మానకేం? శశాంక నా ఈడు వాడే" అన్నారు సరీగ్గా ఆరు నెలలకే ఆ మాట నిజమైంది.

1974 అక్టోబరు రెండవ తేదీ నా రాత అడ్డం తిరిగిపోయింది. కృష్ణ మోహన రావు గారు నకిరేకల్ వద్ద రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు.

తల్ల క్రిందులైనాను. ముక్కలైనాను. కడుపులోని మంచు ముక్కలై కాల్చింది.

ధరాఖాస్తు లేకుండా ఉద్యోగం వచ్చిన సందర్భం అదేనోమో. ఇంకా ఏడుస్తున్నావా జానకీ అనడిగేవారు దుర్గాబాయమ్మగారు. జానకీ అని ప్రేమగా పలుకరించేవారు దేశముఖ్‌గారు. పివిగారు, భాట్టం, మండలి, మర్రి చెన్నా రెడ్డి, సినారే– ఎందరెందరో పాపం నన్ను చూసి జాలి పడ్డారు. కట్టలుగా ఉత్తరాలు వచ్చేవి. పెద్దదానికి అయిదు, చిన్నదానికి రెండున్నర. బోర్డులో నాది టూరింగ్ ఉద్యోగం కనుక నేను ఎన్నడూ తలవని విధంగా రేడియోలో చేరాను. బ్రహ్మానందరెడ్డి గారిని తలచుకొంటాను. ఆయన హోం మినిస్టర్. ఆయన వల్లే భారత ప్రభుత్వం స్పందించింది. సోదరులు వామనరావు గారు నా శ్రేయోభిలాషి. ఆయన వల్లానూ.

రేడియో నా వ్యక్తిత్వానికి ఎంతో చేసింది. ఒక వినయాన్ని నేర్పింది. సంగీత, సాహిత్యాలను బహుళ జన ప్రయోజనకారిగా ఎల్లా మలచుకోవాలో చూపింది. పెద్దలందరికీ మర్యాద ఇస్తూనే వారిని ఎల్లా నా దారిలోకి తెచ్చుకోవాలో అలవాటు చేసింది. మొదట్లో ఎర్రలైటు వెలగ్గానే కళ్ళ నీళ్ళు తిరిగి గొంతు పూడుకు పోయేది. రావూరి భరద్వాజ, శారదా శ్రీనివాసన్, ఏం.జి. శ్యామలాదేవి– వీరంతా నన్ను ఆదుకొన్నారు. మహానుభావులైన వారితో – కేశపంతుల నరసింహశాస్త్రి, మంచాల జగన్నాథరావు, జనమంచి రామకృష్ణ, మాడపాటి సత్యవతి, పాలగుమ్మి వారు, వింజమూరి సీతాదేవి– ఒకరని ఏమిటి ఎందరో సంగీతజ్ఞులైన వారితో – ఈమని సరస్వతి, ఎన్.ఎస్. శ్రీనివాసన్,

ఎల్లా వెంకటేశ్వరరావు, షేక్ హుస్సైన్, మారెళ్ళ కేశవరావు, నేతి శ్రీరామశర్మ, శేషాచారి – అందరి సహకారమూ అందుకొన్నాను. నా కార్యక్రమాల్లో సంగీతం ఎక్కువగా ఉపయోగించేదాన్ని. ఎమర్జెన్సీ సమయంలో ఇరవై సూత్రాలు, ప్లస్ అయిదు సూత్రాలు. వాటి మీద పిల్లలకి ఒక సీరియల్ నాటకం కూడా రాశాను. చాలా కార్యక్రమాలు, రంగవల్లి, మహిళా సమాజం, గ్రామలక్ష్మి, సమత, బాలానందం, వినోదం, బాలవిహార్, నవలా స్రవంతి, స్రవంతి వయోధికుల కార్యక్రమం నేనే ప్రారంభించాను. అందరికీ చదువు–ప్రతీది ఒక సవాలే. ప్లానింగ్, ప్రొడక్షన్, ప్రెజెంటేషన్ అని మూడు అంశాలు. ఎవరు తప్పు చేసినా బాధ్యత నాదే. పిల్లలు తప్పు చేస్తే నేనే బాధ్యురాలిని, ఒక్కొక్కసారి తల్లిదండ్రులతో పేచీ వచ్చేది. కష్టపడ్డాను గానీ సంతృప్తి వుంది. ఆవుల సాంబ శివరావు గారు చీఫ్ జస్టిస్. రాజ్యాంగమూ – పిల్లలూ అని ప్రోగ్రాం పంపించాను. ప్రశ్నలు పంపమ్మా అన్నారు. రాజ్యాంగము తిరగేసి ఇరవై మూడు ప్రశ్నలు రాశాను. భవనం వెంకటరామ్ గారు మంత్రి. లైవ్‌కి పిలిచాను. పరీక్షలు ఎందుకు అని కార్యక్రమం. ఇందిరా గాంధీ గారి పేరు ప్రస్తావించకూడదు. ఎందుకంటే అక్కడ జనతా ప్రభుత్వం. ఆయనతో చెప్పాను. మిమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెడతానమ్మా అని నవ్వారు. ఇప్పటికీ ఎందరో మీరున్న రోజుల్లో అని ప్రస్తావిస్తుంటారు. అత్యధిక సంఖ్యలో రంగస్థల కార్యక్రమాలు చేశాను. వరంగల్, కరీంనగర్, గోదావరిఖని, నాగార్జున సాగర్, వనపర్తి, శ్రీశైలం– ఇలా ఎన్నో చోట్ల. రవీంద్ర భారతిలో పంతొమ్మిదేళ్ళు బాలల రంగస్థల కార్యక్రమాలు. రావు బాలసరస్వతిని మైసూర్ నుంచి నగరానికి రప్పించాను మొదటి సారిగా.

శోభనాయుడుతో నృత్య రూపకం చేయించాను– "ఎండిన నేలకు తొలకరి జల్లులు– ఒకే శీర్షికన నాలుగు కథలు" – అని. రవీంద్రభారతిలో మాలతీ చెందూర్, రామలక్ష్మి, వాసి రెడ్డి, "మాలచ్చిమి ముచ్చట్లు" ప్రతీవారం హైలెట్. శ్రీ రంగం గోపాలరత్నం పదహారు పాటలు రికార్డు చేశాను. "పన్నీటి జల్లులూ పల్లేరుకాయలు" అనే సంభాషణ ప్రతి ఆదివారం రాసేదాన్ని. నా దస్తూరీ లైవ్ చదివే శారద, శ్యామలకి జోహార్లు. సినీ ప్రముఖులు అక్కినేని మొదలు సోమయాజులు, భానుమతీ, మంజు భార్గవీ, మాడా, పి.బి. శ్రీనివాస్, బాల సుబ్రహ్మణ్యం ఇల్లా ఎందరో వచ్చేవారు. అన్నీ లైవ్. బాల కవి సమ్మేళనానికి సినారే, దాశరథీ వచ్చారు.

నృత్య నాటికలు కూడా ఎన్నో. వామనమూర్తి, కుచేలుడు, "పైడ్ పైపర్" మహీధర నళినీ మోహన్‌రావు "రాజుగారి జలుబు", "కోతి తపస్సు", "వంటింట్లో విప్లవం". స్త్రీలకి "విజయదశమి", "యక్ష గృహిణి", "వచ్చింది శ్రావణి"- ఇలా ఎన్నో.

"నిశ్శబ్దంలో ప్రేమ నాదాలు" వినికిడి లోపం ఉన్న పిల్లలకు తల్లులు మాటలు నేర్పే కార్యక్రమం, "ఆశ్రమం" వయోవృద్ధులను గురించిన కార్యక్రమాలకి, బాలల బృందగీతాలకు నాలుగు సార్లు ఆకాశవాణి జాతీయ స్థాయి బహుమతులు వచ్చాయి.

నారాయణరెడ్డిగారు టెలిఫోన్లో "అందరికీ చదువు" మకుటగీతం చెప్పారు. చిన్న సవరణ నేను చెబితే ఒప్పుకున్నారు. ఇది కదనకుతూహలరాగంలో ఉంటుందండీ, నిరక్షరాస్యత మీద ధ్వజం అంటే నవ్వారు. బాపూజీ మెచ్చిన నెహ్రూ, నేటి బాలలే రేపటి పౌరులూ-ఇలా కొన్ని పాటలు రాసి ఇచ్చారు. ఈ సందర్భంగా మా డైరెక్టర్ గణేషన్ గారు వారికి రెండు వందల యాభయ్యే ఇస్తామని చెప్పు అన్నారు. ఆయనకి తెలుసండీ అన్నాను. అయినా చెప్పు అన్నారు. నేను ఫోన్‌లో చెప్పాను. "మీ మాట గానీ మీ మూట నాకు ముఖ్యం కాదమ్మా" అన్నారు నారాయణరెడ్డిగారు.

వందేమాతర గీతం అద్భుతమైనది. బంకిం చంద్ర చటర్జీ ఆనంద మఠం రాసి వందేళ్ళు అయిన సందర్భంగా రవీంద్ర భారతిలో ప్రత్యేక కార్యక్రమం నేను అడిగాను నారాయణరెడ్డిగారిని- 'సుజలాం ఎటువంటి జలాలు సుఫలాం ఎటువంటి ఫలాలు ఇలా వర్ణించే గీతం కావాలి' అని. ఆయన వచ్చారు. ఎమ్2 స్టూడియోలో కూర్చుని తనదైన శైలిలో పాడేశారు. ఇది భలే బాగా వచ్చింది అన్నారు. రెహ్మాన్ "మా తుఝే సలాం" కంటే ఎంతో ముందు వచ్చింది. దూర్‌దర్శన్‌కి ఇవ్వండి అన్నాను. నేను పోయి అడుగుతానా అన్నారు. పదహారు మంది పిల్లలతో నాట్యం చేయించాను. దృశ్య గీతి అని ఆహ్వానంలో వేశాను. ఇదేమిటి అన్నారు. చూడతగినది, చూడవలసింది. అని చెప్పాను నేను.

1975లో ప్రొడ్యూసర్‌గా చేరాను. 1994లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా రిటైర్ అయ్యాను. రిటైర్ అయిన పద్దెనిమిది ఏళ్లకి ఎప్పుడు వెళ్ళినా అందరూ ఆప్యాయంగా పలుకరిస్తారు. ఆకాశవాణీ నమస్తుభ్యం అనుకొంటాను. రిటైర్మెంట్ తరువాత నేను యునిసెఫ్, సేవ్ ది చిల్డ్రెన్ యూ.కే.తో పని చేశాను. వివిధ ప్రభుత్వ శాఖలకీ ఎన్.సి.ఈ.ఆర్.టి.కి ఇరవై ఏడు ఆడియో క్యాసెట్లు రూపొందించి ఏడు జిల్లాలలో "బాల జాగృతి", "మా చేతి పంపు-మన బిందె నింపు", "చిరు దీపం" ఎయిడ్స్ సోకిన వారి పిల్లల సంరక్షణ

కార్యక్రమాలు అంటే వీధి ప్రదర్శనలు షుమారు ఆరున్నర వందల వరకూ నిర్వహించాను. ఇవి తెలుగు, హిందీ, ఉర్దూ, ఒరియా భాషల్లో చేశాం. నగరంలో పదమూడు కాలనీల్లో చెట్లు నాటి యువజన శిబిరాలు పెట్టాను. ఆ చెట్లు పెద్ద వృక్షాలు అయినాయి. నా సంతోషానికి అంతులేదు. ఐ.ఏ.ఎస్. ఆఫీసర్లు రమణాచారి, ఊర్మిళా సుబ్బారావు. చందనా ఖాన్, ఛాయారతన్, కుల్సుం అబ్బాసీ, యునిసెఫ్‌లో భార్గవ, సుధా మురళి ఎంతో సహకరించారు. చాలా చెప్పాను. చాలా చాలా వదిలేశాను. ఇప్పటికైనా సాహిత్యంలోకి వస్తాను. నాకు పన్నెండేళ్ళ వయస్సు ఉన్నప్పుడు మా ఇంట్లోనే మహిళా మండలి గ్రంథాలయం ఉండేది. రెండు వందల తెలుగు పుస్తకాలు చదివాను అర్థమైనా కాకపోయినా. వేలూరి శివరామశాస్త్రి, మల్లంపల్లి, అడవి బాపిరాజు, కుటుంబరావు, చలం, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, ఇంకా కొవ్వలి, జంపన-- ఒకటేమిటి కనుపించిందల్లా చదివే దాన్ని. ఆ ప్రేరణతోటే పదిహేనో ఏట కృష్ణా పత్రికకి ఒక కథ రాశాను. అది ఏ సర్టిఫికేట్ కథ, రావూరి సత్యనారాయణ గారు ఈ కథ రాసిన అమ్మాయి వయస్సు పదిహేను అని క్రింద రాశారు. అల్లా మొదలైంది నా రచనా వ్యాసంగం.

తెలుగు స్వతంత్రలో వారాలకి ఒకటి చొప్పున ఎనిమిది కథలు వచ్చాయి. గోరా శాస్త్రి పెద్ద ఉత్తరాలు రాసేవారు మెచ్చుకొంటూ. నిజాం కాలేజీ లైబ్రరీలోకి భయంగా వెళ్లేదాన్ని పత్రిక చూసుకోవడానికి. కథ ఉండేది. సంతోషం! అప్పుడే జాన్ గాల్స్ వర్దీ, సోమర్సెట్ మాం, జేబి ప్రీస్లీ, గీ ద మొపాసా, ఓ హెన్రీ మొదలైన అనువాదాలు స్వతంత్రలో, ఆంధ్ర ప్రభలో విశ్వ సాహితీ అన్న పేరున రాశాను.

ఆంధ్ర సచిత్ర వార పత్రికలో నేను రాసిన కథలు చాలా వచ్చేవి. వాటికి బాపు బొమ్మలు. నా హాస్టల్ వాతావరణంలో రాసేదాన్ని. స్నేహం, వెలుగు నీడలు, మరలి వచ్చిన మైత్రి, అపశ్రుతి, స్వయంకృతాలు వంటివి. జనం కొందరు మెచ్చుకునేవారు. జీవిత సత్యాలు అనే కథను గురించి యాభై ఏళ్ళ తరువాత ఒక లెక్చరర్ మెచ్చుకొంటే ఆశ్చర్యపోయాను.

“అగమ్య గమ్యస్థానం” అనే కథ ఆంధ్ర పత్రిక స్వర్ణోత్సవ సంచికలో వచ్చింది. సికిందరాబాదు స్టేషన్ నుంచి నిండుగా లైట్లతో బయలుదేరిన బస్సు మునిమాపు వేళ ఖాళీ అయిపోయి అఫజలగంజ్ చేరుకున్న ప్రయాణంతో ఒక మహిళ జీవితం చేరుస్తూ కథ సాగుతుంది. మనిషికి జీవితంలో రాదగ్గ కష్టాలేమిటి అని ఆలోచిస్తే చిన్న తనంలో

తల్లి దండ్రులను కోల్పోవడం, యవ్వనంలో జీవిత సహచరిని కోల్పోవడమూ, వృద్ధాప్యంలో సంతానాన్ని పోగొట్టుకోవడము అని స్ఫురిస్తుంది. ఈ మూడు కష్టాలు ఒకరికే వస్తే ఏమౌతుంది? ఏమీ కాదు అని చెప్పాను. ఈ ప్రకృతికి ఏమీ శోభ తగ్గలేదు. సూర్యచంద్రులు ఉదయించక మానరు. పువ్వులు వికసించక మానవు. మన మనస్సుకే ఒక గాయమైంది. అది పుండులా సలిపినా, గాయం మాని మచ్చ మిగిలినా ఎవ్వరికీ కనుపించదు. మనకి నిర్ణీతం అయినంత కాలం బ్రతుకవలసిందే. మధ్యలో, మీనాక్షి అనే కథానాయిక దిగి పోదామని లేస్తుంది. మీ టికెట్ ఆ చివరి వరకూ కదమ్మా అంటాడు కండక్టర్. అవును, తన వారందరి గమ్యాలు వేరు. తన గమ్యం వేరు. ఎవరైనా తనని ఎందుకు ముందుగా పోనిస్తారు అనుకుని ఆస్తి శరణాలయానికి రాయాలనుకొన్న పత్రాలు గట్టిగా పట్టుకుని చివరికి లాయర్ దగ్గరికి వెడుతుంది. కన్నీటి చుక్కలేని కళ్ళు తుడుచుకుంటుంది. ఈ కథని రాచకొండ మెచ్చుకుంటూ ఉత్తరం రాశారు. యువలో వచ్చిన కథకీ, ఆంధ్ర ప్రభలో వచ్చిన మరొక కథకీ కృష్ణశాస్త్రిగారు నా చేత కంటతడి పెట్టించావు అన్నారు. మల్లాది రామకృష్ణశాస్త్రి నువ్వు సంభాషణలు బాగా రాస్తావు, నాటకాలు రాయి అన్నారు. సంఘజీవి అనే బుద్ధిమాంద్యం గల పిల్ల కథ చదివి ఉండి ఉండి బలే కథ రాసేవే అని వీపు మీద ఒక దెబ్బ వేశారు కొడవటిగంటి. "ద రైటర్ కన్ రైట్" అని మాత్రమే అన్నారు చలం. నాకు ఈనాటి రచనలు నచ్చలేదంటే మీ లోపం కాదు. చలం టేస్టుదే లోపం అన్నారు కూడా చలం. నాకు భయం నా రచనలు ఆయనకి చూపడం. యువ, జయశ్రీ, స్వాతి, జ్యోతి, ఆంధ్రజ్యోతి, వనిత, వనితా జ్యోతి, ఇలా చాలా పత్రికలకే రాశాను. యువ దీపావళి సంచికలలో వచ్చిన మాను వంగింది, "దీపాలు వెలిగాయి కానీ" వంటి కథలు మిత్రులు మెచ్చుకొన్నారు. పద్మరాజుగారి దగ్గరకు తమిళ కల్కి పత్రిక వారు కథకోసం వస్తే నాది ఎందుకు ఈ అమ్మాయి చూడండి ఎంత బాగా రాసిందో అని నా పరిష్కారం అనే కథ ఇచ్చారు. అది తమిళంలో అనువాదమైంది. భీం సేన్ నిర్మల్ గారు హిందీలోకి రెండు కథలు అనువదించి ధర్మయుగ్, సారికా పత్రికల్లో వేశారు. కన్నడంలో సుధాపత్రికలో రెండు కథలు వచ్చాయి. ఒరియాలో ఒకటి వచ్చింది. పేరు గుర్తు లేదు. హిందీలో ఆరు కథలు పుట్టపర్తి నాగపద్మిని అనువదించి పుస్తకం వేసింది. "యాత్ర" కేంద్ర సాహిత్య అకాడెమీ బంగారు కథలులో వచ్చింది. మళ్ళీ హిందీలోకి అనువదించి పెద్ద సభ పెట్టి నా చేత తెలుగు చదివించారు. ఆంధ్ర జ్యోతిలో వేయబోవని తలుపు, సంఘర్షణ అనే నవలలు సీరియల్‌గా వచ్చాయి. ఇండియా టుడేలో నాలుగు కథలూ, ఒక మూడు భాగాల పెద్ద కథ "జనసంద్రంలో రక్తతరంగం" వచ్చాయి. దీన్ని

మెచ్చుకొంటూ అవసరాల రామకృష్ణరావు ఉత్తరం రాశారు. ఈనాడులో వచ్చిన వెలిగే దీపం, సన్మానం చాలా ఏళ్ళకి గుర్తు పెట్టుకొని పాఠకులు ప్రస్తావించారు. నేషనల్ బుక్ ట్రస్ట్ వారి సంకలనంలో, రాష్ట్ర సాహిత్య అకాడమీ సంకలనంలో, నూరేళ్ళ పంట, కదంబం ఇల్లాగ ఎన్నో విధాల వచ్చాయి. రేడియోలో రసమయి కార్యక్రమం రాత్రి తొమ్మిదిన్నరకి- కృష్ణశాస్త్రి గారు, రజని గారు వచ్చేవారు. రెండు కథలు రాసి లైవ్ చదివాను. ఒక కథకి కృష్ణశాస్త్రి గారు 'వృంతము' అని పేరు పెట్టారు. నేను తెల్ల మొహం వేస్తే, సరేలే, తొడిమ అని పేరు పెడదాం అన్నారు. తరలి వెళ్ళాము అనేది నేషనల్ బుక్ ట్రస్ట్ వారి కథాభారతిలో వేశారు. ఇంగ్లీషులో కూడా వచ్చింది. ఎర్రగులాబీలు శ్రీనివాస రాయప్రోలు అనువదించారు.

నా నాటికలు, ముఖ్యముగా రేడియోకి రాసినవి, ఇరవైకి పైగానూ, పిల్లల కోసం మరొక ఇరవై ఉంటాయి. వేరెవ్వరూ ఇంత సంఖ్యలో రాసి, ప్రొడ్యూస్ చేసి ప్రచురించినవారు లేరని నా నమ్మకం- ముఖ్యముగా మహిళల్లో. పదహారు నాటికలూ, రూపకాల సంకలనం వేశాను. గురువు గారే ఆవిష్కరించారు. రెండు మాత్రం చెబుతాను. ఒకటి అపరాజిత గంట నాటకం. ఇది ఇంగ్లీషులో రాసి BBCకి పంపాను. ఇది తెలంగాణా కథ- మహిళ అన్ని విధాల అన్యాయమైనా ఎల్లా నిలబడుతుందో చెప్పాను. మాండలికంలో రాశానని అన్నాను. మా స్నేహితుడు మహబూబ్ నగర్ మనిషి కే.బి. గోపాలం. మా అల్లుడు కరీంనగర్ మనిషి నరేందర్ వీళ్ళకి చూపించేదాన్ని ఏమీ ఎబ్బెట్టుగా లేవు కదా అని. వారు ఆమోదించాకే అచ్చుకి పంపేదాన్ని. అయినా అల్లం నారాయణ సంకర భాష అన్నారు పోనీండి.

పవిత్ర అనే మరొక నాటిక. కేశవపంతుల వారు వేదం, జి.వి. సుబ్రహ్మణ్యంగారు ఉపనిషత్ శ్లోకాలు చదివి పెట్టారు. స్త్రీలు ఎప్పుడూ పవిత్రులే. బలాత్కరించబడి, గర్భము దాల్చినా, ఆ సంతానాన్ని కన్నాక వారు తిరిగి పవిత్రులే. వారి సంతానానికి గ్రాస వాసాది దైన్యము లేక కట్టుకొన్న వాడు చూడాలి, అని స్మృతులు చెబుతున్నాయి. లోకంలో అక్రమ సంతానం అంటూ ఏదీ లేదు అని ప్రామాణికంగా చెప్పే నాటిక. ఇది ఇంగ్లీషులో శ్రీనివాస్ రాయప్రోలు అనువదించారు. ఆనందా శంకర్ నృత్యనాటిక చేస్తానన్నది. ఎప్పుడో మరి.

పిల్లల నాటికలన్నీ రవీంద్ర భారతి రంగస్థలం పైన ప్రదర్శించినవే. 'బీనందం గారి ఆసుపత్రి' సంకలనం జవహర్ బాలభవన్ ప్రచురించింది. మిఠాయి పొట్లం కథల

సంపుటి భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం వేసింది. రీ బిల్డ్ ఇండియా స్వామి వివేకానంద రచన అనువదించాను. రామకృష్ణ మఠంవారు ఎన్ని ముద్రణలు వేసుకున్నారో తెలియదు. డాక్టర్ సుశీలా నయ్యర్ కస్తుర్బా అనువదించాను. బెజవాడ గోపాలరెడ్డిగారు రాజ భవన్ ఆవిష్కరించారు. నేషనల్ బుక్ ట్రస్ట్ కి "రెడ్ క్రాస్ కథ", "బంగారు పిలక" సంకలనం చేశాను.

కృష్ణమోహనరావుగారు గతించినప్పుడు రాసిన కవితలు, నేను ఆ పేరుతో పిలువను. ఒక కవిత చూసి నారాయణరెడ్డిగారు అన్నారు. "ఏమీ గేయం చూశానమ్మ" అని. అది గాయమండీ అన్నాను. కానీ సోదరుడు సుధామ ద్రవహృదయం కవిత్వం అని అభివర్ణించినపుడు తల వొగ్గాను. మొత్తం ఇరవై ఏడు పుస్తకాలు వేశాను. ఇప్పుడు నాలుగు వందల ఏభై పేజీల కథల సంకలనం వేస్తున్నాను. ప్రస్తుతం బెంగుళూరు 'ప్రథమ బుక్స్' వారికి పన్నెండు పిల్లల పుస్తకాలు అనువదించాను. వారు చాలా అందంగా ఆ పుస్తకాలు ముద్రించారు. నాకు చాలా సంతోషంగా ఉంది ఈ పని చెయ్యగలిగినందుకు. క్లుప్తంగా నా రచనా వ్యాసంగం ఇది. ప్రయోజనం కోసం రాయలేదు. మనసున్న మనిషిగా రాశాను. ఏ సిద్ధాంతమూ ప్రతిపాదించలేదు, బలపరచలేదు. మనుష్యుల కథలు రాశాను. భాష మెరుగు పరచుకోవడానికి అనుక్షణమూ ప్రయత్నిస్తుంటాను. నా బ్రాండు కథలు గుర్తు పట్టవచ్చు ఒకసారి రజనీ కాంతారావుగారన్నట్లు. బడుగు జీవుల కథలు నాలుగైదు రాశాను. నాకు ఆ జీవితాలు ఎక్కువ చిత్రించగలనో లేనోనని బెరుకు. స్త్రీ అన్నిట్లో అంతర్వాహినిగా ఉన్నది. "జగన్మాత" అని ఒక కథ. ఒకామె పెళ్లి కాకుండా ఒక సంబంధం వల్ల పిల్లవాడిని కంటుంది. వాడిని పెంచుకుంటూ ఉంటుంది. ఇద్దరు మిత్రులు ఆమెను చూడ్డానికి వెడతారు. ఒకరు ముక్క చీవాట్లు పెట్టడానికి; మరొకరు వోదార్చడానికి. ఆమె ఏడవదు. పైగా గర్వంగా తన కొడుకుని ముద్దు చేస్తుంటుంది. ఏమి మాట్లాడాలో తెలియక తిరిగి వస్తారు మిత్రులు. అది ఏడవనిదే ఏమి వోదార్చను అంటుంది ఒకామె. ఎందుకు ఏడుస్తుంది? హిమాలయ శిఖరాన దేదీప్యమానంగా వెలిగిపోతూ లోకాన్ని చిన్న చూపు చూస్తున్న జగన్మాత, దాని వ్రేళ్ళ కొసల నుంచి జాలువారుతున్న అనురాగం చూడలేదా?" అంటుంది రెండో ఆమె. వివాహంతో సంబంధం లేకుండా మాతృత్వానికి నేనిచ్చిన విలువ అది. ఆమె గౌరవనీయురాలు. ఆమెకు ఆ హక్కున్నది అని చెప్పాను. ఇది ఇంగ్లీషులోకి అనువాదమైంది.

సాధన సమితి సమావేశాలు మా ఇంట్లో, బూర్గుల రంగనాధరావు గారింట్లో, నెల్లూరి కేశవస్వామి ఇంట్లో జరిగేవి– ప్రతి మొదటి ఆదివారం. ప్రతీ వారూ తమ రచన చదవాలి. దాన్ని మెచ్చుకొనే వారు, చీల్చి ఎండేసే వారు. దూషణ భూషణల్ని ఎదుర్కోవాలి. వాకాటి, అక్కిరాజు, పోరంకి, భాస్కరభట్ల, ఒక్కోసారి ఆవంత్స సోమ సుందర్, శశాంక, ఉషశ్రీ వచ్చేవారు. అందరికీ ఆతిథ్యమిచ్చే భాగ్యం నాకు కలిగేది. నా అనారోగ్యాలని గురించి చెప్పాలి. పదమూడేళ్ళ క్రితం రొమ్ము కాన్సర్ ఆపరేషన్ అయ్యింది. ఆరేళ్ళ క్రితం పేస్ మేకర్ అమర్చారు. "నా గుండెలో హృదయ గమన నిర్దేశన యంత్రం పొదిగినప్పుడు నేను సాధికారత సాధించాను" అని నిమ్స్‌లో ఉండగా రాశాను. 'వార్త' పత్రికలో అచ్చయ్యింది.

గృహలక్ష్మి స్వర్ణకంకణం ముప్పై ఏళ్ళ నాడే వచ్చింది. ఆ అభినందన సభకు నారాయణరెడ్డిగారే అధ్యక్షత వహించారు. సుశీలా నారాయణరెడ్డి అవార్డు పద్దెనిమిది ఏళ్ళ క్రితం ఇచ్చారు. ఆ మహా ఇల్లాలిని తలుచుకొంటే నాకు కళ్ళల్లో నీళ్ళు వస్తాయి– పిన్న వయస్సులోనే వెళ్లిపోయినందుకు. చింతా దీక్షితులు, మాదిరెడ్డి సులోచన అవార్డు, దక్షిణ మధ్య రైల్వే వారి విశిష్ట పురస్కారమూ, ఆకాశవాణి బహుమతి వచ్చినప్పుడు ముప్పై నాలుగు మహిళా సంఘాలు, యూనిసెఫ్ కలిసి చేసిన సత్కారం, తెలుగు విశ్వ విద్యాలయం రెండు సార్లు, ఒకటి ఉత్తమ రచయిత్రి పురస్కారమూ, నవ్వని పువ్వు కథల సంపుటికి శంకర్ దయాళ్ శర్మగారి చేతుల మీదుగా పురస్కారమూ, సనాతన ధర్మ పరిషత్తు వారు మొన్న ఉగాదికి చేసిన ఘన సత్కారమూ, పింగళి వెంకయ్య పురస్కారమూ, వరప్రసాదరెడ్డిగారు చేసిన మాతృవందన దూరదర్శన్లో, మా టీవిలో, జెమినీలో, మహాటీవిలో, సితార, వనితా టీవిలో నన్ను గురించి డాక్యుమెంటరీలు తీశారు. ఇంటర్వ్యూలు చేశారు. నాకిద్దరు అమ్మాయిలు ఉషారమణి, వసంత శోభ. ఉష ఎంఏ, ఎం. ఫిల్ చేసి పి. హెచ్.డి చేస్తోంది. ఆకాశవాణిలో వార్తలు చదువుతుంది. అది ఉద్యోగం. మూడు ఇంగ్లీష్ న్యూస్ పేపర్లలో పని చేసి, ఇంగ్లీష్ జర్నలిజంలో పేరు సంపాదించుకుంది. రకరకాల సంస్థలకి డాక్యుమెంటరీలు చేస్తుంది. శోభానాయుడు దగ్గిర నాట్య విశారద పూర్తి చేసింది. వసంత శోభ ఆర్కిటెక్ట రెండు ఎం.టెక్.లు పాస్ అయ్యింది. సంస్థానాల మీద పి. హెచ్.డి. చేస్తోంది. హైదరాబాదు వారసత్వ సంపద మీద విస్తృతంగా పని చేసింది. ఇద్దరికీ సంగీతం, నాట్యము వచ్చు. శోభకి చిత్ర లేఖనం వచ్చు. అమెరికా, సౌత్ ఆఫ్రికా, కెన్యా, ఫ్రాన్స్ థాయ్ లాండ్, శ్రీలంక, మెక్సికో మొదలైన దేశాలన్నీ తిరిగి వచ్చారు. నన్నూ తీసుకు వెడదామని రోజూ పేచీ. నేను రానంటాను. అల్లుడు రేవెల్లి

నరేందర్ జర్నలిస్ట్, బిల్ గేట్స్ ఫౌండేషన్‌లో పని చేస్తున్నాడు. క్రికెట్ విశ్లేషణ అపరిమితంగా చేస్తూ రోజూ ఏదో ఒక టీవీలో కనుపిస్తుంటాడు. ముగ్గురూ బంగారమే. నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటారు. నాకు చింతలున్నాయి. కానీ ఇప్పుడు చెప్పను.

యువతరానికి నేనిచ్చే సందేశామా? ఆత్మ గౌరవాన్ని కాపాడుకోండి. మనధర్మం ఏమిటో అంతర్వాణి చెబుతూనే ఉంటుంది. దాని గొంతు వినండి. విద్య వికాసం పొందండి. మంచి మనుష్యులుగా బ్రతకండి. సందేశం ఇచ్చేంత పెద్ద దానిని కాలేదు కానీ.. పరిషత్తు వారిచ్చిన తాఖీదులో ఆ మాటా ఉన్నది. యువ రచయితలకు చెప్పేది భాషని పెంచుకోవాలి, కవిత్వం చదవాలి.

నేను అభిమానించేవారు వీలుంటే ఒక్కసారి గౌతమ బుద్ధుడినీ, ఆది శంకరులనీ, స్వామీ వివేకానందని చూడాలని ఉన్నది. ఇరవై ఏడు వేల నాలుగు వందల రోజులకి పైగా బ్రతికిన తరువాత నేను నేర్చుకున్న దేమిటి, అర్థం చేసుకున్నదేమిటి అని యోచిస్తే, ఏ సమయానికి ఆ ధర్మం అనుసరించు అని. పిల్లగా, తల్లిగా, భార్యగా, ఉద్యోగిగా ఎప్పటికప్పుడు నీ విధ్యుక్త ధర్మం నీకు గోచరిస్తూనే ఉంటుంది. అది ఎంత కష్టమైనా వీలైనంత అనుసరించు. గొప్ప ఆత్మానందం ఉంటుంది. నువ్వు ఉన్నతిని పొందాలని స్వార్థపడు. తప్పులేదు. శరీర శ్రమకు ప్రత్యామ్నాయం లేదు. కష్టపడవలసిందే. ఆ శ్రమ తగ్గించుకోవడానికి సౌలభ్యాల కోసం వెతుక్కో. ఉన్న దానితో సంతృప్తి పడు. పై మెట్టు మీద ఉన్న వారిని చూసి బాధ పడితే అది నీ కడుపు మంటను పెంచుతుంది. నేను నలభై రూపాయల రేకుల ఇంట్లో ఎల్లా ఉన్నానో బంజారా హిల్స్ మేడలోనూ అల్లాగే ఉన్నాను.

ఏడుస్తూంటే నీ దగ్గరికి ఎవ్వరూ రారు. దిగమింగేసి నవ్వితే కొందరైనా వస్తారు.

అందరిలో ఉన్నది దీపం. అది పరమాత్మని ప్రతి రూపం అని గుర్తు చేసుకుంటూ ఉండు. ప్రతీ మనిషినీ గౌరవించు. నీకు నువ్వే పెరిగినట్లు తృప్తి పొందుతావు. తల్లి ప్రేమను మించినది లేదు. అది అనుక్షణమూ ప్రసరింప చేస్తూ ఉండు. నీ వారికి సేవచెయ్యి. స్త్రీ జీవితం చాలా కష్టం అని చాలా కాలానికి గ్రహించాను. ఆమె వోర్పు వల్లనే కుటుంబం, పిల్లలూ, సమాజం నిలబడుతాయి.

చెప్పడం తేలికేనేమో. నేనెంత వరకూ ఆచరించినదీ నాకు తెలియదు. నన్నెరిగినవారు చెప్పాలి.



ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులు

వ్యక్తమయ్యే చైతన్యం ఎప్పుడూ అనంత రూపాలలో ఆవిష్కృతమవుతుంది. బీజం నాటినా వ్యక్తమయ్యే వృక్షం ఏ ఆకృతిలో పెరిగి వస్తుందో ఎవరూ చెప్పలేరు. మనిషి బ్రతుకూ అంతే. ఎవరి బ్రతుకూ సరళరేఖాకారంగా ఉండదు. ఎన్నో మలుపులు, మార్పులు తప్పనిసరి.

మాది వరంగల్ పట్టణం. నేను మార్చి 17, 1936లో పుట్టాను. నేను పుట్టిన నాటికి నిజాం రాష్ట్రంలో మేలుకొనబోతున్న స్వాతంత్ర్య సంగ్రామం, మేలుకొని తరంగాలు తరంగాలుగా రూపొందుతున్న తెలుగువారి సామాజిక సాహిత్య ఉద్యమాలు, తెలుగు భాషను, సారస్వతాన్ని రక్షించుకోవాలన్న తీవ్ర సంకల్పం గాలిలో వ్యాపించి ఉన్న కాలం. బ్రిటిష్ ఇండియాలో దృఢమైన సంకల్పంలోకి సాగుతూ వున్న స్వాతంత్ర్యోద్యమం. భారత దేశాన్ని ఆవరించిన గాంధీజీ వ్యక్తిత్వం, సాహిత్య రంగంలో విశ్వంలోనే తన ఉనికిని నిలబెట్టుకున్న రవీంద్రుని కవితా మూర్తిత్వం- జీవనాన్ని దాని చైతన్య మూలాలను స్పృశిస్తున్న భారతీయ తాత్త్విక మథనం జరుగుతున్న కాలం. ఇదీ వాతావరణం.

మా తాతగారు కోయిల్ కందాడై రంగాచార్యులు గారు. వారి పూర్వులు అదే జిల్లాలోని నెల్లికుదురు, మునిగలవీడు, చిట్యాల గ్రామాలలోని వారు. చివరకు వారు చిట్యాల (వరంగల్ జిల్లా తొర్రూరు దగ్గర) నుండి వరంగల్లుకు వచ్చి చేరుకున్నారు. వారి మేనమామ గారు వరంగల్లులో ఉండేవారు. వారి కుమార్తెను వివాహమాడి వారికి పురుషసంతతి లేకపోవటంతో తాతగారు వరంగల్లుకు వచ్చినారు.

మొదటి నుంచీ బీద కుటుంబమే. జీవిక కోసం కరణాల యింద్లలో వంటలు చేస్తూ కడుపు నింపుకున్నారు. చదువుకోవాలని బలమైన కోరిక ఉండేది. అవకాశాలు లేవు. దొరికిన పుస్తకం చదువుతూ–స్వయం వ్యక్తులుగా రూపొందుతూ వచ్చారు. వరంగల్లుకు రాగానే ముదిగొండ మల్లికార్జున శాస్త్రి, అమరవాది నారాయణాచార్యుల వద్ద సంస్కృత సాహిత్యము, ఇతర ప్రాథమిక శాస్త్ర గ్రంథాలు అధ్యయనం చేసినారు. అయినా దానితో తృప్తి కల్గలేదు. విద్యాపిపాసతో విజయనగరం వెళ్లారు. 1905 ప్రాంతాలలో (20 ఏండ్ల వయసులో) అక్కడ సంస్కృత కళాశాలలో తాతా సుబ్బరాయ శాస్త్రి మొదలైన దిగ్గంతుల వద్ద శాస్త్రాభ్యాసం చేసినారు. తునిలో రాజావారి ఆస్థాన విద్వాంసులు, సద్విద్యాప్రకరణాది గ్రంథకర్తలు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల చిన రంగాచార్య స్వామి వారి వద్ద శ్రీభాష్యం పూర్తి చేసుకున్నారు. ఇంచుమించు 1910నాటికి ఎన్న దగిన ఉభయ వేదాంత విద్వాంసులయ్యారు. స్వయం కృషితో పురాణేతిహాసాలను, శాస్త్ర గ్రంథాలను అధ్యయనం చేసినారు.

క్రమంగా విశిష్టాద్వైతంలో ఇటు కాంచి నుంచి, అటు విజయనగరం దాకా మహా విద్వాంసులుగా పేరొంది అనేక బిరుదులు సన్మానాలు గ్రహించారు. మా ఇంట్లో సంస్కృత విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు. వారికి భోజనాల వసతీ యిక్కడే. మా తాతగారి సంతానం నలుగురు కుమారులు. పెద్దవారు వెంకట నరసింహాచార్యులు నా తండ్రి. మిగిలిన ముగ్గురిలో చివరి వారు సంపత్కుమారాచార్యులు గారు. నలుగురిలో ముగ్గురూ ఉభయ వేదాంతాలలో పండితులే. చివరి వారు మీ అందరూ ఎరిగిన ఛందోవ్యాకరణాలంకార శాస్త్రాలలో సాహిత్యంలో తనదైన ముద్ర వేసుకున్న సంపత్కుమార.

నేను పెరిగిన ఈ వాతావరణానికి కొంచెం వేరైనది మా అమ్మగారి పుట్టిల్లు. మా మాతామహులు ఠంయాల లక్ష్మీ నరసింహాచార్యులు. వారిది వరంగల్లులోని గోవిందనగరం (ఎల్లంబజారు). శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ నిర్మాతల కుటుంబం. వారు తెలుగులో అనేక ప్రబంధాలు, క్షేత్ర మాహాత్మ్యాలు, చిత్రబంధ కవితలు, యక్షగానాలు, నాటకము, ప్రహరి వంటి రచనలు చేసినవారు. కవినాథ బిరుదాంకితులు. వారి యింట వాస్తు జ్యోతిషాది శాస్త్రములు కూడా అధ్యయనంలో ఉండేవి.

మా మాతామహులకు అయిదుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. పెద్ద కుటుంబం. వచ్చిపొయ్యేవాళ్లు– ఎట్లా గడిచేదో సంసారం. అందరిలో మా అమ్మ మూడవ

సంతానం. మొదటి ఆడబిడ్డ. ఆడపిల్ల కావాలని మా అమ్మమ్మ కొడవటివంచ లోని లక్ష్మీనృసింహాస్వామి సేవకు వెళ్లిందట. ఆ వూరి స్వామి ఆమె కలలో కనిపించి తన కోరిక తీర్చటానికి ఒక రూపాయి ఇమ్మన్నాడు. ఆమె పావులా ఇస్తానన్నదట. చివరకు ఏదోవిధంగా స్వామియే అంగీకరించాడు. అమ్మ పుట్టింది 1918లో. ఆమె పేరు లక్ష్మి (ఈ విషయం మాతామహులు రచించిన కొడవటివంచ క్షేత్ర మాహాత్మ్యంలో ఉన్నది). తరువాత ఆమె పేరు లక్ష్మీ నరసమ్మ.

నా వ్యక్తిత్వం మీద ఒత్తిడులు ఈ రెండు ఇండ్లలో నుంచి వచ్చినవే. శాస్త్రీయ సంప్రదాయ విద్య ఒకవైపు, కవిత్వం పొంగే వాతావరణం మరొకవైపు.

పాంచాలరాయ శతకంలో నేను వ్రాసిన పద్యం యిది.

ఇటు చేయి వేసిన తాత హేలా కవిత్వాభిరాము
డటు చేసి వేసిన తాత ఆధ్యాత్మ విద్యానిధాను
డిటుల నా తల్లిదండ్రు లిర్వురీ చెట్ల మధుర ఫలములు
చిటిలిన మధువేనొ కానొ చేకొమ్ము పాంచాల రాయ

నా కోసమూ మా అమ్మ వ్రతాలూ ఉపవాసాలూ చేసిందట. నేను వరమున పుట్టినాను. చిన్నతనంలో ఎన్నో బాలరిష్టాలు. అవన్నీ దాటుకుంటూ వచ్చాను. అమ్మ తన తమ్ముడి వివాహం నిమిత్తం వేల్పుగొండ (ఇప్పుడు జఫర్‌గఢ్)కు వెళ్లగా అక్కడ నేను పుట్టినాను. వేల్పుగొండ అతి పురాతన క్షేత్రం. అక్కడ లక్ష్మీనరసింహాస్వామి స్వయం వ్యక్తమూర్తి. ఆయన నీడలో పుట్టడం వల్ల ఆయన నేత్రకాంతులు నా మీద ఆవేళ ప్రసరించాయేమో! అది పంచ నారసింహ క్షేత్రం. ఆ కొండమీద కోటగోడలున్నాయి. ఆదిరాజు వీరభద్రరావు గారు వేల్పుగొండ కాకతీయుల తొలి రాజధాని కావచ్చునన్నారు. ఆ కొండకు నైరృతి భాగంలో సుప్రసన్న నారసింహ క్షేత్రం ఉన్నది. అక్కడ పన్నిద్దాళ్వారులూ ఒకే బండమీద ఉన్నారు. మా నాన్న యింట్లో, అమ్మ ఇంట్లోనూ పరంపరంగా వస్తున్న ఇలవేలుపు వేల్పుగొండ స్వామియే. ఈ సుప్రసన్న నారసింహాస్వామి పేరు నాకు పెట్టారు. నా జీవితాన్ని వేల్పుగొండ, కొడవటంచలలో నెలకొని ఉన్న నరసింహస్వామి మూర్తులూ, మతామహులర్చించే సీతారామ చంద్రస్వామి పరిపాలిస్తూ వచ్చారు.

ఇంట్లో సాయంకాలం అరుగుల మీద పోతన భాగవతంలోని ప్రహ్లాద చరిత్ర, గజేంద్రమోక్షం, వామన చరిత్ర, రుక్మిణీ కళ్యాణం మొదలైన ఘట్టాలు చెప్పేవారు. ఆ

మాధుర్యం హృదయంలోనికి అప్రయత్నంగా ప్రవేశించింది. సంస్కృత స్తోత్రాలు, ద్రావిడ వేదంలోని తిరుప్పల్లాండు మొదలైనవి సంత చెప్పేవారు.

మా నాయనమ్మ వరదరాజుల పెండ్లి, సీతాకాల్యాణం మొదలైన జానపద గీతాలు పాడేది. ఆ నాళ్లలో మా యింటి దగ్గర ఉండే బురుజు దగ్గర కూచిపూడి నాటక ప్రదర్శన చూచినాను. శ్రీవైష్ణవ సంప్రదాయ కుటుంబంలో ఆయా సందర్భంలో తిరునామాలు గానం చేసేవారు. ఆంధ్ర దేశంలో ద్రావిడ దేశంలోని ప్రసిద్ధ వైష్ణవ విద్వాంసులు ఈ ప్రాంతం వస్తే మా యింట్లోనే దిగేవారు. వారి శాస్త్ర చర్చలూ, సాహిత్య చర్చలూ కొనసాగేవి. తాతగారు శ్రీమద్రామాయణము, భగవద్విషయమూ, ఇతర సంప్రదాయ గ్రంథాల ప్రవచనాలు చేసేవారు. అప్రయత్నంగానో, సప్రయత్నంగానో చెవుల్లోకి వెళ్లేవి ఈ అంశాలన్నీ. శ్రుతమైనదంతా ఒక సంస్కారంగా ఆత్మలో ముద్రించుకొని పోయింది.

నాకు మనస్సులో కెక్కిందంతా శ్రుతపాండిత్యమే. గురుకుల క్లిష్టత లేని నాకు అధ్యయనం అంతా స్మృతిలగ్నమైందే. నా చిన్నతనంలో మరొక ముఖ్య ప్రభావ కేంద్రం రెండిండ్లలో ఉన్న గ్రంథాలయమే. దాదాపు 500 సంస్కృత, ద్రావిడ గ్రంథాలు ఒక్కోచోట ఉండేవి. వాటిల్లో కొన్ని కొత్తవి; కొన్ని పాతవి. ఇండ్లలోకి శ్రీ వైష్ణవ పత్రిక, రామానుజ పత్రిక, ప్రసన్న సుధ వంటివి వచ్చేవి. గోలకొండ కవుల సంచికలో మా మాతామహుల పద్యాలు (ఫోటోతో సహా), మా పెద్ద మామల ఇద్దరి పద్యాలున్నాయి. వాటితో పాటు మా నాన్నగారి పద్యాలూ ఉన్నవి.

మా యింట్లో ఉన్న శ్రీవైష్ణవ సంప్రదాయం ఉదారమైంది. స్మార్త పండితులూ, ఆరాధ్య శైవులూ మా యింటికి వస్తూవుండేవారు. అందరికీ ఆదర సత్కారాలు ఉండేవి. తాతగారికి ఆ నాళ్లలో తెలంగాణంలోని జమీందారుల ఆశ్రయం ఉండేది. కల్లెడ, పర్వతగిరి, రంగాపురం మొదలైన చోట్లలో కొన్ని నెలల కొద్దీ ఉండి కాలక్షేపాలు కొనసాగించేవారు. వారిచ్చిన భూముల మీద కొంత ఆదాయమూ వస్తూ ఉండేది. కుటుంబ పోషణలకు సరిపోయేది.

2

రాజ్య వ్యవస్థ ప్రజల సంస్కృతికీ, భాషా సంప్రదాయాలకు, విద్యకు, జీవన పురోగమనానికి విరుద్ధంగా ఉన్నప్పుడు సమాజం నూతనంగా సమాంతర వ్యవస్థను నెలకొల్పుకుంటుంది. నిజాం సంస్థానంలో సరిగ్గా అదే జరిగింది. తెలుగు భాష

అణచివేతకు గురయింది. సంస్కృతి, సంప్రదాయాలకు ఆదరణం లేదు. అట్లాంటి స్థితిలో భాషా సాహిత్యాల రక్షణ కోసం గ్రంథాలయాలు, వీధి పాఠశాలలు వృద్ధి పొందాయి. మాదిరాజు రామకోటేశ్వరరావు ఆత్మకథలో వరంగల్లులో ఆనాళ్లలో ఉన్న వీధిబడులు సుమారు వందకు పైగా ఉన్నట్లు పట్టిక ఇచ్చారు. దేవోత్సవాలు, హరికథలు, బతుకమ్మ పండుగలు, పురాణ ప్రవచనాలు, గణేశోత్సవాలు, పంచాంగ శ్రవణాలు, ఆర్యసమాజ సనాతన ధర్మ సభలు– ఇలా ఎన్నెన్నో సంస్కృతిని నిలువబెట్టే సంస్థలు ఏర్పడ్డాయి.

నేను తొలుదొల్త అలాంటి వీధి బళ్లలోనే చదివాను. ఒకటి మా యింటికి దగ్గరలో ఉన్న 'పొట్టి పంతులు' జగన్నాథం గారి బడి. రెండవది నాకు అక్షరాభ్యాసం చేసిన మోటుపల్లి కృష్ణమాచార్యుల గారి బడి. ఇది ఇంటికి అరకిలోమీటరు దూరం ఉండవచ్చు. ఆ తరువాత నియత విద్యాభ్యాసం విషయం ఇంట్లో చర్చకు వచ్చినట్లున్నది. ఇంట్లో మా 'నాన్న'ల వలె ప్రాచ్య విద్యలోకి చేరిపోవటమా లేక పాఠశాల విద్యలోకి వెళ్లటమా అన్న సందేహం. మా చిన్న మేనమామ రంగాచార్యులు అప్పటికే ఇంటర్ పూర్తి చేసి బి.ఏ. కోసం హైదరాబాద్‌లో చేరినట్లున్నారు. అప్పటికే అయన వీలైనప్పుడు ట్యూషన్‌లు చెప్పుతూ కొంచెం కొంచెం తన చదువు కోసం సంపాదించుకునేవారు. అప్పుడు మా అమ్మ పట్టుబట్టి నన్ను స్కూలు చదువుల్లోకి చేర్చాలని కోరింది. మా తాతగారు అంగీకరించినారు. నాకు మే 10, 1943న ఎనిమిదవ ఏట ఉపనయనము జరిగింది. అప్పుడే మా తాతగారి అన్నగారి చేత పంచ సంస్కారాలూ జరిగాయి. ఒకసారి ఏదో ఉత్సాహంతో రామలింగేశ్వర దేవాలయంలో ఉన్న సంస్కృత పాఠశాలలో 'రామ' శబ్దమూ నేర్చుకున్నా. అయితే మళ్లీ వీధి బడిలోకి వెళ్లవలసి వచ్చింది.

ఆనాళ్లలో తెలుగులో విద్యాబోధన చేయటానికి ఒక పాఠశాల ఏర్పరచవలెనని జాతీయోద్యమ నేత లిక్కడ భావించారు. అప్పటికే ఎన్.కే. రావు ఈ ప్రయత్నంలో రాష్ట్రంలో దేశీయ విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నారు. చందాకాంతయ్య అనే వర్తకుడు తెలుగు పాఠశాల నెలకొల్పటం కోసం లక్ష రూపాయలు దానం చేస్తానని ప్రకటించినాడు. ఆంధ్ర విద్యాభివర్ధినీ పాఠశాల ప్రారంభం అయింది. దానికి కాంగ్రెస్ నాయకులు ఎం.ఎస్. రాజలింగం కార్యదర్శి. భండారు చంద్రమౌళీశ్వరరావు, అడవాల సత్యనారాయణ, పాములపర్తి సదాశివరావు మొదలైన వాళ్లు దానిలో అధ్యాపకులు (జీతాలు కూడా ఉన్నవో లేవో సరిగా తెలియదు).

ఈ పాఠశాల మా అమ్మమ్మగారి యింటికి వెనుక వీధిలో అప్పుడు ఉండేది. మిక్కిలి దగ్గర కావటంతో మా అమ్మ నన్ను ఆ పాఠశాలలో చేర్పించటానికి అనువుగా, చదువు నిమిత్తం అమ్మమ్మ యింట్లోనే ఉంచింది. నేను 1945–46లలో నాటి మూడవ తరగతిలో చేరినాను. మా మేనమామ రంగాచార్యులే తొలుతగా ఏ,బీ,సీ,డీలు నేర్పించారు. ఆ పాఠశాల నేను నాల్గో తరగతిలో ఉన్నప్పుడు మట్టెవాడలో నేరెళ్ల వాళ్ల స్థలంలోకి మారిందని గుర్తు.

ఆ పాఠశాలలో తొలి నుంచీ ఒక సాంస్కృతిక పునరుజ్జీవన చైతన్యం ప్రస్ఫుటంగా ప్రకాశించేది. నిజాం రాజు చందా కాంతయ్యకు ఒక బిరుదం యిచ్చి సత్కరించినాడు. చందా కాంతయ్య నిరంతర దానశీలి. యజ్ఞములు చేసేవాడు. వేదాంతి. యంత్రాచణశీలి. ఎప్పుడో అనుకోకుండా బుట్టనిండా మిఠాయి పెట్టుకుని బడికి వచ్చి పిల్లలందరికీ ఆ మిఠాయి పంచి తాను ఆనందించేవాడు. ఆ జీవమూ ఆ పాఠశాల సమితిలో సభ్యుడే కాని, కార్యదర్శి కాలేదు. అధ్యక్షుడు కాలేదు. స్కూలుకు తన పేరు పెట్టనీయలేదు. అప్పటికే పాఠశాలలో ఏకనాథ గ్రంథాలయము అని ప్రత్యేక గ్రంథాలయము ఉండేది.

జాతీయోద్యమంలో భాగంగా జాతీయ విద్యార్థి సంఘం అనే సంస్థ యువకులకు ప్రేరణ యిచ్చేదిగా పని చేస్తూ వుండేది. వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించేది. ఆ సంఘానికి మా మేనమామ రంగాచార్యులు, మా పినతల్లి భర్త ఎం.ఎన్. రంగాచార్యులు క్రియాశీల కార్యకర్తలు. గోసేవా సమితి కార్యక్రమాలుండేవి. ముఖ్యంగా ఈ అశాంతభావంలోనే సంఘ సంస్కారం, ప్రజలకు సంస్కృతి పట్ల ఆలోచింపజేసేవి. ఆర్యసమాజం, సనాతన ధర్మసభల సమావేశాలు నిరంతరంగా జరిగేవి. ఆర్య సమాజం సంస్కరణవాది. విగ్రహారాధనకు, శ్రాద్ధాది కర్మలకు, అవతార వాదానికి వ్యతిరేకం. సనాతన ధర్మ సంస్థలు వీటిని సమర్థించేవి.

ఎం. ఎస్. రాజలింగం వార్ధాలో గాంధీగారి వద్ధ శిక్షితులై వచ్చి వరంగల్లులో సుభాను చేతి పరిశ్రమశాల నెలకొల్పినాడు. నవారు నేత, గ్లోకోజు తయారు చేయటం వంటివి వారు చేస్తుండగా నేను చూచినాను.

ప్రతి సంవత్సరం గణపతి ఉత్సవాలు తొమ్మిది రోజుల్లో వైభవంగా జరిగేవి. ఉపన్యాసాలు, సంగీత కచ్చేరీలు, సాహిత్య స్పర్థలు, అవధానాలు, కవి సమ్మేళనాలు కొనసాగేవి. ఆంధ్రపత్రిక రోజు మధ్యాహ్నానికి ఊళ్లోకి వచ్చేది. వరంగల్ చౌరస్తాలో

వేముల వారి యింటి ముందు గద్దెపై కూర్చొని పత్రికలో వార్తలు అన్నీ చదివేవారు. అనేకమంది శ్రోతలు శ్రద్ధగా అదంతా వినేవారు. అదీ జాతీయ నిష్ఠయే.

ఈ వాతావరణంలో నా మనస్సులో ఎన్నో మార్పులు వచ్చాయి. కొన్ని గొప్ప భావాలకు ప్రతీకలైన ఆచారాలను ప్రతీకలుగానే కాక అనివార్యంగా ఆచరించవలననే భావం క్రమక్రమంగా సడలిపోవటం ప్రారంభం అయింది. వాటి మీద విరోధము లేదు. భిన్న భిన్న ఉపాసనామార్గాలు, సంప్రదాయాలు మానవుని చిత్తశాంతి కోసం ఏర్పడ్డవి. ప్రాతిభాసికంగా కనిపించే భేదాలు అన్నీ తాత్కాలికంగా రూపొందినవే. వాటికి సార్వజనీనత, సార్వకాలీనత లేదు. వేషభాషలు, ఆచారాల వ్యవహారాల పట్ల పట్టుదలలు, విభేదాలు, పరస్పర అనిష్టాలు ఇవన్నీ వ్యర్థములనే నిశ్చయం ఏర్పడుతూ వచ్చింది.

భారత దేశానికి స్వాతంత్ర్యం రావటం, పాకిస్తాన్ ఏర్పడటం, ఆనాటి ఉద్విగ్న క్షణాలు అనుభవంలోకి వచ్చేవి. ఒకనాడు స్కూలు నుంచి తిరిగి వస్తున్నప్పటికి ఒక గుఱ్ఱం కడుపులో ఎవరో బాకు గ్రుచ్చారు. ప్రాణావసాన స్థితిలో ఉన్నది. అమ్మమ్మ యింటికి చేరేప్పటికి ఎవరో దుండగులు నారాయణరెడ్డి అనే డాక్టరును, మొగిలయ్య అనే జాతీయ పతాకనెగురవేసిన యోధుని చంపినట్లు, వారు రజాకార్లనీ తెలియవచ్చింది.

స్వతంత్ర భారత దేశంలో విలీనం కాకుండా తాను స్వతంత్ర రాజుగా ఉండాలని కోరుకోవటం, ప్రతి ముస్లిం రాజే అన్న ఒక సూత్రాన్ని ముస్లిం సంస్థలు ప్రచారంలోకి తేవటం కారణంగా నిజాంను నిలబెట్టేందుకు రజాకార్లనే ప్రత్యేక సేన ఏర్పడింది. ప్రజలకొక ప్రాణరక్షణ లేకుండా పోయింది. అప్పటికీ భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణా సాయుధ పోరాటాన్ని ప్రారంభించింది. రెండు విభిన్న శక్తుల సంఘర్షణలో ఎన్నో ప్రాణాలు, మానాలు, ఆస్తులు గాలిలో కలిసిపోయినాయి.

మా కుటుంబం వరంగల్లులో రక్షణ లేదని భావించి కల్లెడ దొరవారైన ఎఱ్ఱబల్లి వెంకటేశ్వరరావు పిలుపు మేరకు కల్లెడకు చేరుకుంది. అక్కడ మొత్తం కుటుంబమూ ఉన్నది. తాతగారు ఉదయం భగవద్విషయాన్ని, సాయంకాలం శ్రీమద్రామాయణాన్ని కాలక్షేపం చెప్పేవారు. నేను దాదాపుగా రెండు సమయాలకూ వెళ్లేవాడిని. అనేక వేదోపనిషత్ ఇతిహాస పురాణాంశాలు ఆ కాలక్షేపాలలో ప్రసక్తములయ్యేవి. వాటి అర్థము, సమన్వయము అద్భుతంగా ఉండేది.

సర్వ సమర్పణ, శరణాగతి, మానవుని ఆర్ద్ర సంబంధాలు ఈ కాలక్షేప సమయంలో

మరొక అద్భుత లోకమన్నట్లుగా సాక్షాత్కరించేవి. నా జీవనంలో ఎంతో విద్యను సేకరించుకున్న సమయం అది. సామాన్యులు వర్ణభేదాలకు అతీతంగా భగవంతునికి చేరువకావటం వింటూంటే, వారందరూ నా చుట్టూ తిరుగుతున్నారన్న స్ఫురణ కలిగేది.

నాన్నగారికీ, పినతండ్రులిద్దరకూ ఉదయం గడిలో కాలక్షేపం కంటే ముందే ఇంట్లో ద్రావిడ వేదాంత రహస్య గ్రంథాలను తాతగారు అధ్యాపన చేసేవారు. గడిలో కాలక్షేపంలో వీరిలో ఎవరో ఒకరు పాఠ్యం చదివేవారు. తాతగారు విశదంగా విపులంగా వ్యాఖ్యానించేవారు. ఇంట్లో నేనూ, మా చిన్నాయన సంపత్కుమారలకు వేరే చెప్పుకోదగిన పనులు లేవు. ఈ సందర్భంలో ఒక అద్భుత సన్నివేశం జరిగింది. అది మేమిద్దరం కలిసి కవిత్వాభ్యాసం చేయటం.

మేముంటున్న యింటికి ఇంచుమించు ఎదురుగా శ్రీనివాసమూర్తి ఇల్లు ఉండేది. వారి చెల్లెలు భర్త ప్రతాపపురం రాఘవాచార్యులు మా వలెనే వరంగల్లు నించి భద్రత కోసం అత్తవారి ఇంటికి వచ్చినారు. వారు చిక్కగా పద్యాలు రాసేవారు. అప్పటికి బీజభూతంగా ఉన్న పద్యం మాలో చివురించి పుష్పించటం అక్కడే ఆరంభం అయింది. వారి దగ్గరనే తిరుపతి వేంకట కవుల పేరు విన్నాము. ఆ ఆరునెలల కాలంలో ఎన్ని పద్యాలు వ్రాసినామో తెలియదు. కానీ, పద్య ధోరణి అలవాటయింది. సాధన జరిగింది. నాకు ఛందో లక్షణం తెలిసేది కాదు. అయినా పద్యం నిర్మించే సందర్భలో ఇక్కడ లఘువు, ఇక్కడ గురువు ఉండాలని నాకు అనిపించేది. దానికి కారణం అంతకు ముందే మౌకంగా నేర్చుకున్న భాగవత పద్యాల మూసలు కావచ్చు.

కల్లెడలో మా చిన్నాయనగారితో నాకు ఏర్పడ్డ గాఢానుబంధం ఆయన జీవితాంతం దాకా అంతే సజీవంగా కొనసాగింది. ఆయన మిత్రుడు; గురువు; నాయెడ వాత్సల్యం గలవాడు.

కల్లెడ దొరలు ప్రజల విషయంలో ఎలా ఉండేవారో తెలియదు కానీ, సంప్రదాయాన్ని పోషించేవారు. శ్రీరంగంలో ఒక సత్రం నిర్మించారు. కందాడై శేషాచార్యులు, ప్రతివాది భయంకర అణ్ణంగణాచార్యుల వారి గ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయం చేసేవారు.

ఈ కాలంలోనే సాయుధ కమ్యూనిస్టులు రాత్రులలో పాటలు పాడుకుంటూ వచ్చేవారు. జనం కొందరు చాటుగా పరుగెత్తి దాక్కునేవారు. ఆర్నెల్లకు ఆ ఊరు విడిచి బెజవాడ చేరుకున్నాము మొత్తం కుటుంబం. అయితే గడవటం కష్టమని కొందరు

రాజమండ్రికి, కొందరు రేపల్లెకు వెళ్లినారు. తాతగారు బెజవాడలో ఉన్న శిష్యుల ప్రోత్సాహంతో గ్రంథ ప్రవచనాలు చేస్తూ సంసారం నిర్వహించేవారు. ఆ రోజుల్లో మేం కొంతకాలం అద్దెకున్న యిండ్లలో ఒకటి గూడవల్లి రామబ్రహ్మం గారి యిల్లు. పారుపల్లి వారి వీధిలో ఉండేదనుకుంటా.

బెజవాడలో ఉన్న రోజులు నేను కొంతకాలం అక్కడ మునిసిపల్ స్కూలులో చేరి చదువుకున్నా. తాతగారి వెంట కాలక్షేపాలకు వెళ్లటం ఉండనే ఉన్నది. సంపత్కుమార గారు రేపల్లెలో ఉన్నారు. కల్లెడ తరువాత మేమిద్దరం మళ్లీ ఒక కప్పు కింద ఉన్న రోజులు దాదాపుగా లేవేమో. అక్కడ ఉన్నవాళ్లలోనే నా మీద గాంధీ ప్రభావం ఎక్కువయింది. ఆయన హత్య జరిగిన రోజులవి. బెజవాడలో ఏడెనిమిది నెలలున్నాము. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్‌పై పోలీస్ యాక్షన్ జరిగిన తరువాత నెమ్మదిగా దీపావళి వరకు యింటికి చేరుకున్నాము. ఆ పద్యాలు మొన్న మొన్నటి దాకా గుర్తుండేది. అక్కడి నుంచి వెలువడే 'విజయవాణి' (మల్లెల శ్రీరామ మూర్తి సంపాదకులు)లో మా పెద్ద మేనమామ వార ఫలితాలు వ్రాస్తుండేవారు

నిజాం ప్రాంతం నుంచి వచ్చిన కాందిశీకులను బెజవాడ ప్రజలు ఆదరించలేదు. అద్దెలు విపరీతంగా పెంచారు. భాషను వెక్కిరించారు. ఒక తీవ్రమైన అనిష్టం యిక్కడి ప్రజలలో అందువల్ల నెలకొన్నది. తరువాత వచ్చిన నాన్‌ముల్కీ, ప్రత్యేక తెలంగాణా ఉద్యమాల వెనుక ఈ అసంతుష్టి ఉన్నది.

3

ఒక మత సంబంధమైన తాత్త్వికానుబంధం గల వాతావరణంలో నేను పెరిగిన సంగతి తెలుసుకోవలసి ఉంటుంది. అయితే ఆర్యసమాజం మొదలైన ఉద్యమాల బలం వలన బాహ్యాచారాల ఆడంబరాల పట్ల విశ్వాసం సడలిన విషయం చెప్పుకున్నాను. అసలు భక్తి ఉద్యమం ఈ లోకం నుంచి పారిపోవటం నేర్పదు; ఈ జగత్తు నిండా ఈశ్వరుని సాక్షాత్కరించుకుంటుంది. 'సర్వభూతేషుచాత్మానం సర్వభూతానిచాత్మని, ఈక్షతే యోగ యుక్తాత్మా, సర్వత్ర సమదర్శనః' అన్న గీతావాక్యం భౌమ జీవన దివ్యీకరణ భావాన్ని వ్యక్తం చేస్తుంది. సగుణోపాసనకు ఆధారం ఇదే. శ్రీవైష్ణవం పరవ్యూహ విభవ అంతర్యామ్యర్చావతరాలుగా భగవంతుని దర్శించినా, మనకు అత్యంత సన్నిహితమైంది అర్చావతారమే అన్న అంశం శ్రీవచన భూషణాది సంప్రదాయ గ్రంథాలు వెల్లడిస్తున్నాయి.

మరొక అంశం భక్తుని – భగవంతునిగానే చూడటం! అతని అర్చనాసేవ భగవదర్చనమే. మానవ సేవయే మాధవ సేవ అన్న ఆధునిక భావన దీనిలో నుంచి పుట్టిందే.

భక్తి ఉద్యమం ఈ లోకాన్ని ఈశ్వర స్థానంగా ఎన్ని, దీన్ని అతని లీలా విభూతిగా భావించింది. 'నాహం వందే తవచరణే యోర్ద్వద్యమద్వంద్వహేతోః' అన్న ముకుందమాల మోక్షం నాకు వద్దు. జన్మ జన్మలకూ నిన్ను భావిస్తూ, సేవిస్తూ ఉండటం కావాలి అంటున్నది. శ్రీ శఠగోపులు తమ తిరువాయ్ మొళి ప్రబంధంలో భక్తి ధర్మం వలన లోకం ఎలా పరివర్తన చెందిందో వివరించారు.

పుడమికిని కల్గు శాపమ్ము పొలిసె, యముడు
కార్య నిర్వృత్తుడయ్యెను కవి దొలంగె
నరకములు మారిపోయెను నరులపాప
సంతతి నశించె, భక్తుల సముదయమ్ము
కడలి వన్నె గలుగు స్వామి గాథలెల్ల
పాడుచును నృత్యమాడుచు పరవశింప
కన్నులార గంటిమి–వృద్ధి కలుగుగాక
కలుగుగాకమేలు సమృద్ధి కలుగు గాక (5–2–1)

పాండురంగ మాహాత్మ్యంలో రామకృష్ణ కవి 'నిత్యనైమిత్తికముల నిర్ఛిద్రబుద్ధి నాచరించుచు, హరిభుక్తమాత్మ భార్య భక్తినిడ భుక్తి నిడుచున్కి ముక్తిగాని నిదురవంటిది, రాతివంటిదియు గాదు'

గార్హస్థ్య జీవితం ఎంత శ్రేష్ఠమైందో – 'నిదుర వంటిది రాతి వంటిదియు గాదు' అని నాడు కేవల స్థితిని ముక్తి భావాన్ని కాదంటున్నాడు. ఆళ్వారులు కొంతమంది తాము ఈ జన్మలో తిరుమల కొండమీద రాయిగానో, మొక్కగానో పుట్టి ఉంటే ధన్యులమని భావించినారు. ఈ భావన వైకుంఠ, కైలాస, భూలోకాది పరలోక భావనలను కాదంటున్నది. ఆ భావనలు ఒక విధంగా చూస్తే లోకంలోని దివ్యజీవన భావనకు ప్రతిబింబాలు మాత్రమే. ఇదంతా ఎందుకు చెప్పటమంటే, అప్పటికి శ్రీ అరవిందుల తత్త్వం నన్ను ఆకర్షించటమే. ఈ భూమిక నా చేతనలో స్పష్టాస్పష్టంగా ఉండటం కారణం కావచ్చు. ఎక్కడికో పారిపోవటం కాకుండా ఈ లోకాన్ని అవిద్యాపరిమితుల నుండి దూరం చేసి దివ్యచైతన్యాన్ని ఆవహింపచేయటం లక్ష్యంగా శ్రీ అరవిందుల తత్త్వం ఏర్పడింది.

అద్వైతుల జగన్మిథ్యాత్వభావన కానీ, కైవల్యరూప ముక్తిగానీ, బౌద్ధుల నిర్వాణం కానీ నన్ను ప్రభావితం చేయలేదు. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు మూడూ సత్యమేనని ఒకదానికొకటి శరీరం వంటిదని చెప్పిన విశిష్టాద్వైతం తాత్త్వికంగా ఈ భావనకు అతి సన్నిహితం. అంతా ఈశ్వరమయమే. ఈశావాస్యమిదమ్ సర్వం. అందువల్ల జగత్తును దివ్యపరిణామం వైపు ప్రయాణింపజేసేది సౌందర్య భావన, ప్రేమ భావన, శాంతి భావన ఆనంద భావన.

1950 డిసెంబర్‌లో శ్రీ అరవిందులు శరీరం విడిచిపెట్టిన తరువాత ఆయన తత్త్వమును గురించి భారతిలో వచ్చిన వేలూరి వారి వ్యాసాలు నా సాహిత్య తత్త్వదృష్టికి పునాదిని ఏర్పరిచినాయి. మానవుని సర్వజీవనానికి ఇహలోకము, భూమి ముఖ్యవేదిక. ఆసురీ తత్త్వాన్ని ఏరూపంగా ఉన్నా దాన్ని పరిహరించి దైవీ గుణాలను పృథ్వీమీద స్థాపించటమే వ్యష్టి ముక్తి కాక, సమష్టి ముక్తి అవుతున్నది. ఈ నిశ్చయానికి నేను వచ్చేసరికి నా వయస్సు ఇంచుమించు 16 సంవత్సరాలు.

అప్పటి నుంచి నా సాహిత్యం, కవిత్వం, విమర్శ, వ్యాఖ్యానం– ఏదైనా ఈ భూమిక మీదనే నిలబడి ఉన్నాయి. నా తొలి రచన హృద్గీతలోని తొలి పద్యాలలో– 'జడమై, ప్రాణమవై, మనస్సువయి విజ్ఞానంబవై' అని బ్రహ్మ పదార్థాన్ని వర్ణించటం జరిగింది. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ భూమికల గురించి స్పష్టంగా చెప్పటమే.

1949–50లలో ఆంధ్ర ప్రాంతం నుంచి మా పాఠశాలకు తెలుగు మాధ్యమంలో పాఠం చెప్పటానికి అధ్యాపకులు ఒక సమూహంగా వచ్చినారు. వారికి నాయకులు ప్రధానోపాధ్యాయులుగా వచ్చిన యద్ధనపూడి కోదండరామశాస్త్రి. వారు దివ్యజ్ఞాన సమాజం వాతావరణంలో పెరిగి వచ్చినారు. మేడం బ్లావట్స్‌కీ, కల్నల్ అల్కాట్, అనిబిసెంట్, జిడ్డు కృష్ణమూర్తి– ఈ పేర్లన్నీ అప్పుడు విన్నవే. ఈ తరంగం ముంపులో తాత్త్వికతలోని విశ్వజనీనత అర్థమైంది. జాతీయ భావన కేంద్రంగా విశ్వజనీనత చుట్టూ వలయంగా నా భావ పరిధి విస్తరించుకుంటూ పోయింది. 1986లో అడయార్‌లో జిడ్డుకృష్ణమూర్తి, చివరి ఉపన్యాసం (జనవరి,4) విన్నాను.

వైకె శాస్త్రి వచ్చిన తరువాత పాఠశాలలో పరివర్తన వచ్చింది. పోతన జయంతి ఉత్సవాలు ప్రారంభం అయినాయి. నేను పదో తరగతిలో ఉండగా పోతన జయంతి

ఉత్సవాలలో వక్తృత్వము, వ్యాసరచన, గ్రంథపఠన పోటీలలో మూడు ప్రథమ బహుమతి దేనికైనా పోతన భాగవతమే కానుక. నాకు ఆ సంవత్సరం పోతన భాగవతంతో పాటు కవిత్రయ భారతము బహుమతిగా ఇచ్చారు. ఇది నా జీవితంలో ఊరిలో పెద్దల ముందు కలిగిన తొలి పరిగణన. తొలి అవార్డు కూడా కావచ్చు.

నేరెళ్ల వేణుమాధవ్ నాకన్నా మూడేళ్లు స్కూల్లో సీనియర్. మా ప్రధానోపాధ్యాయులు భాగవతంలోని నృసింహావతార వర్ణన ఘట్టం అద్భుతంగా చదివేవారు. నన్ను ఒక విధంగా పోతన మోహంలోకి నెట్టి పడవేసినారు. ఆ గద్య పద్యాల చింతనామృత పాన విశేష మత్త చిత్తమేరీతి చేరనేర్తు- ఇదీ అప్పటి మనఃస్థితి.

4

కల్లెడలో ప్రారంభమైన పద్య రచనాభ్యాసం సాగుతున్నది మా యిద్దరకూ. సంపత్కుమార 1949లో చిట్టిగూడురులో భాషాప్రవీణ కోర్సులో చేరినాడు. అక్కడికి దగ్గరయిన బందరులోని ఉద్దీప్త సారస్వత సంభార సామగ్రి నెమ్మది నెమ్మదిగా ఆయన ద్వారా వరంగల్లుకు నా దగ్గరకు వస్తూ ఉన్నది. మా ఊళ్లోని శబ్దానుశాసన ఆంధ్ర గ్రంథాలయం పుస్తకాల ద్వారా పరోక్ష గురుస్థానం వహించింది. హైదరాబాద్‌లో అప్పటికే తెలుగు బిఏ చేసిన మా చిన్న మేనమామ రంగాచార్యులు పారిజాతాపహరణంలోని పద్యాలను, రాయప్రోలు పద్యాలను, జాషువా, కరుణశ్రీల పద్యాలను పరిచయం చేసేవారు. ఒక్కోసారి ఆయన 'విజయశ్రీ'ని కమ్మని గొంతుతో మాకు వినిపించేవారు. ఆయన ఇంట్లో మధ్యాహ్నం వేళ ఆయన తల్లికి, వదినలకు కాలక్షేపంగా వావిలకొలను సుబ్బారావు రామాయణానువాదం వినిపించేవారు. ఆ వరుసలో కొన్ని రోజులు వరుసగా 'వేయిపడగలు' కూడా చదివి వినిపించారు. నా జీవితంలో విశ్వనాథ ప్రవేశించింది అలాగే అనుకుంటా. బందరు నుంచి కదలి వచ్చే సాహిత్య సామగ్రిలో రాయప్రోలు, కృష్ణశాస్త్రి, అడవి బాపిరాజు, నాయని, వేదుల- ఇలా కాల్పనిక కవులంతా కదలివచ్చేవారు. 'వైతాళికులు' చదవటం ఒక అచ్చెరువు గొలిపే అనుభవం. నెమ్మది నెమ్మదిగా విశ్వనాథ సత్యనారాయణ సపరివారంగా కవితలతో, నవలలతో, నాటకాలతో, విమర్శతో, కల్పవృక్షంతో తరలి వచ్చారు. చిట్టి గూడురులో సంపత్కుమార పద్యరచనాభ్యాసం పెరిగింది. ఇక్కడ నేనూ అభ్యసనం సాగిస్తున్నాను. 1951లో విశ్వనాథవారి సోదరులు వెంకటేశ్వరులు మా పాఠశాలలో తెలుగు అధ్యాపకులుగా వచ్చారు. ఆయన నా పద్యాలు చూసి తలవూపారు. అప్పుడే 1951 నుంచి అప్పుడప్పుడూ రాసుకున్న పద్యాలు యిద్దరం కలిసి ఒక శతకంగా

తెద్దామని అనుకున్నాం. మకుటం 'సర్వేశ్వరా!' అని! దాంట్లో ఇద్దరి పద్యాలు కలగలపుగా కూర్చినాము. ఆ రోజుల్లో వరంగల్లు నుంచి వివేకానంద అనే ఒక ద్విభాషా పత్రిక వచ్చేది. దానిలో ఒక కమ్మ నిండా ఈ పద్యాలు అచ్చు వేసేవారు. నెలకు పన్నెండు పద్యాలు వచ్చేవి. ఆ ముద్రితమైన కాగితాలు సంపాదకులు కొమ్ము సుబ్బారావు 200 విడిగా అచ్చు వేసి యిచ్చేవారు. పుస్తకంగా రూపొందటానికి ఆంధ్రప్రింటింగ్ ప్రెస్ వారు ఉచితంగా ముఖ పత్రము, పీఠిక ముద్రించి యిచ్చారు. 1954 మధ్యభాగానికి ముద్రితమైంది మా తొలి పుస్తకము. విశ్వనాథ వెంకటేశ్వర్లు దాన్ని పట్టుకువెళ్లి విశ్వనాథవారితో పీఠిక వ్రాయించి తెచ్చినారు. దానిని హృద్గీత అని పేరు పెట్టి మా తాతగారికి అంకితం చేశాము.

ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రస్తుత అధ్యక్షులు ఆచార్య సి. నారాయణరెడ్డి అప్పటి తెలంగాణ రచయితల సంఘం కార్యదర్శి. మా రచనలను పత్రికలను పంపి అచ్చయ్యేటట్టు చూసేవారు. తెలుగు స్వతంత్రలో అవి అచ్చయినప్పుడు మా పేర్ల చివరనున్న ఆచార్య శబ్దం తొలగించి వేశారు. మేము సుప్రసన్న, సంపత్కుమారలము అయ్యాము. ఎంత అందమైన కత్తిరింపో అది. అప్పటి నుంచి నారాయణ రెడ్డి నాకు అన్నయ్యనే.

1954లో తెలుగు స్వతంత్రలో నా వచన పద్యాలు అచ్చయ్యాయి. గోలకొండ పత్రికలో ఉదాహరణాలను గురించిన నా వ్యాసం పెద్దది అచ్చయినది. మే28, 1954నాడు జరిగిన నా పెళ్లిలో సంపత్కుమార రవీంద్రుని ఊర్వశి కవితా సంపుటాన్ని (బెజవాడ గోపాలరెడ్డి అనువాదం) నాకు అత్యంత ప్రీతితో– తనకన్నా ప్రతిభావంతుడననే అతిశయోక్తితో బహూకరించారు. ఆ సందర్భంలో దాశరథి అభినందిస్తూ ఒక లేఖ వ్రాసారు. తన పదకొండవ ఏట నా జీవితంలోకి నడచివచ్చిన నా మేనమామ కూతురు శారద. తన జీవితం చివరి క్షణం దాకా నాకు నెచ్చెలియే; ప్రియురాలే. నా కావ్యాలలో శేఫాలికకు నాయిక. కులపాలిక. నాకు సాధనలోనూ సహచరి ఆత్మన.

నిడుదవోలు వారి ఉదాహరణ వాఙ్మయ చరిత్ర చదివి నేను పోతన్నను గూర్చి రససిద్ధోదాహరణము వ్రాసినాను. అది కరీంనగరం నుంచి వెలువడే సారస్వత జ్యోతిలో అచ్చయినది. ఆ రోజుల్లోనే కొన్ని గేయాలూ అచ్చయినాయి. అంటే రూపనిష్ఠతో సంబంధం లేకుండా పద్యము, గేయము, వచన పద్యము– మూడు నా రచనా మార్గంలో ప్రధాన స్థానాన్ని ఆక్రమించాయి.

1953-54 నాటికి వరంగల్లులోని సామ్యవాద మిత్రులతో నా పరిచయం పెరిగింది. వారిలో అతి సన్నిహితులు పి. నరసింహస్వామి. అతడు ఒక అడవిచెట్టు వంటివాడు. శ్రీశ్రీ, ఆరుద్ర, అనిశెట్టి వంటి వారి రచనలు వినిపించేవారు. సమ్మోహముద్ర వేసేవారు. ఆయనకు ప్రేరకులు పాములపర్తి సదాశివరావు. పి వి నరసింహారావు, ఈయనా కలిసి కాకతీయ పత్రిక నడిపేవారు. కాకతీయ కళాసమితి పేర ప్రతి సంవత్సరమూ సంగీత సాహిత్య సభలు నిర్వహించేవారు. ఒక కవి సమ్మేళనములో నేను సున్నా అని చివర వచ్చే ఒక గేయాన్ని చదువగా సభంతా కరతాళ ధ్వనులు చేసింది.

పివి, సదాశివరావులకు; కాళోజీకి గార్లపాటి రాఘవరెడ్డి గురువు. రాఘవరెడ్డి ఏ పూర్వయుగాల నుంచి ఋష్యాశ్రమాల నుంచి కదలివచ్చిన యోగివలే ఉండేవారు. స్వామి దగ్గర నుంచి రాఘవరెడ్డి వరకు వచ్చేసరికి సంవాద దశ నుండి సంభావన దశదాకా వచ్చినట్టుంది. నా రచనలలో అవికలితంగా కలిసిపోయిన సామ్యవాద ధోరణికి ఈ సాంగత్యం కారణం అనుకోవాలె. 1953-55లలో వరంగల్లు కాలేజీలో ఇంటర్ మీడియట్ చదివాను. అక్కడ చలమచెర్ల రంగాచార్యులు, ప్రత్యేక తెలుగువారికి పాఠం చెప్పేవారు. ఆయన మాకు గబ్బిలం పాఠం చెప్పినారు. ఆయన పాఠం వింటే ఆ పద్యాలన్నీ ఒకపాటి సారస్వత ప్రియునికి కంఠస్థం కావలసిందే.

సాహితీబంధుబృందం అనే సంస్థను నేను, నా సహపాఠి పేర్వారం జగన్నాథం, మిగిలిన మరికొందరు మిత్రులం 1955 ఫిబ్రవరిలో స్థాపించినాము. దానికి విశ్వనాథ సత్యనారాయణ ప్రారంభకులుగా వచ్చినారు. నేను ఆ సంస్థకు స్థాపక అధ్యక్షుడిని. కాళోజీ, హయగ్రీవాచారి వేదికమీద ఉన్నారు. పివి సభలో కూర్చున్నారు. ఆ సందర్భంలోనే పివి, విశ్వనాథ వారిని కలిసి వేయిపడగల హిందీ అనువాదానికి అనుమతిని కోరినారు.

తెలంగాణా రచయితల సంఘం 1955 మొదట్లో ఒక కవిత్వపు పోటీ పెట్టింది. దానికి నేను ఎవరెస్టు అనే గేయం పంపించినాను. ఆ పోటీలో తెన్నేటి పూర్ణచంద్రరావు రాసిన దయ్యాల మఱ్ఱిచెట్టు అన్న వచన పద్యానికి మొదటి బహుమతి, నా గేయానికి రెండో బహుమతి వచ్చింది. బహుమతులు 50,30,20 రూపాయలు. మూడో బహుమతి ఎవరికి వచ్చిందో గుర్తు లేదు. ఎవరెస్టు అన్న నా గేయంలో కాల్పనిక ప్రగతివాద ధోరణులు కలసి ఉన్నాయనుకుంటున్నాను.

న్యాయ నిర్ణేతలుగా నార్ల, పుట్టపర్తి వారున్నారు. నార్లవారి పట్టుదల మీద మొదటి

బహుమతి తెన్నేటి వారికి వచ్చినట్లు, కానీ, పుట్టపర్తి వారు నా గేయానికి మొదటి బహుమతిని సూచించినట్లు అప్పట్లో విన్నాను. ఇది నాకు రాష్ట్ర స్థాయిలో వచ్చిన మొదటి బహుమానము. కవిగా గుర్తింపబడటం దీనివల్ల జరిగింది. ఆ గేయం స్రవంతిలో అచ్చుయినది.

వరంగల్లులో కాకతీయ కళాసమితి వారు భారతీయ సంగీతం గురించి వ్యాసం రాసే పోటీ పెట్టారు. దానికి సామగ్రి కావాలంటే మా చెలమచర్ల వారు ది హిస్టరీ ఆఫ్ క్లాసికల్ సాంస్క్రిట్ లిటరేచర్ అన్న పుస్తకం చదవమన్నారు. అది ఆధారంగా నేనో వ్యాసం రాసి పంపించినాను. దానికి ప్రథమ బహుమతి వచ్చింది. కాలేజీ మ్యాగజైన్‌లో నా పేర రచనలతో పాటు, మారు పేరుతో ఒక కథ వ్రాసినాను.

అంతకు మందే విశ్వనాథ సాహిత్యంతో పరిచయం ఉన్నా, 1951లో వరంగల్లులో ఆంధ్రసారస్వత పరిషత్ వరంగల్ శాఖ వార్షిక సభలకు ముఖ్య అతిథిగా వచ్చినప్పుడు వారి రెండు మూడు ఉపన్యాసాలు వినటం, ఆయన పద్యం చదవగా ముగ్ధడనవటం, మా స్కూల్లో ఉపన్యసిస్తూ, మా స్థాయికి దిగివచ్చి మాట్లాడటం- అన్నీ నా మనస్సును పట్టివేశాయి.

విశ్వనాథ సాహిత్యంలో అంతర్బహిర్లోకాల అద్భుతమైన ఆవిష్కరణ, పద్యంలో ఉండే సంభాషణ శైలి, అతి విపులమైన శబ్దార్థ సందోహం, అనంత కల్పనా చతురత, చరాచర ప్రకృతి అంతా సజీవమై సాక్షాత్కరించటం, ఋతువులు, కొండలు, అడవులు, వాగులు, వంకలు, పశుపక్షులు అపూర్వ రీతిలో ప్రవృత్తం కావటం, నాణ్యతో దర్శనీయం కావటంతో అదేదో పూర్వ యుగాల బంధువు చేరవచ్చినట్లయింది. ఉద్వేగం పొందిన గడియలలో ఆ సాహిత్యం చిత్తశాంతిని కలిగించే సాధరణీకరణ లక్షణం నన్ను లోగొన్నది.

ఆ విధంగా విశ్వనాథ సాహిత్య అధ్యయనం నా జీవనంలో అవిభాజ్యమైన భాగంగా మారిపోయింది. నేను విశ్వనాథను సర్వప్రకృతిని వివిక్తంగా సాక్షత్కరింపజేసే మహాకవిగా అంగీకరించినా, ఆయన విశ్వసించే జగన్మిథ్యాభావాన్ని అంగీకరించలేకపోతున్నాను. సామాజిక దృక్పథంలోనూ ఆయనకున్న కొన్ని పరిమితులు నాకు లేవు అట్లాగే సంపత్కుమార శ్రీ వైష్ణవ తాత్త్విక దృక్పథంతో విభేదించలేక నాకు దూరంగానే ఉన్నారు. నా వలె శ్రీ అరవిందుల చైతన్యం ఆరోహణ, అవరోహణల జంట నిచ్చెనల లక్షణాన్ని ఆయన అంగీకరించలేదు. పద్య నిర్మాణంలో ఆయనకు రాయప్రోలు అంటే అంత ఇష్టం

లేదు. నాకైతే రాయప్రోలు పద్యం మధుర రసవాహినులు ప్రవహించే కోన.

సంస్కృత పాండిత్యం సంపత్కుమార పద్యాన్ని ప్రౌఢంగా చేసింది. నా పద్యం తీయదనాన్ని పుంజుకొని వెలువడింది. ఈ విధంగా యిద్దరి మధ్య రచనా విషయంలో ఎడం పెరుగుతూ వచ్చింది. అయినా ఆయన చివరి క్షణం దాకా నేను ఆయనకు అనుంగు బిడ్డనే.

5

హైదరాబాదుకు పై చదువులకోసం వెళ్లి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఏడు సంవత్సరాలు గడిపినాను. 1955-62 వరకు సాగిన ఈ కాలంలో బిఏ, ఎంఏ, పిహెచ్‌డిలు పూర్తయినాయి. దేశంలోని అనేక రంగాల ప్రముఖులను అక్కడ వినే అవకాశం వచ్చింది. ఉస్మానియాలో అధ్యయనం సర్వతోముఖ వికాసం కలిగించింది. తెలుగుశాఖలో ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, దివాకర్ల వెంకటావధాని, రామరాజు, చలమచర్ల ఇత్యాదుల అంతేవాసిత. ఖండవల్లివారి సౌజన్యం ఎంతో గొప్పది. వినీతి, ఆర్ద్రత, తెలుగు భాషా సాహిత్యాల పరివ్యాప్తికి ఏ పరిమితులు లేకుండా ఆయన సాగించారు. ఆయన కృషి ఫలితమే ఈనాటి తెలంగాణలోని సాహిత్య వికాస స్థితి. ఆయన శిష్య వాత్సల్యం అపారం. విద్యార్థులతోనూ సమస్థాయిలో ఆదరించి మాట్లాడేవారు. అప్పుడే ఆంధ్రప్రాంతం నుంచి విద్యార్థుల రాకడ ప్రారంభమైంది. కళాశాలల్లో తెలుగు భాషా బోధన అవకాశాలు విస్తరించాయి. ప్రాచ్య విద్యా పరివ్యాప్తి కలిగింది. ఖండవల్లి వారికి పరిశోధక పర్యవేక్షక స్థితి కలిగింది. రామరాజు, అవధాని, దుర్గయ్య, సినారె, ఆనందమూర్తి, గోపాలకృష్ణారావు, రాజేశ్వరశర్మ, పిఎస్ఆర్ అప్పారావు- ఇలా ఎంతో మంది దిగ్గజాలు పరిశోధన మార్గాన్ని బహు విస్తృతంగా నిలబెట్టారు. వారి సాహిత్య శోధన క్షేత్రాలు అతి విశాలమైనవి. ఆ నాళ్లలో పరిశోధనకు చేరుకున్న వాళ్లలో నేనూ ఒకణ్ణి. నేను ఏ హాస్టల్‌లో ఉండేవాడిని. మాదిరాజు రంగారావు అక్కడే ఉండేవాడు. మాకు తరగతుల తరువాత గ్రంథాలయం, ఊళ్లో సాహిత్య సమావేశాలు, హాస్టల్లో రాత్రివేళల్లో సాహిత్య గోష్ఠులు... ఇదీ నిరంతర చైతన్య స్ఫూర్తి. నారాయణగూడలో పల్లా దుర్గయ్య ఇంట్లో రామరాజు, దాశరథి, రామలింగం ప్రభృతులు ఉండేవారు. సినారె, ఆళ్వారుస్వామి మొదలైనవారు అక్కడ జతకూడేవారు. నేను, రంగారావు అక్కడికి సాయంకాలాలలో చేరుకునేవారం. ఎక్కువ సమావేశాలు కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలోనే జరిగేవి.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడటం, ఆంధ్రప్రాంత కవిపండితుల రాకపోకలు పెరగటం, వాతావరణంలో కొత్త వెచ్చదనం అప్పటి స్థితి. ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంలో తెరసం వరంగల్ శాఖ ఒక ప్రత్యేక సంచికను వెలువరించింది. దాని వెనుక నా కృషి ఉన్నది. నేను స్థానిక సాహిత్య సమీక్ష పేరున వరంగల్ జిల్లా సాహిత్య వికాసం గురించి దానిలో విపులమైన వ్యాసం వ్రాసినాను. నేను బిఏ విద్యార్థిగా ఉన్న రోజుల్లో వట్టికోట ఆళ్వారు స్వామి నాతో సాహిత్యము-నీతి అనే ప్రసంగం చేయించి, వ్యాసము రాయించి ప్రభాస అనే వ్యాససంపుటిలో చేర్చి ప్రకటించినారు.

6

ఆ నాళ్లలో నేను కాళోజీ నాగొడవ మీద వ్యాసం రాస్తే, ఆయన దాన్ని మెచ్చి ఆ గ్రంథం రెండవ కూర్పులో పీఠిక వలె చేర్చినారు. ఎంకిపాటలమీద నా వ్యాసం నాలుగు నెలలు స్రవంతిలో వరుసగా వచ్చింది. నేను ఎమ్మే విద్యార్థిగా ఉన్నప్పుడు సంస్కృత రూపకములు- తెలుగు అనువాదము అనే వ్యాసాన్ని సెమినార్లో సమర్పింపగా నాటి సభాధ్యక్షులు భూపతి లక్ష్మినారాయణ దాన్ని మంచి పరిశోధన వ్యాసం అన్నారు. ఇంకా ఆళ్వారు స్వామి, వానమామలై మొదలైన వారికి కూడా నా వ్యాసంగం మీద అభిమానం ఉండేది. పోతన చరిత్ర వర్తమాన కవిస్తుతిలో నా పేరును పేర్కొనటం నా పూర్వభాగ్యఫలంగా భావిస్తాను. కరీంనగర్‌లో విశ్వనాథ షష్టిపూర్తి సందర్భంలో నా కవితను అధ్యక్షత వహించిన పివి మెచ్చుకున్నారు. నాకు సంపత్కుమారల రచన ఒక గేయకావ్యం చదవటానికి తెరసం ప్రత్యేక కావ్యగాన గోష్ఠి ఏర్పాటు చేసింది. అక్కడ మమ్మల్ని సన్మానించింది. అదే మాకు మొదటి సన్మానం. ఆ సభకు కప్పగంతుల వారు అధ్యక్షులు. 1957లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఏర్పడింది. అంతకుముందే అఖిలాంధ్ర సాహిత్య పరిషత్ అనే సంస్థ ఏర్పాటు చేయాలనే సంకల్పం ఉండేది. ఆ ప్రయత్నంలో పివి. కాళోజీ మొదలైన వారు ప్రముఖులు. దానిని త్రోసిరాజని సాహిత్య రాజకీయాల కారణంగా ప్రభుత్వం చేత అకాడమీ ఏర్పాటు చేసి గోపాలరెడ్డి అధ్యక్షుడు, విశ్వనాథ ఉపాధ్యక్షుడుగా సంస్థ ఏర్పడింది.

విశ్వనాథ సంపాదకత్వం, గౌతమరావు నిర్వహణలో ఆ నాళ్లలోనే జయంతి పత్రిక 1955లో ప్రారంభమైంది. దానిలో నా రచనలు ఎక్కువగా వచ్చేవి. రసధుని అనేపేర కొందరు మిత్రులము ఒక సాహిత్యసంస్థను స్థాపించి విశ్వనాథను గూర్చి, శ్రీశ్రీని గూర్చి

రెండు గోష్ఠీ కార్యక్రమములు ఏర్పాటు చేసినాము. ఒకసారి కోఠీ మహిళాకళాశాలలోని దర్బారు హాలులో ఆర్ట్స్ కాలేజీ తెలుగు సాహిత్య సంఘం వారు విశ్వనాథ కల్పవృక్ష ఉత్సవాలు నిర్వహించేవారు. ఒక సదస్సుకు తాపీ ధర్మారావు అధ్యక్షత వహించి ప్రశంసాపూర్వకంగా ప్రసంగించారు. ప్రశంసకో, నిందకో భాగ్యనగర సాహిత్య లోకంలో మాకు విశ్వనాథ అభిమానులనే కాకుండా, భక్తులనే ముద్రపడింది. అంతవరకు మమ్మల్ని అభిమానించిన కవిమిత్రులతో ఈ అంశం ఎడం పెంచింది.

ఈ నాళ్లలో నా పద్యాలు భారతిలో అచ్చయ్యేవి. ఆ పద్యాలను దాశరథి ప్రభృతులు ప్రశంసించేవారు. బాపురెడ్డి, చేకూరి రామారావు నాకు మంచి మిత్రులు. చేరా కోసం నిజాం కాలేజీ హాస్టల్లో అప్పుడప్పుడూ కొన్ని రాత్రులు గడవడం పరస్పర స్నేహ గాఢతకు దారి తీసింది.

ఆ రోజుల్లో నేను తేజశ్చక్రము రాశాను. ఇది మధ్యాక్కర వలె కన్పిస్తుంది. యతిప్రాసలు కూడా ఉంటాయి. అయితే గణనిబద్ధత ఉండదు. తొలుదొలుత కొన్ని భాగాలుగా జయంతిలో వచ్చినవి. అయితే 1958 అక్టోబరులో ఇది పుస్తకరూపంలో వచ్చింది. ఈ పుస్తకంలో దఃఖయోగిని అన్న గీతపద్య బహుళ కావ్యమూ చేరింది.

కుందుర్తి వచనపద్యోద్యమం నడుపుతున్న కాలమిది. తన ఆఫీసులోనే ఒక ఆలస్య వేళలో నా తేజశ్చక్రము చదివించారు. అప్పుడు నవయుగ అనే వారపత్రికలో దాన్ని ఆయన సమీక్షించారు. కుందుర్తికి నా పద్యాలంటే ఇష్టం. అయితే ఆయన వచన పద్యాన్ని ఆధ్యాత్మిక వాదులు ఆక్రమించగలరని సంకోచం పొందేవారు. అయినా, ఆయన విశ్వనాథ శిష్యుడే కావటం వల్ల ఈ పరస్పర ఆదరణానికి ఇబ్బంది కలుగలేదు. కుందుర్తి వల్ల వచ్చిన సమస్య రూపనిష్ఠ. నాకెన్నడూ రూపనిష్ఠ లేదు. నేనే కాదు, దాశరథి దగ్గర నుంచి తెలంగాణా కవులు ఎవరూ ఈ రూపనిష్టకు కట్టుబడలేదు. కొంతలో కొంత ఈ రూపనిష్ఠ ప్రచురణ విషయంలో మా రంగారావుకు ఉండేది. పద్యం రాసి మనం మెప్పించేది ఏముంటుంది అని ఆలోచించేవాడు.

1959 ఏప్రిల్ భారతిలో నా 'సాహస్రమాన్మథము' అనే పద్యాలు అచ్చయినాయి. ఆ సంవత్సర సాహిత్య సమీక్ష చేస్తూ సాళ్వ కృష్ణమూర్తి ఈ కవితను ఆ ఏటి ఉత్తమ కవితగా పేర్కొన్నారు.

1959లో నేను పరిశోధన కోసం చేరినాను. అంశము రాజరాజభూషణుని కృతులు–

అధ్యయనము అని. వసుచరిత్రను గూర్చి నాకొక సందేహము ఉండేది. ప్రతి పద్యమూ శబ్దశక్తి చేత అనేకార్థాలను ప్రసరింపచేస్తున్నప్పుడు వస్తువును భావించటం దుర్లభమని, కావ్యానుభవం ఎలా కలుగుతుందని. నేను 1961 జనవరిలో విజయనగరం నుంచి మద్రాసు దాకా ఈ ప్రశ్నను మోసుకొని సాహిత్యయాత్ర చేసినాను ఎంతోమంది విద్వాంసులను కలుసుకున్నాను. అనేక సాహిత్య గోష్ఠులలో పాల్గొన్నాను. అయినా సందేహం తీరలేదు. ఈ పరిశోధన వ్యాసం నా సాహిత్య దర్శనాన్ని విస్తృత పరచిన మాట వాస్తవమే. ఎంతోమంది విద్వాంసులను దర్శించి సంభాషించి వారి వాత్సల్యాన్ని అనుభవించి ఒక పరితృప్తిని పొందినాను.

త్రిపురనేని గోపీచంద్ –నేను వసుచరిత్ర మీద పరిశోధన చేస్తున్నానని తెలుసుకుని ఒకసారి నన్ను కలుసుకోమన్నారు. సాదరంగా నాతో చర్చించినారు. బహు అర్థ సంయోజనలో ప్రధానార్థానికి ఇతర అర్థానికి ఉపమాన, ఉపమేయ భావం చెప్పుకోవచ్చునేమో చూడమన్నారు. అలాగే వసుశబ్దార్థం తెలుసుకోమన్నారు. తరువాత సంశయం తొలగిపోయింది. కావ్యము మూడు పొరలలో ఉన్నదని, ఒకటి జలం లోకంలోకి ప్రవహించటం, రెండు ఇంద్ర వృత్రాసురుల కథ, మూడు కావ్య స్ఫుట వస్తువైన ఉపరిచర వసు కథ. ఈ బహుస్తర గాథా నిర్మాణానికోసం కవి అనేకార్థ ప్రతిపాదకమైన శైలిని ఎన్నుకొన్నాడని నాకు స్ఫురించింది. శ్రీ అరవిందుల 'సావిత్రి' కావ్య అధ్యయనం ఈ అంశాలన్ని విపులంగా ప్రస్ఫుటం చేసింది. ఇది ప్రాచీన కావ్యాధ్యయనంలో నూతన మార్గావిష్కరణంగా ప్రశంస పొందింది. 1962 జూన్‌లో నాకు డాక్టరేట్ డిగ్రీ వచ్చింది. వరంగల్ కళాశాలలో స్థిరమైన ఉద్యోగం వచ్చింది.

1970 ప్రాంతాలలో పద్యరచనం మీద ఒక నిరసనం తీవ్రమైంది. పద్యం చచ్చిపోయిందంటూ వ్యాఖ్యానించేవారు. ఆ తీవ్రతను తొలగించేందుకు నేను 1973లో తొలి అష్టావధానం చేసినాను. ఆ తరువాత తెలంగాణాలో చాలా ప్రాంతాలలో 80 దాకా అష్టావధానాలు చేసినాను. శ్రీశృంగేరి పీఠాధీశులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ స్వాముల సమక్షంలోనూ, శ్రీ పివి సమక్షంలోనూ అష్టావధానాలు చేసే అవకాశం లభించింది. వారి ఆశీఃస్సులు లభించాయి.

వరంగల్లు ప్రాంతంలో సాహిత్య చరిత్ర గురించి, చరిత్ర గురించి కొంత తీవ్రంగానే కృషి చేసినాను. ఇంటాక్ సంస్థవారి ప్రోత్సాహం ఇందుకు కారణం. ఏకశిలా సాహిత్య

సౌందర్యం అనేపేర ఈ ప్రాంత సాహిత్య చరిత్రను సంపాదకుడుగా ప్రచురించినాను. విద్యారణ్యస్వామి సాహిత్య సమగ్ర తాత్త్వికతపై ఒక గోష్ఠి నిర్వహణకు పరిస్థితులు ఏర్పరచటం విద్యారణ్య విద్వద్గోష్ఠి అనే పేర రెండు సంపుటాలను ప్రచురించటం మరొక మౌలిక కృషి.

మా తాతగారు కోయిల్ కందాడై రంగాచార్యుల వారి స్మారకంగా 2005 నుంచి ఒక ట్రస్టు ఏర్పరచి ప్రసిద్ధులైన ఉభయ వేదాంత పండితుల చేత స్మారకోపన్యాసం చేయించి, ఆ వేళకు దాన్ని ప్రచురించి వారిని పండిత రత్న బిరుదంతో సత్కరించి యథోచితంగా సన్మానం చేస్తున్నాము.

నేను ఎమర్జెన్సీ రోజులలో దానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో రహస్యంగా పాల్గొన్నాను. అప్పుడే వందేమాతరం గీతం శతజయంతి ఉత్సవాలు జరిగితే ఒక ప్రత్యేక సంచికను వెలువరించాను.

7

జీవన గమనంలో మార్పు. ఉద్యోగం, సంసారం ఒక పార్శ్వమైతే, కవిత్వం, విమర్శ మరో పార్శ్వం, ఉద్యోగ జీవితంలో ప్రతిరోజు ప్రతి తరగతి పాఠమూ, నూతన అధ్యయన స్థానమే అయింది. బయట కానవచ్చే ఇతరాంశాలు ఏవీ నన్ను వికలం చేయలేదు. వృత్తి నిర్వహణ సందర్భంలో చివరవరకూ ఎన్నో ఎత్తుపల్లాలు, ఒడిదుడుకులు కలుగుతూనే వున్నాయి.

1964లో అధునా అన్న కావ్యసంపుటి వచ్చింది. దానికి ముందుమాట వ్రాస్తూ దేవులపల్లి రామానుజరావు – "సుప్రసన్న తెలుగు సరస్వతికి సహస్ర కమలపూజ చేయగలర"ని ఆశించారు. ఈ ఖండకావ్య సంపుటిలోని పద్యాలు 1957 నుంచి వివిధ పత్రికలలో వచ్చినవే. కవికి సొంతు గొంతు క్రమంగా ఏర్పడుతుంది. పేర్వారం జగన్నాథం, సంపత్కుమార, నర్సింహారెడ్డిలతో కలిసి 1967లో చేతనావర్తం తొలిసంపుటం నా పీఠికతో వెలువడింది. ఈ సంపుటం వెలువడగానే సాహిత్యలోకంలో సంచలనం. ఈ సంకలనం పార్టీలకు లొంగిపోయే సాహిత్యాన్ని దూరం చేసింది. ప్రజాస్వామ్య దృక్పథానికి బలమిచ్చింది. మానవుడు కేవలం అర్థవశుడుగా కాక ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆది భౌతిక స్తరాలలో పరిపూర్ణంగా వికసించవలసిన అవసరాన్ని నొక్కిచెప్పింది. దివ్యజీవన ఆవిర్భావాన్ని పృథ్వీమీద జరగాలని స్వప్నించింది.

జాతీయ జీవన ధోరణితో విరోధం పెంచుకుని పార్టీల వ్యక్తుల తీరులు వెనక్కి తగ్గాయి. ప్రతిభావంతమైన సంస్కృతి ప్రకాశంలో సమాజంలోని వైరుధ్యాలను, ధోరణులను ఈ సంపుటి సమీక్షించింది. మరి నాలుగేళ్లలో సంపత్కుమార పీఠికతో రెండవ సంపుటం వచ్చింది. ఎవరేమని నిరసించే ప్రయత్నం చేసినా చేతానవర్త స్ఫూర్తి ఆధునిక తెలుగు కవితారంగంలో తన కర్తవ్యాన్ని సమర్థంగా నిర్వహించింది. ఈ నడిమి కాలంలో వరంగల్లు నుంచి వారపత్రికగా వెలువడే జనధర్మ ద్వైమాసిక సాహిత్యానుబంధాన్ని ప్రకటించింది. నేను దీనికి సంపాదకుణ్ణి. విలువగల సాహిత్య పత్రికను పదకొండు సంచికలను ప్రకటించింది. స్వాతంత్ర్యోత్తర కాలాన తెలుగు కవిత ఇది వెలువరించిన విలువైన ప్రత్యేక సంచిక. జ్ఞానపీఠ పురస్కార సందర్భంలో విశ్వనాథను గురించి మరొక ప్రత్యేక సంచికను వెలువరించింది.

1971లో ఆధునిక సాహిత్యాన్ని ముఖ్యంగా కవిత్వాన్ని గురించి నేను వ్రాసిన వ్యాసాలను సాహిత్య వివేచన పేరిట ప్రచురించాను. ఇది వెలువడిన వెంటనే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ఉత్తమ విమర్శ గ్రంథంగా బహుమతి ప్రకటించింది. దానితో నాకు విమర్శక స్థానం లభించినట్లే భావించాను. అబ్బూరి రామకృష్ణారావు వంటి వారు నా విమర్శలోని సమతులా లక్షణాన్ని ఎంతగానో అభిమానించారు.

నా అదృష్టం ఏమిటంటే తొలితరం కవులు చాలామందితో నా పరిచయము కలిగి ఉండటం. వారి వాత్సల్యాన్ని నేను పొందగలగటం నా అదృష్టమే. విశ్వనాథ వారితో పాటు కాటూరి వెంకటేశ్వరరావు, శివశంకరస్వామి, నోరి నరసింహశాస్త్రి – రాయప్రోలు సుబ్బారావు, నాయని సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి– వీళ్లందరితో నాకు ఆప్తమైన సంబంధం ఉండేది. తరువాత తరం కవులతో కూడా నా సంబంధాలు ప్రీతిపాత్రాలే అయినవి.

నా జీవితం ఉద్యోగంలో కుదురుగానే సాగింది. మెట్లు ఎక్కడమూ జరిగింది. నా జీవితంలో ఎంతోమంది నా సంపూర్ణ వికాసానికి దోహదం చేసినారు. వారికి నేను ఏమి చేసినానో చెప్పలేను కానీ, కొంతమంది పురోగమనానికైనా నా చేతనైన సహాయం చేసినాను. 1987లో శతాంకుర వచ్చింది. కావ్య సృజనశక్తికి విలక్షణమైన అభివ్యక్తి ముద్ర కలిగింది. సాహిత్యవేత్తలు దీన్ని స్వాగతించి దాని అభినవతను మెచ్చుకొన్నారు. సృష్టిలోని అనేక పార్శ్వాలు ఈ ముక్తక సంపుటిలో వ్యక్తమయ్యాయి. నా తాత్త్విక జీవన పరమార్థ దృష్టి

ఈ కావ్యంలో సంగ్రహంగా ప్రకటితమైంది. నా కావ్య ప్రస్థానంలో ఇది ఒక విశిష్టమైన ఘట్టమే. ఈ సందర్భంలోనే నాకు ఆధ్యాత్మిక సాధనలో కొంత సంక్లిష్టమైన ఘట్టంలో ఉన్నట్టు అనిపించేది. ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు లభించలేదు. కొన్ని సంశయాలు తీరే అవకాశాలు లేకుండెను. నా తపోమార్గంలో హఠాత్తుగా నిరోధం ఏర్పడ్డట్టు అనిపించింది. ఆ సందర్భంలో నా జీవనంలోకి ఒక అరుదైన వ్యక్తి, సనాతన అధునాతన జీవన తాత్పర్యాన్ని తనలో సమన్వయం చేసుకున్న వ్యక్తి అవతరించారు. వారి పేరు సద్గురు శివానందమూర్తి. అంతకుముందు నా జీవనంలో ప్రవేశించిన తత్త్వ స్ఫూర్తిని కలిగించిన వారు శ్రీఅరవిందులు, శ్రీమాత, రమణమహర్షి, సాయిబాబా వంటి వారు వీరిలో లీనమైనారు. వారి మార్గదర్శనం నన్ను, నాజీవితాన్ని స్పష్టమైన అసంక్లిష్టమైన మార్గంలో తీర్చిదిద్దుకోవటానికి దోహదం చేసింది.

సద్గురువుల అనుగ్రహం నాకు అనంతమైన చిత్తశాంతిని కలిగించింది. వారి సన్నిధి అసంతృప్తి లేకుండా నాకు సమచిత్తతను ప్రసాదించింది. వారి సన్నిధి నాకు ఈశ్వర సన్నిధానమే అయింది. వారు స్థాపించిన సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ పక్షాన శ్రీరామనవమి పురస్కారం లభించటం గొప్ప ఆశీర్ అనుగ్రహం. అలాగే శ్రీ ముత్తేవి లక్ష్మణ యతీంద్రుల అనుగ్రహం కూడా లభించింది. వారు ఉత్తమ కవితకు స్వయంగా వశీకృతులయ్యేవారు. తొలి పరిచయంలోనే 1982లో తేజశ్చక్రము రాసిన కవివి కదా అని కౌగిలించుకున్నారు. అది శ్రీరాముడు మారుతికి అనుగ్రహించిన పరిష్వంగం. నన్ను మధురకవి అని పిలిచేవారు.

తరువాత నా కావ్యాలు ఎన్నో వెలువడ్డాయి. ఋతంభర, కన్నీటి కొలను, కృష్ణరశ్మి, శ్రీనిరుక్తి, శ్రీనృసింహ ప్రవత్తి- ఇలా ఎన్నో. అయినా నేను భావిస్తున్న సమగ్ర కావ్యం రూపు కట్టలేదు. అనుకోకుండా పదిహేను రోజులు జ్వరంలో పడ్డ తరువాత ఆ వేదనలో 2002లో సాంపరాయం కావ్యం ఒక ప్రవాహం లాగా వెలువడింది.

సాంపరాయం 12 అధ్యాయాల్లో సృష్టి ఆరంభం నుంచి జీవన పరిణామం వర్ణించి మానవుడు మృత్యువును అతి తరించేదాకా ప్రయత్నాన్ని వ్యక్తీకరించే ఇతిహాస కావ్యం. శతాంకుర లాగా ఇదీ వచన పద్యమే. అయినా ప్రతి పద్యమూ లయ కలిగిన నాలుగు పాదాలతో నిర్మితమైంది. మృత్యువును జయించి దివ్యమైన సమాజం భూమండలంలోనే ఏర్పడవలసిన రీతిని కలగన్నది. భావుకులు, తత్త్వవిదులు, కవిత్వగ్రహణ పారీణులు దీని ఔన్నత్యాన్ని ప్రశంసించినారు. ఈ కావ్యాన్ని మిత్రులు డాక్టర్ ఎల్ఎస్ఆర్ ప్రసాద్,

డాక్టర్ విబి రామారావులు ఇంగ్లీషులోకి అనువదించారు.

సాంపరాయం తరువాత వచ్చిన కావ్యాలు శేఫాలిక, ప్రీతి పుష్కరిణి, మణిసేతువు, మణికర్ణిక మొదలైనవి దేనికవి వైలక్షణ్యం కలవే. బింబప్రతిబింబ భావాన్ని ఓర్వలేవు.

1983లో వెలువడిన సహృదయచక్రం వ్యాస సంపుటి తరువాత నా విమర్శ గ్రంథాలు మరో 11 వెలువడ్డాయి. అనేక అంశాలకు సంబంధించిన వినూత్న అంశాలు ఈ వ్యాసాల్లో ఉంటాయి. వీటిల్లో అధ్యయానానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ విమర్శ గ్రంథంగా పురస్కరించింది. అదే విశ్వవిద్యాలయం ఉత్తమ పరిశోధకునిగా ప్రతిభా పురస్కారాన్ని అందించింది.

నా పీఠికల సంపుటి అంతరంగం. శ్యాంసంగ్ వారు, కేంద్ర సాహిత్య అకాడమీ వారు సంయుక్తంగా ప్రకటించిన తొలి ఠాగూర్ సాహిత్య పురస్కారాన్ని పొందింది. తరువాత శ్యాంసంగ్ కంపెనీ వారి ఆహ్వానం మీద కొందరు పురస్కార గ్రహీతలతో కలిసి దక్షిణ కొరియాకు వెళ్లటం, అక్కడ సాహితీవేత్తలను కలుసుకోవటం జరిగింది. అఖిల భారత ప్రాచ్యవిద్వన్మహాసభలలో పాల్గొని 1977 నుంచి ఎన్నో పరిశోధన పత్రాలను సమర్పించాను. 1987లో కలకత్తాలో ఈ మహాసభలు జరిగినప్పుడు ద్రావిడ అధ్యయన సదస్సు విభాగానికి అధ్యక్షత వహించగలగటం నాకు సమకూడిన గొప్ప గౌరవం. జీవిఎస్ పేర ఏర్పడ్డ సాహిత్యపీఠం వారి ఉత్తమ విమర్శక పురస్కారం 2001లో నాకు లభించింది.

వేద రహస్యాన్ని సామాన్య పాఠకులకు అందించే సంకల్పంతో వేద సూక్త సౌరభం అనే పేర వాటిలోని ఆధ్యాత్మిక భూమికను ఆవిష్కరించే ప్రయత్నం చేసినాను. ఈ గ్రంథానికి మంచి స్పందన లభించింది. ఇదే పద్ధతిలో ఇటీవల శ్రీకృష్ణోపనిషత్ వ్యాఖ్య కూడా ప్రకటించాను. దీపవృక్షం అనే పేర జీవనములోని అన్ని పార్శ్వాలకు సంబంధించిన మనోభావాల సంకలనం వెలువరించాను.

సాహిత్యంలో జాతీయ భావధోరణి బలపరిచే నిమిత్తం 1974లో జాతీయ సాహిత్య పరిషత్ ఏర్పడింది. దాని స్థాపన ప్రయత్నంలోనూ, పురోగమనంలోనూ నేను ప్రముఖమైన కృషిని నిర్వర్తించాను. విశ్వనాథ శతజయంతి సందర్భంలో గ్రంథరూపంలోకి రాని ఆయన అనేక రచనలను విశ్వనాథ అసంకలిత సాహిత్యం అనే పేర నేను, సంపత్కుమార కలిసి ఆరు సంపుటాలుగా వెలువరించినాము. దాన్లో మూడు, నాలుగు సంపుటాలకు నేను సంపాదకుడిని. నేను సంపాదకత్వం వహించిన అనేక గ్రంథాలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్

సంపుటాల అనువాదంలో అయిదవ భాగం ఒకటి.

సాహితీబంధుబృందం, కులపతి సమితి, జాతీయ సాహిత్య పరిషత్, విశ్వనాథ భారతి, సృజనలోకం వంటి అనేక సాహిత్య సంస్థల నిర్మాణంలో, పురోగతిలో నా ప్రయత్నం ముఖ్యమైందే. 1964–73 సంవత్సరాల నడుమ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడిగా నేను సాధ్యమైన కృషి నిర్వర్తించాను. 1982లో రాష్ట్ర స్థాయిలో పోతన పంచశతి ఉత్సవాలను నిర్వర్తించిన సందర్భంలో నా భూమిక ముఖ్యమైందే. ఆ సంకల్పం దగ్గర నుంచి పూర్తయ్యే దాకా నా కృషి ఉన్నది. ఈ ఉత్సవాలు అయిదు రోజుల పాటు వరంగల్లులో అపూర్వంగా జరిగినాయి. దీనికి ప్రధాన ఆధారం బలం పివి. నరసింహారావు. ఈ ఉత్సవాల ఫలితంగా పోతన విజ్ఞాన పీఠం 1987లో ఏర్పడింది. ఆ పీఠం 1992లో భవనం నిర్మించుకోవటం జరిగింది. అంతకుముందు, తరువాత ఎన్నో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది; నిర్వహిస్తున్నది. నేను చాలాకాలం దానికి సంయుక్త కార్యదర్శిగా ఉన్నాను. ఆరేడేళ్లుగా కార్యదర్శిగా నా కృషి కొనసాగిస్తున్నాను.

ఈ ప్రాంతంలో సాంస్కృతిక చైతన్యం పురోభివృద్ధి కోసం కృషి చేస్తున్నాను. దీనిలో సభాభవనం, గ్రంథాలయం ఉన్నాయి. వరంగల్లు ప్రాంతంలో సాంస్కృతికంగానే కాక ఆధ్యాత్మిక స్ఫూర్తిని కలిగించటంలో ఈ సంస్థ ఎంతో దోహదం చేస్తున్నది.

నా జీవితం సుఖదుఃఖ మిశ్రితం. ఎన్నో వెలుతులు, ఎన్నో పొంగిపొర్లటాలు. 2008 చివర మా పెద్దబ్బాయి గుండెపోటుతో పరమపదించటం, 2010 ఆగస్టులో మా చిన్నాయన సంపత్కుమార పరలోక గతులు కావటం, మొన్న డిసెంబరులో నా ధర్మపత్ని కాలగతి చెందటం– ఇవన్నీ ఒకే కాలంలో సంభవించిన విషాదాలు. ఇప్పుడొక విచిత్రమైన శూన్యస్థితిలో మనస్సు ఉన్నది. ఈ మృత్యువు చేసే ఒత్తిడి జీవన పరమార్థాన్ని వ్యాఖ్యానించే దివ్యద్వారమే అవుతుందని నా విశ్వాసం.

శతాంకురలో ఎక్కడో అన్నాను. జీవితం ఎటర్నల్ స్క్రిప్చర్ అని. అలాగే దీన్లో వెలుగులు చూచుకుంటూ ఆ మార్గంలో నడుస్తున్నాను. ఋతుచక్రంలో శిశిరం తరువాత వసంతం వస్తుంది. ఇదంతా చక్రనేమిక్రమం.

ఈ పరిణతవాణి ప్రసంగ పరంపరలో 58వ ప్రసంగానికి నన్ను పిలిపించి, ఒకింత ధృతిని కలిగించి, నన్ను నేను సింహావలోకనం చేసుకునే అవకాశం కల్పించిన ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య సి.నారాయణరెడ్డికి కృతజ్ఞతలు.



గొల్లపూడి మారుతిరావు

నేను నా చిన్నప్పుడే నా చిన్నతనాన్ని నష్టపోయాను. అది నాకు దక్కిన అదృష్టం. నా పద్నాలుగవయేటనే మొదటి రచన చేశాను. ఆనాటి తెలుగు సాహిత్య రంగంలో పేరు మోసిన ఎందరో పెద్దల మధ్య తిరిగాను. పురిపండా అప్పలస్వామి, మొసలికంటి సంజీవరావు, మసూనా, అంగర వెంకట కృష్ణారావు, అంగర సూర్యారావు, రాచకొండ విశ్వనాధ శాస్త్రి - యిలాగ. ఆనాటి ఓ కవి సమ్మేళనంలో ఆవంత్స సోమసుందర్, గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, మల్లాది రామచంద్రశాస్త్రి వారి సరసన నిలబడి అప్పట్లో రాసిన ఉమర్ ఖయ్యాం పద్యాలు చదివేశాను. నన్ను 'సాఖీకవి' అన్నారు ఆవంత్స. అప్పట్లో తెన్నేటి విశ్వనాథంగారి ఆధ్వర్యంలో విశాఖపట్నం టౌనుహాలులో పురిపండా అప్పలస్వామిగారు జరిపించిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కనకాభిషేకంలో అభినందన పద్యాలు రాసి చదివాను. మరో 35 సంవత్సరాల తర్వాత - ఆయన కాలధర్మం చెందాక - ఆయన ట్రంకుపెట్టెను కాగితాలన్నిటితో సొంతం చేసుకుని, వారిమీద పరిశోధన చేసిన చామర్తి కనకయ్య (కనక్ ప్రవాసి) గారు నా పద్యాల వ్రాతప్రతి నకలుని నాకు పంపారు. పురిపండా నన్ను శ్రీపాదకి పరిచయం చేశారు. అలాగే శ్రీశ్రీకి. ఈ పెద్దల మధ్య చెట్లెక్కి ఆడే నా చిన్నతనం జారిపోయింది. నాకంటే పెద్దలు, లబ్ధప్రతిష్ఠులు, ప్రసిద్ధుల మధ్య గడపడం-నన్ను కమ్మెచ్చులాగ సాగదీసి ఎంతో కొంత భయభక్తుల్ని, బాధ్యతల్ని, వినయాన్ని నేర్పింది. ఇది గొప్ప అదృష్టం.

చాలామందికి దక్కని, ప్రయత్నించినా కలిసిరాని మరొక అదృష్టం నాకు కొంగు బంగారమయింది. అది నా జీవితమంతా తొలినాటి నుంచీ నా అభిరుచీ, వృత్తీ ఒకటే

కావడం. నా మనస్సుకి వచ్చిన ఆనందాన్నిచ్చిన పనే నా వృత్తికావడం. దినపత్రిక, వారపత్రిక, రేడియో, టీవీ, రంగస్థలం, సినిమా, ప్రసంగవేదిక, ఏంకరింగు, నాటక ప్రయోక్త, వక్త- యివన్నీ ఒకదాన్ని ఒకటి ఒరసుకు సాగే ప్రక్రియలు. జీవితమంతా - కింది తరగతి నుంచి పై తరగతికి వెళ్లినట్టు ప్రక్రియలో సాంద్రత, స్వారస్యం, అప్పీలు, రీచ్ పెరిగే స్థాయిలలో, మాధ్యమాలలో జీవిక సాగడం - గొప్ప అదృష్టం. అవకాశం. అనుభవం. దక్షత తర్వాతి మాట.

మౌలిక రచన, నటన, కళ - యివేవీ నాకు వారసత్వం కావు. తల్లిదండ్రుల తరాలలో ఎవరూ చేపట్టని, ఎవరికీ తట్టని కోణాలివి. మాది సాదా సీదా బ్రాహ్మణ కుటుంబం. మా నాన్న 11మంది సంతానంలో అయిదో కొడుకు. వారాలు చేసుకుని ఎస్సెల్సీ దాకా చదువుకున్నారు. మా పెదనాన్న ఒకాయన సత్రం గుమాస్తా. మరొకాయన వంటలు చేసేవాడు. మా అమ్మ పెద్ద చదువుకోలేదు. కాని పురాణాలు చదువుకునేపాటి నేర్చుకుంది. మంచి గొంతు. చాలా అందమయింది. నాలాగే. లేదా నేను ఆమెలాగే. ఈ ముక్కు మాత్రం నా సొంతం. ఆమె ముక్కు కూడా కోటేరు వేసినట్టు ఉండేదికాని - నా దగ్గరికి వచ్చేసరికి మరింత సాగి గెద్దముక్కు అయింది. ఏ విషయమయినా ఒక ప్రణాళికతో - కథలాగ మనస్సుకు హత్తుకునేట్టు చెప్పేది. ఆ ధోరణి నాకు వంట బట్టిందనుకుంటాను. నాకు చీరెకడితే మా అమ్మ. ఆమె వాగ్ధోరణి, మొండి కర్తవ్య దీక్ష, ప్రథమ కోపం, అనారోగ్యం, అందం, రోగాలూ అన్నీ నాకు వారసత్వంగా వచ్చాయి. ఆమెకు ఏయే దశలో ఏమేం వచ్చాయో గుర్తుపెట్టుకునేవాడిని. ఆ దశలో అవి నాకూ వస్తాయని నమ్మకం. ఆ వరస ఏనాడూ తప్పలేదు. "నీకు ఏయే యిబ్బందులొచ్చాయో చెప్పు. నేనూ నీ వయస్సులో వాటికి సిద్ధ పడతాను" అనేవాడిని. "అవేంరావు. నువ్వు బాగుంటావు" అనేది. అది ఆమె ఆశీర్వాదం. కాని శరీరానికి, ఆమె యిచ్చి జీన్స్‌కి ఆ పెద్ద మనస్సు లేదు. మా అమ్మకి నేను రచనలు చేయడం సుతారామూ నచ్చేదికాదు. కారణం - 1955 ప్రాంతంలో రచనా వ్యాసంగం. ఉపాధికాగలదని ఊహించలేని దశ. ఆమెకి నేను సినీమాల్లో చేరడం బొత్తిగా యిష్టంలేదు. నా కీర్తీ, డబ్బూ ఏనాడూ ఆమెని అబ్బురపరచలేదు.

చార్లీ చాప్లిన్ తల్లి గుర్తుకొస్తుంది. ప్రపంచ ప్రఖ్యాతిని సాధించాక చాప్లిన్ తల్లిని అడిగాడు:

What do you think of all this? అని.

ఆమె అప్పటికే మతిస్థిమితం తప్పింది. As long as it makes you happy అన్నది ఆమె సమాధానం.

1982 ఏప్రిల్ 23 న "ఇంట్లో రామయ్య – వీధిలో కృష్ణయ్య" ఇంటర్వెల్‌కి నేను స్టార్‌ని. మా అమ్మకి ఆ సినీమా పక్కని కూర్చుని చూపించాను. అప్పటికే దేశం నా వేషం చూసి ఉగ్రూతలూగుతోంది. కాని మా అమ్మ చలించలేదు. సినీమా అంతా అయాక ఉండబట్టలేక అడిగాను– ఎలావుందని.

"అందరూ నిన్ను తిడుతున్నారు. నువ్వా రెండో అబ్బాయి వేషం వెయ్యాలసింది" అంది. నేను సినీమాలో విలన్‌ని. రెండో అబ్బాయి సినీమాకి మొదటి అబ్బాయి – చిరంజీవి. చిరంజీవికి ఈ మాట చెప్పాను.

మా అమ్మ స్వభావం చెప్పడానికి చేసిన శాఖా చంక్రమణం ఇది.

నా జీవితంలో చేసిన పెద్ద పొరపాటు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మేథమెటికల్ ఫిజిక్స్ విభాగంలో చేరడం. నన్ను ఇంగ్లీషు డిపార్టుమెంటులో చేర్చుకుంటామన్నారు. అప్పటి ప్రొఫెసరు కె.ఆర్.శ్రీనివాస అయ్యంగార్. తెలుగు రచయితకి ఇంగ్లీషు చదువేంటి అన్నది ఆనాటి నా అసంగతమైన మీమాంస. తర్వాత ఆసలు చదువుకి శీతకన్ను వేసి లైబ్రరీలో చదువే సాగించాను. I Was a bad student and best actor of Andra University నా విశ్వవిద్యాలయం చదువు ఓ పీడకలగా డిగ్రీతో బయటపడే దిశగా, కె.వి. గోపాలస్వామిగారి ఆధ్వర్యంలో ఆరుబయలు రంగస్థలంలో ప్రాచుర్యం దిశగా సాగింది. ఆనాటి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకున్న తరం – తెలుగు సాహిత్యంలో బలమైన ముద్ర వేసిన తరం. కొండముది శ్రీరామచంద్రమూర్తి, నిడదవోలు మాలతి, కొలకలూరి ఈనాక్, మోదుకూరి జాన్సన్, ఏటుకూరి ప్రసాద్, జ్యేష్ట, కవన శర్మ, నేనూ.

ఆంధ్రాభ్యుదయోత్సవాలు ఆ రోజుల్లో ప్రసిద్ధమైనవి. 1956లో నలుగురు ఉపన్యాసాలకు పచ్చారు. ఇద్దరు తెలంగాణా కవులు – యువకులు. ఒకాయన పొట్టిగా, గట్టిగా మీదకెగిసే నిప్పురవ్వలాగ ఉన్నారు. మరొకాయన ఉంగరాల జుత్తు, అందంగా అలంకరించిన పుష్పగుచ్ఛంలాగ ఉన్నారు. పొట్టి ఆయన పేరు దాశరధి. పుష్పగుచ్ఛం పేరు సి. నారాయణరెడ్డి. మాకా పేర్లు కొత్త. దాశరథి రాసిన 'అచుంబితం' గేయాన్ని మోదుకూరి జాన్సన్, లభాను అతి శ్రావ్యంగా పాడారు.

మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడిచిరా

నిశ్శబ్దం ఎరుగనట్టి నిమ్నగవలె విడిచిపో

చేదగు కన్నీటి బొట్టు చిందిన చప్పుడులు విను

వాదింపగరాని మనసు పరివాదిని లోతుగను– యిప్పటికీ గుర్తుంది. ఆనాటి నారాయణ రెడ్డిగారి శ్రావ్యమైన ప్రసంగమూ గుర్తుంది. మరొక వ్యక్తి శ్రీశ్రీ. ఎంత ప్రముఖుడో అంత చప్పని ప్రసంగం. ఇంకొకరు నటుడు. కె. వెంకటేశ్వరరావు. నిజానికి ఆయన పేరూ వినలేదు. కాని గంటసేపు ప్రేక్షకుల్ని తన ప్రసంగంతో ఉర్రూతలూగించారు. తర్వాత నా జీవితమంతా ఈ నలుగురితోనూ ముడిపడింది. నేనూ, దాశరథిగారూ రేడియోలో కలిసి పనిచేశాం. వెంకటేశ్వరరావుకి నా జీవితంలో అతి ముఖ్యమైన నాటకాలు రాశాను. నేను రాసిన ఎన్నో సినీమాలకు సినారె పాటలు రాశారు. నటుడిగా వారు రాసిన ఎన్నో పాటలను నటించాను. ఇక శ్రీశ్రీ. మద్రాసు రేడియోలో ఆయన నన్ను ఇరకాటంలో పెట్టని సంవత్సరమంటూ ఉండేదికాదు.

మరొక వింత సంఘటన చెప్పాలి. ఆనర్స్‌లో ప్రముఖ నవలా రచయిత థామస్ హార్డీ నవల "ది మేయర్ ఆఫ్ కాస్టర్‌బ్రిడ్జ్" మాకు నాన్‌డిటైల్డ్. మొదటిరోజు ప్రొఫెసరు ముత్తుస్వామిగారు హెంచర్డ్ సంతలో తాగి జూదంలో తన భార్యనీ బిడ్డనీ ఓడిపోయిన అధ్యాయం చెప్పారు. ఇక మనస్సు ఆగలేదు. నవలంతా చదివేసి, ఇంకా తనివి తీరక 600 పేజీల నవలనీ మళ్లీ ఆయన క్లాసుకి వచ్చే లోపల – అంటే వారంలో అనువదించాను. అది 'పరాజితుడు'గా తరువాత ప్రచురితమయింది. విశేషమేమంటే తీరా ఆ నవలలో పరీక్ష తప్పాను!

అయితే అలా పరీక్ష తప్పిన మరొక పెద్దాయన నాకు వత్తాసు. ఆయన పేరు పుట్టపర్తి నారాయణాచార్యులుగారు. ఆయన వ్రాసిన 'పెనుగొండ లక్ష్మి' నవలని విద్వాన్ పరీక్షకి పాఠ్యగ్రంథంగా పెట్టారు. ఆయనే ఆ పరీక్షకు హాజరుకావాల్సి వచ్చింది. పరీక్ష రాశారు. కాని తప్పారు. కారణం ఆ రచనకు సంబంధించిన ఒక్క ప్రశ్నకి సమాధానం క్షుణ్ణంగా రాశారు. మిగతా ప్రశ్నలకు వ్యవధి చాలలేదు. అయితే ఓటమిలో నాకు తోడు. అదీ ఊరట.

ఆ రోజుల్లో – అంటే 1956 మాట – యింట్లో కిరసనాయిలు దీపాలే ఉండేవి. ఆ

దీపాల వెలుగులో పాఠ్యపుస్తకాలు మీదనే పెట్టి దొంగతనంగా కింద తెల్ల కాగితాల మీద కథ రాసేవాడిని. మా అమ్మ వెనుకనుంచి వచ్చి పట్టేసేది. అక్కడ్నుంచీ దీవెనలు. ఆ రోజుల్లో రోజూ విధిగా ఒక కథ రాసేవాడిని. పుంఖాను పుంఖంగా పత్రికలకు పంపేవాడిని. ఆంధ్ర పత్రిక, ఆంధ్ర ప్రభ, చిత్రగుప్త, ప్రజామత, భారతి–యిలాగ. వాటిని చూసి మా అమ్మ తిట్లు. గతిలేక పోస్టాఫీసుకు వెళ్లి–పోస్టు మాస్టరుని బతిమాలుకుని – కేరాఫ్ పోస్టు మాస్టరు అడ్రసు సంపాదించుకున్నాను. దాదాపు అన్నీ తిరిగి వచ్చేవి. ఒక్కటయినా ప్రచురితం కాదా అని ఆశ. అదో మైకం. ఆవేశం. ఏదో చెప్పాలనే ఆరాటం.

కూతుర్ని టెన్నిస్ క్రీడాకారిణిని చేసి ప్రపంచస్థాయిలో నిలపాలని స్విట్జర్లాండులో ఓ తల్లి ఆరాటం. ఆమె ఆదర్శం మార్టినా నవ్రతిలోవా. కూతురుకి ఆమె పేరే పెట్టుకుంది. మార్టినా హింగిస్. ఆ అమ్మాయి పెరిగి పెద్దదయి ప్రపంచ ప్రఖ్యాతి సాధించింది. నాలాంటివారికి ఆ అదృష్టం లేదు. పెద్దల ఆంక్షల్ని దాటి అభిరుచిని కాపాడుకున్న అదృష్టవంతుడిని నేను. అయితే పేరు ప్రఖ్యాతులు వచ్చాక కూడా ఇది అదృష్టమని మా అమ్మ ఒప్పుకోలేదు.

ఆనర్స్ చావుతప్పి కన్ను లొట్టపోయినట్టుగా పూర్తిచేసి 1959 లో ఆంధ్ర ప్రభలో ఉపసంపాదకుడిగా చేరాను. మానాన్నగారికి కోపం. చిత్తూరు వెళ్లినందుకు మా అమ్మకి అయిష్టత.

చిన్నతనాన్ని చిన్నప్పుడే నష్టపోయానన్నాను. కాని నేను చేసే ఏ పనిలోనయినా చిన్నప్పటినుంచే నేనే పెద్దని. చదువుకొనే రోజుల్లోనే 'రాఘవ కళా నికేతన్' అనే సంస్థని నడిపాను. నా సంస్థలో 50 ఏళ్ల ముడియాల సూర్యనారాయణగారు, మా డ్రాయింగు మేష్టారు భండారు సత్యనారాయణగారు నటించేవారు. నా మొదటి సన్మానం నా చిన్నతనంలో నా ఉపాధ్యాయులు చేశారు. సభలో మా నాన్నగారున్నారు. ప్రసంగాలు: "వీడు ఈ మారుతి గట్టివాడు – బాగా రాస్తాడు.." యిలా సాగాయి. అదొక మధురమైన జ్ఞాపకం. ఆ దశ నుంచి నేను సినీనటుడినయి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొన్న రోజుల వరకూ– ఆయన ఆఖరి రోజుల్లో మా నాన్నగారు నా పరోక్షమయిన అభిమాని. కళ్లు సరిగ్గా కనిపించని రోజుల్లో– దినపత్రిక వెనుక పేజీల్లో వచ్చే సినీ ప్రకటనలలో– ఎక్కడో రూపాయంత నా బొమ్మ ఉండేది. సూర్యరశ్మి వెలుగులో పేపరు ఉంచి ఆ బొమ్మని వెదికి చూసేవారు.

నా నాటకాలకు నేనే రచయితని, ప్రయోక్తని, నటుడిని, దర్శకుడిని, కార్యదర్శిని. పూర్ణా పిక్చర్స్ అధినేత గ్రంధి మంగరాజుగారు మాకు పోషకులు. పది పదిహేను రూపాయలు ఇచ్చేవారనుకుంటాను. టౌన్ హాలుకి రూపాయి అద్దె. నేనే సభని నిర్వహించి, ఉపన్యాసం ఇచ్చి, తెరవెనక్కి వెళ్లి, నటులకి మేకప్ చేసి, చేసుకుని నాటకం వేసేవాడిని. ఇప్పటికీ ఆ ప్రదర్శనల కరపత్రాలు – 54 ఏళ్ల తర్వాత నా దగ్గర ఉన్నాయి.

నా ఆనర్స్ పట్టా నాకెప్పుడూ గర్వాన్ని కలిగించలేదు. కాని మా నాన్నగారికి అది తాను చాలా ఖర్చు చేసి కొడుక్కి సంపాదించిపెట్టిన పట్టా. ఆయన ఎప్పుడు ఉత్తరం రాసినా నా పేరు చివర బి.యస్సీ (ఆనర్స్) రాయడం మరిచిపోయేవారుకారు. మా అమ్మ నా చదువుకీ, వృత్తికీ, కీర్తికీ రాజీ పడింది. ఆమెకి నేను పించను వచ్చే గుమాస్తాపని చేస్తూ విశాఖపట్నంలో ఉండాలని కోరిక.

ఉపాధికి ఆస్కారం కల్పించని వ్యావృత్తిమీద విముఖత ఆనాటిది. ఉపాధికి అర్థమూ, మార్గమూ మారిపోయిన తరం ఈనాటిది. ఈతరం – నాపిల్లలూ, మనుమలూ నా వ్యాసంగాన్ని అంతగా పట్టించుకోరు. వాళ్లకిదంతా అర్థం కాని సొద. వాళ్లకి నేను ప్రముఖుడినని తెలుసు. అంతవరకే They are resigned to my celebrity status. రెండు తరాల అలసత్వం మధ్య 50 సంవత్సరాల కృషి, జీవనం, తృప్తి.

ఎమిలీ డికిన్సన్ అంటుంది:

Fame is a bee

It has a song

It has a sting

Ah, it has a wing!

కీర్తి తేనెటీగలాంటిది. దానికి లాలించే పాట వుంది. కాటేసే కొండె వుంది. ఎగిరిపోయే రెక్కలూ ఉన్నాయి – అని. ఇంతదూరం ప్రయాణం చేశాక రచ్చ గెలిచానన్న తృప్తి. జీవితంలో విజయాలు వాటంతటవే ఎల్లల్ని నిర్ణయిస్తాయి. కాలం, విలువలు, ధోరణులు – వాటికి పరిమితు లవుతాయి. సెన్సాఫ్ హ్యూమర్ అవసరం. నవ్వుకోవడం ఒక ఆటవిడుపు.

చదువయాక ఢిల్లీలో మా చిన్నాయనగారింటికి వెళ్లాను. చావు తప్పిన గుడ్డి చదువు డిగ్రీ అది. ఆయన మిలట్రీలో పనిచేసేవారు. ఆయన నన్ను మిలట్రీ ప్రెస్సులో కంపోజిటర్

ఉద్యోగానికి తీసుకెళ్లారు. కళ్లనీళ్లు తిరిగాయి. చెయ్యనని వెంటనే బస్సెక్కి ఇంటికి వచ్చేశాను. టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రూఫ్ రీడర్ ఉద్యోగానికి పరీక్షకి వెళ్లాను. పరీక్షలో తప్పాను. కారణం – సిగరెట్టు అనే మాట స్పెల్లింగు తప్పురాసి. వెనకటికి ఒకాయన అన్నాడు. Read ans read about the harm that cigarette makes and decided not to read. అని. నేనూ తర్వాత రెండేళ్లు కసిగా సిగరెట్లు కాల్చాను. స్పెల్లింగూ, పొగాకు వార్నింగూ క్షుణ్నంగా అర్థమయాక మానేశాను. మరో ఏభై ఏళ్ల తర్వాత నాకు టైమ్స్ ఆఫ్ ఇండియానుంచి ఫోన్ వచ్చింది. ఆ సంస్థ విచిత్రమైన పొయిటిక్ జస్టిస్! సంవత్సరం పాటు 'సురభి' పత్రిక సంపాదకుడిగా ఎన్నో మంచి శీర్షికలు నిర్వహించాను. ఎందరో ప్రముఖులచేత రచనలు చేయించాను.

సరే. ఢిల్లీ కథకి వద్దాం. నార్ల వెంకటేశ్వరరావు, కపిల కాశీపతి, పురిపండా అప్పలస్వామి, తెన్నేటి విశ్వనాథం గార్ల పరిచయ లేఖలు పట్టుకుని విజయవాడలో దిగాను– ఆంధ్రప్రభలో ఉద్యోగానికి. వార పత్రికలో చేరి శ్రీపాదవారి మాటల్లో కథలు గుట్టలు గుట్టలుగా రాసేయాలని తహతహ. ఆరు నెలలు తిప్పి దినపత్రికలో చేర్చుకున్నారు నీలంరాజు వెంకట శేషయ్యగారు. అదిన్నీ చిత్తూరుకి బదిలీ చేశారు. అక్కడ కొత్త ఎడిషన్ ప్రారంభించాలి. కళ్లనీళ్లు తిరిగాయి. చిత్తూరు ఎడిషన్ ఎడిటరు జి.కృష్ణగారు బుజ్జగించి తీసుకెళ్లారు. వి.డి.ప్రసాదరావుగారు, రావూరు వేంకట సత్యనారాయరావుగారు, జొన్నలగడ్డ రాధాకృష్ణయ్య, నండూరు పార్థసారథి– మేమంతా చిత్తూరు చేరాం. కొంతకాలం తర్వాత తిరుమల రామచంద్రగారు వచ్చి చేరారు. ఆయన మా రూం మేటు. నెలల తరబడి కలిసి జీవనం. ఆఫీసులో పక్క పక్కనే కుర్చీలు. వార్తల పని లేనప్పుడు ఆయన మిలటరీ అనుభవాలు దొర్లేవి. ఇద్దరం పద్యాల్లో పలకరించుకునేవాళ్లం.

రెండు గుర్తున్నాయి:

వడయు బోండాయు కాఫీయు వరుసగాను

విందు గుడిచినవారలే విబుధ వర్య?

అయన సమాధానం:

వడయొక్కటె యున్నద ఆ

వడయును కుడువంగ బోగ చలచల్ల నయెన్

వడి వడి నమిలితి నంతే

చెడిపోయితినయ్య నేను చెలికాడ భువిన్.

నా జీవితంలో ప్రముఖమయిన మలుపులు, నా జీవితాన్ని అర్థవంతం చేయగల వ్యక్తుల కలయిక – అన్నిటికీ మూలకేంద్రం చిత్తూరు అవుతుందని తెలీదు. అప్పుడు చిత్తూరు కలెక్టరు బి.కె.రావుగారు. మునిసిపల్ కమీషనర్ గుంటూరు శేషేంద్ర శర్మగారు. అక్కడి మిత్రులు మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, రాజేంద్ర, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, కె.సభా ప్రభృతులు. ఆ రోజుల్లోనే చిత్తూరు రచయితల సంఘాన్ని ప్రారంభించాం. అక్కడినుంచే తిరువణ్ణామలైలో ఉంటున్న చెలంగారి ఆశ్రమానికి ప్రయాణాలు. అక్కడ జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి, యామిజాల పద్మనాభస్వామి వంటివారి పరిచయం. చెలంగారు హెచ్చరించిన ప్రళయానికి భయపడి వీరిద్దరూ చిత్తూరు వచ్చి కొంతకాలం ఉన్నారు. మరో గొప్ప స్నేహం 'మా తెలుగుతల్లి' సృష్టికర్త శంకరంబాడి సుందరాచారిగారి పరిచయం. ఆయన కంచినుంచి తరుచు వచ్చేవారు.

అక్కడ ఉండగానే నా పెళ్లి. నాకు పెళ్లయాక దంపతులం ఆయనకి మా యింట్లోనే పాదాభివందనం చేసి బట్టలు పెట్టాం. అక్కడే గోడకి ఆనుకుని కూర్చుని ఆశీర్వాద పద్యం రాశారు శంకరంబాడి.

సకల సౌభాగ్య సంపత్తి, సరసమైత్రి

ఆయురారోగ్య ఘనకీర్తి ఆత్మతృప్తి

యోగఫలశక్తి, భుక్తి, సుఖ సుప్తి గలిగి

మారుతీ శివకాములు మనగ వలయు

ఆయన వాక్శుద్ధిగల హితులు. ఆయన చెప్పినవన్నీ అక్షరాలా జరిగాయి.

మా ఆవిడ శ్రీపాదవారమ్మాయి. ఆమె చిన్నాన్నలు శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారు, ఇప్పుడు శతజయంతిని జరుపుకుంటున్న పద్మభూషణ్, సంగీత కళానిధి శ్రీపాద పినాకపాణిగారు. మా మామగారికొక ప్రత్యేకత ఉంది. ఆయన శ్రీపాద రామకృష్ణారావుగారు. సి.నారాయణరెడ్డిగారికి గురువులు. మా ఆవిడని ఎప్పుడు కనిపించినా 'గురుపుత్రి' అని పలకరిస్తారు రెడ్డిగారు.

ఆచంట జానకిరామ్‌గారు తిరుపతిలో ఉండేవారు. వారి శ్రీమతి శారదాదేవి– మహిళా కళాశాలలో తెలుగు ప్రొఫెసర్. ఆయనే నన్ను రేడియోకి వెళ్లమని ప్రోత్సహించారు.

ఓసారి విశ్వనాథ సత్యనారాయణగారికి చిత్తూరులో సన్మానాన్ని ఏర్పాటు చేశారు శేషేంద్ర శర్మగారు. అంతకుముందే ప్రచురితమయిన నా తొలి నవల 'చీకటిలో చీలికలు' కాపీని శర్మగారికిచ్చాను. విశ్వనాథవారి కళ్లబడి ఉంటుంది. రెండు మూడు పేజీలు తిప్పినట్టున్నారు. ఆనాటి సభలో వేరే కారణానికి అగ్గిమీద గుగ్గిలమయి ఉన్నారు. కారణం ఆరుద్ర– వారి కిన్నెరసాని పాటలు 'పిప్పరమెంటు' పాకమని ఎక్కడో అన్నారట. అదీ కోపానికి కారణం! ఆ ప్రసంగం అటూ యిటూ తిరిగి నా నవల మీదకు వచ్చింది. నన్నూ నాలుగు మాటలు చెరిగారు. అడియన్సులో ఉన్న శర్మగారూ, మాల్లాది రామచంద్రశాస్త్రిగారూ ఇబ్బంది పడ్డారు– ఆ నవల నాదేనని గుర్తుపట్టి.

మర్నాడు శర్మగారింట్లో విందు. రాత్రి నన్ను తిట్టిన విషయం విశ్వనాథవారితో చెప్పినట్టున్నారు. ప్రసంగం టేపు పెట్టారు. ఆయన పక్కనే కూర్చున్నాను నేను. నన్ను విమర్శించే మాటలు వచ్చాయి. నా వేపు తిరిగి 'మిమ్మల్ని తిట్టానా?" అన్నారు విశ్వనాథ. నేను నవ్వాను. "ఆ నవలకి ఎంత ప్రాచుర్యం వస్తుందో తెలీదుగాని మీ విమర్శకారణంగా దాన్ని గుర్తుంచుకుంటాను" వంటి మాటేదో అన్నాను. ఆయన కరిగిపోయారు. ఉదాత్తమయిన వ్యక్తి పశ్చాత్తాపాన్ని – తనకంటే చిన్న వ్యక్తి మీద ఎలా చూపిస్తారు? ఆరోజు సాయంకాలం రామ విలాస సభలో ఆర్.బి.రామకృష్ణరాజుగారు చేస్తున్న సన్మానం. విశ్వనాథ ముందుగా బజారుకెళ్లి కొన్ని శాలువాలు కొన్నారు. ఆ సభలో యువరచయితలందరినీ పేరు పేరునా పిలిచి కప్పారు. నేను సిగ్గుపడి ముందుకు రాకపోతే ఆయనే నా దగ్గరకు వస్తూ "పెళ్లయి పిల్లల్ని కన్నవాళ్లకి ఇంకా సిగ్గేమిటండీ" అంటూ కప్పారు. ఇప్పుడు ఆ శాలువా ఏమయిందో గుర్తులేదు. కాని ఆ సన్మానం స్పర్శ గుర్తొచ్చినప్పుడల్లా ఈ భుజాలు పొంగుతాయి. మనస్సు ఆర్ద్రమవుతుంది.

చిత్తూరులో ఉన్న మూడేళ్లూ వందలాది వ్యాసాలు, కథలూ, నాటికలూ రాశాను. ఆంధ్రప్రభలో 'కులాసా కబుర్లు' శీర్షికని నిర్వహిచాను. పంచాయితీల్లో, గ్రామాల్లో, పాఠశాలల్లో, అర్థం లేని సభల్లో ఉపన్యాసాల వెల్లువ సాగింది. ఈగల సంహార వారోత్సవాల మీదా, టీకాలు వేయించే ప్రోగ్రాంలమీదా, కుటుంబ నియంత్రణ – ఏదయినా, ఎక్కడయినా, ఎప్పుడయినా. కలం మెరుగులు దిద్దుకుని మనస్సు ఉపన్యాసాల వొరవడిని

లొంగదీసుకున్న ప్రయోగాత్మకమైన దశ అది.

తర్వాతి దశ-గవర్నమెంటు ఉద్యోగం- రేడియోలో. నూటికి నూరుపాళ్లూ గవర్నమెంటు ధోరణిలోనే సాగింది. బ్రహ్మచారిగా రేడియో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాను. పెళ్లికొడుకుగా పరీక్ష రాశాను. పెళ్లాన్ని పురిటికి పంపించి ఇంటర్వ్యూకి వెళ్లాను. అబ్బాయికి బారసాల చేసి తండ్రిగా ఉద్యోగంలో చేరాను. ఈ దశలు నా జీవితంలో త్వరగా జరిగాయా, ఉద్యోగమే ఆలశ్యమయిందా చెప్పడం కష్టం.

హైదరాబాదు ఆకాశవాణి కేంద్రం ఒక భువన విజయం. దేవులపల్లి కృష్ణశాస్త్రి, నాయని సుబ్బారావు, మునిమాణిక్యం నరసింహారావు, బుచ్చిబాబు, భాస్కరభట్ల కృష్ణారావు, స్థానం నరసింహారావు, దాశరథి, బాలాంత్రపు రజనీకాంతరావు, యండమూరి సత్యనారాయణ, వేలూరి సహజానంద, రావూరి భరద్వాజ, తురగా కృష్ణమోహన్‌రావు, పాలగుమ్మి విశ్వనాథం, వింజమూరి వరదరాజ అయ్యంగార్, మంచాల జగన్నాథరావు, న్యాయపతి రాఘవరావు, న్యాయపతి కామేశ్వరమ్మ, వారణాశి రామమూర్తి 'రేణు', కేశవపంతుల నరసింహశాస్త్రి, ఉషశ్రీ, శంకరమంచి సత్యం- యీ వాతావరణంలో చేసే పని ఉద్యోగమేమిటి? ఓ గొప్ప వైభవం. ఇరవై మూడు సంవత్సరాల యువ రచయితకి మైకం. మా జీతం ఎంతో తెలిసేది కాదు. ఏ పని చెయ్యకూడదో తెలిసేది కాదు. అన్ని పనులూ మావే.

జీవితంలో ఇది అరుదైన అదృష్టం. దీనికి పునాది చిత్తూరులో ఉండగానే పడింది. 1962లో చైనా దురాక్రమణ జరిగింది. అప్పటికే నా నాటికల ప్రదర్శనలు చూసిన కలెక్టరు బి.కె. రావుగారు నా చేత ఒక నాటిక రాయించారు- 'వందేమాతరం'. నేనే ప్రయోక్తని. చిత్తూరు జిల్లాలో నాలుగు చోట్ల చిత్తూరు, తిరుపతి, నగరి, మదనపల్లిలో ప్రదర్శనలు ఏర్పాటు చేసి ఆ రోజుల్లో యుద్ధ నిధికి 50వేలు వసూలు చేయించారు. ఆంధ్రప్రదేశ్ పౌర సంబంధాలు శాఖ తరఫున హైదరాబాదు గాంధీ గ్రౌండ్సులో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శన. అప్పటి ఆశాఖ డైరెక్టరు నరేంద్ర లూథర్. తర్వాత చీఫ్ సెక్రటరీ అయ్యారు. అప్పటి ఆ శాఖ మంత్రి పి.వి. నరసింహారావుగారు. వందేమాతరం నాటికని పౌరసంబంధాల శాఖ ప్రచురించింది. ఆ నాటికకి పి.వి. గారు ముందుమాట రాశారు. అప్పటికి వారితో నాకు వ్యక్తిగత పరిచయం లేదు.

హైదరాబాదు వచ్చాక పరిచయం ప్రారంభమయింది. వారి జీవితమంతా ఒక

మిత్రుడిగా ఆత్మీయతను చూపారు. ఆయన ముఖ్యమంత్రి అయి, కేంద్ర మంత్రి అయి, ప్రధాని అయి, పదవీ విరమణ చేశాక కూడా ఆ ఆత్మీయత కొనసాగింది. హైదరాబాదులో ఎన్నో సభలలో కలిసి ప్రసంగాలు చేశాం. నిజానికి నేను ఆత్మకథ రాయడానికి నన్ను ప్రోత్సహించింది ఆయనే. పదవీవిరమణ చేశాక ఢిల్లీలో వారిని కలుసుకోవడానికి వెళ్లినప్పుడు ఆయన వ్రాసిన 'ది ఇన్సైడర్' గ్రంథాన్నిస్తూ ఆత్మకథని ప్రారంభించమన్నారు. "తర్వాత సవరణలు చేసుకోవచ్చు. ప్రతీరోజూ ఎంతో కొంత రాయండి. అలా రాయకపోతే ఈ గ్రంథం రాయగలిగే వాడిని కాదు" అన్నారు. నన్ను ఆత్మకథ రచనకు ప్రోత్సహించిన మరొక వ్యక్తి ప్రముఖ దర్శకుడు మహేష్ భట్.

హైదరాబాదు రేడియో ఉద్యోగం నా జీవితంలో ఓ గొప్ప అధ్యాయం. 1963 జనవరి 16న రేడియో ప్రవేశం. మార్చిలో దాశరథిగారు నన్ను పలకరించారు– "ఎక్కడుంటున్నావు అబ్బాయ్!" అంటూ. గగన్ మహల్ రోడ్డులో కారు షెడ్డును ఒక వాటాగా తీర్చిన యింట్లో. నన్ను అన్నపూర్ణా పిక్చర్స్ అధినేత దుక్కిపాటి మధుసూదనరావుగారు కలుసుకోవా లనుకుంటున్నారు. తుళ్లిపడ్డాను. ఆయన నన్ను కలుసుకోవడమేమిటి? దాశరథి నవ్వారు.

ఇద్దరూ మా ఇంటికొచ్చారు. మా ఇంట్లో ఓ గడ్డిమోడా, ఒక కుర్చీ. అన్నపూర్ణా పిక్చర్స్ మేనేజింగ్ డైరెక్టరు ఒకదానిమీదా, దాశరథిగారు మరొక దానిమీదా కూర్చున్నారు. కోడూరి కౌసల్యాదేవిగారి 'చక్రభ్రమణం' నవలకి స్క్రీన్‌ప్లే రాయాలి. నాకు ఆ రచన తెలీదన్నాను.

"ఆయనకి రాయించుకోవడం తెలుసు. నువ్వులే" అన్నారు దాశరథి.

అబిడ్స్ తాజ్‌మహల్ హోటల్ రూం నెంబరు 18 దుక్కిపాటిగారిది. తలుపులు తెరవగానే గది మంచం మీద అప్పటికి నేను రాసిన రచనలు ఉన్నాయి. నా సినీరచనా వ్యాసంగానికి అక్కడ అక్షరాభ్యాసం జరిగింది. సినీ మాధ్యమానికి దుక్కిపాటి నా గురువు. తదాదిగా 20 సంవత్సరాలు, నాలుగు నంది అవార్డులు. నంది అవార్డులు ప్రారంభమయిన మొదటి సంవత్సరమే ఉత్తమరచయిత అవార్డును అందుకున్నాను. నా మొదటి సీనుని సాపు రాసుకున్న వ్యక్తి దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుగారి కో డైరెక్టరు కె.విశ్వనాథ్. డబ్బూ, కీర్తి, ఉక్కిరి బిక్కిరి చేసే పని వత్తిడి– అది ఒక ఉప్పెన.

ఈ దేశానికి మొదటి ప్రధాని నెహ్రూ పోయినప్పుడు నేను రేడియోలో ఉన్నాను. పి.వి.నరసింహరావు వంటి ప్రముఖుల స్పందనలు రికార్డు చేశాను. హఠాత్తుగా లాల్ బహదూర్ శాస్త్రిగారు వెళ్లిపోయినప్పుడు డ్యూటీలో ఉన్న మొదటి ఆఫీసర్ని నేనే. అవన్నీ విలువైన జ్ఞాపకాలు. మహిళా కార్యక్రమంలో ముప్పాళ రంగనాయకమ్మగారి 'బలిపీఠం' ఆ రోజుల్లో పెద్ద సంచలనం. ఇవి కేవలం ఏరిన కొన్ని నమూనాలు. ఒక పక్క రేడియో, మరొక పక్క సినిమా జోడుగుర్రాలయి సాగాయి.

కె.విశ్వనాథ్‌కి 7 గొప్ప సినిమాలు రాశాను. ఎస్.డి.లాల్‌కి ఎన్టీరామారావుగారు నటించిన 6 హిట్ సినిమాలు రాశాను. అట్లూరి పుండరీకాక్షయ్యగారికి అయిదు మంచి సినిమాలు రాశాను. కథా చౌర్యానికి బలి అయిపోయినవి పోగా నా ఖాతాలో మన్నికయిన సినిమాలు చాలా మిగిలాయి. మొత్తం 81.

ఈలోగా విజయవాడ బదిలీ. విజయవాడ ఆకాశవాణి మరోగొప్ప పండిత పరిషత్తు. జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, ఆమంచర్ల గోపాలరావు, కందుకూరి రామభద్రరావు, ప్రయోగ నరసింహశాస్త్రి, డాక్టర్ జి.వి.కృష్ణారావు, బందా కనకలింగేశ్వరరావు, నండూరి సుబ్బారావు, సి. రామమోహనరావు, వింజమూరి శివరామారావు– వీరుకాక సంగీత రంగంలో అతిరథులు వోలేటి వెంకటేశ్వర్లు, శ్రీరంగం గోపాల రత్నం, నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, దండమూడి రామమోహనరావు, అన్నవరపు రామస్వామి, వి.బి.కనకదుర్గ, ఉషశ్రీ, శంకరమంచి సత్యం విజయవాడ బదిలీ అయి వచ్చారు.

జీవితంలో అభిరుచినీ, దక్షతనీ, ఓ ఆదర్శాన్నీ నిర్దేశించిన పెద్దల సమక్షమది. విజయవాడ రేడియోకి నేను రాసిన మంచి నాటికలు– కళ్యాణి, సర్వే స్టోన్ నంబరు 23, ఓ సీత కథ. 'ఓ సీత కథ'లో కె. వెంకటేశ్వరరావు ముఖ్యపాత్ర చేశారు. శంకరమంచి ప్రయోక్త. సర్వే స్టోన్‌కి బందా ప్రయోక్త. వోలేటి, శ్రీరంగం గోపాలరత్నం, వి.బి. కనకదుర్గ – ఇంకా ఎందరో నటించిన మంచి నాటిక. విజయవాడలో ఉండగా ఎమెస్కో ప్రచురణలకి రాసిన మూడు నవలలు– పిడికెడు ఆకాశం, వెన్నెల కాటేసింది, మళ్లీ రైలు తప్పిపోయింది నవలలకి కితాబులు అందించిన సినారె ఉత్తరాలు ఇప్పటికీ నా దగ్గర ఉన్నాయి. విజయవాడలో రాసిన గొప్ప నాటిక 'కళ్లు'. ఆంధ్రనాటక కళా పరిషత్తు పోటీలలో నాటకానికీ, నాటికకీ ఒకేసారి బహుమతిని అందుకోవడం అప్పటికి చరిత్ర. అదీ విజయవాడలోనే.

ఆ తర్వాత రెండేళ్లు శబల్పూరులో అరణ్యవాసం. అక్కడా రెండు హిట్ సినీమాలు కథ, మాటలు రాశాను–మరపురాని తల్లి, పాపం పసివాడు. తర్వాత మద్రాసు.

మద్రాసులో ఎప్పుడు ఉన్నా సుధారా హోటల్లో నాది 13వ నంబరు గది. 12వ నంబరు గదిలో ఒకాయన ఉండేవారు. రోజంతా ఆయన పాటల పరిశ్రమ. నాది మాటల పరిశ్రమ. ఆయన సి.నారాయణరెడ్డిగారు. రోజూ రాత్రిళ్లు అనుభవాల్ని కలబోసుకునేవారం. నన్ను ఉద్యోగం రాజీనామా చేయమని ధైర్యం చెప్పింది ముగ్గురు– సినారె, ముళ్లపూడి, తాతినేని రామారావు. రాజీనామా చేసినంతపని చేశాను కాని చెయ్యలేదు.

మద్రాసు జీవితం– ఉద్యోగాన్ని విరమించవచ్చునని ధైర్యాన్ని ఇచ్చిన దశ. అయితే ఎనిమిదేళ్ల తర్వాత అనుకోకుండా ఓ గొప్ప మలుపు, అదృష్టం తమాషాగా కలిసి వచ్చింది. కచ్చేరీ రోడ్డులో స్కూటర్ ఆక్సిడెంటు జరిగి నా కాలూ చెయ్యీ విరిగాయి. అది పెద్ద మలుపు. నాకు కడప బదిలీ అయింది. ఆరు నెలలు మంచం మీద ఉన్నప్పుడు ఒకాయన నిర్మాత ఏ. కామేశ్వరరావుగారు ఆసుపత్రికి వచ్చారు. నిర్మాత రాఘవకి ఓ సినీమా రాసిపెట్టాలన్నారు. ప్రతిఫలం అత్యల్పం. అయితే నా షరతుల మీద నాతో ఒదిగే దర్శకుడయితే చేస్తానన్నాను. ఓ రోజు హై స్కూలు ఎగ్గొట్టి వచ్చినట్టున్న ఓ కుర్రాడు మా యింటికి వచ్చాడు. అతను కోడి రామకృష్ణ. ఆరు నెలలు చర్చించి ఓ కథ తయారు చేశాం – తరంగిణి. అయితే ఇది కాస్త పేరున్న దర్శకుడు చేపడితే రాణించే కథ అనిపించి అటకెక్కించాం. మరికొన్ని నెలల తర్వాత రూపు దిద్దుకున్న కథ– ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య. నిర్మాత రాఘవ తన విశ్వాసాలను నిర్దుష్టంగా ఏర్పరుచుకున్న మూర్ఖుడు. ఇలాంటి వ్యాపారాలకి కావలసిన మూర్ఖత్వమది. నేను ప్రధాన పాత్రని వెయ్యాలన్నాడు. కోడి రామకృష్ణ విశ్వాసమూ అదే. నాకప్పుడు 42. అలవికాని కుటుంబ సమస్యల్లో, ఉద్యోగ సమస్యల్లో ఉన్నాను. సినీమా బాగా రాణిస్తే 42 యేట నాకు ఒరిగేదేమిటి? కాకపోతే ఈ వయస్సులో చెయ్యి కాల్చుకోవడమెందుకు? మొరాయించాను. ఎదిరించాను. విసుక్కున్నాను. ఆ సమయంలో కె.విశ్వనాథ్‌కి "శుభలేఖ" అనే మంచి చిత్రాన్ని రాస్తున్నాను. మధ్యలో ఎందుకీ పిడకలవేట? ఇదీ నా ఆలోచన. కాని చివరికి ఇద్దరి మూర్ఖపు నమ్మకాలకు తలవొంచాను. మొట్టమొదటిసారిగా కెమెరాముందు నిలబడ్డాను. 1982 ఏప్రిల్ 23 ఉదయం తొమ్మిది గంటలకి తెలుగు ప్రేక్షకులు ఓ కొత్త ముఖాన్ని చూసి షాక్ అయారు; ఆనందించారు; ఆదరించారు. 31 సంవత్సరాల తర్వాత ఇప్పటికీ ఆపనే చేస్తున్నారు. ఈ ప్రసంగం సమయంలో నేను రెండు సినిమాలు చేస్తున్నాను.

ఇందువల్ల దక్కిన లాభం – కీర్తి, డబ్బు. నష్టం – రచయిత పూర్తిగా నిద్రపోయాడు. ఈ దశలో రాసిన ఒకే ఒక చిత్రం– ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నిర్మించి, కె.విశ్వనాథ్, కమల్‌హాసన్, నేనూ నటించిన 'శుభసంకల్పం'.

నట జీవితం 31 సంవత్సరాలుగా సాగుతోంది. ఇంకా ఆగలేదు. ఎన్నో అనూహ్యమైన మలుపులు. ఒకటి రెండు చెప్తాను. మా నాన్నగారు నా జీవితంలో – నా కప్పుడు 12 ఏళ్లుంటాయి. ఒకేసారి మూడణాలు ఇచ్చి మా ఇంటి ఎదురుగా ఉన్న సెలక్టు టాకీసులో రిలీజయిన విజయా పిక్చర్స్ మొదటి చిత్రం 'షావుకారు' చూడమన్నారు. అది నాకు ఆశ్చర్యాన్ని కలిగించిన సంఘటన. షావుకారు జానకి గారు నాకంటే 10 ఏళ్లు పెద్ద. నేను రచయితనయి, నటుడినయాక మేమిద్దరం భార్యాభర్తలుగా కనీసం మూడు సినీమాల్లో నటించాం.ఎస్. వరలక్ష్మి గారి మొదటి చిత్రం 'బాలరాజు' నేను మా అమ్మ వొడిలో కూర్చుని చూసిన గుర్తు. ఆవిడ నాకంటే పన్నెండేళ్లు పెద్ద. మేమిద్దరం కనీసం మూడు సినీమాల్లో భార్యాభర్తలుగా నటించాం. ఓసారి బి.నాగిరెడ్డిగారు నన్ను పిలిచి: "నాకు తెలుసు ఏనుగుని సర్కసు బల్ల మీద ఫీట్ చేయమంటున్నానని. మీరు నా సినీమాలో ప్రముఖ పాత్ర వెయ్యాలి" అన్నారు. షావుకారు కథ వారికి చెప్పాను. విసూ గారు దర్శకత్వం వహించిన 'నేటి సావిత్రిలో' ప్రముఖ పాత్రని వేశాను. అదే విజయావారి ఆఖరి చిత్రం. 260 సినీమాల అనుభవాలకు ఈ వ్యవధి, ఈ సందర్భమూ చాలదు.

నాకిష్టం లేని పని మా అబ్బాయిల్లో ఆఖరివాడు – శ్రీనివాస్ చేశాడు. కోడిని ఒప్పించి అసిస్టెంటుగా దర్శకత్వ శాఖలో చేరాడు. మంచి దర్శకుడవుతాడని రాఘవేంద్రరావు, కమల్‌హాసన్, కె.ఎస్.రామారావు, గోపాల రెడ్డివంటి వాళ్లు అన్నప్పుడు పొంగిపోలేదు. ఊరట చెందాను. లాయరు కొడుకు లాయరు కావాలని, డాక్టరు కొడుకు డాక్టరు కావాలని, ఏక్టరు కొడుకు ఏక్టరు కావాలని అనుకోవడం రివాజు. అనుకొంటూ వాళ్ల తలలు, మన ఓపికనీ పరీక్షించే రోజులివి. దర్శకుడిని చేయడం, చేయాలనుకోవడం అరుదు. అట్లూరి పూర్ణచంద్రరావుగారు అతనికి దర్శకత్వం ఛాన్స్ ఇచ్చారు. నాతో ధైర్యంగా తన ఆలోచనల్ని చెప్పలేడని పాత్రోని రాయమన్నాను. కాని పూర్ణచంద్రరావుగారు నా తలవొంచారు.

కోరి ప్రేమించి, కట్టుకున్న పెళ్లాంతో 9 నెలలు కాపురం చేశాడు. సినీమాకి 9 రోజులు దర్శకత్వాన్ని వహించాడు. తొమ్మిదోరోజు ఆక్సిడెంట్. వెళ్లిపోయాడు. సరిగ్గా

52వ రోజున మా అబ్బాయి స్థానంలో నిలబడి జీవితంలో మొదటిసారి 'స్టార్ట్ కెమెరా" చెప్పాను. 'కట్' చెప్పడానికి నోరురాక భోరుమన్నాను.

26 ఏళ్ల కుర్రాడు ఊహించుకున్న ప్రేమకథ, 56ఏళ్ల పుత్రశోకంతో ఉన్న తండ్రి చేతిలో ఏమవుతుంది? మారుతీరావుని చూస్తే తెలుగు ప్రేక్షకులకి పాత్ర కనిపించలేదు. కొడుకుని పోగొట్టుకున్న తండ్రే కనిపించాడు. వేషాలు తగ్గిపోయాయి. నా కెరీర్ గ్రాఫ్ కొండ దిగింది.

వాసూ పోయినప్పుడు ఓ కవిత రాశాను. దాన్ని ఎప్పుడూ పూర్తిగా చదవలేకపోయాను. అందులో కొన్ని వాక్యాలు.

ఈ నావ గమ్యందాకా నడుస్తుందన్నుకున్నాను
ఈ చెయ్యి కష్టంలో నా భుజం మీద వాలుతుందనుకున్నాను
ఎంత చిన్న కారణానికయినా
ఆకాశం పగిలేలా ప్రతిధ్వనించే ఆ నవ్వు
నాకంటే ఎక్కువకాలం నిలుస్తుందనుకున్నాను.
....
ఇంకా అసంపూర్తిగా మిగిలిపోయిన నా కలలకి
ఆమూర్తిలో పర్యవసానాన్ని వెదక్కున్నాను
ఆ వ్యక్తిలో ఆత్మవిశ్వాసాన్ని చూసి
ఇక ధైర్యంగా వృద్ధాప్యాన్ని ఆహ్వానించవచ్చనుకున్నాను
.....
నాకంటే విలాసంగా, నిండుగా, గర్వంగా బతికే మనిషి
ప్రిన్స్ చార్మింగ్
ఏ పని చెయ్యాలన్న ధైర్యం కంటే రెండడుగులు ముందు నడిచేవాడు
ఏ కంటిలో నీటిని చూసినా చేతిని మైళ్లకొద్దీ సాచి తుడిచేవాడు

కడుపున పుట్టిన అచ్చుమైన స్నేహితుడు

నాన్నా అన్న పిలుపులో నేనున్నానన్న ఓదార్పు

కష్టం ఎవరి ముఖంలో చూసినా కళ్లల్లో ఎరుపు

తనకి అక్కరలేని చావుకి ఆరు రోజులు కాపలా కాశాడు

జేబులో రూపాయుంటే చెయ్యి వెయ్యి ఖర్చు చేస్తుంది

సూర్యరశ్మికి మరింత వెలుగునిచ్చే శక్తివి నువ్వని

అమ్మ మీద పద్యాన్ని గదిలో టేబిలు మీద ఉంచాడు

ఖరీదయిన జీవితం అతని వ్యసనం

ఆకలికీ, అవసరానికీ తలవొంచే మనుషులు అతని బలహీనత

ఏడు సముద్రాలు దాటి కోరుకున్న రాకుమారి కోసం పదేళ్లు తపస్సు చేశాడు

చిన్న కెరటాన్ని దాటి యిటువేపు అడుగు వెయ్యలేకపోయాడు

ఎన్ని సూర్యోదయాలు ఆ చిరునవ్వుని నష్టపోయాయి?

ఎన్ని జీవితాల్లోంచి స్నేహం శలవు తీసుకుంది?

నా అడుగుజాడల్ని కొలిచి మిల్లీ మీటరు తేడా లేకుండా నడిచేవాడు

నాకంటే ముందుకు ఎందుకు అడుగు వేశాడో అర్థం కాదు

కన్నాను కనుక 'నాయనా' అనాలికాని

నాకు అతి విలువైన మిత్రుడు, ఆర్తత్రాణ పరాయణుడు

ఇప్పుడే ఆ సందు మలుపు తిరిగాడు

ఈ గాయం ఇంకా పచ్చిగా వుంది

గుండె గొంతులో అడ్డుపడుతోంది క్షమించండి

ఈసారికి శలవు తీసుకుంటాను

మరోసారి నా దీనత్వాన్ని మరికాస్త విప్పుకుంటాను..

సంజయ్ గాంధీ పోయిన సంవత్సరానికి పార్లమెంటు లాబీలో ఇందిరా గాంధీని ఆమె సహాధ్యాయి, మిత్రురాలు పుపుల్ జయకర్ తారసపడినప్పుడు అడిగారట. "ఇప్పటికయినా దుఃఖం నుంచి తేరుకున్నారా?" అని.

ఇందిరాగాంధీ సమాధానం చెప్పలేదు. నార్త్ బ్లాక్‌లో తన గదికి వెళ్లి ఒక చీటీ మిత్రురాలికి పంపించిందట. "జీవితంలో మనస్సుకి తగిలిన గాయాలు ఎన్నటికీ మానవు. ముట్టుకున్నప్పుడల్లా బాధ జివ్వుమంటుంది. కాని కాలం ఆ బాధతో సహజీవనాన్ని చేయడాన్ని అలవాటు చేస్తుంది."

అదీ నా పరిస్థితి.

తర్వాతి జీవనం ఏమిటి? కసిగా రోజుకి 18 గంటలు పనిచెయ్యడాన్ని అలవరచుకున్నాను. రాత్రి మూడో పెగ్గు దాటకూడదని వెయ్యి దేవుళ్లకి మొక్కుకునేవాడిని. భరించలేని వేదన అప్రమత్తంగా ఉంటే మనిషిని అధః పాతాళానికి తొక్కేస్తుంది. అది భయంకరమైన దశ.

నాటకం నా ఊపిరి. నా రచనా జీవితంలో నా ముఖ్యమైన రచనలకు ప్రధానంగా ముగ్గురే ప్రయోక్తలు. కె.వెంకటేశ్వరరావు, చాట్ల శ్రీ రాములు, బి.వీ. రామారావు. ముగ్గురులో ఎక్కువ ప్రయోగాత్మక రచనలు శ్రీరాములుకోసం రాశాను. 35 సంవత్సరాల కిందట రాసిన 'గో టు హెల్' నాటకాన్ని మళ్లీ తన 81వ యేట ఈ మధ్యనే మళ్లీ పునర్నిర్మించాడు. తెలుగుదేశం గర్వించే ప్రయోక్తలలో శ్రీరాములు ఒకడు. బి.వి. రామారావు నేను సృష్టించిన చరిత్రలన్నింటికీ భాగస్వామి. ఆంధ్రనాటక కళా పరిషత్తు రెండు ప్రదర్శనలు– కరుణించని దేవతలు, కళ్లులో ప్రధాన పాత్రలు పోషించాడు. కొన్ని రచనలు రాయడానికి అతనే కారకుడు. ఒక విచిత్రమైన అనుభవం చెప్పాలి. కుటుంబ నియంత్రణ స్ఫురణకు వచ్చే రీతిగా ఒక నాటకం – 'ఒక చెట్టూ రెండే పువ్వులూ'. చాలామంచి నాటకం. 'నీలయ్యగారి దయ్యం' మంచినాటిక. నాటకాన్ని సాంగ్ అండ్ డ్రామా డివిజన్ హక్కుల్ని కొన్నది. ఒకరోజు విజయవాడ రేడియోస్టేషన్‌కి సురభి కంపెనీ స్థాపకులు ఇద్దరు– ఆవేటి నాగేశ్వరరావు, నటీమణి పూర్ణిమ వచ్చారు. ఆ నాటకాన్ని సాంగ్ అండ్ డ్రామా డివిజన్ తరఫున ప్రదర్శించడానికి అనుమతిని సంపాదించారు. నాకెంత పారితోషికం కావాలి? అడగడానికి వచ్చారు. ఎంత? అన్నాను. బాగా ఆలోచించి ప్రదర్శనకి 5 రూపాయలు ఇస్తామన్నారు. ఇది 1971మాట. కేవలం అయిదు

రూపాయిలా? నాకు ఆవేశం వచ్చింది. నాకు డబ్బు అక్కరలేదు. ప్రదర్శించండి అన్నాను. నన్ను ఒప్పించబోయారు. వద్దన్నాను. తర్వాత మల్లాది వెంకట కృష్ణశర్మగారికి గర్వంగా ఈ మాట చెప్పాను. ఐదు రూపాయలు వద్దన్నానని. ఆయన గుండె బాదుకున్నాడు. "ఎంతపని చేశావయ్యా? నాకు ఏ రెండున్నరో యిస్తే జీవితమంతా కాలుమీద కాలేసుకుని బతికేస్తున్నాను. అయిదు రూపాయలు వదులుకున్నావా?" అని మొత్తుకున్నాడు. నాకర్థం కాలేదు. సురభి కంపెనీ కొన్ని వందల ప్రదర్శనలు కొన్ని సంవత్సరాలు పాటు యిస్తుందట. ఇచ్చిందేమో. నాకు తెలియదు. సురభి కంపెనీ అనే ఉద్యమానికి ఇది మచ్చుతునకగా ఈ సంఘటన నాకెప్పుడూ జ్ఞాపకం వస్తుంది.

ఈటీవీ ఛానల్ ప్రారంభించకముందే రెండు కార్యక్రమాలను నన్ను నిర్వహించమని కోరారు. 'మనసున మనసై', 'ప్రతిధ్వని'. ఒకటి కుటుంబపరమైన వినోద కార్యక్రమం. రెండవది రాజకీయ విశ్లేషణాత్మకమైన కార్యక్రమం. ఆ రోజుల్లో 'మనసున మనసై' చాలా పాపులర్ కార్యక్రమం. అలాగే జెమినిలో 'ప్రజావేదిక' కూడా చాలా మందిని ఆకర్షించింది.

వ్యాసాలు రాశాను. కథలు రాశాను. సభలకు పరిగెత్తాను, దేశాలు తిరిగాను. ట్రావెలింగ్స్ రాశాను. ఎలిజీలు రాశాను– నన్ను నేను రక్షించుకోవడానికి. నా దుఃఖం నుంచి పారిపోవడానికి. ఒక్కరికే– యిలాంటి మార్గాంతరం లేదు; తెలియదు. నా భార్య! ఆవిడకి నేను పెద్ద గొడుగునయాను.

విశాఖలో మా యింటి దగ్గర్లో రిటైరయిన ఓ పోస్టు మాస్టరు ఉండేవారు– విష్ణుభట్ల నరసింహశాస్త్రి. ఆయనకి ఒక్కగానొక్క కూతురు. నాకు ఆనర్స్‌లో జూనియర్. అమెరికాలో సెటిలయింది. భర్త, పిల్లలూ. ఆ రోజుల్లో ఇప్పటి ఫోన్లు, కంప్యూటర్లు లేవు. మా యింట్లో ఫోన్ ఉండేది. కూతురుతో మాట్లాడడానికి ఆదివారం ఉదయం మా ఇంటికి వచ్చేవారు. ఒక్కోసారి కూతురు ఫోన్ చేసేది కాదు. "పని వత్తిడిలో ఉందేమో" అని వెళ్లిపోయేవారు. ఆయన రామకృష్ణ మిషన్ సభ్యులు. అతి సాధువు. "మిమ్మల్ని వదిలి వెళ్లిపోయిందని కూతురుమీద కోపం లేదా?" అనడిగేవాడిని. "ఎందుకూ కోపం? దాని బతుకు అది బతుకుతోంది. కాదనడానికి నేనెవర్ని?" ఈయన ముఖ్యపాత్రగా 'సాయంకాలమైంది' నవల రాశాను. ఆంధ్రప్రభలో ధారవాహికగా ఇంద్రకటి శ్రీకాంతశర్మగారు ప్రచురించారు. నవలని చదివి వేయి పడగల్ని గుర్తుచేసుకున్నవారు– పిరాట్ల వెంకటేశ్వర్లు, డాక్టరు పప్పు వేణుగోపాలరావు, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ వంటివారు పాతిక మంది ఉండగా

విజయవాడలో కొందరు 'సాయంకాలమైంది' అభిమాన సంఘాన్ని ఏర్పరచుకున్నారు. ఈ నవల అభిమాని మరొకరున్నారు– పి.వి.నరసింహారావు! చదివి పెద్ద ఉత్తరం రాశారు. ఈ నవలకి తెలుగు విశ్వవిద్యాలయం బహుమతి, వరంగల్లు సహృదయ సాహితి ఉత్తమ నవల బహుమతి వచ్చాయి. అంతకంటే జ్ఞాపకం ఉండిపోయే ప్రశంస ఒకటుంది. నాకు చెర్లపల్లి జైలునుంచి సెన్సారయిన ఉత్తరం ఒకటి వచ్చింది. "చిన్నప్పుడు మీ వేషాలు చూసి ఈ గొల్లపూడిగాడు ఎప్పుడయినా కనిపిస్తే దుడ్డుకర్రతో బుర్ర బద్దలు కొట్టాలనుకొనేవాడిని..." అంటూ "ఈ మధ్య మీ 'ఎర్రసీత' నవల, మీ 'సాయంకాలమైంది' నవల చదివాను. మనస్సుకి స్వాంతన కలిగింది. మీ అనుమతి తీసుకోకుండానే మీ అభిమానిగా మారిపోయాను" అంటూ ఒక ఖైదీ రెండు పేజీల ఉత్తరం రాసి కింద సంతకం చేశాడు. అడ్రసు:ఖైదీ నంబరు 405, మహానది బ్లాక్, పేరు జూలకంటి శ్రీనివాసరెడ్డి అనే మొద్దు శీను. ఒక హంతకుడులో ఈ స్పందన నాకు ఎప్పటికప్పుడు గుర్తుకొస్తూంటుంది. అమెరికాలో ఉంటున్న ఓ 26 ఏళ్ల యువకుడు, కేవలం కాన్వెంటు చదువు చదువుకున్నవాడు, సాయంకాలమైంది నవల గురించి విని, కేవలం ఈ నవల చదవడానికి తెలుగు నేర్చుకున్నాడు. ఆ మధ్య అమెరికా వెళ్లినప్పుడు అతను భార్యతో వచ్చి నన్ను కలిశాడు. ఒక నవలకి ఒక దేశపు ప్రధాని, ఒక హంతకుడు, భాషరాని ఒక యువకుడు అభిమానులు కావడం ఏ బహుమతులకన్నా విలువయినవని నా ఉద్దేశం.

56 సంవత్సరాల జీవితాన్ని 56 నిముషాల ప్రసంగంలో కుదించడం అసాధ్యం. అయినా ప్రయత్నిస్తున్నాను. పరిగెత్తుతున్నాను.

ఈ పరిషత్తు అధ్యక్షులు నారాయణ రెడ్డిగారికీ, నాకు ఎంతో ఆత్మీయమైన సాంగత్యం. ఆయనకి భారతీయ జ్ఞానపీఠ్ పురస్కారం ఇచ్చినప్పుడు మద్రాసులో మిత్రులంతా హోటల్ సవేరాలో సత్కారం చేశాం. అప్పుడు నేను ప్రధాన వక్తని. ఆయనకి రాజాలక్ష్మి ఫౌండేషన్ పురస్కారం ఇచ్చినప్పుడు నేను ప్రధాన వక్తని. ఆయన సమగ్ర సాహిత్య 5,6 సంపుటాలు విశాఖలో విడుదల చేసినప్పుడు నేను ప్రధాన వక్తని. నా షష్టిపూర్తికి, నాకు జరిగిన ఎన్నో సన్మానాలకి ఆయన వక్త. నాకు వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలో ఇచ్చిన జీవిత సాఫల్య పురస్కారాన్ని ఆయన చేతుల మీదుగా అందుకున్నాను. మా ఇద్దరి రచనలతో ఎన్నో సినీమాలు వచ్చాయి. ఆయన పాటల్ని ఎన్నింటినో నటించాను.

మాధ్యమాలన్నింటిలో పనిచేయడం ఈ జీవితానికి దక్కిన అదృష్టం. చేపట్టిన ప్రతీ ప్రక్రియా ఒక ల్యాండ్ మార్క్ కావడం మరో అదృష్టం. తెలుగు సాహిత్య చరిత్రలో గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కాన్ని ఫుల్‌స్టాపులూ, కామాలూ పొల్లుపోకుండా 42 పాత్రలతో రూపొందించిన బృహత్తర నిర్మాణంలో నేను గిరీశం చేశాను–నా 62వ యేట. అదొక అపూర్వమైన అనుభవం. జీవితంలో ఏనాడూ ఆధునిక నాటకం ఛాయలకురాని శ్రీకృష్ణపాత్రధారి పీసపాటి నరసింహమూర్తిగారిని లుబ్ధావధాన్లు పాత్ర చేయడానికి రాముడు వలస వెళ్లి ఒప్పించాను. ఆయన లుబ్ధావధాన్లు. నా చిన్నతనం నుంచి ఆయన నాటకాల్ని అభిమానిగా చూసిన నేను–ఆయన తమ్ముడు గిరీశం. సిగపట్లు తప్ప పోటీపడి నటించాం. నాటకంలో మా యిద్దరికీ ఒకే సీను. అది చూసిన వారికి చిరస్మరణీయం.

నా రచనల మీద నాలుగు విశ్వవిద్యాలయాల్లో– నా సమగ్ర సాహిత్యం మీదా, నా నాటకాల మీదా, నా నవలల మీదా, నా కాలమ్ రచనల మీదా నాలుగు పి.హెచ్.డి పట్టాలు తీసుకున్నారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో, నాగార్జున విశ్వవిద్యాలయాల్లో, వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ముగ్గురు ఎమ్.ఫిల్. సిద్ధాంత వ్యాసాలను రాశారు. నా కొడుకులిద్దరూ ఇంగ్లీషులో ఎమ్మే చదివి ఎమ్.ఫిల్ చేశారు. ఇద్దరికీ ఎంతో కొంత నేను పాఠాలు చెప్పాను. మా పెద్దబాయి తన 48వ యేట ఎమ్మే చదివాడు. అతనికి షేక్స్పియర్, శామ్యూల్ బెకెట్, ఓనీల్, జీన్ పాల్ సార్త్రే, బ్రెక్ట్, థియేటర్ ఆఫ్ ఎబ్సర్డ్, బుచ్చిబాబు బోధించాను. 17 పేపర్లు ఒకే విడతలో రాసి మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి పాసయ్యాడు. తర్వాత నా నాటకం మీద శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎమ్.ఫిల్. చేశాడు. ప్రముఖ రచయిత మధురాంతకం రాజారాంగారు కొడుకు గొల్లపూడి మారుతిరావు కొడుక్కి గైడ్. అంశం? నా నాటకం గోటు హెల్. తెలుగు నాటకాన్ని ఇంగ్లీషులో ఎలా ఉదాహరించను? అన్నాడు మా అబ్బాయి. అతనికోసం నాటకాన్ని ఇంగ్లీషులో రాశాను. ఎమ్.ఫిల్. విషయం. The Colour of anger in east and west: A comparative study of john Osborne"s Look Back in Anger' and Gollpudi Marutirao's "Go To Hell'. పిల్లలు నా భుజాల మీద నిలబడతారు కనుక ఈ ప్రసంగంలో వారికి ఈ మాత్రం స్థానం.

ఒకప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నా నాటిక 'కళ్లు' ఎమ్మే క్లాసుకి పాఠ్య గ్రంథం. డాక్టర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఎమ్మే కోర్సులకి కథా చిత్రాలు, వార్తా

చిత్రాలకు సిలబస్ రాశాను. ఐక్య రాజ్యసమితి అనుబంధ సంస్థ యునెస్కో ప్రాజెక్టుగా 18 విజ్ఞాన సర్వస్వాలు తయారవుతున్నాయి. ఈ అనుబంధ సంస్థ కార్యాలయాలు ఇంగ్లండు, పారిస్, అబూదాబీల్లో ఉన్నాయి. ఈ విజ్ఞాన సర్వస్వాలు ఈ భూగ్రహం మీద పర్యావరణానికి సంబంధించిన అన్ని విషయాలను సమగ్రంగా విశ్లేషించే అతి విలువయిన పరిశోధనల గ్రంథాలను ప్రచురిస్తుంది. ఇప్పటికి 800 ఈ బుక్స్‌ని ప్రచురించింది. It has intensive stae-of art coverage of many disciplines, with contributions by thousands of scholars from over 100 countries and edited by over 395 subject experts. It is rich in iner disciplinary subjects and attempts to forge inter disciplinary pathways between disciplines.ఈ విజ్ఞాన సర్వస్వం పేరు Encyclopaedia od Life Supporting Systems. ఈ సర్వస్వాల విషయ నిర్దేశనకు ప్రపంచంలో దాదాపు అన్ని దేశాల మేధావులతో ఒక సంపాదక మండలి ఉంది. అందులో నేను సభ్యుడిని. అంతేకాదు. ఈ ప్రణాళిక కార్య రూపాన్ని నిర్దేశించే జాయింట్ కమిటీలో ప్రపంచంలో కేవలం 14 మందే ఉన్నారు. అందులో నేనొకడిని. ప్రాచీన కాలం నుంచీ మన సాహిత్యంలో మన విజ్ఞాన నిధులలో ఈ స్పృహ ఉన్నదా? ఉంటే ఎలా వుంది? ఈ విషయాల్ని చర్చించే ప్రముఖుల వ్యాసాలతో 'భారతీయ సాహిత్యం' మీద ఒక సంపుటానికి నేను సంపాదకుడిని. ఇది నాకు దక్కిన అరుదయిన అదృష్టమనుకుంటాను. నేను ఈ విజ్ఞాన సర్వస్వానికి **Communication- Media Sustainable Development and Catharsis of Ideas** అనే పరిశోధనా వ్యాసాన్ని రాశాను. ఇది నాకు చాలా తృప్తినిచ్చిన కృషి.

ఇవాళ దాదాపు 40 ఏళ్ల తర్వాత – ఇంటర్నెట్‌లో 'కౌముది' మాస పత్రికలో నా నవలలు ఈ తరం చదువుతోంది. ఎందరో కొత్త అభిమానులు, యువకులు నన్ను పలకరిస్తున్నారు. ఇప్పుడు కంప్యూటర్ నా మొదటి స్నేహితుడు. తెలుగులో నా రచనలు టైపు చేస్తాను. ఒక బ్లాగ్, ఒక ఫేస్ బుక్ నిర్వహిస్తాను. తెల్లారిలేస్తే కంప్యూటర్‌తోనే నా జీవితం. అదొక వ్యసనం; ఆయుధం; అవకాశం!

ఇక సత్కారాలు, సన్మానాలు, అప్పాజోశ్యుల విష్ణుభొట్ల కందాళం ఫౌండేషన్ వారి ప్రతిభా జీవిత సాఫల్య పురస్కారం, వంగూరి చిట్టెన్‌రాజు ప్రపంచ తెలుగు మహా సభల జీవిత సాఫల్య పురస్కారం, 96 ఏళ్ల చరిత్ర ఉన్న కాకినాడ యంగ్‌మెన్స్ హాపీ క్లబ్ జీవిత సాఫల్య పురస్కారం, కళ్లు నాటికకి, 'సాయంకాలమైంది' నవలకీ సాహిత్య అకాడమీ

పురస్కారం, రెండు ధర్మనిధి పురస్కారాలు, మద్రాసు తెలుగు అకాడమీ తెలుగు వెలుగు పురస్కారాలు, రాజా లక్ష్మీ ప్రత్యేక పురస్కారం, వంశీ బర్కిలీ గురజాడ అప్పారావు బంగారు పతకం–యివన్నీ పెద్ద జాబితా.

ఈ మధ్య ప్రారంభించిన గొప్ప ఉద్యమం–వందేళ్ల కథకి వందనాలు–ధారావాహిక. హెచ్ ఎం టీ వీ ఛానల్ ద్వారా ప్రసారమౌతోంది. గత నూరు సంవత్సరాలలో రాసిన ప్రసిద్ధ కథా రచయితల ప్రసిద్ధ కథలు, ఆయా రచయితల పరిచయం, వారి జీవితంలో ముఖ్య ఘట్టాలను ప్రతిఫలించే ఫోటోలు, చేతివ్రాత–చివరగా ఎంపిక చేసిన కథ వైశిష్ట్యాన్ని విశ్లేషించే ప్రత్యేక సంచికా కార్యమమది. ఇదొక పరిశోధనాత్మకమయిన కృషి. తెలుగు సాహిత్యంలో మొట్టమొదటిసారిగా ఆయా వ్యక్తుల వీడియో రికార్డింగు చేశాను. తొంభయ్యో పడిలో ఉన్న ఎందరో రచయితల్ని రికార్డు చేశాను. మునిపల్లెరాజు, కాశీపట్నం రామారావు, ఘండికోట బ్రహ్మాజీరావు, దాశరధి రంగాచార్య, శివరాజు సుబ్బలక్ష్మి– వీరందరినీ రికార్డు చేశాను. చింతా దీక్షితులుగారబ్బాయి బాలం భట్టు పూనాలో దొరికారు. అడివి బాపిరాజు గారి మనుమరాలు దయాల్బాగ్‌లో ఉన్నారు. నెల్లూరి కేశవస్వామి శాస్త్రిగారబ్బాయి నరసింహశాస్త్రిగారు 88, మునిమాణిక్యం నరసింహారావుగారి మనుమరాలు ఎనభయ్యో పడిలో ఉన్నారు. రచయిత ఎస్. నటరాజన్ (కలం పేరు శారద) చివరివరకూ తెనాలిలో జంగిడిలో వడలు అమ్ముకు బతికాడు. మూర్ఛ రోగంతో 42వ యేట పోయాడు. ఆయనతో పేదరికాన్ని, ఆకలినీ, దైన్యాన్ని పంచుకున్న ఆలూరి భుజంగరావుగారికి 84 సంవత్సరాలు. ఇవన్నీ తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోగల ఇంటర్వ్యూలు. నాకు ప్రత్యేకంగా ఒక పాఠశాల. ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాను. కొందరు రచయితలు సూచించిన 217 కథల నుంచి 116 కథల్ని ఎంపిక చేశాం. ఇప్పటికి 33 కథలు ప్రసారమయాయి. ఈ ధారావాహిక ప్రసారం పూర్తయేనాటికి నాకు 75వస్తాయి.

నేను వారానికి రెండు కాలమ్స్ రాస్తాను– తెలుగులో 31 సంవత్సరాలుగా, హన్స్ ఇండియా ఆంగ్ల దినపత్రికకి సంవత్సరం నుంచి. తెలుగు కాలమ్ చాల వెబ్ సైట్లలో వస్తుంది.

నా జీవితంలో ఒక అసంతృప్తి మిగిలిపోయింది. అది తీరేది కాదు. నేను మీలాగ ఓ పద్ధతిలో తెలుగు చదువుకున్నవాడిని కాదు. అభిరుచిని చుక్కానిగా చేసుకుని తెలుగు వనంలో జొరబడిన వాడిని. చాలా సార్లు– ఇప్పటికీ నా ఆలోచనకి తెలుగు పదాలు లొంగక గింజుకుంటూంటాను. శరీరానికి వచ్చిన వయస్సు మెదడుదాకా ప్రయాణం

చెయ్యకుండా అడ్డకట్ట వేశాను. ఆరోగ్యకరమైన ఆనందప్రదమైన జీవితానికి ఒకే రహస్యం-మనది కాని, ఎదుటి వ్యక్తి ఆశించని 'మంచి' పనిని చేసుకుంటూ పోవడం. మహాత్ముడు బారిష్టరు చదువు చదివి దక్షిణాఫ్రికాలో చక్కగా ప్రాక్టీసు చేసుకుని ఉంటే మనకే గొడవలేదు. సమాజ హితాన్ని నెత్తిన వేసుకున్నాడు; మహాత్ముడయాడు. పోతన, మదర్ థెరిస్సా, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, గ్రాహం బెల్ ఆ పనే చేశారనుకుంటాను.

తలవొంచుకు కృషి చెయ్యి. తల ఎత్తుకు జీవించు. "ప్రాణము దైవమునొద్ద వడ్డీ బేహరమున కప్పుగొంటి, రుణమంతయు నిమ్మని తల్పుదట్టినన్ సరసర హేమనిష్కముల సంచులు ముందర విప్పి బోసెదన్" అన్నారు దువ్వూరి రామిరెడ్డి. అది అహంకారం కాదు. ఆత్మ విశ్వాసం.

నా ఆత్మకథలో రాసిన రాబర్ట్ బ్రౌనింగ్ మూడు ఇంగ్లీషు వాక్యాలతో ఈ తెలుగు ఉపన్యాసాన్ని ముగిస్తాను.

Grow old along with me

the best in yet to come

the first for which the last was made

నమస్కారం



డి.వెంకట్రామయ్య

శబ్దం కంటే నిశ్శబ్దం మంచిది!

మాటకంటే మౌనం గొప్పది!

ఈ మాటలు అర్థవంతమైనవే; అనుసరణీయమైనవే. కాని, మానవజీవితంలో మాటలూ తప్పవు; శబ్దాలూ తప్పవు. నాకూ తప్పలేదు. రేడియోలో అంటే ఆకాశవాణిలో దాదాపు మూడున్నర దశాబ్దాల పాటు మాట్లాడాను. వార్తలు చదివాను; రాశాను అనువదించాను; ఎడిట్ చేశాను; ప్రసంగాలూ వ్యాఖ్యానాలూ చేశాను. పాట జోలికి మాత్రం ఎన్నడూ పోలేదు. శ్రోతల అదృష్టం కొద్దీ నాకు పాటలు పాడటం చేతకాదు.

ఒక మనిషి జీవితంలో అర్ధశతాబ్ద కాలమన్నది గణనీయమైన గడువే. సరిగ్గా మరో ఏడాదికి నేను ఆకాశవాణిలో చేరి యాభయ్యేళ్ళు పూర్తవుతాయి. హైదరాబాద్ నగర వాసిగానూ అప్పుడే యాభయ్యో యేట అడుగు పెట్టాను. నా జీవితంలోని మరో ప్రధాన ఘట్టం నా వివాహం జరిగే మరో ఏడాదికి యాభయ్యేళ్లు. 1963మే నెలలో నాకు పెళ్ళయింది. 1963నవంబర్లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో చేరాను. నా భార్య పేరు కరుణ– నవరసాల్లోనూ నాకిష్టమైనది కరుణరసం.

✧ ✧ ✧

గొప్పవాళ్ళ జీవితాల్లో బాల్యం, కౌమారం, యౌవనం వంటి అన్ని దశలూ గొప్పగానే వుంటాయి. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందంటారు. ఆమాట ఏమోగాని, గొప్పవాళ్ళు

పుట్టీ పుట్టగానే ఘనకార్యాలు మొదలుపెడతారు. జీవితాంతం ఘన కార్యాలు చేస్తూనే వుంటారు. వాళ్ళు మాట్లాడే ప్రతి మాట, చేసే ప్రతి పనీ గొప్పగానే వుంటాయి. వాళ్ళ జీవితాల్లో అడుగడుగునా ఏవేవో ఆశ్చర్యకరమైన ఆసక్తిదాయకమైన సంఘటనలూ, ఎన్నెన్నో అద్భుతాలూ జరుగుతూవుంటాయి.

నేను గొప్పవాణ్ణి కాదు– సామాన్యుణ్ణి. అంచేత నా జీవితంలోని అన్ని దశలూ అన్ని ఘట్టాలూ సామాన్యమైనవే. చెప్పుకోడానికైనా అంత గొప్ప విషయాలేమి లేవు. కృష్ణాజిల్లా గుడివాడ దగ్గర్లో వున్న దొండపాడు గ్రామంలో 1941 ఆగస్టు ఇరవయ్యో తేదీన అతి సాధారణమైన రైతు కుటుంబాలలో పుట్టాను. నాకు అన్నదమ్ములూ అక్క చెల్లెళ్ళూ ఎవరూ లేరు. నా తల్లి దండ్రులకే నేనొక్కడినే. మా నాన్నపేరు దివి కాశీవిశ్వనాథం; మా అమ్మపేరు నాగరత్నం.

పుట్టడం రైతు కుటుంబంలో పుట్టినా, నేనెన్నడూ కాయకష్టం చేసి ఎరగను. ఏనాడూ చెరువులో దిగి నీళ్ళ కావిడి మొయ్యలేదు. చేలో దిగి నాగలి పట్టలేదు. ఒక్కడినే సంతానాన్ని గనక నా తల్లిదండ్రులు గారాబంగా పెంచారు. ఈ గారాబం నన్ను కొంత చెడగొట్టింది. దానికి తోడు చిన్నతనం నుంచీ కూడా నా శరీరం సుకుమారం; మనసు సున్నితం. శరీరం సుకుమారం కావడం చేత కలిగే కష్టనష్టాల మాట అలావుంచి, మనసు సున్నితం కావడం వల్ల నా జీవితంలోని వేర్వేరు దశల్లో ఎన్నో మార్లు ఎదురు దెబ్బలు తగిలాయి చేదు అనుభవాలు మిగిలాయి.

ఏడో తరగతిలోనో ఎనిమిదో తరగతిలోనో వుండగా, మొదటి సారిగా మావూరి లైబ్రరీలో అడుగుపెట్టిన నేను ఆ తదుపరి మూడు నాలుగేళ్ళలో అంటే హైస్కూలు చదువు ముగించుకుని కాలేజిలో ప్రవేశించే నాటికల్లా ఆ లైబ్రరీలో వున్న పుస్తకాలన్నీ చదివేశాను. ఆ పుస్తకాల్లో అల్లసాని వారి మనుచరిత్రా వుంది; చలంగారి మైదానమూ ఉంది; రామస్వామి చౌదరిగారి సూతపురాణమూ వుంది; 'వాడేవీడు' వంటి డిటెక్టివ్ నవలలూ వున్నాయి. అర్థమైనా కాకపోయినా పురాణాలూ ప్రబంధాలూ వేటీనీ విడిచి పెట్టలేదు. అర్థం తెలీక పోయినా పది మాటల పరిచయం కలిగింది; భావం అవగతం కాకపోయినా భాషకున్న బలం తెలిసింది.

ఆ చదువు అంతటితో ఆగలేదు. కాలేజిలో వుండగానూ, ఆతర్వాత అన్ని దశల్లోనూ కొనసాగింది; ఇప్పటికీ కొనసాగుతూనే వుంది. చదివిన కొద్దీ ఇంకా ఇంకా చదవాలన్న

తపన అధికమౌతోంది. చదివిన కొద్దీ చదవటంలో వున్న అద్భుతానందపు అనుభూతులు పదే పదే పలకరిస్తున్నాయి. ఈ మధ్య కొంతకాలంగా రాయటంకంటే చదవటమే బాగుంటోందన్న భావన బలపడుతోంది. ఈ విధంగా ఏర్పడిన అనాసక్తివల్ల గాని, సహజంగా నాకున్న అలసత్వం వల్లగాని, ఇతర కారణాలవల్లగాని నా రచనావ్యాసంగానికి ఎన్ని విరామాలు వచ్చినా, ఆ కృషి ఎంత కృశించినా, చదవటం మటుకు నేను మానలేదు. మరిచిపోలేదు.

నా పదిహేనో సంవత్సరంలో అనుకుంటా 'మహాప్రస్థానం' మొట్ట మొదటిసారి చదివాను. ఏదో కొత్తగా అనిపించింది; మళ్ళీ చదివాను.. మరింత కొత్తగా అనిపించింది. మళ్ళీ మళ్ళీ చదివాను... చదివిన కొద్దీ బుర్ర తిరగుతోంది గుండె కొట్టుకునే వేగం పెరుగుతోంది. నాకప్పుడే పరిచయమైన శ్రీరంగం శ్రీనివాసరావనే ఆయన ఏం చెబుతున్నాడో నా కంతగా అర్థం కాలేదు గాని, ఆ మాటల్లో వున్న వాడి, వేడి, ఆ పదాల్లో పద బంధాల్లో వున్న లయ అవన్నీ నన్ను గట్టిగా పట్టుకున్నాయి. ఇలా కాదనుకుని ఆ గీతాలు చదవటం ఆపి, ఆ పుస్తకం మొదట్లో వున్న 'యోగ్యతాపత్రం' చదివాను. శ్రీశ్రీ అనే ఆయన నన్ను కదిలించి, కలవర పెడితే, ఈ చలం అనే పెద్ద మనిషి అసలు వూపిరాడకుండా చేసి పారేశాడు. 'మహాప్రస్థానం' ఎన్నిమార్లు చదివాను. అంతే అప్పుడు నా నెత్తికెక్కి కూర్చున్న శ్రీశ్రీ, చలమూ ఇప్పటికీ అక్కడే కూర్చున్నారు; ఇంకా దిగలేదు.

గురజాడ అప్పారావు రచనల్లో ముందుగా నేను చదివింది కన్యాశుల్కమే. ఆయన రచనలన్నిటిలోకి అధికంగా, అమితంగా నన్ను ఆకర్షించినదీ ఆకట్టుకున్నదీ, కూడా కన్యాశుల్క నాటకమే! మహాప్రస్థానం మొదటిసారి చదివినప్పుడు ఎంతగా ఆ రచనకి లొంగి పోయానో, కన్యాశుల్కం మొదటిసారి చదివినప్పుడూ అంతే! అప్పట్నించి ఇప్పటి దాకా మహాప్రస్థానం యాభై సార్లో అరవై సార్లో చదివితే, కన్యాశుల్కం వందసార్లు చదివివుంటాను. ఈ మధ్య మతి మరుపు కాస్త ఎక్కువైంది గాని, నిన్న మొన్నటిదాకా కన్యాశుల్కంలోని ప్రధాన సన్నివేశాలన్నీ, సంభాషణలన్నీ కంఠోపాఠంగా అప్పగించేవాణ్ణి.

ఈ విధంగా రచయితగా నేనింకా ఓనమాలు కూడా దిద్దకముందే తమ తమ అసమాన ప్రతిభాసామర్థ్యాలతో, విశిష్ట రచనలతో, విరాట్ స్వరూపాలతో నా మనసంతా హృదయమంతా ఆక్రమించుకున్న త్రిమూర్తులు శ్రీశ్రీ, చలం, గురజాడలుకాగా, ఆ తర్వాత క్రమంగా కృష్ణశాస్త్రి, తిలక్, నారాయణ రెడ్డి వంటి కవులూ, శ్రీపాద, మల్లాది, కొడవటి గంటి, గోపీచంద్, బుచ్చిబాబు, రావిశాస్త్రి వంటి వచన రచయితలూ తమ కళా ప్రాభవ

కాంతి రేఖల్ని నాపై ప్రసరింపజేశారు. మిగతావారికంటే కవుల్లో తిలక్, వచన రచయితల్లో రాచకొండల ప్రభావం నామీద కాస్త ఎక్కువ.

తగు మాత్రంగా హిందీ సాహిత్యమూ, కాస్త అధికంగానే ఆంగ్ల సాహిత్యమూ అధ్యయనం చేసినప్పటికీ, ఆయా భాషలకు చెందిన కొందరు కవులూ రచయితలూ నన్ను అమితంగా ఆకర్షించినప్పటికీ, వారి ప్రభావం ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని నా రచనలపై వుందనుకోను.

'నామీద ఎవరి ప్రభావమూ లేదు' అని ఏ రచయితైనా అంటే అది నమ్మదగ్గ మాట కాదు. ఆ విధంగా అనేవాళ్లు 'జీనియస్'లయినా అయివుండాలి; లేదా ఏ గొప్ప కళకీ, ఏ గొప్ప రచనకీ, ఏ కొత్త ఆలోచనకీ ప్రభావితులు కాని జడులైనా అయి వుండాలి. నేను జీనియస్‌నీ కాను; జడుణ్ణీ కాను. అందువల్ల నాకు పూర్వులైన అనేక మంది గొప్ప రచయితల ప్రభావం నామీద అంతో ఇంతో పడిందని అనుకుంటున్నాను అని నేనే ఒక సందర్భంలో రాశాను (డి.వెంకట్రామయ్య కథలు' 1997 వేదగిరి కమ్యూనికేషన్స్ ప్రచురణ, రచయిత ముందుమాట 'స్వకీయం').

✧ ✧ ✧

మా వూళ్ళో వీధి బడి లాంటి ఒక బడిలో ఏడో తరగతి వరకూ చదివి, గుడివాడ వెళ్ళి ఎనిమిదో తరగతిలో చేరాను. మా వూళ్ళో హైస్కూలు లేకపోవడం చేత ఆ రోజుల్లో మావూరి పిల్లలందరూ అలాగే చేసేవారు. ఆ తర్వాత కొంత కాలానికి మావూరి పక్కనున్న మోటూరు అనే కుగ్రామంలో హైస్కూలు వచ్చాక, కొందరు ఆవూరికీ, మిగతావాళ్ళు గుడివాడ పట్టణానికి వెళ్ళడం ప్రారంభించారు. ఒక్క ఏడాది మినహా నా హైస్కూలు చదువంతా గుడివాడలోనే సాగింది. డిగ్రీ పూర్తయ్యే వరకూ కాలేజీ చదువూ అక్కడే. గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల నుంచి 1962లో బి.యస్సీ. పట్టా పుచ్చుకున్నాను.

హైస్కూలు దశలోనే మావూరి లైబ్రరీ పుస్తకాలన్నిటి దుమ్మూ దులిపేసిన నేను కాలేజిలో చదివిన నాలుగేళ్లలో అక్కడి లైబ్రరీ పుస్తకాలు కూడా ఏ ఒక్కటీ విడిచిపెట్టకుండా చదివేశాను. అయితే ఈ మాట తెలుగుతో పాటు కొన్ని ఇంగ్లీషు, హిందీ పుస్తకాలు కూడా చదివాను. అన్నట్టు విద్యార్థిగా నేను తెలుగు చదువుకున్నది PUC (ప్రీ యూనివర్సిటీ

కోర్సే) వరకే. డిగ్రీలో నా సెకండ్ లాంగ్వేజ్ హిందీ. కాలేజీ చేరే నాటికే ప్రయివేటుగా హిందీ చదువుకుని, కొన్ని పరీక్షలు పాసయ్యాను.

నేను కాలేజిలో చేరిన కొత్త రోజుల్లోనే ఒకనాడు మా కాలేజి లైబ్రరీలో 'నారాయణరెడ్డి గేయాలు' అనే పుస్తకం నాటకం బడింది. ఇంటికి తీసుకెళ్ళి చదివాను. అప్పటికే నారాయణరెడ్డి గారి కవితా ప్రశస్తి గురించి కొంత మేర విని వున్నప్పటికీ ఆయన కవిత్వం చదవటం అదే మొదటిసారి.

ఆ పుస్తకంలోని కొన్ని కవితా ఖండికలు చదివి ముగ్ధుడినై, అవన్నీ ఒక నోట్ బుక్‌లో కాపీ చేసుకున్నాను. ఆనోట్ బుక్ నిన్న మొన్నటిదాకా నా దగ్గరుండేవి. ఇప్పటికీ వుందేమో, వెతకాలి. ఆ పుస్తకంలోనేను చదివిన 'యౌవనోల్బణం', 'చుక్కలతో చెప్పాలని', 'చంద్రబింబం ఆరిపోతే' వంటి కవితలు ఇప్పటికీ కొద్ది కొద్దిగా జ్ఞాపకమున్నాయి. ఆ తర్వాత కొంత కాలానికి 'నాగార్జున సాగరం' 'కర్పూర వసంత రాయలు' వంటి సి.నా.రె. ప్రసిద్ధ కావ్యాలు చదివాను.

నారాయణరెడ్డి గారి కవితలూ, కావ్యాలూ ఆ రోజుల్లో నన్నెంతగా ఆకర్షించాయో, అలరించాయో ఆ తర్వాతికాలంలో ఆయన సినీగీతాలు అంతకుమించి నన్ను ఆకర్షించాయి. నేనుకవిని కాను కథలు, నవలలు, నాటకాల వంటివి రాసుకునే వచన రచయితని. అయితే మొదటి నుంచీ కూడా నేను కవితాప్రియుణ్ణి. సాహిత్యప్రక్రియలన్నిటిలోకి కవిత్వమే గొప్పదని నమ్మిన వాణ్ణి. పురాణ, ప్రబంధ కవిత్వాల నించి ఈనాటి స్త్రీవాద, వేర్పాటు వాద, దళిత, మైనారిటీ కవిత్వాలవరకూ అన్నిరకాల కవిత్వాలూ సీరియస్‌గా చదివిన వాణ్ణి; ఇంకా చదువుతున్నవాణ్ణి. వీటిన్నిటికీ తోడు నాకు సినిమా పిచ్చి కూడా ఎక్కువ గనక సినిమాలకి రాసే వారిలో నాకిష్టమైన కవుల సాహిత్యం కూడా కాస్త ఎక్కువగానే అధ్యయనం చేశాను. దేవులపల్లి, మల్లాది వంటి వారితో ప్రారంభించి శ్రీశ్రీ, ఆరుద్ర, ఆత్రేయ, కొసరాజు, దాశరథి, నారాయణరెడ్డి, వేటూరి వంటి కవుల సినీగీతాల ప్రత్యేక, విశిష్ట, విలక్షణ స్వభావాలను గురించి కూడా చాలమటుకు శోధించాను.

సినిమాపాట అంటే ఇవ్వాళ అందరికీ చులకనైపోయింది గాని, ఇంతకుముందు నేను ప్రస్తావించిన కవులందరూ సినీ గీతానికి కావ్య గౌరవం కల్పించినవాళ్ళే.

నేను దారి తప్పలేదు. పాఠకుడిగా, రచయితగా నేను సాగించిన ప్రస్థానంలోని

వేర్వేరు దశల్లో కేవలం సాహిత్య రంగమే కాకుండా సినిమా రంగం వంటి ఇతర రంగాల ఆకర్షణ, ప్రభావమూ కూడా ఎంతో కొంత మేర నాపై పడ్డాయని చెప్పడమే నా ఉద్దేశ్యం. ఇక్కడ మరో విషయం స్పష్టం చెయ్యదల్చుకున్నాను. ఒక కవి, లేదా రచయిత సృష్టించే సాహిత్యం మీద ఆరచయితకి ముందు కాలం నాటి కళలు, సాహిత్య నేపథ్యంతో పాటు సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులన్నిటి ప్రభావం కూడా పడుతుంది; పడితీరాలి. అప్పుడే ఆ రచనలు సజీవంగా, సహజంగా వుంటాయి.

✧ ✧ ✧

నేనీ విధంగా చేతికి దొరికిన ప్రతి పుస్తకమూ సినిమా పాటలు పుస్తకాలతో సహా చదివేసి, కరపత్రాలతో సహా పత్రికలన్నీ కరకరా నమిలెయ్యటం వల్ల రచయితగా పుట్టి, పెరగటానికి ఆ చదువంతా నాకెంత పని కొచ్చిందో తెలీదుగాని, విద్యార్థి దశలో నా అసలు చదువు మాత్రం అటకెక్కింది. 'ఫలానా వారబ్బాయి చాలా బుద్ధిమంతుడు, ఎప్పుడు చూసినా అతని చేతిలో పుస్తకం వుంటుంది...' అని, మా వూళ్ళో నాకు చాలా మంచి పేరుండేది. కాని, ఎప్పుడు చూసినా నా చేతిలో వుండే ఆ పుస్తకం నా పాఠ్య గ్రంథం కాదు, అది ఏదో కథా సంపుటమో, నవలో, నాటకమోనని ఎవరికీ తెలీదు.

మావూళ్ళోనే కాదు, హైస్కూల్లోనూ కాలేజీలోనూ కూడా నాకు రాముడు మంచి బాలుడన్న పేరే వుండేది. అయితే, నాదెప్పుడూ వెనక బెంచీయే. ఒకసారి, రెండు సార్లూ కాదు – మూడు నాలుగు మార్లు పరీక్షలు తప్పాను. ఆఖరుకి డిగ్రీ కూడా థర్డ్ క్లాసు లోనే పాసయ్యాను. బయటి పుస్తకాలు తప్ప క్లాసు పుస్తకాలెన్నడూ ముట్టుకోక పోవడం ఇందుకు ప్రథమ కారణమూ ప్రధాన కారణమూ కాగా, నాటక కళ మీద చిన్నతనం నుంచీ వున్న ఆసక్తి కాలేజి చదువులనాటికి నాటకాలపిచ్చిగా ముదరడమూ, కొత్తగా సినిమా పిచ్చి పట్టుకోవడమూ మిగతా కారణాలు.

కాలేజిలో వున్న నాలుగేళ్ళలోనూ చాలా నాటకాలాడాను. తెలుగులోనూ ఇంగ్లీషులోనూ కూడా ఆడా మగా అన్ని వేషాలూ వేశాను. ఆత్రేయ వంటి ఆధునిక నాటక కర్తల నాటకాల నించి షేక్స్పియర్ ఇంగ్లీషు నాటకాల వరకూ ఎన్నో రకాల నాటకాల్లో నటించాను. గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో అధమ పక్షం అయిదారుమార్లు ఉత్తమ నటుడి బహుమతు లందుకున్నాను.

కాలేజిలోనే కాదు, హైదరాబాద్ వచ్చి ఆలిండియా రేడియోలో చేరిన తర్వాత

కూడా నాటకాలాడటం మానలేదు. ఆకాశవాణి తరఫునా, బయటి నాటక సంస్థల తరఫునా కూడా అయిదారేళ్ళ పాటు ఎన్నో నాటకాలాడాను. నేను చెబుతున్నది రేడియో నాటకాల గురించి కాదు–రంగస్థల నాటకాల గురించి. నా రేడియో నాటకాల విషయం తర్వాత ప్రస్తావిస్తాను.

ఆకాశవాణి తరఫున ప్రదర్శించిన నాటకాల్లో అప్పటి నా సహోద్యోగులు గొల్లపూడి మారుతీరావు, కోకా సంజీవరావు, కీర్తి శేషులు వాసుదేవ మూర్తి, వఠెం సత్యనారాయణ వంటివారు నా సమాన నటులు కాగా, బయటి సంస్థల తరఫున ఆడిన నాటకాల్లో కోకా సంజీవరావు, సి.యస్. రావు; పరుచూరి వెంకటేశ్వరరావు, డి.ఎస్.ఎన్. మూర్తి, యర్రం నేని చంద్రమౌళి వంటివారు నాతోపాటు నటించేవారు,

ఈ విధంగా నేను ముందుగా నటుణ్ణి, ఆ తర్వాత రచయితని. రేడియోలోనూ అంతే! ముందుగా నటుణ్ణి, రచయితని, రేడియో ఆర్టిస్టుని. ఆ తర్వాత రేడియో జర్నలిస్టుని. నిజానికి రేడియో ఉద్యోగంలో చేరడానికి నాకు ప్రధానంగా పని కొచ్చింది నా నాటకానుభవమే.

ఔత్సాహిక నాటక సమాజాలు ఎవర్నించీ ఎటువంటి సహాయ సహకారాలూ లేకుండా తమంత తాముగా నాటకాలాడటంలో గల ఇక్కట్లన్నీ ఇబ్బందులన్నీ స్వానుభవంలోకి రావటంతో పాటు, క్రమంగా సాహిత్య రంగంపట్ల ఆసక్తి పెరగటంతో 1969–70 రంగస్థల నాటకాలకి స్వస్తి పలికాను.

✧ ✧ ✧

నా సాహిత్య రచనా వ్యవసాయం లేదా వ్యాసంగం అన్నది పత్రికలకంటే ముందుగా రేడియోలోనే ప్రారంభమైంది. రేడియో కోసం రాసిన వాటికంటే ముందే పత్రికల్లో రెండు మూడు రచనలు అచ్చయినప్పటికీ అవి చెప్పుకోదగ్గవి కావు.

1963 నవంబర్లో – అంటే ఇప్పటికి సరిగ్గా నలభై తొమ్మిది సంవత్సరాల క్రితం ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో తెలుగు ఎనౌన్సర్‌గా చేరాను. ఆ విధంగా చేరడానికి నన్ను ఇంటర్వ్యూ చేసిన వారిలో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు కూడా ఒకరు. “డి. అంటే ఏమిటి నాయనా, దేవులపల్లా..?” అని నన్నడిగి పక పకా నవ్వారు. అప్పటి కింకా ఆ మహా కవి కంఠ స్వరం మూగబోలేదు. ఆ తర్వాత ఏడాదికో, ఏణ్ణర్థానికో

వ్యాధిగ్రస్తులైనప్పుడు ఆపరేషన్ చేసిన వైద్యులు ఆయన స్వర పేటిక తొలగించారు.

నేను ఆకాశవాణిలో అడుగు పెట్టిన కొత్తలో స్థానం నరసింహారావు, ముని మాణిక్యం నరసింహారావు, నాయని సుబ్బారావు, బాలాంత్రపుర రజనీకాంతరావు, పాలగుమ్మి విశ్వనాథం, బుచ్చిబాబు, న్యాపతి రాఘవరావు, న్యాపతి కామేశ్వరి, మంచాల జగన్నాథరావు, శ్రీవాత్సవ, భాస్కరభట్ల కృష్ణారావు వంటి మహానుభావులంతా హైదరాబాద్ కేంద్రంలో పని చేస్తుండేవారు. రచయితలుగా అప్పటికే ప్రసిద్ధులైన రావూరి భరద్వాజ, దండమూడి మహీధర్ వంటి ప్రముఖులుండేవారు. మారెళ్ళ కేశవరావు, ఎన్.ఎస్. శ్రీనివాసన్, ఎమ్. చిత్తరంజన్, వింజమూరి సీతాదేవి, నేతి శ్రీరామ శర్మ వంటి సంగీత కళాకారులూ, శారదా శ్రీనివాసన్, కె. చిరంజీవి వంటి డ్రామా ఆర్టిస్టులూ, మల్లాది నరసింహశాస్త్రి, మాడపాటి సత్యవతి, రతన్ ప్రసాద్ వంటి ఎనౌన్సర్లూ వుండేవారు. తురగా కృష్ణమోహనరావు, నళినీ మోహన్, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం వంటివారు వార్తా భాగంలో వుండేవారు. గొల్లపూడి మారుతీరావు, శంకరమంచి సత్యం వంటి రచయితలు నాకంటే కొద్ది మాసాలు ముందుగా రేడియోలో చేరారు. ఇటువంటి ప్రముఖులందరితోనూ కలిసి పని చేసే అవకాశం ఆకాశవాణి ద్వారా నాకు లభించింది.

1964లోనో, 65లోనో సరిగా జ్ఞాపకం లేదుగాని, అప్పట్లో స్క్రిప్టు రైటర్‌గా పనిచేస్తూ వుండిన ప్రసిద్ధ కవి నాయని సుబ్బారావుగారు రాయాల్సివున్న ఒక రూపకం-- అనారోగ్యకారణాల వల్ల ఆయన రాయలేక పోవడం చేత నేను రాయాల్సివచ్చింది.

'లంచం పిశాచి' అనే పేరుతో కార్మికుల కార్యక్రమంలో ప్రసారమైన ఈ రూపకమే నాకు గుర్తున్నంత వరకూ రేడియోలో నా మొదటి రచన. ఆతదుపరి సుమారు పదిహేనేళ్ళ కాలంలో రేడియో కోసం కనీసం రెండు వందల నాటికలు, సీరియల్ నాటికలు, రూపకాలు, కథలు, ప్రసంగాలవంటివి రాశాను. వాటిలో అధిక భాగం – ముఖ్యంగా నా నాటికలు, సీరియల్ నాటికలూ ఆరోజుల్లో శ్రోతల్ని ఎంతగానో మెప్పించాయి. నేను రాసిన రేడియో నాటికలన్నింటిలోనూ ప్రధాన పాత్రధారిని నేనే; ఆ నాటికలన్నింటి ప్రయోక్తనీ నేనే. రాంబాబు అన్న పేరుతో సుమారు పదేళ్లపాటు నేను నిర్వహించిన 'కార్మికుల కార్యక్రమం' కూడా ఆ రోజుల్లో అత్యధిక స్థాయిలో శ్రోతల ఆదరణ పొందింది.

ప్రారంభ దశలో పత్రికల్లో అచ్చయిన నా రచనలు చాల మటుకు అనువాదాలు. హిందీతో పాటు ఇతర భారతీయ భాషల ప్రసిద్ధ రచయితల కథలు హిందీ నించి తెలుగులోకి

అనువదించేవాడిని. అలా అనువదించిన పాతిక ముప్పయి కథలు 1966-68 సంవత్సరాల మధ్య పత్రికల్లో అచ్చయినాయి- గోరాశాస్త్రిగారు 'ఆంధ్రభూమి' దినపత్రిక సంపాదకుడిగా వున్న రోజుల్లో, ఒకానొక దశలో ప్రతి ఆదివారమూ ఆ పత్రికలో నా అనువాద కథ ఒకటుండేది. ఇటువంటి కథలు కొన్ని కలిసి 'బాహ్యాంతరాలు' అన్న పేరుతోనూ, మరో రెండు అనువాద నవలూ 1970 నాటికే పుస్తకరూపంలో వచ్చాయి. ప్రసిద్ధ మరాఠీ రచయిత H.N. ఆప్టే రాసిన 'మీ' అన్న నవలను 'నేను' అన్న పేరుతో 1976లో అనుకుంటాను- నేషనల్ బుక్ ట్రస్టు వారి కోసం తెలుగులోకి అనువదించాను.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒకానొక స్థానం కల్పించి, రచయితగా నాకంతో ఇంతో పేరు తెచ్చి పెట్టినవి నా కథలు. కవిత్వం తప్ప మిగతా సాహిత్య ప్రక్రియలన్నిటిలోనూ ఎంతో కొంత కృషి చేసినా, రేడియోవంటి ఇతర మాధ్యమాలకోసం ఎంత రాసినా, రచయితగా నన్ను కాస్త ఎత్తుగానే నిలబెట్టినవి నా కథలే. నేనిప్పటి దాకా సుమారు ఎనభై కథలు రాశాను. వీటిలో మూడు వంతులకి పైగా 1970-90 సంవత్సరాల మధ్య రాసినవే. ఆ రెండు దశాబ్దాలలోనూ ఆనాటి ప్రముఖ పత్రికలోనూ నా కథలు అచ్చయినాయి. ఏ సందర్భంలో ఏ పత్రిక ప్రత్యేక సంచిక ప్రచురించినా అందులో నా కథ వుండేది. కొత్తగా ఏ పత్రిక ప్రారంభమైనా, ప్రారంభ సంచికలో నా కథ వుండేది. ప్రత్యేక సంచికలకే రాయాలన్న నియమం నేనెప్పుడూ పెట్టుకోలేదుగాని, నా కథల్లో అధిక భాగం ప్రత్యేక సంచికల్లోనే ప్రచురితమైనాయి.

నేను కథలు రాయటం ప్రారంభించడాని కెంతో ముందుగానే సాహిత్య రంగంలో అభ్యుదయ వాదం బాగా బలపడింది. సామాన్య మానవుడి సంక్షేమమే సాహిత్య ప్రయోజనమన్న దృక్పథం సర్వత్రా వ్యాపించింది. అయితే- 'అభ్యుదయం అభ్యుదయం' అన్న నినాదాల వల్ల వొరిగేదేమీ లేదు. కేవలం సానుకూల దృక్పథాలవల్లా సానుభూతి వచనాలవల్లా ప్రయోజనం లేదు; ఈ సామాజిక వ్యవస్థనీ, ఈ రాజకీయ వ్యవస్థనీ పట్టి పీడిస్తున్న జాడ్యాలన్నిటినీ వదలగొట్టాలంటే, ఈకుళ్ళు నంతా కడిగి పారెయ్యాలంటే - పై పై పూతలు, లేపనాలు పనికిరావు; సాముహికమైన ప్రజా ఉద్యమాలూ, పోరాటాలే ఈ పరిస్థితిని మార్చగలవు. రచయితలుకూడా అటువంటి ఉద్యమాలకీ పోరాటాలకీ బాసటగా నిలబడి, విప్లవోన్ముఖంగా ప్రజల్ని చైతన్యపరిచే రచనలు చెయ్యాలి... అన్న వాదం విద్యార్థుల్లో యువజనుల్లో అంకురించి, అప్పుడప్పుడే క్రమంగా అన్ని వర్గాలకీ విస్తరిస్తోంది.

1970లో విశాఖపట్నంలో జరిగిన శ్రీశ్రీ షష్టిపూర్తి సభలోనూ, అంతకి కాస్త ముందుగానూ సాహిత్యరంగంలో జరిగిన అనేక నాటకీయ పరిణామాల పర్యవసానంగా ఆ సంవత్సరమే విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. ఈ దశలోనూ, ఆ తర్వాత ఒకటి రెండు దశాబ్దాలపాటూ ఆధునిక తెలుగు సాహిత్యపు రూపు రేఖలు మార్చడంలో విరసం నిర్వహించిన పాత్ర విస్మరించదగ్గది కాదు.

విరసం ఏర్పడిన కొత్తలో అందులో చేరమని నాకూ పిలుపు లొచ్చాయిగాని, కొన్ని కారణాల వల్ల నేను చేరలేదు. అయితే, కొంతకాలం పాటు ఆ సంస్థ కార్యకలాపాలకు సన్నిహితంగా వ్యవహరించాను. పలుమార్లు విరసం వేదికలపై ప్రసంగించాను. విరసం ప్రముఖులు చాలామంది అప్పుడూ ఇప్పుడూ కూడా నాకు స్నేహితులే. అయితే, రచయితల సంఘంగా ఏర్పడిన ఆ సంస్థ సాహిత్య సృజనకంటే సాహిత్యేతర కార్య కలాపాలకు ప్రాధాన్యమిస్తోందన్న అభిప్రాయంతో క్రమంగా విరసానికి దూరంగా జరిగాను.

ఈ వివరాలన్నీ ఎందుకు చెబుతున్నానంటే, 1966లో ప్రారంభమైన దిగంబర కవితోద్యమం, 1970లో ప్రారంభమైన విప్లవ కవితోద్యమం వంటి వివిధ సాహితీ పరిణామ దశల ప్రభావం ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా నైనా నా రచనల మీద ఎంతో కొంత పడింది. అయితే ఈ సమాజాన్నీ దేశాన్నీ ఉద్ధరించడానికే నేను రాస్తున్నానని నేనెప్పుడూ చెప్పుకోలేదు. నినాద ప్రాయంగా మిగిలిపోయే రచన లెన్నడూ చెయ్యలేదు. సిద్ధాంత ప్రవచనాలకెప్పుడూ పరిమితం కాలేదు.

"రచనల వల్ల సమాజాన్ని బాగు చెయ్యొచ్చుననీ, దేశాన్ని ఉద్ధరించవచ్చుననీ నేను అనుకోవటం లేదు. అయితే, ప్రజల్లో అధిక సంఖ్యాకుల మేలుకోరే వ్యవస్థని ఏర్పరచడాని కవసరమైన అవగాహననీ చైతన్యాన్నీ పాఠకుల్లో కలిగించటానికి సాహిత్యం ఒక సాధనంగా, చేతనైన వాడి చేతిలో ఆయుధంగా ఉపకరిస్తుందని భావిస్తున్నాను" అని, 1997లో వెలువడిన నారెండో కథా సంపుటానికి ముందుగా రాశాను.

"ప్రస్తుత సామాజిక, రాజకీయ, వ్యవస్థల్లో వున్న దుర్నీతికీ, దుర్మార్గానికీ, దుష్ట స్వభావానికీ బలైపోయిన నిస్సహాయుల, నిర్భాగ్యుల కథలే నేనెక్కువగా రాశాను. వాళ్ళు కూలి వాళ్ళు కావచ్చు; ముష్టివాళ్ళు కావచ్చు; మధ్యతరగతికి చెందిన మామూలు మనుషులు కావచ్చు; మగాడి వంచనకి లోనైన మహిళలూ కావచ్చు; ఏమి రాసినా– ఎవరి గురించి రాసినా అందులో అసహజాలు, అబద్ధాలు, అభూత కల్పనలూ లేకుండా

చూడ్డానికే రచయితగా నా సర్వశక్తులూ వినియోగించాను. పేరుకోసమో, ప్రైజుకోసమో, డబ్బుకోసమో నేను నమ్మిన సిద్ధాంతాన్ని వదులుకోలేదు. నాకు తెలిసిన నిజాలు చెప్పడం మానలేదు. వాస్తవాల నెప్పుడూ వక్రీకరించలేదు" అని కూడా అప్పట్లో రాశాను. అప్పుడే కాదు, ఇప్పుడు రాయాల్సి వచ్చినా ఒక్క అక్షరం తేడా లేకుండా ఇవే మాటలు రాస్తాను.

సాహిత్య రచనకి వస్తువు, రూపం – ఈ రెంటిలో ఏది ముఖ్యం అన్న విషయం గురించి అనేక దశాబ్దాల క్రితం ప్రారంభమైన సిద్ధాంతరాద్ధాంతాలూ, చర్చలూ, వాదోపవాదాలూ ఇప్పటికీ కొనసాగుతూనే వున్నాయి. ఇప్పుడు నేనా వివరాల్లోకి వెళ్ళదల్చుకోలేదు గాని, నా నిశ్చితాభిప్రాయంగా ఒకమాట చెబుతాను. 'సామాజిక ప్రయోజనం గల రచన అన్నంత మాత్రాన వస్తువుకి ఎంత ప్రాముఖ్య మిచ్చినా, రూపానికున్న ప్రాధాన్యాన్ని విస్మరించకూడదు. వస్తువుకీ రూపానికీ మధ్య సరైన సమన్వయాన్ని సాధించగలిగినప్పుడే ఆ రచన సార్థక మౌతుందని నా నమ్మకం. ఇటువంటి సమన్వయాన్ని సాధించడానికే నేను కృషి చేశాను. ఆకలి కథ కూడా ఆసాంతం ఏడుపు గొట్టుగా వుండనక్కర్లేదనీ, ప్రయోజన కరమైన కథలు కూడా పాఠకులకి ఆసక్తి కరంగా ఆహ్లాదకరంగా వుండొచ్చుననీ రుజువు చెయ్యడానికి నేను ప్రయత్నించాను. నా రచనల ద్వారా నేను ఆశించిన ప్రయోజనాలన్నీ, నేను చేసిన ప్రయత్నాలన్నీ, ప్రయోగాలన్నీ ఏమేరకు నెరవేరాయో, ఎంతవరకూ సఫలమయ్యాయో నిర్ణయించవలసింది పాఠకులే.

సాహిత్యరచనల్లో నేననుసరించవలసిన మార్గాన్ని ఎంచుకోవడంలో, ఆమార్గాన్ని నిర్మించుకోవడంలో నాకు తోడ్పడి, ఒకానొకదశలో విరివిగా రాయడాని కవసరమైన ప్రోత్సాహాన్నీ, ప్రేరణనీ నాకందించిన మరో విషయం గురించి ఇక్కడ ప్రస్తావించాలి. 1963లో నేను హైదరాబాద్ వచ్చినప్పట్నించి 1980 వరకూ పదిహేడు సంవత్సరాలపాటు నారాయణగూడ విఠల్ వాడీలో ఒక ఇంట్లో వుండేవాణ్ణి. 1970లోనో 71లోనో ప్రారంభమై, ఏడెనిమిదేళ్ళ పాటు ప్రతి ఆదివారమూ మా ఇంట్లో రచయితల సమావేశాలు జరిగేవి. ఆ రోజుల్లో నారాయణ గూడలో మాదొక రచయితల బృందం వుండేది. నేను. చంద్ర, శ్రీపతి, శ్రీకంఠమూర్తి, రాజా రామమోహనరావు, భైరవయ్య, సి. యస్. రావు ఆబృందంలోని ప్రధాన సభ్యులం కాగా, 'రచన'శాయి, (అప్పటికి 'రచన' పత్రిక లేదు. శాయి, రాంబాబూ కలిసి వై. రాంబాబు అండ్ శాయి అన్న పేరుతో కథలు రాసేవారు) ముప్పిడి ప్రభాకరరావు, పి.వి.ఆర్. శివకుమార్ వంటి వారు కూడా కొంతకాలం మా జట్టులో వుండేవారు. నగ్నముని, నిఖిలేశ్వర్, ఎమ్. పార్థసారథి, చలసాని ప్రసాదరావు,

కొంపెల్ల విశ్వం, పి. శ్రీనివాసశాస్త్రి, జి. శ్రీరామమూర్తి, మల్లాది వెంకట కృష్ణమూర్తి, పాలకొడేటి, చందు సోంబాబు వంటి రచయితలు కూడా అప్పుడప్పుడూ వచ్చి మా సమావేశాల్లో పాల్గొనేవారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వుండే కొందరు రచయితలు కూడా హైదరాబాద్ వచ్చినప్పుడు మా ఇంట్లో జరిగే సమావేశాలకి వచ్చేవారు. చాసో, కాళీపట్నం రామారావు, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, బీనాదేవి, త్రిపుర, బలివాడ కాంతారావు, భమిడిపాటి జగన్నాథరావు, అల్లం శేషగిరిరావు వేగుంట మోహన ప్రసాద్, కె.వివేకానందమూర్తి ఎన్.ఎస్. ప్రకాశరావు, మరువాడ రాజేశ్వరరావు లాంటి ఎందరో రచయిత లావిధంగా మా సమావేశాల్లో పాల్గొన్నారు. మా బృంద సభ్యులుగాని, అతిథులుగా వచ్చిన ఇతర రచయితలు గాని తాము రాసుకొచ్చిన కథలు చదివితే వాటి బాగోగుల గురించి సమగ్రంగా చర్చించడం, ఎక్కడ ఏ పత్రికలో ఏమంచి రచన వచ్చినా దాని గురించి ఆరచన చదివిన వాళ్ళు చెప్పడం, ఇంగ్లీషు, హిందీవంటి ఇతర భాషల్లో వచ్చే కథలు, ఇతర రచనల పోకడల గురించి చర్చించడం–ఇలాంటివన్నీ మా సమావేశాల్లో జరిగేవి. దీనివల్ల వర్తమాన సాహిత్యపు తీరుతెన్నుల గురించి అందరికీ ఒక అవగాహన ఏర్పడేది. ఏమి రాయాలి, ఏ విధంగా రాయాలీ అన్న విషయంలో ఎవరికి వారు నిర్దిష్టమైన ఒక దృక్పథాన్ని ఏర్పరుచుకునే వీలు కలిగేది. ఇంకా రాయాలి, కొత్తగా రాయాలన్న ఉత్సాహం కలిగేది. రచయితగా అప్పటికే కాస్త పేరు తెచ్చుకున్న నాబోటివాళ్ళకే కాకుండా, కొందరు యువ రచయితలకి కూడా ఈ సమావేశాలవల్ల ఎంతో కొంత లాభం జరిగింది.

✧ ✧ ✧

నా కథలు నాలుగు చదివితే, ఐదో కథకి నా పేరు లేకపోయినా ఇది ఫలానా వాడు రాసిన కథ అని పాఠకులు గుర్తించగలిగే ప్రత్యేక శైలి, శిల్పాలు నిర్మించుకోవడంలో నేను చాలమటుకు సఫలీ కృతుణ్ణి కాగలిగాననే అనుకుంటాను. వస్తువు ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, ఆ వస్తువుని కథగా మలచడంలో కూడా నేను ప్రత్యేక శ్రద్ధ వహిస్తాను. కథ మొదలు పెట్టి నాలుగైదు వాక్యాలు చదవగానే ఈ కథ పూర్తిగా చదవాలన్న ఆసక్తి పాఠకుడికి కలిగింప జెయ్యడానికి ప్రయత్నిస్తాను. 'కథ చాలా బావుంది', 'బావుంది', 'ఫర్వాలేదు', అన్న మాటలు తప్ప 'ఈ కథ ఏమీ బావుండ లేదు', 'ఈ కథ బోర్ కొట్టింది' వంటి వ్యాఖ్యలు నా కథల కెప్పుడూ రాలేదు.

నేను కథలు రాయటం ప్రారంభించిన కొత్తలోనే 'ఆంధ్రప్రభ', 'ఆంధ్రజ్యోతి' వంటి ప్రముఖ పత్రికలు నిర్వహించిన పోటీల్లో బహుమతులొచ్చాయి. అయినా కొన్నాళ్ళ తర్వాత పోటీలకి రాయటం మానేశాను– ఎప్పకప్పుడు కొత్త రచయితలకి అవకాశం ఇవ్వాలన్న అభిప్రాయంతో.

ఇక నాకు లభించిన అవార్డులు, పురస్కారాలు, సత్కారాలు, సన్మానాల గురించి పెద్దగా చెప్పుకోడానికేమీ లేదు. ఈ అవార్డు తీసుకోడానికీ, ఈ పురస్కారం పొందడానికీ నేను అర్హుడినేనని నేనే కాకుండా ఇతరులు కూడా భావించిన సందర్భాల్లో సైతం కొన్ని వచ్చాయి; కొన్ని రాలేదు. వచ్చినవి ఎందుకొచ్చాయో, రానివి ఎందుకు రాలేదో నాకు తెలీదు. అవార్డులు సంపాదించడానికీ, సత్కారాలూ సన్మానాలూ పొందడానికీ ఏవో కొన్ని పద్ధతులుంటాయట. అలాంటి వేమీ నాకు తెలీదు; తెలుసుకోవాలన్న ఉద్దేశ్యమూ లేదు. కొన్నాళ్ళ క్రితం వరకూ నాకీ అవార్డు రాలేదే; నాకీ సత్కారం జరగలేదే అన్న అసంతృప్తి కొద్దిగా వుండేదిగాని, ఇప్పుడదీ లేదు.

చిన్నా చితకా అవార్డులూ, సత్కారాలూ, పురస్కారాలూ వదిలేస్తే – 1997లో బుచ్చిబాబు స్మారక కథా పురస్కారం, 1997లో తెలుగు విశ్వ విద్యాలయం వారి సాహితీ పురస్కారం, 2010లో రావి శాస్త్రి రచనా పురస్కారం వంటివి నాకు లభించిన వాటిలో ముఖ్యమైనవి.

డి. వెంకట్రామయ్య కథలు అన్న పేరుతో నా మొదటి కథా సంపుటం 1974లో వచ్చింది. దేశీ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ తరఫున నా మిత్రుడు బి.శివాజీరావు ప్రచురించిన ఈ పుస్తకాన్ని నార్ల వెంకటేశ్వర రావుగారు ఆవిష్కరించారు. అదే పేరుతో 1997లో వచ్చిన రెండో కథా సంపుటాన్ని వేదగిరి కమ్యూనికేషన్స్ తరఫున మిత్రుడు వేదగిరి రాంబాబు ప్రచురించాడు. 1974లోనే 'ఉదయరాగం' అనే నా మొదటి నవలనీ, ఆ తర్వాత కొన్నాళ్ళకి 'పువ్వులమేడ' అనే రెండో నవలనీ కూడా దేశీబుక్ డిస్ట్రిబ్యూటర్స్ వారే ప్రచురించారు. ఇవి కాక, నా అనువాద కథలన్నీ ఒక సంపుటంగానూ, అనువాద నవలలు మూడు పుస్తకాలుగానూ వచ్చాయి.

పత్రికల్లో ప్రచురితమై పుస్తక రూపంలోరాని వ్యాసాలు పాతిక ముప్ఫయి దాకా వుంటాయి. అలాగే దాదాపు పాతిక పుస్తకాలకి పీఠికలు రాశాను. వాటిలో అయిదారు గ్రంథాలు నేనే ఎడిట్ చేశాను. ఇవి కాక వివిధ పత్రికల్లో 'కాలమ్స్' రూపంలో వచ్చిన

రచనలూ, సినిమా వ్యాసాలూ, సమీక్షల వంటివీ ఉన్నాయి. అన్నట్టు 1978లో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో వచ్చిన 'పంతులమ్మ' అనే సినిమాకి మాటలు రాశాను. మరో రెండు సినిమాలకి కూడా పాక్షికంగా రాశాను గాని తెరమీద నాపేరుండదు.

ఈ ప్రసంగం ముగించే ముందు నా ఉద్యోగ జీవితానికి చెందిన ముఖ్య విషయమొకటి చెప్పాలి. నేను ఆకాశవాణిలో దాదాపు ముప్ఫయి నాలుగు సంవత్సరాలు పని చెయ్యగా, అందులో సుమారు ఇరవయ్యేడు సంవత్సరాలు ప్రాంతీయ వార్తా విభాగంలోనే పని చేశాను. 'న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్‌లేటర్' అనేది నా ఉద్యోగం పేరు. వార్తలు అనువదించటమూ, చదవటమూ నా ఉద్యోగవిధులు. అయితే అవి మాత్రమే కాకుండా, స్వయంగా వార్తలు రాయటం, ఎడిట్ చెయ్యటం వంటి పనులు కూడా ఇరవయ్యేళ్ళకి పైగా నేనే చేశాను. నాతో పాటు న్యూస్ రూమ్‌లో పని చేసిన వారికి తప్ప బయటి ప్రపంచానికీ విషయం తెలీదు గనక, నా అంతట నేనే చెప్పుకోవలసి వచ్చింది. నారాయణరెడ్డి గారొక సభలో అన్నారు. 'సంపాదకులు రెండు విధాలుగా వుంటారు, కొందరు ప్రత్యక్ష సంపాదకులైతే మరికొందరు ప్రచ్ఛన్న సంపాదకులు' అని. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రపు ప్రాంతీయ వార్తా విభాగంలో రెండు దశాబ్దాలకి పైగా నేనే ప్రచ్ఛన్న సంపాదకుణ్ణి.

ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగంలో నేను పని చేసినంత కాలమూ పనికిరాని పాత విధానాలకు స్వస్తి పలకడంతో పాటు, రేడియో జర్నలిజానికి నూతన జవసత్త్వాలు కల్పించడానికి కూడా నా శాయశక్తులా కృషి చేశాను. రేడియో కోసం స్వయంగా వార్తలు రాసినా, లేక అనువదించినా ఆ వార్తల్లో వాడే భాష వీలయినంత సహజంగా, సరళంగా, సజీవంగా వుండేట్టు రాసేవాణ్ణి; రాయించే వాణ్ణి. వార్తా రచన విషయంలో పత్రికలకీ, రేడియో, టెలివిజన్ వంటి మాధ్యమాలకీ కొన్ని తేడాలుంటాయి. రేడియో వార్తలకి వాడే భాషలో సంక్లిష్టత, అస్పష్టత అనేవి అసలేమాత్రం పనికి రావు. సుదీర్ఘమైన వాక్యాలూ, కఠినమైన పదాలూ, జటిలమైన పదబంధాలూ వుండకూడదు. తగు మాత్రంగా చదువుకున్న వాళ్ళకీ, అసలేమాత్రం చదువుకోని వాళ్ళకీ కూడా వార్త వినగానే, ఆ వార్తలోని విషయమేమిటో స్పష్టంగా తెలియాలి.

ఈ నియమాలన్నీ పాటించడంతోపాటు వార్తలోని విషయం ఏదయినా ఆ వార్త చదవడానికీ, వినడానికీ అనువుగా ఆసక్తికరంగా వుండే, సజీవంగా వుండే భాష రాసేందుకే

నేనెప్పుడూ ప్రయత్నించేవాణ్ణి. ఆ ప్రయత్నంలో చాలమటుకు సాఫల్యాన్ని సాధించగలిగాననే అనుకుంటున్నాను. వార్తా విభాగంలో నాతో పాటు పనిచేసిన నా జూనియర్లకీ, తాత్కాలిక పద్ధతిపై అక్కడ పనిచెయ్యడానికొచ్చే బయటి జర్నలిస్టులకీ కూడా కొన్ని డజన్లమందికీ విధి విధానాలన్నీ నేర్పాను.

వార్తల ఎడిటింగ్‌లో కూడా రేడియోకీ, పత్రికలకీ ఎన్నో తేడాలుంటాయి. ఒక దిన పత్రికలో నాలుగు కాలాల (Column) మేర విస్తరించిన వార్తని అందులోని ప్రధానాంశాలేవీ విడిచి పెట్టకుండా, ఒక నిమిషంలోనో, అర నిమిషంలోనో రేడియోలో చెప్పగలగాలి. అవసరాన్ని బట్టి ఏవార్త నిడివి పెంచాలో, ఏది తగ్గించాలో కూడా రేడియో వార్తలు ఎడిట్ చేసేవాడికి తెలియాలి. పది రకాల వార్తలున్నప్పుడు ఆ వార్తల క్రమాన్ని నిర్ణయించి ఆ బులెటిన్ (Bulletin) కి సమగ్ర రూపాన్ని కల్పించడం కూడా ఎడిటర్‌కి తెలియాలి. రేడియో వార్తల ఎడిటింగ్ విషయంలో కూడా నాదైన స్వంతముద్ర కనబర్చడానికి నేనెంతగానో శ్రమించాను. అలాగే వార్తలు చదవటంలో కూడా నా గొంతు నాదే; నా శైలి నాదే. ఇతరులెవరైనా నన్ను అనుకరించారే గాని, నేను ఎన్నడూ ఎవరినీ అనుకరించలేదు.

ఈ విధంగా రేడియో జర్నలిజానికి చెందిన వివిధ విభాగాల్లో దాదాపు మూడు దశాబ్దాలపాటు నేను చేసిన కృషి సామాన్యమైనది కాదని చెప్పుకోడానికి నేను సంకోచించడంలేదు.

గత పది సంవత్సరాలుగా ఒక ప్రముఖ టీవీ ఛానెల్ వారు ఎంపిక చేసే న్యూస్ రీడర్ అభ్యర్థులకు వార్తలు చదవటంలో శిక్షణ ఇస్తున్నాను. ఇవ్వాళ రేడియోలోనూ, వివిధ టెలివిజన్ ఛానెళ్ళలోనూ వార్తలు చదివే వారిలో చాలా మంది ఏదో ఒక దశలో నా వద్ద శిక్షణ పొందిన వారే.

ఇక నా సాహిత్య వ్యాసంగం గురించి చెప్పాలంటే ఇటీవలి కాలంలో కథలూ గట్రా ఏమీ రాయలేదుగాని, 'రచన' మాసపత్రికలో నా 'ఆకాశవాణి అనుభవాలు' రాస్తున్నాను. ఈ రచన మరికొంత కాలం కొనసాగుతుంది.

ఈ మధ్యనే ఒక సందర్భంలో రాశాను– 'జర్నలిజం నా వృత్తి; సాహిత్యం నా ప్రవృత్తి; సినిమా నా ప్రేయసి!' అని



కనుమలూరి వెంకట శివయ్య

నేను, 1933వ సంవత్సరం, తిరుపతికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న అప్పళాయగుంట అనే గ్రామంలో, కర్షక కుటుంబంలో పుట్టాను.

మాది కర్షక కుటుంబం అయినా, సరస్వతీ దేవి అనుగ్రహం మా తాతగారికి (తండ్రిగారి తండ్రికి) కలిగింది. వారు, సుమారు వంద సంవత్సరాల క్రితమే, కవిగా పండితుడుగా, గ్రామ స్థాయిలో, వీధిబడి ఉపాధ్యాయుడుగా, నటకుడుగా హరికథకుడుగా, పేరు పొందిన వారు.

అలాగే మా తండ్రిగారు, ఒక వైపు పొలం పనులు తాను చేస్తూ పని మనుషుల ద్వారా చేయించుకొంటూ, సుమారు డెబ్బై ఏండ్ల క్రితమే ప్రైవేటుగా, విద్వాన్ పరీక్ష పాసయి, తెలుగు పండితులయ్యారు. తిరుపతిలోని దేవస్థానం హిందూ హైస్కూలులో (ఇప్పుడు పేరు శ్రీ వెంకటేశ్వర హైస్కూలు) ప్రధాన తెలుగు పండితులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు.

ఇలా కీర్తి శేషులైన మాతాతగారు, తండ్రిగారు ఒక చేత హలమూ, ఒక చేత కలమూ అన్నట్లు ప్రసిద్ధి చెందినవాదరు.

ఆ పాండితీ కవితా ధారలు, సరస్వతీ దేవి అనుగ్రహంతో, నా రక్త నాళాలలో చోటు చేసుకొన్నాయి.

మాది పేద కుటుంబం. మా తాతగారికి 7మంది పుత్రులు, ఒక పుత్రిక; మాతండ్రిగారికి నలుగురు పుత్రులు, నలుగురు పుత్రికలు– వారిలో నేను మొదటివాడను.

సరస్వతీ దేవి అనుగ్రహంతో నేను కష్టపడి పైకి వచ్చాను. నేనూ వేసవి సెలవులలో, పొలాలో చిన్న చిన్న పనులు చేసేవాణ్ణి పేదతనము వలన విద్యనా కబ్బెను. పేద తనము వలన వెలుగు కలిగె వహ్నికీల ఒసగు, పసిడికి కాంతులు కష్టపడిన వాడు ఘనత పొందు.

నేను ఎం.ఏ డిగ్రీ గణిత శాస్త్రంలో చదివాను. 1954 విద్యా సంవత్సరంలో, తిరుపతిలోని ఎస్.వి. ఆర్ట్స్ కాలేజిలో అసిస్టెంట్ లెక్చరర్‌గా చేరాను.

అప్పుడు, మొట్ట మొదటి సారిగా, శ్రీ నారాయణరెడ్డి గారిని చూచే అదృష్టం కలిగింది.

కళాశాల ప్రిన్సిపాలు నిర్వహించిన సాహితీ సభలో, శ్రీ రెడ్డిగారు కవితా గానం చేశారు. వారి రచన "కర్పూర వసంత రాయలు" లోని కొన్ని గేయాలను వినిపించారు.

కమ్మని కంఠంతో రాగ భరితంగా, భావ ప్రసూన పరిమళాలను వెదజల్లుతూ, వారు గేయాలను వినిపిస్తుంటే, అధ్యాపకులు, విద్యార్థులు పరవశించి పరమానందం పొందినారు.

ఆరోజు నాకు కలిగిన స్ఫూర్తి, నన్ను ఈనాడు ఈ దశ వరకు తీసుకొచ్చింది. శ్రీ నారాయణరెడ్డిగారే నాకు మార్గదర్శి అయ్యారు.

ఆనాటి నుండి నా జీవిత గాథలో, రెండు ప్రస్థానాలు ప్రారంభమయ్యాయి. ఒకటి ఉద్యోగం, మరొకటి సద్యోగం.

ముందు, ఉద్యోగంలోని కొన్ని వివవరాలు సవినయంగా, అహంకార రహితంగా చెబుతాను.

ఉద్యోగంలో మా తండ్రిగారి కోరికను ఎలాగైనా సాధించాలని పట్టు బట్టాను. వారి కోరిక ఏమిటి? "నేను ప్రభుత్వంలో ఉన్నత అధికారి కావా"లని

నన్ను, ఒకేమారు పైకి తీసుకొని వెళ్లే, గొప్ప వారితో నాకు పరిచయంలేదు.

ఒక్కొక్క మెట్టు ఎక్కి పైకి పొయ్యాను.

ముందు, సచివాలయంలో, ఆతర్వాత స్త్రీ సంక్షేమ శాఖలో, చిన్న ఉద్యోగాలు చేశాను. ఉద్యోగం చేస్తూ, సాయంకాలపు కళాశాలలో చేరి, ఎల్.ఎల్.బి. డిగ్రీ పొందినాను.

ఆపై, కేంద్ర ప్రభుత్వంలో Census Department Talrelation officer అయ్యాను. రాష్ట్ర ప్రభుత్వంలోని Deputy Collector కంటె, ఎక్కువ జీతం Talrelation Offincerకు ఉండేది.

అయినా, మాతండ్రిగారి కోరికను, ఎట్లైనా సాధించాలని, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు కమిషను నిర్వహించిన Group - I పరీక్షలలో ఉత్తీర్ణుడయ్యాను. కష్టపడి చదివాను; సరస్వతీ దేవి అనుగ్రహం లభించింది. By Collector గా సెలక్టు అయ్యాను.

ఆపైన I.A.S. పదవి లభించింది. ఎన్నో ఉన్నత పదవులలో పనిచేశాను. చివరకు G.A.D Secretary గా పదవీ విరమణ చేశాను.

ఉద్యోగ పర్వంలో, నేను సాధించిన కొన్ని విశేషాలను, అందరికీ అంజలించి, వినమ్రతతో, విన్నవిస్తున్నాను.

ఆ రోజులలో, Village officers (అనగా కరణాలు, మునసబులు) ఉండేవారు, పశ్చిమ గోదావరి జిల్లాలో, కొవ్వూరు Rdo గా పనిచేసినప్పుడు, గ్రామ కరణాలకు, మునసబులకు, Division head quetionలో క్రీడలలో సాంస్కృతిక విషయాలలో, పోటీలు పెట్టి బహుమతులు ఇచ్చాను. అందరికీ ఆశ్చర్యానం దానుభూతులు కలిగాయి. కలెక్టరుగారు, అన్ని విషయాలలో నా పని తీరు చూచి, చాలా అభినందించారు.

కర్నూలు జిలాల్లలో RDOగా, నెల్లూరు జిల్లాలో DRO గా ఉన్నప్పుడు, కలెక్టర్ల అనుమతితో, Jan 26 Republic Day సందర్భంగా, ఢిల్లీలో జరిపే తీరులో ప్రభుత్వపు వివిధ శాఖల వారిచే Tablea parade చేయించాను.ఆనాటి నుండి ఈనాటి వరకూ “నభూతో న భవిష్యతి” అన్నట్లు జరిగినది.

కలెక్టర్లు, మెచ్చుకొని నాకు ప్రశంసా పత్రాలు ఇచ్చారు. నేను కర్నూలు RDO గా ఉండగా, కర్నూలు పట్టణ మధ్యలో ప్రవహించే, హింద్రీ నదికి ఒక మారు ఉప్పెనలు (floods) వచ్చాయి. Releif కార్యక్రమంలో, నేనూ, ఇతర ఉద్యోగులూ నదీ తీరాలపై తిరుగుతుండగా, ఒక వ్యక్తి నీటిలో కొట్టుకొని పోతూ ఉండటం చూచాము. ఏమి చెయ్యాలో తెలియక ఉన్నాము. నాకు ఈత బాగా తెలుసుకాబట్టి, దొన్నెలా ఉండే ఒక చిన్న పడవ ఎక్కి నదిలోనికి పోవడానికి, సాహసించాను. ఇతర ఈతగాండ్రు, నేను నదిలోనికి వెళ్ళి, మునుగి పోయే వ్యక్తిని రక్షించాము.

కలెక్టరు, చాలా సంతోషంతో, ప్రభుత్వానికి వ్రాసి నాకు ధైర్య సాహసాలకు చెందిన ప్రశంసా పత్రం తెప్పించి ఇచ్చారు.

నేను ఖమ్మం జిల్లా, S.F.D.A Project Officer గా పని చేశాను. ప్రతి రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక S.F.D.A ఆఫీసరు ఉంటాడు.

నేను పనిచేసిన రెండు సంవత్సరాలలో, S.F.D.A ఉన్నత ఫలితాలను చూచి, కేంద్ర ప్రభుత్వం నన్ను ఢిల్లీకి పిలిచి, అభినందించారు.

నేను Telugu ganga special Collector గా చేసినప్పుడు, భూసేకరణకు నష్ట పరిహారంగా సుమారు 35కోట్ల grant వచ్చినది. నష్ట పరిహారం భూమి ఆసాములకు (Land owners) ఇచ్చు సందర్భంలో, కడు జాగ్రత్త తీసుకొని, ఒక్కరూపాయి కూడా ఉతోచంగా ఇవ్వబడగూడదని గ్రామాలలో నెల రోజులు దండోరా వేయించాను. అంతా సవ్యంగా, అవినీతి రహితంగా జరిగింది.

ఆ భూసేకరణ ప్రాంతానికి చెందిన MLA లు మంత్రి ఒక సభ పెట్టి, నన్ను, నా క్రింది ఉద్యోగులకు ఘనంగా సత్కరించారు. అవినీతి రహితంగా, ప్రతిభాయుతంగా కార్యక్రమం జరిగిందని, ప్రభుత్వానికి వ్రాసి, నాకు, C.M. గారిచే, హైదరాబాదులో Fateh maidan లో జరిగిన బహిరంగ సభలో ఉత్తమ సేవా పత్రాన్ని ఇప్పించారు.

Commission, College Education గా చేసి, కళాశాలలకు అధ్యాపకులకు, ఎంతో సేవ జేసినాను. కళాశాలలకు ఇచ్చే గ్రాంట్స్ విషయంలోగాని, ఉద్యోగులకు వచ్చే జీతాలు, ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు విషయంలోగాని అవినీతి అనునది ఒక అణువు లేకుండా, Open meetings లో అందరి సమక్షంలో నిర్ణయాలు తీసుకొని, ఆచరణలో పెట్టించాను.

కళాశాల అధ్యాపకులకు Multifocus knowledge ఉండేట్లుగా, ప్రతి కళా శాలలో Faculty forum పెట్టించాను. కల్మష రహితంగా చేసిన సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో, GAD కార్యదర్శిగా పదవీ విరమణ చేశాను.

ఇక సాహితీ పాండితీ విషయాలకు సంబంధించిన, సద్యోగ ప్రస్థానంలోని కొన్ని విశేషాలను. అతి వినమ్రతతో అహంకార రహితంగా విన్న విస్తాను.

నేను Dy Collector గా సెలక్టు అయ్యే వరకు, నాలో సాహితీ స్రవంతి కడు మెల్లగా సాగింది.

Dy Collectorసెలక్షన్ పరీక్షలకు, నేను తెలుగు సాహిత్యం ఒక పేపరుగా ఎన్నుకొన్నాను. అందుకని తెలుగు సాహిత్యం, ఆమూలాగ్రం క్షుణ్ణంగా చదివాను. మాతండ్రిగారి సహాయ్యం కూడా ఉండినది.

నేను RDO గా RDO గా D.S.O గా పశ్చిమ గోదావరి, కడప, కర్నూలు, నెల్లూరు, గుంటూరు జిల్లాలో పని చేసేటప్పుడు, సాహిత్య సభలకు, సాంస్కృతిక సభాలకు నన్ను అధ్యక్షునిగానో, లేక ముఖ్య అతిథిగానో, నిర్వాహకులు పిలిచేవారు. నేను ఆనాటి సభను బట్టి (ఉదాహరణకు నన్నయ జయంతి, త్యాగరాజగానసభ, కూచిపూడి నృత్యం ఇలా వివిధ శాఖల సభల బట్టి), సంబంధించిన కావ్యాలను, పుస్తకాలను, చదివీ చదివీ, ప్రసంగాన్ని, లిఖితం చేసుకొని బాగా అధ్యయనం చేసి, ఉపన్యాసం ఇచ్చేవాడిని. నిర్వాహకులు, శ్రోతలు ఆశ్చర్య చకితు లయ్యేవారు. అలా కొన్ని ఏండ్లు జరిగేటప్పటికి, తెలుగు సాహిత్యంపై చక్కని పట్టు దొరికింది. మిత్రులయిన పండితుల సూచనలను గౌరవించి, S.V.Universiti MAC (Telugu) ప్రైవేటుగా అభ్యర్థిగా వ్రాసి Universits first clon first rank సంపాదించాడు. సంస్కృతంలో 80% తెచ్చుకున్నాను. అపై, MAC (Public Admostati) డిగ్రీ పొందినాను. అలా మెట్టుపై మెట్టు ఎక్కుతూ, మూడు MA Degree లు LL.B Degree పొందినాను.

నేను కడపలో RDO గా చేసినపుడు సంస్కృతి సంవర్ధక సదస్సును, 1968 సంవత్సరంలో స్థాపించి దానికి తగిన ఆర్థిక వసతులు ఏర్పాటు చేసినాను.

శ్రీకాకుళంలో Joint collector గా పని చేసినప్పుడు, సాహిత్య తరంగిణి అనే పేరుతో, అప్పుడప్పుడూ సాహిత్యోపన్యాసాలు పెట్టించాను.

ఒంగోలు జిల్లాలో, District Development officer గా పనిచేసినపుడు, 1982లో ఎర్రన పీఠం స్థాపించి, దానికి జిల్లా కలెక్టరు అధ్యక్షులుగా, జిల్లా పరిషత్తు ఛైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టరు ఉపాధ్యక్షులుగా ఉండునట్లు Register చేయించినాను. వారు, నన్ను శాశ్వత ఉపాధ్యక్షునిగా ఉంచినారు. ఆరోజులలోనే, కడు జాగ్రత్తగా, ఏమాత్రం చెడ్డపేరు రాకుండా, పంచాయితీలు, జిల్లా పరిషత్తు, ఉదార దాతలు, ఆర్థికంగా సాయం చేయునట్లు శ్రమించాను. 2 లక్షల రూపాయలు Bank fixed Deposite క్రింద పెట్టి, దానిపైన వచ్చు వడ్డీతో, ప్రతి సంవత్సరం, ఎర్రన పీఠ సాహిత్యపు తిరునాళ్లు చేయగలుగునట్లు ఏర్పాటు చేసినాను.

ఇలా, సాహిత్య సేవ చేస్తూ పొయ్యాను.

నా సాహిత్య సేవ, నాకున్న కవితా పాండిత్యాలను చూచి, ఏలూరులో విశాలహృదయులు మౌక్తికాభిషేకం చేశారు.

గుంటూరులో రెండు మార్లు కనకాభిషేకం చేశారు. గుంటూరులో ఉన్న విశ్వయోగి విశ్వంజీ మహరాజ్‌వారు, నాకు కనకాభిషేకం చేస్తూ, "ఇతిహాసవాఙ్మయ మహోదృక్షా" అనే బిరుదు ప్రదానం చేశారు.

రవీంద్ర భారతిలో, ముఖ్యమంత్రిగారు నాలుగు మార్లు కవి సన్మానం చేశారు. నేను, కవిగా, పండితునిగా, ప్రముఖ సుప్రసిద్ధ కవి పండిత సమ్రాట్టులనుండి, ఎన్నోమార్లు సభలలో ఆశీస్సులు పొందినాను.

నేను భువనవిజయ సభలో కృష్ణదేవరాయలుగా నూరు మార్లకు పైగా, పాల్గొన్నాను. తిరుపతిలో Academy of fine Arts నాకు "అభినవ కృష్ణదేవరాయ" బిరుదు ప్రదానం చేశారు.

ఈ సాహిత్య ఉద్యోగ ప్రస్థానంలో, నేను నా జన్మలో మరువలేని ఒక సంఘటన ఉన్నది.

1988లో, కేంద్ర ప్రభుత్వం, కర్ణాటక ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన హంపీ మహోత్సవాలలో, శ్రీ కృష్ణదేవరాయలు హంపీలో, ఎచట భువన సభ నిర్వహించినో, అదే చోట, నేను శ్రీ కృష్ణదేవరాయలుగా సింహాసనాధిష్ఠుడనై మహాప్రముఖులైన కరుణశ్రీ, ప్రసాదరాయకులపతి మొదలగు కవి పండితులు కవులు పాల్గొనగా, భువనని జయ సభ నిర్వహించితిని. నా జన్మకు ఇంత కంటె కావలసిన దేమున్నది. అంతా సరస్వతీ దేవి కృప. నాకు, "ఉపన్యాస భారతి", "సాహిత్య వల్లభ," "కవిచంద్ర," "విద్వత్కవిరత్న" అనే బిరుదులను ఇతర సంస్థలు ప్రసాదించినాయి.

నేను వ్రాసిన కావ్యాలు

1) శివమోదం (తెలగు కవిత)

2) శివలోకం (తెలుగు సాహిత్య వ్యాసాలు)

3) శివానువాదం (ఇతర భాషలలోని కవితలను, తెలుగు కవితలుగా అనువాదం.

ఉదాహరణకు కన్నడకవి సర్వజ్ఞ వచనాలకు, తెలుగు తేటగీతల అనువాదం)

4) శివభారతి (500 సంస్కృత శ్లోకాలు ఉన్న ఖండకావ్యం)

5) వేంకటశివ సూక్తులు (వేమన పద్యాలవలె, ఆటవెలదులలో పద్యాలు)

6) కల్యాణ దశకము (అరుంధతి కల్యాణం నుండి, పద్మావతీ కల్యాణం వరకు పది అతి పవిత్ర కల్యాణ గాథలు తెలుగు వచనంలో)

7) Social Molleace as seen in examples (ఇంగ్లీషులో, ఇతి హాసాలలో ప్రతిబింబించిన, సామాజిక వ్యవస్థ)

8) భరతనారి (సంగీతాత్మక దృశ్యకల్పనము)

9) భారతం పై తీర్పు (Drama - Pressure Day Court scene)

10) Efficiency or Ethics in Adminstration - (English)

11) సుందరకాండ – (తెలుగు – ఇంగ్లీషు భాషలలో Scientific, Social or Spiritual Study of Sundarakanda)

ఉద్యోగ పదవీ విరమణ అయిన తర్వాత, క్రింది మూడు శాఖలపై ఉపన్యాసాలు ఇస్తున్నాను

1) Adhyathmic = భారత, భాగవత, రామాయణ, దేవీభాగవత, శివపురాణాలపై ఆధ్యాత్మిక ఉపన్యాసాలు

2) Academic = కళాశాలలో, సాహిత్య సభలలో సాహితీపరమైన ఉపన్యాసాలు

3) Administration = మర్రిచెన్నారెడ్డి సంస్థలో, మరియు జిల్లా శిక్షణ కేంద్రాలలో పరిపాలనకు సంబంధించిన ఉపన్యాసాలు

నేను, తిరుపతిలోని కేంద్ర ప్రభుత్వ విద్యాపీఠంలో (Sanskrit University) ఒక సంవత్సరం Visiting Professor గా ఉండే భాగ్యం కలిగింది.

విశ్వవిద్యాలయాల Academic staff colleges లో, అధ్యాపకులకు జరిగే Orientation Course లో, Refresher Courseలో, ఉపన్యాసాలు ఇవ్వడానికి పోతుంటాను.

సప్తగిరి(DD), ETV, MahaTV, SVBC మొదలగు TV channelsలలో ఇతిహాసాలపై

సహస్రాధికంగా ఉపన్యాసాలు ఇచ్చి ఉన్నాను.

DD భారతి. Delhi నుండి నాకు ఆహ్వానం వచ్చింది. ఇతిహాసాలపై వివిధ అంశాలపై (ఉదాహరణకు–న్యాయవ్యవస్థ – ప్రజాపరిపాలన ఆర్థిక వ్యవస్థ, సాంకేతిక విజ్ఞానం, శస్త్రచికిత్స, సంక్షేమ కార్యక్రమాలు – జంతువులు) నేను ఆంగ్లభాషలో ఇచ్చిన, ఉపన్యాసాలు, ప్రపంచ వ్యాప్తంగా Telecast చేయబడినవి. ఇది సరస్వతీ దేవి అనుగ్రహమే.

ఇంగ్లాండు, అమెరికా రెండుమార్లు, పర్యటించి, నాస్వీయకవితాగానం, సాహిత్యోపన్యాసాలు అమెరికాలోనున్న తెలుగు వారికి వినిపించే భాగ్యం కలిగింది.

అలాగే శ్రీలంకలో ఉపన్యాసాలు ఇచ్చాను. ఎచట సీతాదేవిని రావణాసురుడు చెరబట్టి అశోకవనంలో ఉంచెనో, ఆ ప్రదేశాన్ని (దానిని ఇపుడు సీతేలియా అంటారు). చూచి, మనసులో సీతమ్మను ప్రార్థించు కొనే భాగ్యం కలిగింది.

ఇలా , నా జీవితంలో, ఉద్యోగ సద్యోగ ప్రస్థానాలలో గమిస్తున్నాను.

4–1–13 నాడు, నా అదృష్టం, శ్రీనారాయణరెడ్డి అనుగ్రహం వలన, ఆంధ్రసాహిత్య పరిషత్తు సభలో, పరిణత వాణి అనే కార్యక్రమంలో, ఉపన్యాసం ఇచ్చాను. ఎన్నడో, నాసాహిత్యప్రస్థానానికి స్ఫూర్తినిచ్చి, 4–1–13 నాడు, నా ఉపన్యాసం ఏర్పాటు చేసిన శ్రీ నారాయణరెడ్డిగారికి వందనాలు.

వారికి సమర్పించిన వందన సుమలతో, ఈ వ్యాసం ముగిస్తాను.

కవిత్వం; కవిత్వస్య శిల్పంచత్వం; మహాకవే!

అసిత్వం కవితాయాంచ; త్వయ్యస్తి కవితాతథీ

హర్షం వాణీ భృశం యాతి దృష్ట్వా తే కవితాశ్రియం

ఆంధ్రమాతుః సుపుత్ర స్త్వం; ఆంధ్రళేః గర్వకారణం

పున్నమి దినక్షిరాబ్ధ...

ఫలభరమ్మున ఎలమావి వంగినటుల

అహిఫణాసీమ కృష్ణయ్య ఆడినటుల

భారతీదేవి వీణియ పలికినటుల

మధుర మధురమ్ము కైతి మధురమయ్యా
మనసు దోచును నీ దివ్యమధుర కవిత
అందు కొనుమయ్య: నా వంద వందనాలు
తెలుగువారల ఎదలలో వెలుగుమయ్యా
పఠితలకు నా నమస్సులు.


ఆంధ్ర సారస్వత పరిషత్తు
Andhra Saraswatha Parishath.
Tilak Road, Hyderabad - 500 001
NO
PARKING

